# అర్థశాస్త్రం

## అభివృద్ధి అర్థశాస్త్రం

B R A O U

డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాదు
1993

T-3456
4-12-93

# రచయితల బృందం

సంపాదకుడు
ఆచార్య సి.హెచ్. రఘురాం

సహ సంపాదకులు
ఆచార్య పి. రామయ్య
శ్రీ కే. సతీష్ రెడ్డి

రచయితలు
ఆచార్య తిప్పారెడ్డి
డా. ఎం. అచ్చిరెడ్డి
డా. టి. దివాకర్ రెడ్డి
డా. ఎస్. సుబ్రమణ్యం
శ్రీమతి ప్రదీప్తా చౌదరి
డా. జి.ఎస్. సీతారాం
శ్రీ ఎస్. మధాకర్ రెడ్డి
శ్రీ జి. రామకృష్ణ
కుమారి ప్రభాపంత్

ముఖ చిత్రం
చంద్ర

Dr. BRAOU
LIBRARY

Dr. B R.A.O.U LIBRARY
Acc No. T-3456
Date 4-12-93
Call No.

డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాదు

కాపీరైటు © 1990 ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగం అయినా ఉపయోగించ దలుచుకుంటే విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి.

ఈ పాఠాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్యప్రణాళికలో ఒక భాగం.

ఇతర వివరాలకు: డైరెక్టరు, డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 482.

Printed at M/s. Sruthi Graphics (P) Ltd. 8-3-231/G/4, Sri Krishna Nagar, Hyderabad - 500 045. Phone : 248494

BRAOU

# పుస్తకపరిచయం

గత 30 సంవత్సరాలలో అభివృద్ధి చెందనిదేశాల ఆర్థిక వ్యవస్థలు, వాటి అధ్యయం ఆర్థిక శాస్త్రంలో ఒక ప్రత్యేక భాగంగా వెలువడినవి. అనువర్తిత శాస్త్రాలలాగే అభివృద్ధి అర్థశాస్త్రం కూడా ఆర్థిక సలహానిచ్చేవారి అవసరాల కోసం, సిద్ధాంతపరమైన విశ్లేషణ కోసం అవసరమైనది. మార్క్స్, కీన్స్ నవ్యసంప్రదాయ అర్థశాస్త్రవేత్తల భావాలను అనువర్తింపచేయడం వల్ల కొత్త సిద్ధాంతాల పరిణామం 1950లో ప్రారంభమైంది. అభివృద్ధి అర్థశాస్త్రం అధ్యయనం అభివృద్ధి చెందుతున్న దేశాలలో సిద్ధాంత అనుభవ ఆధారం సంబంధం వలన ఆవిర్భవించింది. అభివృద్ధి అర్థశాస్త్రంలో ముఖ్యంగా రెండు విషయాలుంటాయి. అవి:

1. ఎక్కువ అనుభవాలను పరీక్షించి ప్రస్తుతమున్న సిద్ధాంతాలను సార్వజనీనం చేయడం.
2. కొత్తగా వెలువడిన భావనలనూ, అనుభవాల ద్వార దృగ్గోచర విషయాన్నీ విశదీకరించడానికి ప్రయత్నించడం. పాఠాలను విశదీకరించడంలో ఈ రెండు పద్ధతుల్నీ అనుసరించాము.

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, రెండవ సంవత్సరం "అభివృద్ధి అర్థశాస్త్రం" పాఠ్య ప్రణాళికలో పొందుపరచిన అంశాలను ఈపుస్తకం వివరిస్తుంది. సాధారణంగా ఈ అంశాలన్నీ మూడేండ్ల డిగ్రీ కోర్సు రెండవ సంవత్సరపు అధ్యయన విషయాలను వివరిస్తాయి. సౌలభ్యం కోసం పాఠ్య ప్రణాళికను ఖండాలుగా, ఖండాలను వివిధ భాగాలుగా విభజించాము. ప్రతి ఖండం సాధారణముగా ఒక ప్రత్యేక విషయాన్ని వివరిస్తుంది.

మొదటి ఖండం వెనుకబడిన దేశాల లక్షణాలను, ఆర్థికాభివృద్ధిని ఆటంకపరిచే, దోహదపరిచే విషయాలను, కారకాలనూ చర్చిస్తుంది. అంతేకాకుండా మూలధన కల్పన సిద్ధాంతాలను, ఉత్పత్తి పద్ధతుల, వస్తువుల ఎంపికకు సంబంధించిన దృక్పథాలను వివరిస్తూ చివరలో ఆర్థికాభివృద్ధి లక్ష్యాలను తెలియజేస్తుంది. రెండవ ఖండంలో జాతీయాదాయ విశ్లేషణ గురించీ, మూడవ ఖండంలో భారతదేశములో ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధిని గురించీ వివరించాం. నాలుగు, ఐదు, ఆరు ఖండంలలో, వ్యవసాయ, పారిశ్రామిక, విదేశీ రంగాలలో ఉన్న సమస్యలను గురించి చర్చించాము. చివరి ఖండంలో పేదరికం, నిరుద్యోగాలను గురించి వివరించాము.

నిపుణులు తయారుచేసిన ఈ పాఠాలను మీరు చదివి, అర్థం చేసుకోవడానికి విశ్వవిద్యాలయం ఒక క్రమ పద్ధతిలో వాటిని అమర్చింది. ప్రతి భాగం విషయసూచికతో ఆరంభమై, దాని ఉద్దేశాలు, లక్ష్యాలు, పరిచయంతో కొనసాగుతుంది. మీ అవగాహనను పరీక్షించుకోవడానికి అవసరమైన చోట చిన్న చిన్న ప్రశ్నలను అడిగాం. పూర్తి పాఠ్య విషయాంశాలపై మీ గ్రహణ శక్తిని పరిశీలించుకోవడానికి ప్రతి పాఠం చివరలో నమూనా పరీక్షా ప్రశ్నలను ఇచ్చాం.

అభివృద్ధి అర్థశాస్త్రం విశిష్ట గుణాత్మకతను, దాని ప్రాముఖ్యాన్ని తెలిపే ప్రధాన సమస్యలను విద్యార్థి సరియైన విధంగా అవగాహన చేసుకోవడంలో ఈ పాఠ్యాంశాలు దోహదపడగలవని ఈ విశ్వవిద్యాలయం ఆశిస్తోంది.

BRAOU

BRAOU

# విషయసూచిక


| | | |
|---|---|---|
| ఖండం—1 | : అభివృద్ధి, అల్పాభివృద్ధి: పరిచయం | 1 |
| భాగం—1 | : వెనుకబడిన ఆర్థికవ్యవస్థల లక్షణాలు | 3 |
| భాగం—2 | : ఆర్థికాభివృద్ధికి అవరోధాలు, దోహదాలు | 12 |
| భాగం—3 | : మూలధన సంచయన సిద్ధాంతాలు | 20 |
| భాగం—4 | : ఉత్పత్తి పద్ధతుల ఎంపిక, వస్తువుల ఎంపిక | 27 |
| భాగం—5 | : ఆర్థికాభివృద్ధి లక్ష్యాలు | 32 |
| ఖండం—2 | : జాతీయాదాయం, సాం[illegible]ణన | 39 |
| భాగం—6 | : జాతీయాదాయం—దాని మదింపు | 41 |
| భాగం—7 | : భారతదేశ జాతీయాదాయ అంచనాలు | 54 |
| భాగం—8 | : జాతీయాదాయ ఖాతాలు—సాంఘీక గణన పద్ధతులు | 64 |
| ఖండం—3 | : అభివృద్ధి కొరకు ప్రణాళికారచన | 75 |
| భాగం—9 | : భారతదేశంలో ఆర్థిక ప్రణాళిక | 77 |
| భాగం—10 | : భారతదేశపు పంచవర్ష ప్రణాళికలు | 84 |
| భాగం—11 | : భారతదేశ పంచవర్ష ప్రణాళికల విజయాలు | 101 |
| ఖండం—4 | : వ్యవసాయ రంగం | 115 |
| భాగం—12 | : భారతదేశ వ్యవసాయరంగ స్వరూపం | 117 |
| భాగం—13 | : వ్యవసాయ ఉత్పాదకత | 126 |
| భాగం—14 | : హరిత విప్లవం | 132 |
| భాగం—15 | : వ్యవసాయ ధరలు | 138 |
| భాగం—16 | : వ్యవసాయ విత్తం | 148 |
| ఖండం—5 | : పారిశ్రామిక రంగం | 155 |
| భాగం—17 | : భారతదేశ పారిశ్రామిక అభివృద్ధి | 157 |
| భాగం—18 | : ప్రభుత్వ రంగం | 169 |
| భాగం—19 | : భారతదేశంలో పారిశ్రామిక శక్తి కేంద్రీకరణ | 176 |
| భాగం—20 | : పారిశ్రామిక విత్తం | 185 |
| ఖండం—6 | : విదేశీరంగం | 191 |
| భాగం—21 | : విదేశీ వర్తకం—ఆర్థికాభివృద్ధి | 193 |
| భాగం—22 | : భారతదేశ విదేశీ వర్తకం | 199 |
| భాగం—23 | : విదేశీ ఆర్థిక సహాయం, విదేశీ మూలధనం | 210 |
| ఖండం—7 | : పేదరికం, నిరుద్యోగం | 221 |
| భాగం—24 | : భారతదేశంలో పేదరికం | 223 |
| భాగం—25 | : భారతదేశంలో నిరుద్యోగం | 229 |


BRAOU

BRAOU

# ఖండం — I

## అభివృద్ధి, అల్పాభివృద్ధి : పరిచయం

వెనుకబడిన దేశాల లక్షణాలను, అభివృద్ధిని నిరోధించే, దోహదపరిచే కారకాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ఖండంలోని మొదటి రెండు భాగాలు వాటిని విశ్లేషిస్తున్నాయి. ఆర్థికాభివృద్ధికి మూలధన సంచయనం ఎంతైనా అవ[illegible] అందుకే మూలధన సంచయనానికి సంబంధించిన సిద్ధాంతాలను కూడా ఈ ఖండంలో తెలుసుకుంటాం. అదే విధంగా ఏయే వస్తువులను ఉత్ప[illegible] చేయాలి, ఏయే ఉత్పత్తి పద్ధతులను ఎంపిక చేసుకోవాలి అనే అంశాలను కూడా ఈ ఖండంలో చర్చిద్దాం. ఇక చివరగా ఆర్థికాభివృద్ధిని సాధించడానికి ఏయే లక్ష్యాలను ప్రధానంగా ఉద్దేశించుకోవాలో తెలుసుకొంటాం.

ఈ ఖండంలోని భాగాలు:

భాగం — 1: వెనుకబడిన ఆర్థిక వ్యవస్థల లక్షణాలు

భాగం — 2: ఆర్థికాభివృద్ధికి అవరోధాలు, దోహదాలు

భాగం — 3: మూలధన సంచయన సిద్ధాంతాలు

భాగం — 4: ఉత్పత్తి పద్ధతుల ఎంపిక, వస్తువుల ఎంపిక

భాగం — 5: ఆర్థికాభివృద్ధి లక్ష్యాలు

BRAOU

BRAOU

# భాగం — 1: వెనుకబడిన ఆర్థిక వ్యవస్థల లక్షణాలు

## విషయక్రమం

1.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
1.1 పరిచయం
వెనుకబడిన దేశాల లక్షణాలు
1.2 ఆర్థిక లక్షణాలు
1.2.1 తక్కువ స్థాయి జీవన ప్రమాణాలు
1.2.2 తక్కువ ఆర్థిక పెరుగుదల రేటు
1.2.3 ఆర్థిక వ్యవస్థలో ప్రాథమిక రంగానికి, వ్యవసాయానికి ప్రాధాన్యత
1.2.4 తక్కువ స్థాయి ఉత్పాదక శక్తి
1.2.5 పాతబడిన ఉత్పత్తి పద్ధతుల వాడకం
1.2.6 తక్కువ స్థాయి మూలధన సంచయనం
1.2.7 తక్కువ స్థాయిలో పెట్టుబడి
1.2.8 అధికస్థాయిలో ముడిసరుకుల ఎగుమతి
1.3 జనాభా సంబంధమైన లక్షణాలు
1.3.1 అధిక జననాల రేటు
1.3.2 అధిక మరణాల రేటు
1.3.3 అధిక జనాభా పెరుగుదల
1.3.4 అధికమైన నిరుద్యోగం
1.4 సాంఘిక, రాజకీయ లక్షణాలు
1.4.1 ఆదాయ, వినియోగాలలో అసమానత్వాలు
1.4.2 మార్పులేని సామాజిక ప్రవర్తన
1.4.3 అనుత్పాదక వినియోగం
1.4.4 అధిక నిరక్షరాస్యత
1.5 చారిత్రక కారణాలు
1.6 సారాంశం/ముగింపు
1.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

## 1.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

వెనుకబడిన దేశాల లక్షణాలను తెలియజేస్తూ మన దేశంలో ఈ లక్షణాలు ఎంతవరకు అభివృద్ధి తక్కువగా ఉండడానికి కారణభూతమవుతున్నాయో తెలుసుకోవడమే ఈ పాఠం లక్ష్యం.

ఈ భాగాన్ని చదివిన తర్వాత కింది విషయాలను అవగాహన చేసుకోగలుగుతారు.

★ వెనుకబడిన దేశాల లక్షణాలను వర్గీకరించగలరు.

★ అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక లక్షణాలను గుర్తించగలరు.



BRAOU

★ వెనుకబడిన దేశాల జనాభా సంబంధమైన లక్షణాలను గుర్తించగలరు.
★ ఈ దేశాల సాంఘిక, రాజకీయ లక్షణాలను తెలుపగలరు.
★ ఈ దేశాలు వెనుకబడి ఉండడానికి గల చారిత్రక లక్షణాలను విశ్లేషించగలరు.

## 1.1 పరిచయం

వర్తమాన ప్రపంచపు ఆర్థిక పరిస్థితిని పమీక్షిస్తే ప్రపంచంలోని దేశాలను రెండు వర్గాలుగా విభజించవచ్చు. ఒక వర్గపు దేశాలలో ప్రజలు ఉన్నత జీవన ప్రమాణాల తోనూ, రెండవ వర్గపు దేశాలలో ప్రజలు పేదరికంలో మగ్గుతూ, నిరక్షరాస్యత, నిరుద్యోగం, పుష్టికర ఆహారలోపం, వ్యాధులు, మొదలైన రుగ్మతలతోనూ జీవితం గడుపుతున్నారని తెలుస్తుంది. ప్రపంచంలో అధికదేశాలు ఈ రెండవ వర్గానికే చెందుతాయి. మొదటి వర్గం దేశాలను అభివృద్ధి చెందిన దేశాలుగా, రెండవ వర్గం దేశాలను అభివృద్ధి చెందని లేక వెనుకబడిన దేశాలుగా పేర్కొంటున్నారు. రెండవ వర్గపు దేశాలలో కొంత అభివృద్ధిని సాధించినప్పుడు, వాటిని అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలుగా వర్ణిస్తారు. ప్రపంచంలోని కొన్ని దేశాలు సుసంపన్నంగా ఉండగా, మరికొన్ని దేశాలు తమ ప్రజలకనీస అవసరాలను కూడా తీర్చలేని పరిస్థితిలో ఎందుకున్నాయి? ధనిక దేశాల సౌభాగ్యానికి తోడ్పడిన, బీద దేశాలు తక్కువ స్థాయి జీవన ప్రమాణాన్ని కలిగి ఉండటానికి దోహదం చేసిన కారణాలేవి? బీద దేశాలు తమ పరిస్థితులను ఏ విధంగా మెరుగు పర్చుకోగలవు? అవి ఏ ఏ రంగాల అభివృద్ధి కోసం దృష్టి కేంద్రీకరించాలి? ఈ రకమైన ప్రశ్నలను గూర్చి "అభివృద్ధి, అల్పాభివృద్ధి, పరిచయం" అనే ఈ ఖండంలో తెలుసుకొంటాం. అభివృద్ధి చెందని దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి విధానాలు, భారతదేశాన్ని ప్రత్యేకంగా దృష్టిలో ఉంచుకొని పరిశీలిస్తాం.

అభివృద్ధి చెందిన దేశాన్ని అభివృద్ధి చెందని దేశంతో పోల్చినపుడు దాని లక్షణాలేవి? అభివృద్ధి చెందని దేశాలలో అధిక సంఖ్యాకులైన ప్రజల జీవన ప్రమాణం చాలా తక్కువగా ఉంటుందని తెలుసుకున్నాం. మూడవ ప్రపంచంగా పేరు పొందిన దేశాలలో పరిస్థితులను పరిశీలించినప్పుడు వాటిలో కొన్ని సామాన్య లక్షణాలు మనకు కనిపిస్తాయి. ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా ఖండాలకు చెందిన 141 దేశాలను మూడవ ప్రపంచ దేశాలుగా పేర్కొనవచ్చు. మధ్య ప్రాచ్యంలోని దేశాలు అతిధనవంతమై ఉండగా, కొన్ని ఆఫ్రికా ఖండపు దేశాలు అతి బీదరికంలో మగ్గుతున్నాయి. అభివృద్ధి చెందని దేశాలను గూర్చి వివరంగా తెలుసుకొనే ముందు ఈ దేశాల సామాన్య లక్షణాలను పరిశీలించడం అవసరం.

## అభివృద్ధి చెందని (వెనుకబడిన) దేశాల లక్షణాలు

అభివృద్ధి చెందని దేశాలలో, 70 కోట్ల జనాభా కల్గిన భారతదేశం వంటి విశాలమైన దేశాలనుండి 60 లక్షల జనాభాగల వంటి చిన్న దేశాలు కూడా ఉన్నాయి. వీటిలో కొన్ని అపారమైన సహజ వనరులను కలిగి ఉండగా, మరికొన్ని పూర్తిగా సహజవనరులులేని స్థితిలో ఉన్నాయి. కాని "లైబెన్‌స్టన్" అనే ఆర్థిక శాస్త్రవేత్త పేర్కొన్నట్లుగా ఈ దేశాలన్నీ కొన్ని సామాన్య లక్షణాలను కలిగి ఉన్నాయి. వీటిని ఆర్థిక, సాంఘిక, రాజకీయ, జనాభా సంబంధ లక్షణాలుగా విభజించవచ్చు. ఇప్పుడు ఈ లక్షణాలను గూర్చి తెలుసుకొందాం.

## 1.2 ఆర్థిక లక్షణాలు

### 1.2.1 తక్కువ స్థాయి జీవన ప్రమాణాలు

అభివృద్ధి చెందిన దేశాలలో సామాన్య మానవుడు చాలా ఉన్నతమైన జీవన ప్రమాణాన్ని కలిగిఉండగా, అభివృద్ధి

B R A O U

చెందని దేశాలలో జీవన ప్రమాణాలు తక్కువ స్థాయిలో ఉన్నాయి. ఒక దేశ ప్రజల జీవన ప్రమాణాన్ని తలసరి ఆదాయం ఆధారంగా నిర్ణయిస్తారు. జాతీయాదాయాన్ని ఆ దేశపు జనాభాతో భాగించి తలసరి ఆదాయం తెలుసుకోవచ్చు. అభివృద్ధి చెందిన కొన్ని దేశాలతో పోల్చినప్పుడు అభివృద్ధి చెందని దేశాలలో తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలలో చాల తేడాలు ఉన్నట్లు గమనిస్తాం. ఉదాహరణకు 1976లో భారతదేశంలో తలసరి ఆదాయం 150 డాలర్లుకాగా బంగ్లాదేశ్‌లో 110 డాలర్లు, శ్రీలంకలో 200 డాలర్లు ఉన్నది. దీనితో పోలిస్తే అమెరికా సంయుక్త రాష్ట్రాలలో తలసరి ఆదాయం 7,900 డాలర్లు. ఇంగ్లాండులో 4,030 డాలర్లు, జపాన్‌లో 4,900 డాలర్లు ఉన్నది. ఈ సంఖ్యల వల్ల అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చినప్పుడు వెనుకబడిన దేశాల ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో స్పష్టమౌతుంది. వెనుకబడిన దేశాల జనాభాలో 40 నుండి 50 శాతం ప్రజలు దారుణమైన బీదరికానికి గురౌతున్నారు. తగిన గృహవసతి లేకపోవడం, అనారోగ్యం, పరిమితంగా లేక అసలే లేని విద్యాసౌకర్యాలు, నిరుద్యోగం, పుష్టికర ఆహారలోపం ఈ దేశాలలోని అధికశాతం ప్రజల ప్రధాన జీవన పరిస్థితులు.

### 1.2.2 తక్కువ ఆర్థిక పెరుగుదల రేటు

వెనకబడిన దేశాలలో తలసరి ఆదాయం తక్కువగా ఉండడమేకాక అభివృద్ధి రేటు కూడా అతి నెమ్మదిగా పెరుగుతోంది. ఉదాహరణకు 1962 1972 మధ్యకాలంలో జపాన్‌లో తలసరి ఆదాయం 9.4 శాతం, రష్యాలో 6.4 శాతం వృద్ధి చెందగా, భారతదేశంలో 1.1 శాతం మాత్రమే వృద్ధి చెందింది. అభివృద్ధి పెరుగుదలలో కనిపించే ఈ మాద్యం వల్ల అభివృద్ధి చెందిన దేశాలకు, వెనుకబడిన దేశాలకు మధ్య వ్యత్యాసం మరింత అధికమౌతోంది. తలసరి ఆదాయంలో పెరుగుదల నెమ్మదిగా జరగడానికి ముఖ్య కారణం జాతీయాదాయం తగినంత పెరగకపోవడమే. తలసరి ఆదాయం పెరుగుదల జనాభా పెరుగుదల మీద కూడా ఆధారపడివుంటుంది. జనాభా పెరుగుదల అధికంగా ఉంటే తలసరి ఆదాయం చెప్పుకోదగినంత ఎక్కువ కాజాలదు. జాతీయాదాయం తగినంతగా పెరగక పోవడానికి కారణాలు తెలుసుకొందాం.

### 1.2.3 ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికి ప్రాధాన్యత

వెనుకబడిన దేశాలలో వ్యవసాయం, ఖనిజాల ఉత్పత్తి, చేపల పట్టడం, అడవుల అభివృద్ధి ప్రజల ప్రధాన జీవనాధారాలుగా వున్నాయి. వీటన్నింటిని కలిపి ప్రాథమిక రంగం అంటారు. అంటే ప్రకృతి నుండి ముడి పదార్థాలను పోగుచేయడం, లేక ఉత్పత్తి చేయడం. వెనుకపడిన దేశాలలోని అధికసంఖ్యాక ప్రజల జీవనాధారం వ్యవసాయమే. ఉదాహరణకు 1970లో భారతదేశం జనాభాలో 68 శాతం, పాకిస్థాన్‌లో 71 శాతం, బర్మాలో 64 శాతం ప్రజలు వ్యవసాయం, దానికి సంబంధించిన పరిశ్రమలలో పాల్గొంటూ ఉండగా, ఇంగ్లాండ్‌లో 3 శాతం, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 4 శాతం, కెనడాలో 8 శాతం ప్రజలు మాత్రమే పాల్గొంటున్నారు. జాతీయాదాయంలో వ్యవసాయ రంగం వాటా భారతదేశంలో 45 శాతం ఉండగా ఇంగ్లాండ్‌లో 2 శాతం, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 3 శాతం మాత్రమే ఉన్నది. దీన్ని బట్టి అభివృద్ధి చెందిన దేశాలలో జాతీయ ఉత్పత్తిలో అధికభాగం పారిశ్రామిక రంగం నుండి లభిస్తుందని, అందువల్ల ఆ దేశాలలో పరిశ్రమలకు, పారిశ్రామిక వస్తూత్పత్తికి అధిక ప్రాధాన్యం లభిస్తున్నదని స్పష్టమౌతున్నది. ఈ కారణం వల్లనే అభివృద్ధి చెందిన దేశాలను పారిశ్రామిక దేశాలనీ, వెనుక పడిన దేశాలను వ్యావసాయిక దేశాలనీ పిలుస్తున్నారు.

### 1.2.4 తక్కువ స్థాయి ఉత్పాదక శక్తి

వెనుక పడిన దేశాలలో అధికభాగం వ్యవసాయం పైనే ఆధారపడిన ఉన్నప్పటికీ ఈ రంగంలో కూడా అవి ఉత్పాదక శక్తి విషయంలో అభివృద్ధి చెందిన దేశాల కంటే వెనుకబడి వున్నాయి. ఉదాహరణకు భారతదేశంలో 1975లో హెక్టారుకు వరి ఉత్పత్తి 1,887 కిలోలు కాగా, జపాన్‌లో 6,185 కిలోలు. అదే విధంగా భారతదేశంలో గోధుమ దిగుబడి హెక్టారుకు 1,338 కిలోలు కాగా, ఇంగ్లాండ్‌లో 4,382 కిలోలు. ఫ్రాన్సులో 3,888 కిలోలు. ఈ తక్కువ స్థాయి ఉత్పత్తికి అనేక కారణాలు ఉన్నాయి. వెనుకబడిన దేశాలలో రైతులకున్న పొలాల విస్తీర్ణం చాలా తక్కువ. అంతేగాక ఈ పొలాలు రైతులకు అందుబాటులో లేక, సారవంతంకాక,



BRAOU

ఆర్థికంగా నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఈ దేశాలలో వ్యవసాయం రైతు కుటుంబానికి సరిపోయేంత వ్యవసాయోత్పత్తి ప్రధాన లక్షణంగా కలిగి ఉన్నది. అనేక సందర్భాలలో వ్యవసాయోత్పత్తిలో అధికభాగం భూయజమానికి ఇవ్వవలసి రావడం వల్ల పొలం బాగు చెయ్యడానికి పెట్టుబడి పెట్టగల స్థితిలో రైతు ఉండడు. సరియైన నీటిపారుదల సౌకర్యాలు లేకపోవడం, నీటికొరకు వర్షాలపై ఆధారపడడం, పాతపడిన వ్యవసాయపద్ధతులను అనుసరించడం వల్ల కూడా వెనుకబడిన దేశాలలో ఉత్పాదక శక్తి తగ్గుతున్నది.

ఇతర రంగాలలో ఉద్యోగావకాశాలు అతిస్వల్పం కావడం వల్ల వెనుకబడిన దేశాల ప్రజలలో అధిక శాతం జీవనభృతికి వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారు. దీనివల్ల ఒక మనిషి చేయగల పనిని నలుగురైదుగురు చేయడం, తద్వారా ప్రచ్ఛన్న నిరుద్యోగ పరిస్థితి పెరుగుతోంది. అవసరం లేని ఈ వ్యక్తులను తొలగించినా, దిగుబడిగాని, ఉత్పాదక శక్తిగానీ తరిగిపోదు. అంటే ఈ అనవసరమైన వ్యక్తులు ఉత్పత్తికి ఏ విధంగానూ తోడ్పడటం లేదనీ, వారు నిజానికి పనిలేని వారనీ చెప్పవచ్చు.

జనాభాలో అధికభాగం వ్యవసాయ రంగంలో పాల్గొంటున్నందువల్ల భూమికీ, దానిపై ఆధారపడిన వ్యక్తులకూ మధ్య నిష్పత్తి చాలా అధికంగా ఉన్నది. వెనుక బడిన దేశాలలో వ్యవసాయరంగంలో కనిపించే మరికొన్ని ముఖ్యలక్షణాలు: పంటల మార్పిడి విధానం వల్ల వచ్చే లాభాలు రైతులకు తెలియక పోవడం, ఉత్తమ పద్ధతుల్లో భూమిసాగు చెయ్యక పోవడం, వ్యవసాయ ఉత్పత్తులకు తగిన మార్కెటింగ్ సౌకర్యాలు లేకపోవడం, రైతులనూ, వినియోగదారులనూ దళారీలు దోచుకోవడం మొదలైనవి.

## 1.2.5 పాత పడిన ఉత్పత్తి పద్ధతులు

వ్యవసాయంపై ఆధారపడిన వారి సంఖ్య అధికంగా ఉండటమే గాకుండా, అనేక వెనుకబడిన దేశాలలో వ్యవసాయ రంగంలో ఉపయోగించే ఉత్పత్తి పద్ధతులు కూడా చాలా పాతవి. దీనివల్ల తలసరి ఉత్పాదక శక్తి అతి తక్కువగా ఉంటున్నది. రైతుకు లభ్యమౌతున్న అతి తక్కువ పెట్టుబడి సరియైన విధంగా ఉపయోగించకపోవడం, లేక వృధా చేయడం, వ్యవసాయపు పనులు సక్రమంగా చేయకపోవడం వల్ల కూడా తలసరి ఆదాయం తగ్గుతున్నది. కొంచెం మెరుగైన పరికరాలను ఉపయోగించటం ద్వారా, వ్యవసాయ ఉత్పత్తిని సక్రమంగా నిర్వహించడం ద్వారా మొత్తం ఉత్పత్తిని అధికం చేయచ్చు. అభివృద్ధి చెందిన దేశాలలో యంత్రాలను ఎక్కువగా ఉపయోగించడం ద్వారా అధికోత్పత్తి స్థాయిని అందుకోగలుతున్నారు. ఆ దేశాలలో తగినంత మంది శ్రామికులు లభించకపోవడమే ఇందుకు కారణం. అయితే వెనుకబడిన దేశాలలో శ్రామికులు కావలసిన దానికంటే ఎక్కువగా లభిస్తూ ఉండడం వల్ల ఈ పద్ధతులను అనుసరించవలసిన అవసరం లేదు. దానికి బదులు శ్రామికులను సరిగా ఉపయోగించుకుంటూ మర నాగలి వంటి ఆధునిక పనిముట్లు, నీటి పారుదల సౌకర్యాల సహాయంతో అధికోత్పత్తిని సాధించవచ్చు.

## 1.2.6 తక్కువస్థాయి మూలధన సంచయనం

వెనుకబడిన దేశాలలో మరొక ప్రధాన తగిన స్థాయిలో మూలధన సంచయనం లేకపోవడం. ప్రాథమిక పరిశ్రమల పెరుగుదల, భారీ పరిశ్రమలు, ప్రాథమిక సౌకర్యాల కల్పన మూలధన సంచయనం పెరుగుదలలో చేరి ఉన్నాయి. పరిశ్రమల అభివృద్ధికి కీలకమైన ఉక్కు, విద్యుచ్ఛక్తి, బొగ్గు, అల్యూమినియం, రాగి, ఇతర లోహాలు, ఖనిజాల ఉత్పత్తికి ప్రాథమిక పరిశ్రమలు తోడ్పడతాయి. 1970లో తలసరి ఉక్కు వినియోగం మన దేశంలో 11 కిలోలు కాగా, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 528 కిలోలు. భారీ పరిశ్రమల రంగంలో భారీ యంత్రాలు, గనులలో ఉపయోగించే యంత్రాలు డైనమోలు, బ్లాస్ట్ ఫర్నేస్, మిషన్‌టూల్స్ మొదలైనవి ఉన్నాయి. ప్రాథమిక సౌకర్యాలలో రైల్వేలు, రోడ్లు, కాలువల ద్వారా రవాణా, విమానయానం, వార్తాపత్రికలు, రేడియో, టెలిగ్రాఫ్, టెలిఫోన్, తపాలా మొదలైన ప్రసార సాధనాలు చేరి ఉంటాయి.

వెనుకబడిన దేశాలలో ఈ రంగాలు దాదాపు శూన్యమని లేక వాటి పెరుగుదల అతి నెమ్మదిగా ఉందని చెప్పవచ్చును. ఒక దేశపు ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామికాభివృద్ధికి ఇవి ఆధార భూతం కావడం వల్ల వాటి అభివృద్ధిని త్వరితం చేయవలసిన అవసరం ఉన్నది.

## 1.2.7 తక్కువ స్థాయిలో పెట్టుబడి

వెనుకబడిన దేశాలలో పైన తెల్పిన రంగాలలో పెట్టుబడి అతి తక్కువగా ఉండటం వల్ల ఈ రంగాలు అభివృద్ధి చెందడం లేదు. ప్రజలలో అధికభాగం పేదరికంలో మగ్గుతున్నందున వారు ఉత్పత్తి రంగాలలో పెట్టుబడి పెట్టగల స్థితిలో లేరు. అయితే పెట్టుబడి అధికమైతే అభివృద్ధి రేటు అధికమౌతుందని చెప్పలేం. ఉదాహరణకు ప్రజలకు అత్యవసరం కాని వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలలో పెట్టుబడి పెడితే అధిక భాగానికి దానివల్ల మేలుకలగదు. అదే విధంగా బాగా అభివృద్ధి చెందిన యాంత్రిక పద్ధతులలో పెట్టుబడి పెట్టినా పెరుగుదల రేటు తక్కువగానే ఉంటుంది. అందువల్ల అభివృద్ధి సాధనకు ఏఏ రంగాలలో పెట్టుబడి అవసరమో గుర్తించవలసిన అవసరముంది. వెనుకబడిన దేశాలలో ధనిక వర్గాల వారు తమ నిధులను బంగారం, వెండి నగల వంటి వాటిని కొనడానికే లేక ఆస్తులను సంపాదించుకోవడానికే వినియోగిస్తారు. కాని వస్తూత్పత్తికి ఉపయోగపడే పరిశ్రమలలో పెట్టుబడి పెట్టరు. ఈ విధంగా మిగులు నిధులు లభ్యమవుతున్నా వాటిని తమ వినియోగానికే ఉపయోగిస్తారు. అందువల్ల ఈ దేశాలలో ఉత్పత్తి, ఉత్పత్తి సాధనాల పెరుగుదల దెబ్బతింటున్నాయి.

## 1.2.8 ముడిసరుకుల ఎగుమతి

వెనుకబడిన దేశాల విదేశీ వర్తకంలో అధికభాగం ఆయా దేశాల ముడిసరుకులే అని తెలుసుకోవచ్చు. ప్రపంచంలో సహజవనరుల సరఫరాలలో అధిక భాగం ఈ దేశాలనుండే లభిస్తోంది. ఈ దేశాలు ఎగుమతి చేసే ముడిసరుకులలో మలయా, బొలివియా, థాయ్ లాండ్ దేశాలనుండి తగరం, శ్రీలంక, బర్మా దేశాలనుండి రబ్బరు, ఇతర దేశాలనుండి తేయాకు, కాఫీ, చెరకు, పొగాకు, పత్తి, ఇతర లోహాలు, ఖనిజాలు ఉన్నాయి. ఈ ముడిసరుకులను అభివృద్ధి చెందిన దేశాలు దిగుమతి చేసికొని, అక్కడ వృద్ధి చెందుతున్న పరిశ్రమలలో వస్తూత్పత్తికి ఉపయోగించుకొంటున్నాయి. వెనుకబడిన దేశాలు తమ ముడిసరుకులకు తగిన ధరలను పొందలేకపోయినా, పెట్రోలు ఉత్పత్తి చేసే దేశాలు మాత్రం ధరల విషయంలో తమ మాటను నెగ్గించుకోగల్గుతున్నాయి. ఎగుమతుల నుండి సంపాదన నిలకడగా ఉండదు. ఒకవేళ అభివృద్ధి చెందిన దేశాలు ముడిసరుకుల దిగుమతులను ఏ కారణం చేతనైనా ఆపి వేస్తే వెనుకబడిన దేశాల ఆర్థిక వ్యవస్థలు బాగా దెబ్బతింటాయి. వెనుకబడిన దేశాలు ఎగుమతుల ద్వారా సంపాదించే ఆదాయం స్థిరంగా ఉంటుందని చెప్పడానికి వీలులేదు. ముడిసరుకులను ఎగుమతి చేసే దేశాల మధ్య పోటీలు, శత్రుత్వం, అవసరమైన దానికంటే ఎక్కువ ఉత్పత్తి, అస్థిర రాజకీయ సంబంధాలు ఒక వస్తువుకు బదులు ఇంకొక వస్తూత్పత్తి (ఉదాహరణకు రబ్బరుకు బదులుగా ప్లాస్టిక్) అనే ఇతర కారకాలు వెనుకబడిన దేశాలు ఎగుమతుల ద్వారా సంపాదించే ఆదాయం అస్థిరత్వంగా ఉండటానికి దోహదం చేస్తున్నాయి. అంతేకాక వెనుకబడిన దేశాలు అభివృద్ధి చెందిన దేశాలనుండి అతి ఖరీదైన యంత్ర పరికరాలను దిగుమతి చేసుకోవడం వల్ల అవి విదేశీమారక ద్రవ్యం విషయంలో అభివృద్ధి చెందిన దేశాలకు రుణపడుతున్నాయి.

BRAOU

---

### మీ అవగాహనను పరీక్షించుకోండి — 1

---

1. అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక లక్షణాలేవి?
2. ప్రాథమిక రంగం అంటే ఏమిటి?
3. అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రధానంగా ఏ వస్తువులను ఎగుమతి చేస్తున్నాయి?

---

## 1.3 జనాభా సంబంధమైన లక్షణాలు

---

వెనుకబడిన దేశాలలో ఎక్కువ భాగం అధిక జనాభా కల్గి ఉన్నాయి. అంతేగాక వాటి జనాభా అతివేగం పెరుగుతున్నది. జనాభాకు సంబంధించి వెనుకబడిన దేశాలకు చెందినకొన్ని సమస్యలను పరిశీలిద్దాం.

### 1.3.1 అధిక జననాల రేటు

అధిక జననాల రేటు మూలంగా జనాభా పెరుగుదల వివరిస్తుంది. ఈ జననాల రేటు వెనుకబడిన దేశాలలో ప్రతి వెయ్యిమందికి 35 నుండి 40 వరకు ఉండగా అభివృద్ధి చెందిన దేశాలలో ఇది 1000 జనాభాకు 10 నుండి 15 మాత్రమే ఉంది. ఈ విధమైన అధిక జననాలరేటు వల్ల జనాభాలో 15 సంవత్సరాలకు లోబడిన వారి శాతం చాలా అధికంగా ఉంటున్నది. ఈశాతం పెరిగి, సంతానోత్పత్తి చేసే వారు పెరుగుతున్నప్పుడు జనాభా మరింత పెరుగుతుంది. ఆ విధంగా జనాభా పెరుగుతూనే ఉంటుంది.

### 1.3.2 అధిక మరణాలరేటు

వెనుకబడిన దేశాలలో జననాల లాగే మరణాల రేటుకూడా అధికంగానే ఉన్నది. అనేక ప్రాణాంతకమైన రోగాల వ్యాప్తి వల్ల ప్రజలలో గరిష్ట జీవన స్థాయి తగ్గుతున్నది. సరిపైన వైద్యసౌకర్యాలు కొరవడడం, అపరిశుభ్రత, పుష్టికరమైన ఆహారం లభించకపోడవం వల్ల ఈ దేశాలలో మరణాల సంఖ్య అధికంగా ఉంది. అభివృద్ధి చెందిన దేశాలలో మరణాల రేటు ప్రతి 1000 జనాభాకు 7 నుండి 8 మాత్రమే కాగా వెనుకబడిన దేశాలలో ఇది 17 నుండి 20 వరకు ఉన్నది..

అయితే అర్ధ శతాబ్దానికి ముందు ఉన్న పరిస్థితితో పోలిస్తే ఇటీవల కాలంలో మరణాలరేటు చాలా తగ్గింది. మసూచి, ప్లేగు వంటి ప్రాణాంతకమైన రోగాలను నిర్మూలించడం వల్ల మన దేశంలో 1911లో వెయ్యి జనాభాకు 40 నుండి 43 వరకు ఉన్న మరణాల రేటును 1971 నాటికి 1000కి 15కు తగ్గించగలిగారు. అయితే అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చినప్పుడు ఈ సంఖ్య అధికమని చెప్పాలి. అభివృద్ధి చెందిన దేశాలలో గరిష్ట జీవనస్థాయి 70 నుండి 75 సంవత్సరాలు కాగా మన దేశంలో అది 50 నుండి 52 సంవత్సరాల వరకు ఉన్నది.

### 1.3.3 అధిక జనాభా పెరుగుదల

జననాల పెరుగుదల రేటు నిలకడగా ఉండడం లేక కొంచెం తగ్గటం జరిగినప్పటికీ (1911లో జననాలరేటు 1000 జనాభాకు 49 కాగా 1971లో అది 1000 జనాభాకు 35కు తగ్గింది) మరణాలరేటులో అత్యధిక తగ్గుదల ఏర్పడడం వల్ల జనాభా పెరుగుదల అవధులను మించిపోయింది. ప్రస్తుతం వెనుకబడిన దేశాలలో జనాభా పెరుగుదల రేటు 2.5 శాతం నుండి 3 శాతం వరకు ఉన్నది. అయితే అభివృద్ధిచెందిన దేశాలలో ఈ పెరుగుదల 0.3 నుండి 0.8 శాతం మాత్రమే. జనాభా ఇదే విధంగా పెరిగితే వెనుకబడిన దేశాలలో మరొక 23 నుండి 28 సంవత్సరాల కాలంలో జనాభా రెండింతలు కాగలదు. జనాభా పెరుగుదలలో కనిపిస్తున్న ఆధిక్యత వల్ల తలసరి ఆదాయం తగ్గిపోతుంది.

BRAOU

### 1.3.4 అధికమైన నిరుద్యోగం

జనాభా పెరుగుదలతో పాటు శ్రామికుల సంఖ్య పెరుగుతుంది. కాని ఆర్థిక వ్యవస్థలో పెరుగుదల తక్కువగా ఉండటం వల్ల ఉద్యోగావకాశాలు తగినంతగా పెరగవు. అందువల్ల ఈ దేశాలలో నిరుద్యోగం చాలా అధికంగా ఉంది. ఈ నిరుద్యోగం ఒక వ్యక్తికి పూర్తికాలం పనిలేక పోవడం రూపంలో గానీ, అసలే పనిలేక పోవడం రూపంలోగానీ ఉండచ్చు. మొదటి రకమైన నిరుద్యోగాన్ని గూర్చి ఇంతకు ముందు తెల్సుకున్నాం. రెండవరకమైన దానిలో పనిచేయడానికి తగినశక్తి, ఇష్టం ఉండి కూడా పనిలభించని వారు చేరుతారు. ఆఫ్రికాలోని వెనుకబడిన దేశాలలో 1960లో 31 శాతం ఉన్న నిరుద్యోగం 1973 నాటికి 38 శాతం వరకు పెరిగింది. అదే విధంగా ఆసియాలో 24 శాతం నుండి 28 శాతం వరకు, లాటిన్ అమెరికా దేశాలలో 18 శాతం నుండి 25 శాతానికి నిరుద్యోగం పెరిగింది. గ్రామీణ ప్రాంతాలలో పని దొరకనందున నగరాలకు ప్రజలు వలసపోవడం, తద్వారా ఇరుకు పరిస్థితులలో జీవించడం వల్ల ప్రజలలో నిస్పృహ, నిరాశ, కలతలు, నేరాలు అధికం అవుతున్నాయి.

## మీ అవగాహనను పరీక్షించుకొండి — 2

4. వెనుకబడిన దేశాల జనాభా లక్షణాలు ఏమిటి?

## 1.4 సాంఘిక, రాజకీయ లక్షణాలు

ఒకదేశం అభివృద్ధి చెందకుండా ఉండటానికి ఆర్థికేతర లక్షణాలు కూడా తోడ్పడతాయి. ప్రజల ప్రవర్తన, సాంఘిక వ్యవస్థ, విద్యాస్థాయి, రాజకీయ చారిత్రక పరిస్థితులు వెనుకబడిన దేశాల ఆర్థికేతర లక్షణాలు. ఇప్పుడు వీటిని పరిశీలిద్దాం.

### 1.4.1 ఆదాయం, వినియోగాలలో అసమానత్వాలు

వెనుకబడిన దేశాల జాతీయాదాయం తక్కువగా ఉండి, అతి నెమ్మదిగా పెరుగుతుందని తెలుసుకొన్నాం. అయితే ఇప్పుడు ఈ జాతీయాదాయం ప్రజలలో ఏ విధంగా పంపకమవుతుందో తెలుసుకొందాం. సామాన్యంగా, వెనుకబడిన దేశాలలో జాతీయాదాయం పంపిణీ అసమానంగా ఉంటుంది. భూమి, పరిశ్రమలు ఇతర ఆస్తులూ ఉన్న వర్గాల ప్రజలు జాతీయాదాయంలో అధికభాగం పొందుతారు. దేశ జనాభాను అధికాదాయంగల వర్గాల నుండి అల్పాదాయంగల వర్గాలుగా అవరోహణ క్రమంలో విభజిస్తే పై స్థాయిలోని 10 శాతం ప్రజలు జాతీయాదాయంలో 25 శాతం పొందుతున్నారనేది స్పష్టమవుతుంది. అంటే మొత్తం జాతీయోత్పత్తిలో 4వ శాతం ఉన్నత ఆదాయ వర్గాలు పొందుతుండగా, సమాజంలో దిగువస్థాయిలో ఉన్న 20 శాతం ప్రజలు జాతీయ ఉత్పత్తిలో 8 శాతం మాత్రమే పొందుతున్నారు. దీని ఫలితంగా ప్రజల జీవన ప్రమాణాలలో గొప్ప వ్యత్యాసం కనిపిస్తుంది. సమాజంలో అతి చిన్న వర్గం అత్యధికమైన జీవన ప్రమాణాన్ని కలిగి ఉండగా మిగతావారు బీదరికంలో మగ్గుతున్నారు. ఈ విధంగా వెనుకబడిన దేశాలలో ఒకవైపు భోగభాగ్యాలు కలిగి, మరొకవైపు అతి బీదరికంతో ఉండటం అనే ద్వంద్వ లక్షణాలు కనిపిస్తున్నాయి. అదే విధంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో జీవన ప్రమాణాలు వేరువేరుగా కన్పిస్తాయి.

### 1.4.2 మార్పులేని సామాజిక ప్రవర్తన

వెనుకబడిన దేశాలలో కులం, హోదా మొదలైన సాంఘిక ధోరణులు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. వీటివల్ల సమాజంలో దిగువన ఉన్న ప్రజలను అణచివేయడం, దోచుకోవడం కొనసాగుతుంది. సామాన్యంగా ఉద్యోగాలిచ్చేటప్పుడు తమ తమ కులం, వర్గం వారికే ప్రాధాన్యతనివ్వడం వల్ల వ్యక్తులలో పనిచేయాలనే కోరిక, చొరవ నశిస్తాయి. ఈ దేశాలలో సాంఘిక, మత విధి నిషేధాలూ, మూఢనమ్మకాలూ కూడా ప్రముఖంగా కన్పిస్తాయి.

### 1.4.3 అనుత్పాదక వినియోగం (Conspicuous Consumption)

ప్రజల ఆదాయంలో మిగులు ఏదైనా లభిస్తే దానిని సమాజంలో తమ హోదాను నిలుపుకొనడానికి వినియోగిస్తారు. ఆ మిగులు ఆదాయాన్ని ఇళ్ళు లేక ఆస్తులు, నగలు, కార్లు కొనడానికి గాని, మత, సాంఘిక సంబంధమైన ఉత్సవాలు, పెళ్ళిళ్ళు మొదలైన వాటిపై దుబారాగా ఖర్చు చేయడానికి గాని ఉపయోగిస్తారు. ఈ విధమైన ఖర్చువల్ల సమాజంలోని తమ హోదా పెరుగుతుంది అని భావిస్తారు. కాని ఇటువంటి ఖర్చు ఉత్పత్తికి తోడ్పడక పోవడమే కాక ఆర్థికవ్యవస్థ మెరుగుదలకు ఉపయోగపడదు.

### 1.4.4 నిరక్షరాస్యత

ఒక దేశ అభివృద్ధిని గణించడానికి ఆ దేశపు ప్రజల విద్యాస్థాయి సూచికవలె పనిచేస్తుంది. వెనుకబడిన దేశాలలో అధికభాగం నిరక్షరాస్యులే. 1974లో మనదేశంలో అక్షరాస్యత 34 శాతం ఉండగా, పాకిస్తాన్‌లో 16 శాతం,

BRAOU

ఘనాలో 25 శాతం ఉంది కాని జపాన్‌లో 98 శాతం, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో, ఇంగ్లాండ్‌లో 99 శాతం ప్రజలు అక్షరాస్యులు.

నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్న దేశాలలో ప్రజలు ఛాందస భావాలకు దాసులై, ఉత్పత్తి రంగంలో ఆధునిక పద్ధతుల ప్రాధాన్యతను గుర్తించలేని స్థితిలో ఉంటారు.

## మీ అవగాహనను పరీక్షించుకొండి — 3

5. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రధాన సాంఘిక, రాజకీయ లక్షణాలేమిటి?

## 1.5 చారిత్రక కారణాలు

ఈనాడు వెనుకబడిన దేశాలను పరిశీలిస్తే అవి ఎక్కువ భాగం ఇంగ్లండ్, ఫ్రాన్స్, హాలెండ్, స్పెయిన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలకు ఒకప్పుడు వలస రాజ్యాలుగా ఉండేవని తెలుస్తుంది. అభివృద్ధి చెందిన దేశాలు తమ వలస రాజ్యాలను రెండు విధాలుగా ఉపయోగించుకున్నాయి. తమ దేశాలలో పరిశ్రమల ఉపయోగార్థం వలస రాజ్యాల నుండి ముడి సరుకులను పొందడం, తమ దేశాలలో ఉత్పత్తి అయిన వస్తువులకు వలస రాజ్యాలను విక్రయ కేంద్రాలుగా వాడుకొనడం. దీనివల్ల వెనుకబడిన దేశాల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం కావడం, స్థానిక పరిశ్రమలు అంతరించడం, స్థానిక ఉత్పత్తులకు మార్కెట్ లేక పోవడం జరిగింది. ఈ వెనుకబడిన దేశాలు స్వాతంత్ర్యం పొందిన తర్వాత సమతుల్య ఆర్థికాభివృద్ధి సాధించడానికి తిరిగి కృషి ప్రారంభించవలసి వచ్చింది.

## 1.6 సారాంశం/ముగింపు

పైన తెలిపిన లక్షణాలన్నింటినీ పరిశీలిస్తే వెనుకబడిన దేశాలు అభివృద్ధి చెందిన దేశాలుగా రూపొందడానికి విప్లవాత్మకమైన మార్పులు అవసరమనేది స్పష్టమౌతుంది. ఇన్ని రకాలైన లక్షణాలు కలిగి ఉండడం వల్ల 'వెనుకబడిన దేశాలు' అనే పదం నిర్వచించడం కష్టం. ఐక్యరాజ్యసమితి నిర్వచనం ప్రకారం ''అమెరికా సంయుక్త రాష్ట్రాలు, కెనడా, ఆస్ట్రేలియా, పశ్చిమ యూరప్ దేశాల ప్రజల తలసరి ఆదాయంతో పోలిస్తే తక్కువ తలసరి ఆదాయం గల దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా'' చెప్పవచ్చు. ఈ నిర్వచనంలో జీవన ప్రమాణాలు పోలిక మాత్రమే పరిగణనలోనికి తీసుకొనబడింది. కాని ఇది ఒక్కటే సరిపోదు. ఉదాహరణకు వెనుకబడిన దేశంగా గుర్తించబడిన కువైట్ 1976లో ప్రపంచమంతటిలో అధిక తలసరి ఆదాయం 1,55,000 డాలర్లు కల్గి ఉంది. ఇది అభివృద్ధి చెందిన దేశాల తలసరి ఆదాయం కంటే చాలా ఎక్కువ. అందువల్ల, అభివృద్ధి చెందిన దేశంతో పోల్చినప్పుడు ప్రాథమిక మైన లోపం సూచించడం ఒక దేశపు వెనుకబడిన తనానికి నిదర్శనంగా చెప్పవచ్చు. నర్క్స్ అనే ఆర్థికశాస్త్రవేత్త వెనుకబడిన దేశాలను — ఆయా దేశాల జనాభా, సహజ వనరులను పరిగణనలోనికి తీసుకొన్నప్పుడు అభివృద్ధి చెందిన దేశాలకంటే తక్కువ ఉత్పత్తి పరికరాలు కలిగిన దేశాలుగా నిర్వచించాడు. మన దేశంలో ప్రణాళిక సంఘం వెనుకబడిన దేశాల నిర్వచనంలో నిరుద్యోగాన్ని కూడా పరిగణనలోకి తీసుకొన్నది. ''వెనుకబడిన దేశాలలో శ్రామిక శక్తి పూర్తిగాగాని, కొంతవరకు గాని వినియోగించబడక పోవడం, సహజ వనరులు పూర్తిగా వినియోగంలోకి తీసుకురాకపోవడం అనే లక్షణాలు పక్కపక్కనే కనిపిస్తాయి'' అని ప్రణాళిక సంఘం తెలియజేసింది.

ఈ పాఠంలో అభివృద్ధి చెందని దేశాల వివిధ లక్షణాలను పరిశీలించాం. అయితే వీటి వలన అభివృద్ధి తగినంతగా జరగకపోవడానికి పరిపూర్ణమైన సమాచారం లభిస్తుందని చెప్పలేం. ఇవి వెనుకబడిన దేశాలేవో గుర్తించడానికి

మాత్రమే సహాయపడతాయి. అభివృద్ధి సాధన కొరకు ముఖ్య అవరోధాలేవో గుర్తించి వాటిని తొలగించవలసిన అవసరం ఉన్నది. ఇది ఎలా సాధించవచ్చునో తరువాత పాఠంలో తెలుసుకుంటాం.

పాఠ్య రచయిత్రి: కుమారి ప్రభాపంత్

## 1.7 సంప్రదింపు గ్రంథాలు


| | | |
|---|---|---|
| 1. Datt and Sundaram | : | Indian Economy |
| 2. Benjamin Higgins | : | Economic Development |
| 3. Ghosh | : | Economics of Underdevelopment |
| 4. తెలుగు అకాడమి (1973) | : | భారతదేశ ఆర్థికాభివృద్ధి సమస్యలు |
| 5. తెలుగు అకాడమి (1978) | : | భారతదేశం ప్రణాళిక విధానం |
| 6. తెలుగు అకాడమి (1973) | : | ఆర్థికాభివృద్ధి — వృద్ధి సిద్ధాంతాలు |


## 1.8 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు *30* పంక్తులలో జవాబులు రాయండి.

1. అభివృద్ధి చెందుతున్న దేశాల లక్షణాలేమిటి?
2. ఆర్థికాభివృద్ధికి అవసరమైన కారకాలేమిటి?
3. ఆర్థికాభివృద్ధికి అవసరమైన ఆర్థిక లక్షణాలను విశ్లేషించండి

II. కింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు *15* పంక్తులలో జవాబులు రాయండి.

1. ఆర్థికాభివృద్ధి లక్ష్యాలలో పెరుగుదల రేటును ఒక కారకంగా భావించడంలోని దోషాలేమిటి?
2. ఉద్యోగితలో పెరుగుదల ఏ విధంగా ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంది?
3. ఆర్థికావృద్ధిలో జనాభా సంబంధమైన లక్షణాలను వివరించండి
4. వెనుకబడిన దేశాల సాంఘిక, రాజకీయ లక్షణాలను వివరించండి.

BRAOU

# భాగం — 2: ఆర్థికాభివృద్ధికి అవరోధాలు, దోహదాలు

## విషయక్రమం


2.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

2.1 పరిచయం

2.2 ఆర్థికాభివృద్ధిని నిరోధించే కారకాలు

- 2.2. A ఆర్థికేతర కారణాలు
- 2.2. $A_1$ చారిత్రక అవరోధాలు
- 2.2. $A_2$ సాంఘిక, సాంస్కృతిక అవరోధాలు
- 2.2. B ఆర్థిక కారణాలు
- 2.2. $B_1$ మూలధన లోపం
- 2.2. $B_2$ జనాభా ఒత్తిడులు.
- 2.2. $B_3$ సాంకేతిక పరిజ్ఞాన లోపం
- 2.2. $B_4$ ద్వంద్వ ఆర్థిక విధానం

2.3 ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే కారకాలు

2.4 పెరుగుదలకు, అభివృద్ధికి మధ్యగల తారతమ్యం

2.5 సారాంశం/ముగింపు

2.6 సంప్రదింపు గ్రంథాలు

2.7 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 2.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

ఆర్థికాభివృద్ధిని నిరోధించే శక్తులను, ప్రేరేపించే కారకాలను వర్ణించడమే ఈ భాగం లక్ష్యం.

ఈ పాఠ్యాన్ని చదివిన తర్వాత మీరు

★ ఆర్థికాభివృద్ధికి అవరోధకాలైన ఆర్థికేతర కారణాలను వివరించగలరు.

★ ఆర్థికాభివృద్ధిని నిరోధించే ఆర్థిక కారణాలను విశ్లేషించగలరు.

★ ఆర్థికాభివృద్ధిని దోహదపరచే కారకాలను విశదీకరించగలరు.

★ ఆర్థికాభివృద్ధిని, ఆర్థిక పెరుగుదలల మధ్య తేడాను గుర్తించగలరు.

BRAOU

## 2.1 పరిచయం

అభివృద్ధి చెందని దేశాల వివిధ లక్షణాలను పరిశీలించిన తరువాత, అభివృద్ధికి అవరోధం కలిగించే విషయాలేవో తెలుసుకుందాం. ఆ తర్వాత వెనుకబడిన దేశాలలో వాంఛనీయమైన మార్పులను సాధించడానికి ప్రాధాన్య మివ్వవలసిన కీలక రంగాలను గూర్చి తెలుసుకొందాం.

## 2.2 ఆర్థికాభివృద్ధిని నిరోధించే కారకాలు

పాశ్చాత్య దేశాలు అపారమైన ఆర్థికాభివృద్ధిని సాధిస్తూ ఉండగా, అభివృద్ధి చెందని దేశాలు స్తబ్దంగా లేదా

పూర్తిగా స్తబ్దంగా ఉన్న ఆర్థిక వ్యవస్థలు కలిగి ఉండడానికి ఏదో ఒక ముఖ్య కారణం ఉండాలి. ఈ దేశాలలో ఆర్థిక లోపానికి అనేక మంది ఆర్థికశాస్త్రవేత్తలు వివిధ కారణాలను పేర్కొంటున్నారు. ఈ పాఠంలో అభివృద్ధికి అడ్డుగోడలుగా ఉన్న విషయాలను గూర్చి తెలుసుకుంటాం. వీటిని ఆర్థికేతరమైనవి, ఆర్థికపరమైనవి అని రెండు వర్గాలుగా విభజించవచ్చు.

## 2.2 A ఆర్థికేతర కారణాలు

## 2.2. $A_1$ చారిత్రక అవరోధాలు

మొదటి భాగంలో పేర్కొన్నట్లుగా వెనుకబడిన దేశాలు యిటీవలే ఆర్థికాభివృద్ధికి కృషి చేయడం వల్ల చెప్పుకోదగిన అభివృద్ధిని సాధించలేకపోయాయి. దీనికి కారణం ఇటీవలి కాలం వరకు అధికభాగం పాశ్చాత్యదేశాలకు వలస రాజ్యాలుగా ఉండడమే అని చెప్పవచ్చు. ఇంతకు ముందే చెప్పినట్లుగా ఈ దేశాలు వలస రాజ్యాధికారుల దోపిడికి గురి అయ్యాయి. వలసరాజ్యాలు వాటిని పరిపాలించే దేశాలకు ముడిసరుకులు సరఫరా చేయడమే కాక, ఆ దేశాలలో తయారైన వస్తువులకు మార్కెట్లుగా కూడా ఉపయోగపడ్డాయి. అందువల్ల పాలక దేశాలు వలస రాజ్యాలను అభివృద్ధి చేయడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పాశ్చాత్యదేశాలు తమ వలస దేశాలలో ఏ రంగాలను అభివృద్ధి చేస్తే తమ ఆర్థిక వ్యవస్థలకు దోహదం చేసి, వలస దేశాలనుండి దిగుమతులను పెంచడానికి వీలౌతుందో ఆ రంగాలను మాత్రమే అభివృద్ధి చేశాయి. అందువల్లనే ముడి సరుకుల ఎగుమతికి సహాయపడే రైల్వేలు, నౌకాశ్రయాలు వంటి వాటినే వలస రాజ్యాలలో అభివృద్ధి చేశారు. ఫలితంగా వలస రాజ్యాల ఆర్థిక వ్యవస్థలు అస్తవ్యస్తంగా వృద్ధి చెందాయి. చౌకధరలకు లభించే విదేశీ వస్తువుల దిగుమతి వల్ల ఆయా దేశాలలో సాంప్రదాయ పరిశ్రమలు దెబ్బతిన్నాయి. బ్రిటన్ అనుసరించిన ఇటువంటి స్వార్థపూరిత విధానం వల్లనే మనదేశంలో చేనేత పరిశ్రమ నాశనమైంది. స్వాతంత్ర్యం పొందిన (పూర్వ వలస) దేశాలు ఆర్థిక వ్యవస్థలను పునర్నిర్మించుకోవలసిన గురుతర బాధ్యతలను ఎదుర్కొన్నాయి. తమ పూర్వ పాలకులు అనుసరించిన అక్రమ ఆర్థిక విధానాల ఫలితంగా ఏర్పడిన ఆర్థిక అసమానత్వాలను సరిదిద్దుకోవలసి వచ్చింది.

## 2.2 $A_2$ సాంఘిక, సాంస్కృతిక అవరోధాలు

పాశ్చాత్య దేశాల ప్రజలతో పోల్చినప్పుడు అభివృద్ధి చెందని దేశాల ప్రజల వైఖరులు భిన్నంగా కనిపిస్తాయి. అనేక వెనుక బడిన దేశాలలో ప్రజలు మతపరమైన సిద్ధాంతాలకు విలువనివ్వడము, కర్మ సిద్ధాంతం పట్ల విశ్వాసం కలిగి ఉండడం, కోర్కెలను అణచివేసుకోవడం, జీవితం పట్ల ఆధ్యాత్మిక వైఖరిని అలవర్చుకోవడం వంటివి గోచరిస్తాయి. భౌతిక సంక్షేమంకన్నా, ఆధ్యాత్మిక చింతనకు ఈ దేశ ప్రజలు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. దీని ఫలితంగా జీవన పరిస్థితులను మెరుగు పర్చుకొనేందుకు తక్కువ కృషి చేయడం, జీవితంలో అపజయాలకు, కష్టాలకు, వ్యాధులకు చివరకు మృత్యువుకు కూడా వేదాంత ధోరణిలో తలఒగ్గడం వీరిలో కనిపిస్తాయి. మతం, మతాధికారుల ఆధిపత్యం నుండి విముక్తులైన పాశ్చాత్యదేశాల ప్రజలు తమ భౌతిక సంక్షేమాన్ని మెరుగుపర్చుకునే స్థితిలో ఉన్నారు. వారు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని, శాస్త్ర విజ్ఞానం, ప్రకృతి ప్రాధాన్యతను గ్రహించి, వాటిని తమ ఆర్థిక అభ్యున్నతికి తోడ్పడే విధంగా మలచుకోవటానికి కృషి చేశారు. కాని ఛాందస భావాలకు బానిసలైన వెనుకబడిన దేశాల ప్రజలు, ప్రకృతి శక్తులను తమ అభివృద్ధికి దోహదం చేసే విధముగా ఉపయోగించుకోలే పోయారు

ఈ దేశాలలో అభివృద్ధి అతితక్కువగా ఉండటానికి కొన్ని సాంఘికాచారాలు కూడా తోడ్పడ్డాయి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ వల్ల కుటుంబంలోని సభ్యులందరు ఒక ఇంటికే పరిమిత మైనందున వారిలో చొరవ, సాహసం నశించాయి. కుటుంబంలోని కొడుకులందరికి ఆస్తిలో భాగం ఉంటుంది. వారు వేరుపడితే ఆస్తి

ముక్కచెక్క లౌతుంది. గనుక అందరూ ఉమ్మడిగా జీవిస్తూ భూమిని కలిసి కట్టుగా సాగుచేయడం మంచిదనే భావనే ఉమ్మడి కుటుంబానికి మూలం. దీని ఫలితంగా కుటుంబ సభ్యులెవరైనా వేరే వృత్తులను చేపట్టాలన్నా వీలు కలుగదు. అందువల్ల తరతరాలుగా కుటుంబ సభ్యులు ఒకే వృత్తికి పరిమితమయ్యారు. మన దేశంలో కళలు, వైద్యం వంటి అనేక శాస్త్ర విద్యలకు కులం ఆధారంగా ఉండటం వల్ల వాటి విస్తరణకు అవరోధం ఏర్పడింది. వాటిలో కొన్ని మరుగున పడిపోయాయి. విద్యార్జన కూడా కొన్ని కులాలకే పరిమితమైంది. అంతే గాక విద్యాబోధన, కళలకు, సంగీత సాహిత్యాలకు మాత్రమే పరిమితమై మనో విజ్ఞానం పెరగడానికి తోడ్పడినా అది ఆర్థికాభివృద్ధికి దోహదం చేయలేదు.

## 2.2 B అభివృద్ధికి అవరోధమైన ఆర్థిక కారణాలు

ఆర్థికేతర కారణాలను పరిశీలించిన తరువాత అభివృద్ధికి అవరోధంగా ఉన్న ఆర్థిక కారణాలను మనం ఇప్పుడు పరిశీలిద్దాం. స్వల్పమైన మూలధన సంచయనం, జనాభా పెరుగుదల ఆర్థికాభివృద్ధికి అవరోధంగా ఉంటాయని అందరూ అంగీకరించారు. ఇపుడు మనం వీటికి సంబంధించిన కొన్ని సిద్ధాంతాలను పరిశీలిద్దాం.

### 2.2 $B_1$ మూలధన లోపం

"ఒక దేశం బీదది కావడానికి దాని బీదరికమే కారణం" అంటారు నర్క్స్ అనే ఆర్థికశాస్త్రవేత్త. కనుక బీదరికానికి, వెనుకబడిన తనానికి బీదరికమే కారణం. ఎందుకంటే అభివృద్ధి చెందని దేశాలు "బీదరికపు విషవలయం"లో ఇరుక్కొని ఉంటాయి. మరొక విధంగా చెప్పాలంటే ఈ దేశాలలో కొన్ని శక్తులు పరస్పర ప్రభావంతో, దేశాన్ని ఎల్లప్పుడు బీదరికపు స్థాయిలో కొనసాగించే విధంగా పనిచేస్తూ ఉంటాయి. ఈ శక్తుల బలమైన ప్రభావం నుండి తప్పించుకోలేని విధంగా వెనుకబడిన దేశాలు ఈ వలయంలో చిక్కుకొన్నాయి.

మూలధం సప్లయ్, డిమాండ్ ఈ రెండింటి లోపం వల్ల అభివృద్ధి కుంటుపడుతుంది. డిమాండ్, సప్లయి రెంటి విషయంలో విషవలయాలు ఏర్పడతాయి. సప్లయి వైపు ఆదాయంలో మిగులు లేక పొదుపు చేసిన ధనం పెట్టుబడి పెట్టడం వల్ల మూలధన కల్పన జరుగుతుంది. కాని ఆదాయాలు తక్కువగా ఉండడం వల్ల పొదుపు కూడా తక్కువగా ఉంటుంది. తక్కువ ఆదాయానికి కారణం తక్కువ ఉత్పత్తి, మూలధనం లోపించడం వల్ల ఉత్పత్తి స్థాయి తక్కువగా ఉంటుంది. పొదుపు, పెట్టుబడి తక్కువ గనుక మూలధనం లోపిస్తుంది. ఈ రకంగా సప్లయ్ దిశలో విషవలయం ఏర్పడుతుంది. దీనిని కింది బొమ్మద్వారా చూపవచ్చు.

తక్కువ మూలధన సంచయనం

↙ ↖

మూలధన లోపం  తక్కువ స్థాయి పెట్టుబడి

↘ ↗

తక్కువస్థాయి ఉత్పత్తి ⟷ తక్కువ ఆదాయం

ఇక డిమాండ్ వైపు చూస్తే పెట్టుబడి పెట్టడానికి అవసరమైన ప్రోత్సాహకాలు అభివృద్ధి చెందని దేశాలలో లేవని నర్క్స్ అభిప్రాయపడినాడు. వస్తువులకు, సేవలకు డిమాండ్ పెరిగితే ఉత్పత్తి విస్తరిస్తుంది. కాని అభివృద్ధి చెందని దేశాలలో ఆదాయాలు తక్కువ గనుక వస్తువులకు డిమాండ్ తక్కువగా ఉంటుంది. మూలధనం లేవందువల్ల ఉత్పత్తిస్థాయి తక్కువ కాబట్టి ఆదాయాలు తక్కువగా ఉంటాయి. పెట్టుబడి పెట్టడానికి ప్రోత్సాహకాలు లేవు కాబట్టి మూలధనం లోపిస్తుంది. ఈ రకంగా డిమాండ్ దిశలో విషవలయం ఏర్పడుతుంది. దీనిని కింది బొమ్మ ద్వారా చూపించవచ్చును.



BRAOU

పెట్టుబడికి ప్రోత్సాహకాల కొరత

↙ ↖

తక్కువస్థాయిలో మూలధన సంచయనం తక్కువ డిమాండ్

↘ ↗

తక్కువ స్థాయిలో ఉత్పత్తి ↔ తక్కువ ఆదాయాలు

పై రెండు విషవలయాలలో తక్కువ స్థాయిలో ఉత్పత్తి తక్కువ ఆదాయాలకు దారి తీస్తుందనేది సామాన్య విషయంగా కనిపిస్తుంది. ఈ రెండు విషవలయాలు అభివృద్ధి చెందని దేశాలను 'తక్కువ ఆదాయాలు, తక్కువ ఉత్పత్తి స్థాయి' అనే వలలో చిక్కుకునేట్టు చేసి ఆర్థికాభివృద్ధి జరగకుండా చేస్తాయి. ఈ వలయాలను ఏదో ఒక దశలో ఛేదిస్తేనే సాధ్యమౌతుంది. ఇది ఎట్లా సాధించవచ్చునేది తర్వాత పాఠంలో తెలుసుకుంటాము.

## 2.2 $B_2$ జనాభా ఒత్తిడులు

ఆసియా ఖండంలోని అనేక దేశాల అధిక జనాభా పెరుగుదలరేటు ఆయా దేశాల ఆర్థికాభివృద్ధిపైన చెడు ప్రభావం చూపింది. అభివృద్ధి చెందని దేశాలలో వైద్య ఆరోగ్య సౌకర్యాలను మెరుగుపరచడం వల్లా, ప్రాణాంతకమైన అనేక వ్యాధులు నిర్మూలన వల్లా మరణాల రేటు తగ్గిపోయింది. అయితే జననాలరేటు స్వల్పంగా మాత్రమే తగ్గడం వల్ల ఈ దేశాలలో జనాభా పెరుగుదల హద్దులు దాటి "జనాభా విస్ఫోటన" ఏర్పడింది. అభివృద్ధి చెందిన దేశాలలో కూడా అవి అభివృద్ధి సాధిస్తున్న తరుణంలో (18, 19 శతాబ్దాలలో) దాదాపు ఇటువంటి పరిణామాలే కలిగాయి. అయితే మిగులు జనాభాను ఆయా దేశాలు తమ వలస రాజ్యాలలోనో, కెనెడా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి కొత్తగా కనుగొనబడిన దేశాలలోనో సర్దగలిగాయి. అభివృద్ధి చెందని దేశాలకు ఈనాడు ఇటువంటి అవకాశం లేదు. అందువల్ల ఈ దేశాలలో వ్యవసాయం, ఇతర ప్రాథమిక రంగాలలో అధిక జనాభా వత్తిడులు కనిపిస్తాయి. ఉత్పత్తిలో సాధించిన పెరుగుదల అంతా పెరుగుతున్న జనాభాకే సరిపోవడం వల్ల జనాభా పెరుగుదల అభివృద్ధికి అవరోధం అవుతుంది. దీనివల్ల పెట్టుబడికి అవసరమైన మిగులు చాలా స్వల్పమౌతుంది. అభివృద్ధి చెందని దేశాలు తమ శక్తికి మించి అభివృద్ధికి కృషి చేయవలసి వస్తుంది. వినియోగానికి అవసరమైన వస్తువుల తయారీకి మూలధనం ఖర్చు అయి, ఉన్నత పెరుగుదల స్థాయాలకు అవసరమైన దీర్ఘకాలిక పథకాలపై పెట్టుబడి తగ్గించవలసి వస్తుంది.

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు పెరగవు గనుక అధిక నిరుద్యోగానికి దారి తీస్తుంది. దీని వల్ల ఉపాధి కల్గిన వారిపై భారం పెరుగుతుంది. నిరుద్యోగుల, పిల్లల, వృద్ధుల బాధ్యతను ఉద్యోగులు వహించవలసి వస్తుంది. దీని ఫలితంగా తలసరి ఆదాయం, వినియోగం తగ్గిపోయి, బీదరికం పౌష్టికాహార లోపం, నిరాశా నిస్పృహలు సంభవిస్తాయి.

## 2.2 $B_3$ సాంకేతిక విజ్ఞానం లోపం

ప్రతి దేశానికి ఆ దేశపు వనరులపై ఆధారపడి తగిన ఉత్పత్తి పద్ధతులు ఉంటాయి. ఈ పద్ధతులను గుర్తించకపోతే అభివృద్ధి మరింత ఆలస్యమౌతుంది. అదే విధంగా ఒక దేశానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరించి వేర్పుల సమీకరణ జరగాలి. శాస్త్రీయ మార్పులు కూడా ఆ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు తగినట్టుగా ఉండాలి. ఈ విషయంలో వైఫల్యం జరిగితే ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుంది. ఈ వైఫల్యం రెండు రూపాలలో జరగవచ్చు. అవి: 1) కొన్ని వెనుకబడిన దేశాలలో అక్షరాస్యత అతి తక్కువగా వుండడం వల్ల ఆ దేశాలకు అవసరమైన ఉత్పత్తి పద్ధతులను అర్థం చేసుకునేందుకు తగిన విద్యా సౌకర్యాలు లోపిస్తాయి. దీని ఫలితంగా ఆ దేశాలలో తక్కువరకమైన, అసమర్థమైన ఉత్పత్తి పద్ధతులు నెలకొంటాయి. 2) మరికొన్ని



Dr. BRAOU
LIBRARY
Acc. No: T-3456
Class No: 330 ARD

దేశాలలో నిరక్షరాస్యులైన ప్రజలు అధిక శాతం, ఉన్నత శిక్షణ కలిగిన కొద్ది మంది ప్రజలు ఉంటారు. ఈ కొద్దిమంది విద్యావంతులు తమ దేశాలకు తగిన ఉత్పత్తి పద్ధతులను అర్థం చేసుకొని, వాటిని నిర్వహించే స్థితిలో ఉంటారు. అయితే అతి సున్నితమైన శస్త్ర చికిత్సలో నైపుణ్యం గల వైద్యులకు గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన వైద్య సౌకర్యాలను కల్పించడం తెలియకపోవచ్చు. ఇటువంటి దేశాలలో అత్యున్నత శిక్షణ పొందిన నిపుణులు ఒకవైపు, అభివృద్ధి చెందని ఆర్థిక వ్యవస్థ మరొకవైపు ప్రక్క ప్రక్కనే కనిపిస్తాయి. భారతదేశం ప్రపంచంలో అత్యధిక శాస్త్రీయ నిపుణులను కలిగిన దేశాలలో మూడవ స్థానం పొంది అభివృద్ధి చెందని దేశంగానే ఉంది. మన అవసరాలకు అనుగుణంగా మన విద్యా విధానాలను మలుచుకోవలసి ఉన్నదని దీనివల్ల స్పష్టమవుతున్నది. ఈ విధంగా అభివృద్ధి చెందని దేశాలలో వాటికి తగిన ఉత్పత్తి పద్ధతులను గ్రహింపకపోవడం, ఉత్పత్తిని పెంచడానికి తగిన పద్ధతులను అవలంబించక పోవడం అభివృద్ధికి అవరోధాలు అవుతున్నాయి.

## 2.2 $B_4$ ద్వంద్వ ఆర్థిక వ్యవస్థలు

అభివృద్ధి చెందని దేశాలు ద్వంద్వ ఆర్థిక వ్యవస్థ లక్షణాలు కలిగి వుంటాయని ముందు పాఠంలో తెలుసుకున్నాం. ఈ దేశాలలో ఆర్థిక అసమానత్వాలు అధికంగా ఉంటాయి. స్వల్ప సంఖ్యలో వున్న ధనవంతులు చాలా ఉన్నతమైన జీవన ప్రమాణాలతో ఉండి, అత్యధికులు పేదరికంలో మగ్గుతూ ఉంటారు. విలాస వస్తువులకు ఉన్న డిమాండ్ వల్ల వాటి ఉత్పత్తికై కొరతగా వున్న మూలధన వస్తువులు, విదేశీ మారకం, సుశిక్షితమైన మానవశక్తి దుర్వినియోగమవుతాయి. దీనివల్ల దేశానికి అత్యవసరమైన ఆర్థికాభివృద్ధికి కావలసిన వనరులు తగ్గిపోతాయి. ఈ విధంగా ద్వంద్వ ఆర్థిక వ్యవస్థ, ఆదాయ వినియోగాలలో అసమానత్వాలు కలిగించి ఆర్థికాభివృద్ధికి బలమైన అవరోధంగా రూపొందుతుంది.

### మీ అవగాహను పరీక్షించుకొండి – 1

1. ''పేదరిక విషవలయం'' అంటే ఏమిటి?
2. ''జనాభా విస్ఫోటనం'' అంటే ఏమిటి?

## 2.3 ఆర్థికాభివృద్ధికి దోహదపడే కారకాలు

ఆర్థికావృద్ధికి అవరోధాలుగా ఉన్న కారణాలను సరియైన విధంగా నిర్ణయించి అభివృద్ధికి తోడ్పడేటట్లు చేయవచ్చు. జనాభా పెరుగుదలను అభివృద్ధికి అవరోధం కాకుండా, అభివృద్ధి కార్యక్రమాలకు దోహదం చేసేదిగా చేయవచ్చునని అనేకమంది ఆర్థిక శాస్త్రవేత్తలు రుజువు చేశారు. విస్తృతంగా లభించే శ్రామిక శక్తిని రెండు విధాలుగా ఉపయోగించుకోవచ్చు.

1). శ్రామికులు అధికంగా వుంటే, వారు తక్కువ వేతనాలకే పనిచేయడానికి ఇష్టపడతారు. వేతనాలు కూడా ఉత్పత్తి వ్యయమే కాబట్టి, చౌకగా లభించే శ్రామికశక్తి వల్ల ఉత్పత్తి ఖర్చులు తగ్గుతాయి. లాభాలు పెరిగి, పెట్టుబడికి నిధులు ఎక్కువగా లభిస్తాయి. దీని ఫలితంగా ఉత్పత్తి పెరిగి పెరుగుదల రేటు అధికమౌతుంది. కార్మికుల సంఖ్య తక్కువగా ఉంటే, అధిక వేతనాలు చెల్లించవలసి వస్తుంది. దీనివల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. లాభాలు తగ్గి, పెట్టుబడి కూడా తక్కువౌతుంది. ఈ విధంగా నిరుద్యోగులుగా ఉన్న మిగులు శ్రామికశక్తిని వాస్తవానికి ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే విధంగా మలచుకోవచ్చు .

2) అధిక శ్రామికశక్తి వల్ల శ్రమ సాంద్రితమైన ఉత్పత్తి పద్ధతులను అనుసరించడానికి, వీలౌతుంది. అనేక పరిశ్రమలలో శ్రమ సాంద్రితమైన ఉత్పత్తి పద్ధతుల వల్ల ఉత్పత్తి త్వరితంగాను, చౌకగాను సాధ్యమౌతుంది. ఉదాహరణకు, రైలు మార్గాలు నిర్మించడం, రోడ్లు వేయడం, కంధకాల్లు త్రవ్వడం, నీటిపారుదల కాలువలు,

ఆనకట్టల నిర్మాణంలో కూడా క్రేన్లు, భూమిని త్రవ్వే భారీ యంత్రాలను వాడకుండా శ్రామిక సాంద్రిత మైన పద్ధతుల ద్వారా ఎక్కువ పనిని సాధించవచ్చు. దీనివల్ల భారీ యంత్ర పరికరాలను ఇతర పనులకు మళ్ళించే అవకాశం కలుగుతుంది.

3) మూలధన సంచయనాన్ని వృద్ధి చేయడం, విద్యావ్యాప్తి, ప్రజల వైఖరులను మార్చడం ఆర్థికాభివృద్ధికి తోడ్పడే ఇతర కారకాలు. ఈ విధంగా ఆర్థికాభివృద్ధికి పెద్ద అవరోధాలుగా ఉన్న జనాభా, తక్కువ ఉన్న మూలధనాన్ని త్వరితమైన ఆర్థికాభివృద్ధికి సరియైన విధంగా ఉపయోగించుకోవచ్చును. పెరిగిన జనాభా వల్ల తక్కువ వేతనాలకే అవసరమైనంత మంది శ్రామికులు లభిస్తారు. మూలధనం తక్కువైతే శ్రమ సాంద్రిత పద్ధతులను ఉపయోగించవచ్చు.

## 2.4 పెరుగుదలకు, అభివృద్ధికి మధ్యగల తేడా

మొదటి భాగంలో వెనుకబడిన దేశాల లక్షణాలను తెలుసుకున్నాం. ఈ భాగం ఆర్థికాభివృద్ధిని అవరోధించే కారకాలనూ, దోహదపరిచే కారకాలనూ చర్చించాం. ఈ విశ్లేషణ దృష్ట్యా ఆర్థికాభివృద్ధి అంటే ఏమిటో మీకు అవగాహన అయి ఉంటుంది. అయినా ఇప్పుడు ఆర్థికాభివృద్ధి అంటే ఏమిటో సంక్షిప్తంగా తెలుసుకుందాం. పెరుగుదతో బాటు ఆర్థిక వ్యవస్థలో కలిగే మార్పుల్నే ఆర్థికాభివృద్ధి అని నిర్వచించవచ్చు.

సాధారణంగా ఆర్థిక పెరుగుదల, (Economic growth) ఆర్థికాభివృద్ధి (Economic development) అనే పదాలను ఒకే అర్థంతో వాడుతున్నారు. కాని అర్థశాస్త్రాన్ని అధ్యయం చేసే విద్యార్థులు ఈ రెండింటి మధ్య భేదాన్ని గుర్తించాలి. ఆర్థిక పెరుగుదల (లేదా ఆర్థిక వృద్ధి) అంటే ఉత్పత్తిలో గమనించదగిన పెరుగుదలగా చెప్పుకోవచ్చు. అనగా స్థూల జాతీయోత్పత్తిలో ఏర్పడే మార్పును తెలియజేస్తుంది. ఇది పరిమాణాత్మక మార్పు (Quantive change) ను తెలియజేస్తుందే తప్ప ఆర్థిక వ్యవస్థలో జరిగే గుణాత్మకమార్పు (Qualitative change) ను గాని, వ్యవస్థ పూర్వక మార్పును గాని తెలియజేయదు.

ఇంకో విధంగా ఆర్థిక పెరుగుదల అంటే సంస్థాగత మార్పులు లేని విస్తరణ మాత్రమే. అభివృద్ధి లేకుండా పెరుగుదల జరగవచ్చు. ఉదాహరణకు మధ్య ప్రాచ్య దేశాలలో కొన్ని చాలా ఉన్నతమైన జాతీయ ఆదాయాన్ని కలిగి వున్నా, ఆ దేశాలలో ఉత్పత్తి పద్ధతుల్లోగాని, జీవన ప్రమాణాల్లోగాని మార్పులు కలగలేదు. పెట్రోలియం ఎగుమతుల వల్ల ఈ దేశాల జాతీయ ఆదాయం పెరుగుతున్నది. కాని వాటిలో బలమైన మూలధన పునాది లేనందున అవి స్వయం పోషకాలు కాలేకపోతున్నాయి. కాబట్టి పెరుగుదల సంస్థాగత మార్పులు లేని విస్తరణ మాత్రమే. అభివృద్ధి అనేది సంస్థాగత ఉత్పత్తి మార్పులతోను, వినియోగంలో మార్పులతోనూ కూడి ఉంటుంది.

ఆర్థికాభివృద్ధిని సామాన్యంగా ఆయా దేశాల జాతీయ ఆదాయం పెరుగుదలను దృష్టిలో వుంచుకొని లెక్కగడతారు. ఐక్యరాజ్యసమితి 1950, 1960 దశాబ్దాలను 'అభివృద్ధి దశాబ్దాలు' గా వర్ణించింది. అభివృద్ధిరేటును కొలమానం జాతీయ ఉత్పత్తిలో సంవత్సరానికి 6 శాతం పెరుగుదలగా పేర్కొన్నది. అనేక వెనుకబడిన దేశాలు ఈ పెరుగుదల రేటును సాధించగలిగినా, దాని వల్ల ఆయా దేశాలలో స్వయం పోషకమైన ఆర్థికాభివృద్ధి సంభవించలేదు. ఈ పరిగణనలో మొత్తం జాతీయోత్పత్తి ప్రధాన పాత్ర వహించడం ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాలలో జరిగిన అభివృద్ధిని గణించకపోవడమే ఇందుకు కారణం.

జాతీయ ఉత్పత్తి పెరుగుదల వల్ల ఏ రంగాలు లాభపడతాయో తెలియ చెప్పదు. పెరిగిన ఆదాయంలో అధికభాగం ఉన్నత ఆదాయవర్గాలే పొందడం వల్ల అసమానత్వానికి దారి తీస్తుంది. ఆదాయాలు పెరగడం వల్ల జాతీయ ఉత్పత్తి పెరిగినప్పటికీ అందువల్ల బీద ప్రజలకు లాభం చేకూరదు.

కాని ఆర్థికాభివృద్ధిలో ఆర్థిక పెరుగుదల ఒక భాగం మాత్రమేనని గుర్తించాలి. పరిమాణాత్మక మార్పులతో బాటు గుణాత్మక మార్పులను కూడా తెలియజేసేది ఆర్థికాభివృద్ధి. కాబట్టి ఆర్థికాభివృద్ధి అంటే ఉత్పత్తిలో

BRAOU

పెరుగుదలనే కాకుండా ఆ పెరుగుదలను సాధించడానికి అవసరమైన వ్యవస్థాపూర్వక, సాంకేతిక మార్పులను కూడా సూచించేది. వస్తువుల స్వరూపంలోనూ, వస్తూత్పత్తికి ఉపయోగించే ఉత్పత్తి కారకాలలోనూ, వస్తూత్పత్తికి జరిగే వనరుల కేటాయింపులోనూ, ఉత్పత్తి సముదాయంలోనూ, ఉత్పత్తిని ప్రభావితం చేసే సాంఘికార్థిక వ్యవస్థలలోనూ, సాంకేతిక జ్ఞానంలోనూ మార్పులు వచ్చినప్పుడు అంటే ఈ వ్యవస్థ పూర్వక మార్పులు జరిగినప్పుడే ఆర్థికాభివృద్ధి జరిగిందని చెప్పవచ్చు. వీటితో బాటు తలసరి ఉక్కు వినియోగం, విద్యుచ్ఛక్తి వినియోగం, అక్షరాస్యత రేటు, ఉద్యోగభృతి స్థాయి, శిశు మరణాల రేటు, వైద్య సదుపాయాల అందుబాటు వంటి ఇతర గణాంకాలను కూడా ఆర్థికాభివృద్ధి కోసం పరిగణిస్తున్నారు. అందుకే ఆర్థికాభివృద్ధిని ఇంకొక విధంగా కూడా చెప్పవచ్చు.

ఆర్థికాభివృద్ధి అంటే — అతి తక్కువ ఉత్పత్తి స్థాయి, శ్రమ సాంద్రితమైన, కొన్ని సందర్భాలలో అతి పురాతనమైన ఉత్పత్తి పద్ధతులు, నిరక్షరాస్యత, పేదరికం, నిరుద్యోగంతో కూడిన ఆర్థిక వ్యవస్థ నుండి, మూలధన సాంద్రతతో అధిక ఉత్పత్తి పద్ధతులు, పూర్తి ఉద్యోగభృతి, ఉన్నత జీవన ప్రమాణాలు కల్గిన — ఆర్థిక వ్యవస్థగా రూపొందే ప్రక్రియ అని చెప్పవచ్చు.

పై విశ్లేషణ వల్ల ఆర్థికాభివృద్ధికి, ఆర్థిక పెరుగుదలకు స్పష్టమైన భేదముందని తెలుస్తుంది. ఆర్థిక పెరుగుదల అనేది ఆర్థికాభివృద్ధిలో ఒక భాగం మాత్రమే.

## మీ అవగాహనను పరీక్షించుకొండి — 2

3. ఆర్థిక పెరుగుదల అంటే ఏమిటి?
4. ఆర్థికాభివృద్ధి అంటే ఏమిటి?

## 2.5 సారాంశం/ముగింపు

ఈ పాఠంలో అభివృద్ధికి అవరోధాలుగా ఉన్న ప్రధాన ఆర్థిక, ఆర్థికేతర విషయాలను గూర్చి తెలుసుకున్నాం. ఈ అవరోధాలలో కొన్నిటిని తొలగించవచ్చు. మరి కొన్నిటిని ఆర్థికాభివృద్ధికి దోహదపడే విధంగా మార్చుకోవచ్చు. ఈ అవరోధాలన్నింటిలో మూలధనం లోపించడం ఒకటి. దీనివల్ల అభివృద్ధి ఏ విధంగా కుంటుపడుతుందో, ఈ లోపాన్ని ఏ విధంగా సవరించవచ్చునో తరువాత పాఠంలో తెలుసుకుంటాము.

పాఠ్య రచయిత్రి: కుమారి ప్రభాపంత్

## 2.6 సంప్రదింపు గ్రంథాలు


1. Benjamin Higgins : Economic Development
2. Ghosh : Economics of Under Development
3. Kindleberger : Economic Development
4. తెలుగు అకాడమి (1973) : భారతదేశ ఆర్థికాభివృద్ధి సమస్యలు
5. తెలుగు అకాడమి (1978) : భారతదేశం ప్రణాళికా విధానం
6. తెలుగు అకాడమి (1973) : ఆర్థికాభివృద్ధి — వృద్ధి సిద్ధాంతాలు




BRAOU

## 2.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి సుమారు 30 పంక్తులలో జవాబులు రాయండి.

1. ఆర్థికాభివృద్ధిని నిరోధించే కారకాలను వివరించండి?
2. "ఒక దేశం పేదది కావడానికి దాని పేదరికమే కారణం" అన్న నర్క్స్ వాదనను "పేదరికపు విషవలయం" అనే భావన ఆధారంగా వివరించండి?

II. ఈ కింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 15 పంక్తులలో జవాబులు రాయండి.

1. ఆర్థికాభివృద్ధికి, ఆర్థిక పెరుగుదలకు మధ్యగల భేదాన్ని వివరించండి.
2. ఆర్థికాభి వృద్ధిని ప్రేరేపించే కారకాలను వివరించండి.
3. అధిక జనాభా పెరుగుదల ఆర్థికాభివృద్ధికి అవరోధమా? వివరించండి.
4. 'పేదరికపు విషవలయం' అనే భావనను వివరించండి.
5. 'జనాభా విస్ఫోటనం' అంటే ఏమిటి?

BRAOU

# భాగం — 3: మూలధన సంచయన సిద్ధాంతాలు

## విషయక్రమం

3.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
3.1 మూలధనం గురించి పరిచయం, దాని ఉపయోగాలు
3.2 మూలధన సంచయన సిద్ధాంతాలు
3.2.1 పొదుపులో పెంపుదల
3.2.2 అపారమైన శ్రమశక్తిద్వారా మూలధన సంచయనం
3.2.3 సంతులిత వృద్ధి
3.2.4 అసంతులిత వృద్ధి
3.2.5 ఇతర కారకాల ద్వారా మూలధన సంచయనం
3.3 సారాంశం/ముగింపు
3.4 సంప్రదింపు గ్రంథాలు
3.5 నమూనా పరీక్షాప్రశ్నలు

## 3.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

మూలధన సంచయనాన్ని వివరిస్తూ, దాని పెరుగుదలకు దోహదపడే కారకాలను విశ్లేషించడం ఈ పాఠం, లక్ష్యం.

ఈ భాగం చదివిన తర్వాత మీరు

★ మూలధన సంచయనం అనే భావనను వివరించగలరు.

★ మూలధన సంచయనానికి సంబంధించిన సిద్ధాంతాలను ముఖ్యంగా సంతులిత వృద్ధి, అసంతులిత వృద్ధి సిద్ధాంతాలను పరిశీలించగలరు.

## 3.1 మూలధనం — పరిచయం, ఉపయోగాలు

అన్ని రకాల ఉత్పత్తికి మూలధనం అవసరం. అధికోత్పత్తికి అతి సామాన్యమైన చాకు గొడ్డలి వంటివి అవసరం కావచ్చు. లేక కంప్యూటర్ల వంటి క్లిష్టమైన సాంకేతిక యంత్రాలు అవసరం కావచ్చు. వీటిలో ఏవో కొన్ని అవసరమవుతాయి. వెనుకబడిన దేశాలలో ఇటువంటి పనిముట్లు వాడకం అతి తక్కువగా జరుగుతుంది. ఈ దేశాలలో నిరుద్యోగులైన కార్మికుల సంఖ్య అధికంగా ఉండటం, ఉత్పత్తికి వుపయోగపడే మేలైన ఉత్పత్తి పద్ధతులు తెలియకపోవడం ఇందుకు కారణాలు. నిరుద్యోగులైన కార్మికులు అధికంగా ఉండటం వల్ల ఈ దేశాలలో శ్రమ సాంద్రమైన ఉత్పత్తి పద్ధతులను ఉపయోగిస్తారు. వెనుకబడిన దేశాలలో ఉత్పత్తికి సామాన్యమైన నాగలి, మగ్గం, గొడ్డలి వంటి సాధనాలను వాడతారు. వీటిని గ్రామంలో కమ్మరి, లేక వడ్రంగి తయారు చేస్తాడు. మూలధన వస్తువులను కొద్ది ఉత్పాదక ప్రక్రియల ద్వారా తయారు చేసుకుంటారు. అందువల్ల కొందరికి ఉపాధి లభిస్తుంది.

ఇక పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల పరిస్థితి పరిశీలిద్దాం. ఈ దేశాలలో వ్యవసాయంలో ట్రాక్టర్ పంటకోత యంత్రాలు వంటి సాధనాలను ఉపయోగిస్తారు. ఒక ట్రాక్టర్ని తయారు చేసేందుకు అనేక

ఉత్పాదక ప్రక్రియలు, అవసరం అవుతాయి. వీటిలో ట్రాక్టర్ నిర్మించే యంత్రాలు, విడిభాగాలు, చక్రాలు ఇతర భాగాలు మాత్రమే గాక పెట్రోలియం, డీసెల్ వంటి ముడి పదార్థాలు చేరివుంటాయి. వీటి కోసం ముడి లోహాల, ఖనిజాల ఉత్పాదన, గనుల అభివృద్ధి, రవాణా, విద్యుత్ ఉత్పాదన కోసం ఆనకట్టల నిర్మాణం మొదలైనవి జరగాలి. ఈ రకం వస్తువులు లభించడానికి ముందు అందుకు అవసరమైన అనేక పరిశ్రమలను స్థాపించవలసి వస్తుంది. ట్రాక్టర్ల విషయంలోనే కాక అభివృద్ధి చెందిన దేశాలలో తయారయ్యే అన్ని వస్తువుల విషయంలో ఇది వర్తిస్తుంది. ఆ విధంగా తయారైన వస్తువుల ఉత్పాదన చాలా విషయాలలో కూడి ఉంటుందని స్పష్టమవుతున్నది. ఇందుకోసం అవసరమయ్యే పరిశ్రమలలో ఉక్కు, ఇతర లోహాలను తయారు చేసే పరిశ్రమలు, భారీ యంత్రాలు, పనిముట్లు ఉత్పత్తి చేసే పరిశ్రమలు, నీటి పారుదల ప్రాజెక్టులు, విద్యుత్ ఉత్పాదన కేంద్రాలు స్థాపించవలసి వస్తుంది. అందువల్ల పైన తెలిపిన భారీ, కీలక పరిశ్రమలలో ఉత్పత్తి మూలధన సంచయనంలో భాగం అవుతుంది. వెనుకబడిన దేశాలలో లోపిస్తున్న ఈ మూలధనం పరిశ్రమల స్థాపనద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుంది.

## మీ అవగాహనను పరీక్షించుకొండి – 1

1. మూలధనం అంటే ఏమిటి?

## 3.2 మూలధన సంచయన సిద్ధాంతాలు

చెప్పుకోతగిన పారిశ్రామిక పునాది లేని వెనుకబడిన దేశాలలో మూలధన సంచయనం ఏ విధంగా సాధ్యమవుతుందనేది తరువాత ఎదురయ్యే ప్రశ్న. వెనుకబడిన దేశాలు మూలధన సంచయనం కోసం అనుసరించదగిన విధానాలను గురించి అనేక సిద్ధాంతాలు ప్రతిపాదితమయ్యాయి. వీటిలో కొన్నింటిని పరిశీలిద్దాం.

### 3.2.1 పొదుపులో పెంపుదల

మూలధన సంచయనానికి ప్రజలలో పొదుపు అధికం చేయడం మొదటి అవసరమని అనేక సిద్ధాంతాలు ప్రతిపాదిస్తున్నాయి. ఆదాయాలలో మిగులు వల్లనే మూలధన సంచయనం కలుగుతుంది కాబట్టి, పొదుపులో పెరుగుదలను పెట్టుబడి పెట్టడం ద్వారా మూలధన సంచయనానికి దారి తీస్తుందని చెప్పవచ్చు. అందువల్లనే వివిధ ప్రభుత్వాలు తమ విధానాల ద్వారా ప్రజలలో పొదుపును పెంచడానికి కృషి చేస్తాయి.

అయితే ఇది మూలధన సంచయనానికి సరియైన మార్గం కాదు. భారతదేశంలో 1950 దశాబ్దాలలో మొత్తం జాతీయ ఉత్పత్తులలో 5 శాతం ఉన్న పొదుపు 1978  1979 నాటికి 20 శాతానికి పెరిగింది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలో 20 శాతం పెరుగుదల సరిపోతుందని భావిస్తారు. అయితే దీనికి తగిన విధంగా మనదేశంలో మూలధన సంచయనంలో గాని, పెరుగుదల రేటులోగాని అభివృద్ధి జరుగలేదు. దీనికి కారణం మూలధన సంచయనానికి పొదుపును సూచికగా వాడే పొరపాటు పద్ధతి. పొదుపును తిరిగి పెట్టుబడి పెట్టడానికి, భౌతిక మైన మిగులుగా భావించటం లేదు.

ఉదాహరణకు: ఉక్కును రెఫ్రిజిరేటర్ల, ఉక్కు పాత్రల ఉత్పత్తికి ఉపయోగించక పోతే రైల్వేలు లేక యంత్రాల నిర్మాణంలో మూలధనంగా ఉపయోగించవచ్చు. ఈ విధమైన భౌతిక మిగులు మరింత మూలధన నిర్మాణానికి తోడ్పడుతుంది. కాని ఈ వాస్తవాన్ని విస్మరించి, మూలధన సంచయనానికి ప్రత్యక్షంగా తోడ్పదని ధనరూపమైన పొదుపుకు ప్రాధాన్యతనిస్తున్నారు.

ధన రూపమైన పొదుపు మూలధన సంచయనానికి తోడ్పడుతుందనుకోవడం సరికాదు. పొదుపు చేసే వారందరు పెట్టుబడి పెట్టేవారు కాకపోవచ్చు. మనదేశంలో లక్షలాది ప్రజలు తమ ఆదాయాలలో కొంత



BRAOU

భాగం పొదుపు చేస్తూ వుండవచ్చు. కాని ఈ పొదుపు వెను వెంటనే నీటి పారుదల ప్రాజెక్టులుగా గానీ, రైల్వేలుగా గానీ, ఉక్కు కర్మాగారాలుగా గాని మారుతుందనుకోవడం సరికాదు. పొదుపు వెంటనే గాని, తప్పని సరిగాగాని పెట్టుబడిగా మారదు. అందువల్ల పొదుపులో పెరుగుదల వల్ల మూలధన సంచయన పెరుగుతుందని చెప్పలేము.

భారతదేశం వంటి బీద దేశంలో అధిక సంఖ్యాక ప్రజల, ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల బీద ప్రజల, పొదుపు వారి ఆదాయాలలో అతి తక్కువ భాగం వుంటుంది. వాస్తవానికి, తక్కువ స్థాయి పొదుపుకన్నా, ఉత్పత్తి పద్ధతులు, ప్రాతిపదిక సౌకర్యాల రూపకల్పన, విస్తారమైన పెట్టుబడి, అవసరమైన నేర్పులు, సాంకేతిక విజ్ఞానం, ముడి సరుకులు, యంత్ర పరికరాలు లోపించడమే ఈ దేశాలలో మూలధన సంచయనానికి అవరోధాలుగా నిలుస్తున్నాయి.

### 3.2.2 అపారమైన శ్రమశక్తి ద్వారా మూలధన సంచయనం

ఆర్థర్ లూయిస్ అనే ఆర్థికశాస్త్రవేత 'ఆధునిక జనాభా, నిరుద్యోగం కలిగిన దేశం నీటి ద్వారానే మూలధన సంచయనం సాధించగలదు'' అని అన్నారు. అధిక జనాభాను వ్యవసాయరంగం నుండి మూలధన సంచయనానికి. మళ్ళించవచ్చు. శ్రమ సాంద్రితమైన ఉత్పత్తి పద్ధతులను అనుసరించడం ద్వారా అపారంగా లభించే శ్రమశక్తిని ఆధునిక రంగానికి మళ్ళించి దాని సహాయంతో మూలధన సంచయనం సాధించవచ్చు. నిరుద్యోగం అధికంగా ఉంటుంది. గనుక వేతనాల రేటును తక్కువ స్థాయిలో ఉండవచ్చు. దీని ఫలితంగా, ఉత్పత్తి, శ్రామికులపై ఖర్చు మధ్య యేర్పడే మిగులును అధికం చేయడానికి ఈ మిగులును మరింత ఎక్కువ ఉత్పత్తికి పెట్టుబడిగా పెట్టడానికి వీలవుతుంది.

పైన తెల్పిన పద్ధతి అపారంగా లభించే శ్రమశక్తిలో అభివృద్ధి కోసం లభించే సంభావ్యతలను గుర్తిస్తున్నది. ప్రారంభదశలో శ్రమసాంద్రత పద్ధతులను అనుసరించడం జరిగితే మూలధన సంచయనానికి పునాది వేసినట్లు అవుతుంది. దీనిపై మరింత మూలధన సంచయనం సాధించవచ్చు. ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాలవలె శ్రమశక్తి కొరతగా ఉండే దేశాలకు పైన తెల్పిన పద్ధతి అన్వయింప చేయజాలమనీ, అందువల్ల మూలధన సంచయనానికీ ఈ పద్ధతిని అన్ని సందర్భాలలో ఉపయోగించలేమనే విమర్శ ఉంది.

### 3.2.3 సంతులిత వృద్ధి

ఒక బీద దేశం అభివృద్ధి సాధనలో ఎదుర్కొనే విషయాలను గురించి తెలుసుకున్నాం. ఈ సిద్ధాంతాన్ని రగ్నార్ నర్క్స్ అనే ఆర్థికశాస్త్రవేత్త ప్రతిపాదించాడు. ఆ విషయాలనుండి బయటపడే మార్గాలను కూడా ఆయన సూచించాడు. మూలధనానికి తగిన డిమాండ్, సప్లయ్ లేనందువల్లనే మూలధన సంచయనం తక్కువగా ఉంటుందని అతని అభిప్రాయం. డిమాండ్, సప్లయిలలో ఈ కొరత మూలధనం వల్లనే సంభవిస్తుంది. డిమాండ్ లేనందున భారీ సంఖ్యలో ఉత్పత్తి అయ్యే వస్తువులకు మార్కెట్ చిన్నది గా వుంటుంది. ఉదాహరణకు ఏదైనా వెనుకబడిన ప్రాంతంలో బూట్లు తయారు చేసే కర్మాగారం స్థాపిస్తే, అక్కడి ప్రజలకు అవసరమైన బూట్ల అమ్మకం జరిగిన తర్వాత ఆ కర్మాగారం ఉత్పత్తి స్తంభించి పోతుంది. అంతేగాక ఆ కర్మాగారంలో పనిచేసే కార్మికులు తమ ఆదాయమంతా బూట్లను కొనడానికే ఖర్చు చేయరు. వారు వస్త్రాలు లేక, గృహోపకరణ వస్తువులు మొదలైన ఇతర వస్తువులను కొనాలనుకుంటారు. ఈ ఇతర రకాలైన వస్తువులను తయారు చేసే కర్మాగారాలు ఆ ప్రాంతాలలో లేకపోతే ఆ బూట్ల కర్మాగారం విస్తరణ జరగజాలదు. డిమాండ్ లేనందువల్ల ఆ కర్మాగారమే మూత పడవచ్చు. వివిధ కర్మాగారాలలో పనిచేసే కార్మికులు వివిధ రకాల వస్తువులను కోరతారు గనుక ఒక ప్రాంతంలో ఒకే పరిశ్రమను స్థాపించడం నిరుపయోగమని నర్క్స్ అభిప్రాయం.

ఈ సమస్య పరిష్కారానికి ఒకే పరిశ్రమలో మూలధనం పెట్టుబడి పెట్టకుండా దానిని అనేక పరిశ్రమలలో సంతులితంగా పెట్టుబడి పెట్టాలి. అప్పుడు వివిధ పరిశ్రమలు పరస్పర వృద్ధికి దోహదం చేస్తాయి. అంతేకాక

BRAOU

బహుళ వినియోగవస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలలో పెట్టుబడి పెరుగుదల వల్ల బీదరికం అనే విషవలయం ఛేదింపపడుతుంది. అపారంగా లభ్యమయ్యే శ్రమశక్తి మూలధన సంచయనానికి తోడ్పడుతుందనే ఆర్థర్ లూయిస్ అభిప్రాయంలో రగ్నార్ నర్క్స్ ఏకీభవించాడు. అనేక అభివృద్ధి చెందని దేశాలు ప్రచ్ఛన్న నిరుద్యోగంతో కూడిన అధిక జనాభాను కలిగి ఉన్నాయి. ఈ జనాభానుండే మూలధన సంచయనం సాధింపవచ్చు. ఇటువంటి దేశాలలో అనుత్పాదక శ్రామికులను ఉత్పాదక శ్రామికులు పోషిస్తారు. దీనిని బట్టి ఉత్పాదక శ్రామికులు తమ వినియోగానికి పోను అనుత్పాదక శ్రామికులను కూడా పోషించగలిగిన మిగులు కలిగి వుంటారని తెలుస్తున్నది. ఈ అనుత్పాదక శ్రామికులను అదేవేతన స్థాయిలో మూలధనం రంగంలో నియమిస్తే, వారిని అధికోత్పత్తికి తోడ్పడే విధంగా వాడుకోవచ్చు. ఈ విధంగా అదనంగా ఉన్న శ్రామికులను మూలధన రంగానికి కేటాయించి, ప్రచ్ఛన్న నిరుద్యోగితను మూలధన సంచయానికి వాడుకోవచ్చు.

పైన తెలిపిన పద్ధతి సంతులిత పెరుగుదల ప్రాధాన్యతను తెలియజేస్తున్నది. పరిశ్రమలు పరస్పర దోహదకారులు గనుకను, అవి పరస్పర పెరుగుదలకు తోడ్పడతాయి గనుకను, సన్నిహిత సంబంధాలు గల ఈ పరిశ్రమలన్నింటిలో పెట్టుబడి పెట్టడం వల్ల ఆర్థిక వ్యవస్థ క్రమాభివృద్ధిని సాధించగలుగుతుంది. అభివృద్ధి చెందని దేశాలలో మూలధనానికి కొరత వున్నందున, అవి అనేక పరిశ్రమలలో ఒకే సమయంలో పెట్టుబడి పెట్టలేవు. ఏదో ఒక పరిశ్రమలో పెట్టుబడి పెట్టడమే వీటికి సాధ్యంకాదు అన్న ఈ సిద్ధాంతాన్ని కొందరు విమర్శించారు. నర్క్స్ పరిమిత డిమాండ్ పరిస్థితులనే అభివృద్ధికి అవరోధాలుగా పరిగణించి, సప్లయ్ విషయాలను నిర్లక్ష్యం చేశాడనే విమర్శకూడా ఉన్నది. అంతేగాక అతడు మూలధన రంగానికి చెందిన వేర్వేరు సప్లయ్, ప్రాతిపాదిక సౌకర్యాల కల్పన వంటి ఇతర విషయాలను ఎట్లా అభివృద్ధి పరచాలో వివరించలేదు.

### 3.2.4 అసంతులిత వృద్ధి

హర్ష్మన్ అనే మరొక ఆర్థికశాస్త్రవేత్త అసంతులిత అభివృద్ధిని సమర్థిస్తాడు. వెనుకబడిన దేశాలలో మూలధనం తక్కువ గనుక అన్ని రకాల పరిశ్రమలలో భారీగా పెట్టుబడి పెట్టడం అసాధ్యమని అతని అభిప్రాయం. అందువల్ల ఈ దేశాలలో అసంతులిత అభివృద్ధి అమలు చేయాలి. పెట్టుబడి రెండు రకాలు. 1) సోషల్ ఓవర్ హెడ్ క్యాపిటల్ (సామాజిక ఉమ్మడి మూలధనం). దీనిని సామాన్యంగా ప్రభుత్వ రంగం కలిగిస్తున్నది. 2). ప్రత్యక్షంగా ఉత్పత్తి కారకమైన కార్యకలాపాలలో పెట్టుబడి. దీనిని ప్రైవేట్ రంగం సమకూరుస్తుంది. ఈ రెండింటిలో ఏదో ఒక రంగాన్ని విస్తరింపచేయడం ద్వారా అభివృద్ధి సాధించవచ్చు. ఈ రకమైన విస్తరణ వల్ల ఏర్పడిన అసంతులిత స్థితిని రెండవ రంగం పూర్తి చేస్తుంది. ప్రభుత్వ రంగ విస్తరణకు ప్రభుత్వ ప్రాతిపదిక సౌకర్యాలను అంటే సామాజిక ఉమ్మడి మూలధనాన్ని సమకూరిస్తే దాని వల్ల ప్రైవేట్ రంగం కూడా లాభపడుతుంది. దీని వల్ల మొత్తం జాతీయోత్పత్తి పెరుగుతుంది. దీనికి బదులుగా, ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తే ప్రత్యక్షంగా ఉత్పత్తి కారకమైన కార్యకలాపాలు విస్తరిస్తాయి. అప్పుడు రోడ్లు, రవాణా వంటి ప్రాతిపదిక సౌకర్యాల అవసరం పెరుగుతుంది. దీనివల్ల ప్రభుత్వ రంగ కార్యకలాపాలకు డిమాండ్ పెరుగుతుంది. ఈ విధంగా పబ్లిక్, ప్రైవేట్ రంగాల మధ్య అసంతులితలను ప్రోత్సహిస్తే దాని వల్ల మూలధన సంచయనానికి మార్గం ఏర్పడుతుందని కొందరి నమ్మకం.

హర్ష్మన్ మరొకరకమైన అసంతులితను కూడా ప్రతిపాదించాడు. ప్రతి పరిశ్రమకు ఉత్పాదకాలు అవసరం. ఆ పరిశ్రమ ఉత్పాదితలు మరొక పరిశ్రమకు ఉత్పాదికాలు అవుతాయి. ఉదాహరణకు ఉక్కు ఉత్పత్తికి ఇనుపఖనిజం, మాంగనీసు మొదలైనవి కావాలి. ఈ రకమైన ఉత్పాదకాలను ఉత్పత్తి చేసే పరిశ్రమలను "వెనుక అనుబంధ పరిశ్రమలు" (Backward Linkages) అంటారు. అదే విధంగా ఉక్కు పరిశ్రమ ఉత్పాదితాలు రైల్వేలు, నిర్మాణాలు, యంత్ర పరికరాలు మొదలైన పరిశ్రమలకు ఉత్పాదికాలు అవుతాయి. ఇతర పరిశ్రమల ఉత్పాదితలను తమకు ఉత్పాదకాలు వాడువే పరిశ్రమలను "ముందు అనుబంధ పరిశ్రమలు" (Forward Linkages) అని పిలుస్తారు. ఒక ఉక్కు కర్మాగారం స్థాపిస్తే, దానికి ముడి సరుకులు అవసరమౌతాయి. దీని వల్ల అసంతులిత ఏర్పడుతుంది. దీనిని తొలగించడానికి "వెనుకబడిన అనుబం 2

పరిశ్రమల''ను స్థాపించవలసి వస్తుంది. ఈ ఉక్కు కర్మాగారం ఉత్పత్తి చేసిన ఉక్కును ఉపయోగించేందుకు "వృద్ధి చెందిన అనుబంధ'' పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం లభిస్తుంది.

అసంతులిత పెరుగుదల సిద్ధాంతంలో కూడా కొన్ని పరిమితులు లేకపోలేదు. ఒక పర్యాయం అసంతులిత ఏర్పడితే దానివి సరిదిద్దడం సాధ్యం కాకపోవచ్చు. అవసరమైన సందర్భాలలో, అవసరమైన సమయాలలో తగిన పెట్టుబడులు వస్తాయి అని హర్ష్‌మన్ భావించారు. అయితే అవసరమైన విధంగా పబ్లిక్ రంగంలో గాని, ప్రైవేటు రంగంలో గాని పెట్టుబడులు రాకపోతే అసంతులిత సరిదిద్దబడక పోవచ్చు. అంతేకాక ఎంత అసంతులిత సృష్టించాలో అతడు సూచించలేదు. అసంతులిత పెరుగుదల దిశ, స్వభావం, దానికి తగిన సమయం వివరాలు కూడా తెలియపర్చలేదు. సాంకేతిక సిబ్బంది, ముడి సరుకులు, ప్రాతిపదిక సౌకర్యాల లోపం వల్ల కలిగే సమస్యలను పరిగణనలోకి తీసుకోలేదు. ఈ సమస్యలు అసంతులిత పెరుగుదల పెట్టుబడి నిర్ణయాలను తారుమారు చేయవచ్చు. ఇష్టపూర్వకంగా అసంతులిత పరిస్థితులను ప్రోత్సహిస్తే, కొరతలు యేర్పడతాయి. వాటిని సరిదిద్దడానికి చర్యలు తీసుకోకపోతే ద్రవ్యోల్బణ ఒత్తిడులకు దారి తీయవచ్చు. కొరతల వల్ల స్వార్థ పర వర్గాలు ఏర్పడి, రేషనింగ్, దొంగ నిల్వలు, చీకటి వ్యాపారం మొదలైనవి సంభవిస్తాయి. దీని వల్ల వెనుకబడిన దేశాల పరిస్థితి క్లిష్టతరమౌతుంది.

## 3.2.5 ఇతర కారకాల ద్వారా మూలధన సంచయనం

పైన తెలిపిన సిద్ధాంతాలు ఏ రకమైన మూలధనాన్ని ఏ సమయనంలో సంచయనం చేసుకోవాలో స్పష్టంగా తెలియ పరచలేక పోతున్నాయి. అన్ని రకాల పనిముట్లు, యంత్ర సామాగ్రి, ఉపకరణాలు కలిసి మూలధనం ఏర్పడుతుంది. అయితే ఆర్థికాభివృద్ధికి ఇవన్నీ ఒకే సమయంలో అవసరం కావు. ట్రాక్టర్లు, మర మగ్గాల వంటి కొన్ని ఉత్పాదక వస్తువులు, ఆహార ధాన్యాలు, వస్త్రాల వంటి వినియోగ వస్తువులను ప్రత్యక్షంగా తయారు చేస్తాయి. కాని ట్రాక్టరును ఉత్పత్తి చేయడానికి ఉక్కు, అల్యూమినియం మొదలైన ఉత్పాదకాలు అవసరమౌతాయి.

పెట్టుబడి దారీ వ్యవస్థలో, ఉత్పత్తి అయిన వస్తువుల అమ్మకాలపై లభించే లాభాలను బట్టి మూలధనం పెట్టుబడి ఆధారపడి ఉంటుంది. అందువల్ల, అధిక లాభాలను ఆర్జించే వినియోగ వస్తువులను ఉత్పత్తి చేసే తేలిక రంగంలో పెట్టుబడి పెట్టడానికే ప్రైవేట్ పారిశ్రామిక వేత్తలు సిద్ధ పడతారు. స్వేచ్ఛా మార్కెట్టు శక్తుల ప్రాబల్యం వల్ల ఆర్థిక వ్యవస్థ తేలిక రంగానికే మొగ్గు చూపుతుంది.

ఐతే తేలిక యంత్రాలను భారీ రంగం ఉత్పాదితాల వల్లనే తయారు చేయగలుగుతాము. భారీ రంగాన్ని స్థాపించక పోతే, తేలిక రంగం అభివృద్ధి కాదు. కాని లాభాలు తక్కువగా ఉంటాయనే కారణంతో భారీ రంగ పరిశ్రమ స్థాపనకు ప్రైవేట్ రంగం ఆసక్తి చూపదు. అంతేగాక భారీ రంగ పరిశ్రమల స్థాపనకు పెట్టుబడి అధికంగా అవసరం కావచ్చు. ఇంత భారీ పెట్టుబడికి అవసరమైన నిధులు ప్రైవేటు రంగం కలిగి ఉండకపోవచ్చు. అంతే గాక, ప్రైవేట్ రంగం బహుకొద్ది భారీరంగ పరిశ్రమలను మాత్రమే స్థాపించవచ్చు. దీని వలన అసంతులిత అభివృద్ధి జరుగుతుంది.

ప్రణాళికా బద్ధమైన ఆర్థిక వ్యవస్థలో భారీ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి.. అందువల్లనే వెనుక బడిన దేశాలలో అధిక భాగం తమ మూలధన సంచయన ప్రక్రియలో భారీ రంగానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించుకున్నాయి. ప్రణాళికల ద్వారా భారీ, తేలిక పరిశ్రమల సంతులిత పెరుగుదలను సాధించవచ్చును. ఈ రంగాలలో క్రమబద్ధమైన పెట్టుబడుల ద్వారా ఆర్థికాభివృద్ధిని ప్రారంభించగలుగుతాం. లాభాలకు ప్రాధాన్యత నివ్వడం జరగదు కనుక ప్రభుత్వ రంగం భారీ రంగం అభివృద్ధికి కృషి చేయడం ద్వారా పెట్టుబడుల ధోరణులను మార్చగలుగుతుంది. ప్రభుత్వ రంగం అవసరమైన నిధులను కేటాయించి, విదేశ పరిజ్ఞానాన్ని సహకారాన్ని సంపాదించి మూలధన సంచయన ప్రక్రియను ప్రారంభించగలుగుతుంది.

---



BRAOU

## మీ అవగాహనను పరీక్షించుకొండి — 2

3. సంతులిత వృద్ధి అంటే ఏమిటి?
4. అసంతులిత వృద్ధి అంటే ఏమిటి?
5. ముందు అనుబంధాలు అంటే ఏమిటి?
6. వెనుక అనుబంధాలు అంటే ఏమిటి?
7. 'సోషల్ ఓవర్ హెడ్ కాపిటల్ (సామాజిక ఉమ్మడి మూలధనం) అంటే ఏమిటి?
8. 'ప్రత్యక్షంగా ఉత్పత్తి కారకాలైన కార్యకలాపాలలో పెట్టుబడి' అంటే ఏమిటి?

## 3.3 సారాంశం/ముగింపు

మూలధన సంచయనాన్ని గురించి వివిధ సిద్ధాంతాలు ఏ మూల ధన వస్తువులను ఉత్పత్తి చేయాలో స్పష్టంగా తెలియజెయ్యడం లేదు. వాటికి అనేక ఇతర పరిమితులు కూడా ఉన్నాయి. ఆర్థికాభివృద్ధి జరగాలంటే, అందుకు తగిన మూలధన రంగాలను అభివృద్ధి పర్చాలి. ఈ సందర్భంగా భారీ రంగం పెరుగుదల ముఖ్యమైనది. దీనిని ప్రభుత్వ రంగం చేపట్టాలి. మూలధన రంగంతో బాటు, ఇతర రంగాల అభివృద్ధికి కూడా శ్రద్ధ కనపరచాలి. రాబోయే పాఠంలో ఆర్థికాభివృద్ధి లక్షణాలను గూర్చి తెలుసుకుంటాం.

పాఠ్య రచయిత్రి: కుమారి ప్రభాపంత్

## 3.4 సంప్రదింపు గ్రంథాలు


1. తెలుగు అకాడమి (1973) : ఆర్థికాభివృద్ధి— వృద్ధి సిద్ధాంతం
2. తెలుగు అకాడమి (1972) : ఆర్థికవృద్ధి— ప్రణాళికారచన సిద్ధాంతాలు (Ch.4)
3. Benjamin Higgins : Economic development
4. Ghosh : Economics of Underdevelopment.


## 3.5 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. *కింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబులు రాయండి.*

1. సంతులి వృద్ధి, అసంతులిత వృద్ధి దృక్పథాల లాభాలను పోల్చండి.
2. మూలధనం అంటే ఏమిటి? ఆర్థికాభివృద్ధిలో దాని ప్రాధాన్యతను వివరించండి.
3. మూలధన సంచయనం కోసం మిగులు జనాభా (శ్రమ)ను ఏ విధంగా ఉపయోగించువచ్చునో వివరించండి.

II. కింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబు రాయండి.

1. మూలధన సంచయనం పెరుగుదల కోసం పొదుపులో పెరుగుదల ఏ విధంగా కారణభూత మవుతుంది.
2. అపరిమిత శ్రామిక సప్లయ్ ఆర్థికాభివృద్ధికి ఏ విధంగా దోహద పడుతుంది.
3. సంతులిత వృద్ధి సిద్ధాంతాన్ని వివరించండి.
4. హర్ష్‌మన్ అసంతులిత వృద్ధి భావనను వివరించండి.
5. కింది భావనలను వివరించండి.

   (i) వెనుక అనుబంధాలు, ముందు అనుబంధాలు

   (ii) సామాజిక ఉమ్మడి మూలధనం (సోషల్ ఓవర్ హెడ్ క్యాపిటల్), ప్రత్యక్షంగా ఉత్పత్తి కారకమైన కార్యకలాపాలలో పెట్టుబడి.

BRAOU

# భాగం — 4 : ఉత్పత్తి పద్ధతుల ఎంపిక, వస్తువుల ఎంపిక

విషయ క్రమం


4.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
4.1 పరిచయం
4.2 శ్రమ సాంద్రత పద్ధతి, మూలధన సాంద్రత పద్ధతి
4.3 వినియోగ వస్తువులు, ఉత్పాదక వస్తువులు
4.4 దిగుమతి ప్రత్యామ్నాయ విధానం
4.5 సారాంశం/ముగింపు
4.6 సంప్రదింపు గ్రంథాలు
4.7 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 4.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

ఉత్పత్తి ప్రక్రియలో ఉపయోగించే సాంకేతిక విధానాలను తెలుసుకొని శీఘ్రగతిలో ఆర్థికాభివృద్ధిని సాధించడానికి అనువైన ఉత్పత్తి పద్ధతులనూ, అవసరమైన వస్తువులనూ, ఎంపిక విధానాన్ని వివరించడమే ఈ భాగం లక్ష్యం. వీటితో బాటు దిగుమతి ప్రత్యామ్నాయ విధాన పాత్రను కూడా ఈ పాఠం చర్చిస్తుంది.

ఈ పాఠాన్ని చదివిన తరువాత మీరు,

★ ఉత్పత్తి పద్ధతుల ఎంపికను విశ్లేషించగలుగుతారు.
★ వినియోగ వస్తువులు, ఉత్పాదక వస్తువుల మధ్యగల ఎంపికను గుర్తించగలుగుతారు.
★ ఉత్పత్తి పద్ధతుల ఎంపికలో, వస్తువుల ఎంపికలో దిగుమతి ప్రత్యామ్నాయ విధాన ప్రాముఖ్యతను తెలుసుకోగలుగుతారు.

## 4.1 పరిచయం

పెట్టుబడికి సంబంధించిన వనరుల కొరత వర్ధమాన దేశాలలో సహజంగా కనిపిస్తూ ఉంటుంది. ఆర్థిక వ్యవస్థలో ఉన్న పరిమిత వనరులనువ్యవసాయరంగాభివృద్ధికి వినియోగించాలా? లేక పారిశ్రామిక రంగాభివృద్ధికి వినియోగించాలా? అదే విధంగా వినియోగ వస్తువుల ఉత్పత్తి శ్రేయోదాయకమా? లేక ఉత్పాదక వస్తూత్పత్తి శ్రేయోదాయకమా? అనే ప్రశ్నలకు సమాధానాలను జాగ్రత్తగా పరిశీలించవలసి ఉంటుంది. ఏ ఏ రంగాలకు ప్రాధాన్యత యివ్వాలో ముందుగా తెలుసుకోవాలి. ప్రాధాన్యతలు నిర్ణయించిన తరువాత ఎటువంటి ఉత్పత్తి పద్ధతులను ఎంపిక చేయాలో కూడా నిర్ణయించుకోవాలి. ముఖ్యంగా ఉత్పత్తి పద్ధతులను రెండుగా వర్గీకరించవచ్చును (1) శ్రమ సాంద్రత పద్ధతులు (2) మూలధన సాంద్రత పద్ధతులు.

భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో ఏ రకమైన వస్తువులను ఉత్పత్తి చేయాలో తెలుసుకోవలసిన అవసరం ఉంది. ప్రస్తుత అవసరాలకు ఉపయోగపడే వినియోగవస్తువులను ఉత్పత్తి చేయాలాలేక భావి ఆర్థికాభివృద్ధిని నిర్ణయించే ఉత్పాదక వస్తువులను ఉత్పత్తి చేయాలా అనే విషయాన్ని చర్చించాలి. అందుకే ఈ పాఠంలో వస్తువుల రకాలలో ప్రధాన భాగాలైన వినియోగవస్తువులను, మూలధన వస్తువులను తెలుపుతూ వాటి మధ్యగల ఎంపిక సమస్యలను చర్చించడం జరిగింది.

## 4.2 ఉత్పత్తి పద్ధతుల ఎంపిక: శ్రమ సాంద్రతపద్ధతి, మూలధన సాంద్రత పద్ధతి

ఉత్పత్తి పద్ధతి ఎంపిక వనరుల లభ్యత మీదా, ఆర్థిక వ్యవస్థ సమస్యల పైనా ఆధారపడి ఉంటుంది. వెనుకబడిన దేశాలలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంటుంది. ఎక్కువ ఉద్యోగావకాశాలను కల్పించదేయాలంటే శ్రమ సాంద్రత పద్ధతులు మిక్కిలి అనువైనవి. ఈ పద్ధతిని చిన్న,మధ్య తరహా పరిశ్రమలలో చేపట్టవచ్చును. శ్రమ సాంద్రత పద్ధతులు వల్ల పరిశ్రమల వికేంద్రీకరణకు అవకాశముంటుంది. అంటే వివిధ ప్రాంతాలలో పరిశ్రమలను నెలకొల్పవచ్చు. వినియోగపు వస్తువుల తయారీలోనూ, వ్యవసాయిక కార్యకలాపాలలోనూ శ్రమ సాంద్రత పద్ధతులు అనుకూలమైనవి. ఈ పద్ధతులు సక్రమమైన ఆదాయ పంపిణీ తోడ్పడతాయి.

శ్రమ సాంద్రత పద్ధతులను చేపట్టినందు వల్ల కొన్ని నష్టాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టడానికి వీలుండదు. ఫలితంగా శ్రామికుల ఉత్పాదకతను గరిష్ఠ స్థాయికి పెంచలేము. శ్రమ సాంద్రత పద్ధతులు ఉద్యోగితను సృష్టించటానికి అనుకూలమైనప్పటికీ శ్రామికుల ఉత్పాదకతను వృద్ధి పర్చలేవు. అంటే వస్తూ త్పత్తిని ఎక్కువగా పెంచడానికి వీలుపడదన్న మాట. అంతే కాకుండా ఉత్పత్తి విలువలో ఎక్కువ శాతాన్ని వేతనాల కిందనే వెచ్చించవలసి ఉంటుంది. కనుక సంస్థ లాభాలు క్షీణించటం తత్ఫలితంగా పెట్టుబడికి అవసరమైన నిధుల కొరత ఏర్పడుతుంది. ఈ పద్ధతుల్లో ఎక్కువ ఉద్యోగిత ఏర్పడుతున్నందువల్ల వినియోగపు వస్తువులకు డిమాండ్ మితిమీర పెరిగి ద్రవ్యోల్బణానికి దారి తీయవచ్చు.

వర్థమాన దేశాలలో ఉత్పత్తి పెరుగుదల రేటును శీఘ్రగతిలో పెంచాలంటే మూలధన సాంద్రత పద్ధతులను అనుసరించాలని వాల్టర్ గాల్సన్, హార్వేలైబిన్ స్టీన్‌లు అభిప్రాయపడ్డారు. ఈ పద్ధతుల వల్ల ఉత్పత్తి పెరగడమే కాకుండా ఉద్యోగిత కూడా భవిష్యత్‌లో గణనీయంగా పెరుగుతుంది. ఈ పద్ధతులననుసరించి ఉత్పత్తి ప్రక్రియను సాగిస్తే తలసరి ఉపాంతపు పెట్టుబడి నిష్పత్తి గరిష్ఠ స్థాయికి చేరుకునే అవకాశం కలుగుతుంది. అంటే లాభాలలో అధిక శాతం తిరిగి పెట్టుబడి కింద వినియోగించబడుతుంది. వర్థమాన దేశాలలో తగినంత అవస్థాపన ఉండదు. అవసరమైన అవస్థాపనను నిర్మించనిదే ఆర్థిక పురోభివృద్ధి సాధ్యపడదు. మరి అవస్థాపనను నిర్మించటానికి ముఖ్యంగా భారీ మూలధన వస్తువులు అవసరమౌతాయి. ఈ విధంగాపరిశీలిస్తే మూలధన సాంద్రత పద్ధతులను ప్రాధాన్యత కన్పిస్తుంది.

ఉత్పత్తి పద్ధతుల ఎంపిక వస్తువుల స్వభావాన్ని బట్టి ఉంటుంది. కనుక ఒకానొక సమయంలో ఏ ఏ వస్తువులను ఆర్థిక వ్యవస్థ ఉత్పత్తి చేయాలో నిర్ణయించుకోవలసి ఉంటుంది. సర్వ సాధారణంగా వస్తువులను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. (1) వినియోగపు వస్తువులు (2) ఉత్పాదక వస్తువులు. వినియోగ వస్తువులకు శ్రమ సాంద్రత పద్ధతులు, ఉత్పాదక వస్తువులకు మూలధన సాంద్రత పద్ధతులు అనుకూలమైనవి. భారీ యంత్రాలు, యుద్ధ సామాగ్రి మొదలైన ఉత్పాదక వస్తువులు ఆర్థిక వ్యవస్థకు చాలా అవసరం. వీటిని ఉత్పత్తి చేయటానికి ఎక్కువ "ఫలన కాలం" కావలెను. ఉత్పాదక వస్తువులను ఉత్పత్తి చేసేటప్పుడు మొదట్లో తక్కువ పరిమాణంలో ఉద్యోగవకాశాలులభ్యమవుతాయి. కాని రాను రాను ఆర్థికవ్యవస్థ ఎక్కువ పటిష్ట మవుతుంది కనుక ఉద్యోగావకాశాలు కూడా అధిక పరిమాణంలో పెరుగుతాయి.

వర్థమాన దేశాలలో నిజమైన వనరుల (భౌతిక వనరుల) కొరత వల్ల మూలధన సాంద్రత పద్ధతులను ఎక్కువగా ప్రవేశపెట్టలేక పోతున్నారు. లోగడ చెప్పినట్లుగా భారీ, మౌలిక వస్తూత్పత్తికి మూలధన సాంద్రత పద్ధతులను చేపట్టటం తప్పనిసరి అవుతుంది. ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్న తొలి దశలో అవస్థాపనను నిర్మించటానికి ఈ పద్ధతులను చేపట్టాలి. మొత్తం వనరులను భారీ మౌలిక వస్తువుల ఉత్పత్తికే వినియోగిస్తే ప్రజల ప్రస్తుత అవసరాలకు వినియోగపు వస్తువులను ఎట్లా ఉత్పత్తి చేయాలన్నది పరిష్కరించవలసిన సమస్య. ప్రణాళికా నిపుణుల అభిప్రాయం ప్రకారం మొదట్లో వినియోగపు వస్తువులను శ్రమ సాంద్రత పద్ధతులతో ఉత్పత్తి చేయవలసి ఉంటుంది. ఆర్థిక వ్యవస్థ కొంత బలం పుంజుకున్న తరువాత వినియోగవస్తువులను కూడా ఆధునిక పద్ధతుల్లో ఉత్పత్తి చేయవచ్చు. అప్పుడు వినియోగ వస్తూత్పత్తి ప్రక్రియను కూడా మూలధన

BRAOU

సాంద్రత పద్ధతులే అవసరమౌతాయి. అయితే నిరుద్యోగ సమస్యను దృష్టిలో ఉంచుకుంటే శ్రమ సాంద్రత పద్ధతులకే మొగ్గు చూపవలసి ఉంటుంది. ఉత్పత్తి పద్ధతులను ఎన్నుకునేటప్పుడు మనం ఒక విషయాన్ని ముఖ్యంగా గుర్తించుకోవాలి. ఈ రెండు పద్ధతులు పరస్పర విరుద్ధాలు కావు. ఆర్థికవ్యవస్థలో ఒక దశ వరకు శ్రమ సాంద్రత పద్ధతుల ద్వారా నిరుద్యోగ సమస్యను కొంతవరకు పరిష్కరించవచ్చు. ఆ తరువాత సంపూర్ణ ఉద్యోగితకు భంగం కలుగకుండా మూలధన సాంద్రత పద్ధతులను ఉపయోగించవచ్చు. ఏ ఏ రంగాలలో ఎంత మేరకు ఈ రెండు పద్ధతులను ఉపయోగించాలన్నది ముఖ్యమైన విషయం. మన ఆర్థిక వ్యవస్థలో వీలును బట్టి ఈ రెండు పద్ధతులను కూడా ప్రవేశ పెట్టారు.

---

## మీ అవగాహనను పరీక్షించుకొండి — 1

---

1. శ్రమ సాంద్రత, మూలధన సాంద్రత పద్ధతుల మధ్య తేడాను గుర్తించండి.

---

## 4.3 వస్తువుల ఎంపిక : వినియోగవస్తువులు, ఉత్పాదక వస్తువులు

---

ఇంతవరకు ఉత్పత్తి పద్ధతుల గురించి పరిశీలించాం. ఇప్పుడు వస్తువుల ఎంపిక గురించి తెలుసుకుందాం. లోగడ చెప్పినట్లు ఆర్థిక వ్యవస్థలో వస్తువులను (1) వినియోగపు వస్తువులు (2) ఉత్పాదక వస్తువులుగా వర్గీకరించవచ్చు. స్వల్పకాలంలో సాధారణంగా వినియోగ వస్తువుల ఉత్పత్తికి ప్రాధాన్యత ఇస్తారు. ఎక్కువ పరిమాణంలో వినియోగ వస్తువుల లభ్యత వల్ల ప్రజల తలసరి వినియోగం పెరగడమే దీనికి కారణం. (జనాభా పెరుగుదల రేటు వినియోగ వస్తువుల పెరుగుదల రేటుకంటే మించనప్పుడు). కాని ఆర్థికాభివృద్ధి త్వరితగతిలో సాగాలంటే వస్తురాశి ఉత్పత్తి పెరగాలి. అందుకు ఉత్పాదక వస్తువులుఅవసరమౌతాయి. అంతే కాకుండా వినియోగ వస్తురాశిని పెంచటానికి కూడా ఉత్పాదక వస్తువులు ఉపయోగపడతాయి. కాబట్టి ఉత్పాదక వస్తు రంగాన్ని మనం విస్మరించలేము. నిజానికి వినియోగ, ఉత్పాదక వస్తురంగాలు ఒక దానికొకటి పూరకాలుగాని ప్రత్యామ్నాయాలుకావు. ఉత్పాదక వస్తురంగం అభివృద్ధికి తగినంత వినియోగ వస్తురాశి మార్కెట్‌లో లభ్యం కావాలి. లేకుంటే ఉత్పాదక వస్తురంగంలో పెట్టిన పెట్టుబడులు ద్రవ్యోల్బణానికి దారి తీయవచ్చు. వినియోగపు వస్తురంగంలో విక్రయమయ్యే మిగులు పరిమాణం పెరగాలి. అప్పుడే ఉత్పాదక వస్తు రంగాన్ని వృద్ధి చేయగలం. అంటే ఉత్పాదక వస్తురంగం అభివృద్ధి విక్రయమయ్యే వినియోగ వస్తువుల మిగులుపై ఆధారపడుతుందన్న మాట.

కాబట్టి వినియోగ వస్తురంగంలో విక్రయమయ్యే మిగులును ఎట్లా ఎక్కువ చేయగలం? అన్న ప్రశ్నకు సమాధానాన్ని తెలుసుకోవాలి. ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త మారిస్ డాబ్ ఈ అంశాన్ని వినియోగవస్తు రంగంలో శ్రామికుల ఉత్పాదకతకూ శ్రామికులకు చెల్లించే వేతనాలకూ గల సంబంధముగా పేర్కొన్నాడు. శ్రామికుల ఉత్పాదకత పెరిగినప్పటికీ వారికి చెల్లించే వేతనం పెరగకుండా ఉంటే మిగులు జనిస్తుంది. ఈ విధంగా ఆలోచిస్తే వినియోగ వస్తురంగంలో శ్రామికులకు బదులుగా మూలధన సాంద్రత పద్ధతులను ఉపయోగిస్తే ఎక్కువ మిగులు జనించవచ్చు. కాని ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న తొలి దశలో మూలధనం కొరత వల్ల నిరుద్యోగ సమస్య ఉధృతంగా ఉంటుంది. కాబట్టి శ్రమ సాంద్రత పద్ధతులనే చేపట్టవలసి ఉంటుంది. ఒక వేళ అవసరమగు మూలధనాన్నీ, సాంకేతిక పరిజ్ఞానాన్నీ విదేశాల నుండి దిగుమతి చేసుకుంటే, బహుశా మూలధన సాంద్రత పద్ధతులను చేపట్టడానికి యిబ్బందులు ఉండవని కొంత మంది శాస్త్రవేత్తల అభిప్రాయం. అయితే, ఈ అభిప్రాయం కూడా సరైనదికాదు. కారణం దిగుమతుల ద్వారా మూలధనాన్ని పొందాలంటే విదేశీ మారక ద్రవ్యం పుష్కలంగా లభ్యం కావాలి. అంటే ఎగుమతులు ఎక్కువగా ఉండాలి. వర్ధమాన దేశాలలో విదేశీ మారక ద్రవ్యం కొరత కూడ ఉంటుంది. కనుక మూలధన సాంద్రత పద్ధతులను ఎక్కువగా ప్రవేశపెట్టలేము.

BRAOU

ఈ సందర్భముగా ప్రొ. పాల్ బరన్ అనే శాస్త్రవేత్త అభిప్రాయాన్ని మనం తెలుసుకోవచ్చు. ఆర్థిక వ్యవస్థలో వనరులను దుర్వినియోగం చేయరాదు. ప్రజల విలాస వినోదాలకై చాలా వరకు అనవసరంగా ఖర్చు చేస్తుంటారు. అటువంటి వస్తూత్పత్తినీ, వినియోగాన్నీ తగ్గిస్తే, వనరులను ప్రయోజనకరమైన వస్తూత్పత్తికి వినియోగించవచ్చు. కనుక మామూలుగా జనించే "మిగులు" కంటే, విలాస వినోదాలను తృప్తి పరచే వస్తూత్పత్తిని తగ్గిస్తే ఇంకా ఎక్కువ "మిగులు" (వనరుల రూపంలో) జనిస్తుందని పాల్ బరన్ భావించాడు. అంటే మామూలుగా జనించే మిగులుకంటే ఆర్థిక వ్యవస్థలో సంభవనీయమైన "మిగులు" ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వస్తూత్పత్తి "ఎంపిక"లో విలాస వినోదాలను తృప్తి పరుస్తున్న వినియోగ వస్తువుల ఉత్పత్తిని అరికట్టడం చాలా అవసరం.

---

మీ అవగాహనను పరీక్షించుకొండి — 2

---

2. వినియోగ వస్తువులకు, ఉత్పాదక వస్తువులకు ఉన్న సంబంధమేమిటి?

---

## 4.4 దిగుమతి ప్రత్యామ్నాయ విధానం

---

విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్న వస్తువులకు బదులుగా మన దేశంలోనే ఉత్పత్తి అయిన వస్తువులను వినియోగిస్తే దానిని "దిగుమతి ప్రత్యామ్నాయ విధానం" అంటారు. శ్రమ సాంద్రత, మూలధన సాంద్రత పద్ధతులను రెండింటినీ సక్రమంగా జోడించి ఆర్థికాభివృద్ధి త్వరితగతిన సాధించవలసి ఉంటుంది. అందుకుగాను దిగుమతి విధానాన్ని కూడా పరిశీలించ వలసి ఉంటుంది. అంటే అనవసరమైన దిగుమతులను అరికట్టి తత్ఫలితంగా లభ్యమైన విదేశీ మారకాన్ని అవసరమైన వస్తువుల దిగుమతికి ఉపయోగించవచ్చు. దేశంలో ఉత్పత్తి కాదగిన వస్తువులను సాధ్యమైనంత వరకు దిగుమతి చేసుకోకూడదు. దిగుమతులలో ముఖ్యంగా మూడు రకాలున్నాయి. అవి (1) ఆహార పదార్థాల దిగుమతులు (2) పోషక లేదా సంరక్షణ దిగుమతులు (3) అభివృద్ధి పరమైన దిగుమతులు. దీర్ఘకాలంగా ఆహార పదార్థాల దిగుమతులుండరాదు. వర్ధమాన దేశంలో దిగుమతి విధానం రూపొందించేటప్పుడు ముఖ్యంగా ఆలోచించవలసిన అంశాలు రెండు (i) ఏ రకమైన వస్తువులను ఉత్పత్తి చేయవలసి ఉంటుంది.? (ii) ఏ విధమైన ఉత్పత్తి పద్ధతిని చేపట్టవలసి ఉంటుంది.

వర్ధమానదేశాలు దిగుమతి ప్రతిస్థాపన విధానానికి ఎక్కువ ప్రాముఖ్యత చూపుతున్నాయి. అంతర్జాతీయ వ్యాపారం వల్ల వెనుకబడిన దేశాలు ప్రయోజనాన్ని సాధించలేక పోయాయని ప్రముఖ శాస్త్రవేత్తలు సింగర్, గున్నార్ మిర్డాల్ పలుమార్లు అభిప్రాయపడ్డారు. దిగుమతులను ప్రతిస్థాపన చేయాలన్నది ఒక అభివృద్ధి విధానంగా వర్ధమానం దేశాలు భావిస్తున్నాయి. అటువంటి విధానాన్ని ప్రొ. చెనెరీ కూడా సమర్థించారు.

దిగుమతుల ప్రతిస్థాపన విధానాన్ని చేపట్టినప్పుడు కొన్ని విషయాలనుపరిశీలించవలసి ఉంటుంది.ఏ ఏ వస్తువులను ప్రతిస్థాపితం చేసుకోగలం? ఏ ఏ వస్తువులనుదిగుమతి చేసుకోవలసి ఉంటుంది? ఆర్థిక వ్యవస్థలో అవలంబించవలసిన ఉత్పత్తి పద్ధతులను బట్టి ఈ విషయాలనునిర్ణయించుకోవాలి. దిగుమతుల ప్రతిస్థాపన విధానం స్వల్ప, దీర్ఘకాలాల్లో కూడా ప్రయోజనకరమైనది. స్వల్ప కాలంలో ధరల స్థాయిని అదుపులో ఉంచి అవసరమైన వస్తువుల కొరతను నిర్మూలించగలదు. దీర్ఘ కాలంలో ఆర్థిక వ్యవస్థ స్వయం సమృద్ధిని సాధించడానికి వస్తువులనువాటి తులనాత్మక వ్యయాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయించవలసి ఉంటుంది. దిగుమతుల ప్రతిస్థాపన విధానం ప్రణాళికలలో ఎంపిక చేసిన ఉత్పత్తి పద్ధతులకూ, వస్తువులకూ విరుద్ధంగా ఉండరాదు.

## మీ అవగాహనను పరీక్షించుకోండి — 3

3. "దిగుమతి ప్రత్యామ్నాయ విధానము" అంటే ఏమిటి?

## 4.5 సారాంశం /ముగింపు

ఉత్పత్తి ప్రక్రియలో మూలధన శ్రమసాంద్రత పద్ధతులను ఉపయోగించాల్సిన పరిస్థితి ఉందని తెలుసుకొన్నాం. ఉత్పత్తి చేయదగు వస్తువులు — అంటే వినియోగ, ఉత్పాదకత వస్తువుల మధ్య ఒక సమతూకాన్ని నిర్ధారించుకోవలసి ఉంటుంది. ఆ సమతూకం కోసం అనువైన విదేశీ వ్యాపార విధానాన్ని చేపట్టవలసి ఉంటుంది. అంటే సరైన దిగుమతి ప్రతిస్థాపన విధానానికి చాలా ప్రాముఖ్యము ఉంటుంది.

మొత్తం మీద మనం తెలుసుకోవలసినదేమంటే వర్ధమాన దేశాలలో అభివృద్ధి ధ్యేయాలు ముఖ్యంగా రెండున్నాయి. అవి (1) ఎక్కువ ఉద్యోగావకాశాలను సృష్టించడం (2) త్వరిత గతిలో ఆర్థికాభివృద్ధిని సాధించటం, ఈ ధ్యేయాలను సాధించడానికి వీలుగా మనం చేపట్టిన ఉత్పత్తి పద్ధతులు, ఎంపిక చేసిన వస్తువులు ఉండాలి.

— డా. టి.దివాకరరావు

## 4.6 సంప్రదింపు గ్రంథాలు

1. తెలుగు అకాడమి (1972) : ఆర్థికవృద్ధి—ప్రణాళికారచనా సిద్ధాంతాలు (Ch.5)
2. తెలుగు అకాడమి (1973) : భారత దేశ ఆర్థికాభివృద్ధి : సమస్యలు (Ch.6)
3. తెలుగు అకాడమి (1978) : భారత దేశం—ప్రణాళికా విధానం (Ch.6)

## 4.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

BRAOU

I. కింది ప్రశ్నలకు సుమారు *30* పంక్తులలో జవాబులు రాయండి.

1. శ్రమ సాంద్రత, మూలధన సాంద్రత పద్ధతుల మధ్య తారతమ్యాన్ని వివరించండి. ఈ రెండు పద్ధతుల గుణదోషాలను విశదీకరించండి.

II. కింది ప్రశ్నలకు సుమారు *15* పంక్తులలో జవాబులు రాయండి.

1. "మూల ధన వస్తువుల రంగంలో పెట్టుబడి వినియోగవస్తువుల విక్రయం అయ్యే మిగులు (లభ్యం) పై ఆధారపడి ఉంటుంది" — చర్చించండి.
2. దిగుమతి ప్రత్యామ్నాయ విధానం అంటే ఏమిటి? దాని ప్రాధాన్యతను వివరించండి.

# భాగము — 5 : ఆర్థికాభివృద్ధి

విషయక్రమం

5.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
5.1 పరిచయం
5.2 ఆర్థికాభివృద్ధి లక్ష్యాలు
5.2.1 అభివృద్ధి రేటును పెంచడం
5.2.2 పెట్టుబడి రేటును అధికం చేయడం
5.2.3 ఉపాధి కల్పనలో అభివృద్ధి
5.2.4 సాంఘీక న్యాయం
5.2.5 స్వయం పోషకత్వం
5.3 తగిన లక్ష్యాల ఎంపిక
5.4 అభివృద్ధి వ్యూహాన్ని నిర్ణయించుకోవడం
5.5 సారాంశం/ముగింపు
5.6 సంప్రదింపు గ్రంథాలు
5.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

## 5.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

ఆర్థికాభివృద్ధి సాధించడానికి అవసరమయ్యే లక్ష్యాలను పరిశీలించడమే ఈ పాఠం లక్ష్యం.

ఈ భాగాన్ని చదివిన తరువాత మీరు

★ ఆర్థికాభివృద్ధి లక్ష్యాలలో ప్రధానమైన వాటిని గుర్తించగలరు.

★ ఇవ్వబడిన పరిస్థితులను బట్టి అనువైన (తగిన) లక్ష్యాన్ని ఎన్నుకోవడాన్ని తెలుసుకోగలరు.

★ అభివృద్ధి వ్యూహం అంటే ఏమిటో తెలుసుకొని, దీర్ఘకాలిక అభివృద్ధిని సాధించడానికి అనువైన వ్యూహాన్ని గుర్తించగలరు.

B R A O U

## 5.1 పరిచయం

ఇంతకు ముందు పాఠాలలో వెనుకబడిన దేశాల లక్షణాలను, వాటి ప్రత్యేక సమస్యలను గురించి తెలుసుకున్నాం. వెనుకబడిన దేశాల, అభివృద్ధి చెందిన దేశాల వినియోగం, ఉత్పత్తి ధోరణులలో తేడాలను గమనించాం. వెనుకబడిన దేశాలు అభివృద్ధి చెందిన దేశాల అభివృద్ధి స్థాయిని చేరుకోవాలి. వెనుక బడిన దేశాలు ఎదుర్కొంటున్న వివిధ పరిమితుల కారణంగా, అభివృద్ధి చెందిన దేశాల లక్షణాలన్నింటిని వెంటనే పొందడం అసాధ్యం వెనుకబడిన దేశాలు ఆర్థిక స్థితి గతులను ప్రణాళికా బద్ధంగా క్రమంగా మార్చుకోవాలి. ఈ కృషిలో కొన్ని రంగాలకు తక్షణ ప్రాధాన్యతనివ్వాలి. ఇతర రంగాలను వాయిదా వేసుకోవచ్చు. అందువల్ల వెనుక బడిన దేశాలు నిర్ధారిత సమయంలో సాధింపతగిన కొన్ని లక్ష్యాలను ఏర్పరచుకోవాలి. ఈ లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధమైన వ్యూహరచన చేయాలి.

## 5.2 ఆర్థికాభివృద్ధి లక్ష్యాలు

వెనుకబడిన దేశాలు వివిధ లక్ష్యాలను పెంచుకొని, వాటిని సాధించడానికి అభివృద్ధి ప్రక్రియను ప్రారంభిస్తాయి. ఈ దేశాల ప్రణాళికలలో కనిపించే లక్ష్యాలను ముందు పరిశీలిద్దాం. తరువాత మొత్తం అభివృద్ధి వ్యూహం దృష్ట్యా వాటిలో కనిపించే లోపాలను పరిశీలిద్దాం. అభివృద్ధి లక్ష్యాలు రెండు రకాలుగా ఉంటాయి. దీర్ఘకాలిక లక్ష్యాలు సుదీర్ఘ కాలంలో ఆర్థిక వ్యవస్థ ఏ దిశగా పయనించాలో నిర్దేశిస్తాయి. స్వల్పకాలిక లక్ష్యాలు (ప్రణాళికావేత్తలు) వెనువెంటనే పరిష్కరించాలని భావించే ప్రత్యేక సమస్యలకు సంబంధించి ఉంటాయి. ఒక స్వల్ప కాలిక లక్ష్యం మొత్తం ప్రణాళికా వ్యూహానికి వ్యతిరేకమైనదిగా ఉండవచ్చు. అంతేగాక అభివృద్ధి కృషిలో సమస్యల్ని విడివిడిగా పరిష్కరించడానికి ప్రయత్నిస్తే ఆర్థిక వ్యవస్థ పెరుగుదల అస్తవ్యస్తం కావచ్చు. అందువల్ల అభివృద్ధికి సంబంధించి వాస్తవ ఆశయాన్ని గురించి తెలుసుకునేముందు ప్రణాళికా వేత్తలు ఎంచుకున్న లక్ష్యాలను, వాటి లోటుపాట్లను గురించి తెలుసుకుందాం.

### 5.2.1 అభివృద్ధి రేటును పెంచడం

వెనుకబడిన దేశాలు తమ జాతీయాదాయాల పెరుగుదల రేట్లను పెంచుకోవడం తమ ప్రధాన లక్ష్యంగా ఉన్నట్లు అనిపిస్తుంది. జాతీయాధాయంలో అభివృద్ధి, వస్తువుల, సేవల ఉత్పత్తిలో పెరుగుదల ద్వారా అభివృద్ధి స్థాయిలో పెరుగుదలను సూచిస్తుంది. 1950 నుంచి 1970 వరకు 'అభివృద్ధి దశాబ్దాలలో'' పెరుగుదల రేట్లను 5 నుంచి 7 శాతం సాలీనా సాధించవలసిన అవసరాన్ని ఐక్యరాజ్యసమితి నొక్కి చెప్పింది. మనదేశ పంచవర్ష ప్రణాళికలలో పెరుగుదల రేటు ప్రారంభంలో సాలీనా 5 నుండి 6 శాతం ఉండాలని నిర్ణయించారు. ఈ రేటును సాధించడానికి ఇతర చలాంకాలను (Variables) తగినట్లుగా సరిదిద్దారు.

ఐతే పైన పేర్కొన్న లక్ష్యం అనేక పరిమితులకు లోబడి వుంటుంది.

(అ) పెరుగుదల రేటు అంటే జాతీయాదాయంలో పెరుగుదల అని భావిస్తారు. జాతీయ ఆదాయం అన్ని రంగాల, అన్ని రకాల వస్తువుల, సేవల ఉత్పత్తులను కలిపిన సమష్టి విషయం. దాంతో అభివృద్ధి, అభివృద్ధేతర రంగాలను ప్రత్యేకంగా చూపడం జరుగదు. ఉదాహరణకు కొన్ని దేశాలు రక్షణ, యుద్ధ సన్నద్ధాలపై పెద్ద మొత్తాలను ఖర్చు పెడుతున్నాయి.. దీని వల్ల వాటి జాతీయాదాయం పెరుగుతుంది. కాని అది వాటి వాస్తవ ఆర్థికాభివృద్ధిని ప్రతి ఫలించదు. కొన్ని మధ్య ప్రాచ్య దేశాలు పెట్రోలు ఉత్పత్తిపై తమకు గల గుత్తాధిపత్యం వల్ల పెట్రోలు ధరలను పెంచగలిగాయి. దీనివల్ల వాటి జాతీయాదాయాలు బాగా పెరిగాయి. కాని ఆ దేశాల ప్రజల జీవన ప్రమాణాలలో చెప్పుకోదగిన అభివృద్ధి జరుగలేదు. విలాస వస్తువుల, సేవల ఉత్పత్తి పెరగడం వల్ల ఒక చిన్న వర్గం జీవన ప్రమాణం మెరుగు పడుతుందిగాని, ఈ ఉత్పత్తి ఫలితాలు జనాభాలో ఇతర వర్గాలకు లభించవు. ఈ విధంగా కొన్ని అభిన్నేతర రంగాల పెరుగుదల వల్ల అభివృద్ధి రేటు పెరుగుతుంది. గాని జాతీయాదాయంలో పెరుగుదల వల్లనే వాస్తవమైన అభివృద్ధి జరుగుతుందనే నమ్మకం లేదు.

(ఆ) ఆర్థిక వ్యవస్థ అభిలషించే పెరుగుదల రేటును అభివృద్ధికి లక్ష్యంగా నిర్ణయించడం నిరుపయోగం. సాధారణంగా ఈ పెరుగుదల రేటును పొదుపు పెంపుదల ఆధారంగానూ, ఉత్పాదిత, మూలధనం నిష్పత్తి ఆధారం గానూ నిర్ణయిస్తారు. ఇంతకు ముందు పాఠాలలో మనం తెలుసుకున్నట్లు ఆర్థికాభివృద్ధిలో పొదుపు నిష్పత్తి ఏ విధమైన ప్రభావం చూపని చలాంకం. అంతేగాక భారత ఆర్థిక వ్యవస్థకు 5 శాతం పెరుగుదల రేటు అత్యున్నతమైనదని చెప్పలేం. ఈ రేటు పెరుగుదల వల్ల ఇతర లక్ష్యాలన్నీ సాధింపబడతాయని భావించడం కూడా సరికాదు. పెరుగుదల రేటుపై ప్రభావం చూపే అనేక ఇతర కారకాలున్నాయి. వీటిలో ఉద్యోగభృతి, పెట్టుబడి రేటు, పెట్టుబడి విధానం, ఆర్థిక వ్యవస్థలో నెలకొని ఉన్న సాంకేతిక విజ్ఞానం, వేతనాలు, ధరల వంటి ఆర్థిక కారణాలు, వాతావరణ పరిస్థితులు, సుస్థిర రాజకీయ వ్యవస్థ వంటి ఆర్థికేతర కారకాలు ఉన్నాయి. ఆ విధంగా ప్రారంభిక పెట్టుబడులు పెట్టి తగిన ఉత్పత్తి పద్ధతులు ఉపయోగించాక, వేతనాలరేట్లు, వినియోగ స్థాయిలు పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే పెరుగుదల రేటును అంచనా వేయడం సాధ్యమౌతుంది. కాబట్టి

BRAOU

అభివృద్ధి ప్రణాళిక తుది ఫలితం పెరుగుదలరేటు అని గుర్తించాలి. ముందుగానే దానిని నిర్ణయించడం అంటే అసాధ్యమైన పాత్రను దానికి ఆపాదించడమే అవుతుంది.

### 5.2.2 పెట్టుబడి రేటును అధికం చేయడం

పెరుగుదల రేటును పెంచడం వల్లనే అభివృద్ధి సాధ్యం కాదు. దీనికి బదులుగా ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడి రేటును అధికం చేయాలి. మన పంచవర్ష ప్రణాళికలలో పెట్టుబడి రేట్లను క్రమక్రమంగా పెంచుతూ వచ్చారు. మొదటి ప్రణాళికలో 7 శాతం నుంచి ఐదవ ప్రణాళికలో 16 శాతం వరకు పెంపుదల జరిగింది. మూలధన సంచయనం తక్కువ కాబట్టి, తగిన విధంగా పెట్టుబడి పెంచడం వల్లనే అదనపు మూలధన సమకూర్పటం వీలౌతుంది. కాబట్టి అధిక పెట్టుబడి అభివృద్ధికి ప్రధాన కారకమని భావించవచ్చు. పెద్ద రేటులో పెట్టుబడి పెడితే, దాని వల్ల ఉత్పత్తి అధికమై, ఉద్యోగభృతి పెరిగి, పెరుగుదల రేట్లు కూడా అధికమౌతాయి.

పెట్టుబడి వల్ల ఉత్పత్తి అధికమైనప్పటికీ, అది అభివృద్ధికి దారి తీస్తుందని ఖచ్చితంగా చెప్పలేము. పెట్టుబడి వివరం తెలిస్తేగానీ, అది అభివృద్ధికి దోహదం చేస్తుందో లేదో తెలియదు. ప్రైవేట్ ప్రభుత్వ రంగాలు రెంటికీ సమాన ప్రాధాన్యమిచ్చే మిశ్రమ ఆర్థిక వ్యవస్థలున్న దేశాలలో అన్నిరకాల పెట్టుబడులకు ప్రోత్సాహం లభిస్తుంది. ప్రభుత్వ రంగం ప్రాధాన్యత కలిగిన పరిశ్రమలలో పెట్టుబడి అధికం చేస్తుంది. ప్రైవేట్ రంగం అధిక లాభాలను ఆర్జించే పరిశ్రమలలో పెట్టుబడి పెడుతుంది. ప్రాధాన్యత లేని రంగాలలో పెట్టే ప్రైవేటు పెట్టుబడి ప్రణాళిక మూల లక్ష్యాన్నే భంగ పరుస్తుంది. ''ఉత్పత్తి'' లేక ''పెట్టుబడి'' అధికం చేయాలని తెలియజేసే ప్రణాళికలు, ఏవస్తువులను ఉత్పత్తి చేయాలో, ఏ రంగంలో పెట్టుబడి పెట్టాలో స్పష్టం చేయవు.

అనుచితమైన పెట్టుబడి కేటాయింపుల వల్ల, ప్రాధాన్యత లేని పరిశ్రమలు వృద్ధి చెంది, ప్రాధాన్యత గల పరిశ్రమల పెరుగుదల దెబ్బతింటుంది. దీని ఫలితంగా వినియోగ ప్రమాణాలలో వ్యత్యాసాలు పెరగడమే కాక, కొరతగా ఉన్న ఉక్కు, విద్యుచ్ఛక్తి, రాగి, రవాణా, శ్రమశక్తి మొదలైన ఉత్పదకాలను అధిక ఆదాయ వర్గాలు కోరుకునే విలాస వస్తువుల ఉత్పత్తికి మళ్ళించడం జరుగుతుంది. ఈ విధంగా ప్రాధాన్యత లేని రంగాలు విస్తరించి, ప్రాధాన్యత గల రంగం వృద్ధి చెందక పోగా ఉత్పత్తి, పెరుగుదల రేట్లు పడిపోతాయి. కాబట్టి పెట్టుబడిని ప్రాధాన్యత లేని రంగాలకు మళ్ళించకుండా జాగ్రత్త వహిస్తూ ప్రాధాన్యత లేని రంగాలలో ఎక్కువగా ఉండేటట్లు చూడాలి. అంతేగాని మొత్తం పెట్టుబడి రేటు పెరిగింది కదా అని సంతృప్తి చెందకూడదు. అందువల్ల పెట్టుబడి ఏ రంగంలో పెట్టిందీ, యే వస్తువుల ఉత్పత్తి నిర్ధారించిందీ స్పష్టంగా తెలియకపోతే పెట్టుబడిలో వృద్ధి వల్లనే ఆర్థికాభివృద్ధి జరుగుతుందని ఖచ్చితంగా చెప్పలేము.

BRAOU

### 5.2.3 ఉపాధి కల్పనలో అభివృద్ధి

కొన్ని సందర్భాలలో, పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థలో నిరుద్యోగం కూడా అధికం కావచ్చు. భారతదేశం దీనికి మంచి ఉదాహరణ. అందువల్ల నిరుద్యోగాన్ని తగ్గించడం అభివృద్ధి కృషిలో మరొక ప్రత్యేక లక్ష్యంగా తీసుకోవచ్చు. పంచవర్ష ప్రణాళికల అమలు జరుగుతున్న సమయంలో నిరుద్యోగుల సంఖ్య మొదటి ప్రణాళికలో 53 లక్షలు నుండి 4వ ప్రణాళికాంతానికి 140 లక్షలకు పెరిగింది. ఈ సంఖ్య క్రమంగా పెరుగుతున్నందువ, ఉపాధి కల్పనను అభివృద్ధి లక్ష్యాలలో ఒకటిగా ప్రభుత్వం నిర్ణయించింది.

నాలుగవ ప్రణాళికలో ఉపాధి కోసం ప్రత్యేకంగా సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ, లాభసాటి గాని రైతుల వ్యవసాయ కూలీల సంస్థ, దుర్భిక్ష ప్రాంతాల కార్యక్రమం, కనీసావసరాల పథకం వంటి వాటిని ప్రారంభించారు. శ్రమశక్తికి సంబంధించిన వ్యూహారచన, ఉపాధి కల్పించగల పథకాలు, పనికి ఆహారం పథకం, స్వయం ఉపాధి పథకాలు, చిన్న తరహా, అతి చిన్న పరిశ్రమల అభివృద్ధి మొదలైన వివిధ రకాల చర్యల ద్వారా మన దేశంలో ఉద్యోగ భృతిని అధికం చేయడానికి కృషి జరుగుతున్నది.

 ఉద్యోగ భృతి అధికం చేయడం ప్రధాన లక్ష్యమైనా, ఇది ఇతర విషయాలతో ముడిపడి ఉన్నదని

గుర్తుంచుకోవాలి. బాగా సాంద్రమైన ఉత్పత్తి పద్ధతులను ఉపయోగించి, అన్ని వనరులను అందుకోసం వాడినప్పుడే ప్రజలందరికీ పూర్తి ఉద్యోగభృతి సాధ్యమౌతుంది. కాని దీని వల్ల దీర్ఘకాలంలో త్వరితమైన అభివృద్ధి రేటును సాధించగలిగిన నిర్మాణ గతమైన మార్పులు ఆర్థిక వ్యవస్థలో జరగవు. కాబట్టి ఉద్యోగ భృతిని అధికం చేయడం అభివృద్ధి కృషిలో అంతర్భాగంగావే చేపట్టాలి.

### 5.2.4 సాంఘిక న్యాయం లేదా బీదరికం తగ్గింపు

నిరుద్యోగం పెరగడంతో బాటు ఆదాయాలలో అసమానత్వాలు, బీదరికం కూడా పెరుగుతున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వరుసగా 40 శాతం, 50 శాతం ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారని అనేక పరిశీలనల్లో తేలింది. జనాభా పెరుగుదలతో బాటు ఈ సంఖ్య కూడా పెరగుతున్నది. అందువల్ల బీదరికం తగ్గించడానికి వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. వీటిలో ధనికులపై అధికాధికంగా పన్నులు విధించడం, భూమి లేని కార్మికులు సన్న, చిన్నకారు రైతులు మొదలైన బీద, బలహీన వర్గాల ప్రజలకు ప్రత్యక్షంగా సహాయం చేయడం వంటివి ఉన్నాయి. ఆర్థిక అసమానత్వాలను తగ్గించేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల భూములపై గరిష్ట పరిమితి విధించడం, అదనపు భూముల పంపకం, ఆర్థిక శక్తి వికేంద్రీకరణకు అవసరమైన చర్యలు తీసుకున్నారు.

హేతుబద్ధమైన ఏ ప్రణాళికలోనైనా అభివృద్ధికీ, సాంఘిక న్యాయానికీ సమాన ప్రాతినిధ్యం ఉండాలి. దీనికోసం ప్రణాళికా రచనలో సరియైన ఎంపికలు జరగాలి. ఏమి ఉత్పత్తి చేయాలి (వస్తువు ఎంపిక), ఎట్లా ఉత్పత్తి చేయాలి (ఉత్పత్తి పద్ధతుల ఎంపిక) అని ఎంపికలు రెండు రకాలుగా వుంటాయి. ఈ ఎంపికలకు, ఆర్థికాభివృద్ధికి మధ్యగల సంబంధాన్ని తరువాత తెలుసుకుందాం.

### 5.2.5 స్వయం పోషకత్వం

భారతదేశంలో జరిగినట్లుగా, ఆర్థికాభివృద్ధి ప్రారంభ దశలలో అభివృద్ధి పునాదుల నిర్మాణానికి విదేశీ సహాయం, విదేశీ విజ్ఞానం, విదేశీ మూలధనంపై అధికంగా ఆధారపడవలసి రావచ్చు. దీని ఫలితంగా విదేశీ మారకం అసంతులిత, ఎగుమతుల్లో సమస్యలు, విదేశీ రుణ భారం ఏర్పడవచ్చు. అందువల్ల మన దేశపు ఐదవ ప్రణాళికలో నిర్దేశించిన విధంగా స్వయం పోషకత్వం ఒక లక్ష్యం కావాలి. దిగుమతులపై తక్కువ ఆధారపడటం, దిగుమతులు ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించడం, ఎగుమతుల విస్తరణ, తగినన్ని విదేశీ మారక నిల్వలను సృష్టించుకోవడం మొదలైనవి స్వయం పోషకత్వ వ్యూహాల సముదాయం. ఐతే ప్రణాళికలలో పేర్కొన్న ప్రాధాన్యతలకు అనుగుణంగా దిగుమతులు, ఎగుమతులు, దిగుమతుల ప్రత్యామ్నాయాలకు చెందిన విధానాలు వుండాలి.

BRAOU

---

### మీ అవగాహనను పరీక్షించుకోండి – 1

---

1. ఆర్థికాభివృద్ధి ప్రధాన లక్ష్యాలేమిటి?

---

### 5.3 తగిన లక్ష్యాల ఎంపిక

---

పైన పేర్కొన్న లక్ష్యాలను ప్రణాళిక అమలులో ఎదురయ్యే లోపాల పూరణకు తాత్కాలిక మార్గాలుగా భావించకూడదు. ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి లక్ష్యాలను మార్పు చేయడం దీర్ఘ కాలిక ప్రణాళికాభివృద్ధికి దోహద పడదు. వాస్తవానికి ప్రస్తుత పరిస్థితి నుండి అభివృద్ధి చెందిన దేశాల ఉత్పత్తి, వినియోగాల ప్రమాణాల స్థాయికి చేరే విధంగా ఆర్థిక వ్యవస్థను పూర్తిగా మార్చడానికి పట్టే కాలాన్ని దృష్టిలో ఉంచుకొని లక్ష్యాలను నిర్ణయించాలి. దీనికోసం ప్రణాళిక వేత్తలు ఐదు సంవత్సరాల అభివృద్ధిని గాక, తక్కువ మూలధనం,

తక్కువస్థాయి ఆదాయాలు, వినియోగాలతో కూడిన ఆర్థిక వ్యవస్థను మూలధన సాంద్రమైన ఉత్పత్తి పద్ధతులు, ఉన్నతమైన ఆదాయ, వినియోగ స్థాయిలు కలిగిన ఆర్థిక వ్యవస్థగా రూపొందించడానికి అవసరమైన మొత్తంగా దీర్ఘదర్శి ప్రణాళికను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రతి వ్యక్తికీ సాధ్యమైనంత ఉన్నతమైన జీవన ప్రమాణాన్ని, పూర్తి ఉద్యోగభృతి పరిస్థితులను సాధించడం అభివృద్ధి లక్ష్యం కావాలి. సాధింపవలసిన జీవన ప్రమాణం అమెరికా సంయుక్త రాష్ట్రాలు, యూరప్ లేక జపాన్‌లోని సగటు మనిషి జీవన ప్రమాణానికి సమానంగా ఉండాలి.

ఈ ప్రమాణాన్ని సాధించేందుకు ఉత్పత్తి, వినియోగాలలో మార్పులు తేవాలి. ఉన్నత జీవన ప్రమాణానికి అనుగుణమైన వస్తువుల ఉత్పత్తికి ఉక్కు, విద్యుచ్ఛక్తి, రాగి వంటి ఉత్పాదకాలు అవసరం. ముందు వీటిని ఉత్పత్తి చేయాలి. విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి ఆనకట్టలు నిర్మించాలి. సిమెంట్, ఉక్కు, బొగ్గు, పెట్రోలు, సాంకేతిక నేర్పులు, రవాణా మొదలైనవెన్నో కావాలి. ఇవన్నీ భారీ పెట్టుబడి రంగానికి చెందినవి. ఉన్నత జీవన ప్రమాణానికి అవసరమైన వస్తువుల ఉత్పత్తి, వినియోగములకు ముందు భారీ రంగం అభివృద్ధి అత్యవసరం. ఒక పెద్ద దేశానికి అవసరాలు అధికంగా ఉంటాయి. గనుక మూలధనం పెరుగుదల కూడా ఉంటుంది. భారీ రంగం ఎంత త్వరితంగా అభివృద్ధి చెందితే అంత త్వరగా లక్ష్యాలను సాధించగలుగుతాము. అంతే వేగంతో అత్యధిక సంఖ్యాకులకు ఉన్నత జీవన ప్రమాణాలు సమకూర్చగలుగుతాము.

అందువల్ల (అ) ఏం సాధించాలో, (ఆ) దానిని ఎంత కాలంలో సాధించాలో లక్ష్యాలలో స్పష్టపర్చాలి. దీర్ఘకాలిక అభివృద్ధికి అస్పష్టమైన "స్వయం పోషకత్వం" లేక "ఆర్థికాభివృద్ధి" తగినవి కావు.

## 5.4 అభివృద్ధి వ్యూహాన్ని నిర్ణయించుకోవడం

లక్ష్య నిర్ణయం చేసుకొన్న తరువాత, ప్రణాళికా వేత్త, ఆ లక్ష్య సాధనలో ఎదురయ్యే పరిమితులను పరిశీలించాలి. ఏవి లభిస్తున్నాయో, ఏవి లభించడం లేదో తెలుసుకోవాలి. దీని వల్ల అభివృద్ధి కృషిలో ఎదురయ్యే కొరతలను తగిన విధంగా తొలగించుకోవచ్చు. అందుబాటులో ఉన్న ఉత్పత్తి పద్ధతులు, సహజ వనరులు, శ్రామికులు, ఆహార ధాన్యాల నిల్వలు, ప్రాతిపదిక సౌకర్యాలు మొదలైనవాటి జాబితా తయారు చేసుకోవాలి. దీనివల్ల ప్రణాళికావేత్త తనకు లభ్యమౌతున్నమేమిటో తెలుసుకోగలుగుతాడు. అభివృద్ధికి ముందు ప్రారంభ పరిస్థితులు, గమ్యం చేరడానికి మార్గాలు ఒక్కో దేశానికి ఒక్కో రకంగా ఉంటాయి. అందువల్ల ప్రణాళికావేత్త లక్ష్యం యేమిటో, ప్రారంభ పరిస్థితులేమిటో తెలుసుకున్న తర్వాత ఆ లక్ష్య చేరుకోవడానికి అతి తక్కువ సమయం పట్టే మార్గాన్ని లేక విధానాన్ని నిర్ణయించుకోవాలి. శ్రమశక్తి కొరతగా ఉన్న ఆర్థిక వ్యవస్థకు, అధిక శ్రమగల వ్యవస్థకు, పోషలిస్టు దేశానికి, పెట్టుబడి దారీ దేశానికి ప్రణాళికా వ్యూహారచన వేర్వేరుగా ఉంటుంది. కాని అన్ని రకాల ఆర్థిక వ్యవస్థలకు లక్ష్యాలు ఒకే విధంగా ఉంటాయి. ప్రారంభ పరిస్థితులనుండి లక్ష్యం చేరుకొనే వరకు అనుసరించే విధానాలు, ప్రణాళికలు మొత్తాన్ని అభివృద్ధి వ్యూహం అంటారు. ఈ వ్యూహాన్ని సౌకర్యం కోసం పంచవర్ష ప్రణాళికలుగా విభజించుకోవచ్చు. కాని ఇవి దీర్ఘకాలిక లక్ష్యానికి అనుగుణంగా వుండాలి. అదే విధంగా ఆర్థిక, వాణిజ్య విధానాలు కూడా అభివృద్ధి వ్యూహానికి అనుగుణంగానే వుండాలి. ఈ విధానాలకూ అభివృద్ధి వ్యూహానికీ ఘర్షణ కలిగితే లక్ష్యాలను చేరకునే విషయములో జాప్యం కలుగుతుంది.

అభివృద్ధి వ్యూహం లక్ష్యాన్ని స్పష్టం చేయడంతో పాటు, దానిని చేరుకొనడానికి తగిన మార్గాన్ని కూడా సూచిస్తుంది. ఈ అభివృద్ధి మార్గంలో సరియైన ఎంపికలు చేసుకొని, తగిన పెట్టుబడి విధానాన్ని చూసుకోవాలి. ప్రారంభ పరిస్థితులపై ఆధారపడి, ఎటువంటి వస్తువులు అవసరమో, వాటి ఉత్పత్తికి ఏ పద్ధతులు అనుసరించాలో, మూలధన సంచయనం ఏ తీరుగా వుండాలో అభివృద్ధి వ్యూహం స్పష్టంగా తెలియజేస్తుంది. అభివృద్ధి పథంలో ప్రాధాన్యతా రంగాలను కూడా తెలియచేస్తుంది. దీనివల్ల ఉత్పత్తి అనుక్రమము (Sequence) లో మార్పులు చేయడానికీ, కొన్ని రంగాలలో పెట్టుబడులను వాయిదా వేయడానికీ వీలు కలుగుతుంది.



BRAOU

లక్ష్యం చేరుకోడానికి మార్గాలను మూడు రకాలుగా చెప్పవచ్చు. ప్రారంభంలో పెంకొని వున్న అధిక జనాభా మీదా, నిరుద్యోగ స్థాయి మీదా, అభివృద్ధి పథంలో ఎంపిక చేసిన వస్తువుల మీద ఆధారపడి వుంటాయి. ఆర్థిక వ్యవస్థను వినియోగ వస్తువుల రంగం, మూలధన వస్తువుల రంగం, భారీ రంగం అనిమూడు రంగాలుగా విభజించవచ్చు.

1) భారీ రంగం పెరుగుదల మీదే అభివృద్ధి ఆధార పడుతుంది. భారీ రంగం పెరుగుదలతో పాటు వినియోగ వస్తువుల ఉత్పత్తి కూడా విస్తరించాలి. ఈ రెండు రంగాలు సంతులిత పద్ధతిలో పెరగాలి. భారీ రంగంలో ఉత్పాదితంలో గరిష్ఠ భాగాన్ని తిరిగి ఆ రంగంలోనే పెట్టుబడి పెట్టినిస్తే, భారీ రంగం పెరుగుదల కూడా గరిష్ఠ స్థాయిని చేరుకుంటుంది.

2) వినియోగ వస్తువులకు డిమాండ్ పెంచడం ద్వారా భారీ రంగంలో పెట్టుబడులను అధికం చేసే సమయంలో ధరలు పెరగనివ్వకూడదు. ధరలను నిలకడగా వుంచడానికి, వినియోగ వస్తువులకు పెరిగిన డిమాండ్‌ను అధిక సప్లయ్ ద్వారా సంతృప్తి పరచాలి. లేని పక్షంలో ద్రవ్యోల్బణ పరిస్థితులేర్పడి, శ్రామికుల జీవన ప్రమాణం పడిపోతుంది. కాబట్టి అభివృద్ధి అనేది ద్రవ్యోల్బణ పరిస్థితులు లేకుండా జరగాలి.

3) అధికాదాయ వర్గా వినియోగం పెరగకుండా చూడాలి. లేకపోతే వ్యత్యాసాలు అధికమౌతాయి. పెరుగుదల సాంఘిక న్యాయంతో కూడి వుండాలి. అంటే ఆదాయాలు, వినియోగం న్యాయమైన పద్ధతిలో పంపిణీ జరిగే పరిస్థితులలో పెరుగుదల వుండాలి. వృధా వ్యయం లేకుండా అభివృద్ధి కృషి జరగాలి.

4) భారీరంగం: పెరుగుదలకు అత్యంత ప్రాధాన్యమివ్వాలి. వినియోగ వస్తువుల రంగంలో మూలధనాన్ని ఆదా చేసే పద్ధతినిగానీ, శ్రమసాంద్రమైన ఉత్పత్తి పద్ధతులను అనుసరించడం ద్వారాగానీ భారీ రంగంలో ఛిద్రాలను (Leakages) తగ్గించాలి. ఈ పరిస్థితుల్లో భారీ రంగం పెరుగుదల కూడా గరిష్ఠ స్థాయిని చేరుకుంటుంది. భారీ రంగం విస్తరణవల్ల అనేక లాభాలు కలుగుతాయి. ఉద్యోగావకాశాలు అధికమవుతాయి. నిజఉత్పత్తి పెరుగుతుంది. జాతీయాదాయం వృద్ధి చెందుతుంది. ఆదాయాల న్యాయమైన పంపిణీద్వారా అసమానత్వాలు, పేదరికం తగ్గుతాయి. అంతేగాక ఆర్థికవ్యవస్థ తనదైన మూలధన పునాదిని నిర్మించుకోవడం వల్ల విదేశాలపై ఆధారపడటం తగ్గి, స్వయం పోషకత్వం సాధ్యమౌతుంది. సాంఘిక న్యాయంతో కూడిన పెరుగుదల జరుగుతుంది. యంత్రాల ద్వారా వినియోగ వస్తువుల ఉత్పత్తిని వాయిదావేసుకోవాలి. ప్రజావసరాలకు కలిగే డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి పెరుగుతుంది. ద్రవ్యోల్బణం లేకుండా సంతులితాభివృద్ధి జరుగుతుంది. మొత్తం అభివృద్ధి వ్యూహాన్ని వివరంగా రూపొందించుకొని అమలుచేస్తే, ప్రణాళికలో పేర్కొన్న అన్ని స్వల్పకాలిక లక్ష్యాలను ఎటువంటి ఇబ్బంది లేకుండా సాధించవచ్చు. అభివృద్ధి లక్ష్యం ప్రణాళికకూ, ప్రణాళికకూ మారనక్కరలేదు. అన్ని లక్ష్యాలు ఒకే ఆశయంతో వుండాలి. 'పూర్తి ఉద్యోగభృతితో' (ప్రతిమనిషికి) అత్యున్నత వినియోగస్థాయితో ముందుగా నిర్ణయించుకొన్న విధంగా దీర్ఘకాలిక జనాభా, సాంకేతిక విజ్ఞానం పెరుగుదల సాధించడమే యీ ఆశయం కావాలి. అభివృద్ధి సాధనకు గల వివిధ వ్యూహాలు అవి భారతదేశానికి ఏ విధంగా ఉపకరిస్తాయో తెలుసుకునే ముందు, పారిశ్రామిక అభివృద్ధికి మన ఆర్థిక వ్యవస్థ ఏ విధంగా సిద్ధమౌతుందో, వ్యూహానికి అవసరమైన వస్తువులను ఎట్లా మలుచుకోగలుగుతుందో తెలుసుకుందాం. వచ్చే కొన్ని పాఠాలలో క్రమాభివృద్ధిని పరిశీలిద్దాం.

BRAOU

---

## మీ అవగాహనను పరీక్షించుకోండి — 2

---

3. అభివృద్ధి వ్యూహం అంటే ఏమిటి?
4. అభివృద్ధి వ్యూహం లక్ష్యాన్ని చేరుకునే మార్గాలు ఏమిటి?
5. భారీ రంగం విస్తరణ వల్ల కలిగే లాభాలను తెలపండి.

## 5.5 సారాంశం/ముగింపు

దీర్ఘకాలికంగా ప్రతిమనిషికి అత్యున్నతమైన జీవన ప్రమాణాన్నీ, పూర్తి ఉద్యోగభృతినీ సాధించడమే అభివృద్ధి లక్ష్యం కావాలి. ఇతర స్వల్పకాలిక లక్ష్యాలు ఈ దీర్ఘకాలిక లక్ష్యానికి వ్యతిరేకంగా వుండకూడదు. ఎంపికచేసుకొన్న లక్ష్యం, ప్రారంభ పరిస్థితులు దృష్టిలో వుంచుకొని, ఆ లక్ష్యసాధనకు అతితక్కువ సమయంలో వీలు కలిగించే అభివృద్ధి వ్యూహాన్ని ఎంచుకోవాలి. ఆ అభివృద్ధి వ్యూహాన్ని తగిన విధంగా రూపొందించు కోవాలి. ప్రణాళికా విధానం ద్వారా ప్రాధాన్యతలను నిర్ణయించుకొని, లక్ష్యాలను చేరుకొనే విధంగా వాటిని అమలుచేయాలి.

పాఠ్య రచయిత్రి: కుమారి ప్రభాపంత్.

## 5.6 సంప్రదింపు గ్రంథాలు


1. Benjamin Higgins : Economic Development
2. Gerald Meier : Leading Issues in Economic Development.
3. Ghosh : Economics of Underdevelopmem.
4. Micheal Todaro : Economic Development and the Third World Countries.
5. తెలుగు అకాడమీ (1972) : ఆర్థికాభివృద్ధి — ప్రణాళికారచనా సిద్ధాంతాలు (పాఠం — 1)
6. తెలుగు అకాడమి (1973) : ఆర్థికాభివృద్ధి — సిద్ధాంతాలు.


BRAOU

## 5.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. *క్రింది ప్రశ్నకు ఒక్కొక్కదానికి సుమారు 30 పంక్తులలో జవాబు రాయండి.*

1. ఆర్థికాభివృద్ధిని సాధించడానికి అవసరమైన కారకాలను లక్ష్యాలను వివరించండి?

II *కింద ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 15 పంక్తులలో జవాబులు రాయండి.*

1. ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా పెరుగుదల రేటు (వృద్ధిరేటు)ను ఒక కారకంగా భావించడంలో ఉన్న పరిమితులేమిటి?
2. ఉద్యోగిత (ఉపాధికల్పన)లో పెరుగుదల ఆర్థికాభివృద్ధికి ఏ విధంగా దోహదం చేస్తుంది?
3. ఆర్థికాభివృద్ధి లక్ష్యాలలో సరియైన ఎంపిక ఏది?
4. సాంఘిక న్యాయం, స్వయం పోషకత్వం అనే భావనలను వివరించండి?

# ఖండం — II

## జాతీయాదాయం, సాంఘిక గణన

జాతీయాదాయం అంటే ఏమిటో ఒక దేశ ఆర్థికాభివృద్ధిని తెలుసుకొనటంలో జాతీయాదాయ ప్రాముఖ్యత ఏమిటో, జాతీయాదాయాన్ని ఏ విధంగా లెక్కిస్తారో తెలుసుకొనవలసిన అవసరం ప్రతి విద్యార్థికి వుంది. అందులోను మన అర్థశాస్త్ర విద్యార్థులం కాబట్టి ఈ విషయాలపై పూర్తి అవగాహన మనకు తప్పనిసరిగా ఉండాలి. అందుకే ఈ ఖణ్డ గ్న పూర్తిగా జాతీయాదాయ విశ్లేషణకు కేటాయించాం. జాతీయాదాయంతో బాటు సాంఘిక గణన పద్ధతులను గూడా చర్చిస్తాం.

ఈ ఖండంలో మూడు భాగాలు :

భాగం — 6 : జాతీయాదాయం — దాని మదింపు

భాగం — 7 : భారతదేశ జాతీయాదాయ అంచనాలు

భాగం — 8 : జాతీయాదాయ ఖాతాలు — సాంఘిక గణన పద్ధతులు

*గమనిక: స్థూల ఆర్థిక విశ్లేషణను చదివేముందు జాతీయాదాయ విశ్లేషణకు సంబంధించిన పరిజ్ఞానాన్ని కలిగి వుండడం ఎంతైనా అవసరం. అందుకే "విశ్లేషణాత్మక అర్థశాస్త్ర" (Course-I) లో స్థూల ఆర్థిక విశ్లేషణను చదివేముందు ఈ ఖండాల్ని చదువండి.*

BRAOU

BRAOU

# భాగం — 6: జాతీయాదాయం—దాని మదింపు

## విషయ క్రమం


6.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
6.1 పరిచయం
6.2 జాతీయాదాయ నిర్వచనం
6.3 ఆదాయ వలయాకార ప్రవాహం
6.4 జాతీయాదాయమదింపు పద్ధతులు
  6.4.1 ఉత్పత్తి మదింపు పద్ధతి
  6.4.2 ఆదాయ మదింపు పద్ధతి
  6.4.3 వ్యయ మదింపు పద్ధతి
6.5 వివిధ ఆదాయ భావనలు
6.6 జాతీయాదాయ గణనలో ఎదురయ్యే సమస్యలు
  6.6.1 ఉత్పాదక కార్యకలాపాల ఎంపిక
  6.2.2 మార్కెట్లోకి రాని ఉత్పత్తి పరిగణన
  6.2.3 అంత్య, మధ్యస్థ వస్తువుల మధ్య భేదం
6.7 వివిధ కాలాల్లోని జాతీయాదాయాన్ని పోల్చడం
6.8 వివిధ దేశాల్లోని జాతీయాదాయాన్ని పోల్చడం
6.9 జాతీయాదాయం, ఆర్థిక సంక్షేమం
6.10 సాధించిన (Actual), సాధించదగిన (Potential) జాతీయాదాయాలు
6.11 సారాంశం/ముగింపు.
6.12 సంప్రదింపు గ్రంథాలు
6.13 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 6.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

జాతీయాదాయానికి సంబంధించిన వివిధ భావనలను, మదింపు పద్ధతులను చర్చించి, జాతీయాదాయ గణనలో ఎదురయ్యే సమస్యలను పరిశీలించడం ఈ పాఠం లక్ష్యం.

BRAOU

## 6.1 పరిచయం

ప్రపంచ దేశాలను సామాన్యంగా సంపన్న దేశాలుగా బీద దేశాలుగా వర్గీకరిస్తూ ఉంటాం. అదే విధంగా కొన్ని దేశాలను త్వరిత గతిని అభివృద్ధి చెందుతున్న దేశాలుగానూ, మరికొన్నింటిని మందగతిలో అభివృద్ధి చెందుతున్న దేశాలుగానూ వర్గీకరిస్తూ ఉంటాం. ఇటువంటి వాక్యాలను (Statements) చేయడానికి సమష్టి ఆర్థిక కార్యకలాపాల స్థాయిని అవగాహన చేసుకోవాలి. కాని ప్రతి ఆర్థిక వ్యవస్థ అనేక రకాల వస్తువుల, సేవల ఉత్పత్తిలో నిమగ్నం కావడం వల్ల క్లిష్టతరమైన రూపాన్ని పొందుతుంది. ఇటువంటి ఆర్థిక వ్యవస్థను సంపూర్ణంగా అవగాహన చేసుకొనడానికి మనకు కొన్ని అభివృద్ధి సూచికలు అవసరం. వాటిలో జాతీయాదాయం ఒక ముఖ్యమైన ప్రమాణం.

జాతీయాదాయం ఒక దేశ ఆదాయాన్ని సూచిస్తుంది. కాని ఈ భావన అంత సులభమైనది కాదు.

ఎందుకంటే వ్యక్తిగత ఆదాయాన్నంతటినీ జాతీయాదాయంగా భావించరాదు. అదే విధంగా జాతీయాదాయంలో కొంత భాగం వ్యక్తులకు సంక్రమించదు. అందుకే జాతీయాదాయ భావనను ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించాలి. జాతీయాదాయ భావనకు దగ్గర సంబంధంగలిగిన భావాలెన్నో ఉన్నాయి. సమష్టి ఆర్థిక కలాపాలపై వివిధ విధానాల ప్రభావాన్ని అర్థం చేసుకొనిడానికి ఈ భావనల జ్ఞానం అవసరం.

## 6.2 నిర్వచనం

జాతీయాదాయాన్ని అంత్యవస్తువు సేవల వార్షిక ప్రవాహపు ద్రవ్యవిలువ అనే నిర్వచనంతో ప్రారంభిద్దాం. ఈ నిర్వచనంలోని కొన్ని అంశాలను ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించాలి. ఈ భావన మూల్యం విలువకు సంబంధించినది. ఒక ఆర్థిక వ్యవస్థలో వైవిధ్యం కలిగిన వస్తు సేవల ఉత్పత్తి జరుగుతుంది. కాబట్టి వాటి భౌతిక పరిమాణాలను కలపడం సాధ్యం కాదు. అందువల్ల వైవిధ్యంతో ఉన్న ఈ ఉత్పత్తులను కలపడానికి ద్రవ్యాన్ని కొలబద్దగా వాడతారు. అంతేకాక జాతీయాదాయం ఒక ప్రవాహ భావన. ఇది నిర్ణీత కాలంలోని ఉత్పత్తిని సూచిస్తుంది. ఈ నిర్ణీత కాలం సాధారణంగా ఒక సంవత్సరంగా ఉంటుంది. దీన్ని బట్టి జాతీయాదాయాన్ని ఒక సంవత్సర కాలంలో ఉత్పత్తి అయ్యే మొత్తం అంత్యవస్తుసేవల ద్రవ్య విలువగా తెలుపవచ్చు. ఈ నిర్వచనంలోని 'అంత్య' అనే పదాన్ని గుర్తుంచుకొనాలి. జాతీయాదాయాన్ని గణించేటప్పుడు ఆ సంవత్సరంలో ఉత్పత్తి అయిన అన్ని వస్తు సేవలను గణనలోనికి తీసుకొనకూడదు. అంత్యవస్తు సేవలను మాత్రమే తీసుకొనాలి. కొన్ని వస్తువులు ఉత్పత్తిలో మధ్యస్థ (Intermediate) వస్తువులుగా ఉపయోగపడతాయి. ఉదాహరణకు రొట్టెల ఉత్పత్తిలో వాడే గోధుమ మధ్యస్థ వస్తువు. రొట్టె అంత్యవస్తువు. అంటే అంత్యవస్తువుల్ని మరల ఉత్పత్తిలో వాడరు. అయితే ప్రతి వస్తువునూ మధ్యస్థ వస్తువు లేదా అంత్యవస్తువుగా విభజించలేము. ఎందుకంటే గోధుమ రొట్టె తయారీలో వాడినపుడు మధ్యస్థ వస్తువు అవుతుంది. కాని అదే గోధుమ వినియోగానికి వాడినపుడు అంత్యవస్తువు అవుతుంది. రొట్టె విలువలో దానిలో వాడిన గోధుమ, పంచదార మొదలైన వస్తువుల విలువలు కలిసి ఉంటాయి. అందుచేత రొట్టె విలువకు గోధుమ, పంచదారల విలువలు కూడ కలిపితే గోధుమ రొట్టెలను రెండు సార్లు లెక్కించినట్లు అవుతుంది. ఈ విధంగా రెండు సార్లు లెక్కించడాన్ని తప్పించడానికి అంత్యవస్తు సేవల విలువలు మాత్రమే లెక్కించాలి.

### మీ అవగాహనను పరీక్షించుకోండి — 1

1. జాతీయాదాయాన్ని నిర్వచించండి.

## 6.3 ఆదాయ వలయాకార ప్రవాహం

నవీన ఆర్థిక వ్యవస్థలు అన్యోన్యంగా ముడిపడిన అనేక సంబంధాలను కలిగి ఉంటాయి. వీటితో ఉత్పత్తి, ఆదాయ వ్యయాల సంబంధాలు అతి ముఖ్యమైనవి. ఈ సంబంధాలు ఆదాయ వలయాకార ప్రవాహాన్ని సూక్ష్మ రూపంలో తెలియజేస్తాయి. ఈ భావనను అవగాహన చేసుకొనడానికి వ్యాపార, కుటుంబ రంగాలుగా మాత్రమే విభజింపబడిన ఒక ఆర్థిక వ్యవస్థను తీసుకొందాం. వ్యాపార రంగం ఉత్పత్తి కారకాలను వినియోగించి వస్తువును అమ్మడానికి ఉత్పత్తి చేస్తుంది. ఉత్పత్తి కారకాలు ఉన్న కుటుంబ రంగం కారకసేవలను వ్యాపార రంగానికి సప్లయ్ చేస్తూ ఆ రంగంలో ఉత్పత్తి అయ్యే వస్తువులను వినియోగిస్తుంది. అందుకనే కుటుంబంలోని వారిని వినియోగదారులని, వ్యాపార రంగంలోని వారిని ఉత్పత్తి దారులని అంటారు. ఈ రెండు రంగాల మధ్య రెండు రకాల లావాదేవీలు (transactions) జరుగుతాయి. కుటుంబరంగం వ్యాపార రంగానికి ఈ కారక

సేవలను అందించి తిరిగి ఆ రంగంలోనే తయారైన వస్తుసేవలను స్వీకరించడం మొదటిది. ఈ ప్రవాహాలు వాస్తవ రూపంలో ఉంటూ మొదటిది రెండవదానికి సరితూగుతుంది ఈ ప్రవాహాలు విజానికి ఆదాయ వ్యయాల రూపంలో జరుగుతాయి. కుటుంబ రంగం వ్యాపార రంగానికి కారక సేవలను అందజేసినందుకు ఆదాయాన్ని పొందుతుంది. ఈ ఆదాయాన్ని వ్యాపార రంగానికి వినియోగ వ్యయరూపంలో తిరిగి ఇచ్చేస్తుంది. ఈ ప్రవాహాలను 1వ పటంలో చూడవచ్చును. ద్రవ్య ప్రవాహాలు వాస్తవిక ప్రవాహాలకు వ్యతిరేక దిశలో పయనిస్తుండడం గమనించవచ్చు. అట్లా జరగడానికి కారణం వ్యాపార రంగం కుటుంబ రంగానికి వస్తు సేవలను అందిస్తూ దానికి బదులుగా కుటుంబ రంగాన్నుండి ద్రవ్యాన్ని స్వీకరించడమే.

పటం – 1: ఆర్థిక కార్యకలాపాల వలయాకార ప్రవాహం



BRAOU

పై విశ్లేషణ సులభమైనదిగా కన్పిస్తుంది, కాని అనేక కారణాల వల్ల వాస్తవిక జగత్తు క్లిష్ట ప్రక్రియలతో ఉంటుంది.

1. దత్త ఆర్థిక వ్యవస్థకు ఇతర ఆర్థిక వ్యవస్థలతో ఎటువంటి సంబంధాలు లేవనే ఊహతో విశ్లేషణ ఉంది. ఇటువంటి ఆర్థిక వ్యవస్థను మూతబడిన ఆర్థిక వ్యవస్థ అంటాము.

2. ప్రభుత్వ వ్యయం, పన్నులు మొదలైన ప్రభుత్వ చర్యలు లేవనే ఊహ మరొకటి.

3. ఉత్పత్తి వ్యాపారం రంగంలో మాత్రమే జరుగుతుందనే ఊహతో విశ్లేషణ జరిగింది. కాని ప్రభుత్వం కూడా ఉత్పత్తి కార్యకలాపాల్లో పాల్గొనవచ్చును.

4. వినియోగదారులు తమ ఆదాయాన్నంతటినీ వినియోగవ్యయానికే వాడతారని ఊహించాం. అంటే కుటుంబ పొదుపు లేదని అర్థం.

5. ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తినంతటినీ అమ్మేస్తారని ఊహించాం. అంటే ఇన్వెంటరీ సంచయనం (inventory accumlation) లేదన్న మాట. ఈ ప్రమేయాలవల్ల ఉత్పత్తి అమ్మకాలకూ ఆదాయం వ్యయానికీ సమానం కావడం ద్వారా వలయం పూర్తవుతుంది. బాహ్యశక్తుల ప్రభావం లేనంతవరకూ ఈ వలయాకార ప్రవాహం సాగుతుంది. కొన్ని ప్రమేయాలను వదలి వేసినప్పటికీ ప్రవాహపు మూల యంత్రాంగం యధాతథంగా ఉంటుంది.

పటం — 2: ఆర్థిక కార్యకలాపాల వలయాకార ప్రవాహం




BRAOU

ఉత్పత్తి కార్యకలాపాలను చేపట్టని ప్రభుత్వ రంగాన్ని ప్రవేశ పెట్టినా కుటుంబ రంగం పొదుపు చేస్తోందని భావించినా పై సంబంధాలు క్లిష్టమౌతాయి. వీటిని రెండవ పటంలో చూపించాం. ఈ కొత్త పరిస్థితిలో కుటుంబ పొదుపు వ్యాపార రంగానికి పెట్టుబడి అవుతుంది. ప్రభుత్వం వసూలు చేసే పన్నులలో కొంత భాగం కుటుంబ రంగానికి మరి కొంత భాగం వ్యాపార రంగానికి చేరుతుంది.

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 2

2. ఆదాయ వలయాకార ప్రవాహం అనుభావనను తెల్పండి.

## 6.4 జాతీయాదాయ మదింపు పద్ధతులు

ఆదాయ వలయాకార ప్రవాహాన్ని మూడు విధాలుగా చూడవచ్చు. ఉత్పత్తి ఆదాయాన్ని కలుగజేస్తుంది. ఆదాయం వ్యయానికి దారి తీస్తుంది. కాబట్టి జాతీయాదాయాన్ని ఉత్పత్తి దశలోగాని, ఆదాయదశలోకాని, వ్యయదశలోగాని గణించవచ్చును. ఈ మూడు దశలలో గణన ఒకే అంచనా నిస్తుంది. ఈ మూడు విధాలైన గణనకు ఉత్పత్తి, ఆదాయ, వ్యయ మదింపు పద్ధతులని పేరు.

### 6.4.1 ఉత్పత్తి మదింపు పద్ధతి

నవీన ఆర్థిక వ్యవస్థలో రొట్టె, వస్త్రాలు, కుర్చీలు మొదలైన ఎన్నో రకాల వస్తువులూ, వైద్యం, న్యాయం, విద్యవంటి సేవలూ, గృహకృత్యాల వంటి సేవలతో కూడిన వివిధ వస్తువుల ఉత్పత్తి ఉంటుంది. ఒక నిర్ణీత సంవత్సరంలో సాధించిన ఈ అంత్యవస్తు సేవల పరిమాణాన్ని $Q_1, Q_2, \ldots\ldots Q_n$ లతోను, వీటి ధరలను వరుసగా $P_1, P_2, \ldots\ldots P_n$ లతోను సూచిద్దాం. ఇప్పుడు ఉత్పత్తి పద్ధతి ప్రకారం జాతీయాదాయ పరిమాణం మార్కెటు ధరలతో లెక్కించబడిన ఈ అంతిమ వస్తు సేవల వార్షిక పరిమాణ మొత్తం విలువకు సమానంగా ఉంటుంది.

$$\text{జాతీయాదాయం} = P_1Q_1 + P_2Q_2 + P_nQ_n$$

$$= \sum_{i=1}^{n} P_iQ_i$$

### 6.4.2 ఆదాయ మదింపు పద్ధతి

ఈ పద్ధతి ప్రకారం అంత్యవస్తువుల ఉత్పత్తి వల్ల కారకాలు సంపాదన మొత్తం విలువను గణించి జాతీయాదాయాన్ని అంచనా వేస్తాం. ఒక అంత్యవస్తువు విలువ కారక ఆదాయాలైన భాటకం, వేతనాలు, వడ్డీ, లాభాలలో ప్రతిబింబిస్తుంది. కాబట్టి ఉత్పత్తి కారకాలు సంపాదించిన ఈ ఆదాయాలను అన్ని వస్తుసేవలకు మొత్తం చేస్తే జాతీయాదాయం వస్తుంది?

$$P_1Q_1 -+ P_2Q_2\ P_nQ_n$$

$$= W_1 + W_2 \ldots\ldots W_n) = R_1 + R_2 \ldots\ldots R_n) = I_1 + I_2 \ldots\ldots I_n) = P_1 + P_2 \ldots\ldots P_n)$$

$R_i, W_i, I_i, P_i$ లు వరుసగా i వస్తువు ఉత్పాదనలో సంభవించిన భాటకం, వేతనాలు, వడ్డీ, లాభాలను తెలియజేస్తాయి.

### 6.4.3 వ్యయ మదింపు పద్ధతి

అంత్య వస్తువుల మీద పెట్టిన వ్యయాలను అన్నిటికీ కలిపి కూడా జాతీయాదాయాన్ని గణించవచ్చు. ఈ పద్ధతి ప్రకారం మూడు ప్రధాన రంగాలైన గృహ, వ్యాపార, ప్రభుత్వ రంగాలలోని అంత్య వస్తుసేవలమీద చేసిన వ్యయాలు మొత్తం లెక్కలోకి వస్తుంది.

ఈ మూడు పద్ధతులూ సర్వ సమానమైన ఫలితాల నిస్తాయి. ఈ విషయం వలయాకార ప్రవాహపటం నుండి కూడా విదితమే. ఉత్పత్తి వ్యయ పద్ధతుల ననుసరించినపుడు వలయాకార ప్రవాహంలోని పై సగభాగాన్ని లెక్కిస్తున్నాము. ఆదాయ పద్ధతి ననుసరించి నపుడు వలయాకార ప్రవాహంలోని కింది సగభాగంలోని వలయాకార ప్రవాహాన్ని లెక్కిస్తున్నాము.

BRAOU

## మీ అవగాహనను పరీక్షించుకోండి — 3

3. జాతీయాదాయ మదింపు పద్ధతులు ఏవి ?

## 6.5 వివిధ ఆదాయ భావనలు

పై చర్చనుండి జాతీయాదాయం విలువద్వారా నే వ్యక్తమవుతోందని తెలుస్తోంది. అయితే ఆదాయాన్ని అంచనావేయడానికి ధరలను వాడాలి. ఈ సందర్భంలో రెండు రకాలైన ధరలను గురించి తెలుసుకోవాలి. ఒక రకం ధరలు మార్కెటులోని ధరలను తెలుపుతాయి. వీటిని మార్కెటు ధరలు అంటారు. ఈ ధరలలో ఉత్పత్తిలో వాడిన మధ్యగత వస్తువుమీద అయిన వ్యయం, ప్రాథమిక కారకాలైన భూమి, కూలి, మూలధనం, వ్యవస్థాపనలకు చెల్లింపులు, పరోక్ష పన్నులు, సబ్సిడీలు ఇమిడి ఉంటాయి. ఈ మార్కెటు ధరలను వాడి ఆదాయాన్ని అంచనా వేస్తే దీనిని మార్కెటు ధరలో జాతీయాదాయం అంటారు.

మార్కెటు ధర నుండి నికర పరోక్ష పన్నులను (అనగా పరోక్ష పన్నుల నుండి సబ్సిడీలను తీయగా మిగిలిన మొత్తం) తీసి వేస్తే వచ్చే ధరలను కారక వ్యయం అంటారు. వీటిని గూడా ఉపయోగించి జాతీయాదాయాన్ని గణించవచ్చు. దీనిని బట్టి మార్కెటు ధరల, కారకాల వ్యయం ద్వారా గణించిన జాతీయాదాయాల తేడా నికర పరోక్ష పన్నుల మొత్తాలకు సమానమని స్పష్టమవుతుంది.

నికర పరోక్ష పన్నులు = మార్కెటు ధరల్లో జాతీయాదాయం — కారక వ్యయంలో జాతీయాదాయం.

మార్కెటు ధరల్లో జాతీయాదాయం = కారక వ్యయంలో జాతీయాదాయం + నికర పరోక్ష పన్నులు

కారక వ్యయంలో జాతీయాదాయం = మార్కెటు ధరల్లో జాతీయాదాయం — నికర పరోక్ష పన్నులు

జాతీయాదాయ విశ్లేషణలో స్థూల, నికర ఆదాయా లనే మరొక తేడా ఉంది. ఉత్పత్తి కారకాల ఆదాయాల మొత్తం జాతీయాదాయం అవుతుందని తెలుసుకొన్నాం. ఉత్పత్తి కారకాలలో ఒకటి మూల ధనం. ఉత్పత్తి ప్రక్రియలో మూలధనంలోని కొంత భాగం ఖర్చయిపోతుంది. దీనినే తరుగుదల అంటారు. మూలధన స్థాయిని నిల్పుకోవాలంటే ఖర్చయిన మూలధనం మేరకు పెట్టుబడి పెట్టాలి. అందుకే జాతీయాదాయంనుండి ఈ తరుగుదలను తగ్గించడం పరిపాటి. ఇలా తగ్గించగా వచ్చిన దానిని 'నికరజాతీయాదాయం' అంటారు. తరుగు తగ్గించబడనపుడు స్థూల జాతీయాదాయం వస్తుంది. కనుక స్థూల, నికర జాతీయాదాయాల వ్యత్యాసం తరుగుదల అవుతుంది.

స్థూల జాతీయాదాయం = నికరజాతీయాదాయం — తరుగుదల

ఆదాయానికి చెందిన మరో రెండు భావన లున్నాయి. ఒక భావన దేశీయాదాయాన్ని (domestic income) మరొకటి జాతీయాదాయాన్ని తెలుపుతాయి. దేశీయాదాయం దేశంలో ఉత్పత్తి అయిన ఆదాయాన్నంతటినీ తెలుపుతుంది. ఇది దేశ భౌగోళిక హద్దులలో ఉత్పత్తి అయిన ఆదాయాన్ని తెలుపుతుంది. కాని కారకాల యాజమాన్యం మరో దేశం వారికి చెందినపుడు ఆ మేరకు ఆదాయంలోని భాగం ఇతర దేశాలకు చెందుతుంది. ఇదే మాదిరిగా ఇతర దేశాల్లోని కారకాల యాజమాన్యం దత్త దేశానికి చెందవచ్చు. ఆ మేరకు ఆదాయం కూడా ఈ దేశానికి చెందుతుంది. ఇతర దేశాల నుండి ఈ దేశానికి వచ్చిన ఆదాయం నుంచి ఈ

దేశం నుంచి ఇతర దేశాలకు పోయిన ఆదాయాన్ని తీసివేస్తే విదేశాలనుంచి వచ్చిన కారకాల నికరాదాయం వస్తుంది. దీన్ని దేశీయాదాయానికి కలిపితే జాతీయాదాయం వస్తుంది. పై తేడాలనుంచి జాతీయాదాయంలో 8 భావనలను గుర్తించవచ్చు.

| 'ఎ' రకం | 'బి' రకం |
|---|---|
| **మొదటి విధానం** | |
| 1. మార్కెటు ధరల్లో స్థూల జాతీయ ఉత్పత్తి | 1. మార్కెటు ధరల్లో స్థూల దేశీయ ఉత్పత్తి |
| 2. మార్కెటు ధరల్లో నికర జాతీయ ఉత్పత్తి | 2. మార్కెటు ధరల్లో నికర దేశీయ ఉత్పత్తి |
| **రెండో విధానం** | |
| 1. కారకవ్యయంలో స్థూల జాతీయఉత్పత్తి | 1. కారక వ్యయంలో స్థూల దేశీయ ఉత్పత్తి |
| 2. కారక వ్యయంలో నికర జాతీయ ఉత్పత్తి | 2. కారక వ్యయంలో నికర దేశీయ ఉత్పత్తి |

'ఎ', 'బి' రకాల తేడా విదేశాలనుండి వచ్చిన నికర కారక ఆదాయానికి సమానం. రెండు విధాలైన ఆదాయాల తేడా నికర పరోక్ష పన్నులకు సమానం. ప్రతి విధానంలోని రెండు భావనల తేడా తరుగుకు సమానం.

పైన చర్చించిన ఎనిమిది జాతీయాదాయ భావనలు గృహరంగానికి లభించే ఆదాయాన్ని తెలియజేయవు. ఉత్పత్తి కారకాలకు లభించే ఆదాయంలో కొంత భాగం కారకాల యజమానులకు చెల్లింపబడదు. ఉదాహరణకు కార్పొరేటు పన్నులు, పంచబడని లాభాలు కారక యజమానుల ఆదాయంలో భాగంకాదు. ఇదే మాదిరిగా వ్యక్తులకు లభించే ఆదాయంలో కొంత భాగం ఆ సంవత్సరంలో అందజేసిన సేవల ప్రతిఫలం కాకపోవచ్చు. కానుకలు, పింఛనులు, విముక్తి (relief) చెల్లింపులు అంటారు. జాతీయాదాయం నుండి గృహరంగానికి లభించిన కారకాల ఆదాయాలను తీసివేసి, బదిలీ చెల్లింపుల్ని కలిపితే వ్యక్తిగత ఆదాయం వస్తుంది.

వ్యక్తిగత ఆదాయం = కారక వ్యయంలో నికర జాతీయాదాయం — పంపకం కాని లాభాలు — కార్పొరేటు పన్నులు + బదిలీ చెల్లింపులు.

వ్యక్తులు పొందిన ఆదాయాన్నంతటినీ వారు వాడుకోలేరు కాబట్టి మరొక భావన ఏర్పడుతూంది. వ్యక్తులు ఆదాయాన్నుండి వ్యక్తిగత పన్నులను చెల్లించవలసి ఉండటమే దీనికి కారణం. వ్యక్తిగత ఆదాయం నుండి వ్యక్తిగత పన్నుల్ని తగ్గిస్తే దాన్ని వ్యయార్హమైన ఆదాయం అంటారు. దీన్ని వినియోగం, పొదుపు అనే రెండు ప్రయోజనాలకు వాడతారు.

వ్యయార్హమైన ఆదాయం = వ్యక్తిగత ఆదాయం — వ్యక్తిగత పన్నులు

లేదా

వ్యయార్హ ఆదాయం = వినియోగం — + పొదుపు

### మీ అవగాహనను పరీక్షించుకొండి — 4

4. మార్కెటు ధరలలో జాతీయాదాయాన్ని నిర్వచించండి.
5. తరుగుదల అంటే ఏమిటి?
6. వ్యక్తిగత, వ్యయార్హ ఆదాయాలను వివరించండి.



BRAOU

## 6.6 జాతీయాదాయ గణనలో ఎదురయ్యే సమస్యలు

జాతీయాదాయాన్ని గణించేటప్పుడు ఎన్నో భావనాపరమైన చిక్కులు ఎదురౌతాయి. ఉత్పాదక కార్యకలాపాల ఎంపికలోనూ, ద్రవ్యీకరణ కాని ఉత్పత్తిని, విలువను తెలుసుకొనేటప్పుడూ మధ్యస్థ వస్తువులనుండి అంత్యవస్తువులను వేరుపరచేటప్పుడూ ఈ చిక్కులు ఎదురౌతాయి. ఈ మూడింటిని గూర్చి సంగ్రహంగా చర్చిద్దాం.

### 6.6.1 ఉత్పాదక కార్యకలాపాల ఎంపిక

జాతీయాదాయాన్ని గణించడానికి ముందు లెక్కలోనికి తీసుకోవలసిన ఉత్పాదక కార్యకలాపాలను ఎంచుకోవాలవడంలో ఒక సౌలభ్యం ఉంది. అరుదైన వనరులను వాడి వ్యక్తుల కోరికలను తీర్చేవస్తుసేవలను తయారుచేయడమే ఉత్పాదక కార్యకలాపమని నిర్వచించవచ్చు. అయితే వ్యక్తుల కోరికలను తీర్చే అన్ని కార్యకలాపాలను ఇందులో చేర్చడానికి వీలు లేదు. ఎందుకంటే ఇలా చేరిస్తే అది అర్థరహితమైన గణనకు దారితీస్తుంది. కాబట్టి ఉత్పాదక కార్యకలాపాలుగా వేటిని పరిగణించాలో, జాతీయాదాయ గణననుంచి వేటిని వదిలివేయాలో తెలుసుకొనడం అవసరం.

మార్కెట్లో మార్పిడికి లోనయ్యే వస్తుసేవల ఉత్పత్తి కార్యకలాపాలన్నిటినీ జాతీయాదాయ గణనలో లెక్కలోని తీసుకొనాలి అనేది ఒక సామాన్య సూత్రం. కాని అభివృద్ధి చెందిన దేశాలనుంచి వెనుకబడిన దేశాలకు దృష్టిని మరల్చినపుడు ఉత్పాదక, అనుత్పాదక కార్యకలాపాలను వేరుచేయడానికి మార్కెటు వ్యవస్థ తన స్థానాన్ని కోల్పోతుంది. అలాగే ఉత్పత్తి కార్యకలాపాలు గృహ వ్యవస్థలో జరుగుతూ, వస్తువులు సొంత వినియోగానికి ఉత్పత్తి అయినప్పుడు కూడా మార్కెటు యంత్రాంగం ఆధారంగా ఉత్పాదక కార్యకలాపాలను, అనుత్పాదక కార్యకలాపాలనుండి వేరు చేయలేము.

ఉత్పాదక అనుత్పాదక కార్యకలాపాల విభజన సంప్రదాయానుసారంగా ఏర్పడినదే కాని తార్కికమైనది కాదు. ఉదాహరణకు ఒక కుర్రవాడు తన తండ్రి నుంచి చిల్లర ఖర్చులకోసం డబ్బు తీసుకొంటూ, దానికి బదులుగా సైకిలును శుభ్రం చేయడం వంటి సేవలను అందించాడనుకొందాం. ఈ సేవలు గృహానికే పరిమితమయినందువల్ల జాతీయాదాయ గణనలోనికి రాదు. ఇలా కాకుండా ఆ కుర్రవాడు వార్తా పత్రికలను పంపిణీ చేస్తే అతని సేవలు జాతీయాదాయంలోకి వస్తాయి.

ఈ విధంగా గృహసేవలను వదిలివేయడం ఎంతో వివాదానికి దారి తీస్తుంది. సాంప్రదాయానుసారంగా గృహిణుల సేవలు జాతీయాదాయంలో కలవటం లేదు. కాని వంటపని వారల సేవలు మాత్రం జాతీయాదాయంలో భాగమవుతున్నాయి. ఈ సంప్రదాయంవల్ల ఒక వంట మనిషి గృహిణిగా మారితే జాతీయాదాయం తగ్గినట్లు కనబడుతుంది. అలాగే కొంతమంది గృహిణులు ఒకరి ఇంట్లో మరొకరు వంటచేసే ఒడంబడిక చేసుకొంటే జాతీయాదాయం తగ్గినట్లు కనబడుతుంది. పై రెండు సందర్భాలలోనూ ఆర్థిక వ్యవస్థ సాలుసరి ఉత్పత్తిలో ఎటువంటి మార్పు లేదు. గృహకార్యకలాపాలన్నింటిని వదిలి వేయడమనే పద్ధతి సాంప్రదాయకమైనదే కాని తార్కికం కాదు. అంతేకాక ఒక దేశ సాంఘిక, సాంస్కృతిక నిర్మాణాన్నిబట్టి గృహిణుల సేవలలో గణనీయమైన మార్పు రానంతవరకు ఈ అంశాన్ని చేర్చినా వదిలినా ఒక్కటే. కాని వివిధ దేశాల జాతీయాదాయాలను పోల్చేటప్పుడుగానీ, దీర్ఘకాలంలో ఒక దేశ జాతీయాదాయాన్ని పరిశీలించేటప్పుడు కానీ ఇబ్బందులు ఎదురౌతాయి.

### 6.6.2 మార్కెటులోనికి రాని ఉత్పత్తి పరిగణన

మార్కెటు కార్యకలాపాలనే జాతీయాదాయంలో చేర్చాలనేది ఒక విస్తృత సూత్రం మాత్రమే. దీనికి కొన్ని మినహాయింపు లున్నాయి. కొన్ని సందర్భాల్లో మార్కెట్లోకి రాని ఉత్పత్తి కూడ జాతీయాదాయంలో భాగమవుతుంది. ఉదాహరణకు చిన్న కారు, సన్నకారు రైతులు తమ ఉత్పత్తిలో అధిక భాగాన్ని సొంత



BRAOU

వినియోగానికి వాడుకొంటారు. కాని దీన్ని జాతీయాదాయంలో చేరుస్తారు. ఇదే విధంగా స్వగృహంలో నివసించే వారి గృహాల అద్దె విలువకూడా జాతీయాదాయంలో చేరుతుంది. కాని మూలధన లాభనష్టాలు (capital gains and losses) జాతీయాదాయంలో చేర్చరు. మార్కెటులోకి రాని ఉత్పత్తిని గురించి ఏర్పడే వివాదం– దాన్ని జాతీయాదాయంలో చేర్చాలా, వదలి వేయాలా అనే విషయాన్ని బట్టి కాక వీటి విలువ నిర్ణయించడానికి ఏ గణాంక పద్ధతులను వాడాలి అనే దాన్ని బట్టి ఉంటుంది.

### 6.6.3 అంత్య, మధ్యస్థ వస్తువుల భేదం

ఉత్పాదక కార్యకలాపంలో ఎన్నో వస్తుసేవల ఉత్పత్తి జరుగుతుంది. వాటన్నిటి విలువను కలిపితే రెండు సార్లు లెక్కించినట్లు అవుతుంది. అందుకనే అంత్య, మధ్యస్థ వస్తువుల తేడా తెలుసుకొనడం అవసరం, అంత్యవస్తువుల విలువలో మధ్యస్థ వస్తువుల విలువకూడా ఇమిడి ఉంటుంది. కనుక మధ్యస్థ వస్తువు లన్నిటిని లెక్కలోనికి తీసుకొన్నట్టయితే రెండు సార్లు లెక్కించి నట్టవుతుంది. కనుక అంత్య వస్తువుల విలువను మాత్రమే జాతీయాదాయ అంచనాలో వాడాలి. ఈ సందర్భంలో ఎదుర్యే ముఖ్యమైన ఇబ్బంది అంత్యమధ్యస్థ వస్తువులను విడదీయడానికి సంబంధించినది. ఉదాహరణకు గృహావసరాలకు వాడనంతవరకు బొగ్గును అంత్యవస్తువుగానే పరగణించాలి. కాని ఉక్కు ఉత్పత్తిలో ఉపయోగించే బొగ్గు మధ్యస్థ వస్తువు అవుతుంది. కాబట్టి వస్తువులను మధ్యస్థ, అంత్య అని విభజించే బదులు మూల్య పద్ధతి (value added method) ని ఉపయోగించవచ్చు. ఉత్పత్తి విలువనుంచి ముడి సరకుల ఉత్పాదకాల విలువను తగ్గిస్తే మూల్యం వస్తుంది. ఒక నిర్ణీత స్థాయిలోని ఉత్పత్తి మూల్యం ఆ స్థాయిలో ఉత్పత్తి కారకాలు మొత్తం విలువకు ఎంత అందజేస్తాయో తెలియజేస్తుంది. కాబట్టి ఇది ఆ స్థాయిలో ఉత్పత్తి కారకాలు సంపాదించిన భాటకం, వేతనాలు, వడ్డీ, లాభాల మొత్తం అవుతుంది. ఒక చిన్న ఉదాహరణను తీసుకుంటే ఈ భావన సులభంగా అర్థమవుతుంది. రొట్టె తయారీని తీసుకొందాం. దీనిలో పిండి మధ్యస్థ వస్తువు. పిండి గోధుమ నుండి వస్తుందనేది విదితమే. మూల్య పద్ధతి ప్రకారం ఈ మూడు ఉత్పత్తి స్థాయిలను అంటే గోధుమ, పిండి, రొట్టెలను తీసుకొని ప్రతీ స్థాయిలో మూల్యాన్ని లెక్కిస్తాం. ఈ మూల్యాల మొత్తం అంత్య వస్తువు విలువకు సరిగా సరిపోతుంది. ఈ క్రింది పట్టికలో ఇచ్చిన సమాచారాన్ని చూడండి.

| ఉత్పత్తి స్థాయి (రు.లలో) | ఉత్పత్తి విలువ (రు.లలో) | మధ్యస్థ వస్తువులపై వ్యయం (రు.లలో) | అదనపు విలువ |
|---|---|---|---|
| గోధుమ | 80 | 0 | 80 |
| పిండి | 90 | 80 | 10 |
| రొట్టె | 200 | 90 | 110 |
| మొత్తం | 370 | 170 | 200 |

BRAOU

అంత్యవస్తువు రొట్టె విలువ రు. 200. దీన్ని వివిధ స్థాయిలలోని ఉత్పత్తి మూల్యాన్ని వేయడం ద్వారా కూడా సాధించవచ్చు. గోధుమ ఉత్పత్తిలో మూల్య విలువ రు. 80, పిండి స్థాయిలో రు. 10 రొట్టె స్థాయిలో రు. 110 అని గమనించవచ్చు. వీటి మొత్తం రు.లు 200 అవుతుంది. 6.7 వివిధ కాలాల్లోని జాతీయాదాయాన్ని పోల్చడం.

జాతీయాదాయం విలువలోనే వ్యక్తమవుతుంది. ధరలు తరచు మారుతూ వుంటాయి. అందుచేత ఒక సంవత్సరం జాతీయాదాయంతో పోల్చడం కష్టం. ధరలు పెరుగుతున్నప్పుడు జాతీయాదాయంలోని ఉత్పత్తి కార్యకలాపాల పెరుగుదల వల్లనైనా కావచ్చు లేదా రెండింటివల్లనైనా కావచ్చు. ఈ ఇబ్బందిని ఎదుర్కొనడానికి

జాతీయాదాయాన్ని రెండు విధాలుగా లెక్కిస్తారు. దీన్ని ప్రస్తుత ధరల (Current Price) లో జాతీయాదాయం అంటారు. రెండవ పద్ధతిలో ఒక నిర్ణీత సంవత్సరంలోని ధరలను ఉపయోగించి జాతీయాదాయాన్ని లెక్కిస్తారు. దీన్ని స్థిర ధరల (Constant Price) లో జాతీయాదాయం అంటారు. దీన్నే వాస్తవిక జాతీయాదాయం అని కూడా అంటారు. జాతీయాదాయాన్ని కాలానుగతంగా పోల్చడానికి వాస్తవ జాతీయాదాయాన్ని వాడాలి. ప్రస్తుత ధరలోని జాతీయాదాయాన్ని ధరల సూచికతో డిఫ్లేట్ (Diflate) చేసి వాస్తవ జాతీయాదాయాన్ని పొందవచ్చు. వివిధ వస్తువుల ధరలకు వాటి ప్రాముఖ్యాన్ని అనుసరించి తూకం ప్రకారం సరాసరి కలిపితే ధరల సూచిక వస్తుంది. ఒక ఆర్థిక వ్యవస్థలో ఆహారం, బట్ట అనే రెండే రెండు వస్తువులు ఉత్పత్తి అయ్యాయనుకొందాం. అంతేకాక మొత్తం ఉత్పత్తిలో ఆహారం విలువ 60 శాతం, బట్టల విలువ 40శాతం అనుకొందాం. అంతేకాక ఆహారం ధరకు రు. 5 నుంచి రు10 కి, బట్టధర రు. 15 నుంచి రు. 20 కి పెరిగిందనుకొందాం. ఇప్పుడు ఆధార సంవత్సరంలో సమష్టి ధర 0.6 × 5 + 0.4 × 15 = రు. 90 అవుతుంది. ఆధార సంవత్సరంలో సమిష్టి ధర 0.6 × 10 + 0.4 × 20 = 14రు.లకు పెరిగింది. ఇప్పుడు ఆధార సంవత్సరంలో ధరను రు.లు 100 గా తీసుకొందాం. ప్రస్తుత సంవత్సరంలో ధర రు. 155.50 అవుతుంది. దీనినే ధరల సూచిక అంటాము. ప్రస్తుత ధరలతో జాతీయాదాయం ధరల సూచికను ఇస్తే వాస్తవ జాతీయాదాయాన్ని ఈ క్రింది సూత్రంతో సాధించవచ్చును.

వాస్తవ జాతీయాదాయం = ప్రస్తుత జాతీయాదాయం/ధరల సూచిక

ఈ కింది పట్టికలోని ఉదాహరణను చూడండి.

| సంవత్సరం | ప్రస్తుత ధరలలో నికర దేశీయ ఉత్పత్తి కోట్ల రు. లో | ధరల సూచిక | స్థిరధర లో నికర జాతీయ ఉత్పత్తి (1970 71) |
|---|---|---|---|
| 1970 71 | 34235 | 100.00 | 34235 |
| 1980 81 | 104201 | 220.71 | 47211 |

BRAOU

## మీ అవగాహనను పరీక్షించుకొండి — 5

7. నిజ (వాస్తవం) జాతీయాదాయం అంటే ఏమిటి?

## 6.8 వివిధ దేశాల్లోని జాతీయాదాయాన్ని పోల్చడం

వివిధ దేశాల జాతీయాదాయలను పోల్చడంలోని ముఖ్యోద్దేశం ఆ దేశాల మధ్య జీవన స్థాయిలలోను వ్యత్యాసాలను తెలుసుకొనడమే. కాని ఇలా పోల్చడంలో చాలా సమస్యలు ఎదురౌతాయి. ఆర్థిక కార్యకలాపాల పరిధిలో ఒక దేశానికి మరొక దేశానికి తేడా ఉండవచ్చు. ఉదాహరణకు మార్కెట్లోకి రాని కార్యకలాపాల పరిధి వివిధ దేశాల మధ్య భిన్నంగా వుంటుంది. అభివృద్ధి చెందిన దేశంలో మోటారు వాహనాలను నడపడం, ఇళ్ళకు రంగులు వేయడం, సామాగ్రిని బాగు చేయడం, బట్టలు కుట్టడం వంటి సేవలు ఇంట్లోని సభ్యులే చేసుకొంటారు. కాని అర్ధ భూస్వామ్య విధానం అమలులో ఉన్న వెనుకబడిన దేశాల్లో ఇలా ఉండదు. మరొక

ఇబ్బందేమంటే వివిధ దేశాల కరెన్సీలు వేర్వేరుగా ఉంటాయి. కనుక వాటిని సామాన్య ద్రవ్య ఆధారానికి (Common monetary basis) మార్చాలి. సాధారణంగా ఇందుకు మారకపు రేటు ఉంటుంది. అయితే మారకపు రేటు రెండు కరెన్సీల మధ్య నిజమైన మారకపు విలువను ప్రతిబింబించక పోవచ్చు. మారకపు విలువకు బదులుగా రెండు దేశాలకు ఒకే ధరను వాడి జాతీయాదాయాన్ని లెక్కించవచ్చు. అయితే దానిలో ఆచరణాత్మక ఇబ్బందులు ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనవి ఒక దేశంలో ఉత్పత్తి అయిన కొన్ని వస్తువులు మరొక దేశంలో ఉత్పత్తి కాకపోవడం, ఒక దేశంలో తయారయిన వస్తువుల నాణ్యతకు మరొక దేశంలో తయారయిన వస్తువుల నాణ్యతకు తేడాలు ఉండడం మొదలైనవి.

## 6.9 జాతీయాదాయం — ఆర్థిక సంక్షేమం

జాతీయాదాయాన్ని గణించడంలోని ముఖ్యోద్దేశం సమష్టి ఆర్థిక కార్యకలాపాలకు సరియైన సూచికను తయారు చేయడమే. అయినప్పటికీ శ్రేయస్సును లెక్కించడానికి కూడా దీన్ని వాడతారు. అధిక జాతీయాదాయం అనేది శ్రేయస్సును తెలియజేస్తుందంటారు. కాని ఇది సరికాదు. స్థూల జాతీయోత్పత్తిలో సంక్షేమాన్ని తెలియజేయని కొన్ని అంశాలు చేరి ఉన్నాయి. అలాగే సంక్షేమాన్ని తెలియజేసే అంశాలు కొన్ని ఇందులో ఉండవు. కాబట్టి జాతీయాదాయానికి కొన్ని చేర్పులు, తగ్గింపులు చేస్తే కాని సంక్షేమ గణన పొందలేము. ఉదాహరణకు విశ్రాంతి విలువను స్థూల జాతీయోత్పత్తిలో చేర్చరు. వ్యక్తులకు వస్తు వినియోగం వల్లనే గాక వారు పొందిన విశ్రాంతి నుండి కూడా కొంత సంతృప్తి వస్తుంది. విశ్రాంతిలో గణనీయమైన తగ్గుదల వల్ల స్థూల జాతీయోత్పత్తిలో కొద్దిపాటి పెరుగుదల వచ్చినప్పుడు సంక్షేమం పెరిగిందని చెప్పడం కష్టం. విశ్రాంతి విలువను కూడా జాతీయాదాయానికి కలిపినప్పుడు ఈ సమస్య తల ఎత్తదు. మార్కెట్లోకి రాని తోటపని, సామాన్లు బాగు చేయడం వంటి వ్యక్తిగత సేవలు జాతీయాదాయంలో చేరవు. కనుక సంక్షేమ గణనలో వీటిని ప్రత్యేకంగా చేర్చుకోవాలి.

పై చేర్పుల మాదిరిగానే జాతీయాదాయం నుంచి కొన్ని తగ్గింపులు కూడా ఉంటాయి. జాతీయాదాయ గణనలో తీసుకొన్న ఉత్పత్తి సాధనలో ఏర్పడ్డ దుష్ఫలితాలను జాతీయాదాయం నుంచి తగ్గించక పోవడం వల్ల ఈ తగ్గింపులు అవసరమౌతాయి. ఉదాహరణకు పారిశ్రామిక ఉత్పత్తి వల్ల కలిగే వాతావరణ కాలుష్యాన్ని తీసుకొందాం. ఈ కాలుష్య వ్యయం జాతీయాదాయ గణనలోకి తీసుకోరు. ఆర్థిక సంక్షేమాన్ని గణించేటప్పుడు ఈ వ్యయాలను కూడా లెక్కలోకి తీసుకోవాలి. ప్రయాణ సౌకర్యాలను ఏర్పాటు చేయవలసి వస్తుంది. ఇవి ప్రజల సంక్షేమాన్ని పెంచవు. కాబట్టి ఆర్థిక శ్రేయస్సును గణించేటప్పుడు ఈ వ్యయాలను మినహాయించాలి.

## 6.10 సాధించిన (Actual), , సాధించదగిన (Potential) జాతీయాదాయాలు

జాతీయాదాయ గణన సాధించిన ఆదాయాన్ని మాత్రమే తెలియజేస్తుంది. కాని సాధించదగిన లేదా పరిపూర్ణ ఉద్యోగిత స్థాయి ఆదాయం కూడా ముఖ్యమైన భావనే. శ్రామికులు, పారిశ్రామిక సామర్థ్యం పూర్తిగా వాడినప్పుడు వచ్చే ఆదాయాన్ని సాధించదగిన ఆదాయంగా నిర్వచిస్తాము. సంపూర్ణ ఉద్యోగిత అంటే మాటికి నూరుపాళ్లు ఉద్యోగితను సాధించడం కాదు. అనుకూలమైన కాలంలోకూడా కొందరు పనివారు ఉద్యోగాలను మార్చుకొంటూ ఉంటారు. ఈ సందర్భంలో మరొక ఉద్యోగం లభించే వరకూ వారు నిరుద్యోగులుగా ఉంటారు. దీనిని సంఘృష్ట నిరుద్యోగిత (frictional unemployment)అంటారు. సాధారణంగా 96 నుండి 97 శాతం వరకూ శ్రామిక శక్తి ఉద్యోగాలను సాధించి, పరిశ్రమలు 90 నుండి 95 శాతం వరకు తమ సామర్థ్యాన్ని వినియోగిస్తే పరిపూర్ణ ఉద్యోగిత, సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకొన్నట్లే భావించాలి. తగిన

గిరాకీ లేకపోవడం వల్ల సాధించిన ఉత్పత్తి సాధించదగిన ఉత్పత్తి కంటె తక్కువగా ఉండి నిరుద్యోగిత, అనుపయోగశక్తి (idle capacity)సంభవిస్తాయి. సాధించదగిన, సాధించిన జాతీయాదాయాల మధ్యగల తేడా ఆర్థిక మాంద్యాన్ని తెలియజేస్తుంది.

## మీ అవగాహనను పరీక్షించుకొండి — 6

8. సంపూర్ణ ఉద్యోగితాస్థాయి ఆదాయం అంటే ఏమిటి?

## 6.11 సారాంశం/ముగింపు

జాతీయాదాయ భావన సమష్టి ఆర్థిక కార్యకలాపాన్ని గణించడానికి ఉపకరిస్తుంది. ఈ భావన ప్రావాహిక మైనది. కాబట్టి కాలానికి సంబంధించినది. సామాన్యంగా జాతీయాదాయం ఒక సంవత్సరానికి సంబంధించి ఉంటుంది. మూల్యమనే భావన అంత్యవస్తు సేవలను లెక్కలోకి రాకుండా చేస్తుంది. జాతీయాదాయాన్ని గణించడానికి ఉత్పత్తి, ఆదాయ, వ్యయ పద్ధతులు ఉన్నాయి. ఈ మూడు పద్ధతులు జాతీయాదాయానికి ఒకే అంచనాను ఇవ్వాలి.

ఆదాయ భావన లెన్నో ఉన్నాయి. ఈ భావనలు ముఖ్యంగా దేశీయ, జాతీయ భావనల తేడావల్లా, స్థూల, నికర భావనల తేడావల్లా, మార్కెటు ధరలు, కారక వ్యయం భావనల తేడా వల్లా ఏర్పడుతున్నాయి. వ్యక్తిగత ఆదాయం, వ్యయార్హా దాయం అని మరోరెండు భావనలు కూడా ఉన్నాయి. వ్యయార్హ ఆదాయంలో వినియోగం, పొదుపు ఇమిడి ఉంటాయి.

జాతీయదాయ గణనలో మూడు ముఖ్యమైన ఇబ్బందులు ఎదురౌతాయి అవి, ఆర్థిక కార్యకలాపాల ఎంపిక, మార్కెటులోకి రాని వస్తువుల పరిగణన, రెండు మార్లు లెక్కింపు వివిధ కాలాలలోని వివిధ దేశాలలోని జాతీయాదాయాలను పోల్చేటప్పుడు జాగ్రత్త వహించాలి. ప్రస్తుత ధరలలో వ్యక్త మవుతున్న ఆదాయాన్ని కాకుండా స్థిర ధరలలో వ్యక్తమయిన ఆదాయాలను తీసుకొంటే వివిధ కాలాలలోని ఆదాయాలను పోల్చడం సాధ్యమవుతుంది. అదే విధంగా దేశాలమధ్య గణన పద్ధతులను పరిశీలించి ఒకే విధంగా ఉన్నట్లు తెలుసుకొని మారకపు రేటు తెలియజేస్తుందని గమనించినప్పుడే వివిధ దేశాల జాతీయాదాయాలను పోల్చడం సాధ్యమౌతుంది.

రచన మరియు అనువాదం: డా: యస్. సుబ్రహ్మణ్యం

## 6.12 సంప్రదింపు గ్రంథాలు

1. Stone and Stone : National Income Analysis

## 6.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

I కింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబు ఇవ్వండి.

1. జాతీయాదాయ గణన పద్ధతులను వివరించండి
2. జాతీయాదాయ విశ్లేషణలో వాడే వివిధ ఆదాయ భావనలను వాటి అన్యోన్య సంబంధాలను వివరించండి.



BRAOU

II *ఈ కిందివాటికి ఒక్కొక్క దానికి 10 పంక్తుల్లో జవాబు ఇవ్వండి.*

1. ఆర్థిక కార్యకలాపాల వలయాకార ప్రవాహం అంటే ఏమిటి?
2. జాతీయాదాయాన్ని ఆర్థిక శ్రేయస్సుకు ప్రతీకగా ఎంతవరకు వాడవచ్చును.
3. వివిధ కాలాల, దేశాల జాతీయాదాయాలను పరిపోల్చేటప్పుడు చేయవలసిన సవరణ లేమిటి?
4. స్థూల జాతీయోత్పత్తి, నికర జాతీయోత్పత్తి, సంపూర్ణ ఉద్యోగితా స్థాయి ఆదాయం అనే భావనలను వివరించండి.
5. జాతీయాదాయాన్ని లెక్కించే పద్ధతులను సంక్షిప్తంగా వివరించండి.
6. ప్రస్తుత ధరలలో జాతీయాదాయాన్ని, నిలకడ ధరలలో జాతీయాదాయాన్ని (వాస్తవ జాతీయాదాయాన్ని) వివరించండి.

# భాగం — 7: భారత దేశ జాతీయాదాయ అంచనాలు

## విషయ క్రమం

7.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
7.1 పరిచయం
7.2 స్వాతంత్ర్యం రాక పూర్వం ప్రయత్నాలు
7.3 స్వాతంత్ర్యానంతరం జాతీయాదాయ అంచనా
7.4 జాతీయాదాయ అంచనాకు అనుసరించిన పద్ధతి
7.5 జాతీయాదాయం పెరుగుదల
  7.5.1 జాతీయాదాయ ధోరణులు
  7.5.2 వివిధ రంగాల్లో సాధించిన ఆదాయం
  7.5.3 స్థూల దేశీయ ఉత్పత్తి వినియోగం
  7.5.4 పొదుపు, మూలధన కల్పన రేటు
7.6 సారాంశం/ముగింపు
7.7 సంప్రదింపు గ్రంథాలు
7.8 నమూనా పరీక్షా ప్రశ్నలు

## 7.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

భారతదేశంలో జాతీయాదాయాన్ని ఏ పద్ధతినుపయోగించిలెక్కించారో తెలుసుకొనడం, భారత దేశంలో జాతీయాదాయ ధోరణుల ఏవిధంగా ఉన్నాయో పరిశీలించడం ఈ పాఠం లక్ష్యం.

ఈ పాఠాన్ని చదివిన తర్వాత మీరు

★ జాతీయాదాయాన్ని అంచనా వేయడంలో వ్యక్తులు, ఏజన్సీలు చేసిన ప్రయత్నాలను గుర్తించగలరు.

★ జాతీయాదాయ అంచనాకు అనుసరించిన పద్ధతిని తెలుసుకోగలరు.

★ జాతీయాదాయ పోకడలను తెలుసుకోవచ్చు.

BRAOU

## 7.1 పరిచయం

జాతీయాదాయానికి సంబంధించిన వివిధ భావనలను వెనుకటి పాఠంలో చర్చించాం. ఉత్పత్తి, ఆదాయ, వ్యయ పద్ధతులు మూడూ ఒకే విషయాన్ని గణిస్తున్నాయి. అవి సర్వసమానమైన ఫలితాలనివ్వాలి. కాని జాతీయాదాయ అంచనాలో ఎన్నో ఆచరణ పరమైన ఇబ్బందులున్నాయి. ముఖ్యంగా దత్తాంశాలల్లోని లోపాలవల్ల ఈ ఇబ్బందులు కలుగుతున్నాయి. భారతదేశ జాతీయాదాయాన్ని అంచనావేసేటప్పుడు రంగానికి తగిన పద్ధతి నిర్ణయించుకొని, ఆయా పద్ధతులను కలిపి వాడవలసి వస్తోంది. 1950వ సం. నుండి భారతదేశ జాతీయాదాయం, తత్సంబంధ అంశాల అంచనాలకోసం వాడుతున్న పద్ధతులు, ఈ అంచనాలలో కాలానుగతమైన మార్పులు ఈ పాఠంలో తెలుసుకుందాం.

## 7.2 స్వాతంత్ర్యం రాక పూర్వం ప్రయత్నాలు

స్వాతంత్ర్యానికి పూర్వం జాతీయాదాయ అంచనా కోసం ప్రభుత్వం ప్రయత్నం చేయలేదు. మనకు లభ్యమయ్యే అంచనాలన్నీ వ్యక్తుల తయారుచేసినవే. దాదాబాయి నౌరోజీ 1876వ సం.లో 1867-68 సం.కి సంబంధించిన జాతీయాదాయాన్ని తలసరి ఆదాయాన్ని అంచనా వేయడానికి తొలి ప్రయత్నం చేశాడు. ఆయన బ్రిటిష్ ఇండియా జాతీయాదాయాన్ని రు. 340 కోట్లుగాను తలసరి ఆదాయాన్ని రు. 20లుగాను అంచనా వేశారు. తరువాత అనేక ప్రయత్నాలు జరిగాయి. వీటి నుండి లభించిన అంచనాలు 1వ పట్టికలో ఉన్నాయి. వీటిని పరిశీలిస్తే చాలా వ్యత్యాసాలున్నట్లు తెలుస్తోంది. ఇది చాల వరకు భావా పరమైన తేడాల వల్లా, వాడిన దత్తాంశాల్లో తేడాల వల్లా,వ్యక్తిగత పక్షపాతాల వల్లా కలుగుతున్నాయి. ఇందుకు కొన్ని కారణాలు ఇవి:

ఎ) జాతీయతావాదులైన ఆర్థిక వేత్తలు భారతదేశాన్నిబీద దేశంగానూ,తక్కువ జీవన స్థాయిగల దేశంగానూ చిత్రీకరించగా,ప్రభుత్వాను కూలురైన వారు తలసరి ఆదాయం మరీ తక్కువకాదని చూపించారు.

బి) ఈ అంచనాలన్నీ ఒకే భావనలు, నిర్వచనాలపై ఆధారపడ్డవికావు.

సి) భౌగోళికంగా అంచానలన్నీఒకే ప్రాంతానికి చెందినవికావు

డి) ఈ అంచనాలని ప్రస్తుత ధరలలో ఇచ్చారు.

మొదటిసారిగా శాస్త్రీయమైన అంచనాలు ఆచార్య వి.కె.ఆర్.వి. రావుగారు తయారు చేశారు. దత్తాంశాల బలహీనతలు కొన్ని ఉన్నప్పటికీ స్వాతంత్ర్యానికి ముందరి కాలానికి చెందిన అంచనాలన్నింటిలోనూ అత్యుత్తమమైనవిగా పరిగణించవచ్చు. ఈయన భారతీయ ఆర్థిక వ్యవస్థను రెండు వర్గాలుగా విభజించారు. పరిశ్రమలు, వాణిజ్యం, రవాణ, ప్రభుత్వసేవలు, ప్రభుత్వ నిర్వహణ, వృత్తులు, కళలు, గృహ సంబంధమైన సేవలు మొదటి వర్గానికి చెందుతాయి. వీటికి ఆదాయ పద్ధతిని ఉపయోగించారు. వ్యవసాయం, గనులు, అడవులు, చేపలు పట్టడం, వేట రెండవ వర్గంలో ముఖ్యమైనవి. వీటికి ఉత్పత్తి పద్ధతిని ఉపయోగించారు.

## 7.3 స్వాతంత్ర్యానంతర జాతీయాదాయ అంచనా ప్రయత్నాలు

పి.సి. మహలనబీస్ అధ్యక్షుడుగానూ, డి.ఆర్. గాడ్గిల్, వి.కె.ఆర్.వి. రావులు సభ్యులుగానూ 1949వ సం.లో ఒక జాతీయాదాయ సంఘం నియమితమైంది. దత్తాంశాల నాణ్యతను పెంచడానికీ, ఇంకా అవసరమైన దత్తాంశాల సేకరించడానికీ, జాతీయాదాయానికి సంబంధించిన అంశాలపై పరిశోధనలను ప్రోత్సహించడానికీ తగిన చర్యలను సూచించడమే ఈ సంఘ ప్రధానాశయం. వీరు 1954వ సం.లో తుది నివేదికను సమర్పించాక కేంద్ర గణాంక సంస్థ (Central Statitical Organisation) వారు ప్రతి సంవత్సరం "నేషనల్ అక్కౌంట్సు స్టాటిస్టిక్స్" అనే సాలుసరి ప్రచురణ ద్వారా జాతీయాదాయ అంచనాలను అందజేస్తున్నారు. కాలక్రమేణ ఆధారిత దత్తాంశాలలోనూ, అంచనా పద్ధతుల్లోను కేంద్ర గణాంక సంస్థవారు ఎంతో అభివృద్ధిని సాధించారు. నేషనల్ అక్కౌంట్స్ స్టాటిస్టిక్స్‌నే శ్వేత పత్రం అని కూడా అంటారు. ఈ అంచనాల్లో మూలధన కల్పన, పొదుపు, ప్రైవేట్ వినియోగవ్యయం, కారకాల ఆదాయం మొదలైన అంశాలెన్నో కొత్తగా చేర్చారు. జాతీయాదాయ అంచనాలో ప్రస్తుతం అనుసరిస్తున్న పద్ధతుల పూర్తి వివరాలు కేంద్ర గణాంక సంస్థవారు 1980వ సం.లో ప్రచురించిన "నేషనల్ అక్కౌంట్సు స్టాటిస్టిక్స్", "సోర్సెస్ అండ్ మెథడ్స్" అనే పుస్తకంలో పొందుపరిచారు.

BRAOU

## 7.4 జాతీయాదాయ అంచనాకై అనుసరిస్తున్న పద్ధతి

భారతదేశ జాతీయాదాయాన్ని అంచనా వేయడానికి ఆర్థిక కార్యకలాపాలను ఈ విధంగా విభజించారు.

1. వ్యవసాయం (పశుపోషణతో సహా)
2. అడవులు
3. చేపలు పట్టడం
4. గనులు, క్వారీలు
5. పరిశ్రమలు
   ఎ) రిజిష్టరయిన పరిశ్రమలు
   బి) రిజిష్టరుకాని పరిశ్రమలు
6. కట్టడాలు
7. విద్యుత్తు, వాయువు, నీటి సరఫరా
8. రవాణా, నిల్వ చేయడం
9. వాణిజ్యం, ఫలహారశాలలు, విశ్రాంత గృహాలు
10. బ్యాంకింగ్, బీమా
11. స్థిరాస్తులు,నివాసగృహాలు యాజమాన్యం, వ్యాపార సేవలు
12. ప్రభుత్వ నిర్వహణ, రక్షణ
13. ఇతర సేవలు

అందుబాటులో ఉన్న దత్తాంశాలు, అంచనా పద్ధతులు ఆధారంగా పై కార్యకలాపాలు మూడు వర్గాలుగా విభజించారు. రిజిష్టర్ కాని పరిశ్రమలను మినహాయించి మిగిలిన మొదటి ఆరు కార్యకలాపాలు మొదటి వర్గానికి చెందుతాయి. వీటన్నిటికీ ఉత్పత్తి, ఉత్పాదకాలు, ధరలు, ప్రతి సంవత్సరానికీ లభిస్తాయి. రైల్వేలు, విద్యుచ్ఛక్తి, కమ్యూనికేషన్లు, బ్యాంకింగ్, బీమా, స్థిరాస్తులు, ప్రభుత్వ నిర్వహణ, రక్షణ, రెండవ వర్గానికి చెందుతాయి. వీటికి సంబంధించిన పాలుసరి ఖాతాలనుండి కారకాల ఆదాయాలు లభిస్తాయి. రిజిష్టరుకాని పరిశ్రమలు, వ్యాపారం, ఫలహారశాలలు, విశ్రాంతి గృహాలు, ఇతర సేవలు మూడవ వర్గానికి చెందుతాయి. ఈ రంగాల ఉత్పత్తిని గురించికానీ, ఉత్పాదకాలను గురించిగానీ కారకాల ఆదాయాలను గురించిగానీ సంతృప్తికరమైన సమాచారం లభ్యం కాదు.

జాతీయాదాయ అంచనాకు ఉత్పత్తి, ఆదాయ వ్యయ పద్ధతుల్లో దేనినైనా వాడవచ్చని ఇంతక్రితమే తెలుసుకున్నాం. కాని వస్తువులను ఉత్పత్తి చేస్తున్న రంగాలకే ఉత్పత్తి పద్ధతి వాడగలము. కాబట్టి మొదటి వర్గంలోని కార్యకలాపాలకు ఉత్పత్తి పద్ధతిని వాడుతున్నారు.

మొదటి వర్గానికి చెందిన రంగాల స్థూల దేశీయ ఉత్పత్తినీ విధంగా అంచనా వేస్తున్నారు. ప్రతి రంగానికీ ఉత్పత్తినిధరలో గుణిస్తే ఉత్పత్తి విలువవస్తుంది. అయితే పశుపోషణ, అడవులు, చేపలు పట్టడం వంటి కార్యక్రలాపాలకు ప్రతి సంవత్సరానికీ సమాచారం లభించదు. అందుచేత బహిర్వేశన (Extrapolation) పద్ధతులు ద్వారా ప్రతి సంవత్సరానికి ఉత్పత్తి అంచనాలు తయారుచేస్తారు. తరువాత ఈ ఉత్పత్తిలో వాడిన మధ్యంతర ఉత్పాదకాలు (Intermediate imputs) అంచనావేస్తారు. ఈ అంచనాలు ఎప్పుడో ఒకసారి నిర్వహించే ప్రతిచయన సర్వే (sampel suryvey) లో తేలిన ఉత్పత్తి ఉత్పాదకాల నిష్పత్తిని బట్టి తయారు చేస్తారు. ఈ నిష్పత్తినే అన్ని సంవత్సరాలకూ వాడతారు. ఉత్పత్తి విలువనుండి ఉత్పాదకాల విలువను తీసివేస్తే స్థూల అదనపు విలువ వస్తుంది.

 రెండవ వర్గానికి చెందిన రంగాలకు అంచనాలు ఆదాయ పద్ధతిని ప్రత్యక్ష రూపంలో వాడి తయారు చేస్తారు.

BRAOU

ఈ రంగాలకు చెందిన వ్యవస్థల సాలు సరి ఖాతాల్లో ఉద్యోగుల వేతనాలు,వడ్డీ చెల్లింపులు, భాటకం, మిగుళ్ళు, తరుగుదలకు సంబంధించిన సమాచారం లభిస్తుంది. వీటి నుండి వచ్చే కారకాల ఆదాయం మొత్తమే అదనపు విలువ అవుతుంది.

మూడవ వర్గానికి చెందిన రంగాల విషయంలోనే సమస్యలెదురౌతాయి. క్రమబద్ధమైన సమాచారం లభ్యం కాకపోవడం వల్ల వీటి అంచనాలు చుట్టు తిరుగుడు పద్ధతిలో తయారవుతాయి. దశాబ్దానికి ఒక మారు లభ్యమయ్యే జనాభా లెక్కల నుండి పనివారల సంఖ్య అంచనావేస్తారు. అంటే ఈ సమాచారం1950, 1960, 1970, 1980 సం. లకు మాత్రమే లభిస్తుంది. ప్రతిసంవత్సరానికీ అంచనాలు అంతర్నివేశన (interpolation), బహిర్వేశన (extrapolation) పద్ధతుల ద్వారా రాబడతారు. నిర్ణీత సంవత్సరాలలో జరిగిన సర్వేలనుండి పనివారు సగటు అదనపు విలువ అంచనాలు తయారవుతాయి. వీటినీ, పనివారి అంచనాలనూ వాడిప్రతిరంగంలో అదనపు విలువను అంచనా వేస్తారు.ప్రతిరంగానికీ స్థిర మూలధన వినియోగాన్ని వేరు వేరుగా వేసి మొత్తం చేస్తారు. ఈ మొత్తాన్ని స్థూల దేశీయ ఉత్పత్తి నుండి తీసేస్తే నికర దేశీయ ఉత్పత్తి లభిస్తుంది. విదేశాలనుండి లభించే నికర కారక ఆదాయాల అంచనా రిజర్వు బ్యాంకు వారి విదేశీ వ్యాపార చెల్లింపుల శేష విభాగం (Balance of payments Division) పొందుపరిచే వినిమయ నియంత్రణ (exchange control) దత్తాంశాల నుంచి తీసుకుంటారు. ఈ అంచనాలను దేశీయాదాయానికి కలిపితే స్థూల, నికర జాతీయ ఉత్పత్తి అంచనాలు లభిస్తాయి.

ప్రస్తుత ధరలలో ఉన్న అంచనాలను డిఫ్లేట్ చేసి స్థిర (1970-71 సం.) ధరల్లోని అంచనాలను తయారు చేస్తారు. ఇందుకు వ్యవసాయం, పశుపోషణ, అడవులు, వేట, మత్స్య పరిశ్రమ రంగాలకు రెండు సార్లు డిఫ్లేట్‌చేసే పద్ధతిని వాడతారు. దీని ప్రకారం ఉత్పత్తి, ఉత్పాదకాలు ఆధారిత సంవత్సర ధరలతో విలువకడతారు. పరిశ్రమలు, నిర్మాణం మొదలైన రంగాలకు ఉత్పత్తిని మాత్రమే డిఫ్లేట్ చేస్తారు. ఈ ఉత్పత్తినీ, ప్రస్తుత ధరలలోని ఉత్పత్తిలో అదనపు విలువ శాతాన్నీ వాడి స్థిర ధరల్లో అదనపు విలువను రాబడతారు. వాణిజ్యం, రవాణా, ఫలహారశాలలు మొదలైన కార్యకలాపాలకు భౌతిక సాధన ఆధారంగా సూచికలను తయారుచేసి వీటిని ఆధారిత సంవత్సరపు అంచనాకు వాడి ప్రతి సం. త్సరానికీ స్థిరధరల వద్ద అంచనాలను తయారు చేస్తారు. జాతీయాదాయంలోని వివధ అంశాల సంబంధాలు 1979-80, 1980-81 సంవత్సరాల దత్తాంశాలద్వారా 2వ పట్టికలో ఇచ్చాం.

## 7.5 జాతీయాదాయం పెరుగుదల

ఇంతవరకూ జాతీయాదాయ అంచనా పద్ధతులును చర్చించాం. ఇప్పుడు భారతదేశంలో పంచవర్ష ప్రణాళికలు అమలు అవుతున్నప్పటి నుంచి జాతీయాదాయానికి చెందిన వివిధ అంశాల్లో వచ్చిన దీర్ఘకాలిక మార్పుల పరిశీలిద్దాం. జాతీయాదాయం, తలసరి ఆదాయం ఒక ఆర్థిక వ్యవస్థ సాధనను తెలుపుతాయి.

### 7.5.1 జాతీయాదాయ ధోరణులు

ఒక ఆర్థిక వ్యవస్థ సాధనకు ప్రతీకగా ఒకే సూచికను తీసుకోవలసివస్తే జాతీయాదాయం అత్యుత్తమమైనది. జాతీయాదాయాన్ని దేశ జనాభాచే భాగిస్తే తలసరి ఆదాయం వస్తుంది. భారతదేశపు జాతీయ, తలసరి ఆదాయాల అంచనాలు నాలుగు నిర్ణీత సమయాలకు 3వ పట్టికలో పొందుపరిచాం. 1950-51సం.లో ప్రస్తుత ధరల్లో తలసరి ఆదాయం రు.245.5 కాగా 1982-83 సం.నికి, 2201.4కి పెరిగింది. కాని ఈ పెరుగుదలలో ఎక్కువభాగం ధరల పెరుగుదల వల్ల కలిగినదే. ఈ విషయం స్థిరధరల వద్దతలసరి ఆదాయాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది. 1950-51సం.లో స్థిర ధరల వద్ద (1970-71 ధరల వద్ద) తలసరి ఆదాయం రు. 466 నుండి 1982-83 సం.లో రు 748.30వకు మాత్రమే పెరిగింది.

జాతీయ, దేశీయాదాయాల్లోని దీర్ఘకాలిక మార్పును అర్థం చేసుకునేందుకు సాలుసరి వృద్ధిరేటును వాడతారు. వృద్ధిరేటును కనుగొనడానికి మొదటి, చివరి సంవత్సరాలను పరిగణించి చక్రవడ్డీ సూత్రాన్ని వాడటం సులభపద్ధతి. చివరి సంవత్సరంలో ఆదాయం రు. Aలు, మొదటి సంవత్సరంలో ఆదాయం రు. Pలు, ఈ రెండు సమయాల మధ్యకాలం n సంవత్సరాలు. అయితే సాలుసరి వృద్ధిరేటు r ను ఈ సూత్రం లో కనుక్కోవచ్చు.

$$A = P\left(1 + r/100\right)^{n}$$

ఈ సమీకరణంలో సాలుసరి వృద్ధిరేటు r శాతంగా తెలుసుకోవాలి.

జాతీయ, తలసరి ఆదాయాల వృద్ధిరేట్లు 3వ పట్టికలో పొందుపరచబడ్డాయి. జాతీయాదాయపుసాంవత్సరిక వృద్ధిరేటు ప్రస్తుతం ధరల్లో 9.5 శాతం కాగా స్థిర ధరల్లో 3.8 శాతం మాత్రమే. అనగా 5.7 శాతం వృద్ధి నిజమైనది కాదని, ధరల పెరుగుదలనే తెలియజేస్తోందని తెలుసుకోవాలి. ఈ తక్కువ వృద్ధిరేటుకు సాయం జనాభా పెరుగుదల రేటు కూడా ఎక్కువగా అనగా 2.2 శాతం వుండుటచే తలసరి ఆదాయం వృద్ధిరేటు 1.5 శాతం మాత్రమే. ఇదిగత మూడు దశాబ్దాల కాలంలో ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధి విధానాన్ని అనుసరించి సాధించిన ప్రగతి.

## 7.5.2 వివిధ రంగాల్లో సాధించిన ఆదాయం

ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్ని అవగాహన చేసుకునేందుకు వివిధ రంగాల్లో సాధించిన ఆదాయాన్ని పరిశీలించాలి. అంటే వివిధ రంగాల ప్రాముఖ్యతలో వచ్చిన మార్పును గమనించాలి. ఆర్థిక వ్యవస్థను ప్రైమరీ, సెకండరీ టెరిషరీ అని మూడు విస్తృత రంగాలుగా విభజించి, ఆ రంగాల్లో సాధించిన నికర జాతీయ ఉత్పత్తిని 4వ పట్టికలో పొందుపరచాం. ప్రైమరీ రంగంలో పరిశ్రమలు, విద్యుత్తు, వాయువు, నీటి సరఫరా, నిర్మాణం, మిగిలిన కార్యకలాపాలన్నీ టెరిషరీ రంగంలో చేర్చారు. ప్రైమరీ రంగం 1950-51 సం.లో మొత్తం ఆదాయంలో 61.3 శాతం సాధించగా, 1982-83సం. లో 40.3 శాతానికి తగ్గింది. ఇదే కాలంలో సెకండరీ రంగభాగం 14.5 శాతం నుండి 21.4 శాతానికీ, టెరిషరీ రంగభాగం 24.2 శాతం నుండి 38.3 శాతానికి పెరిగాయి. వ్యవసాయం అనుబంధిత రంగాల ప్రాముఖ్యత తగ్గడం ఊహకు అందనిదికాదు. ప్రణాళికా బద్ధమైన ఆర్థిక ప్రగతి కారణంగానే ఈ మార్పు సంభవించింది పారిశ్రామికీకరణ విధానం, అందుకు కావలసిన రవాణా, వాణిజ్య కార్యకలాపాలకు ఇచ్చిన ప్రోత్సాహం ఈ మార్పులకు ముఖ్య కారణం.

భారతదేశం మిశ్రమ ఆర్థిక విధానాన్ని అవలంబిస్తోంది. ఇందులో ప్రైవేట్, ప్రభుత్వ రంగాలు రెండూ ప్రముఖ పాత్ర వహిస్తాయి. ఈ సందర్భంలో ప్రభుత్వరంగ ప్రాధాన్యతలో గత మూడు దశాబ్దాల్లోనూ వచ్చిన మార్పును పరిశీలించడం అవసరం. స్థూల దేశీయ ఉత్పత్తిలో ప్రభుత్వ ప్రైవేట్ రంగాల భాగాలు 5వ పట్టికలో ఉన్నాయి. ప్రభుత్వ రంగ భాగం 1950-51 సం.లో 10.9 శాతం కాగా, 1982-83 సం.నాటికి 18.2 శాతానికి పెరిగింది. అంటే ప్రభుత్వ రంగ భాగం దాదాపు రెట్టింపయింది. దీనిని బట్టి ప్రభుత్వ రంగంలోని ఉత్పత్తి అధికతర రేటులో పెరుగుతుందోని తెలుసుకోవచ్చు.

## 7.5.3 స్థూల దేశీయ ఉత్పత్తి వినియోగం

స్థూలదేశీయ ఉత్పత్తిని ఏ విధంగా వాడారో చూద్దాం. ఉత్పత్తిలో కొంత వినియోగానికీ, కొంత మూలధనకల్పనకూ వాడుతున్నారు. 7వ పట్టికలో పొందుపరిచిన దత్తాంశాలను పరిశీలిస్తే స్థూలదేశీయ కల్పన భాగం గణనీయంగా పెరిగినట్లు గమనించవచ్చు. 1950-51వ సం.లో 13.5 శాతం కాగా 1979-80సం.లో 17.1 శాతానికి పెరిగింది. మరోవైపు ప్రైవేటువినియోగ వ్యయం ఇదే కాలంలో 79.8 శాతం నుండి 70.2 శాతానికి తగ్గింది, కాని ప్రభుత్వ వినియోగ వ్యయం మాత్రం 5.1 శాతం నుండి 12.6 శాతానికి పెరిగింది.

### 7.5.4 పొదుపు, మూలధన కల్పనల రేట్లు

ఆర్థిక వృద్ధిరేటు పొదుపు, మూలధన కల్పనలపై ఆధారపడుతుంది. కాబట్టి ఈ రేట్లలోని మార్పులను గమనించడం అవసరం. వీటికి సంబంధించిన దత్తాంశాలు 8వ పట్టికలో చూడండి. దేశీయ ఉత్పత్తిలో మూలధన కల్పనకు వాడిన మొత్తం భాగాన్ని మూలధన కల్పనరేటుగా నిర్వచిస్తాము. అదే విధంగా దేశీయ ఉత్పత్తిలో పొదుపు భాగాన్నే పొదుపురేటుగా నిర్వచిస్తాము. ఈ రెండు రేట్లనూ స్థూలరూపంలోగాని, నికరరూపంలోగాని వ్యక్తం చేయవచ్చు. స్థూల, నికర భావనల తేడా మూలధనతరుగుదలకు సమానమని ముందేతెలుసుకున్నాం. పట్టికలోని దత్తాంశాలనుపరిశీలిస్తే మూలధన కల్పన, పొదుపు రేట్లలో గణనీయమైన పెరుగుదల ఉన్నట్లు తెలుస్తోంది. గత మూడు దశాబ్దాల్లోనూ ఈ రెట్లు రెట్టింపు కన్నా అధికంగా పెరిగినట్లు తెలుస్తోంది. అయితే భారత ఆర్థిక వ్యవస్థలో ఆసక్తికరమైన విషయమేమిటంటే, పొదుపు, మూలధన కల్పనల రేట్లు చాలా ఎక్కువగా ఉన్నప్పటికీ ఆదాయపు వృద్ధిరేటు తక్కువగా ఉన్నది. ఇందుకు అనేక వివరణలుఇచ్చారు. వాటి వివరాలను యిక్కడ చర్చించడం సాధ్యంకాదు.

---

## 7.6 ముగింపు/సారాంశం

---

జాతీయాదాయ అంచనా ప్రయత్నాలు భారతదేశంలో 1876వ సం.లోనే ప్రారంభమయ్యాయి. భారతదేశపు జాతీయాదాయాన్ని అంచనా వేసినవారిలో దాదాబాయి నౌరోజీ ప్రథముడు. బ్రిటీష్ ఇండియా కాలానికి సంబంధించిన అంచనాలన్నింటిలోనూ వి.కె.ఆర్.వి. రావుగారి అంచనా అత్యుత్తమమైనది. శాస్త్రీయ పద్ధతిపైఆధారపడింది.స్వాతంత్ర్యానికి ముందరి ఆదాయ అంచనాలన్నీ అసంపూర్ణ దత్తాంశాలవల్లనేగాక వ్యక్తిగత పక్షపాతాల వల్ల కూడా దెబ్బతిన్నాయి. జాతీయతావాదులైన ఆర్థిక వేత్తలు భారతదేశాన్ని పేదదేశంగానూ తక్కువ జీవన స్థాయిగల దేశంగానూ చిత్రీకరించగా, ప్రభుత్వానుకూలురైన ఆర్థిక వేత్తలు తలసరిఆదాయం అంత తక్కువకాదని చూపదలచారు.

1950ల సం. నుంచి జాతీయాదాయ అంచనాలు 1949 సం.లో నియమించి జాతీయాదాయ సంఘం సూచించిన పద్ధతులమీద ఆధారపడి తయారవుతున్నాయి. కాని దత్తాంశాల సేకరణ పద్ధతుల్లోనూ, అంచనా పద్ధతుల్లోనూ కాలక్రమేణ ఎంతో అభివృద్ధి సాధించబడింది. సిద్ధాంతరీత్యా జాతీయాదాయ అంచనాకు ఉత్పత్తి, ఆదాయ వ్యయ పద్ధతులు ఒకే అంచనాలనిచ్చినప్పటికీ వీటిని మిళితం చేస్తేకాని అంచనా సాధ్యపడదు. భారతదేశ జాతీయాదాయ అంచనాల్లో ఉత్పత్తి, ఆదాయ పద్ధతులు రెంటినీ వాడారు. వస్తూత్పత్తి రంగాలకు ఉత్పత్తి పద్ధతి వాడగా, మిగిలిన రంగాలకు ఆదాయ పద్ధతి వాడారు.

భారత దేశ తలసరి జాతీయా ఆదాయం స్థిర (1970-71) ధరలలో 1950-51 సం.లో రు. 466 కాగా 1982-83 సం.లో రు.696.30కి పెరిగింది. అంటే సాలు సరివృద్ధిరేటు 1.5 శాతం ఇంత తక్కువ రేటులో తలసరి ఆదాయం పెరగడానికి కారణం జనాభావృద్ధిరేటు అధికం (2.2 శాతం) కావడమే. జాతీయాదాయంలో వివిధ రంగాల భాగాలు కూడ గణనీయంగా మారాయి. ప్రైమరీ రంగం భాగం తగ్గగా, సెకండరీ, టెరిషరీ రంగాల భాగాలు పెరిగాయి. అదే విధంగా ప్రైవేటు రంగ భాగం తగ్గి ప్రభుత్వ రంగ భాగం పెరిగింది. పొదుపు రేటు 1950-51 సం.లో 7.0 శాతం కాగా 1980-81లో 16.9 శాతానికి పెరిగింది. పొదుపు, మూలధన కల్పనల రేట్లలో గణనీయమైన పెరుగుదల ఉన్నప్పటికీ జాతీయాదాయ వృద్ధిరేటు తక్కువగా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుంది.

రచన, అనువాదం : డా.ఎస్. సుబ్రహ్మణ్యం.

BRAOU

1వ పట్టిక:స్వతంత్రానికి పూర్వం నాటి జాతీయాదాయ అంచనాలు

| అంచనాదారు | అంచనా సంవత్సరం | జాతీయ ఆదాయం కోట్ల(రు.లలో) | తలసరి ఆదాయం రు.లలో | భౌగోళిక విస్తారం |
|---|---|---|---|---|
| దాదాబాయ్ నౌరోజీ | 1868 | 340 | 20 | బ్రిటీష్ ఇండియా |
| F.J. అట్కిన్ సన్ | 1875 | 574 | 31 | బ్రిటీష్ ఇండియా |
| బారింగ్ అండ్ బార్బర్ | 1882 | 525 | 27 | బ్రిటీష్ ఇండియా |
| లార్డ్ కర్జన్ | 1897 98 | 675 | 30 | బ్రిటీష్ ఇండియా |
| విలియం డిగ్బే | 1899 | 390 | 17 | బ్రిటీష్ ఇండియా |
| సర్.బి.యన్. శర్మ | 1911 | | 50 | బ్రిటీష్ ఇండియా |
| ఫిండ్లే షిరాస్ | 1911 | 1942 | 80 | బ్రిటీష్ ఇండియా |
| వాడియా అండ్ జోషి | 1913-14 | 1087 | 44 | భారతదేశమంతా |
| ఎమోల్డ్ లుప్టన్ | 1919-20 | 2854 | 114 | బ్రిటీష్ ఇండియా |
| షా అండ్ ఖంబాటా | 1921-22 | 2364 | 74 | భారతదేశంమంతా |
| వి.కె.ఆర్.వి. రావు | 1931-32 | 1689 | 62 | బ్రిటీష్ ఇండియా |
| బి. నటరాజన్ | 1938-39 | 1482 | 67 | బ్రిటిష్ ఇండియా |
| ఈస్టరన్ ఎకానమిస్ట్ మినిస్టర్ ఆఫ్ కామర్స్ | 1939-40 | 1934 | 67 | బ్రిటీష్ ఇండియా |
| భారత ప్రభుత్వం | 1945 46 | 6234 | 190 | బ్రిటీష్ ఇండియా |

2వ పట్టిక : జాతీయోత్పత్తి తత్సంబంధ భావనలు (ప్రస్తుతధరల్లో కోట్ల రూ.లలో)

| అంశము | 1979-80 | 1980-81 |
|---|---|---|
| 1. కారకవ్యయంలో స్థూలజాతీయ ఉత్పత్తి | 95023 | 114601 |
| 2. అదనపు పరోక్ష పన్నులు | 14723 | 16745 |
| 3. తీసివేయవలసిన సబ్సిడీలు | 2520 | 2822 |
| 4. మార్కెట్ ధరల్లో స్థూల జాతీయ ఉత్పత్తి | 107226 | 128524 |
| 5. తీసివేయవలసిన స్థిర మూలధనపు వినియోగం | 6651 | 8062 |
| 6. మార్కెట్ ధరల్లో నికర జాతీయోత్పత్తి | 100575 | 120462 |
| 7. తీసివేయవలసిన: విదేశాలనుండి వచ్చిన నికర కారక ఆదాయం | (+) 153 | (+) 330 |
| 8. మార్కెట్ ధరల్లో నికర దేశీయ ఉత్పత్తి | 100422 | 120132 |
| 9. కారక వ్యయంలో నికరదేశీయ ఉత్పత్తి | 88219 | 106209 |
| 10. తీసివేయవలసిన వ్యవస్థాపకత, ప్రభుత్వ పరిపాలన విభాగపు ఆస్తి [illegible]ండి వచ్చిన ఆదాయం | 1985 | 2245 |
| 11. తీసివేయవలసిన: నాన్‌డిపార్ట్‌మెంటల్ సంస్థల పొదుపు | 372 | 184 |

| | | |
|---|---|---|
| 12. ప్రైవేట్ రంగానికి చెందిన దేశీయ ఉత్పత్తి నుంచి ఆదాయం | 85862 | 103780 |
| 13. కలుపగా; జాతీయఋణాలపై వడ్డీ | 1008 | 1500 |
| 14. కలుపగా; విదేశాలనుండి వచ్చిన నికరకారక ఆదాయం | (+) 153 | (+) 330 |
| 15. కలుపగా: ప్రభుత్వ పరిపాలనా విభాగం నుంచి కరెంట్ (Current) బదిలీలు | 2383 | 2803 |
| 16. కలుపగా: విదేశాలనుండి ఇతరకరెంట్ బదిలీలు | 1624 | 2064 |
| 17. ప్రైవేట్ ఆదాయం | 91030 | 110482 |
| 18. విదేశీ కంపెనీలు నిలిపి ఉంచిన ఆర్జనలు తీసివేశాక ప్రైవేట్ కార్పొరేట్ రంగం పొదుపు. | 736 | 814 |
| 19. తీసివేయగా: కార్పొరేషన్ పన్నులు | 1392 | 1311 |
| 20. వ్యక్తిగత ఆదాయం | 88902 | 108357 |
| 21. తీసివేయగా: వ్యక్తులు చెల్లించిన ప్రత్యక్ష పన్నులు | 2011 | 2275 |
| 22. ప్రభుత్వ నిర్వహణ విభాగం చిల్లర వసూళ్ళు | 356 | 381 |
| 23. వ్యక్తిగత వ్యయార్హ ఆదాయం | 86535 | 105701 |

3వ పట్టిక : కారక వ్యయంలో నికర జాతీయ ఉత్పత్తి

| సంవత్సరం | ప్రస్తుతధరల్లో | | స్థిరధరల్లో | |
|---|---|---|---|---|
| | మొత్తం (రూ. కోట్లలో) | తలసరి (రూ.లలో) | మొత్తం (రూ.కోట్లలో) | తలసరి (రూ.లలో) |
| 1950-51 | 8,812 | 245.5 | 16,731 | 466.0 |
| 1960-61 | 13,263 | 305.6 | 24,250 | 558.8 |
| 1970-71 | 34,235 | 632.8 | 34,235 | 632.8 |
| 1982-83 | 1,59,598 | 2,201.4 | 54,276 | 748.6 |

4వ పట్టిక : నికర జాతీయ ఉత్పత్తి వృద్ధిరేట్లు

(శాతంగా)

| కాలము | ప్రస్తుతధరలు | | స్థిరధరలు | |
|---|---|---|---|---|
| | మొత్తం | తలసరి | మొత్తం | తలసరి |
| 1950-51 — 1960-61 | 4.2 | 2.2 | 3.8 | 1.8 |
| 1960-61 — 1970-71 | 9.9 | 7.6 | 3.5 | 1.2 |

| | | | | |
|---|---|---|---|---|
| 1970-71 — 1980-81 | 11.8 | 9.3 | 3.3 | 1.0 |
| 1950-51 — 1980-81 | 8.6 | 6.3 | 3.5 | 1.3 |
| 1950-51 — 1982-83 | 9.5 | 7.1 | 3.8 | 1.5 |

షరా: చక్రవృద్ధి రేట్లు లెక్కించారు.

5వ పట్టిక : నికరదేశీయ ఉత్పత్తి రంగాలవారి విభజన

(శాతాల్లో)

| సంవత్సరం | ప్రైమరీ | సెకండరీ | టెరిషరీ | మొత్తం |
|---|---|---|---|---|
| 1950-51 | 61.3 | 14.5 | 24.2 | 100.0 |
| 1960-61 | 56.6 | 17.0 | 26.4 | 100.0 |
| 1970-71 | 50.1 | 19.7 | 30.2 | 100.0 |
| 1980-81 | 42.5 | 21.3 | 36.2 | 100.0 |
| 1982-83 | 40.3 | 21.4 | 38.3 | 100.0 |

షరా: స్థిరధరలవద్ద నికరదేశీయ ఉత్పత్తి వాడారు.

BRAOU

6వ పట్టిక : ప్రభుత్వ ప్రైవేట్ రంగాల వారీగా స్థూలదేశీయ ఉత్పత్తి

(శాతాల్లో)

| సంవత్సరం | ప్రభుత్వ | ప్రైవేటు | మొత్తం |
|---|---|---|---|
| 1960-61 | 10.9 | 89.1 | 100.0 |
| 1970-71 | 14.9 | 85.1 | 100.0 |
| 1980-81 | 20.4 | 79.6 | 100.0 |
| 1982-83 | 18.2 | 81.8 | 100.0 |

7వ పట్టిక: స్థూలదేశీయ ఉత్పత్తి ఖర్చు (శాతాల్లో)

| అంశం | 1950-51 | 1960-61 | 1970-71 | 1979-80 |
|---|---|---|---|---|
| 1. ప్రభుత్వ అంతిమ వినియోగ వ్యయం | 5.1 | 6.1 | 9.4 | 12.6 |
| 2. ప్రైవేట్ అంతిమ వినియోగ వ్యయం | 79.8 | 78.1 | 74.0 | 70.2 |

| | | | | |
|---|---|---|---|---|
| 3. స్థూల దేశీయ మూలధన కల్పన | 13.5 | 14.1 | 15.7 | 17.1 |
| 4. నిల్వల్లో మార్పులు | 1.8 | 2.8 | 2.6 | 3.7 |
| 5. వస్తుసేవల ఎగుమతులు | 6.1 | 4.5 | 4.6 | 6.7 |
| 6. తగ్గించవలసినది: వస్తుసేవల దిగుమతులు | 3.4 | 7.0 | 4.5 | 5.1 |
| 7. వ్యత్యాసాలు | -2.9 | 1.4 | -1.6 | -5.1 |
| మొత్తం | 100.0 | 100.0 | 100.0 | 100.( |

8వ పట్టిక: ప్రస్తుత ధరల్లో మూలధన కల్పన, పొదుపు రేట్లు

(శాతాల్లో)

| సంవత్సరం | నికర దేశీయ ఉత్పత్తిలో నికర మూలధన కల్పన భాగం | నికర దేశీయ ఉత్పత్తిలో నికర పొదుపు భాగం | స్థూలదేశీయ ఉత్పత్తిలో స్థూల మూలధన కల్పన భాగం | స్థూలదేశీయ ఉత్పత్తిలో స్థూల పొదుపు భాగం |
|---|---|---|---|---|
| 1950-51 | 6.8 | 7.0 | 10.0 | 10.2 |
| 1960-61 | 12.7 | 9.3 | 16.9 | 13.7 |
| 1970-71 | 13.0 | 12.0 | 17.8 | 16.8 |
| 1980-81 | 19.0 | 16.9 | 24.2 | 22.2 |

BRAOU

## 7.7 సంప్రదింపు గ్రంథాలు


1. CSO, National Accounts Statitics : Sources and Methods, Govt. of India, Publications Division, New Delhi, 1980
2. Datt and Sundaram : Indian Economy.


## 7.8 నమూనా పరీక్షా ప్రశ్నలు

I కింది ప్రశ్నలలో ఒక్కొక్క దానికి 30 పంక్తుల్లో జవాబు రాయండి.

1. భారతదేశంలో జాతీయాదాయ అంచనాకు వాడుతున్న పద్ధతిని వివరించండి.
2. జాతీయాదాయ అంచనాలను బట్టి భారత ఆర్థిక వ్యవస్థలో వచ్చిన దీర్ఘ కాలిక మార్పులను వివరించండి.

II కింది ప్రశ్నలలో ఒక్కొక్క దానికి 15 పంక్తులలో జవాబులు రాయండి.

1. స్వాతంత్ర్యానికి పూర్వం భారతదేశ జాతీయాదాయ అంచనాకు జరిగిన ప్రయత్నాలు వివరించండి.
2. భారతదేశ జాతీయాదాయ అంచనాకు ఆర్థిక వ్యవస్థను ఏయే రంగాలుగా విభజించారో వివరించండి.

# భాగం – 8: జాతీయాదాయ ఖాతాలు – సాంఘిక గణన పద్ధతులు

విషయక్రమం

8.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
8.1 పరిచయం
8.2 జాతీయాదాయ ఖాతాల పద్ధతి
8.3 సాంఘిక గణన మ్యాత్రిక
8.4 ఉత్పాదక – ఉత్పత్తుల విశ్లేషణ
  8.4.1 పరిచయం
  8.4.2 సాంఘిక గణన మ్యాత్రికలో తేడా
  8.4.3 ఉత్పాదక ఉత్పత్తుల పట్టిక
  8.4.4 ఉత్పాదక ఉత్పత్తుల విశ్లేషణ ప్రయోజనాలు
8.5 సారాంశం/ముగింపు
8.6 సంప్రదింపు గ్రంథాలు
8.7 నమూనా పరీక్షాప్రశ్నలు

## 8.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

ఖాతాభావనను పరిచయం చేసి జాతీయాదాయాన్ని కొన్ని ఖాతాలుగా ఎలా చూపగలమో వివరించడం; ఈ ఖాతాలను మ్యాత్రిక రూపంలో ఎలా అమర్చగలమో వివరించడం; సాంఘిక గణన మ్యాత్రికకూ ఉత్పాదక ఉత్పత్తుల మ్యాత్రికకూ ఉన్న సంబంధాలను చర్చించడం ఈ పాఠం లక్ష్యం.

ఈ పాఠం చదివిన తర్వాత మీరు

★ జాతీయాదాయ ఖాతాల పద్ధతిని వివరించగలరు.
★ జంట పద్దు నమోదు విధాన సూత్రాలను గుర్తించగలరు.
★ సాంఘిక గణన పద్ధతిని విశ్లేషించగలరు.
★ ఉత్పాదక ఉత్పత్తుల విశ్లేషణను వివరించగలరు.

## 8.1 పరిచయం

జాతీయాదాయానికి చెందిన వివిధ భావనలను గురించి, వాటి అంచనా పద్ధతులను గురించి వెనుకటి పాఠాల్లో నేర్చుకున్నాం. ఈ భావనలను ఖాతాల రూపంలో ఎలా చూపగలమో ఇప్పుడు చర్చిద్దాం. ఈ ఖాతాలు జాతీయాదాయంలోని వివిధ అంశాలను ఏకం చేస్తాయి. జాతీయ ఖాతాలంటే ఆర్థిక వ్యవస్థలో నిర్వహించే లేదా ఆరోపించే లావాదేవీలను క్రమబద్ధంగా అమర్చి (i) వివిధ రూపాల్లో అంటే ఉత్పత్తి, వినియోగ, మూలధన సంచయనం రూపాల్లో ఉన్న ఆర్థిక కార్యకలాపాలను వేరుచేయడం, (ii) వివిధ రంగాలను వేరుచేయడం, (iii) వివిధ రకాల లావాదేవీలను అంటే వస్తుసేవల కొనుగోలు, అమ్మకం, పన్నులు, కానుకలు మొదలైన వాటిని వేరు చేయడం.

## 8.2 జాతీయ ఆదాయ ఖాతాల పద్ధతి

జాతీయఖాతాలు వ్యాపార ఖాతాల సూత్రాలపైనే ఆధారపడ్డాయి. అయితే వ్యాపారసూత్రాల భావన చాలా పురాతనమైనదికాగా జాతీయ ఖాతాల భావన ఈ మధ్యనే అమలులోకి వచ్చింది. వ్యాపార ఖాతాలు జంటపద్దు నమోదు విధానంపై ఆధారపడ్డాయి. ఈ విధానంలో ప్రతి లావాదేవీలోనూ రెండు వర్గాలుంటాయి. ఒక వర్గం చెల్లింపుదార్లు, మరో వర్గం వసూలు దార్లు. ఉదాహరణకు రు. 20లకు వర్తకుడు కొనుగోలుదారుకు ఒక టీ పొట్లాన్ని అమ్మాడను కుందాం. ఈ లావాదేవీని వర్తకుడు తన ఖాతాలో టీ పొట్లం అమ్మకాన్ని డెబిట్ వైపునా, రూ. 20ల వసూలును క్రెడిట్ వైపునా చూపుతాడు. ఇదే లావాదేవీని కొనుగోలు దారు వైపునుంచి కూడా చూపవచ్చు. ఇప్పుడు టీ పొట్లం వసూలు క్రెడిట్‌లోనూ, రు. 20లు డెబిట్‌లోనూ ఉంటుంది. ఈ లావాదేవీలను వసూళ్ళు, చెల్లింపులు అనడానికి బదులు క్రెడిట్, డెబిట్ అని ఎందుకంటారో తెలుసుకోవాలి. అక్కౌంటెంటుకు పైకం చెల్లించారో లేదో తెలుసుకోవలసిన అవసరం లేదు. ఖాతాల్లో చేర్చినవి చెల్లింపులూ, వసూళ్ళు కావు. చెల్లించదగినవీ, వసూలు చేయతగినవీ మాత్రమే నమోదు అవుతాయి. కాబట్టే వీటిని క్రెడిట్, డెబిట్ అని సూచిస్తాము.

వాణిజ్య ఖాతాల్లో ఒక సంస్థ లావాదేవీలు ఖాతాలోని క్రెడిట్, డెబిట్ వైపుల నమోదవుతాయి. ఈ ఖాతా వాణిజ్య సంస్థ స్థితి గతులను తెల్పుతుంది. జాతీయాదాయ ఖాతాల్లో కూడా లావాదేవీలు ఇదే విధంగా ఉంటాయి. అయితే వాణిజ్య ఖాతాలకూ, జాతీయాదాయ ఖాతాలకూ ఒక చిన్న తేడా వుంది. ఉదాహరణకు, ఉత్పత్తి దారు కారకాలను అద్దెకు తీసుకొని, ఉత్పత్తిని సాధించి మార్కెట్‌లో అమ్ముతాడు. జాతీయాదాయ ఖాతాల్లో ఉత్పత్తిని అమ్మగా వచ్చిన మొత్తాన్ని క్రెడిట్‌వైపునా, ఉత్పత్తి కారకాల చెల్లింపుల్ని డెబిట్‌వైపునా చూపిస్తారు. ఆర్థిక వ్యవస్థలో లెక్కలేనన్ని లావాదేవీలు జరుగుతాయి. సంస్థలు ముడిసరుకులను కొని తయారైన వస్తువులను అమ్ముతాయి; పనివారికి వేతనాలు, జీతాలను చెల్లిస్తాయి. వినియోగదార్లు నిత్యావసరాలను దుకాణాలనుండి కొంటారు. రైతులు తమ ఉత్పత్తులను వ్యాపారస్తులకు అమ్ముతారు. ప్రభుత్వ వృద్ధాప్యపు ఫించనులను చెల్లిస్తూ ఉంటుంది. దిగుమతులు దేశంలోకి వస్తాయి, ఎగుమతులు దేశంనుండి బయటకు పోతాయి. లావాదేవీలన్నీ క్రమ పద్ధతిలో వర్గీకరింపబడి జాతీయాదాయ ఖాతాల్లో చేర్చాలి. ఈ ఖాతాలు వివిధ లావాదేవీలు ఒకదానితో ఒకటి ఎలా ముడిపడి వున్నాయో తెల్పి ఆర్థిక వ్యవస్థ నిర్వహణను తెల్పుతాయి.

ఆర్థిక కార్యకలాపాలన్నింటినీ ఉత్పత్తి, వినియోగం, పెట్టుబడి అని మూడు తరగతులుగా విభజించవచ్చు. భూమి, శ్రమ, మూలధనం, వ్యవస్థాపన అనే నాలుగు కారకాల సహకారంతో వస్తు సేవలను తయారు చెయ్యడం ఉత్పత్తి కార్యక్రమమంటారు. ఈ వస్తుసేవలను అంటే వ్యక్తుల వాంఛలను తీర్చడానికి వాడే ప్రక్రియను వినియోగమంటారు. వినియోగానికి పోనూ మిగిలిన ఉత్పత్తిని ఉత్పాదక శక్తిని పెంచడానికి వాడతాము. ఈ మొత్తాన్ని పెట్టుబడి అంటారు. ఖాతాల నిర్మాణానికి ఉత్పత్తి, వినియోగం, ప్రభుత్వ రంగం అని మూడు రంగాలను గుర్తించవచ్చు.

జంటపద్దు నమోదు విధానంలో రెండు సూత్రాలున్నాయి. ఈ ఖాతాలు అంతర్గతంగానూ, బాహ్యంగానూ సంతులితము కావాలి. అంతర్గత సంతులితం అంటే ప్రతి క్రెడిట్ అంశానికీ సమానమైన డెబిట్ అంశం ఉండటం. బాహ్యసంతులితం అంటే ఒక ఖాతాలోని ప్రతి డెబిట్ అంశానికీ మరొక ఖాతాలో సమానమైన క్రెడిట్ అంశమూ, అదే విధంగా ఒక ఖాతాలోని ప్రతి క్రెడిట్ అంశానికీ మరొక ఖాతాలో సమానమైన డెబిట్ అంశమూ ఉండటం. ఈ సూత్రాలను ఒక ఉదాహరణతో విశదీకరిద్దాం. ఒక ఆర్థిక వ్యవస్థను ఉత్పత్తి రంగం, గృహసంబంధమైన రంగం అని రెండు రంగాలుగా విభజిద్దాం. ఉత్పత్తి విలువ రు. 200 కోట్లుఅనుకుందాము. వేతనాలు 170 కోట్లు, లాభాలు రు. 30 కోట్లు అనుకుందాం. గృహ రంగం తన పూర్తి ఆదాయాన్ని వినియోగ వ్యయానికి ఉపయోగించిందనుకుందాం. ఈ పరిస్థితిలో ఖాతాలు ఈ విధంగా ఉంటాయి.

ఉత్పత్తి రంగం ఖాతా (రు. కోట్లలో)

| డెబిట్ | క్రెడిట్ |
|---|---|
| ఉత్పత్తి కారకాలకు చెల్లింపులు: వేతనాలు 170 | అమ్మకమైన ఉత్పత్తి విలువ: 200 |
| లాభాలు: 30 | — |
| మొత్తం: 200 | మొత్తం: 200 |

గృహరంగం ఖాతా (రు. కోట్లలో)

| డెబిట్ | క్రెడిట్ |
|---|---|
| వినియోగ వ్యయం 200 | ఆదాయాలు: వేతనాలు: 170 |
| — | లాభాలు: 30 |
| మొత్తం: 200 | మొత్తం: 200 |

పై ఖాతాలు అంతర్గతంగానూ, బాహ్యంగానూ సంతులితంగా ఉన్నాయి. ప్రతి ఖాతాలోని డెబిట్ అంశం మరొక ఖాతాలో క్రెడిట్ అంశంగా వుంది. అంతేగాక ప్రతి ఖాతాలోని క్రెడిట్ అంశాల మొత్తం అదే ఖాతాలోని డెబిట్ అంశాల మొత్తానికి సమానం. పై ఉదాహరణలో గృహరంగం తమ ఆదాయంలో రు. 40 కోట్లు పొదుపు చేసిందనుకుందాం. ఇపుడు ఖాతాలు ఈ విధంగా ఉంటాయి.

ఉత్పత్తి రంగం ఖాతా (రు. కోట్లలో)

| డెబిట్ | క్రెడిట్ |
|---|---|
| ఉత్పత్తి కారకాలకు చెల్లింపులు: వేతనాలు: 170 | అమ్మకమైన ఉత్పత్తి విలువ: 160 |
| లాభాలు: 30 | ఇన్వెంటరీ పెట్టుబడి: 40 |
| మొత్తం: 200 | మొత్తం: 200 |

గృహరంగం (రు. కోట్లలో)

| డెబిట్ | క్రెడిట్ |
|---|---|
| | ఆదాయాలు |
| వినియోగం: 160 | వేతనాలు: 170 |
| వ్యక్తిగత పొదుపు: 40 | లాభాలు: 30 |
| మొత్తం: 200 | మొత్తం: 200 |

పై రెండు ఖాతాలు అంతర్గతంగా సంతులితమయ్యాయి కాని బాహ్యంగా సంతులితం కాలేదు. ఎందుకంటే

ఉత్పత్తి రంగం లోని ఇన్వెంటరీ పెట్టుబడికి అనుగుణంగా గృహరంగంలో డెబిట్ లేదు. అదే మాదిరిగా గృహరంగంలోని పొదుపుకు అనుగుణంగా ఉత్పత్తి రంగంలో క్రెడిట్ లేదు. ఈ రెండు అక్కౌంట్లను బాహ్యంగా సంతులితం చేయడానికి పొదుపు, పెట్టుబడి ఖాతాను తయారు చెయ్యాలి.

పొదుపు, పెట్టుబడి ఖాతా (రు. కోట్లలో)

| డెబిట్ | క్రెడిట్ |
|---|---|
| ఇన్వెంటరీ పెట్టుబడి: 40 | వ్యక్తిగత పొదుపు: 40 |
| మొత్తం: 40 | మొత్తం: 40 |

ఈ సందర్భంలో ఖాతాలకు సంబంధించిన మరొక సూత్రాన్ని గుర్తుంచుకోవాలి. పెట్టుబడిని ఉత్పత్తి రంగంలో క్రెడిట్‌గాను పొదుపు పెట్టుబడి రంగంలో డెబిట్‌గాను పరిగణిస్తారు. అదే మాదిరిగా పొదుపు గృహరంగంలో డెబిట్ గాను, పెట్టుబడి రంగంలో క్రెడిట్‌గాను పరిగణిస్తారు.

అకౌంటింగుకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలను తెలుసుకున్నాం కనుక ఇప్పుడు జాతీయాదాయ ఖాతాలను తయారు చేద్దాం. ఇక్కడ ఐదు ఖాతాలను అంటే 1. ఉత్పత్తి, 2. గృహరంగం, 3. మూలధనం, 4. ప్రభుత్వ రంగం, 5. విదేశీరంగాలను పరిగణనలోనికి తీసుకుందాం. ఉత్పత్తి ఖాతాలో ప్రైవేట్ అంతిమ వినియోగ వ్యయం, ప్రభుత్వ అంతిమ వినియోగ వ్యయం, స్థూల దేశీయ మూలధన కల్పన ఎగుమతులు క్రెడిట్ వైపునా, స్థూల ఆదాయ చెల్లింపులు, ప్రత్యక్ష దిగుమతులు డెబిట్‌వైపునా ఉంటాయి. గృహరంగం ఖాతాలో గృహరంగ ఆదాయం, ప్రభుత్వ బదిలీ చెల్లింపులు క్రెడిట్ వైపునా, గృహరంగం పొదుపు, గృహరంగంలోని వారు చెల్లించే ప్రత్యక్షపన్నులు, ప్రైవేట్ అంతిమ వినియోగం డెబిట్‌వైపునా ఉంటాయి. మూలధనం ఖాతాలో గృహరంగం పొదుపూ, సంస్థల పొదుపూ, ప్రభుత్వ పొదుపూ క్రెడిట్ వైపునా, విదేశాల్లో పెట్టిన నికర పెట్టుబడి స్థూల దేశీయ మూలధన కల్పనా డెబిట్ వైపునా ఉంటాయి. ప్రభుత్వ రంగం అకౌంటులో సంస్థల నుంచి, గృహరంగం నుంచి వసూలైన పన్నులు క్రెడిట్ వైపునా, ప్రభుత్వ పొదుపు, ప్రభుత్వ వినియోగ వ్యయం, బదిలీ చెల్లింపులూ డెబిట్ వైపునా ఉంటాయి. విదేశీ రంగం ఖాతాలో దిగుమతులూ, నికర విదేశీ పెట్టుబడి క్రెడిట్ వైపునా, ఎగుమతులు డెబిట్ వైపునా చూపుతారు. ప్రతి ఖాతాలోని మొత్తం జాతీయాదాయానికి చెందిన ఒక్కొక్క భావనను తెల్పుతుంది. ఉదాహరణకు, ఉత్పత్తిరంగం ఖాతాలోని క్రెడిట్ అంశాల మొత్తం స్థూల దేశీయ వ్యయాన్ని తెలుపగా, డెబిట్ అంశాల మొత్తం స్థూల దేశీయ ఉత్పత్తిని తెలుపుతుంది. గృహరంగం ఖాతా వ్యయార్హ ఆదాయాన్ని ఇస్తుంది. కొన్ని పరికల్పిత దత్తాంశాల ద్వారా ఈ ఖాతాలు ఎట్లా ఉంటాయో చూడండి.

BRAOU

ఉత్పత్తి రంగంపు ఖాతా (రు. కోట్లలో)

| డెబిట్ | రు. కోట్లు | క్రెడిట్ | రు.కోట్లు |
|---|---|---|---|
| గృహరంగపు ఆదాయం | 400 | ప్రైవేట్ వినియోగం | 240 |
| ప్రత్యక్ష పన్నులు | 50 | ప్రభుత్వ వినియోగవ్యయం | 80 |
| పొదుపు | 30 | స్థూల మూలధన కల్పన | 40 |
| దిగుమతులు | 40 | ఎగుమతులు | 160 |
| మొత్తం | 520 | మొత్తం | 520 |

గృహరంగం ఖాతా — రు. కోట్లలో

| డెబిట్ | రు.కోట్లు | క్రెడిట్ | రు. కోట్లు |
|---|---|---|---|
| పొదుపు | 120 | గృహరంగంపు ఆదాయం | 400 |
| ప్రత్యక్ష పన్నులు | 80 | ప్రభుత్వపు బదిలీ చెల్లింపులు | 40 |
| ప్రైవేట్ వినియోగ వ్యయం | 240 | | |
| మొత్తం | 440 | మొత్తం | 440 |

మూలధనం ఖాతా — రు. కోట్లలో

| డెబిట్ | రు. కోట్లు | క్రెడిట్ | రు. కోట్లు |
|---|---|---|---|
| వికర విదేశీ పెట్టుబడి | 120 | గృహరంగపు పొదుపు | 120 |
| స్థూల మూలధన కల్పన | 40 | సంస్థల పొదుపు | 30 |
| | | ప్రభుత్వపొదుపు | 10 |
| మొత్తం | 160 | మొత్తం | 140 |

ప్రభుత్వ రంగం ఖాతా — రు. కోట్లలో

| డెబిట్ | రు. కోట్లు | క్రెడిట్ | రు. కోట్లు |
|---|---|---|---|
| ప్రభుత్వ పొదుపు | 10 | సంస్థల ప్రత్యక్షపన్నులు | 50 |
| ప్రభుత్వ వినియోగ వ్యయం | 80 | గృహరంగపు ప్రత్యక్ష పన్నులు | 80 |
| బదిలీ చెల్లింపులు | 40 | | |
| మొత్తం | 130 | మొత్తం | 130 |

BRAOU

విదేశీ రంగం ఖాతా — రు. కోట్లలో

| డెబిట్ | రు. కోట్లు | క్రెడిట్ | రు. కోట్లు |
|---|---|---|---|
| ఎగుమతులు | 160 | దిగుమతులు | 40 |
| వికర విదేశీ పెట్టుబదులు | 120 | | |
| మొత్తం | 160 | మొత్తం | 160 |

## మీ అవగాహనను పరీక్షించుకొండి — I

1. జంటపద్దు నమోదు విధాన సూత్రాలు ఏమిటి?

## 8.3 సాంఘిక గణన మాత్రిక

పై సమాచారాన్ని మాత్రిక రూపంలో అమర్చి సంక్షిప్తం చేయవచ్చు. ఇటువంటి మాత్రికను సాంఘిక గణన మాత్రిక అంటారు.

మాత్రిక రూపంలో అమర్చినపుడు ఒక అడ్డ వరుసలో క్రెడిట్ లేదా ఆ రంగంలోకి వచ్చే మొత్తాలు, నిలువు వరుసలో డెబిట్ లేదా ఆ రంగం నుంచి బయటకు పోయే మొత్తాలు ఉంటాయి. ప్రతి అంశము ఒక అడ్డ వరుసకు చెందినపుడు మరొక నిలువు వరుసకు కూడా చెందుతుంది. కాబట్టి ప్రతి అంశాన్ని రెండు కోణాలనుండి చూడవచ్చు. మాత్రిక రూపంలో జాతీయాదాయ ఖాతాల మొదటి అడ్డ వరుసను పరిశీలిద్దాము.

| | ఉత్పత్తి అక్కౌంట్ | గృహరంగం అక్కౌంట్ | మూలధనం అక్కౌంట్ | ప్రభుత్వ రంగం అక్కౌంట్ | విదేశీ అక్కౌంట్ | అడ్డవరుస మొత్తం |
|---|---|---|---|---|---|---|
| ఉత్పత్తి అక్కౌంట్ | 0 | 240 | 40 | 80 | 160 | 520 |
| గృహరంగం అక్కౌంట్ | 400 | 0 | 0 | 40 | 0 | 440 |
| మూలధనం అక్కౌంట్ | 30 | 120 | 0 | 10 | 0 | 160 |
| ప్రభుత్వం అక్కౌంట్ | 50 | 80 | 0 | 0 | 0 | 130 |
| విదేశీ అక్కౌంట్ | 40 | 0 | 120 | 0 | 0 | 160 |
| నిలువ వరుస మొత్తం | 520 | 440 | 160 | 130 | 160 | |

BRAOU

ఉత్పత్తిదారులకు వినియోగ వస్తువుల అమ్మకం ద్వారా రు. 240 కోట్లు, స్థూల మూలధన కల్పన వల్ల రు. 40 కోట్లు, ప్రభుత్వ బదిలీ చెల్లింపుల వల్ల రు. 160 కోట్లు, ఎగుమతుల వల్ల రు. 160 కోట్లు ముదుతోంది. అదే విధంగా ఉత్పత్తి రంగ కారకాల చెల్లింపుల కింద గృహరంగానికి రు. 400 కోట్లు, పొదుపుకు రు. 30 కోట్లు, ప్రభుత్వానికి పన్నుల రూపంలో రు. 50 కోట్లు, దిగుమతులకు రు. 40 కోట్లు చెల్లిస్తోంది. గృహరంగం అందుకున్న ఆదాయంలో (రు. 440 కోట్లు) 240 కోట్లు వినియోగ వస్తువులకూ రు. 80 కోట్లు ప్రభుత్వానికి పన్నుల రూపంలోనూ, రు 120 కోట్లు పొదుపు కిందా చెల్లిస్తుంది. మిగిలిన అడ్డ వరుసలను, నిలువు వరుసలను ఇదే మాదిరిగా అర్థం చేసుకోవాలి.

జాతీయదారు ఖాతాల తయారీని గూర్చి 1953వ సం:లో ఐక్యరాజ్యసమితి వారు మొదటి మారుగా సలహాల నిచ్చారు. తిరిగి 1968 సం:లో కొత్త పద్ధతిని సూచించారు. అయితే మొదటి సారి ఇచ్చిన పద్ధతులకు కొత్తగా ఇచ్చిన పద్ధతులకు ఎక్కువ తేడా లేదు. కొత్త పద్ధతిలో మొదటి నిల్వ (Opening stock) చివరి నిల్వ (Closing stock) లకు సంబంధించిన దత్తాంశాలు కూడా చేర్చడమే ముఖ్యమైన మార్పు.

## 8.4 ఉత్పాదక ఉత్పత్తుల విశ్లేషణ

### 8.4.1 పరిచయం

ఉత్పాదక ఉత్పత్తుల విశ్లేషణ ఆర్థిక వ్యవస్థలోని వివిధ పరిశ్రమలు ఒకదాని మీద ఒకటి ఎలా ఆధారపడి ఉన్నాయో తెల్పుతుంది. సప్లయి, డిమాండ్‌ల మధ్య సమతౌల్యాన్ని కాపాడానికి అవసరమైన షరతులు. ఈ విశ్లేషణను బట్టి నిర్ణయించవచ్చు. ఈ పద్ధతిని 1951వ సం:లో లియాంటీఫ్ (Leontief) అనే ఆర్థిక శాస్త్రవేత్త కనుగొన్నాడు.

### 8.4.2 సాంఘిక గణన మ్యాత్రికలో తేడా

ఈ విశ్లేషణలో ప్రథమ అంశం ఉత్పాదక ఉత్పత్తుల పట్టిక నిర్మాణం, పైన చర్చించిన సాంఘిక గణన మ్యాత్రికలోలాగే ఉత్పాదక ఉత్పత్తుల పట్టిక కూడా ఖాతాల ఆధారంతోనే తయారవుతుంది. కాని సాంఘిక గణన మ్యాత్రికకూ, దీనికీ ఒక తేడా ఉంది. సాంఘిక గణన మ్యాత్రిక విస్తృతమైన భావన, ఆర్థిక వ్యవస్థలో జరిగిన లావాదేవీలన్నీ దీనిలో పరిగణిస్తారు. ఉత్పాదక — ఉత్పత్తుల పట్టికలో ఉత్పత్తి కార్యక్రమాన్ని కొన్ని రంగాల వారీగా విభజించి, ప్రతి రంగం కొనుగోళ్ళు (ప్రతి రంగం నుండి) అమ్మకాలు వివరంగా చూపుతారు. ఆర్థిక వ్యవస్థ ఎన్ని రంగాలుగా విభజించబడాలి అనే విషయం అధ్యయన ప్రయోజనంపైనా, అందుబాటులో ఉన్న వనరులపైనా ఆధారపడి వుంటుంది.

### 8.4.3 ఉత్పాదక ఉత్పత్తుల పట్టిక

ఉత్పాదక — ఉత్పత్తుల పట్టికలో వుండే అంశాలను పరిశీలిద్దాం. అవగాహనా సౌలభ్యం కోసం ఆర్థిక వ్యవస్థను మూడు రంగాలుగా ప్రైమరి, సెకండరీ, టెరిషరీ రంగాలుగా విభజిద్దాం. వీటి ఉత్పత్తులు అదే క్రమంలో రు. 250 రు. 200, రు 150 అనుకుందాం. ఈ ఉత్పత్తులలోని కొంతభాగాన్ని ఈ రంగాలే కొనుగోలు చేస్తాయి. దీనినే మధ్యస్థ ఉపయోగం (intermediate use) అంటారు. మిగిలిన ఉత్పత్తి వినియోగానికీ, పెట్టుబడికీ, ఎగుమతులకూ వాడతారు. వీటి మొత్తాన్నే అంత్య డిమాండ్ (Final Demand) అంటారు. ఉత్పత్తి మధ్యస్థ ఉపయోగానికీ, అంత్య డిమాండ్‌కూ ఎలా పంపిణీ అయిందో కింది పట్టికలో చూడవచ్చు.

ఉత్పాదక — ఉత్పత్తుల పట్టిక

| ఉత్పత్తి | వినియోగిస్తున్నరం గాలు | | | అంత్య | మొత్తం |
|---|---|---|---|---|---|
| రంగాలు | ప్రైమరీ | సెకండరీ | టెరిషరీ | డిమాండ్ | ఉత్పత్తి |
| ప్రైమరీ | 20 | 60 | 30 | 140 | 250 |
| సెకండరీ | 30 | 20 | 15 | 135 | 200 |
| టెరిషరీ | 10 | 40 | 15 | 85 | 150 |
| మొత్తం | 60 | 150 | 60 | 360 | 600 |



BRAOU

మొదటి అడ్డు వరుస ప్రైమరీ రంగం మొత్తం ఉత్పత్తి పంపిణీని తెల్పుతుంది. రు. 250 విలువ చేసే మొత్తం ఉత్పత్తిలో రు. 20లు ప్రైమరీ రంగపు ఉత్పాదక వస్తువులకూ రు. 60లు సెకండరీ రంగం ఉత్పాదక వస్తువులకూ, రు. 30లు టెరిషరీ రంగం ఉత్పాదక వస్తువులకూ, రు. 140లు అంత్య డిమాండ్‌కూ పంపిణీ అయింది. మిగిలిన రెండు అడ్డ వరుసలను కూడా ఇదే మాదిరిగా అర్థం చేసుకోవాలి.

ఉత్పత్తి విలువకూ మధ్యస్థ ఉత్పాదకాలకూ మధ్య గలభేదాన్నే అదనపు విలువ (value added) అంటారు. ఈ అదనపు విలువ ప్రాథమిక కారకాలైన భూమి, శ్రమ, మూలధనం, వ్యవస్థాపనలకు చెల్లింపులుగా వాడతారు. ఈ చెల్లింపులనే అదే క్రమంలో భాటకం, వేతనాలు, వడ్డీ, లాభాలు అంటారు. ఈ కారకాల చెల్లింపులను కూడా ఉత్పాదక ఉత్పత్తుల పట్టికలో చూపాలనుకుంటే ఈ విధంగా చూపాలి.

ఉత్పాదక ఉత్పత్తుల పట్టిక (రూ.లలో)

| ఉత్పత్తి | వినియోగరంగాలు | | | అంత్య | మొత్తం |
|---|---|---|---|---|---|
| రంగాలు | ప్రైమరీ | సెకండరీ | టెరిషరీ | డిమాండ్ | ఉత్పత్తి |
| ప్రైమరీ | 20 | 60 | 30 | 140 | 250 |
| సెకండరీ | 30 | 20 | 15 | 135 | 200 |
| టెరిషరీ | 10 | 40 | 15 | 85 | 150 |
| మొత్తం మధ్యస్థ ఉత్పాదకాలు | 60 | 120 | 60 | | |
| అదనపు విలువ ప్రాథమిక ఉత్పాదకాలు | 190 | 80 | 90 | | |
| 1) భాటకం | 50 | 10 | 5 | | |
| 2) వేతనాలు | 70 | 20 | 50 | | |
| 3) వడ్డీ | 30 | 20 | 50 | | |
| 4) లాభాలు | 40 | 30 | 20 | | |
| మొత్తం ఉత్పత్తి | 250 | 200 | 150 | 360 | 600 |

ప్రైమరీ రంగంలోని అదనపు విలువ రు. 190లోను రు. 50లు, భాటకానికి రు. 20లు వేతనాలకు, రు. 30లు వడ్డీకి, రు. 40లు లాభాలకు వెచ్చించినట్లు పట్టికలో గమనించవచ్చు. ఈ ప్రాథమిక చెల్లింపులను మధ్యస్థ ఉత్పాదకాల విలువకు కలిపితే మొత్తం ఉత్పత్తి విలువ వస్తుంది. ఈ విధంగా అడ్డ వరుసల మొత్తం అదే నిలువు వరుస మొత్తానికి సమానంగా ఉంటుంది.

BRAOU

### 8.4.4 ఉత్పాదక ఉత్పత్తుల విశ్లేషణ ప్రయోజనాలు

ఉత్పాదక – ఉత్పత్తుల పట్టిక వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. కొన్ని ఉపయోగాలు కింద చూడండి.

1. ఉత్పాదక – ఉత్పత్తుల పట్టిక వివిధ రంగాల ముందు, వెనుక అనుబంధాలను (Forward and Backward linkages) గణించడానికి ఉపయోగిస్తుంది. ఒక రంగం వృద్ధి చెందినపుడు ఆ రంగానికి అవసరమైన వివిధ ఉత్పాదకాలకు డిమాండ్‌ను కలుగజేయడం ద్వారా ఇతర రంగాల వృద్ధికి దోహదం చేస్తుంది. ఈ ప్రభావాన్నే వెనుక అనుబంధ ప్రభావం (Back ward linkage effect) అంటారు. ఉదాహరణకు వ్యవసాయరంగం వృద్ధి చెందితే ఎరువులు, క్రిమి సంహారక మందులు, యంత్రాలు మొ: వాటికి డిమాండ్ పెరుగుతుంది. ఇదే వెనుక అనుబంధ ప్రభావం. ఇదే విధంగా వ్యవసాయ ఉత్పత్తులు ఇతర పరిశ్రమల్లో వాడితే వ్యవసాయరంగంతో పాటు ఆయా రంగాలు కూడా వృద్ధి సాధిస్తాయి. ఉదాహరణకు చెఱకు ఉత్పత్తి పెరిగితే పంచదార పరిశ్రమ వృద్ధి చెందుతుంది. ఈ ప్రభావాన్నే ముందు అనుబంధం అంటారు. ఈ విధంగా ఒక రంగంలో వృద్ధి సాధించినపుడు ముందు అనుబంధం వల్లగానీ వెనుక అనుబంధం వల్లగానీ ఇతర రంగాల్లో కూడా వృద్ధి సంభవిస్తుంది.

2. ఈ విశ్లేషణను భవిష్యత్సూచనకు (Forecasting) వాడవచ్చు. వివిధ రంగాల ఉత్పత్తుల అంత్య డిమాండ్ తెలిస్తే ఈ పట్టికలు వాడి వివిధ రంగాల ఉత్పత్తులకు మొత్తం డిమాండ్‌ను (అంత్య + మధ్యస్థ) అంచనా వేయవచ్చు. ఈ అంచనాలు రంగాల వారీ వృద్ధిలో హెచ్చుతగ్గులు లేకుండా చూసుకోడానికి ఉపయోగపడతాయి.

3. వివిధ రంగాల మొత్తం డిమాండ్‌ను అంచనావేస్తే, ఈ అంచనాల నుంచి మూలధనం, శ్రామికుల అవసరాలను కూడ అంచనా వేయవచ్చు.

BRAOU

### మీ అవగాహనను పరీక్షించుకొండి – 2

2. ఉత్పాదక ఉత్పత్తుల మాత్రిక అనగానేమి?
3. సాంఘిక గణన మాత్రికతో ఉత్పాదక ఉత్పత్తుల మాత్రిక ఏ విధంగా విభేదిస్తుంది.
4. ఉత్పాదక ఉత్పత్తుల విశ్లేషణ ప్రయోజనాలేమి?

## 8.5 సారాంశము/ముగింపు

జాతీయాదాయ ఖాతాలు ఆర్థిక వ్యవస్థలోని వివిధ కార్యకలాపాలను, రంగాలను, లావాదేవీలను ఒక దానినుంచి మరొక దానిని వేరు చేయడానికి వీలైన లావాదేవీల క్రమబద్ధమైన అమరిక. ఈ ఖాతాలు వివిధ లావాదేవీల సంబంధాలనూ ఆర్థిక వ్యవస్థ ఎలా పనిచేస్తోందో తెల్పుతాయి.

ఈ పద్ధతి వ్యాపార ఖాతాలనుసరించే జంటపద్దు నమోదు విధానంపై ఆధారపడినది. ప్రతి ఖాతాలోను (వైపులు) కోణాలు ఉంటాయి. అవి క్రెడిట్, డెబిట్ కోణాలు. జంట పద్దు నమోదు పద్ధతిలో రెండు సూత్రాలు ఉన్నాయి. ఖాతాలు అంతర్గతంగానూ, బాహ్యంగానూ, సంతులితం కావాలి. అంతర్గత సంతులితమంటే ప్రతి ఖాతాలోనూ ప్రతి క్రెడిట్ అంశానికి సమానమైన డెబిట్ అంశముండాలి. బాహ్య సంతులితమంటే ఒక ఖాతాలోని ప్రతి డెబిట్ అంశానికి అనుగుణంగా మరొక ఖాతాలో క్రెడిట్ అంశముండాలి. ఈ ఖాతాల్లోని సమాచారాన్ని మాత్రిక రూపంలో అమర్చడం వల్ల సాంఘిక గణన మాత్రిక

ఏర్పడుతుంది. ఉత్పాదక ఉత్పత్తుల మాత్రికలో ఉత్పత్తి రంగం అనేక ఉపరంగాలుగా విడిపోయి, ఈ ఉపరంగాల మధ్య ఉత్పత్తి ప్రవాహాలను గుర్తించవచ్చు. ఈ ఉత్పాదక ఉత్పత్తి పట్టికను ఎన్నో ప్రయోజనాలకు వాడవచ్చును. ఉదాహరణకు ముందు, వెనుక సంబంధాలను అంచనా వేయడానికి, వివిధ రంగాలలో ఉత్పత్తికి కావలసిన సరుకులను అంచనా వేయడానికి, మూలధనం, శ్రామికుల అవసరాలను అంచనా వేయడానికి ఉత్పాదక ఉత్పత్తుల పట్టిక ఉపయోగపడుతుంది.

రచన, అనువాదం: డా.ఎస్. సుబ్రహ్మణ్యం.

## 8.6 సంప్రదింపు గ్రంథాలు


1. Stone and Stone : National Income Analysis


## 8.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

I *కింది వాటికి 30 పంక్తులలో జవాబులు రాయండి.*

1. జాతీయ ఆదాయ ఖాతాల సూత్రాలను వివరించి వాణిజ్య ఖాతాలతో పోల్చండి.
2. ఉత్పాదక ఉత్పత్తుల పట్టిక అంటే ఏమిటి? దీనిని ఎలా నిర్మిస్తారు? దీని ఉపయోగాలేమిటి?

II *కింది వాటిని గురించి 10 పంక్తులు రాయండి.*

1. సాంఘిక గణన మాత్రికతో ఉత్పాదక ఉత్పత్తుల మాత్రిక ఎట్లు విభేదిస్తుంది?
2. ఖాతాల్లో అంతర్గత సంతులితం, బాహ్య సంతులితాలను గురించి రాయండి.

3. *కింది భావనలను వివరించండి.*

1. ముందు అనుబంధం
2. వెనుక అనుబంధం

B R A O U

BRAOU

# ఖండం — III

## అభివృద్ధి ప్రణాళికా రచన

భారతదేశంలో ఆర్థిక ప్రణాళికా రచనను వివరిస్తూ, ఈ ఖండం భారతదేశంలో అమలవుతున్న పంచవర్ష ప్రణాళికల లక్ష్యాలనూ, వ్యూహాలనూ, పెట్టుబడి అంచనాలనూ ఆయా ప్రణాళికల విజయాలను చర్చిస్తుంది. గత మూడు, నాలుగు దశాబ్దాల కాలంలో అంటే ప్రణాళికా కాలం ఆరంభం నుంచీ ఆర్థిక పెరుగుదల, సామాజిక న్యాయం, ఆర్థిక సమానతలు, ఉద్యోగిత, ధరల స్థాయి, స్వయం పోషకత్వం మొదలైన అంశాలలో మనం సాధించిన ప్రణాళికా విజయాలను అవగాహన చేసుకొనడానికి ఈ ఖండంలోని చివరి భాగం ఉపయోగపడుతుంది.

ఈ ఖండంలో చేర్చిన భాగాలు :

భాగం 9: భారతదేశంలో ఆర్థిక ప్రణాళిక.

భాగం 10: భారతదేశంలో పంచవర్ష ప్రణాళికలు

భాగం 11: భారతదేశంలో పంచవర్ష ప్రణాళికల విజయాలు.

B R A O U

Dr. BRAOU
LIBRARY

Acc. No: T-3456
Class No: 330 ARD

[illegible]

BRAOU

# భాగం _ 9: భారత దేశంలో ఆర్థిక ప్రణాళిక

విషయక్రమం


9.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
9.1 పరిచయం
9.2 ప్రణాళికా రచన ఆవశ్యకత
    9.2.1 స్వేచ్ఛా వ్యాపార (లైసేజ్ ఫేయిర్) విధాన పరిమితులు
    9.2.2 ప్రభుత్వ పాత్ర ప్రణాళికల పాత్ర
9.3 భారతదేశంలో ప్రణాళికా రచన
9.4 భారతదేశ ప్రణాళికా రచన లక్షణాలు
9.5 భారతదేశ ప్రణాళికల ప్రధాన లక్ష్యాలు
9.6 సారాంశం/ముగింపు
9.7 సంప్రదింపు గ్రంథాలు
9.8 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 9.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ప్రణాళికా రచన విధానాన్నీ, ప్రక్రియనూ, భారతదేశ ప్రణాళికల లక్ష్యాలనూ వివరించడం ఈ పాఠం లక్ష్యం.

ఈ పాఠాన్ని చదివిన తర్వాత మీరు

- ★ ఒక ఆర్థిక వ్యవస్థలో ప్రణాళికా రచన ఆవశ్యకతను గుర్తించగలరు.
- ★ బ్రిటిష్ పాలనను దృష్టిలో పెట్టుకొని భారతదేశంలో ప్రణాళికల ప్రాధాన్యతను విశ్లేషించగలరు.
- ★ భారతదేశ ప్రణాళికా రచన లక్షణాలను వివరించగలరు.
- ★ భారతదేశ ప్రణాళికల ప్రధాన లక్ష్యాలను తెలుసుకోగలరు.

## 9.1 పరిచయం

భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి తగిన అత్యంత లాభకరవ్యూహాన్ని ఎంపిక చేయడానికి అవసరమైన పరిస్థితులను గురించి ఇంతకు ముందు పాఠాలలో చర్చించాం. దేశంలో నెలకొనివున్న నిరుద్యోగం, అపారంగా పెరుగుతున్న జనాభా, మూలధన లోపం మొదలైన పరిస్థితుల్లో దేశ ఆర్థిక వ్యవస్థ తన లక్ష్యాలను చేరుకొనే సమయంలో, సమార్గంలో లభ్యమయ్యే వస్తువులనూ, ఉత్పత్తి విధానాలనూ దృష్టిలో ఉంచుకొని ఆ వ్యూహ లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది.

ప్రారంభదశనుండి లక్ష్యం చేరుకొనే వరకు మొత్తం కార్యక్రమాన్ని అదుపులో ఉంచడానికి, మార్గదర్శకంగా ఉండడానికి, పర్యవేక్షించడానికి పెద్ద యంత్రాగం అవసరమౌతుంది. అందువల్ల మొత్తం ప్రణాళికా రచనకు బాధ్యత వహించే ఒక కేంద్ర సంస్థ, అభివృద్ధి దశలన్నీ ఉన్న దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం. దీనివల్ల ఆర్థిక వ్యవస్థ అవరోధాలు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఇతర ఒడిదుడుకులు లేకుండా అభివృద్ధి చెందగలుగుతుంది. ఈ పనిలో ప్రభుత్వ రంగం లక్ష్యం నిర్దేశించిన ప్రాధాన్యతలను, కేటాయింపులను అదుపు చేసి, క్రమంగా అమలు చేయగలుగుతుంది. సమగ్రమైన ప్రణాళిక మొత్తాన్ని 5 సంవత్సరాల కొకసారి అమలు చేసే విభాగాలుగా



BRAOU

విడగొట్టవచ్చు. దీనివల్ల స్వల్పకాలాలకు కేటాయింపును సులభతరం చేయడానికీ, అవసరమైన కార్యక్రమాలను అమలు చేయడానికీ వీలు కలుగుతుంది. 5 సంవత్సరాల కొకసారి కార్యక్రమాలు అమలు చేయవలసిన సమయాలనూ, వాటి అవసరాలనూ, సాధించిన విజయాలనూ, లోపాలనూ సవరించడానికి తీసుకోవలసిన చర్యలను సమీక్షించడానికి వీలు కలుగుతుంది.

## 9.2 ప్రణాళికా రచన ఆవశ్యకత

గత కొన్ని దశాబ్దాలనుంచి ఆర్థిక కార్యకలాపాలలో ప్రభుత్వ జోక్యం పెరుగుతూ ఉంది. ఈ జోక్యం వల్ల సామాజిక జీవనంలో సాంఘికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎంతో ప్రభావం కనిపిస్తోంది. 19వ శతాబ్దపు సిద్ధాంతతత్వం (Philosophy) అయిన స్వేచ్ఛా వాణిజ్య విధానం (Laissej-faire Policy) ప్రకారం ప్రజాజీవితంలో ప్రభుత్వం ఎంత అల్పంగా జోక్యం చేసుకొంటే సమాజానికి అంత శ్రేయస్కరమనీ, సమాజ ప్రగతికి అంత దోహదమనీ తెలుస్తుంది. కాని ఈ విధానం ఎన్నో పరిమితులలో ఉంది.

### 9.2.1 స్వేచ్ఛా వాణిజ్య విధాన పరిమితులు

1. స్వేచ్ఛా వాణిజ్య విధానం వల్ల ఆదాయ పంపిణీ అసమానతలకు దారి తీస్తుంది. వస్తూత్పత్తి ధనవంతులకోసం జరుగుతుంది. కాగా బీద వారికి విద్య, ఆరోగ్యం, గృహవసతి, ఆహారం మొదలైన నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉండవు.

2. ఆర్థిక వ్యవస్థలో జరిగే ప్రధాన మార్పులకు అనుగుణంగా మార్కెటు వ్యవస్థ కదలదు. ఏ రంగాలకైతే వనరులు అవసరమవుతాయో ఆ రంగాలకు లభ్యం కావు. వీటివల్ల జనాభాలో అధిక సంఖ్యాకులకు వ్యతిరేకంగా కొందరికి మాత్రమే అధిక ఆదాయాలు లభ్యమవుతాయి. పరిమితమైన వనరుల పంపిణీ అసమానతలతో కూడి ఉంటుంది. అదే సమయంలో అనవసరపు ఉత్పత్తి తగ్గదు. వీటన్నిటి ఫలితంగా అత్యల్ప ఆదాయంవల్ల అనేకులు పేదరికంతో బాధపడుతూ ఉంటారు.

3. మార్కెటు ఆర్థిక వ్యవస్థ దుబారా వ్యయానికి దోహద పడుతుంది. మార్కెటులో ఏర్పడే పోటీవల్ల పెట్టుబడిదారులు వారి సాంకేతిక పరిజ్ఞానాన్ని, సాంకేతిక యాంత్రీకరణను పెంచుకొనడానికి ఇష్టపడతారు. అంతేకాకుండా ప్రకటనలపై అధికంగా వ్యయం చేయడానికి ప్రయత్నిస్తారు. ఈ ప్రక్రియలో వస్తువుల నాణ్యత దెబ్బతినవచ్చు.

4. స్వేచ్ఛా విదేశీ వ్యాపార మనేది స్వయం నియంత్రణతో కూడి ఉంటుంది. ఇందులో ప్రభుత్వ జోక్యం ఉండదు. కాని స్వయం క్రమ బద్ధీకరణ (స్వయం నియంత్రణ) విధానం అనేక సమస్యలకు దారితీస్తుంది.

5. మార్కెటు ఆర్థిక వ్యవస్థ అస్థిరతకు దోహదపడుతుంది. ద్రవ్యాన్ని సృష్టించడంలో మార్కెటు వ్యవస్థ వ్యాపార చక్రాలను, నిరుద్యోగితను, బీదరికాన్ని (1930లో వచ్చిన ఆర్థిక మాంద్యం వంటి సమస్యలను) ఉద్భవింపజేస్తుంది.

ఆధునిక కాలంలో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థల్లో గూడ స్వేచ్ఛావాణిజ్య విధానానికి ప్రాధాన్యత తగ్గుతూ ఉంది. దీనికి ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థల్లో గుర్తింపు పోయిందనే చెప్పవచ్చు. 19వ శతాబ్దంలో ఇతరుల జోక్యం లేకపోవడమనే అభిప్రాయానికి విలువ ఉండేది. కాని 20వ శతాబ్దంలో ప్రభుత్వ జోక్యం అవసరమనే విషయాన్ని అన్ని ఆర్థిక వ్యవస్థలు గుర్తిస్తున్నాయి.

### 9.2.2 ప్రభుత్వ పాత్ర — ప్రణాళికల పాత్ర

ఆర్థిక కార్యకలాపాల కొనసాగింపు ప్రస్తుతం ఏ ఆర్థిక వ్యవస్థలోని ప్రభుత్వమైనా అప్రధాన పరిశీలకురాలిగా ఉండదు. ఈ శతాబ్దం ఆరంభం నుంచి ప్రభుత్వం అనేక కార్యకలాపాలలో చురుకుగా పాల్గొంటున్నది. పౌరుల



BRAOU

రక్షణ, నియంత్రణ, సంరక్షణ మొదలైన బాధ్యతలను ప్రభుత్వం నిర్వహిస్తున్నది. జోక్యం చేసుకోని, నియంత్రణ చేయలేని, క్రమబద్ధం చేయలేని క్షేత్రం అంటూ ఆధునిక ప్రభుత్వానికి ఉండదు. ప్రజలు ఎన్నుకొన్న ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం తప్ప ఏ యితర ఏజెన్సీగానీ, సంస్థగానీ ప్రణాళికా రచనవంటి జాతీయ బాధ్యతను చేపట్టలేవు. వ్యక్తులు కూడా చేపట్టలేరు. కాని ప్రతి ఆధునిక ఆర్థిక వ్యవస్థ ప్రణాళికా బద్ధమయ్యే ఉండాలా అనేది ఒక పెద్ద ప్రశ్న. ఈ విషయం మీద భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు ప్రణాళికను ఒక మిలిటరీ వ్యవస్థగా భావించి వ్యతిరేకించారు. ఇతరుల అభిప్రాయంలో ప్రణాళికా రచన కోరతగినది కానప్పటికీ అది ఒక అవసరమైన ప్రక్రియ. ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థ కార్యకలాపాలను నియంత్రించడం, క్రమబద్ధం చేయడమే కాకుండా పూర్తి నిర్వహణ బాధ్యతను ప్రభుత్వానికి రాజ్యానికి అంటగడుతుంది. సామ్యవాద తరహా సమాజాన్ని స్థాపించాలనే లక్ష్యమున్న ఏ ప్రభుత్వమైనా ప్రణాళికా బద్ధ ఆర్థికాభివృద్ధికి కృషిచేయవలసి ఉంటుంది.

శాంతి భద్రతలను మాత్రమే పరిరక్షించవలసిన ప్రభుత్వ కర్తవ్యం ఆధునిక కాలంలో విస్తృతమయింది. భారతదేశంలో రాజ్యాంగం, అందులో ముఖ్యంగా ఆదేశ సూత్రాలు, ప్రజల పూర్తి సామాజికార్థిక సంక్షేమ బాధ్యతలను ప్రభుత్వానికి అప్పగించింది. శ్రామిక సంక్షేమం వంటి అనేక సాంఘికార్థిక న్యాయాంశాలను, లక్ష్యాలను భారత రాజ్యాంగంలో నమోదుచేసి, ప్రణాళికా బద్ధ ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ కర్తవ్యాన్ని ద్విగుణీకృతం చేసింది.

పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలలో ప్రభుత్వం పెద్దతరహాలో పాల్గొనడం ద్వారా జాతీయాదాయం తప్పనిసరిగా పెరుగుతుంది. ప్రభుత్వ రంగం నుంచి వచ్చిన ఆదాయం పునః పంపిణీకోసం. ఆదాయ అసమానతల తగ్గింపుకోసం, పునః పెట్టుబడికోసం ఉపయోగిస్తారు. జాతీయాదాయం, తలసరి ఆదాయం పెరుగుదల కోసం, ఆదాయ సంపదల అసమానతలను తగ్గించడం కోసం, ఉపాధి కల్పనా సౌకర్యాలను పెంచడం కోసం, ఆర్థిక వ్యవస్థ సంపూర్ణాభివృద్ధికోసం ప్రణాళికా రచనను చేపట్టడం ఎంతైనా అవసరమని చెప్పవచ్చు. ప్రణాళికా రచన వలన ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఆర్థిక అవరోధాలు,ఇతర ఒడుదుడుకులు లేకుండా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందగలుగుతుంది. ఈ పనిలో ప్రణాళికా లక్ష్యం నిర్దేశించిన ప్రాధాన్యతలను, కేటాయింపులను ప్రభుత్వ రంగం అదుపుచేసి, సక్రమంగా నిర్వహించగలుగుతుంది. సమగ్రమైన ప్రణాళిక మొత్తాన్ని 5 సంవత్సరాల కొకసారి అమలుచేసి, విభాలుగా విడగొట్టవచ్చు. దీనవల్ల స్వల్పకాలిక కేటాయింపులను సులభతరం చేయడానికి అవసరమైన కార్యక్రమాలను అమలు చేయడానికి వీలు కలుగుతుంది. 5 సంవత్సరాల కొకసారి కార్యక్రమాలను అమలు చేయవలసిన సమయాలను, వాటి అవసరాలను, సాధించిన విజయాలను, లోపాలను సవరించడానికి తీసుకోవలసిన చర్యలను సమీక్షించడానికి వీలు కలుగుతుంది.

---

## మీ అవగాహనను పరీక్షించుకొండి — 1

---

1. స్వేచ్ఛా వాణిజ్య విధాన పరిమితులు ఏమిటి?
2. ప్రస్తుత ప్రభుత్వాల బాధ్యతలు ఏమిటి?

---

## 9.3 భారత దేశంలో ప్రణాళికా రచన

---

ముందుగా నిర్ణయించుకొన్న కొన్ని సాంఘిక, ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి ఆర్థిక కార్యక్రమాలను ప్రభుత్వం సరైన పద్ధతిలో క్రమబద్ధం చేయడం ప్రణాళికా రచనలో ప్రధాన మని తెలుసుకొన్నాము. స్వాతంత్ర్యానికి ముందు భారత ఆర్థిక వ్యవస్థ పెరుగుదల లేని స్తబ్దపరిస్థితిలో ఉండేది. దాదాపు రెండు శతాబ్దాల కాలం,



BRAOU

పశ్చిమ దేశాలలో అపారమైన సాంకేతిక అభివృద్ధి, పెరుగుదల జరుగుతున్న కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ పేదరికం అనే విషవలయంలో చిక్కుకొంది. దీనికి ఒక కారణం భారతదేశంలో బ్రిటిష్ వారు అనుసరించిన ఆర్థిక విధానం. అప్పటి ఉత్పత్తి పద్ధతి వలస విధానంపై ఆధారపడి ఇంగ్లండు అవసరాలను తీర్చడానికి వీలుగా ఉండేది. ఇంగ్లండుకు ముడి పదార్థాలను ఎగుమతి చేయడానికి వీలుగా వ్యవసాయం, తోటలు పెంపకాన్ని, రైల్వేలు, నౌకాశ్రయాలువంటి కొన్ని రవాణా సౌకర్యాలను మాత్రమే బ్రిటిష్‌వారు ప్రోత్సహించారు. అంతేగాక ఇంగ్లీషు వస్తువులకు భారతదేశాన్ని మార్కెట్టుగా రూపొందించారు.

భారత ఆర్థిక వ్యవస్థ వెనుకబడిన దేశ లక్షణాలన్నిటిని కలిగియుంది. ప్రపంచం మొత్తంలో అతి తక్కువ తలసరి ఆదాయం, తలసరి వినియోగం, జనాభా పెరుగుదల, జనసాంద్రత ఉంది. జనాభాలో అధిక శాతం గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తూ, ఎక్కువ స్థాయిలో నిరక్షరాస్యత, అధికమైన మరణాల రేటుతో తీవ్ర వ్యాధులకు గురి అవుతూ ఉండేవారు. భూమిలో ఎక్కువ భాగం సారవిహీనమై జనాభా పెరుగుదల రేటుకన్న తక్కువ వ్యవసాయ ఉత్పత్తి ఉండేది. దీనివల్ల ప్రజలలో పేదరికం, పౌష్టిక ఆహారలోపం అధికంగా ఉండేవి. ఆదాయాలలో తేడాలు ఎక్కువగా ఉండి అతి తక్కువ మంది ధనవంతులుగాను, అధిక సంఖ్యాకులు అతి పేద వారుగానూ ఉండేవారు. తగినపని ఉండేది కాదు. ప్రచ్ఛన్న నిరుద్యోగం ఉండేది. రవాణా, విద్యుచ్ఛక్తి ఇతర ప్రాతిపదిక సౌకర్యాలు అతి ప్రాథమిక స్థాయిలో ఉండేవి.

స్వాతంత్ర్యానంతరం ఇటువంటి వెనుకబడిన ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి పథంవైపు మళ్లించడానికి ప్రభుత్వం ప్రణాళికారచనను చేపట్టవలసి వచ్చింది. ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి పరచే బాధ్యతాయుతమైన కార్యాన్ని ప్రయివేటు రంగం చేపట్టగలదా అని ఆలోచించారు. బ్రిటిష్ వారు స్వేచ్ఛా వ్యాపార విధానాన్ని అమలుచేయడం వల్ల అనేక రంగాలలో ప్రయివేటు రంగం స్థిరత్వాన్ని సాధించింది. అయితే ప్రయివేటు రంగానికి బాధ్యత అంతా వదిలివేస్తే లాభాలను మాత్రమే దృష్టిలో ఉంచుకొనే ఆ రంగం దేశానికి బలమైన ఆర్థిక వ్యవస్థను ఇవ్వలేదని భావించారు. అయితే ప్రజాస్వామ్యాన్ని ఎంచుకొన్న మన దేశంలో ప్రభుత్వమే అన్ని రంగాలను అదుపు చేసే సామ్యవాదం అమలు చేయడం కూడా అభిలషణీయం కాదు.

ఈ కారణాల వల్ల మిశ్రమ ఆర్థిక వ్యవస్థ రూపొందింది. దీనిలో పబ్లిక్కు రంగం ద్వారా ప్రభుత్వం ఆర్థిక కార్యక్రమాలకు సరైన మార్గాన్ని చూపిస్తుంది. అదే సమయంలో ప్రణాళికలు నిర్దేశించిన ఆదేశాలకు లోబడి ప్రయివేటు రంగం పనిచేస్తుంది. 1987 లోను 1956లోను చేసిన పారిశ్రామిక విధానచట్టాలు ఆర్థిక వ్యవస్థలో పబ్లిక్కు, ప్రయివేటు రంగాల స్థానాన్ని స్పష్టీకరించాయి. పారిశ్రామికాభివృద్ధికి ప్రాతిపదిక సౌకర్యాలను కల్పించే బాధ్యత పబ్లిక్కు రంగానిది కాగా, వినియోగ వస్తువుల ఉత్పత్తి విషయంలో ప్రయివేటు రంగానికి స్వేచ్ఛయిచ్చారు. ఈ విధంగా మిశ్రమ వ్యవస్థలో రెండు రంగాల ఏర్పాటు ప్రభావాన్ని మరొక పాఠంలో తెలుసుకొంటాం.

## 9.4 భారత ప్రణాళికా రచన లక్షణాలు

భారత దేశ ఆర్థికాభివృద్ధిని ప్రణాళికా బద్ధంగా సాధించడం గురించి మొదటిసారి శ్రీ విశ్వేశ్వరయ్య 1934లో ప్రచురించిన "భారతదేశంలో ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థ" అనే గ్రంథంలో చర్చించారు. ఆ తర్వాత కాలంలో అనేక ప్రణాళికలు తయారు చేసినా వీటిని అమలు చేయలేదు. 1950లో ప్రణాళికా సంఘం స్థాపనతో మన దేశంలో ప్రణాళికా రచన ప్రారంభమయింది. ఆర్థిక వ్యవస్థలోని భౌతిక, సాంకేతిక, మూలధన సంబంధమైన విషయాలను పరిగణనలోనికి తీసుకొని సాంఘిక న్యాయంతో కూడిన అభివృద్ధిని సాధించడానికి ప్రణాళికను రూపొందించే బాధ్యతను ప్రణాళికా సంఘానికి ఇచ్చారు. అభివృద్ధికి అవరోధంగా ఉన్న విషయాలను చర్చించి, వాటిని తొలగించడానికి మార్గాలను సూచించవలసినదిగా సంఘాన్ని కోరారు. సోషలిస్టు తరహా సమాజ స్థాపన ధ్యేయంగా ఎంచుకొవడం వల్ల వస్తువుల ఉత్పత్తి, వినియోగాలలో సామాన్య ప్రజలకు సన్నిహిత సంబంధం కలిగించడం, అభివృద్ధి ఫలితాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు కూడా

చేరేటట్టు చూడవలసిన అవసరం ఏర్పడింది. మన దేశంలో ప్రణాళికా రచన అనేక ఆశయాలతో ఉంది. జాతీయ ఆదాయాన్ని పెంచడం మాత్రమే గాక మొత్తం ఉత్పత్తిని సాంఘిక, ఆర్థిక సంబంధాల వ్యవస్థను పూర్తిగా మార్చి, ఆదాయం, సంపద న్యాయమైన పద్ధతిలో పంపిణీ జరిగేటట్లు చూడడం ఈ ఆశయాలలో ముఖ్యమైనవి. ఈ లక్ష్య సాధనలో ప్రధాన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం పబ్లిక్కు రంగాన్ని ప్రత్యక్షంగాను, ప్రయివేటు రంగాన్ని పరోక్షంగానూ అదుపు చేస్తుంది.

మన ప్రణాళికలు సాధించవలసిన అభివృద్ధి లక్ష్యాలను సూచిస్తాయేగాని, వాటిని పబ్లిక్కు, ప్రయివేటు రంగాలు తప్పక అమలు చేయాలనే నిర్బంధం లేదు. భవిష్యత్తుకు స్పష్టమైన లక్ష్యాలను ప్రణాళికలు సూచిస్తాయి. పబ్లిక్కు, ప్రయివేటు రంగాలు ఈ లక్ష్యాల సాధనకు కృషి చేస్తాయని ప్రభుత్వం ఆశిస్తుంది. పబ్లిక్కు రంగాన్ని ప్రత్యక్షంగా అదుపులో ఉంచుతూ, ప్రయివేటు రంగాన్ని లైసెన్సుల పద్ధతి, ఆర్థిక విధానాల ద్వారా పరోక్షంగా క్రమబద్ధం చేస్తుంది.

---

## మీ అవగాహనను పరీక్షించుకొండి — 2

3. భారత ప్రణాళికా రచనలోని ప్రధాన లక్షణ మేమిటి?

---

## 9.5 భారత దేశ ప్రణాళికల ప్రధాన లక్ష్యాలు

సిద్ధాంత రీత్యా అభివృద్ధికి వ్యూహాన్ని రూపొందించడమే గాక భారతదేశ ప్రణాళికలు ప్రతి ఐదు సంవత్సరాల కాలానికి వేరు వేరు ఆశయాలను, వ్యూహాలను, నమూనాలను ఏర్పాటు చేస్తాయి. అభివృద్ధి కృషిలో కనిపించే లోటుపాట్లవల్ల ఎదురయ్యే సమస్యల వల్ల ఉత్పన్నమైన పరిస్థితులను ఎదుర్కొనడానికి ప్రణాళికల లక్ష్యాల ఒక ప్రణాళికనుండి మరొక ప్రణాళికకు మారుతూ ఉంటాయి. ప్రణాళికల లక్ష్యాలను 5 వర్గాలుగా విభజించవచ్చు. 1. జాతీయ ఆదాయం పెంచడం, 2. పెట్టుబడి ఆదాయ నిష్పత్తిని పెంచడం, 3. ఆదాయం, సంపద, ఆర్థిక శక్తి కేంద్రీకరణలలో అసమానత్వాలను తగ్గించడం, 4. అదనంగా ఉపాధి కల్పనను కలిగించడం, 5. వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదక వస్తువుల ఉత్పత్తి శక్తి, విదేశీ మారక ద్రవ్యం విషయాలలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడం.

(ఏ) మన ప్రణాళికలు జాతీయ ఆదాయాన్ని పెంచడానికి కృషి చేస్తున్నాయి. మొదటి ప్రణాళికా కాలంలో మొదటి అయిదు సంవత్సరాలలో 11 శాతం వృద్ధిరేటును అంచనా వేశారు. ఈ రేటు రెండవ ప్రణాళికలో 25 శాతానికి పెంచారు. మూడవ ప్రణాళికలో ఇదే రేటును కొనసాగించారు. 4.5వ ప్రణాళికలలో వృద్ధి రేటును సంవత్సరానికి 5.5 శాతం పెంచారు. వదిలివేసిన 6వ ప్రణాళిక వృద్ధిరేటు 4.7 శాతంగా నిర్ణయించారు. కొత్త 6వ ప్రణాళికలో (1980 85) వృద్ధిరేటును తిరిగి 5 శాతానికి పెంచారు. లక్ష్యాన్ని అధిగమించిన మొదటి ప్రణాళిక తప్ప ఇతర ప్రణాళికలలో లక్ష్యాల సాధన జరగలేదు. కాని ఏడవ ప్రణాళిక ఈ లక్ష్యాన్ని సాధించవచ్చు.

(బి) దేశంలో పారిశ్రామిక ప్రాతిపదిక నిర్మించడానికి ఉత్పాదకశక్తి పెంచడానికి పెట్టుబడి స్థాయి అధికం కావాలి. అభివృద్ధి చెందిన దేశాలలో పెట్టుబడి జాతీయ ఆదాయంలో 20 శాతం ఉంది. క్రమక్రమంగా మన దేశంలో కూడా పెట్టుబడిని ఈ స్థాయికి పెంచడం మన ప్రణాళికల ఆశయం. మొదటి ప్రణాళికలో పెట్టుబడి జాతీయ ఆదాయంలో 7 శాతం ఉండగా, అది తరువాత ప్రణాళికలలో 11 శాతం, 14 శాతం, 14.5 శాతం, 16.3 శాతానికి పెరిగింది. ప్రస్తుతం ఈ నిష్పత్తి జాతీయ ఆదాయంలో 20 శాతంగా ఉంది. దీనివల్ల మూలధన సంచయనం లక్ష్యాన్ని సాధించగలమని ఆశిస్తున్నారు.

BRAOU

(సి) పేదరికం పారదోలడం ప్రధాన ఆశయంగా ఉన్న 5వ ప్రణాళికా కాలం నుంచి అసమానత్వాలను తగ్గించాలనేది ప్రాధాన్యతను పొందింది. పేద ప్రజలకు సహాయం చేయడానికి అమలు చేసిన చర్యలలో భూములు లేని శ్రామికులు, చిన్న, సన్నకారు రైతులు, గ్రామీణ వృత్తిపనివారు, నిరుద్యోగులు మొదలైన బలహీన వర్గాల ప్రజలకు ప్రత్యక్ష సహాయం అందజేయాలని ఉంది. అసమానత్వాలను తగ్గించడానికి తీసుకొన్న ఇతర చర్యలలో పట్టణ, గ్రామీణ భూముల మీద గరిష్ట పరిమితిని నిర్ణయించడం, ఏక స్వామ్యాలను తగ్గించడానికి చర్యలు, పెద్ద పారిశ్రామిక సంస్థలను క్రమబద్ధం చేయడం, ఆదాయం, సంపదలపై ఎక్కువ రేటు పన్నులను విధించడం చెప్పుకోదగ్గవి.

(డి) ప్రధాన రంగాలలో వచ్చే అవరోధాలను ఎదుర్కొనడం; వ్యవసాయరంగంలో ఆహారధాన్యాల కొరత మొదటి అవరోధం. జనాభా పెరుగుదల, ఉద్యోగస్తుల పెరుగుదల వలన సప్లయ్ అవుతున్న దానికన్నా ఆహారానికి డిమాండు పెరిగింది. అందువల్ల ఆహార ధాన్యాల విషయంలో స్వయం పోషకత్వానికి గొప్ప ప్రాధాన్యత ఇచ్చారు. మూలధనం లోపించడం మరొక అవరోధం. ప్రాథమిక, మౌలిక రంగాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత నిస్తూ ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి వ్యూహాన్ని అనుసరించి మూలధన లోపాన్ని సవరించే ప్రయత్నం జరిగింది. మన ఆర్థిక వ్యవస్థకు అవసరమైన మూలధన సంచయనం సాధించగలిగితే దానివల్ల ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు పెరగడమే కాక ఉద్యోగభృతికి అపారమైన అవకాశాలు ఏర్పడుతాయి. విదేశీమారక ద్రవ్యం తగినంతగా లభించకపోవడం మూడవ అవరోధం. అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రాథమిక వస్తువుల ఎగుమతుల ద్వారా విదేశీమారక ద్రవ్యాన్ని ఆర్జిస్తాయి. కాని, ఈ దేశాలు చాలా ఖరీదైన మూలధన వస్తువులను దిగుమతి చేసుకొంటాయి. అందువల్ల ఈ దేశాలు విదేశీ మారక ద్రవ్య విషయంలో కష్టాలను ఎదుర్కొంటాయి. 5వ ప్రణాళికా కాలం నుంచి దిగుమతులపై ఆధారపడడాన్ని తొలగించి ఆర్థిక వ్యవస్థలో స్వయం పోషక వృద్ధిని సాధించాలని నిర్ణయించారు. ఈ లక్ష్యసాధన కోసం ఎగుమతులను ప్రోత్సహించడానికీ, దిగుమతి చేసుకొనే వస్తువులకు ప్రత్యామ్నాయాలను కనుగొనడానికీ, ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వయం పోషకత్వానికీ ప్రయత్నాలు జరిగాయి.

(ఇ) రెండవ ప్రణాళికా కాలం నుంచి ఉపాధికల్పనను పెంచే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఆ ప్రణాళికలో ప్రజలకు వినియోగ వస్తువులను సరఫరా చేయడానికై చిన్న తరహా, కుటీర పరిశ్రమల పెరుగుదలను ప్రోత్సహించారు. తర్వాత ప్రణాళికలోకూడ ఈ కృషికొనసాగింది.

## మీ అవగాహనను పరీక్షించుకొండి – 3

4. భారత దేశ ప్రణాళికల లక్ష్యా లేమిటి?
5. భారత దేశ ఆర్థిక వ్యవస్థలో గల ప్రధాన అవరోధాలు ఏమిటి?

## 9.6 సారాంశం/ముగింపు

స్వేచ్ఛా వాణిజ్య విధాన లోపాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికా రచన ఆవశ్యకతను వివరించడానికి ఈ పాఠంలో ప్రయత్నం చేశాం. ప్రస్తుతం ప్రపంచంలో ప్రభుత్వ పాత్ర విస్తారంగా పెరుగుతున్నది. జాతీయ తలసరి ఆదాయాల పెరుగుదలకు, అసమానతల తగ్గింపుకు, పేదరిక నిరుద్యోగ నిర్మూలనకు ఆర్థిక ప్రణాళికలు అవసరం. అయితే ప్రణాళికలు లక్ష్యాలను నిర్ణయిస్తాయే తప్ప ప్రభుత్వరంగాన్నిగాని, ప్రయివేటు రంగాన్నిగాని ఖచ్చితంగా అమల పరచమని నిర్బంధించలేవు. జాతీయాదాయం పెంపు, మూలధన ఉత్పత్తి విస్తృతి పెంపు, అసమానతల తగ్గింపు, ఉపాధి సౌకర్యాల పెంపు, పేదరిక నిర్మూలన మొదలైన ఆశయాలను భారత ప్రణాళికల లక్ష్యాలుగా తెలుసుకొన్నాం.



BRAOU

## 9.7 సంప్రదింపు గ్రంథాలు


1. Ashok Rudra : Planning Models
2. Dutt and Sundaram : Indian Economy
3. Misra and Puri : Indian Economy
4. తెలుగు అకాడమి (1972) : ఆర్థికాభివృద్ధి — ప్రణాళికా రచనా సిద్ధాంతాలు


## 9.8 నమూనా పరీక్షా ప్రశ్నలు

I క్రింది ప్రశ్నలలో ఒక్కొక్కదానికి సుమారు 30 పంక్తులలో జవాబు లయ్యండి.

1. ఆర్థికాభివృద్ధి వ్యూహంలో ప్రణాళికా రచన పాత్ర ఏమిటో భారత దేశాన్ని ఉదహరిస్తూ వివరించండి.
2. భారతదేశ ప్రణాళికల ప్రధాన లక్ష్యాలను విశదపరచండి.

II క్రింద ప్రశ్నలలో ఒక్కొక్కదానికి సుమారు 15 పంక్తులలో జవాబులు రాయండి.

1. భారత దేశ ప్రణాళికల ప్రధాన అంశాలను రాయండి.
2. భారత దేశ ప్రణాళికల ముఖ్యమైన లక్ష్యాలను తెలియజేయండి.
3. ప్రణాళికా రచన ప్రాధాన్యతను వివరించండి.

BRAOU

# భాగం-10: భారతదేశ పంచవర్ష ప్రణాళికలు

## విషయక్రమం

10.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
10. 1 పరిచయం
10. 2 మొదటి పంచవర్ష ప్రణాళిక, 1951-56
10. 3 రెండవ పంచవర్ష ప్రణాళిక, 1956-61
10. 4 మూడవ పంచవర్ష ప్రణాళిక, 1961-66
10. 5 వార్షిక ప్రణాళికలు, 1966-67, 1967-68, 1968-69
10. 6 నాల్గవ పంచవర్ష ప్రణాళిక 1969-74
10. 7 ఐదవ పంచవర్ష ప్రణాళిక 1974-79
10. 8 నిరంతర ప్రణాళికలు
10.8.1 లక్ష్యాలు
10.8.2 ప్రణాళికా పెట్టుబడి, 1978-83
10.8.3 ముసాయిద ఆరవ ప్రణాళిక వివరణ
10.8.4 1977-80 కాలంలో ఆర్థికవ్యవస్థ పరిస్థితి.
10. 9 ఆరవ పంచవర్ష ప్రణాళిక, 1980-85
10.10 ఏడవ పంచవర్ష ప్రణాళిక, 1985-90
10.11 సారాంశం/ముగింపు
10.12 సంప్రదింపు గ్రంథాలు
10.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

## 10.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

ఆరు పంచవర్ష ప్రణాళికలనూ, వాటి లక్ష్యాలనూ, ప్రణాళికా పెట్టుబడులనూ, వాటి జయాపజయాలను వివరించడమే ఈ పాఠం లక్ష్యం. ఏడవ పంచవర్ష ప్రణాళిక పరిచయమవుతుంది.

ఈ పాఠాన్ని చదివిన తర్వాత మీరు

★ ఆరు పంచవర్ష ప్రణాళికల లక్ష్యాలనూ, పెట్టుబడులనూ, వ్యూహాలనూ, జయాపజయాలనూ విశ్లేషించగలరు.
★ ఏడవ ప్రణాళిక లక్ష్యాలనూ, పెట్టుబడులనూ, వ్యూహాన్నీ తెలుసుకోగలరు.
★ నిరంతర ప్రణాళిక, ప్రణాళికా సెలవు అనే భావనలను అవగాహన చేసుకోగలరు.

## 10.1 పరిచయం

ప్రణాళికా రచన ఆవశ్యకతనూ, లక్షణాలనూ, లక్ష్యాలనూ గత భాగంలో తెలుసుకొన్న తర్వాత భారతదేశంలో ఇంతవరకు అమలయిన వివిధ ప్రణాళికలను వివరంగా అధ్యయనం చేయవలసిన ఆవశ్యకత ఉంది. ఈ పాఠంలో మనం అదే ప్రయత్నాన్ని చేస్తున్నాం. ఇంతవరకు మనం ఆరు పంచవర్ష ప్రణాళికలను పూర్తిగా అమలుపరిచాం. ప్రస్తుతం అమలులో ఉన్న ఏడవ పంచవర్ష ప్రణాళికా కాలం 1990 మార్చి నెలలో ముగుస్తుంది. 1990 ఏప్రిల్ నెలనుండి ఎనిమిదవ ప్రణాళిక ఆరంభమవుతుంది. మనదేశంలో అమలులో



BRAOU

ఉన్నవి పంచవర్ష ప్రణాళికలని మీ కందరికీ తెలుసు. అంటే అయిదు సంవత్సరాల కొక ప్రణాళికను రచించి, లక్ష్యాలను సాధించడానికి భారత ప్రభుత్వం ఆ ప్రణాళికను అమలుపరుస్తుంది. మొట్టమొదటి పంచవర్ష ప్రణాళిక 1951లో ఆరంభమయింది. మన దేశంలో ప్రణాళికలను తయారు చేయడానికి ఒక కేంద్ర యంత్రాంగం ఉంది. దానినే 'ప్రణాళికా సంఘం' అంటారు. మనదేశంలో కూడా అనేక ఇతర దేశాలలో లాగ విత్త సంవత్సరం ఏప్రిల్‌లో ఆరంభమై మార్చినెలలో ముగుస్తుంది. అందుకే ప్రణాళికలు కూడా ఏప్రిల్ నెలనుంచి అమలు అవుతాయి. గత 40 సంవత్సరాలలో (1950 నుండి) మనం 7 పంచవర్ష ప్రణాళికలను, మూడు వార్షిక ప్రణాళికలను, ఒక నిరంతర ప్రణాళికలను రూపొందించి, అమలు పరిచాం.

ఈ పాఠంలో ఒక్కొక్క పంచవర్ష ప్రణాళిక లక్ష్యాలనూ, పెట్టుబడులనూ, వ్యూహాన్నీ, విజయాలనూ విడివిడిగా అవగాహన చేసుకొందాం.

## 10.2 మొదటి పంచవర్ష ప్రణాళిక 1951-56

దేశ ఆర్థికాభివృద్ధికోసం పునాదులు వేయడానికి ఆర్థికవ్యవస్థను పునరుద్ధరించడం రెండవ ప్రపంచయుద్ధం, దేశవిభజనవల్ల కలిగిన నష్టాలను భర్తీచేయటం, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన వివిధ పథకాలను సమన్వయ పరచడం అనే బాధ్యతలను ఈ ప్రణాళిక చేపట్టింది.

### 10.2.1 లక్ష్యాలు

ఈ ప్రణాళిక రెండు ప్రధాన లక్ష్యాలతో ఉంది. అవి రెండవ ప్రపంచ యుద్ధం వల్లా, దేశ విభజనవల్లా ఏర్పడిన అస్తవ్యస్త పరిస్థితిని పరిదిద్దడం, భవిష్యత్తులో సమగ్ర, సమతుల ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే కృషికి ప్రారంభం చేయడం. వీటికి తోడు కొన్ని ఇతర లక్ష్యాలు కూడా నిర్ణయించారు. 1. ఆహారధాన్యాల, ముడిపదార్థాల ఉత్పత్తిని పెంచడం, 2. బహుళార్థ నీటిపారుదల ప్రాజెక్టులు, రవాణా సౌకర్యాలు చేపట్టి శాశ్వత ఆర్థిక వనరులను సృష్టించడం, ఉపాధికల్పన అవకాశాలను అధికం చేయడం, 3. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలకు అనుగుణంగా సాంఘిక న్యాయం కలుగజేయడానికి తగిన చర్యలను ప్రారంభించడం, 4. ఈ కార్యక్రమాలను అమలుచేయడానికి అవసరమైన పరిపాలనా సంస్థలను, ఇతర సంస్థలను ఏర్పాటు చేయడం.

### 10.2.2 ప్రణాళికా పెట్టుబడి

ప్రారంభంలో ఈ ప్రణాళికా పెట్టుబడి పబ్లిక్ రంగంలో రూ. 2069 కోట్లుఉంటుందని అంచనావేశారు. తరువాత దీనిని రు. 2356 కోట్లకు పెంచారు. కాని అసలు ఖర్చు అంచనా కన్నా తక్కువై రూ. 1960 కోట్లు మాత్రమే అయింది.

ఆహారధాన్యాల కొరతను తొలగించే ఉద్దేశంతో మొత్తం పెట్టుబడిలో అధికభాగం 31 శాతం. వ్యయసాయం నీటిపారుదల రంగాలకు కేటాయించారు. యుద్ధకాలంలో అవరోధంగా రుజువైన రవాణా రంగానికి 27 శాతం, ఆరోగ్యం, విద్య మెరుగుదలచేసే లక్ష్యంతో సామాజిక, ఇతర సేవా రంగాలకు 23 శాతం నిధులు కేటాయించారు. కాని, పారిశ్రామిక రంగానికి 4 శాతం మాత్రమే నిధులు కేటాయించడం వల్ల తరువాత కాలంలో ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామిక ప్రగతికి తీవ్ర అవరోధాలు కలిగాయి. ఈ ప్రణాళికా కాలంలో జాతీయ ఆదాయం 11 శాతం రేటున పెరుగుతుందని అంచనావేశారు.

### 10.2.3 వ్యూహం

మొదటి ప్రణాళిక సమగ్రమైన కార్యక్రమం కాదు. వేర్వేరు అభివృద్ధి కార్యక్రమాలను గుదిగుచ్చి ఒక ప్రణాళిక రూపంలో తయారుచేశారని చెప్పవచ్చు. ఈ ప్రణాళిక సిద్ధాంతరీత్యా బలహీనమైనది. తర్వాత ప్రణాళికా



B R A O U

కాలంలో వార్షికవృద్ధి రెండు నుంచి రెండున్నర శాతం జరిగింది, పొదుపు 5 నుండి 6¾ శాతం పెరిగిందని రుజువు చేయడానికి హరోడ్‌డోమార్ వృద్ధి నమూనాను ఉపయోగించే ప్రయత్నం జరిగింది.

### 10.2.4 సాధించిన విజయాలు

మొదటి ప్రణాళిక తన లక్ష్యాలలో అధిక భాగం సాధించి, ప్రణాళికావేత్తల ఆశలకు ప్రోత్సాహం కలిగించింది. జాతీయ ఆదాయం నిర్ణయించిన లక్ష్యం కంటే అధికంగా 18 శాతం వృద్ధిపొందింది. వార్షిక ఆదాయం 11 శాతం, తలసరి 8 శాతం, పెట్టుబడి రేటు 2.3 శాతం చొప్పున పెరిగాయి. 1950-51 లో పోలిస్తే 1955-56లో ధరల సూచిక 13 శాతం తగ్గింది. వినియోగ వస్తువుల అధికోత్పత్తి ప్రభావం దీనివల్ల తెలుస్తుంది.

వ్యవసాయ రంగంలో ఆహారధాన్యాల ఉత్పత్తి 20 శాతం పెరిగింది. అన్ని పంటలకు సంబంధించి వ్యవసాయ ఉత్పత్తి సూచి సంఖ్య 1950-51లో ఉన్న 26 నుండి 1955-56లో 117కు పెరిగింది. పారిశ్రామిక రంగంలో కూడా ఉత్పత్తి 38 శాతం పెరిగి గణనీయమైన అభివృద్ధి జరిగింది. ఉక్కు తయారీ, విద్యుదుత్పాదన శక్తి అధికమయ్యాయి. భాక్రానంగల్, దామోదర్, హీరాకుడ్ వంటి బహుళార్థ నీటిపారుదల ప్రాజెక్టులు ప్రారంభించారు. రవాణా, కమ్యూనికేషన్ రంగాలలో ముఖ్య రహదారులు, రైల్వేలైన్లు, వంతెనలు, రైల్వే పరికరాలు విస్తారమయ్యాయి. సామాజిక అభివృద్ధి జాతీయ విస్తరణ సేవాపథకం, కౌలుదారీ సంస్కరణలు ప్రవేశపెట్టడం, మధ్యదళారీల తొలగింపు ఈ ప్రణాళిక ఇతర విజయాలు. విదేశీమారక ద్రవ్య పరిస్థితి కూడా సంతృప్తికరంగా ఉంది.

పెరుగుతున్న నిరుద్యోగం, నెమ్మదిగా జరుగుతున్న పారిశ్రామిక ప్రగతి మొదటి ప్రణాళిక అపజయాలని చెప్పవచ్చు. రెండవ ప్రణాళికలో పారిశ్రామిక రంగానికి ఎక్కువ ప్రోత్సాహం లభించింది.

---

### మీ అవగాహనను పరీక్షించుకోండి-1

1. మొదటి పంచవర్ష ప్రణాళిక ఏ సంవత్సరంలో ఆరంభమై ఏ సంవత్సరంలో అంతమైంది?
2. మొదటి ప్రణాళిక లక్ష్యాలేమిటి?
3. మొదటి ప్రణాళికలో వ్యవసాయ, నీటిపారుదల రంగాలకు కేటాయించిన పెట్టుబడి శాతమెంత?
4. మొదటి ప్రణాళిక సాధించిన ప్రధాన విజయాలు ఏమిటి?

---

## 10.3 రెండవ పంచవర్ష ప్రణాళిక, 1956-61

సోషలిస్టు తరహా సమాజాన్ని స్థాపించే ఆశయాన్ని దృష్టిలో పెట్టుకుని రెండవ పంచవర్ష ప్రణాళికా లక్ష్యాలను నిర్ణయించారు. మొదటి ప్రణాళికలో వ్యవసాయం, నీటిపారుదల, విద్యుచ్ఛక్తి రంగాలకు ప్రాధాన్యత నివ్వడం వల్ల రెండవ ప్రణాళికలో ఈ రంగాలకు తక్కువ ప్రాధాన్యమిచ్చి పారిశ్రామిక రంగానికి ముఖ్యంగా భారీ, మౌలిక పరిశ్రమలకు అధిక ప్రాధాన్యమివ్వాలని ప్రణాళికావేత్తలు సంకల్పించారు. ప్రణాళికా రచనలో నూతన ఆర్థిక, సాంఘిక లక్ష్యాలను నిర్ణయించి సంక్షేమ రాజ్య స్థాపనకు కృషిచేయడానికి సోషలిస్టు తరహా సమాజస్థాపనోద్దేశ్యం ప్రోత్సాహాన్నిచ్చింది.

### 10.3.1 లక్ష్యాలు

పరిశ్రమల అభివృద్ధి, ఉపాధికల్పన అవకాశాల విస్తరణ తప్పించి ఇతర విషయాలలో రెండవ ప్రణాళికా లక్ష్యాలు దాదాపు మొదటి ప్రణాళికా లక్ష్యాలను పోలి ఉన్నాయి. రెండవ ప్రణాళికా లక్ష్యాలు నాలుగు విధాలుగా ఉన్నాయి.



BRAOU

1. జాతీయాదాయాన్ని తగినంతగా వృద్ధిచేసి తద్వారా దేశంలో జీవన ప్రమాణాల స్థాయిని పెంచడం ప్రథమ లక్ష్యం. ప్రణాళిక ఐదు సంవత్సరాలలో సంవత్సరానికి 5 శాతం చొప్పున జాతీయాదాయాన్ని మొత్తం 25 శాతం పెంచాలని నిర్ణయించారు.

2. మౌలిక, భారీ పరిశ్రమలకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ త్వరితంగా పారిశ్రామికీకరణ సాధించాలని నిర్ణయించారు. పరిశ్రమల ప్రగతికి మూల కారకాలైన ఇనుము, ఉక్కు, బొగ్గు, సిమెంటు, భారీ రసాయనాలు, యంత్ర పరికరాల పరిశ్రమలను త్వరితంగా వృద్ధి చేయాలని నిశ్చయించారు.

3. మొదటి ప్రణాళికలో నిరుద్యోగం రేటు పెరిగింది. అందువల్ల ఈ ప్రణాళికలో ఉపాధికల్పన అవకాశాలను విస్తరించాలని భావించారు. నిరుద్యోగం మాత్రమే గాక ప్రచ్ఛన్న నిరుద్యోగాన్ని కూడా దృష్టిలో ఉంచుకొన్నారు. పట్టణాలలో ఉద్యోగాల కోసం ప్రయత్నించేవారి సంఖ్య తగ్గించడానికి పరిశ్రమల వికేంద్రీకరణ జరపాలని అనుకొన్నారు.

4. సోషలిస్టు తరహా సమాజం, సంక్షేమరాజ్యం లక్ష్యాలుగా ఎంచుకొన్నందువల్ల ఆదాయం, సంపదలలో అసమానత్వాలను తగ్గించడం, ఆర్థిక వనరులను మరింత న్యాయంగా పంపిణీ చేయడం ప్రణాళిక మరొక ఆశయం.

## 10.3.2 పెట్టుబడి

పెట్టుబడి, లక్ష్యాల విషయంలో రెండవ ప్రణాళిక మొదటి ప్రణాళిక కంటే ఎక్కువ ఆశాజనకమైనది. ప్రభుత్వ రంగంలో మొత్తం పెట్టుబడి రూ. 4800 కోట్లని అంచనావేశారు. కాని ప్రణాళిక చివరలో మొత్తం పెట్టుబడి రూ. 4600 కోట్లు మాత్రమేనని తేలింది. ఈ పెట్టుబడిలో అత్యధిక భాగం 28 శాతం రవాణా కమ్యూనికేషన్ రంగాలకు, 20 శాతం పరిశ్రమలు, ఖనిజాలకు, 11 శాతం వ్యవసాయం, సమాజాభివృద్ధి కార్యక్రమాలకు, 10 శాతం విద్యుచ్ఛక్తి రంగానికి కేటాయించారు. సాంఘిక సేవలకు మొదటి ప్రణాళికలో 23 శాతం నిధులు కేటాయించగా రెండవ ప్రణాళికలో 18 శాతం మాత్రమే కేటాయించారు.

## 10.3.3 వ్యూహం

ప్రొఫెసర్ పి.సి.మహలనోబిస్ రూపొందించిన నాలుగు రంగాల నమూనాలు రెండవ ప్రణాళికకు సిద్ధాంత రీత్యా ఆధారభూతంగా ఉన్నాయి. ప్రజల జీవన ప్రమాణంలో పెంపుదల తలసరి ఆదాయం పెంపుదల మీద ఆధారపడి ఉంటుందని ఆయన అభిప్రాయం. అందువల్ల మూలధన వస్తురంగం ఎక్కువ పెట్టుబడితో త్వరితంగా వృద్ధిచెందాలని ఆయన భావించాడు. ఈ రంగంలో పెట్టుబడి దేశంలో పారిశ్రామిక రంగం విస్తరణకు, వృద్ధిరేటుకు తోడ్పడుతుంది.

## 10.3.4 విజయాలు

రెండవ ప్రణాళికలో లక్ష్యాలు, కేటాయింపులు స్పష్టంగా ఉన్నప్పటికీ ఆ ప్రణాళిక అనేక ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను ఎదుర్కొనవలసి వచ్చింది. వర్షాలు సక్రమంగా పడకపోవడం, సూయజ్ కాలువ సమస్య, విదేశీమారక ద్రవ్య విషయంగా ఏర్పడిన సంక్షోభం, ఎక్కువరేటు ద్రవ్యోల్బణం ఈ ప్రణాళికా కాలంలో ఎదురైన సమస్యలు. అందువల్ల ప్రణాళికా లక్ష్యాలలో ఎక్కువ భాగం సాధ్యం కాలేదు. జాతీయాదాయం 25 శాతం వృద్ధిచెందాలని లక్ష్యంగా పెట్టుకొన్నా వాస్తవంగా అది 19.5 శాతం చొప్పున మాత్రమే పెరిగింది. తలసరి ఆదాయం 8 శాతం మాత్రమే పెరిగింది. మూలధనం ఉత్పత్తి నిష్పత్తి 2:1 ఉంటుందని ఆశించారు. కాని మూలధన సాంద్రమైన, దీర్ఘకాలానికి ఫలాలనిచ్చే పథకాలపై ఎక్కువ రేటులో పెట్టుబడి పెట్టడం వల్ల ఈ నిష్పత్తి 3.86:1 గా రూపొంది జాతీయాదాయం ఆశించినంత మేరకు పెరగలేదు. ఉత్పత్తిలో, ముఖ్యంగా వినియోగరంగ ఉత్పత్తిలో శ్రమసాంద్రమైన పద్ధతుల ప్రాధాన్యత గుర్తించకుండా కేటాయింపులు చేయడం వల్ల ఈ ఫలితం కలిగింది. దీనివల్ల ఆర్థిక వ్యవస్థలో అసంతులిత వృద్ధి కలిగి వినియోగ వస్తువులకు కొరత ఏర్పడి ధరలు పెరిగాయి, వృద్ధిరేటు తగ్గిపోయింది.



BRAOU

జనాభా పెరుగుదల ప్రభావాన్ని సరిగా అంచనా వేయకపోవడం వల్ల తలసరి ఆదాయంలో పెరుగుదల అతి తక్కువగా ఉంది. జనాభా పెరుగుదల సంవత్సరానికి 1.2 శాతం మాత్రమే ఉంటుందని అంచనావేయగా, వాస్తవానికి జనాభా 2.2 శాతం చొప్పున పెరిగింది. నిత్యావసర వస్తువినియోగంలో తలసరి పెరుగుదల 12 శాతం ఉండాలని ప్రణాళికా లక్ష్యం కాగా ఆహార రంగంలో ఆహార వినియోగం 8 శాతం మాత్రమే పెరిగింది. వస్త్రాల వినియోగంలో మార్పులేదు. ఈ విధంగా ప్రజల జీవన ప్రమాణాలను పెంచాలని చేసిన కృషి విజయవంతం కాలేదు.

వ్యవసాయ ఉత్పత్తి 15 శాతం పెరిగింది. ప్రణాళికా కాలంలో 211 మిలియను ఎకరాలకు నీటి సరఫరా చేయాలని లక్ష్యం కాగా 14 మిలియను ఎకరాలకు మాత్రమే నీటి సరఫరా జరిగింది. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, నీటిసరఫరా, భూసార రక్షణ మొదలైన కార్యక్రమాల్లో అభివృద్ధి తగినంతగా లేదు. 1957-58 సంవత్సరంలో వర్షాలు సరిగా పడక వ్యవసాయ ఉత్పత్తి దెబ్బతింది.

పారిశ్రామిక రంగంలో పారిశ్రామిక ఉత్పత్తి సూచి (1950-51-100) 1955-56 లో 125 ఉండగా 1960-61 కి 177 కు, లేక 42 శాతం పెరిగింది. దుక్క ఇనుము, చక్కెర, కాగితం అట్టలు పరిశ్రమలలో లక్ష్యాలు సాధించారు. ప్రభుత్వ రంగంలో దుర్గాపూర్, భిలాయ్, రూర్కెలా పట్టణాలలో ఒక్కొక్కటి 10 లక్షల టన్నుల ప్రారంభ ఉత్పత్తి శక్తిగల 2 ఉక్కు కర్మాగారాలను స్థాపించడం వల్ల పరిశ్రమల రంగానికి ప్రోత్సాహం కలిగింది. కాని ఈ ఉక్కు కర్మాగారాలకు, భారీ విద్యుత్, యంత్రాల కర్మాగారాల మంజూరీలో చాలా జాప్యం జరిగింది. వీటిని ఆలస్యంగా ప్రారంభించడం వల్ల వాటి పెట్టుబడి పెరగడమే గాక ఈ పరిశ్రమలతో సంబంధమున్న ఇతర పరిశ్రమల ఉత్పత్తి గూడా దెబ్బతిన్నది.

విదేశీ వాణిజ్య రంగంలో కూడా పరిస్థితి ఆశాజనకంగా లేదు. ఈ ప్రణాళికా కాలంలో రూ. 4340 కోట్ల విలువైన దిగుమతులు జరుగుతాయని భావించారు. కాని సూయజ్ కాలువ మూసివేయడం వల్ల, మూలధన వస్తుసామగ్రి ధరలు పెరగడం వల్ల దిగుమతుల విలువ రూ. 5402 కోట్లకు పెరిగింది. మన ఎగుమతులు కన్నా ఈ దిగుమతుల విలువ రూ. 2339 కోట్లు ఎక్కువగా ఉంది. ప్రణాళిక మొదటి రెండు సంవత్సరాలలో విదేశీ మారకం విషయంలో ఎదురైన సమస్యల వల్ల 1958 లో ప్రణాళిక సైజును తగ్గించాలని భావించారు. ప్రణాళికను రెండు భాగాలుగా విభజించారు. 1. ప్రాజెక్టులు, నౌకాశ్రయాలు, విద్యుచ్ఛక్తి, వ్యవసాయంతో సంబంధమున్న ఇతర రంగాలు ప్రధాన విభాగంగానూ, 2. నిధులు లభ్యమైతే చేపట్టవలసిన ఇతర పథకాలను రెండవ విభాగంగానూ నిర్ణయించారు. ప్రణాళిక చివర భారీయంత్రాలు, ఆహారధాన్యాలు ఎక్కువగా దిగుమతి చేసుకోవలసి వచ్చినందున విదేశీమారక ద్రవ్యం విషయంలో సంక్షోభ స్థితి ఏర్పడింది. ఈ ప్రణాళిక కాలంలో దాదాపు అన్ని వస్తువుల ధరలు 30 శాతం వరకు పెరిగాయి. ఈ ద్రవ్యోల్బణ పరిస్థితి ప్రజల నిజ ఆదాయాన్ని తగ్గించింది. ప్రణాళికా కాలంలో అదనంగా 10 మిలియన్ల ప్రజలు శ్రామిక శక్తిలో చేరతారని, దాదాపు 1.6 మిలియన్ల ప్రజలకు వ్యవసాయ రంగాలలోనూ, 7.9 మిలియన్ల ప్రజలకు వ్యవసాయేతర రంగాలలోను ఉపాధి కల్పించాలని ఆశించారు. వాస్తవానికి వ్యవసాయేతర రంగాలు 6.5 మిలియన్ ప్రజలకు మించి ఉపాధి కల్పించలేకపోయాయి. ప్రణాళిక చివరలో 9 మిలియన్ల ప్రజలు నిరుద్యోగులుగా ఉన్నారు.

రెండవ ప్రణాళిక తన లక్ష్యాలలో అధిక భాగాన్ని సాధించలేకపోయినా మన ఆర్థిక వ్యవస్థలో తరువాత కాలంలో పారిశ్రామిక ప్రగతికి ఈ ప్రణాళిక పునాది వేసిందని చెప్పవచ్చు. ఆశించినంతగా పబ్లిక్కురంగ సంస్థలు విజయం సాధించకపోయినా, ఈ ప్రణాళికా కాలంలో స్థాపించబడిన భారీపరిశ్రమలు భవిష్యత్తు పారిశ్రామిక వృద్ధికి పునాదులు వేశాయి.

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 2

 5. రెండవ ప్రణాళిక లక్ష్యాలేమిటి?

6. రెండవ ప్రణాళికా వ్యూహాన్ని ఎవరు రూపొందించారు?
7. రెండవ ప్రణాళికలో పబ్లిక్కు రంగానికి కేటాయించిన మొత్తం పెట్టుబడి ఎంత?
8. రెండవ ప్రణాళికా కాలంలో ఎంత జాతీయాదాయ వృద్ధిరేటును సాధించారు.

## 10.4 మూడవ పంచవర్ష ప్రణాళిక, 1961-66

ఒక విధంగా మూడవ ప్రణాళిక రెండవ ప్రణాళిక కొనసాగింపు అని చెప్పవచ్చు. అయినప్పటికీ 1961 నుండి 1976 వరకు 15 సంవత్సరాల కాలం దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలకు అది నాంది పలిగింది.

### 10.4.1 లక్ష్యాలు

ఈ ప్రణాళిక 5 లక్ష్యాలతో ఉంది. 1. జాతీయాదాయాన్ని సంవత్సరానికి 5 శాతం చొప్పున పెంచడం, తరువాత ప్రణాళికలలో కూడ ఇదే రేటుకోసం పెట్టుబడులు కేటాయించడం; 2. పరిశ్రమలకు, ఎగుమతులకు అవసరమైన విధంగా వ్యవసాయ ఉత్పత్తిని పెంచడం, ఆహారధాన్యాలలో స్వయం సమృద్ధిని సాధించడం; 3. ఉక్కు, రసాయనాలు, ఇంధనం, యంత్రాల తయారీవంటి మౌలిక పరిశ్రమల విస్తరణ; 4. ఉపాధి అవకాశాలు గణనీయంగా పెంపొందించడం; సంపదలోని ఆదాయం అసమానతలను తగ్గించి, పూర్వంకంటే న్యాయమైన పద్ధతిలో పంపిణీ చేయడం, 5. ఆదాయాన్ని, వ్యవసాయ ఉత్పత్తిని సంవత్సరానికి 6 శాతం చొప్పున, పారిశ్రామిక ఉత్పత్తిని 14 శాతం చొప్పున, జాతీయాదాయాన్ని 30 శాతం చొప్పున, తలసరి ఆదాయాన్ని 17 శాతం చొప్పున, తలసరి వినియోగాన్ని 10 శాతం చొప్పున ప్రణాళికా కాలంలో పెంచడం మూడవ పంచవర్ష ప్రణాళికా లక్ష్యాలు.

### 10.4.2 పెట్టుబడి

మూడవ ప్రణాళికకు మొత్తం పెట్టుబడి రూ. 10,400 కోట్లు ఉండగా, దీనిలో 6,300 కోట్లు ప్రభుత్వ రంగానికీ, రూ. 4,100 కోట్లు ప్రయివేటు రంగానికీ ఉద్దేశించారు. ఈ ప్రణాళికలో గూడా పరిశ్రమలు, ఖనిజ రంగాలు మొత్తం పెట్టుబడిలో అత్యధిక భాగం 24 శాతం కేటాయింపు పొందాయి. రవాణా రంగానికి 16.7 శాతం, సాంఘిక సేవల పథకాలకు 16.3 శాతం, వ్యయసాయ రంగానికి 14 శాతం, విద్యుచ్ఛక్తి రంగానికి 10 శాతం కేటాయించారు.

### 10.4.3 వ్యూహం

రెండవ ప్రణాళికలాగే మూడవ ప్రణాళికకూడా ఏ ప్రత్యేకమైన వ్యూహంమీద ఆధారపడలేదు. పీతాంబర్ పంత్ రచించిన మూడవ ప్రణాళికకు చెందిన (సూత్రాలు వంటి సాంకేతిక) సిద్ధాంతాలపై ఆధారపడి మూడవ ప్రణాళిక రూపొందింది. డబ్ల్యు.బి.రెడ్డావే, జె.శాండి మొదలైన ఆర్థిక శాస్త్రవేత్తల అభిప్రాయాలకు విలువనివ్వడం మంచిదనే ఉద్దేశంతో మూడవ ప్రణాళికను రూపొందించినవారు ఈ ఆర్థికవేత్తల సూత్రాలను పరిగణనలోకి తీసుకొన్నారు.

### 10.4.4 విజయాలు, అపజయాలు

మూడవ ప్రణాళికా కాలంలో అనేక ఆర్థికేతర విషయాలు ప్రణాళిక విజయాలపై దుష్ప్రభావం చూపాయి. 1962లో మనదేశంపై చైనా దాడి, 1965 లో పాకిస్థాన్‌తో పోరాటం వల్ల వనరులను రక్షణ రంగానికి బదలాయించారు. తద్వారా ప్రణాళిక ప్రాధాన్యతలు దెబ్బతిన్నాయి. ఈ ప్రణాళికా కాలంలో దాదాపు ప్రతి సంవత్సరం వర్షాభావం కూడా ప్రణాళికా వైఫల్యానికి తోడ్పడింది.

వ్యవసాయ రంగంలో ప్రణాళికా లక్ష్యాలు సాధ్యం కాలేదు. వ్యవసాయ ఉత్పత్తి వార్షిక పెరుగుదల 6 శాతానికి బదులు 2.8 శాతం మాత్రమే ఉంది. ఆహారధాన్యాల ఉత్పత్తి 1964-65 లో నిర్దేశించిన లక్ష్యం 101.6



BRAOU

మిలియన్ టన్నులకు బదులుగా 88.9 మిలియన్ టన్నులకు మాత్రమే చేరుకుంది. చెరకు, వేరుసెనగ వంటి వాణిజ్యపంటలు పుష్కలంగా పండాయి. పారిశ్రామిక వృద్ధికూడా తగ్గిపోవనారంభించింది. లక్ష్యం 14 శాతం పెరుగుదల కాగా సాలీనా 7.8 శాతం పెరుగుదల మాత్రమే సాధించారు. ఉక్కు, అల్యూమినియం వంటి ప్రధానమైన పరిశ్రమలలో అదనపు ఉత్పాదక శక్తి సృష్టికాకపోవడం వల్లా, విదేశాలనుండి దిగుమతి చేసుకొనే ముడి పదార్థాలలో విడిభాగాలలో కొరతవల్లా అనేక పథకాల అమలులో జాప్యం వల్లా పారిశ్రామిక వృద్ధి కుంటుపడింది. అంతేగాక పరిశ్రమలకు కోరినంత విద్యుత్ సరఫరా కాలేదు.

జాతీయాదాయం ఆశించిన దానికంటే తక్కువగా సాలీనా 4 శాతం మాత్రమే పెరిగింది. తలసరి ఆదాయం ఈ ప్రణాళికా కాలంలో 1.5 శాతం పడిపోయింది.

వ్యవసాయ ఉత్పత్తిలో తగ్గుదలవల్లా, రక్షణవంటి ఉత్పత్తికి తోడ్పడని రంగాలలో ఖర్చు పెంపుదల వల్లా ధరలు విపరీతంగా పెరిగాయి. సాధారణ ధరల సూచి 36 శాతం పెరిగింది. దీని ఫలితంగా స్వయంపోషక వృద్ధి సాధన అసాధ్యమయింది.

అన్ని అవాంతరాలు ఎదురైనా ప్రణాళిక మొదటి సంవత్సరాలలో పరిశ్రమల రంగం ప్రగతిని కనబరిచింది. అయితే 1965లో దిగుమతుల కోసం విదేశీ పరపతి సౌకర్యాలు రద్దుచేయడం వల్ల పరిశ్రమల రంగం కీలకమైన సాధనాలు సవిముట్లు లభించక దెబ్బతింది. పరిపాలనా సామర్థ్య లోపం వల్లా వనరుల వినియోగం సరిగాలేనందువల్లా అనేక పరిశ్రమల పథకాల విషయంలో తగిన ప్రణాళికా రచన చేయనందువల్లా అధిక ధరలవల్లా శిక్షణ పొందిన సిబ్బంది లోపం వల్లా ఈ ప్రణాళిక ఆశించిన విజయాలు సాధించలేదు.

మూడవ ప్రణాళిక అంతానికి పరిస్థితి నిరాశాజనకంగా ఉండడం వల్ల ప్రభుత్వం రక్షణ రంగంపై అదనపు ఖర్చుచేయడం అభివృద్ధి ప్రణాళికను ఒకే సమయంలో అమలుచేయడం సాధ్యంకాదని గ్రహించింది. అందువల్ల ఇంతవరకు ప్రణాళికా రంగానికి ఇచ్చిన ప్రాధాన్యతను రక్షణ రంగానికి మళ్లించారు. అప్పటి అస్తవ్యస్తపరిస్థితుల మూలంగా ఐదు సంవత్సరాల కొక ప్రణాళిక బదులు వార్షిక ప్రణాళికలు అమలుచేయడం మంచిదని భావించారు. కాబట్టి తర్వాత మూడు సంవత్సరాలకు (1966-69) వార్షిక ప్రణాళికలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సవివరంగా రూపొందించాయి.

BRAOU

## మీ అవగాహనను పరీక్షించుకోండి-3

9. మూడవ పంచవర్ష ప్రణాళిక లక్ష్యాలేమిటి?
10. మూడవ ప్రణాళిక మొత్తం పెట్టుబడి ఎంత?
11. మూడవ ప్రణాళిక విఫలం కావడానికి కారణాలేమిటి?

## 10.5 వార్షిక ప్రణాళికలు (1966-67, 1967-68, 1968-69)

పైన పేర్కొన్న వివిధ కారణాలవల్ల నాల్గవ పంచవర్ష ప్రణాళికను 1966 ఏప్రియల్ నుండి అమలు పరచకుండా, ఆ ఉద్దేశ్యాన్ని మానుకొని, ఆర్థిక వ్యవస్థను ఒక సరైన స్థితికి తీసుకొని రావాలనే ఉద్దేశంతో స్వల్పకాలిక ప్రణాళికలను అమలుచేశారు. 1966 ఏప్రియల్ నుండి ఆర్థిక వ్యవస్థ మెరుగుపడే వరకు మూడు వార్షిక ప్రణాళికలను అమలు పరిచారు. ఈ కాలాన్నే 'ప్రణాళికా సెలవు' (Plan Holiday) అని అంటారు.

### 10.5.1 లక్ష్యాలు


మూడవ ప్రణాళికలో అసంపూర్ణంగా వదిలివేసిన వాటిని కొనసాగించడం ఎదురుచూడని పరిస్థితుల వల్ల ఆర్థిక

వ్యవస్థలో ఏర్పడిన పత్తిడులను సవరించడం, సాధ్యమైన వృద్ధిరేటును సాధించడం, ద్రవ్యోల్బణ పత్తిడులను అదుపుచేయడం ఈ మూడు వార్షిక ప్రణాళికల లక్ష్యాలు. ఈ ప్రణాళికలను కేంద్రప్రణాళిక, రాష్ట్రప్రణాళిక అని రెండు విధాలుగా విభజించారు. కేంద్ర ప్రణాళిక పరిశ్రమలు, రవాణా, కమ్యూనికేషన్ల వంటి కీలక రంగాలకూ, రాష్ట్ర ప్రణాళిక వ్యవసాయం, విద్యుదుత్పాదన, నీటిపారుదల వంటి రంగాలకూ ప్రాధాన్యతనిచ్చాయి.

పారిశ్రామిక రంగంలో భారీ, మౌలిక పరిశ్రమలకు బదులు దేశ రక్షణకు తోడ్పడే పథకాలకు ప్రాధాన్యమిచ్చాయి. మొదటి వార్షిక ప్రణాళిక *(1966-67)* లో దుర్భిక్షం వల్ల వ్యవసాయ ఉత్పత్తి తగ్గిపోయింది. వ్యవసాయ ఉత్పత్తి సూచి ఒక శాతం తగ్గింది. పారిశ్రామిక ఉత్పత్తిలో 1.7 శాతం పెరుగుదల కనిపించింది. సాధారణ ధరల సూచి ఒక్క సంవత్సరంలో 15.5 శాతం పెరగగా నిజ జాతీయాదాయం ఒక శాతం మాత్రమే పెరిగింది.

వ్యవసాయ రంగంలో ఉత్పత్తి తగ్గిపోవడం వల్లా, 1966లో రూపాయి విలువ తగ్గించడం వల్లా దిగుమతుల ఖర్చులు పెరిగి మొత్తం ధరలు పెరిగాయి.

రెండవ వార్షిక ప్రణాళిక (1967-68)లో వ్యవసాయానికీ, కుటుంబ నియంత్రణ పథకాలకూ ప్రాధాన్యత లభించింది. అధిక దిగుబడి వంగడాలను ప్రవేశపెట్టడం వల్ల సస్యవిప్లవం ప్రారంభమయింది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడం వల్ల ఈ సంవత్సరంలో ఆహారధాన్యాల ఉత్పత్తి 28 శాతం పెరిగి 95 మిలియన్ టన్నులకు చేరుకొంది. కాని, పరిశ్రమల రంగం వెనుకబడే ఉంది. ఆశించినదాని కన్నా ఎక్కువగా ధరల పెరుగుదల 9 శాతం వరకు ఉంది.

మూడవ వార్షిక ప్రణాళిక (1968-69) లక్ష్యాలలో ధరల స్థిరీకరణతో బాటు జాతీయాదాయంలో 5 శాతం పెరుగుదల విదేశీమారక ద్రవ్యం విషయంలో పరిస్థితిని మెరుగుపరచడానికి ఎగుమతుల విస్తరణా ముఖ్యమైనవి. వ్యవసాయం, దానికి సంబంధించిన కార్యక్రమాలకు ప్రాధాన్యత నిచ్చారు. వ్యవసాయ ఉత్పత్తి 94 మిలియన్ టన్నులు చేరుకొన్నప్పటికీ ఉద్దేశించిన లక్ష్యం కన్నా అది 8 శాతం తక్కువగా ఉంది. వాణిజ్య పంటలు సరిగా పండలేదు. మొత్తం వ్యవసాయ ఉత్పత్తి సూచి ఒక శాతం పడిపోయింది. పారిశ్రామిక ఉత్పత్తి ఆశాజనకమై, పారిశ్రామిక ఉత్పత్తి సూచి సంఖ్య ఈ సంవత్సరంలో 6 శాతం పెరిగింది. అయితే గత సంవత్సరంతో పోలిస్తే సాధారణ ధరల సూచి 3 శాతం పెరిగింది. జాతీయాదాయంలో పెరుగుదల లక్ష్యమైన 5 శాతం బదులు 3.3 శాతం మాత్రమే పెరిగింది.

### 10.5.2 వార్షిక ప్రణాళికల పరిశీలన

'పిగ్మీ' ప్రణాళికలు అని పేరు పొందిన ఈ వార్షిక ప్రణాళికలు 1965-66 నాటి ఆర్థిక సంక్షోభాన్ని తొలగించడానికి తోడ్పడ్డాయి. ఈ కాలంలోనే సస్యవిప్లవం ప్రారంభమై వ్యవసాయ ఉత్పత్తి పెరిగింది. రూపాయి విలువను తగ్గించడం వల్ల ఎగుమతులు అధికమై దిగుమతులు తగ్గడం వల్ల విదేశీమారక ద్రవ్యం విషయంలో పరిస్థితి మెరుగుప ంది.

---

## మీ అవగాహనను పరీక్షించుకొండి-4

---

12. 'ప్రణాళికా సెలవు' అంటే ఏమిటి?

---

## 10.6 నాల్గవ పంచవర్ష ప్రణాళిక, 1969-74

---

1967లో ప్రణాళికా సంఘాన్ని పునర్‌వ్యవస్థీకరించారు. ప్రొఫెసర్ గాడ్గిల్ ఉపాధ్యక్షుడుగా, ఉత్పత్తి లక్ష్యాలు. 

పరిశంగా రూపొందించడానికి నూతన ప్రణాళికా వ్యూహాన్ని ప్రవేశపెట్టారు. నాల్గవ ప్రణాళిక ముఖ్యలక్ష్యాలు నిలకడతో వృద్ధి, స్వయంపోషకత్వ సాధనకోసం ఈ ప్రణాళికలో ప్రభుత్వ రంగానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చారు.

### 10.6.1 లక్ష్యాలు

1. ఆహార ఉత్పత్తిని సాలీనా 5 శాతం చొప్పున వృద్ధిచేసి, పారిశ్రామిక ఉత్పత్తిని 8.10 శాతం చొప్పున, ఎగుమతులను 7 శాతం చొప్పున పెంపొందించి జాతీయాదాయాన్ని సాలీనా 5.7 శాతం పెంచాలనేది ప్రధాన లక్ష్యం.

2. ఆర్థిక స్థితి నిలకడగా ఉండేటట్లు చూడడం, ఇందుకోసం ఆహారధాన్యాల ధరలు, సాధారణ ధరల స్థాయి నిలకడగా ఉంచేందుకు ఆహారధాన్యాల నిల్వలు నిర్మించడం రెండవ ప్రధానలక్ష్యం.

3. విదేశీ సహాయంపై ఆధారపడడాన్ని తగ్గించి స్వయంపోషకత్వాన్ని పెంచడం మరొక లక్ష్యం. ఆహారధాన్యాల దిగుమతిని తగ్గించి, 1971లో పూర్తిగా ఆపివేశారు.

4. సాంఘిక న్యాయంతో బాటు సమానత్వాన్ని సాధించడం, సామాన్య మానవుడు, బలహీనవర్గాలకు ప్రత్యేక ప్రాధాన్యత నివ్వడం ఈ ప్రణాళిక మరో లక్ష్యం. ఏక స్వామ్యాల చట్టం, నూతన పారిశ్రామిక లైసెన్సుల విధానం, జాతీయ బ్యాంకుల పరపతి విధానంలో మార్పులు, ఆర్థికశక్తి కేంద్రీకృతం కాకుండా ప్రభుత్వ ఆర్థిక సంస్థల ద్వారా అదుపుచేయడం నాల్గవ ప్రణాళిక మరొక ఆశయం.

5. రాష్ట్రాల మధ్య, రాష్ట్రాలలోని వివిధ ప్రదేశాల మధ్య ప్రాంతీయ అసమానత్వాలను తొలగించడానికి ప్రాధాన్యత నిచ్చారు. వివిధ ప్రాంతాలలో వృద్ధి, ఆర్థిక కార్యక్రమాల వికేంద్రీకరణతో దేశం మొత్తంలో ఆర్థికాభివృద్ధిని మెరుగుపరచవచ్చని భావించారు.

6. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలను పెంపొందించడం, శ్రమసాంద్రమైన పథకాలు అమలుచేయడం, గ్రామీణ ప్రాంతాలలో నీటిసరఫరా సౌకర్యాలను విస్తరించడం, ప్రభుత్వ రంగ పరిశ్రమలను విస్తరించడం, ఖనిజాలు, రవాణా సౌకర్యాలు, కమ్యూనికేషన్లు, విద్యుచ్ఛక్తి రంగాలలో ప్రగతిని సాధించడం నాల్గవ ప్రణాళిక ఇతర లక్ష్యాలు. ఈ ప్రణాళికా కాలంలో ఎంతమందికి ఉపాధి కల్పించాలో నిర్దేశించలేదు.

### 10.6.2 పెట్టుబడి

నాల్గవ ప్రణాళిక పెట్టుబడిని రూ. 24,882 కోట్లుగా నిర్ణయించారు. దీనిలో ప్రభుత్వ రంగానికి రూ. 15,902 కోట్లు, ప్రయివేటు రంగానికి రూ. 8,980 కోట్లు కేటాయించారు. పరిశ్రమలు, గనుల రంగానికి 21.5 శాతం, రవాణాకు 17.2 శాతం, వ్యవసాయానికి 16.5 శాతం కేటాయించారు. వార్షికాభివృద్ధి 5.5 శాతం ఉండాలనీ, జనాభా 2.5 శాతం చొప్పున పెరుగుతుందని భావించి తలసరి ఆదాయం సాలీనా 3 శాతం పెరగాలనీ నిర్దేశించారు. ప్రణాళికాంతానికి పెట్టుబడి 11.3 శాతం నుంచి 14.5 శాతానికి పెరగాలని అనుకొన్నారు. ఈ ప్రణాళికలో స్వయంసమృద్ధి సాధించడానికి ప్రాధాన్యతను పరిశ్రమల నుంచి వ్యవసాయ రంగానికి మళ్లించారు. పరిశ్రమల విస్తరణ బదులు అప్పటికే ఉన్న పరిశ్రమల ఉత్పత్తి శక్తి పెరుగుపరచాలని నిర్ణయించారు.

### 10.6.3 వ్యూహం

ప్రణాళికా సంఘంలోని ఆర్థిక విభాగం మొట్టమొదటిసారి సంఖ్యాపరమైన పద్ధతిని ఉపయోగించింది. పర్స్పెక్టివ్ ప్లానింగ్ విభాగం కూడా ఇదే పద్ధతిని అనుసరించింది. నాల్గవ ప్రణాళికకు ఈ పరిశీలనలు ఆధారభూతమైనాయి. ప్రణాళిక తుది సంవత్సరానికి వివిధ రంగాలకు కేటాయింపులూ, ఉత్పత్తి లక్ష్యాలూ



BRAOU

వివరంగా తయారుచేశారు. వివిధ రంగాల కేటాయింపులను విశ్లేషించడానికి పరిశ్రమలకు సంబంధించి ఒక పట్టిక తయారుచేశారు.

### 10.6.4 విజయాలు

ప్రణాళిక మొదటి రెండు సంవత్సరాలలో జాతీయాదాయం 5 శాతం చొప్పున పెరిగినప్పటికీ కొన్ని ఎదురుచూడని పరిస్థితులవల్ల ఈ పెరుగుదల తరువాత సంవత్సరాలలో తగ్గిపోయింది. బంగ్లాదేశ్ నుండి అధిక సంఖ్యలో మన దేశానికి వచ్చిన నిర్వాశితులూ, దేశంలోని కొన్ని ప్రాంతాలలో దుర్భిక్షం, మరికొన్ని చోట్ల వరదలూ, విద్యుచ్ఛక్తి సరఫరాలో లోపాలూ ప్రణాళికా లక్ష్యాలను బాగా దెబ్బతీశాయి.

ఈ పరిస్థితుల్లో ప్రణాళిక మొదటి నాల్గు సంవత్సరాలలో నిలకడ ధరలవద్ద జాతీయాదాయం పడిపోయింది. సగటు వార్షిక వృద్ధిరేటు నిర్దేశించిన లక్ష్యం 5.7 శాతం బదులు 3.2 శాతం మాత్రమే ఉంది. 1969-70 సంవత్సరంలో కంటే తలసరి ఆదాయం 3.5 శాతం మాత్రమే పెరిగింది. 1972-73 లో ఆహారధాన్యాల ఉత్పత్తి 9 శాతం తగ్గిపోయింది. ధరల స్థిరీకరణ సాధ్యం కాలేదు. టోకుధరల సూచీ సంఖ్య 1972-73 మధ్యకాలంలో 32 శాతం పెరిగింది.

నాల్గవ ప్రణాళికా కాలంలో ఎగుమతులు సంవత్సరానికి 7 శాతం చొప్పున, ఆహారేతర దిగుమతులు 5.5 శాతం చొప్పున పెరిగినప్పటికీ ఆహారధాన్యాల దిగుమతులు తగ్గలేదు. ప్రణాళికాంతానికి భారత ఆర్థికవ్యవస్థ పరిస్థితి నిరాశాజనకంగా ఉంది. ద్రవ్యోల్బణ పరిస్థితులు అధికమయ్యాయి. ఆదాయాలలో తేడాలు పెరిగి పేదరికం కూడా అధికమయింది. చమురు ధరలు పెరగడం వల్ల ఇంధన సంక్షోభం ఏర్పడి ఆర్థిక పరిస్థితిని మరింత కల్లోల పరిచింది. అంటే నాల్గవ ప్రణాళిక వృద్ధి స్థిరీకరణ, సమానత్వం రంగాలలో విఫలమైంది.

---

### మీ అవగాహనను పరీక్షించుకోండి-5

---

13. నాల్గవ ప్రణాళిక ఆశించిన జాతీయాదాయ సాలుసరి వృద్ధిరేటు ఎంత?
14. నాల్గవ ప్రణాళిక కోసం ఎంత మొత్తంలో పెట్టుబడిని కేటాయించారు?
15. నాల్గవ పంచవర్ష ప్రణాళిక ప్రధాన విజయాలు ఏమిటి?

---

## 10.7 ఐదవ పంచవర్ష ప్రణాళిక, 1974-79

---

ఐదవ ప్రణాళిక 1974 ఏప్రిల్‌లోనే తయారైనప్పటికీ మరొక పంచవర్ష ప్రణాళికను ప్రారంభించే ముందు ఆర్థికవ్యవస్థలో స్థిరీకరణ సాధించడం అవసరమని భావించారు. నాల్గవ ప్రణాళిక ధరల స్థిరీకరణ విషయంలో విఫలం కావడం వల్ల ఆర్థిక వ్యవస్థలో అత్యధిక ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గడం, 1973 లో అంతర్జాతీయ చమురు ధరలు పెరగడం దీనికి తోడ్పడిన విషయాలు అని చెప్పారు.

అత్యవసర వస్తువుల ఉత్పత్తి, సేకరణ, పంపిణీలను సరిదిద్ది ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి సాంఘిక, ఆర్థిక సంస్కరణలతో కూడిన 20 సూత్రాల కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు.

5వ ప్రణాళిక 1974 లోనే ప్రారంభం కావాలసి ఉన్నా 1976 లోనే దానికి ఆమోదం లభించింది. నాల్గవ ప్రణాళికా కాలంలో ఆర్థిక పరిస్థితి కుంటుపడడం వల్లా, ద్రవ్యోల్బణ పరిస్థితుల వల్లా వార్షిక ప్రణాళికలను అమలుచేశారు. రాజకీయ క్లిష్ట పరిస్థితీ, అత్యవసర పరిస్థితి ప్రకటనా 5 వ ప్రణాళిక ఆలస్యంగా ప్రారంభం కావడానికి కారణాలుగా చెప్పవచ్చు.

మొదటి వార్షిక ప్రణాళిక (1974-75) సన్నకారు రైతులు, చిన్నతరహా పరిశ్రమల పరిస్థితులను మెరుగుపరిచి, ఎగుమతులను ప్రోత్సహించి, దిగుమతి చేసుకొనే వస్తువులకు ప్రత్యామ్నాయాలను కనుగొనాలనే లక్ష్యంతో ఉంది. ఈ సంవత్సరంలో వ్యవసాయ ఉత్పత్తి 3.1 శాతం, పారిశ్రామిక వృద్ధి 2.5 శాతం తగ్గిపోయినా ద్రవ్యోల్బణ రేటుకూడా 7.1 శాతం తగ్గింది. కాని ఈ ప్రణాళిక జాతీయాదాయంలో కానీ, పెట్టుబడిలోకానీ నిర్దేశించిన లక్ష్యం మేరకు వృద్ధిరేటును సాధించలేక పోయింది.

వృద్ధి, స్థిరీకరణ రెండవ వార్షిక ప్రణాళిక (1975-76) లక్ష్యాలు. వ్యవసాయం, విద్యుచ్ఛక్తి, బొగ్గు, చమురు, ఎరువుల రంగాలు ప్రాధాన్యత పొందాయి. పుష్కలమైన పంటలవల్ల ధరలస్థాయి 8 శాతం పడిపోయింది. విదేశీమారక నిల్వలు, వ్యవసాయ ఉత్పత్తి 10 శాతం, జాతీయాదాయం 6 శాతం, పారిశ్రామిక ఉత్పత్తి 5.7 శాతం పెరిగాయి. వర్షాలు సకాలంలో కురవడం ఈ ప్రణాళిక విజయానికి ముఖ్యకారణం. 20 సూత్రాల కార్యక్రమం కూడా దేశ ఆర్థిక పరిస్థితిపై మంచి ప్రభావం చూపిందని చెప్పవచ్చు.

మూడవ వార్షిక ప్రణాళిక (1976-77) తన లక్ష్యాలను సాధించలేక పోయింది. వ్యవసాయ ఉత్పత్తి 7.8 శాతం తగ్గింది. దీని వల్ల ధరలు 11.9 శాతం పెరిగాయి. అయితే పారిశ్రామిక ఉత్పత్తి 10 శాతం పెరిగింది. విదేశీమారక నిల్వలు కూడా తగినంతగా పెరిగాయి.

## 10.7.1 లక్ష్యాలు

పేదరికాన్ని నిర్మూలించడం, స్వయంపోషకత్వాన్ని సాధించడం 5వ ప్రణాళిక ముఖ్యలక్ష్యాలు. 5 సంవత్సరాల కాలంలో పేదరికం తొలగించడం సాధ్యం కాదు గనుక ఆ ప్రయత్నాన్ని 5వ ప్రణాళికలో ప్రారంభించాలని తలపెట్టారు.

## 10.7.2 వ్యూహం

పెట్టుబడిని అంచనా వేయడానికి మానో నమూనాను, వివిధ రంగాల వినియోగస్థాయిలను లెక్కకట్టడానికి ఇయోన్‌టీఫ్ ఉత్పాదకం, ఉత్పాదితం నమూనాను ఈ ప్రణాళిక అనుసరించింది.

## 10.7.3 విజయాలు

*వ్యవసాయం:* అధిక దిగుబడి వంగడాల వాడకంవల్లా, నీటిపారుదల సౌకర్యాల ఏర్పాటువల్లా, ఎరువుల వినియోగంలో పెరుగుదల వల్లా, ఆహారధాన్యాల ఉత్పత్తి అధికమయింది. అనుకూలమైన వాతావరణ పరిస్థితులు కూడా ఇందుకు దోహదం చేశాయి.

*పరిశ్రమలు:* పరిశ్రమల రంగంలో పరిస్థితి ఆశాజనకంగా లేదు. ఎక్కువ పరిశ్రమలు నష్టాలలో పడడం, 1974 నుంచి 1975 వరకు 6 శాతం వృద్ధిరేటు ఉండడం దీనికి కారణాలు. వస్త్రాలు, జనుము, చక్కెర పరిశ్రమలలో ఉత్పత్తి తగ్గిపోయింది.

*ధరలు:* ప్రణాళిక చివరి రెండు సంవత్సరాలు 1976 నుండి 1978 వరకు ధరలు అధికంగా పెరిగాయి. ఖనిజాలు, చమురు, విద్యుచ్ఛక్తి ధరలు కూడా గణనీయంగా పెరిగాయి.

*ఉపాధి:* ఈ కాలంలో ఉపాధికల్పన రేటుకూడా తగ్గిపోయింది. 1971 నుండి 1974 మధ్య 1.8 మిలియన్ వ్యక్తులకు ఉపాధికల్పన కాగా ఈ ప్రణాళికలో 1.4 మిలియన్ల ఉద్యోగాలు మాత్రమే ఏర్పాటు చేయగలిగారు.

1977లో ప్రభుత్వం మారడం వల్లా, అధికారంలోకి వచ్చిన జనతాపార్టీ నూతన ప్రణాళికలను రూపొందించడానికి సమయం కోరడం వల్లా 5వ ప్రణాళిక ఆఖరి సంవత్సరంలో కూడా వార్షిక ప్రణాళికను అమలుచేశారు.

 5వ ప్రణాళిక అనేక అవరోధాలను ఎదుర్కొనవలసి వచ్చింది. రాజకీయ సంక్షోభం, అత్యవసర పరిస్థితి

BRAOU

ప్రకటన, ప్రభుత్వంలో మార్పు ఈ ప్రణాళిక వైఫల్యానికి, చివరికి దానిని విలిపివేయడానికి కారణాలయ్యాయి. ప్రణాళిక మొదటి నాలుగు సంవత్సరాలలో జాతీయాదాయం సాలీనా 3.5 శాతం మాత్రమే పెరిగింది. 1977లో అధికారంలోకి వచ్చిన నూతన ప్రభుత్వం గత పాతిక సంవత్సరాలలో అమలు జరిగిన ప్రణాళికలను పరిశీలించి, ప్రణాళికలలో వృద్ధి, సాంఘిక న్యాయసాధనకు వీలుగా ప్రాధాన్యతలను మార్చవలసిన అవసరాన్ని గుర్తించింది.

జనతాపార్టీ ఆర్థిక విధానం అభివృద్ధి సక్రమంగా జరగడానికి తోడ్పడేటంత బలమైందిగా లేదు. పేదరికం, నిరుద్యోగం, సంపద ఆదాయాలలో అసమానతలు ఆర్థిక వ్యవస్థలో మూడు ముఖ్యమైన లోపాలుగా గుర్తించి, వాటిని గాంధియన్ సోషలిజం ద్వారా సాంఘిక, ఆర్థిక వికేంద్రీకరణ జరిపి, పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## మీ అవగాహనను పరీక్షించుకోండి-6

16. ఐదవ ప్రణాళిక ప్రాథమిక లక్ష్యాలేమిటి?

## 10.8 నిరంతర ప్రణాళికలు

ఇంతకు ముందు ప్రణాళికల్లో ఎదురుచూడని అవాంతరాలకూ, పరిస్థితులకూ తగిన ఏర్పాట్లు చేయలేదు. ప్రణాళికలు అమలు జరుగుతున్నప్పుడు తమ లక్ష్యాలను మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా మార్చుకోవడానికి ఏర్పాటు చేయలేదు. అందువల్ల అనుకోని అవాంతరాలను ఎదుర్కోవడానికి వీలుగా నిరంతర ప్రణాళికలను ప్రవేశపెట్టాలనీ, వీటివల్ల ప్రతి సంవత్సరం పరిస్థితులను సమీక్షించే వీలు కలుగుతుందనీ భావించారు. ప్రణాళికను 5 సంవత్సరాలకు రూపొందించినా, ప్రతి సంవత్సరం ఆర్థిక వ్యవస్థ వివిధ రంగాలలో సాధించిన అభివృద్ధినీ, లభ్యమౌతున్న వనరులనూ దృష్టిలో ఉంచుకొని సమీక్షిస్తారు. అంటే వీటిని 5 సంవత్సరాలనూ దృష్టిలో ఉంచుకొని అమలుచేసే వార్షిక ప్రణాళికలని చెప్పవచ్చును. పంచవర్ష ప్రణాళికలోని ప్రధాన రంగాలలో పెట్టుబడులకూ, ఉత్పత్తులకూ లక్ష్యాలను నిర్దేశిస్తారు. వీటిని నిరంతర ప్రణాళికలని అనడానికి కారణం 5 సంవత్సరాల కాలంలో ఒక సంవత్సర ప్రణాళిక పూర్తికాగానే సమీక్ష అవగాహనతో మరొక సంవత్సరం ప్రణాళిక అమలు ప్రారంభమౌతుంది. ఇంతకుముందు ప్రణాళికల్లా కాకుండా నిరంతరం కొనసాగే ప్రణాళికా పద్ధతిగా వీటిని రూపొందించారు. కొద్ది కాలంలో ఎదుర్కొన్న అపజయాలనూ, సాధించిన విజయాలనూ మరుసటి 5 సంవత్సరాల కాలం దృష్టిలో ఉంచుకొని సమీక్షించడానికి వీలు కలగడమే ఈ ప్రణాళికా పద్ధతిలో ఇమిడి ఉన్న ప్రయోజనం.

### 10.8.1 లక్ష్యాలు

1978-83 సంవత్సరాలకు రూపొందించిన నిరంతర ప్రణాళిక పేదరికాన్నీ, నిరుద్యోగాలను తొలగించడానికీ, సాలీనా 7 శాతం వృద్ధి ద్వారా అసమానతలను తగ్గించడానికి ఉద్దేశించారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూ దానికి అవసరమైన సాధనాల సరఫరాలకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. భారీ పరిశ్రమలలో తయారైన వస్తువులకు మార్కెట్టు తగ్గించి, చిన్న తరహా, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తులకు మార్కెట్టు పెంచుతారు. ధనం సప్లయిని అదుపులో ఉంచి, ప్రాథమిక వస్తువులను పెంచి, ధరల స్థిరీకరణకు కృషి, గ్రామీణ రంగంలో ఉద్యోగాలను సృష్టించి, ప్రతి ఎకరా భూమికి పనిపొందే వారి సంఖ్యను పెంచి, పరిశ్రమలో పెట్టుబడిని అధికం చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తారు. 10 సంవత్సరాల కాలంలో పేదరికాన్ని తొలగించి, తాగడానికి నీరు, వైద్యసౌకర్యాలు, గ్రామీణ గృహనిర్మాణం, రహదార్లు, ప్రాథమిక విద్యవంటి ప్రాథమిక అవసరాలను ప్రజలకు కలిగించి, జనాభాలో అతి పేదవారి జీవన ప్రమాణాలను పెంచాలని ప్రతిపాదించారు.

### 10.8.2 ప్రణాళికా పెట్టుబడి (1978-83)

జనతాపార్టీ ఆర్థిక విధానానికి అనుగుణంగా 5వ ప్రణాళికలో గ్రామీణ అభివృద్ధిపథకాలకు కేటాయించిన రూ. 14,571 కోట్ల మొత్తాన్ని ఆరవ ప్రణాళికలో రూ. 29.925 కోట్లుగా రెట్టింపు చేశారు. గ్రామీణ చిన్నతరహా పరిశ్రమలకు కేటాయింపు రూ. 388 కోట్ల నుండి రూ. 1410 కోట్లకు, భారీ, మధ్యతరహా పరిశ్రమలకు రూ. 6,852 కోట్ల నుండి 8,940 కోట్లకు పెంచారు. ఇంధన రంగానికి కూడా పెట్టుబడిని రూ. 9,855 కోట్లనుండి రూ. 20,150 కోట్లకు పెంచి, రెండింతలు చేశారు.

### 10.8.3 ముసాయిదా ఆరవ ప్రణాళిక సవరణ

ఆరవ ప్రణాళిక 1979లో రెండు ప్రధాన కారణాలవల్ల సవరించవలసి వచ్చింది. ద్రవ్యోల్బణం వల్ల ప్రణాళిక పెట్టుబడులు చెప్పుకోదగినంతగా విలువను కోల్పోయాయి. 7వ ఆర్థిక కమీషన్ 1979-84 కాలానికి కేంద్రం రూ. 23,063 కోట్ల మేర నిధులను రాష్ట్రాలకు బదలాయించాలని సూచించింది. ఈ భారం అధికం కావడంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 71 పథకాలను వదిలివేయవలసి వచ్చింది.

### 10.8.4 1977-80 కాలంలో ఆర్థికవ్యవస్థ పరిస్థితి

ఆహారధాన్యాల విషయంలో 18 మిలియన్ టన్నుల నిల్వలు విదేశీ మారక నిల్వలు 28.6 కోట్లు ఉన్నప్పటికీ జనతా ప్రభుత్వ హయాంలో ఆర్థికవ్యవస్థ ఆరోగ్యకరమైన మార్పు చెందలేదు. పరిశ్రమలు, విద్యుచ్ఛక్తి, ఎగుమతులు అనే మూడు ప్రధాన రంగాలలో వృద్ధిరేటు తగ్గిపోయింది. జనతా పరిపాలనా కాలంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనట్లయితే జాతీయాదాయంలో పెరుగుదల రేటు మరింత దెబ్బతిని ఉండేది.

ఇంతకుముందు ప్రణాళికా కాలంలో పరిశ్రమల రంగంలో ప్రాతిపదిక సౌకర్యాలు తగినంతగా వృద్ధిచెందక పోవడం, జనతాకాలంలో పరిశ్రమలనుండి ప్రాధాన్యతను వ్యవసాయ రంగంపైకి మళ్లించడం వల్ల పరిశ్రమల రంగం దెబ్బతిన్నది. పరిశ్రమల అభివృద్ధికి విద్యుచ్ఛక్తి సరఫరా కొరతకూడా అవరోధంగా నిలిచింది. 1974 తో పోల్చినప్పుడు ద్రవ్యోల్బణ వత్తిడుల వల్ల ధరలసూచి 11 శాతం పెరిగింది. ఈ విధంగా జనతా పరిపాలనా కాలంలో అమలుజరిగిన 1978-79, 1979-80 వార్షిక ప్రణాళికలు భారత ఆర్థిక వ్యవస్థకు మంచిని చేయలేకపోయాయి.

BRAOU

---

### మీ అవగాహనను పరీక్షించుకోండి-7

---

17. నిరంతర ప్రణాళిక అంటే ఏమిటి?

---

## 10.9 ఆరవ పంచవర్ష ప్రణాళిక, 1980-85

---

నిరంతర ప్రణాళికకూ, ముసాయిద ఆరవ ప్రణాళికకూ ఆ తర్వాత స్వస్తి చెప్పారు. 1980 ఏప్రిల్ నుంచి ఐదు సంవత్సరాలు అమలులో ఉండేటట్లుగా నూతనంగా ఆరవ పంచవర్ష ప్రణాళికను రూపొందించారు. ఈ ఆరవ ప్రణాళిక 1985 మార్చినెల వరకు అమలులో ఉంది.

### 10.9.1 లక్ష్యాలు

ఆరవ ప్రణాళికను 1980-95 మధ్య 15 సంవత్సరాల కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తయారుచేశారు. ఆర్థిక వ్యవస్థలో వృద్ధిరేటును పెంచడం, పేదరికాన్నీ, నిరుద్యోగాన్నీ తగ్గించడం ప్రణాళికా లక్ష్యాలు. వనరులను ఇంతకు ముందు కంటే సమర్థవంతంగా ఉపయోగించి, ఆర్థిక, సాంకేతిక స్వయంపోషకత్వాన్ని సాధించడానికి

ఆధునీకరణను అధికం చేసి, దేశంలో లభ్యమయ్యే ఇంధన వనరుల పెరుగుదలను ప్రోత్సహించి, జనాభా పెరుగుదలను నిరోధించి, బలహీనవర్గాల జీవనస్థితిగతులను మెరుగుపరిచి ఈ లక్ష్యాలను సాధిస్తారు.

## 10.9.2 పెట్టుబడి

ఈ ప్రణాళికా పెట్టుబడి రూ. 1,58,710 కోట్లు. సాలీనా 5.2 శాతం వృద్ధిరేటు, 3.3 శాతం సగటు ఆదాయం వృద్ధిరేటు లక్ష్యాలతో ఉంది. వ్యవసాయంలో పెరుగుదల రేటు 4 శాతం, పరిశ్రమలలో 8 నుండి 9 శాతం సాలీనా సాధించాలని ఆశిస్తున్నది. ఇంధన అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యమిచ్చి రూ. 26,535.4 కోట్ల పెట్టుబడిని కేటాయించారు. గ్రామీణ సమగ్రాభివృద్ధి 6వ ప్రణాళిక లక్ష్యాలలో ముఖ్యమైనది. నీటిపారుదల, విద్యుదీకరణ, సన్నకారు రైతులకు సబ్సిడీలు, పరపతి సౌకర్యం మొదలైన ప్రాతిపదిక అభివృద్ధి పథకాలకు ప్రణాళిక ప్రాధాన్యతనిస్తున్నది. ప్రస్తుతం అమలు జరుగుతున్న పథకాలు, ఇంతకుముందు ప్రణాళికలు ప్రారంభించిన పథకాలు పూర్తి చేయడం ప్రణాళిక ఇతర ఆశయాలు. దీనితో నూతన అభివృద్ధి పథకాల పెట్టుబడిపై పరిమితి విధిస్తారు. పేదరికం, నిరుద్యోగం నిర్మూలనకు కూడా ఈ ప్రణాళికలో ప్రత్యేక పథకాలు ఉన్నాయి.

మొత్తం ప్రణాళికా పెట్టుబడిలో ప్రభుత్వ రంగానికి రూ. 84,000 కోట్లు అంటే 53 శాతం కేటాయించగా ప్రైవేటు రంగానికి రూ. 74,710 కోట్లు అంటే 47 శాతాన్ని కేటాయించారు. ఆరవ ప్రణాళికా పెట్టుబడిలో (రూ. 97,500 కోట్లు) అభివృద్ధి శాఖల (Heads of development) ఆధారంలో ఇంధన, పరిశ్రమల రంగాలకు వరుసగా 27.2, 15.4 శాతాన్ని కేటాయించారు. ఆ తర్వాత సాంఘిక సేవ (14.4 శాతం), రవాణా (12.8 శాతం) రంగాలకు ప్రాధాన్యమిచ్చారు. వీటి తర్వాతిస్థానం వ్యవసాయ రంగానికి (నీటిపారుదల, వరద నివారణలతో బాటు) దక్కింది.

## 10.9.3 వ్యూహం

ఆరవ పంచవర్ష ప్రణాళిక సాంప్రదాయక వ్యూహాన్నే పాటించింది. భారీపరిశ్రమల ఆధారంగా ఆర్థికవృద్ధిని శీఘ్రతరంగా సాధించాలనేదే ఈ వ్యూహం. ఆరవ ప్రణాళికా వ్యూహంలో ఉద్యోగితా కల్పనకు రెండవ స్థానం లభించింది. కనీస అవసరాల వ్యూహం ద్వారా సాంఘిక న్యాయాన్ని సాధించాలని ఉద్దేశించారు. రెండవ ప్రణాళిక నుంచి నెహ్రూ, మహలనోబిస్‌ల ప్రణాళికా విధానాన్ని యథాతథంగా కొనసాగిస్తూ ఆరవ ప్రణాళికలో కూడ పాటిస్తున్నారు.

## 10.9.4 విజయాలు

ఆరవ ప్రణాళిక అంచనావేసిన విధంగానే 5.2 శాతం వృద్ధిరేటును సాధించింది. వ్యవసాయ రంగంలో కూడా ఆశించిన లక్ష్యాల కన్నా అధికంగా ఫలితాలు వచ్చాయి. ఆశించిన వ్యవసాయ వృద్ధిరేటు 3.8 శాతం కాగా సాధించినది 4.3 శాతం. అదేవిధంగా సేవల రంగం కూడా అధిక వృద్ధిరేటును (6.6 శాతం) సాధించింది. అంచనావేసిన పెరుగుదల రేటు 5.5 శాతం మాత్రమే. కాని పారిశ్రామిక రంగంలో ప్రగతి మందకొడిగా ఉంది. ఆశించిన వృద్ధిరేటు (6.9 శాతం) లో దాదాపు సగాన్ని (3.7 శాతం) మాత్రమే పారిశ్రామిక రంగం పెరుగుదల సాధించగలిగింది.

ఆరవ పంచవర్ష ప్రణాళికలో 1984-85 సంవత్సరాంతానికి 24.5 శాతం పొదుపు రేటును సాధించాలని అంచనావేయగా వాస్తవంగా నెరవేర్చ గలిగింది 23.3 శాతం మాత్రమే. పొదుపురేటు తక్కువగా ఉండడానికి ముఖ్యమైన కారణంగా ప్రభుత్వరంగ పొదుపు అంచనావేసిన రేటుకన్నా తక్కువగా ఉండడమేనని చెప్పవచ్చు.

ఆరవ ప్రణాళికా కాలంలో వాణిజ్య, ఇంధన రంగాలలో సాలుసరి పెరుగుదల 12 శాతంగా ఉంది. ఇంధన రంగంలో క్రూడ్ ఆయిల్ ఉత్పత్తి గణనీయమైన ప్రగతిని సాధించింది. 1979-80 సంవత్సరంలో క్రూడ్ ఆయిల్ ఉత్పత్తి 12 మిలియన్ టన్నులు ఉత్పత్తి కాగా 1984-85వ సంవత్సరానికి దాని ఉత్పత్తి 29 మిలియన్



BRAOU

టన్నులకు చేరుకొంది. అంటే దాదాపు సాలుసరి 20 శాతం చొప్పున ఉత్పత్తి పెరిగింది. ఇది అంచనావేసిన వృద్ధి రేటు (13 శాతం) కన్నా చాలా అధికం. ఇంధన రంగంలో ఎంతో ప్రగతినీ, అభివృద్ధినీ సాధించినప్పటికీ, మనదేశం విద్యుత్ కొరతను ఎదుర్కొంది. ఉక్కు, సిమెంట్, ఎరువు మొదలైన కీలక పరిశ్రమలు ఇంధన కొరతవల్ల ఆశించిన పురోభివృద్ధిని సాధించలేకపోయాయి.

భారతదేశ ప్రణాళికల ప్రధాన లక్ష్యాలలో ఒకటి నిరుద్యోగితను, పేదరికాన్ని తగ్గించడం, ఆరవ ప్రణాళిక అంచనాల ప్రకారం 1980 మార్చివరకు 12 మిలియన్ల ప్రజలు నిరుద్యోగులుగా ఉంటారు. ఆరవ ప్రణాళికా కాలంలో అదనంగా 34 మిలియన్ల ప్రజలు శ్రామిక శక్తిలో భాగస్తులవుతారు. అంటే ఆరవ ప్రణాళిక 46 మిలియన్ల శ్రామిక శక్తికి ఉద్యోగితా సౌకర్యాలను కల్పించవలసి ఉంటుంది. ఈ ప్రణాళికా కాలంలో ఎన్నో ఉద్యోగితా కల్పన, పేదరిక నిర్మూలన పథకాలను చేపట్టి అదనపు ఉపాధి సౌకర్యాలను కల్పించడం జరిగింది. సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం (IRDP), జాతీయ గ్రామీణ ఉపాధికల్పనా పథకం (NREP), గ్రామీణ శ్రామిక ఉద్యోగిత హామీ పథకం (PLEGP), స్వయం ఉపాధి పథకాలకోసం గ్రామీణ యువతకు శిక్షణ పథకం (TRYSEM), గ్రామీణ నిరుద్యోగ యువతకు స్వయం-ఉద్యోగితా కల్పన పథకం (SEEVY), మొదలైనవి ఈ అభివృద్ధి పథకాలు.

ఏమైనప్పటికీ ఆరవ ప్రణాళికా కాలంలో ఆశించిన ఉపాధికల్పనా సౌకర్యాలను కల్పించలేకపోయారు. ఆ కారణాల్లో ప్రధానమైనవి (i) పారిశ్రామిక రంగంలో వృద్ధిరేటు అల్పంగా ఉండడం, (ii) ఆరవ ప్రణాళిక చివరి సంవత్సరంలో వ్యవసాయ ఉత్పత్తులు తగ్గడం, ఈ కారణాలవల్ల ఆరవ ప్రణాళికాంతానికి నిరుద్యోగుల సంఖ్య 9.2 మిలియన్లకు పెరిగింది. ఒక శుభసూచక పరిణామం ఏమిటంటే దారిద్ర్యరేఖకు దిగువనున్న జనాభా తగ్గుతూ వచ్చింది. 1977-78 సంవత్సరంలో 48.3 శాతం జనాభా దారిద్ర్యరేఖకు దిగువన ఉండగా 1983-84 సంవత్సరంలో 37.4 శాతానికి తగ్గింది. అది 1984-85 సంవత్సరంలో 35 శాతానికి తగ్గింది. ఆర్థిక పెరుగుదల రేటు అధికంగా ఉండడంవల్లనూ పేదరిక నిర్మూలన కార్యక్రమాలను చేపట్టడం వల్లనూ దారిద్ర్యరేఖకు దిగువనున్న జనాభా శాతం తగ్గుతూ వచ్చింది.

ఆరవ పంచవర్ష ప్రణాళికలో ఎదుర్కొన్న సమస్యలలో ధరల పరిస్థితి, చెల్లింపు శేషంలో విపరీత లోటు ముఖ్యమైనవి.

## 10.10 ఏడవ పంచవర్ష ప్రణాళిక, 1985-90

ఏడవ పంచవర్ష ప్రణాళిక 1985వ సంవత్సరం ఏప్రిల్ మాసం నుంచి ఆరంభమైంది. ఈ ప్రణాళిక ఆరంభ పరిస్థితులు చాలా అనుకూలంగా ఉన్నాయి. 1985 సంవత్సరం నుంచి 2000 వరకు 15 సంవత్సరాల దీర్ఘదర్శి వ్యూహం ఉద్దేశ్యంగా పెట్టుకొని ఏడవ పంచవర్ష ప్రణాళికను రూపొందించారు.

### 10.10.1 లక్ష్యాలు

గత ప్రణాళికల్లో ఉద్దేశించిన లక్ష్యాలనే ఏడవ ప్రణాళిక కొరకుకూడా లక్ష్యాలుగా నిర్దేశించారు. అందుకే ఏడవ ప్రణాళికలో ఆర్థిక పెరుగుదల, ఆధునికీకరణ, స్వయంసమృద్ధి, స్వావలంబన, సాంఘిక న్యాయం మొదలైన లక్ష్యాలను సాధించాలని నిర్ణయించారు. ఆహారధాన్యాల ఉత్పత్తిని అధికం చేయడానికి, ఉపాధికల్పనా సౌకర్యాలను పెంచడానికీ, ఉత్పాదకతను ద్విగుణీకృతం చేయడానికీ ఏడవ ప్రణాళికను ఉద్దేశించారు. ఏడవ ప్రణాళికలో ఉద్యోగితకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. అవస్థాపనా సౌకర్యాల అభివృద్ధికి చేసే పెట్టుబడి నుంచి ఆశించిన లక్ష్యాలను సాధించడానికి పాటుపడాలని భావించారు. ఈ ప్రధాన లక్ష్యాలనే కాకుండా సాంకేతిక పరిజ్ఞానంలో ఉన్నతిని సాధించాలనీ, ద్రవ్యోల్బణాన్ని నిరోధించాలనీ, ప్రజల భౌతిక అవసరాలలో ప్రగతిని సాధించాలనీ ఏడవ ప్రణాళిక లక్ష్యంగా పెట్టుకొంది.

## 10.10.2 పెట్టుబడి

ఏడవ ప్రణాళికలో ప్రభుత్వ రంగానికి గాను 1984-85 ధరలలో రూ. 1,80,000 కోట్ల పెట్టుబడిని కేటాయించారు. దీంట్లో నుంచి ప్రస్తుత పెట్టుబడి (Current Outlay) రూ. 25,782 కోట్లను తీసివేస్తే రూ. 1,54,218 కోట్లు ప్రభుత్వరంగ పెట్టుబడి అవుతుంది. ప్రైవేట్ రంగానికి రూ. 1,68,148 కోట్లు కేటాయించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు రెండింటికి గాను మొత్తం పెట్టుబడి రూ. 3,22,366 కోట్లు కేటాయించారు. ఆరవ ప్రణాళికతో పోల్చినప్పుడు ఏడవ ప్రణాళికలో ఈ పెట్టుబడి రెండింతలైనట్లు గమనించవచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య పెట్టుబడి నిష్పత్తిని (48:52) చూస్తే ప్రైవేటు రంగ పెట్టుబడి అధికంగా ఉన్నట్లు అవగతమౌతుంది.

ప్రభుత్వరంగ పెట్టుబడిలో అభివృద్ధి ఖాతాల ఆధారంగా చెప్పగలిగేది ఏమంటే ఇంధన రంగానికి 30.4 శాతం కేటాయించి అధిక ప్రాధాన్యత నిచ్చారు. గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల, దుర్భిక్షప్రాంతాభివృద్ధి పథకం వంటి వివిధ ప్రాంతాల అభివృద్ధి పథకాలతో కూడిన వ్యవసాయ రంగానికి దాదాపు 20 శాతం వనరులను కేటాయించారు. పారిశ్రామిక రంగానికి (ఖనిజాలతో సహా) 12.5 శాతం, రవాణా రంగాలకు 12.7 శాతం కేటాయించారు.

## 10.10.3 వ్యూహం

గత ప్రణాళికా పథకాలకు విరుద్ధంగా ఏడవ ప్రణాళికా వ్యూహాన్ని రూపొందించారు. ఈ ప్రణాళికలో మహలనోబిస్ వ్యూహాన్ని ఆచరించలేదు. పారిశ్రామిక రంగానికి తక్కువ ప్రాధాన్యాన్నిచ్చారు. పేదరికం, నిరుద్యోగం, ప్రాంతీయ అసమానతలు మొదలైన సమస్యలను పరిష్కరించడానికి ఏడవ ప్రణాళికను ఉద్దేశించారు. గ్రామీణాభివృద్ధి పథకాలకు, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో శ్రామిక ఉపయోగిత కార్యక్రమాలను చేపట్టడం ద్వారా నిరుద్యోగం సమస్యను నివారించడానికి ఏడవ ప్రణాళికలో కృషి సల్పుతారు. ప్రజల కవసరమయ్యే వినియోగ వస్తువుల ఉత్పత్తిని పెంచడానికి పాటుపడతారు.

## 10.10.4 పరిశీలన (Assesment)

ఏడవ ప్రణాళిక 1990వ సంవత్సరం మార్చి నెలతో పూర్తి అవుతుంది. ఏడవ ప్రణాళికలోని మొదటి నాలుగు సంవత్సరాలలో ఆశించిన లక్ష్యాలను సాధించడం జరిగింది. ఈ ఏడవ ప్రణాళికాంతానికి అంచనాలకు మించిన అభివృద్ధిని సాధించవచ్చు.

BRAOU

---

### మీ అవగాహనను పరీక్షించుకొండి-8

---

18. ఆరవ, ఏడవ ప్రణాళికలలో కేటాయించిన మొత్తం పెట్టుబడులెంత?
19. ఏడవ ప్రణాళికలో మహలనోబిస్ వ్యూహాన్ని పాటించినట్లు భావిస్తున్నారా?
20. ఏడవ ప్రణాళికలో ఎంత పెరుగుదలను అంచనా వేశారు?

---

## 10.11 సారాంశం / ముగింపు

---

ఈ పాఠంలో గత నలభై సంవత్సరాలలో అమలుచేసిన ఏడు పంచవర్ష ప్రణాళికలను, మూడు వార్షిక ప్రణాళికలను వివరంగా తెలుసుకొన్నాం. ఒక్కొక్క ప్రణాళికలో ఎంతెంత కేటాయింపులు చేశారో, ఏయే లక్ష్యాలను సాధించాలని ఆశించారో, ఏయే విజయాలను సాధించారో పై చర్చవల్ల గ్రహించవచ్చు.

- కుమారి ప్రభాపంత్.

## 10.12 సంప్రదింపు గ్రంథాలు


1. Datt & Sundaram : Indian Economy
2. Misra & Puri : Indian Economy
3. తెలుగు అకాడమి (1972) : ఆర్థికవృద్ధి - ప్రణాళికారచనా సిద్ధాంతాలు


## 10.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

I *కింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 30 పంక్తులలో జవాబు లివ్వండి.*

1. ఆరవ పంచవర్ష ప్రణాళిక లక్ష్యాలను, విజయాలను వివరించండి.
2. రెండవ పంచవర్ష ప్రణాళిక రూపొందించిన వ్యూహాన్ని విశదీకరించండి.
3. నిరంతర ప్రణాళిక అనే భావనను వివరించండి.
4. ఏడవ పంచవర్ష ప్రణాళిక లక్ష్యాలు ఏమిటి?

I. *కింది ప్రశ్నలకు ఒక్కొక్కదానిక సుమారు 15 పంక్తులలో జవాబు లివ్వండి.*

1. ప్రణాళికా సెలవు అంటే ఏమిటి? మూడు వార్షిక ప్రణాళికలను వివరించండి.
2. నిరంతర ప్రణాళిక అను భావనను వివరించండి. దాని లక్ష్యాలేమిటి?
3. ఏడవ పంచవర్ష ప్రణాళిక లక్ష్యాలేమిటి?

BRAOU

# భాగం—11: భారతదేశ పంచవర్ష ప్రణాళికల విజయాలు

విషయక్రమం


11. 0 లక్ష్యాలు, ఉద్దేశాలు
11. 1 పరిచయం
11. 2 వ్యవసాయాభివృద్ధిలో ప్రణాళికల పాత్ర
11. 3 ప్రణాళికా కాలంలో పారిశ్రామిక ఉత్పత్తి
11. 4 ప్రణాళికలు — ఆర్థిక వ్యవస్థలో వృద్ధి
11. 5 ప్రణాళికలు — సాంఘీక న్యాయం
11. 6 ప్రణాళికలు — ఉపాధికల్పన
11. 7 ప్రణాళికలు — ధరల పరిస్థితి
11. 8 ప్రణాళికలు — స్వయం పోషకత్వం
11. 9 సారాంశం/ముగింపు
11.10 సంప్రదింపు గ్రంథాలు
11.11 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 11.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

భారతదేశంలో గత 35, 40 సంవత్సరాల కాలంలో అమలయిన వివిధ పంచవర్షప్రణాళికలు తమ లక్ష్యాలను ఎంత వరకు సాధించగలిగాయో వీటి వల్ల మన దేశ ఆర్థిక వ్యవస్థలో మౌలికమైన మార్పులు ఎంత వరకు సంభవించయో సమీక్షించడమే ఈ పాఠం లక్ష్యం.

ఈ పాఠాన్ని చదివిన తర్వాత మీరు

★ వ్యవసాయరంగాభివృద్ధి సాధనలో ప్రణాళికలు ఎంత వరకు సఫలీకృతమైనాయో చెప్పగలరు.
★ గత 35 సంవత్సరాల కాలంలో పారిశ్రామిక ఉత్పత్తి ధోరణులను వివరించగలరు.
★ ప్రణాళికా కాలంలో జాతీయాదాయ ధోరణులను గుర్తించవచ్చు.
★ సాంఘీక న్యాయాన్ని, స్వయం పోషకత్వాన్ని, ఉద్యోగితా అవకాశాల పెంపును సాధించడంలో ప్రణాళికల పాత్రను విశ్లేషించవచ్చు.
★ ప్రణాళికా కాలంలో ఆదాయ, సంపద అసమానతలలో మార్పులను తెలుసుకోవచ్చు.
★ గత 35 సంవత్సరాల కాలంలో ధరల స్థాయిలోకి విపరీత పోకడలను గురించి తెలుసుకో గలుగుతారు.

BRAOU

## 11.1 పరిచయం

భారతదేశంలో అమలు చేసిన వివిధ ప్రణాళికలను గురించీ, అవి వైయక్తికంగా సాధించిన విజయాలను గురించీ కిందటి పాఠంలో చర్చించాం. కానీ ఈ ప్రణాళికలు ఆర్థిక వ్యవస్థలో ఎటువంటి ప్రధానమైన మార్పులను తెచ్చాయో, మన ఆర్థిక వ్యవస్థ ముఖ్యమైన లక్ష్యాల సాధనలో ఎంత వరకు సఫలీకృతమయ్యాయో తెలుసుకొనవలసి అవసరం ఉంది. మన దేశ ఆర్థికాభివృద్ధి కోసం వ్యవసాయ, పారిశ్రామికరంగాల అభివృద్ధిపై

సాంఘీక న్యాయాన్నీ, ఆర్థిక అసమానతల తొలగింపునీ, ఉద్యోగితా సౌకర్యాల పెంపునీ, స్వావలంభనమూ, ధరల స్థాయిలో అత్యల్ప మార్పునే కాక ఇంకా అనేక లక్ష్యాలను నిర్ణయించుకున్నాం. ఈ లక్ష్యాల సాధనలో ప్రణాళికలు ఎంత వరకు సఫలీకృతం అయ్యాయో సమీక్షించుకొందాం.

## 11.2 వ్యవసాయ అభివృద్ధిలో ప్రణాళికల పాత్ర

పంచవర్ష ప్రణాళికలను రూపొందించే నాటికి వ్యవసాయ రంగాభివృద్ధికోసం నిర్దిష్టమైన విధానమంటూ ఏమీ లేదు. ఆనాటి ఆర్థిక పరిస్థితులలో కేవలం సాంప్రదాయక పద్ధతుల మీదా, నైపుణ్యం మీదా ఆధారపడ్డారు. ప్రణాళికలు నీటి పారుదల సౌకర్యాల పెరుగుదలను, వ్యవసాయ విస్తరణను,సమాజాభివృద్ధి కార్యక్రమాలను మాత్రమే సూచించాయి. 1966 69 వార్షిక ప్రణాళికల కాలంలో అధునాతన పద్ధతులతో సస్య విప్లవాన్ని ప్రవేశ పెట్టారు.

భారతదేశంలో ఉద్యోగావకాశాలకూ, ఉత్పత్తి ప్రమాణాలకూ వ్యవసాయమే ప్రధానరంగంగా ఉంది. ఆహార ధాన్యాలకూ పారిశ్రామిక ముడి సరుకులు పత్తి, జనపనార, కాఫీ, టీ మొదలైన వాటికి వ్యవసాయమే ఆధారం. ఆర్థికాభివృద్ధి అంచానకు వ్యవసాయరంగంలో పోకడలు చాలా ముఖ్యమైనవి. కార్మికులు కొనుక్కునే పారిశ్రామికోత్పత్తుల సరఫరా అవసరాల మేరకు జరిగితే, ద్రవ్యోల్బణం తలెత్తదు.

వ్యవసాయోత్పత్తిని రెండు ప్రధాన భాగాలుగా విభజించవచ్చు. 1. ఆహారధాన్యాలు 2. ఆహారేతర ఉత్పత్తులు. మొత్తం వ్యవసాయోత్పత్తిలో మూడింట రెండువంతులు ఆహారధాన్యాలే.

పట్టిక — 1 : వ్యవసాయ అభివృద్ధి రేటు

| | 1952 53 నుంచి 1964 65 వరకు | 1964 65 నుంచి 1972 74 వరకు |
|---|---|---|
| మొత్తం వ్యవసాయోత్పత్తి | 3.42 % | 2.18% |
| ఆహారధాన్యాలు | 2.75% | 2.73% |
| ఆహారేతర ఉత్పత్తులు | 4.79% | 1.75% |

పై పట్టిక వ్యవసాయ రంగంలోని దయనీయ పరిస్థితికి అద్దం పడుతోంది. ఆహార ధాన్యాల, ఆహారేతర వస్తువుల రెండింటి ఉత్పత్తి 20 సంవత్సరాలలో తగ్గిపోవటంతో వ్యవసాయాభివృద్ధిరేటు కూడా తగ్గిపోయింది.

పట్టిక — 2: వ్యవసాయరంగంలో పెట్టుబడి, ఉత్పత్తులు

| | మొదటి ప్రణాళిక | రెండవ ప్రణాళిక | మూడవ ప్రణాళిక | వార్షిక ప్రణాళిక | నాల్గవ ప్రణాళిక | ఐదవ ప్రణాళిక |
|---|---|---|---|---|---|---|
| 1. వ్యవసాయం, నీరు పారుదల రంగాలకు కేటాయించిన పెట్టుబడి శాతం | 31% | 20% | 21% | 24% | 24% | 24% |
| 2. ఆహారధాన్యాల ఉత్పత్తి లక్ష్యం (మిలియన్ టన్నులు) | వివరాలు లభించలేదు | 81.5 | 100 | 105 | 129 | 116 |
| 3. సాధించినది | 65.8 | 79 | 72.3 | 98 | 111 | 114.6 |

పై పట్టిక ప్రకారం ఇతర ప్రణాళికలతో పోలిస్తే మొదటి ప్రణాళికలో అధికశాతం పెట్టుబడి వ్యవసాయరంగానికి కేటాయించినట్లు తెలుస్తోంది. నిజమైన తలసరి ఆదాయం పెరిగింది. కానీ రెండవ ప్రణాళికలో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత తగ్గించి, ఆ స్థానం పారిశ్రామికరంగానికిచ్చారు. ఫలితంగా దిగుబడి పెరిగినప్పటికీ లక్ష్యాన్ని సాధించడంలో ఈ రంగం విఫలమైంది. అందువల్ల 3వ ప్రణాళికలో వ్యవసాయరంగంలో పెట్టుబడిని పెంచాల్సిన అవసరం ఏర్పడింది. కానీ అనావృష్టి పరిస్థితులవల్ల వ్యవసాయాభివృద్ధి కుంటుపడి ఉత్పత్తి పెంచటానికి చేసిన ప్రయత్నాలు వమ్ము అయ్యాయి. సస్య విప్లవ విధానాన్ని ప్రవేశ పెట్టడంలో వార్షిక ప్రణాళికల కాలం ప్రముఖ పాత్ర వహించింది. అలాగే 4వ, 5వ ప్రణాళికలలో వ్యవసాయోత్పత్తికి అధిక ప్రాధాన్యమిచ్చారు. ఏదేమైనప్పటికీ మొదటి ప్రణాళిక తప్ప మిగతా ప్రణాళికలు లక్ష్యాలను సాధించలేకపోయాయి.

భారతదేశ ప్రణాళికాభివృద్ధిలో వ్యవసాయాభివృద్ధిని ప్రధానరంగంగా ఎప్పుడూ పరిగణించలేదు. అదే పెద్ద బలహీనతకు దారితీసింది. కార్మికుల అవసరాల (wage goods) సరఫరా భారత ప్రణాళికా విధానానికి పునాదిగా ఉంది. లక్ష్యాలు సాధించలేనపుడు క్రమబద్ధంగా కాక దఫాల వారీగా పెట్టుబడిని మంజూరు చేసే పద్ధతి వల్ల కార్మికుల అవసరాల ఉత్పత్తి అభివృద్ధి సాఫీగా కొనసాగకుండా పోయింది. ఇంతకు ముందే చెప్పినట్లు భారీ పరిశ్రమల ఏర్పాటు వల్ల ఉద్యోగావకాశాలు [illegible]. జనాభా పెరుగుదల వల్ల వ్యవసాయోత్పత్తికి డిమాండ్ పెరిగి వ్యవసాయోత్పత్తుల అభివృద్ధిని అత్యవసరం చేసింది. వ్యవసాయాభివృద్ధి రేటులో తరుగుదల వల్ల రెండు నష్టాలు కలిగాయి. ఒక వైపు ద్రవ్యోల్బణం ఏర్పడి ప్రజల దారిద్ర్యం పెరిగి, ప్రణాళికల సైజుతగ్గింది, రెండో వైపు ఆహార పదార్థాల దిగుమతి ఎక్కువై విదేశీమారకద్రవ్య నిల్వలు తరిగిపోయాయి. వ్యవసాయ రంగానికి అధిక శాతం పెట్టుబడిని కేటాయించినప్పటికీ ఉద్యోగావకాశాల, జనాభా పెరుగుదలలతో పోల్చి చూస్తే అందుకు తగిన విధంగా వ్యవసాయోత్పత్తి (దిగుబడి) పెరగలేదు. వరుసగా కొన్ని సంవత్సరాల పాటు అనావృష్టి పరిస్థితులు ఏర్పడటమే దీనికి కారణం. చిన్న, మధ్య తరహా నీటి పారుదల సౌకర్యాల ఏర్పాటుకు బదులు, భారీ ఖర్చుతో, ఎక్కువ కాలం పట్టే బహుళార్థ సాధక పథకాల మీద ఎక్కువ శ్రద్ధ చూపటంతో రైతులకు ఆశించిన ఫలితాలు అందివ్వ లేకపోయాయి. ప్రణాళికల తర్వాత కూడా వ్యవసాయాభివృద్ధి వరుణ దేవుడి దయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసి వచ్చింది.

## 11.3 ప్రణాళికా కాలంలో పారిశ్రామిక ఉత్పత్తి

ప్రణాళికల అమలుకు కావాల్సిన పెట్టుబడిని సమకూర్చడంలో ప్రణాళికారచయితలు చాలా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది. అభివృద్ధి క్రమంలో భారీ, ప్రాథమిక పరిశ్రమల పాత్ర మొదటి ప్రణాళికలోనే గుర్తించినప్పటికీ మొత్తం పెట్టుబడిలో చాలా తక్కువ భాగాన్ని మాత్రమే ఈ రంగానికి కేటాయించారు. కానీ ఈ తక్కువ భాగమే ప్రభుత్వరంగ సంస్థలైన హెచ్.యం.టి, ఐ.టి.ఐ. (ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీ) ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, లోక్‌మోటివ్స్ మొదలైన ఎన్నో పరిశ్రమల స్థాపనకు పునాదులు వేయటానికి ఉపయోగపడింది. రెండో ప్రణాళికను పారిశ్రామికాభివృద్ధి లక్ష్యంగా రచించారు. 1956లో పారిశ్రామిక విధాన రూపకల్పన జరగటంతో పారిశ్రామిక రంగం ముఖ్యంగా భారీ పరిశ్రమల స్థాపన, విద్యుత్పరికరాలు, ఉక్కు, యంత్ర పరికరాలు, ఫెర్రస, నాన్-ఫెర్రస్ పరిశ్రమలు పెద్ద ఊపునందుకున్నాయి.మూడవ ప్రణాళిక కూడా భారీ పరిశ్రమల అభివృద్ధికి ఇదే విధమైన ప్రాముఖ్యానిచ్చింది. పెట్రోలియం, యంత్ర పరికరాలు, లోహ వస్తువులు, రవాణా సామాగ్రి, విద్యుత్, విద్యుదేతర యంత్రాల ఉత్పత్తి, అభివృద్ధి కూడా తృప్తికరంగా ఉన్నది.

మూడు వార్షిక ప్రణాళికల కాలంలో ప్రాధాన్యత పారిశ్రామిక రంగం నుండి రక్షణ రంగానికి మరలింది. దానివల్ల కొంత కాలం పాటు ప్రణాళికా విధానమే నిలిచిపోయింది. ఉత్పత్తిని పెంచడం కన్నా, స్థాపిత ఉత్పాదనశక్తిని ఉపయోగించడానికి ప్రాముఖ్యం ఇచ్చారు. దీని వల్ల 3వ ప్రణాళికా కాలంలో 35% ఉన్న

పారిశ్రామికాభివృద్ధిరేటు వార్షిక ప్రణాళికల సమయంలో 11 శాతానికి పడిపోయింది. నాల్గవ ప్రణాళిక పారిశ్రామిక రంగానికి కాక వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమిచ్చింది. భారీ పరిశ్రమల రంగానికి కొత్త పెట్టుబడులు కేటాయించలేదు. దీని వల్ల వినియోగించుకోలేని ఉత్పాదకశక్తి వల్ల ఏర్పడే సమస్యలు మరింత పెరిగాయి. పారిశ్రామిక ఉత్పత్తి శక్తిని వినియోగ వస్తు పరిశ్రమలకు మళ్ళించి, భారీ పరిశ్రమల్లోని లదనపు ఉత్పాదక శక్తి సమస్యను పరిష్కరించాలని తప్పుగా అనుకోవడం జరిగింది. దీనితో వినియోగవస్తువుల (Consumer durables) ఉత్పత్తి పెరిగింది. వ్యూహమే తల్లకిందులైంది. వినియోగ వస్తువులను యంత్రాలపై తయారు చేసే విధానానికి ప్రభుత్వామోదం, ప్రోత్సాహం లభించాయి. 5 సంవత్సరాలలో పారిశ్రామిక ఉత్పత్తి 18.5 శాతానికి మాత్రమే పెరిగింది. 1974-77 మధ్య కాలంలో అంటే మూడు వార్షిక ప్రణాళికల కాలంలో తాత్కాలికత చోటు చేసుకుంది. నిరంతర ప్రణాళికా పద్ధతిని ప్రవేశ పెట్టడం వల్ల మళ్ళీ వ్యవసాయరంగానికి ప్రధాన్యత లభించింది, ఫలితంగా పారిశ్రామిక ఉత్పత్తి, ఉత్పాదకశక్తి పడిపోయాయి. 1980లో ప్రారంభించిన 6వ ప్రణాళికలో కూడా వ్యవసాయ రంగాన్ని ప్రాధాన్యతా రంగంగా గుర్తించే విధానం కొనసాగింది. మళ్ళీ భారీ, ప్రాథమిక పారిశ్రామిక రంగాల అభివృద్ధి కుంటుపడింది. 6వ ప్రణాళికలో నిర్మాణంలో ఉన్న పథకాలను పూర్తి చేయటం వల్లా, ఉత్పాదనాశక్తిని ఉపయోగించుకోవడం వల్ల భారీ పరిశ్రమల రంగానికి తక్కువ ప్రాముఖ్యం లభించింది.

పట్టిక 3: పారిశ్రామిక ఉత్పత్తి, పెట్టుబడుల పరిస్థితి

| | 1వ ప్రణాళిక | 2వ ప్రణాళిక | 3వ ప్రణాళిక | వార్షిక ప్రణాళిక | 4వ ప్రణాళిక | 5వ ప్రణాళిక | 6వ ప్రణాళిక |
|---|---|---|---|---|---|---|---|
| పరిశ్రమలు గనుల తవ్వకంలో పెట్టుబడిశాతం | 4% | 20% | 20% | 23% | 18% | 23% | 21% |
| సాధించిన అభివృద్ధి రేటు | 38% | 52% | 35% | 11% | 18.5% | 31% | వివరాలు లభించ లేదు |
| అభివృద్ధిరేటు లక్ష్యం | వివరాలు లభించ లేదు | వివరాలు లభించ లేదు | 55% | వివరాలు లభించ లేదు. | 50% | 25.0% | 40% |

BRAOU

పై పట్టికలో చూపినట్లుగా పెట్టుబడి కేటాయింపుల్లో చేసిన తాత్కాలిక బదలాయింపుల వల్ల పెట్టుబడి ఎక్కువగా ఏర్పడలేదు. విధానంలో పెద్ద మార్పులు జరగటం వల్ల ఒకవైపు పెట్టుబడి ఎక్కువగా ఏర్పడని పరిస్థితి ఉండగా మరో వైపు దీనికి సరితూగని పద్ధతిలో వ్యవసాయాభివృద్ధి ఉంది. ముందు పాఠంలో చెప్పినట్లుగా వ్యవసాయరంగంలో ఉత్పత్తి అయ్యే కార్మికుల అవసరాలకూ, పెట్టుబడి కేంద్రీకరణకూ మధ్య సమతూక కేటాయింపు నిష్పత్తి సాధ్యంకాలేదు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల రెండింటి అభివృద్ధి సమతూకంలో ఉండాల్సిన అవసరాన్ని గుర్తించే వ్యూహంలేకపోవటం, పెట్టుబడి కేటాయింపులో వ్యవసాయరంగానికి ప్రాధాన్యత ఇవ్వటం, దాన్ని మరల పారిశ్రామిక రంగానికి మార్చడం, మరల వ్యవసాయ రంగం వైపు మొగ్గుచూపటం వల్ల రెండింటిలో ఏ రంగమూ పూర్తిగా అభివృద్ధి చెందలేదు. 2వ ప్రణాళికలో ప్రత్యేకంగా ఇలా పేర్కొన్నారు. ''ప్రాథమిక పరిశ్రమల్లో పెట్టుబడి వల్ల వినియోగ వస్తువులకు డిమాండ్ పెరిగింది కానీ ఇది వినియోగ వస్తువుల సరఫరాను పెంచలేకపోయింది. శ్రమశక్తిని కూడా ఎక్కువగా వినియోగించుకోలేకపోయింది. పెట్టుబడిని పొదుపు చేసే విధంగా వినియోగ వస్తువులను సరఫరా

చేసేందుకూ, శ్రమ శక్తిని ఉపయోగించుకొనేందుకూ సమతూకంలో ఉండే పారిశ్రామికీకరణ అవసరం" ప్రొఫెసర్ గౌతమ్ మాథుర్ తన భారీ వ్యూహంలో చెప్పిన సమతూక కేటాయింపు విస్తృతికి ఇది సరిపోలుతోంది. దురదృష్టవశాత్తు ఈ అభిప్రాయం కాగితాలపైనే మిగిలి ఆచరణలోకి రాలేదు. సరైన విధానమూ, వ్యూహమూ లేకపోవటంతో పాటు ఇతర ఆర్థికేతర కారణాలు కూడా ప్రణాళికల వైఫల్యానికి కారణం. మారుతున్న రాజకీయ సిద్ధాంతాలు, యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలు, అంతర్జాతీయ సంక్షోభం, బలమైన ప్రైవేట్ రంగం ఉనికి పెద్ద కారణాలు. ఫలితంగా 2వ ప్రణాళిక నుంచీ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో పెట్టుబడి ఏర్పాటు పాత్ర తక్కువైయింది. దీనిఅర్థం దేశంలో పారిశ్రామికాభివృద్ధికి పునాది ఏర్పాడటానికి ఒక దశాబ్దకాలం చాలునని భావించారు. పెరుగుతున్న జనాభాగల పెద్ద దేశం అవసరాలకు ఇది ఏ మాత్రం సరిపోదు.

హద్దూ, అదుపూలేని ప్రైవేటు రంగం ఏర్పడటం వల్ల పరిస్థితి మరింత క్షీణించింది. 1956 పారిశ్రామిక విధానం ప్రైవేట్ రంగంలో వినియోగవస్తువుల తయారీని పూర్తిగా ఆమోదించింది. ప్రైవేట్ రంగం నిరాటంకంగా సాగింది. భారతప్రణాళికా విధానంలో ఇదొక పెద్ద బలహీనత. ఫలితంగా ప్రణాళికా రచయితలు ఎంతో జాగ్రత్తగా నిర్ణయించిన లక్ష్యాలు సాధించలేదు. ప్రణాళికలు పూర్తిగా విఫలమయ్యాయి. పెట్టుబడి కేటాయింపునూ అనేక పరిశ్రమల అభివృద్ధినీ మార్చి వేసింది. కేంద్రీకరణనూ, గుత్తవిధానాన్ని పెంచింది. ఆదాయ, వినియోగాల్లో తారతమ్యాలను పెంచింది.

ప్రైవేట్ రంగం అభివృద్ధిని చూస్తే వస్తువుల, సాధనాలను ఎన్నుకునే స్వేచ్ఛ ముఖ్య విషయమని తెలుస్తోంది.మనది మిశ్రమ ఆర్థిక విధానం కావటం వల్ల (ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెండూ ఉండటం మిశ్రమ విధానం) ప్రైవేట్ రంగం ప్రణాళికా పరిధిలోని వ్యక్తుల నిర్ణయాలకు వదిలివేయబడింది. దీనితో పాటు ఆర్థికాభివృద్ధికి వినియోగవస్తువుల తయారీ అంత ముఖ్యంకాదన్న కారణంతో, వినియోగవస్తువుల తయారీ ప్రైవేట్ రంగానికి ఇచ్చారు.

ఏమైనప్పటికీ లాభార్జనే ధ్యేయంగా ప్రైవేట్ రంగం ప్రణాళికలు నివారించాలనుకున్న అత్యవసరం కాని వస్తువుల తయారీనే సాగించింది. అదుపు లేకపోవడంతో పాటు అప్పటికే ఆదాయంలో అసమానతలు ఈ వస్తువుల తయారీకి అనుకూల పరిస్థితిని సృష్టించాయి. శెట్టి తన నివేదికలో 60వ దశకం మధ్య నుంచి సమాజంలోని ధనిక వర్గాల అవసరాలకోసం అత్యవసరం కాని వస్తువల తయారీ బాగా పెరిగిందని పేర్కొన్నారు. ప్రాథమిక పరిశ్రమలకవసరమయ్యే వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమల అభివృద్ధి రేటు తగుముఖం పట్టింది.

పట్టిక — 4: పారిశ్రామికోత్పత్తి పెరుగుదల రేటు (శాతంలో)

| | 1960-65 | 1966-72 |
|---|---|---|
| మొత్తం | 8.98 | 4.47 |
| ప్రాథమిక పరిశ్రమలు | 10.45 | 6.66 |
| మధ్యస్థరహా వస్తువులు | 7.02 | 3.81 |
| మన్నికలేని వినియోగవస్తువులు (Consumer non-durables) | 3.42 | 5.31 |
| మన్నికైన వినియోగవస్తువులు (Consumer durables) | 10.72 | 7.97 |

BRAOU

పై పట్టికను బట్టి భారీ పరిశ్రమల రంగానికీ, ఆ రంగంలో పెట్టుబడి ఏర్పాటుకి ప్రాధాన్యమిచ్చినప్పటికీ వినియోగవస్తువుల రంగంతో పోల్చి చూస్తే ప్రాథమిక, భారీ రంగాల అభివృద్ధి రేటు 17 శాతానికి పడిపోయింది. పారిశ్రామిక పునాది అభివృద్ధి చెందడం ఎంతో అవసరం. కానీ దానికి విరుద్ధంగా ఉన్న ఈ పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. సంవత్సరాలనుంచి వినియోగ వస్తువుల తయారీ రంగం, పెట్టుబడి, భారీ పరిశ్రమల రంగాల పెట్టుబడిని దాటి పోయింది. ప్రణాళికలవైజానికి ఇది పూర్తివిరుద్ధం. ఆర్థిక వ్యవస్థలో మార్పు ఉంది నిజమే కానీ అది వాంఛించిన విధంగా కాక మరో మార్గంలో ఉంది. అందుకనే శెట్టి దీనిని "నిర్మాణాత్మక తిరోగమనము" అన్నారు.

ప్రణాళికలలో చెప్పింది ఒకటి. ఆచరణలో జరిగింది మరొకటి. 2వ ప్రణాళిక నుండే వినియోగ వస్తువులను ఫ్యాక్టరీల ద్వారా ఉత్పత్తి చేయటం ఒక మార్పు. ఆ విధంగా ప్రస్తుతం ఉన్న అభివృద్ధి దీర్ఘకాలిక నిర్మాణాత్మక తిరోగమనానికి బీజం 1956లోనే పడింది. అదే విధంగా 3వ ప్రణాళికలో కూడా మన్నికైనా వినియోగవస్తు (Durables) పరిశ్రమలను స్థాపించటానికి అనుమతించారు. 1967లో ఏర్పర్చిన దత్ కమిటీ భారతదేశంలోని లైసెన్సింగ్ విధానాన్ని గురించి నివేదిస్తూ భారీ పరిశ్రమల రంగానికి ప్రాధాన్యమిచ్చినట్లుగా చెప్పటం నిజంగా తమాషాగా వుందన్నారు. 1956-66 మధ్య కాలంలో 74 శాతం లైసెన్సులు ప్రైవేట్ రంగానికి మంజూరు కాగా ప్రభుత్వ రంగం కేవలం 3 శాతం లైసెన్సులు పొందింది. వినియోగ వస్తువుల తయారీలోనే కాక పెట్టుబడి, వినియోగ, పారిశ్రామిక వస్తూత్పత్తి చేసే పరిశ్రమల్లో కూడా ఏదో ఒక రూపంలో ప్రైవేట్ సంస్థల జోక్యం ఉంటూ వచ్చింది. పారిశ్రామిక విధానం కింద ప్రభుత్వ రంగంలో భారీ పరికరాల వర్గీకరణను ఆచరణలో పెట్టలేదు. అల్యూమినియం ఉత్పత్తి యావత్తు ప్రైవేట రంగానికే ఇచ్చారు. యంత్రపరికరాల ఉత్పత్తికి 226 లైసెన్సులు ప్రైవేట్ రంగానికి ఇచ్చారు. ఇదే విధంగా ఇతర రంగాలలోకి ప్రైవేట్ రంగం అడుగు పెట్టి మొత్తం ప్రణాళికల ఆకారాన్నే కూలదోసింది. అసలు యాజమాన్యం సంగతి అలా ఉంచి, కొరతగా ఉండే భారీ వస్తువులను దుర్వినియోగ పరచడం ఏ మాత్రం హర్షించలేని విషయం. లాభార్జనే ధ్యేయంగా ఉండే ప్రైవేట్ రంగం ఈ లైసెన్సులను విలాస వస్తువుల, అత్యవసరం కాని వస్తువుల తయారీకి ఉపయోగిస్తుంది. దత్ కమిటీ ప్రైవేట్ రంగంలో యాంత్రీకరణ ఉన్నత స్థాయిలో వుందని పేర్కొంది. 1956-66 మధ్య కాలంలో ప్రైవేట్ రంగం యంత్రాలు, పెట్టుబడిసాధనాలపై 67.5 శాతం ఖర్చుపెట్టగా అదే కాలంలో ప్రభుత్వ రంగం కేవలం 19 శాతం ఖర్చుపెట్టింది. పెట్టుబడిసాధనాల దిగుమతిలో 86 శాతం ప్రైవేట్ రంగానిది కాగా ప్రభుత్వ రంగం వాటా కేవలం 4 శాతం మాత్రమే. యంత్రాలపై వినియోగ వస్తువుల తయారీలో కావలసిన ముడిసరుకులు, సాధన సంపత్తికి ప్రభుత్వ రంగం మీద ఆధారపడుతున్నారు. ఈ విధంగా భారీ రంగంలోని దిగుబడినంతా తేలిక రకం యంత్రాలు, వినియోగ వస్తువుల తయారీకి ఉపయోగిస్తున్నారు. ఇది భారీ పరిశ్రమల రంగం అభివృద్ధి రేటును తగ్గిస్తోంది. భారీ పరిశ్రమల రంగానికి ప్రాధాన్యమివ్వటమంటే ప్రణాళికలో దానికి కేటాయించినపెట్టుబడి శాతం కాక దానిపై వచ్చే ఉత్పత్తిని మళ్ళీ దాని అభివృద్ధికే వినియోగించటం. భారీ పరిశ్రమల రంగం ఉత్పత్తినంతటినీ తేలిక రకం పరిశ్రమ రంగానికి మళ్ళించడం వల్ల పారిశ్రామిక రంగ ఉత్పత్తిని మళ్ళీ అదే రంగంలో వినియోగించే పద్ధతి భారీ పరిశ్రమలకుతక్కువ ప్రాధాన్యమిచ్చేదిగా వుంది.

భారీ పరిశ్రమల రంగంలోనే వివిధ ప్రణాళికలలో ప్రాధాన్యతలలో మార్పుల వల్ల వివిధ పరిశ్రమలకు వివిధ సమయాల్లో ప్రాధాన్యమిచ్చారు. ఫలితంగా పారిశ్రామిక రంగంలో అస్థిరమైన అభివృద్ధిలో ఉత్పత్తి ఒకప్పుడు సమృద్ధిగానూ, మరొకప్పుడు కొరతగానూ ఉంది. పెట్టుబడి కేటాయింపులలో జరిగిన మార్పుల వల్ల భారీ పరిశ్రమల రంగంలో సరైన అభివృద్ధి లేక సిమెంట్, విద్యుచ్ఛక్తి, ఉక్కు రసాయనాలకు తీవ్ర కొరత ఏర్పడింది. కొన్ని సార్లు అవసరాలకు మించిన ఉత్పత్తి జరిగింది. బొగ్గు వంటి అనేక వస్తువులు మార్కెట్లో కుప్పలుగా ఉన్నాయి. మొదటి ప్రణాళికలో పారిశ్రామిక రంగానికి పెట్టుబడి కేటాయింపు తక్కువగా వుండటం వల్ల 2వ ప్రణాళికలో ప్రారంభించిన పరిశ్రమలకు కావాల్సిన ముడి సరుకుల సరఫరాలో తీవ్రమైన అడ్డంకులు ఏర్పడతాయి. ఉక్కు,యంత్రపరికరాలు, భారీ సాధనాలు, భారీ విద్యుత్ పరికరాలు, రవాణా మొదలైన పరిశ్రమలకు ఇనుప ఖనిజం, ఉక్కు, ఇతర నాన్-ఫెర్రస్‌లోహాలు, విద్యుచ్ఛక్తి మొదలైన ముడిసరుకులు



BRAOU

స్థిరమైన సరఫరా ఉండాలి. ఈ పరిశ్రమలు అవసరానికి తగినంతగా సరఫరా లేకపోవటం వల్ల 2వ ప్రణాళికలో పారిశ్రామిక ఉత్పత్తికి తీవ్రమైన అడ్డంకులు ఏర్పడ్డాయి. ఇంతకు ముందు సమతూక అభివృద్ధిని గురించి చదువుతూ, పరిశ్రమలకు కావల్సిన ముడి సరుకులు మొదలైన వాటిలో పెరుగుదల ఉంటేనే కాని స్థిరమైన పారిశ్రామికాభివృద్ధి జరగదని తెలుసుకున్నాం. మూడవ ప్రణాళికలో ఈ అడ్డంకులను అధిగమించటానికి ముడి సరుకుల సరఫరా కవసరమైన, ప్రాథమిక పరిశ్రమలకు ప్రాధాన్యతను మార్చారు. మూడవ ప్రణాళిక ముడి సరుకులు సరఫరా చేసే పరిశ్రమల స్థాపనకు కృషి చేసింది. పది సంవత్సరాలలో దేశం తన పారిశ్రామికావసరాలను తానే తీర్చుకునే స్థితికి చేరుకోగలదని భావించారు.

చైనా పాకిస్తాన్‌లతో జరిగిన యుద్ధాలవల్ల ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడి ప్రణాళికా పద్ధతులకు కలవిచ్చారు. ప్రణాళికల అమలును ఆపివేశారు. పెట్టుబడి సేకరణ ఆపి, వనరులన్నింటి నీ రక్షణ రంగం వైపు మరల్చారు. కానీ వార్షిక ప్రణాళికలో భారీ పరిశ్రమల రంగ ప్రాధాన్యతను తిరిగి నెలకొల్పలేదు. విస్తరణ కన్నా ఉన్న ఉత్పాదక శక్తిని వినియోగించుకోవటమే ప్రధాన ధ్యేయమయింది. దానితో పెట్టుబడి సేకరణ కుంటు పడింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఇది జరగరాని పొరపాటు. సస్య విప్లవంలో యంత్రాల ద్వారా వ్యవసాయోత్పత్తిని పెంచే పద్ధతి ప్రవేశపెట్టడంతో వ్యూహంలోనే మార్పు వచ్చింది.

---

### మీ అవగాహనను పరీక్షించుకోండి - 1

---

1. ఐదవ పంచవర్ష ప్రణాళికా కాలంలో వ్యవసాయ, నీటి పారుదల రంగానికి కేటాయించిన పెట్టుబడి శాతమెంత?
2. వ్యవసాయ రంగంలో అల్ప పెరుగుదల వల్ల ఏర్పడిన ప్రభావాలు ఏమిటి?
3. పంచవర్ష ప్రణాళికలలో పారిశ్రామిక, ఖనిజ రంగానికి కేటాయించిన పెట్టుబడి శాతమెంత?
4. మూడవ పంచవర్ష ప్రణాళికలో మన్నికైన వినియోగ వస్తువుల మన్నికలేని (Non-durable) వినియోగ వస్తువుల ఉత్పత్తిలోని ధోరణులు ఏ విధంగా ఉన్నాయి?
5. ప్రైవేటు, ప్రభుత్వ రంగాలకు లైసెన్సులు ఇవ్వడంలో దత్ కమిటీ సిఫారసులేమిటి?

---

## 11.4 ప్రణాళికలు - ఆర్థిక వ్యవస్థలో వృద్ధి

మొత్తం ప్రణాళికా కాలంలో జాతీయాదాయం 5 శాతం, అంతకంటే ఎక్కువ పెరగాలని భావించారు. ఇదే పద్ధతి కొనసాగితే దేశం ఇరవై ఐదుసంవత్సరాలలో స్వయం పోషకత్వం సాధించగలదనీ, జీవన ప్రమాణం రెట్టింపు అవుతుందని భావించారు. లక్ష్యాలనూ, సాధించిన అభివృద్ధినీ పట్టికలో చూడండి.

పట్టిక — 5 : జాతీయ, తలసరి ఆదాయాలు అభివృద్ధి

| | 1వ ప్రణాళిక 1951-56 | 2వ ప్రణాళిక 1956-61 | 3వ ప్రణాళిక 1961-66 | వార్షిక ప్రణాళిక 1966-69 | 4వ ప్రణాళిక 1969-74 | 5వ ప్రణాళిక 1974-79 | 6వ ప్రణాళిక 1980-85 |
|---|---|---|---|---|---|---|---|
| జాతీయాదాయ సంవత్సర సగటు అభివృద్ధి లక్ష్యం | 2.3% | 5.0% | 5.5% | 5.5% | 5.7% | 5.5% | 5.2% |

BRAOU

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| సాధించింది | 3.6% | 3.9% | 2.2% | 2.5% | 3.5% | 3.9% | వివరాలు లభించలేదు |
| తలసరి ఆదాయం సంవత్సరం) సగటు అభివృద్ధి | | | | | | | |
| లక్ష్యం | 0.9% | 3.3% | 3.2% | వివరాలు లభించలేదు | 3.0% | వివరాలు లభించలేదు | 3.3% |
| సాధించింది | 1.8% | 2.1% | 0.3% | 2.4% | - 1.2% | 2.9% | వివరాలు లభించలేదు |

దీన్ని బట్టి భారత ప్రణాళికలు చాలా తక్కువ అభివృద్ధి రేటును సాధించినట్లు తెలుస్తోంది. మొదటి ప్రణాళిక తప్ప మిగతా ఏ ప్రణాళికా నిర్ణయించిన అభివృద్ధి రేటులో సగం కంటే ఎక్కువ సాధించలేకపోయింది. సంవత్సరానికి కనీసం 5 శాతం అభివృద్ధి చేయాలనే అనుకున్నారు. కానీ ప్రణాళికా కాలం మొదటి దశాబ్దంలో (1951-60) 3.8 శాతం అభివృద్ధి రేటును సాధించగా, రెండవ దశాబ్దంలో (1961-70) 3.7 శాతం అభివృద్ధిరేటును మాత్రమే సాధించగలిగారు. తర్వాతి దశాబ్దం (1971-80) అంతకంటే తక్కువ కేవలం 3 శాతం అభివృద్ధి రేటును మాత్రమే సాధించగలిగింది. జనాభా పెరుగుదల 2 నుండి 2.5 శాతం వరకూ ఉండగా తలసరి ఆదాయం చాలా తక్కువగా 1 నుడి 1.5 శాతం వరకూ మాత్రమే పెరిగింది. ఈ పద్ధతి ఇలాగే కొనసాగితే, దారిద్ర్య నిర్మూలన, ప్రజల జీవన ప్రమాణాన్ని రెట్టింపు చేయటం వంటివి సుదూర స్వప్నాలు గానే ఉంటాయి.

మొదటి అభివృద్ధి రేటును నిర్ణయించటం, ఆ తర్వాత దానిని సాధించుకోవటానికి ప్రయత్నం చేయటం ప్రణాళికాబద్ధమైన పద్ధతేకాదు. అభివృద్ధి రేటు నిర్ణయమే అభివృద్ధికి ప్రథమ సోపానం కాదు. అదొక లక్ష్యం మాత్రమే. వేతనాలు, పెట్టుబడి అవకాశాలు, పెట్టుబడి - ఉత్పత్తుల నిష్పత్తి, ఉత్పత్తి విధానం, సాదుపు పరిస్థితులు మొదలైన వాటిపై అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. అభివృద్ధి రేటును ముందే నిర్ణయించటం చెరువులో బర్రె కొమ్ములు జూసి బేరం చేసినట్టు ఉంటుంది.

ఏమైనప్పటికీ లక్ష్యాన్ని సాధించటంతోనే సరిపోదు. ప్రాధాన్యతా రంగాలలో అభివృద్ధి క్రమం సరిగ్గాఉందో లేదో తెలుసుకోవాలంటే వివిధ రంగాలలో పరిస్థితులు వాటిలో అభివృద్ధి క్రమం అమలు జరిగే తీరు చాలా ముఖ్యం. ఇది ప్రణాళికా ఫలితాలు దక్కాల్సిన రంగాలకు దక్కుతున్నాయో లేదో తెల్పుతుంది. జరగవలసిన వ్యవస్థాగత మార్పులు జరుగుతున్నాయో లేదో తెలుసుకోవటానికి తోడ్పడుతుంది. పారిశ్రామిక రంగం గురించి జరిపిన అనేక పరిశీలనల ద్వారా పరిశ్రమలు అధికాదాయ వర్గాలవారి అవసరాలను తీర్చే వస్తూత్పత్తిలో మాత్రం అద్భుత ఫలితాలను సాధించినట్లు తెలుస్తోంది. ఈ విధంగా ప్రైవేట్ రంగంలో నిధులను తప్పుగా కేటాయించటం వలన భారత ఆర్థిక వ్యవస్థలో ఏ రంగమూ ప్రణాళికలలో పేర్కొన్న అభివృద్ధి లక్ష్యాలను సాధించలేక పోయింది. ఫలితంగా ఉత్పత్తి రేటు పెరుగుదల ఉన్నప్పటికీ అది అభివృద్ధికి దారి తీయలేదు.

## మీ అవగాహనను పరీక్షించుకొండి - 2

6. జాతీయ, తలసరి ఆదాయ వృద్ధి రేటులను బట్టి భారత ప్రణాళికలు ఎంత వరకు సఫలీకృతమైనాయో తెలుపుము.

## 11.5 ప్రణాళికలు - సాంఘీకన్యాయం

పంచవర్ష ప్రణాళికలు సాంఘిక న్యాయంతో కూడిన అభివృద్ధిని గురించి వక్కాణిస్తూ వచ్చాయి. సాంఘిక న్యాయం అంటే సంపద, ఆదాయాలలో అసమానతలను తగ్గించటం, జీవన ప్రమాణాలను పెంచి ప్రజల పేదరికాన్ని తొలగించడం. రెండవ ప్రణాళికా కాలం నుంచి అసమానతల తగ్గింపు, గుత్తాధిపత్యంపై నియంత్రణ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ లక్ష్యాలను ఎంతవరకు సాధించామో చూద్దాం.

మొదటి లక్ష్యం అసమానతల తగ్గింపును చూస్తే ప్రణాళిక కాలంలో అసమానతలు నిలకడగా పెరుగుతూనే ఉన్నట్లు తెలుస్తోంది. అనేక మంది రచయితల పరిశీలనల్లో జాతీయాదాయ పంపిణీలో అసమానతలు, తారతమ్యాలు తీవ్రస్థాయిలో ఉన్నట్లు వెల్లడైంది. జాతీయాదాయంలో (1960) 20 శాతం ఉన్నత వర్గానికి చెందిన 5 శాతము కుటుంబాలు పొందగా, అట్టడుగున ఉన్న 20 శాతం ప్రజలు కేవలం 8 శాతం మాత్రమే పొందగలిగారని 1964లో మహలనోబిస్ కమిటీ తెలియచేసింది. 1964-65లో మొత్తం వినియోగంలో అట్టడుగున ఉన్న 20 శాతం ప్రజలది 8.47% కాగా, శిఖరాన ఉన్న 20 శాతం ప్రజలది. 42.39% ఉన్నట్లు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ అప్లయిడ్ రీసెర్చి తెలిపింది. దండేకర్, రథ్‌లు విశ్లేషణలో 1967-68 నాటికి 5 శాతం పేదవారి తలసరి వినియోగం ఒక్క శాతం తగ్గిపోగా, ఉన్నత మధ్య తరగతి వర్గం, ధనిక వర్గం తలసరి వినియోగం 4.4 శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఈ విధంగా అభివృద్ధి పథకాలు పేదవారి కంటే ధనికుల వినియోగ ప్రమాణాలను పెంచాయి. దీన్ని బట్టి అసమానతల తగ్గింపు గురించి ఎంతగా మాట్లాడినప్పటికీ సమస్య మరింత క్లిష్టమైందని తెలుస్తున్నది.

పేదరికం తగ్గలేదు. జీవన ప్రమాణాలు పెరగలేదు. భారతదేశంలో పేదవారి సంఖ్యనూ, శాతాన్ని అంచనా వేయటం కోసం అనేక పరిశీలనలు జరుగుతున్నాయి. 1960-61 ధరలను బట్టి దండేకర్, రథ్ "దారిద్ర్యరేఖ"ను నిర్ణయించారు. (ఒక మనిషి మామూలుగా బ్రతికేందుకయ్యే కనీసవ్యయం) గ్రామీణ ప్రాంతాలలో రూ 271.70 పైసల్ని దారిద్ర్యరేఖగా వారు నిర్ణయించారు. దీన్ని ఆధారంగా చేసుకొని వారు 1960-61లో 40 శాతం గ్రామీణులు, 50 శాతం పట్టణ వాసులు దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నట్లు కనుగొన్నారు. 1967-68 నాటికి ఈ శాతంలో పెద్దగా మార్పేమీ కన్పించలేదు. 1977-78లో దారిద్ర్యరేఖకు దిగువన జీవించే వారి సంఖ్య 48.13 శాతం. దీన్నిబట్టి పేదరికాన్ని తగ్గించటానికి చేసిన ప్రయత్నాలన్నీ నిష్ఫలమయినట్లు తెలుస్తోంది. కాని 1984-85 సంవత్సరాంతానికి ఈ పేదరిక జనాభా 37 శాతానికి తగ్గింది.

BRAOU

### మీ అవగాహనను పరీక్షించుకొండి- 3

7. సాంఘీక న్యాయం అంటే ఏమిటి?
8. 'దారిద్ర్యరేఖ' అంటే ఏమిటి?
9. ఆదాయ సంపదల అసమానతల తగ్గింపులో ప్రణాళికలు ఎంతవరకు సఫలీకృతమయ్యాయి?

## 11.6 ప్రణాళికలు - ఉపాధికల్పన

పంచవర్ష ప్రణాళికల్లో తరచూ వినవస్తూ వచ్చిన మరొక నినాదం నిరుద్యోగ నిర్మూలన. మొదటి ప్రణాళిక తప్ప మిగతా అన్ని ప్రణాళికలు 'ఉపాధి కల్పనావకాశాలను సృష్టించటం'' తమ ముఖ్య లక్ష్యంగా వ్యక్తం చేశాయి.

**పట్టిక — 6: ప్రణాళికలు — నిరుద్యోగస్థితి (మిలియన్లలో)**

| | 1వ ప్రణాళిక | 2వ ప్రణాళిక | 3వ ప్రణాళిక | వార్షిక ప్రణాళిక | 4వ ప్రణాళిక | 5వ ప్రణాళిక | 6వ ప్రణాళిక |
|---|---|---|---|---|---|---|---|
| ప్రతి ప్రణాళికాంతంలో నిరుద్యోగం | 5.3 | 7.1 | 9.6 | 23.0 | 39.0 | 44.0 | 47.2 |

నిరుద్యోగ సమస్య అమితంగా పెరగటానికి ప్రణాళికా పద్ధతులలోని రెండు లోపాలు కారణం. మొదటి కారణం జనాభా పెరుగుదలను తక్కువగా అంచనా వేయటం, దీనివల్ల పని కావలిసిన వారి సంఖ్య అంచనాలను మించి పెరిగి పోయింది: రెండవదీ, అతి ముఖ్యమైనదీ పరిశ్రమల్లో యాంత్రికీకరణ పెరిగిపోవటం. దీనివల్ల వస్తువుల తయారీలో మానవ శ్రమకన్నా యంత్రాల పాత్ర ఎక్కువ అయ్యింది. ఇంతకు ముందే చెప్పినట్లుగా, ప్రణాళికలు వినియోగ వస్తువుల తయారీ రంగానికి తమ అభివృద్ధి వ్యూహంలో తగినంత స్థానం ఇవ్వలేదు. ఏ ఉత్పాదనా పద్ధతులను అనుసరించాలో పేర్కొనలేదు. గ్రామీణ ప్రాంతాల్లో శ్రామికశక్తిని ప్రధానంగా ఉపయోగించి తయారు చేసే వస్తువులు, పట్టణాల్లో పెట్టుబడీ, యంత్రాలూ ప్రధానంగా ఉపయోగించి తయారు చేసే వస్తువులతో అసమానమైన పోటీలో పడ్డాయి. ప్రణాళికా కాలంలో వివిధ సమయాలలో అసంబద్ధంగా చేపడుతూ వచ్చిన కార్యక్రమాలు ఈ సమస్యను పరిష్కరించలేక పోయాయి. అభివృద్ధి వ్యూహాన్ని మొదటే సరిగ్గా నిర్ణయించకపోవటమే దీనికి కారణం.

## 11.7 ప్రణాళికలు - ధరల స్థాయి

ఆర్థికాభివృద్ధి ఉత్పత్తి వ్యవస్థలో మార్పులకు దారి తీస్తుంది. కాబట్టి పెట్టుబడి, ఉత్పత్తుల విస్తృతులలో ఎగుడుదిగుడులు ఏర్పడతాయి. ఫలితంగా సాధారణ ధరల సూచిలో హెచ్చు తగ్గులు వస్తాయి. వివిధ రంగాల మీద పెట్టుబడి ప్రభావాన్ని అంచనా వేయగలగటం ప్రణాళికలకున్న ముఖ్య లక్షణం. డిమాండ్ పెరుగుదలను ప్రణాళిక రచనలోనే అ[illegible] కట్టవచ్చు. దీన్ని బట్టి డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా ఉండేటట్లు చూడవచ్చు. ఇంతకు ము[illegible] చర్చించిన సమతూక కేటాయింపు విస్తృతికి ఆధారం ఇదే. అభివృద్ధి కార్యక్రమాల ఉత్పత్తి ప్రమాణాలు పెరగటానికి దీర్ఘకాలం కావాలి. కాబట్టి వాటి స్వల్పకాల ఉత్పత్తి డిమాండ్ వైపు వుంటుంది. ఇక్కడ డిమాండ్ అంటే వినియోగావసరాల కోసం కార్మికుల నుంచి ముడి సరుకులకోసం పరిశ్రమల నుంచి డిమాండ్ అని అర్థం. శ్రమశక్తిని ఎక్కువగా వినియోగించుకోవటం, ఉత్పత్తి తొందరగా సాధించడం ద్వారా వినియోగ వస్తువుల సరఫరా జరగాలి. అదే విధంగా వినియోగ వస్తువుల సరఫరాకు సంబంధించిన రంగాలలో కలిగే ప్రభావాలు పెట్టుబడి దిగుబడుల పట్టికల్లో ఏర్పడే కొరతలనూ, అడ్డంకులనూ గుర్తించటంలో ఉపయోగపడతాయి. సరైన పెట్టుబడి కేటాయింపు పారిశ్రామికోత్పత్తి తగ్గకుండా చేస్తుంది. కాబట్టి అన్ని సంబంధిత పరిశ్రమలలో సమానమైన అభివృద్ధి అవసరం.

భారత ఆర్థిక వ్యవస్థలో వర్ష ఋతువు సృష్టించే హెచ్చు తగ్గులవల్ల కార్మికుల అవసరాల ఉత్పత్తిలో జరిగే హెచ్చు తగ్గులు, ఎరువులు, మొదలైన వాటి కొరత, వ్యవసాయరంగంలో సమన్వయలోపం యుద్ధాల వల్ల ప్రకృతి వైపరీత్యాల వల్ల, ఏర్పడే పరిస్థితులు ద్రవ్యోల్బణాన్ని పెంచుతాయి.

పట్టిక — 7 : ప్రణాళికా కాలంలో ద్రవ్యోల్బణం

| | 1వ ప్రణాళిక | 2వ ప్రణాళిక | 3వ ప్రణాళిక | వార్షిక ప్రణాళిక | 4వ ప్రణాళిక | 5వ ప్రణాళిక |
|---|---|---|---|---|---|---|
| సాధారణ ధరల స్థాయిలో పెరుగుదల శాతం | -13% | 30% | 32% | 27% | 60% | 20.5% |

మొదటి ప్రణాళికాకాలంలో మాత్రం ధరల సూచిలో 13 శాతం తగ్గుదల వుంది. మిగతా ప్రణాళికల కాలంలో ద్రవ్యోల్బణ పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి. దీన్నిబట్టి ద్రవ్యోల్బణానికి తావులేని అభివృద్ధిని ప్రణాళికలు సాధించలేదని స్పష్టమవుతోంది.

ధరల పెరుగుదల వల్ల ఉత్పత్తి మీద రెండు, మూడు ప్రభావాలు పడుతాయి. ధరలు పెరిగిన కొద్దీ కేటాయించిన పెట్టుబడి విలువ తగ్గిపోతుంది. ఈ విధంగా ద్రవ్యోల్బణం ప్రణాళికల కేటాయింపుల సైజును తగ్గిస్తుంది. ఫలితంగా నిజమైన పెట్టుబడి రేటు తగ్గిపోతుంది. అంతిమంగా అభివృద్ధి రేటు కూడా తగ్గిపోతుంది. 2వ ప్రణాళిక డిమాండ్‌కు సరిపడినంత ఉత్పత్తి జరగక ధరలు ఇంకా పెరుగుతాయి.

పంపిణీ వైపు చూస్తే ద్రవ్యోల్బణ పరిస్థితులవల్ల వ్యాపారస్తులు, పారిశ్రామిక వేత్తలు, అధికాదాయ వర్గాల వారు పెరుగుతున్న లాభాలతో అధిక ధరలను తట్టుకోగలిగినా పేద, అల్పాదాయ వర్గాలవారి పరిస్థితి దుర్భరంగా ఉంటుంది. ఆదాయం, వినియోగాలలో తారతమ్యాలు మరింత పెరిగాయి.

## 11.8 ప్రణాళికలు - స్వయం పోషకత్వం

ప్రణాళికలను అమలు పరుస్తున్నప్పుడు యంత్రాలు, సాంకేతిక నైపుణ్యం, ముడిసరుకులకు విదేశాలపై ఎక్కువగా ఆధారపడవలసి వచ్చింది. భారీ పరిశ్రమల స్థాపన ఫలితంగా దేశంలో పెట్టుబడులు చోటు చేసుకోవడం మొదలు పెట్టాయి. విదేశాలపై ఆధారపడవలసి రావడంతో, ఎగుమతి దిగుమతుల చెల్లింపులో సమతూకాన్ని సాధించడంలో ఇబ్బందులు ఏర్పడుతూ వచ్చాయి. దీనితో స్వయం-పోషకత్వం సాధించవలసిన అవసరాన్నీ, ఎగుమతులు పెంచాల్సిన అవసరాన్నీ గుర్తించారు.

భారీ యంత్రాలు, ఆహార ధాన్యాలకు సంబంధించినంత వరకూ విదేశీ రంగంపై ఆధారపడటం కొంత వరకు సమర్ధనీయం కాదు. కాని దత్ కమిటీ చెప్పినట్లు అనవసరములేని వినిమయ వస్తువుల ఉత్పత్తి రంగాలలో విదేశీ ఒప్పందాల కోసం, బహుళజాతి సంస్థలకు ఎక్కువగా లైసెన్సులు ఇవ్వటం అనవసరం. రిఫ్రిజిరేటర్లు, రేడియోలు, టెలివిజన్లు, కెమేరాలు, సబ్బులు, సౌందర్య సాధనాలు మొదలైన వాటి తయారీని ప్రభుత్వం విచ్చలవిడిగా అనుమతించింది. అంతగా అవసరంలేని వినిమయ వస్తువుల ఉత్పత్తికి అనుమతించడం ప్రణాళికలో పేర్కొన్న దానికి విరుద్ధంగా ప్రవర్తించటమే.

ప్రణాళికల్లో అన్నిటిలాగే ఎగుమతి దిగుమతి చెల్లింపుల శేషంలో (బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్) ఎగుడు దిగుడులు ద్యోతకమతవుతూ వచ్చాయి. 5వ ప్రణాళికా కాలంలో ఇతర దేశాల్లో నివసిస్తున్న భారతీయులు చేస్తూవచ్చిన చెల్లింపుల వల్ల మన విదేశీ మారక నిల్వల్లో నిధులు ఎక్కువగా జమఅవుతూ వచ్చాయి. ఎగుడు దిగుడులను కింది పట్టికలో చూడవచ్చు.

పట్టిక – 8 : ప్రణాళికల్లో బాలన్స్ ఆఫ్ పేమెంట్స్ (రూ. కోట్లలో.)

| | 1వ ప్రణాళిక | 2వ ప్రణాళిక | 3వ ప్రణాళిక | వార్షిక ప్రణాళిక | 4వ ప్రణాళిక | 5వ ప్రణాళిక | 6వ ప్రణాళిక |
|---|---|---|---|---|---|---|---|
| బాలన్స్ ఆఫ్ పేమెంట్స్ | 42 | -1724.6 | -2384 | -2075.5 | -2521 | +1145.5 | -9063 |

## మీ అవగాహనను పరీక్షించుకొండి - 4

10. నిరుద్యోగిత పెరగడానికి కారణాలేమిటి?
11. భారతదేశంలో ధరలస్థాయిపై మీ అభిప్రాయం ఏమిటి?
12. చెల్లింపుల శేషంలో భారతదేశ పరిస్థితి ఏ విధంగా ఉంది?

## 11.9 సారాంశం/ముగింపు

భారతీయ ప్రణాళికా రచన, ఆచరణల్లో తప్పొప్పులు రెండూ సంభవించాయి. మనకు కావాల్సిన సరుకులను ఉత్పత్తి చేసుకోవటంలో, దానికవసరమైన సాంకేతిక విజ్ఞానాన్ని ఎంపిక చేసుకోవటంలో సుదీర్ఘ భవిష్యత్ లక్ష్యాలతో నిస్పష్టమైన వ్యూహాన్ని రచించుకోలేక పోవటం జరిగింది. లక్ష్యాల నిర్ణయం, అసలు విషయంలో ఏది ముందు, ఏది వెనుక అనేది లేదు. రంగాల ప్రాధాన్యతల నిర్ణయంలో అనిశ్చితత్వం, మార్పులు చేస్తూ పోవటంతో ఆర్థిక విధానంలో ఎగుడు దిగుడులు ఏర్పడ్డాయి.

నిర్దేశించిన ప్రాధాన్యతలకు వ్యతిరేకమైన దిశలో ప్రణాళికా లక్ష్యాలు అమలు జరగడం వల్ల నిర్ణయించిన లక్ష్యాలు వాస్తవంలో కేవలం నినాదాలుగా మిగిలిపోయాయి. పెరిగిపోతున్న పేదరికం, తక్కువ స్థాయి జీవన పరిస్థితులు, ప్రాథమికావసరాలైన వైద్య, ఆరోగ్య సౌకర్యాలు, మంచినీటి సౌకర్యం, విద్యావకాశాల కొరత, పెరిగిపోతున్న నిరుద్యోగం చూస్తే 30 సంవత్సరాల్లో ప్రణాళికా విధానం ఆర్థిక వ్యవస్థాగత మార్పులను తేలేక పోయిందనేది స్పష్టం అయ్యింది.

అభివృద్ధి చెంది, ధనవంతమై, ఆధునాతనమైన భారతదేశం ఒక పక్క పెరుగుతున్న పేదరికంతో, నిర్మాణయుతమైన పద్ధతి లేకుండా, కాలం చెల్లిన, మార్పులేని విధానాలతో నడుస్తున్న భారతదేశం మరోపక్క మన వ్యవస్థలోని అంతరాలను ఎత్తి చూపుతున్నాయి. మన ప్రణాళికలవల్ల అటు అభివృద్ధి, ఇటు సాంఘిక న్యాయం ఏదీ సాధించలేకపోయాం. దేనినైతే ప్రణాళికా వేత్తలు తప్పించాలని ప్రయత్నించారో అదే వాస్తవమై నిలిచినది.

పాఠ్యరచయిత్రి: కుమారి ప్రభావంత్

BRAOU

## 11.10 సంప్రదింపు గ్రంథాలు


1. Dutt and Sundaram : Indian Economy
2. Misra and Puri : Indian Economy


## 11.11 నమూనా పరీక్షా ప్రశ్నలు

I క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయండి.

1. భారతదేశ వ్యవసాభివృద్ధిలో ప్రణాళికల పాత్రలమ వివరించండి?
2. ప్రణాళికా కాలంలో పారిశ్రామిక ఉత్పత్తి నిర్మాణాన్ని పరిశీలించండి.
3. "సాంఘిక న్యాయంతో కూడిన అభివృద్ధి" అనే లక్ష్యాన్ని సాధించటంలో పంచవర్ష ప్రణాళికలు ఎంతవరకు విజయం సాధించాయి.
4. భారతదేశంలో పేదరికం, నిరుద్యోగ [illegible]ంలో పంచవర్ష ప్రణాళికలు సఫలీకృతమయ్యాయా? కాకపోతే ఎందుకు?

II కింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి 15 పంక్తులలో జవాబులు రాయండి.

1. ప్రణాళికాకాలాల్లో జాతీయాదాయ పెరుగుదల ధోరణిని వివరించండి.
2. స్వయం-పోషకత్వాన్ని సాధించడంలో భారత ప్రణాళికలు ఎంతవరకు సఫలీకృతమయ్యాయి?
3. దారిద్ర్యరేఖ, స్వయం - పోషకత్వం అనే భావనలను వివరించండి.

BRAOU

BRAOU

# ఖండం — IV

## వ్యవసాయరంగం

ఈ ఖండం ప్రధానంగా భారతదేశంలో వ్యవసాయ రంగ స్వరూప స్వభావాన్ని వివరించడానికి ప్రయత్నిస్తుంది. వ్యవసాయ ఉత్పాదకతను పెంచే కారకాలను, ముఖ్యంగా వ్యవస్థాపూర్వక కారకాలను, హరిత విప్లవాన్ని అంటే సాంకేతిక కారకాలను చర్చిస్తుంది. అంతేకాకుండా వ్యవసాయ ధరలు, విక్రయం కాగల మిగులు, విక్రయం చేయబడిన మిగులు, వ్యవసాయ విత్తం మొదలైన అంశాలను కూడా విశదీకరిస్తుంది.

ఈ ఖండంలోని ఐదు (5) భాగాలు:

భాగం — 12: భారతదేశ వ్యవసాయ స్వరూపం

భాగం — 13: వ్యవసాయ ఉత్పాదకత

భాగం — 14: హరిత విప్లవం

భాగం — 15: వ్యవసాయ ధరలు

భాగం — 16: వ్యవసాయ విత్తం

BRAOU

BRAOU

# భాగం — 12: భారతదేశ వ్యవసాయరంగ స్వరూపం

విషయక్రమం

12.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
12.1 పరిచయం: భారతదేశ ఆర్థికవ్యవస్థలో వ్యవసాయ ప్రాముఖ్యత
12.2 బ్రిటిష్ వారి పరిపాలనలో వ్యవసాయాభివృద్ధి
12.3 పంచవర్ష ప్రణాళికలలో వ్యవసాయాభివృద్ధి
12.4 వ్యవసాయరంగ సమస్యలు
12.5 నివారణోపాయాలు
12.6 సారాంశం/ముగింపు
12.7 సంప్రదింపు గ్రంథాలు
12.8 నమూనా పరీక్షా ప్రశ్నలు

## 12.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

స్వాతంత్ర్యానికి పూర్వం, ఆ తర్వాత భారతదేశ వ్యవసాయ రంగంలో వచ్చిన పరిణామాలను, ఎదుర్కొంటున్న సమస్యలను విశ్లేషించడమే ఈ పాఠం లక్ష్యం.

ఈ పాఠాన్ని చదివిన తర్వాత మీరు

★ మన ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగానికి ఉన్న ప్రాధాన్యతను విశ్లేషించగలరు.

★ స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యానంతరం వ్యవసాయ రంగంలో జరిగిన అభివృద్ధి సమీక్షించగలరు.

★ వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించగలరు.

★ వ్యవసాయరంగ సమస్యలను ఏ విధంగా నివారించవచ్చునో తెలుపగలరు.

BRAOU

## 12.1 పరిచయం: భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ ప్రాముఖ్యత

భారతీయ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికి ప్రముఖ స్థానం వుంది. మన దేశంలో ఉన్నట్టువంటి వర్ధమాన ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ ప్రాముఖ్యాన్ని కింద వివరించిన వాస్తవాలు తెలియచెస్తాయి. (1) భారతదేశ జనాభాలో సుమారు 70 శాతం ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడుతున్నారు. స్వాతంత్ర్యం లభించిన తరువాత పారిశ్రామిక రంగం విస్తృతమైనప్పటికీ శ్రామికులలో అత్యధిక శాతం ఇప్పటికీ వ్యవసాయం మీదే ఆధారపడుతున్నారు. (2) వ్యవసాయిక ముడిసరుకుల మీద ఆధారపడ్డ పరిశ్రమలకు వ్యవసాయరంగం పత్తి, జనుము, చెరకు మొదలైన ముడి పదార్థాలను సప్లయి చేస్తుంది. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందనిదే పారిశ్రామిక రంగాన్ని విస్తృత పరచలేమన్న విషయాన్ని పూర్తిగా గుర్తించారు. వ్యవసాయరంగం అభివృద్ధి వల్ల గ్రామీణ ప్రజల ఆదాయాలు వృద్ధి చెంది పరిశ్రమల్లో ఉత్పత్తి అయ్యే వస్తువులకు తగిన సార్థక డిమాండ్ ఉంటుంది. (3) ఇప్పటికి కూడా వ్యవసాయిక వస్తువులే భారతీయ ఎగుమతులలో ఎక్కువ భాగాన్ని సూచిస్తున్నాయి. (4) నికర జాతీయోత్పత్తిలో గణనీయమైన శాతం వ్యవసాయ రంగం నుంచే లభిస్తున్నది. ఉదాహరణకు — 1977-78 సంవత్సరంలో నికర జాతీయాదాయానికి (NNP) సుమారు 44%

వ్యవసాయరంగమే అందించింది. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే భారతదేశంలో వ్యవసాయరంగం వెనుకబడి ఉన్నది. యు.కె (U.K), యు.ఎస్.ఎ (U.S.A) మొదలైన దేశాలలో జనాభాలో అత్యల్ప శాతం వ్యవసాయం మీద ఆధారపడతారు. కాని భారతదేశంలో వ్యవసాయం అత్యధిక శాతం ప్రజలకు జీవనోపాధి కల్పిస్తున్నది.

## 12.2 బ్రిటిష్ వారి పరిపాలనలో వ్యవసాయాభివృద్ధి

ప్రస్తుతమున్న వ్యవసాయరంగాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి అంటే స్వాతంత్ర్యానికి ముందూ, స్వాతంత్ర్యానంతరమూ జరిగిన వ్యవసాయాభివృద్ధిని సమీక్షించాలి. బ్రిటిష్ వారి కాలంలో వ్యవసాయాన్ని అభివృద్ధి పరచటానికి ఎటువంటి శ్రద్ధ చూపలేదు. భూమిని వాస్తవంగా సాగుచేసే వ్యక్తికీ, అసలైన భూ యజమానికీ (అంటే ప్రభుత్వం) మధ్య ప్రత్యక్ష సంబంధముండేది కాదు.

జమిందారులు, జాగీరుదారులు మొదలైన చాలామంది మధ్యవర్తులుగా ఉండేవారు. వారు సాగుచేస్తున్నా కౌలుదార్ల నుండి ఎక్కువ మొత్తాలలో భూమిశిస్తును వసూలు చేస్తుండేవారు. వీరు కూడా వ్యవసాయాభివృద్ధికి ఎటువంటి శ్రద్ధ చూపలేదు. వ్యవసాయవృద్ధికి ఉపయోగించే వనరులలో అతి ముఖ్యమైనది 'నీరు'. బ్రిటిష్ ప్రభుత్వంగాని, జమీందార్లుగాని నీటి పారుదల సౌకర్యాలను మెరుగుపరచి వ్యవసాయదార్లకు నమ్మకంగా నీటిని సప్లయి చేయలేక పోయారు. నీటి పారుదల విషయంలో వారి హాయాంలో ఏమైన చర్యలు తీసుకున్నారంటే అవి కొన్ని నదుల మీద కట్టించిన చిన్న చిన్న ప్రాజెక్టులు మాత్రమే. అటువంటి ప్రాజెక్టులు కట్టించడంలో ఉద్దేశం ప్రభుత్వానికి ఎక్కువగా రాబడి వచ్చేట్లు చేయడమేగాని వ్యవసాయదార్ల నీటి అవసరాలను తీర్చడానికి కాదు.

బ్రిటిష్ ప్రభుత్వం అవలబించిన వైఖరి వల్లా, రెండవ ప్రపంచయుద్ధం వల్లా దేశంలో తీవ్ర ఆహార కొరత ఏర్పడింది. కాబట్టి యుద్ధ సమయంలోనూ, స్వాతంత్ర్యానంతరము తొలి సంవత్సరాలలోనూ మన దేశం అధిక పరిమాణంలో ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవలసి వచ్చింది.

స్వాతంత్ర్యం సిద్ధించిన నాటికి వ్యవసాయ రంగంలో పరిస్థితులు దయనీయంగా ఉండేవి. మొట్టమొదటి విషయంలో దేశము తీవ్రమైన ఆహార సంక్షోభానికి గురైంది. దేశ విభజన కారణంగా పాకిస్తాన్‌కు పెద్ద ఎత్తున డెల్టా ప్రాంతాలను కోల్పోవలసి వచ్చింది. భారతీయ వ్యవసాయదార్లు నిరక్షరాసులైనందువల్ల వారిని గ్రామీణ ఋణదాతలూ, పెద్ద పెద్ద భూస్వాములూ, జమీందార్లూ దోచుకునే వారు. అప్పటి వ్యవస్థాపరమైన సాంఘిక, ఆర్థిక పరిస్థితులు వ్యవసాయాభివృద్ధికి నిరోధకాలుగా ఉండేవి. వ్యవస్థాపరమైన కారకాలలో అతి ముఖ్యమైనది లోపభూయిష్టమైన భూస్వామ్య విధానం. సాంఘిక, ఆర్థిక పరమైన కారకాలలో వ్యవసాయదార్ల సాంఘిక దుస్థితి, వారి ఆర్థిక దుర్భరత మొదలైన వాటిని చెప్పుకోవచ్చు. ఈ కారణాల వల్ల వారు నూతన ఉత్పత్తి పద్ధతులను ప్రవేశపెట్టలేక పోయారు. వ్యవస్థాపరమైన, సాంకేతిక పరమైన అడ్డంకులను గురించి వివరంగా ఇంకొక పాఠంలో మనం నేర్చుకుందాం.

వ్యవస్థాపరమైన, సాంకేతిక పరమైన కా కాలే కాకుండా వ్యవసాయాభివృద్ధి కుంటుపడటానికి మరికొన్ని ఇతర కారకాలు కూడా ఉన్నాయి. అవి:

1. పురాతన పద్ధతులననుసరించి వ్యవసాయం చేయడం.
2. తగినంతనీటి పారుదల సౌకర్యాలు లభ్యం కాకపోవడం
3. వ్యవసాయేతర సేవలు తగినంతగా లేకపోవడం
   ఉదాహరణకు సంస్థాపరమైన పరపతి మొదలైనవి.
4. కమతాల పరిమాణం అతి చిన్నదిగా ఉండి తరచూ కమతాలు చిన్న కమతాలుగా మారటం.

వ్యవసాయోత్పత్తిని పెంచాలంటే ఈ నిరోధకాలను తొందరగా నిర్మూలించవలసిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది..

## 12.3 పంచవర్ష ప్రణాళికలలో వ్యవసాయాభివృద్ధి

ప్రథమ పంచవర్ష ప్రణాళిక వ్యవసాయరంగానికి ప్రాధాన్యత ఇచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధం వల్లా, దేశ విభజన వల్లా ఏర్పడిన ఒడుదుడుకులను సరిదిద్దటమే ఈ ప్రణాళిక లక్ష్యం. ఆనాటికి దేశంలో ఆహార కొరత తీవ్రంగా ఉన్నందువల్ల ప్రణాళికలో సహజంగానే వ్యవసాయం, నీటి పారుదలకు అత్యధిక ప్రాముఖ్యతను ఇచ్చారు. మొదటి పంచవర్ష ప్రణాళికలలో వ్యవసాయ ఉత్పత్తులు 14.7 శాతానికి పెరిగాయి. అందులో ఆహార ధాన్యాల పెరుగుదల సుమారు 20 శాతం ఉన్నది. వ్యవస్థాపరమైన అడ్డంకులను తొలగించటానికి భూ సంస్కరణలు సహకార పరపతి మార్కెటింగ్‌ల మీద ఎక్కువ శ్రద్ధ వహించారు. 1952 అక్టోబర్‌లో సమాజ అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు.

రెండవ పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయానికి ... వ ప్రాధాన్యం ఇచ్చారు. రెండవ ప్రణాళికా కాలంలో పారిశ్రామిక పెరుగుదలతో పాటు వ్యవసాయరంగం పెరుగుదల కూడా ఉంటుందని భావించారు. కాని ఆ విధంగా జరగలేదని వ్యవసాయ ఉత్పత్తి క్షీణించిందని అనతి కాలంలోనే గ్రహించ గలిగారు. వ్యవసాయ ఉత్పత్తిని పెంచడానికి జిల్లా స్థాయిలో సాంద్ర జిల్లా వ్యవసాయ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు.

మూడవ పంచవర్ష ప్రణాళిక లక్ష్యం ఆహార ధాన్యాలలో స్వయం సమృద్ధిని సాధించడం. వ్యవసాయదార్లకు అధునాతన పద్ధతులను తెలియజేయడానికి ఎన్నో చర్యలను తీసుకున్నారు. అధికోత్పత్తికి రైతులను ప్రోత్సహించడానికి గిట్టుబాటు ధరలను ఇవ్వవలసిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. కాబట్టే 1965 జనవరిలో ''వ్యవసాయ ధరల కమీషన్ (A.P.C)ను నియమించారు. వ్యవసాయ వస్తువులకు చెల్లించవలసిన ధరల విషయంలో ఈ కమీషన్ ప్రభుత్వానికి సలహాలను ఇస్తుంది. ఆహార ధాన్యాలను సేకరించడానికీ, పంపిణీ చేయడానికి భారతీయ ఆహార సంస్థ (F C.I) ను కూడా ఏర్పరచారు. ఇన్ని చర్యలు తీసుకున్నప్పటికీ మూడవ పంచవర్ష ప్రణాళికా ఫలితాలు సంతృప్తికరంగా లేవు. దేశంలో 1965-66, 1966-67 సంవత్సరాలలో ఏర్పడిన నీటి కొరత, పొరుగు దేశాలైన చైనా, పాకిస్తాన్‌లతో యుద్ధాలూ ఈ ప్రణాళికా కాలంలో వ్యవసాయోత్పత్తులను బాగా దెబ్బ తీసాయి. వ్యవసాయానికి మొదట్లో కేటాయించిన నిధులను యుద్ధ సామాగ్రి ఉత్పత్తికి తరలించవలసి వచ్చింది. ప్రభుత్వ పంపిణీ విధానాన్ని నిర్వహించటానికి అధిక పరిమాణంలో ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకున్నారు. మొత్తం మీద వ్యవసాయేతర రంగాలలో కూడా ఈ ప్రణాళికా కాలంలో సాధించిన ఉత్పత్తులు సంతృప్తికరంగా లేవు. ఫలితంగా నాల్గవ పంచవర్ష ప్రణాళికను అనుకున్నట్లుగ చేపట్ట లేకపోయాం.

మూడు సంవత్సరాల పాటు (1966-67 నుండి 1968-69 వరకు) వార్షిక ప్రణాళికలను చేపట్టవలసి వచ్చింది. ఈ కాలంలో వ్యవసాయాభివృద్ధి కోసం నూతన వ్యూహాన్ని రూపొందించారు. ఉత్పత్తి ప్రక్రియలో కొత్త సాంకేతిక విధానాన్ని అనుసరించడం, అధికోత్పత్తి నిచ్చే మేలురకం విత్తనాలను వాడటం, రసాయనిక ఎరువులనూ, నీటి పారుదల సౌకర్యాలనూ ఉపయోగించడం ఈ నూతన వ్యూహంలో ముఖ్యమైనవి. ఈ పద్ధతులననుసరించినందువల్ల ఈ కాలంలో వ్యవసాయ ఉత్పత్తులు బాగా పెరిగాయి. వ్యవసాయరంగంలో ఏర్పడిన ఈ కొత్త పోకడలను 'హరిత విప్లవం' అనికూడా అంటారు. అయితే ధాన్యాన్ని ఉత్పత్తిచేసే ఆంధ్రప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్ వంటి కొన్ని రాష్ట్రాలలో వ్యవసాయోత్పత్తులు అంతగా పెరగలేదు ఉత్తరాది రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాలలో గోధుమ ఉత్పత్తి బాగా పెరగటానికి ఈ నూతన వ్యూహం ఎక్కువగా తోడ్పడింది.

మూడు వార్షిక ప్రణాళికల అనంతరం నాల్గవ పంచవర్ష ప్రణాళికను 1969-70లో ప్రవేశపెట్టారు. వ్యవసాయరంగంలో అమలు అవుతున్న ఈ నూతన వ్యూహాన్ని విస్తృత పరచడానికి ఈ ప్రణాళిక ఎక్కువ శ్రద్ధ

చూపింది. భూసంస్కరణలు, వ్యవసాయరంగంలో యాంత్రీకరణ, సంస్థాపరమైన పరపతికి సంబంధించి ఎక్కువ చర్యలు తీసుకున్నారు. సన్నకారు రైతుల అభివృద్ధి ఏజన్సీలు వ్యవసాయ కూలీల స్థితిగతులను మెరుగు పరిచే పథకాలు, నీటి ఎద్దడి ప్రాంతాలను అభివృద్ధి చేసే కార్యక్రమాలు మొదలైనవి ప్రత్యేకంగా చేపట్టిన పథకాలు.

వ్యవసాయరంగాన్ని అభివృద్ధి పరచటానికి ఐదు, ఆరు, ఏడూ ప్రణాళికా కాలాల్లో కూడా ప్రభుత్వం తగు చర్యలు తీసుకొంది. మొదటి పంచవర్ష ప్రణాళిక నుండి ఇంత వరకు వ్యవసాయ రంగాన్ని పరిశీలిస్తే వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయని చెప్పటం అతిశయోక్తికాదు. వ్యవసాయ ఉత్పత్తిని తెలియజేసే సూచీ సంఖ్య 1950-51లో 58.5 వుండగా 1978-79లో ఈ సంఖ్య 137.9కి పెరిగింది. ఆహార ధాన్యాల ఉత్పత్తి సూచీసంఖ్య 62.8 నుండి 134.8కి పెరిగింది. అంతేకాకుండా ముఖ్యంగా గమనించవలసినది ఏమంటే 1950-51లో ఆహారధాన్యాల ఉత్పత్తి 51 మి: టన్నుల కాగా 1981-82లో 133 మి: టన్నులకు పెరిగింది. 1983-84లో ఆహార ధాన్యాల ఉత్పత్తి మునుపు ఎన్నడూ లేనంతగా 152 మి: టన్నుల స్థాయికి చేరుకొంది. అయితే ప్రణాళికా కాలంలో పెరుగుదల తీరుతెన్నులను గమనిస్తే సాఫీగా, ఎప్పుడూ ఉత్పత్తులు పెరగలేదని మనకు తెలుస్తుంది. ఉత్పత్తి ఒడుదుడుకులకు లోనైంది. ఉదాహరణకు— మొదటి పంచవర్ష ప్రణాళికలో ఆహార ధాన్యాల ఉత్పత్తి లక్ష్యం 63 మి.ట. ఈ లక్ష్యం ప్రణాళిక చివరి సంవత్సరానికి పొందాలని ప్రణాళికా నిపుణుల భావన. అంటే (1955 56లో) కాని వాస్తవానికి ప్రణాళికా చివరి సంవత్సరంలో 67 మి:ట. ఉత్పత్తి జరిగింది. పోతే ఈ లక్ష్యానికి మించి అంతకు ముందే 1953-54లో 70 మి.ట. సాధించడం జరిగింది. అంటే ప్రణాళిక చివరి సంవత్సరం గరిష్ట ఉత్పత్తి స్థాయిని తప్పనిసరిగా సూచించవలసిన పనిలేదు. మిగిలిన పంచవర్ష ప్రణాళికలలో కూడా ఈ విధంగానే ఉంటుంది. ఉత్పత్తి అనుకున్నంత లేకపోవడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడమే.

నిజం చెప్పాలంటే ఉత్పత్తి దోరణులను పరిశీలించేటప్పుడు వాతావరణం వల్ల ఏర్పడిన ప్రభావాన్ని మినహాయించి విశ్లేషణ చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు ఉత్పత్తిని ప్రభావితం చేసే కొన్ని అంశాలను పరిశీలిద్దాం.

వ్యవసాయ ఉత్పత్తిని ప్రభావితం చేసే ముఖ్య అంశాలలో సాగు చేయబడిన విస్తీర్ణం, పంటల తీరు, పంటల సాంద్రత, నీటి పారుదల, ఆధునిక ఉత్పత్తి పద్ధతులు, వాతావరణం ముఖ్యమైనవి. 1950-51లో (ప్రణాళికల ముందు) ఆహార ధాన్యాల సాగు 97 మి: హెక్టార్లు ఉండగా 1955-56లో 111 మి: హెక్టార్లకు పెరిగింది. 1981-82లో విస్తీర్ణం 129 మి: హెక్టార్లకు పెరిగింది.

పోతే, పంటల సాంద్రతను తెలియజేసే సూచీసంఖ్య 1978-79లో 123 ఉన్నది. ఈ సూచీసంఖ్యను లెక్కకట్టడానికి మొట్టమొదటి పంటల స్థూల విస్తీర్ణం, నికర సాగు విస్తీర్ణం తెలుసుకోవాలి. ఉదాహరణకు 1978-79లో పంటల స్థూల విస్తీర్ణం 1,75,177 వేల హెక్టార్లు కాగా నికర సాగు విస్తీర్ణం 1,42,938 వేల హెక్టార్లు. ఆ సంవత్సరం పంటల సాంద్రతను తెలియజేయు సూచీసంఖ్య ఈ సూత్రం ద్వారా లెక్కకట్టవచ్చు.

$$\text{సూచీసంఖ్య} = \frac{\text{పంటల స్థూల విస్తీర్ణం}}{\text{నికరసాగు విస్తీర్ణము}} \times 100$$

$$= \frac{1,75,177}{1,42,938} \times 100 = 123$$

BRAOU

1960–61 నుండి రెండు దశాబ్దాల పాటు వ్యవసాయరంగాభివృద్ధిని ఈ పట్టికలో చూద్దాం

| వరుస సంఖ్య | వర్ణన | 1960 61 | 1970 71 | 1980 81 | వార్షికకాంపౌండ్ వృద్ధిరేటు (1960 61 నుండి 1980 81) |
|---|---|---|---|---|---|
| 1. | విస్తీర్ణం (మిలియన్ హెక్టార్లలో) | 115.6 | 124.3 | 126.7 | 0.46 |
| 2. | ఉత్పత్తి (టన్నులలో) | 82.0 | 108.4 | 129.6 | 2.31 |
| 3. | దిగుబడి (Kg/హెక్టార్) | 709 | 872 | 1023 | 1.85 |
| 4. | రసాయనిక ఎరువుల వినియోగం (000 టన్నులు) | 556 | 2176 | 3678 | 9.91 |
| 5. | నీటి పారుదల గల విస్తీర్ణం | 27934 | 38550 | 48090 | 2.39 |

మూలం: ప్రాంతీయ ఆర్థికాభివృద్ధి, ప్రణాళికా సంఘము, 1983.

## మీ అవగాహనను పరీక్షించుకొండి — 1

1. రెండవ పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయరంగానికిచ్చిన ప్రాధాన్యాన్ని వివరించండి
2. 1980-81 సంవత్సరంలో వ్యవసాయోత్పత్తి ఎంత?

## 12.4 వ్యవసాయరంగ సమస్యలు

ప్రణాళికలలో వ్యవసాయోత్పత్తులు గణనీయంగా పెరిగినప్పటికీ కొన్నిరాష్ట్రాల్లో కొన్ని పంటలకు మాత్రమే ఈ అభివృద్ధి పరిమితమైంది. హరిత విప్లవం వల్ల సంక్రమించిన లాభాలు ఎక్కువగా గోధుమ ఉత్పత్తి చేసే రాష్ట్రాలు పొందాయి. 1950-51 నుండి 1964-65 మధ్యకాలంలో గోధుమ ఉత్పత్తి పెరుగుదల రేటు సాలీనా 4.68% కాగా వరి పెరుగుదల రేటు సాలీనా 4.73% ఉండేది. కాని ఆ తరువాత సంవత్సరాలలో (1967-68 నుండి 1981-82 మధ్యకాలంలో) గోధుమ పెరుగుదల రేటు 6.09% కాగా ధాన్యం రేటు 2.56% పడిపోయింది. దీనిని బట్టి మనకు తెలిసేదేమంటే గోధుమను ఉత్పత్తి చేసే రాష్ట్రాలు ఎక్కువగా వ్యవసాయాభివృద్ధి లాభాలను పొందగలిగాయి. ఫలితంగా ప్రాంతీయ అసమానతలకు దారితీసింది. కొన్ని ప్రాంతాల ప్రజల ఆదాయాలు క్షీణించాయి. సామాజిక శ్రేయస్సు దృష్ట్యా ఆదాయ అసమానతలు పెరగటం సమర్థనీయం కాదు.

ఈ సందర్భంగా ఇంకో విషయాన్ని కూడ చెప్పుకోవచ్చు. ఇటీవల ఉత్పత్తి, ధరల పెరుగుదల వల్ల పెద్ద పెద్ద భూస్వాములు మాత్రమే ఎక్కువగా ప్రయోజనం పొందారు. వ్యవసాయ రంగంలో ఉత్పత్తులు పెరిగినప్పటికీ వ్యవసాయకూలీల సన్నకారు రైతుల సమస్యలు యిప్పటికీ అపరిష్కృతంగానే మిగిలిపోయాయి. ప్రభుత్వం అందించిన సంస్థాపరమైన పరపతినీ, వ్యవసాయిక పరికరాలనూ రసాయనిక ఎరువులనూ పెద్ద భూస్వాములే ఎక్కువగా పొందగలిగారు. వ్యవసాయరంగంలో అభివృద్ధి వల్ల జనించిన మిగులును ఆ రంగాన్ని విస్తృత

పరచడానికి వీరు ఉపయోగించలేదు. పట్టణ ప్రాంతాలలో వ్యవసాయేతర రంగాలను విస్తృతపరచడానికి ఈ మిగులును ఉపయోగించారు. కొంతమంది మేధావుల దృష్టిలో వ్యవసాయానికీ, వ్యవసాయేతర రంగానికీ మధ్య వ్యాపార నిబంధనలు వ్యవసాయ రంగాన్ని నష్టపరచాయి. వ్యవసాయేతర రంగాలలో ముఖ్యంగా పారిశ్రామిక రంగానికి ఎక్కువ ప్రయోజనం కలిగించింది.

వ్యవసాయ రంగం ఇప్పటికీ కూడా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నది. ఫలితంగా వ్యవసాయ ఉత్పాదకత అల్పంగా ఉంటున్నది.

(a) లోపభూయిష్టమైన భూస్వామ్య విధానాలు ఇప్పటికి కూడా వ్యవసాయరంగ అభివృద్ధికి నిరోధకాలుగా ఉన్నాయి. అనేక రాష్ట్రాలలో కౌలు సంస్కరణలకు సంబంధించి చట్టాలను ప్రవేశపెట్టినప్పటికీ, వాటిని సంతృప్తికరముగా అమలుజేయలేకపోయారు. కాబట్టి "దున్నేవాడిదే భూమి" అనే లక్ష్యాన్ని ఇంతవరకూ సాధించలేదు.

(b) మనదేశంలో రైతులు పాతపద్ధతుల్లోనే వ్యవసాయం చేస్తున్నారు. ఇటీవల కొంతమంది నూతన పద్ధతుల ద్వారా వ్యవసాయం చేయడం ప్రారంభించినప్పటికీ, రైతులలో చాలామంది పురాతన పద్ధతులను విడనాడలేదు. కొత్త పద్ధతులవల్ల లాభం చేకూరుతుందని దాదాపు రైతులందరికీ తెలుసు. కాని (i) రైతులలో చాలామందికి ముఖ్యంగా సన్నకారు రైతులకి సరైన ఆర్థికస్తోమత లేకపోవడం వల్లా (ii) సాంఘిక దుస్థితి అంటే పేదరైతులకు సంఘంలో పలుకుబడి తక్కువ కావడం వల్లా కొత్త పద్ధతుల్ని చేపట్టలేక పోతున్నారు.

(c) వ్యవసాయ రంగాన్ని వేధిస్తున్న ముఖ్యమైన సమస్యలలో ఇంకొకటి నీటిపారుదలకు సంబంధించినది. వ్యవసాయానికి సరిపోయినంత నీటిపారుదల సౌకర్యాలు లేవు. అయితే ప్రణాళికా కాలంలో నీటిపారుదల సౌకర్యాలను గణనీయంగా అభివృద్ధి పరిచారు. కాని చాలా రాష్ట్రాలలో ఆ సౌకర్యాలను పూర్తిగా వినియోగించుకోలేదు. ఉదాహరణకు, 1978-79 లో సక్యమైన లేదా సంభవించదగిన నీటిపారుదల విస్తీర్ణం 113.3 మి. హెక్టార్లు ఉండగా, దానిని వినియోగించుకొనిన స్థూల విస్తీర్ణము 48.1 మి. హెక్టార్లు మాత్రమే ఉన్నది. అంటే నీటిపారుదల సౌకర్యాలలో సుమారు 42.5 శాతము మాత్రమే వినియోగమైందని స్పష్టమౌతున్నది. నీటిపారుదల వినియోగశాతం ఉత్తరాది రాష్ట్రాలలో అత్యధికంగా (73.7%) ఉన్నది. తూర్పు రాష్ట్రాలలో అత్యల్పంగా (27.34%) ఉన్నది. నీటిపారుదల సౌకర్యాలను వృద్ధిచేసినందు వల్ల రకరకాలైన పంటలను పండించి వ్యవసాయ ఉత్పత్తులను అధికం చేసుకోవచ్చు.

(d) గిడ్డంగి, విక్రయ సదుపాయాలకు సంబంధించినది మరొక సమస్య. సన్నకారురైతులు వారి పంటను గిట్టుబాటు ధరలు వచ్చేవరకు నిల్వచేయలేరు. ప్రస్తుతమున్న సదుపాయాలు కొద్దిమంది పెద్దరైతులకు మాత్రమే ప్రయోజనం కలిగిస్తున్నాయి. చిన్నరైతులు పంటలను విక్రయించటంలో కమీషన్ ఏజెంట్ల దోపిడికి గురి అవుతున్నారు.

ఈ సమస్యలన్నీ ప్రస్తుతం వ్యవసాయరంగాన్ని పీడిస్తున్నాయి.

## పంటలు — వాటిని పండించే రాష్ట్రాలు

భారతదేశంలో సాగవుతున్న ఆహార, ఆహారేతర పంటలను గురించి ఇప్పుడు పరిశీలిద్దాం. ముఖ్యమైన పంటలలో వరి, గోధుమ, అపరాలు, మొక్కజొన్నలు, ప్రత్తి, జనుము, చెఱకు ఉన్నాయి. పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, తమిళనాడు, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా వరిని పండించే రాష్ట్రాలు. గోధుమను పండించే రాష్ట్రాలలో ముఖ్యమైనవి పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్. మనదేశంలో జొన్నలను సాధారణంగా తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లలో పండిస్తున్నారు. మొక్కజొన్న దాదాపు దేశమంతటా పండుతున్నది. కాని, ఎక్కువగా పండించే రాష్ట్రాలు ఉత్తరప్రదేశ్, బీహార్, పంజాబ్‌లు, పప్పుధాన్యాలను ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లోనూ, కొంతమేరకు కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్రాలలోనూ పండిస్తున్నారు. తేయాకు, కాఫీ, రబ్బరు ఎక్కువగా అస్సాంలో పండుతున్నాయి. మనదేశం మొక్కజొన్నల

ఉత్పత్తిలో ప్రసిద్ధిగాంచినది. వేరుశనగ, ఆముదము, అవిశెలు వీటిలో ముఖ్యమైనవి. పశ్చిమ బెంగాల్, అస్సాం, బీహార్, ఒరిస్సారాష్ట్రాలలో జనుము ఎక్కువగా పండుతున్నది.

### పంటల తీరును నిర్ణయించు కారకాలు

సర్వసాధారణంగా ఆ ప్రాంతంలో గల నేలలో స్వభావం, శీతోష్ణస్థితి, వర్షపాతం మొదలైన కారకాల మీద పంటలతీరు ఆధారపడి ఉంటుంది. అయితే నీటిపారుదల సౌకర్యాలను విస్తృతపరిచి, కొత్త పద్ధతుల ద్వారా వ్యవసాయం చేస్తే ఇప్పుడున్న పంటల తీరులో లాభదాయకములైన మార్పులను తీసుకురావచ్చు. అయితే పంటల తీరును ప్రభావితం చేసే మరికొన్ని అంశాలలో ధరలమార్పు, ముడిసరుకు లభ్యత, కమత పరిమాణం, భూస్వామ్య వ్యవస్థ ముఖ్యమైనవని చెప్పవచ్చు.

### ఉత్పాదకతను పెంచుటలో వ్యవసాయ విధానాలు

ప్రభుత్వం తీసుకున్న చర్యలు అధికోత్పత్తిని సాధించడానికీ, రైతులకు గిట్టుబాటు ధరలను ఇవ్వడానికీ, గ్రామీణ ప్రాంతాలలో ఉద్యోగావకాశాలను మెరుగుపరచడానికీ ఉద్దేశించబడినాయి. కాబట్టి వ్యవసాయిక వస్తువుల ధరల సంఘం వివిధ వస్తువులకు ధరలను నిర్ణయించడంలో కొన్ని అంశాలను పరిగణలోనికి తీసుకుంటుంది. వ్యవసాయధరల సంఘాన్ని ప్రస్తుతం "వ్యవసాయ వస్తువుల వ్యయాలు, ధరల సంఘం" "Commission of Agrirultural costs and prices) అని పిలుస్తున్నారు. వస్తువులను ఉత్పత్తి చేయుటానికి అయిన ఖర్చు, ఆ వస్తువుకున్న డిమాండ్ సప్లయ్ పరిస్థితులు, వ్యవసాయిక ఉత్పాదకత మొదలైన అంశాలను పరిశీలిస్తుంది. వ్యవసాయ వస్తువులకు నిర్ణయించిన ధరలు ఉత్పత్తిదారులను ప్రోత్సహించేటట్లు ఉంటాయి. నూనెగింజల ఉత్పత్తికి ఇటీవల అధిక ప్రాముఖ్యం ఇచ్చారు. ఆహారధాన్యాలను, నూనెగింజలను ఎక్కువగా ఉత్పత్తి చేయడానికి ఇప్పుడున్న పరిశోధన, శిక్షణ సదుపాయాలను విస్తృతపరచాలని ప్రభుత్వం భావిస్తుంది.

## 12.5 నివారణోపాయాలు

ఇంతవరకు మనం వ్యవసాయ రంగం తీరుతెన్నులను గూర్చి నేర్చుకున్నాం. అయితే నేడు ఈ రంగాని అభివృద్ధి పరచటానికి తీసుకోదగిన చర్యలేమిటో తెలుసుకుందాం.

(1) లోగడ చెప్పినట్లుగా వ్యవసాయ ఉత్పత్తులను అతివృష్టి లేదా అనావృష్టి దెబ్బతీస్తాయి. ఉత్పత్తులు పెరిగినప్పటికీ ఆ పెరుగుదల కొన్ని పంటలకు మాత్రమే సంబంధించినదని కూడా ఇంతకుముందు నేర్చుకొన్నారు. గోధుమ, వరి, చెఱకు, ఆలుగడ్డలను మినహాయించి, మిగిలిన పంటలలో స్తబ్దత ఏర్పడింది. కాబట్టి నూతన పద్ధతులను అన్వేషించి, మిగిలిన పంటలను ఎక్కువ చేయుటానికి తగు చర్యలు తీసుకోవలసి వుంటుంది.

(2) వ్యవసాయ ఉత్పత్తిని అధి[illegible] చేయుటానికి నీటిపారుదల సౌకర్యాలు చాలా అవసరం. ఉన్న సదుపాయాలను పూర్తిగా వినియోగించుకోడా[illegible]కి తగు చర్యలు తీసుకోవాలి.

దేశంలో సాగుబడి విస్తీర్ణంలో ఎక్కువమేరకు వర్షాధార, మెట్టభూములున్నాయి. అటువంటి భూములలో ఏ పద్ధతుల ననుసరించి వ్యవసాయ ఉత్పత్తిని అధికం చేయాలో అన్వేషించాలి. మెట్టభూములలో నిలబడగల వంగడాలను తెలుసుకోవలసి ఉంది. కొత్త పద్ధతుల ద్వారా ఈ ప్రాంతాలలో పంటల దిగుబడిని మెరుగు పరచవలసి ఉన్నది.

వ్యవసాయ రంగాన్ని పరిశీలించేటప్పుడు పంటలు వ్యవసాయ ఉత్పత్తులను మాత్రమే కాకుండా, వ్యవసాయేతర ఉపరంగాలను కూడా పరిశీలించవలసి ఉంటుంది. వ్యవసాయేతర ఉపరంగాలలో పాడిపరిశ్రమ, అడవులు,



BRAOU

కోళ్ళ పరిశ్రమ, మత్స్య పరిశ్రమ, పట్టు పరిశ్రమ మొదలైనవి ముఖ్యమైనవి. వ్యవసాయ రంగ అభివృద్ధికి ఈ రంగాల కార్యకలాపాలను కూడా సమన్వయపరచ వలసిన అవసరం ఉంది.

వ్యవసాయ రంగ వృద్ధివల్ల అదనపు ఉద్యోగావకాశాలు సృష్టింపబడాలి. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల నుంచి శ్రామికులు పట్టణ ప్రాంతాలకు తరలి వస్తున్నారు. ఈ ధోరణిని అరికట్టవలసిన అవసరం ఉంది. వ్యవసాయ రంగాన్ని వృద్ధిపరచి, ఆ రంగంలో ఉన్న ప్రచ్ఛన్న నిరుద్యోగులకు పూర్తి ఉపాధి అవకాశాలను అందించాలి. అంతేకాకుండా ప్రాంతీయ అసమానతలను తొలగించడానికి వ్యవసాయకంగా వెనుకబడిన ప్రాంతాలలో ఉత్పత్తులను పెంచడానికి తగు మార్గాలను అన్వేషించాలి. వ్యవసాయాభివృద్ధి వల్ల సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు లాభం పొందగలగాలి.

వ్యవసాయ రంగం తగినంత ఆహారధాన్యాలను ఉత్పత్తి చేయగలగాలి. అప్పుడే జనాభా పెరిగినప్పటికీ, ద్రవ్యోల్బణ రహితమైన ఆర్థికాభివృద్ధిని సాధించగలుగుతాం. ధరలను అదుపులో పెట్టడానికి ప్రభుత్వ పంపిణీ విధానం కూడా సమర్థంగా చేయవలసి ఉంటుంది.

ఈ చర్యలను తీసుకోవడమే కాకుండా, గ్రామీణ వ్యవస్థలో వ్యవసాయిక ఆస్తుల పంపకంలో కూడా ప్రభుత్వం తగు చర్యలను తీసుకోవలసి ఉంది. ప్రస్తుతం ఎక్కువ శాతం వ్యవసాయ సంపద కొద్దిమంది పెద్ద భూస్వాముల చేతులలో ఉంది. ఫలితంగా వ్యవసాయాభివృద్ధి గ్రామీణ ప్రజలలో ఆదాయ అసమానతలను ఇంకా ఎక్కువ చేయడానికి తోడ్పడుతుంది. కనుక వ్యవసాయిక సంపదను కేంద్రీకృతం కాకుండా సక్రమంగా పంపిణీ చేయవలసిన అవసరం కూడా ఏర్పడింది.

## 12.6 సారాంశం/ముగింపు

భారతదేశంలో వ్యవసాయ రంగానికి ఉన్న ప్రాధాన్యతను వివరిస్తూ, బ్రిటిష్ వారి పాలనలో అది ఏ విధంగా కుంటుబడిందో ఈ పాఠంలో తెలుసుకున్నాం. స్వాతంత్ర్యానంతరం ప్రణాళికలను అమలుపరచడం ద్వారా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి కృషి సల్పినారు. వ్యవసాయాభివృద్ధికి మొదటి ప్రణాళికలో అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి ఎక్కువ మొత్తంలో నిధులో కేటాయించినారు. గత రెండు, రెండున్నర దశాబ్దాలుగా భారత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ప్రగతిమార్గం వైపు తీసుకొన్ని వెళ్ళడానికి ఎంతో శ్రద్ధను చూపింది.

వ్యవసాయిక వస్తువుల ఉత్పత్తిలో ధోరణులను గమనించినట్లయితే ఎన్నో ఒడుదుడుకులు కన్పిస్తాయి. గోధుమ పంట ఉత్పత్తి గణనీయంగా పెరుగగా, ఇతర పంటల ఉత్పత్తి సమస్యలలో పెరగలేదు. వ్యవసాయ రంగానికి చెందిన ఇతర సమస్యలలో లోపభూయిష్టమైన భూస్వామ్య విధానాలు, పాత పద్ధతులతో చేసే వ్యవసాయం, సరిపోయినంతగా లేని నీటిపారుదల సౌకర్యాలు, విక్రయ, గిడ్డంగి సమస్యలు ముఖ్యమైనవి. ఈ సమస్యలను తొలగించుకొనడానికి కొన్ని సూచనలు ఈ పాఠంలో ఉన్నాయి. అందులో ముఖ్యమైనది భూసంస్కరణలను అమలు పరచటం, వ్యవస్థాపర చర్యలు చేపట్టటం ద్వారానే గాకుండా సాంకేతిక పరమైన చర్యల ద్వారా కూడా వ్యవసాయ ఉత్పాదకతను పెంచవచ్చు. తద్వారా వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను నివారించవచ్చు.

— డా.టి. దివాకరరావు

## 12.7 సంప్రదింపు గ్రంథాలు


1. Datt and Sundaram: Indian Economy
2. Ojala, E.M : Agriculture and Economic Progress
3. P.C. Bansal: Agricultural Problems of India.

## 12.8 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 30 పంక్తులలో జవాబులు రాయండి.

1. ప్రణాళికా కాలంలో వ్యవసాయాభివృద్ధిని గురించి తెలుపండి.
2. భారత వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వివరించండి. వాటి పరిష్కార మార్గాలను తెలపండి.

II. కింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి 15 పంక్తులలో జవాబులు రాయండి.

1. భారతదేశ ఆర్థికవ్యవస్థలో వ్యవసాయ ప్రాధాన్యతను వివరించండి.
2. బ్రిటిష్ పాలనలోని భారతదేశంలో వ్యవసాయ స్వరూపం ఎలా వుండేదో వివరించండి.
3. వ్యవసాయ పెరుగుదలను ప్రభావితపరిచే విరోధకాలను తెలపండి.

BRAOU

# భాగం — 13: వ్యవసాయ ఉత్పాదకత

విషయక్రమం

13.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
13.1. పరిచయం: బ్రిటిష్ పాలనలో భూస్వామ్య పద్ధతులు
13.2. వ్యవసాయ ఉత్పాదకతను ప్రభావిత పరిచే కారకాలు
13.2.1. వ్యవస్థాపరమై కారకాలు
13.2.2. సాంకేతిక కారకాలు
13.2.3. సాధారణ/ఇతర కారణాలు
13.3. వ్యవస్థాపరమైన అడ్డంకులను తొలిగించే చర్యలు
13.4. వ్యవసాయ ఉత్పాదకతను పెంచే సాంకేతిక చర్యలు
13.5. సారాంశం ముగింపు
13.6. సంప్రదింపు గ్రంథాలు
13.7. నమూనా పరీక్షా ప్రశ్నలు

## 13.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

బ్రిటిష్ వారి పాలనాకాలంలో భారతదేశ వ్యవసాయాభివృద్ధి వ్యవస్థాపరమైన, సాంకేతిక పరమైన కారకాలు ఏ విధంగా కుంటుపరచాయో తెలుసుకోవడం, స్వాతంత్ర్యానంతరం భారతదేశం వ్యవసాయరంగంలో వచ్చిన మౌలిక మార్పులనూ, వ్యవసాయ ఉత్పాదకత పెరుగుదలకు తోడ్పడిన కారకాలనూ చర్చించడం ఈ పాఠం లక్ష్యం.

ఈ పాఠాన్ని చదివిన తర్వాత మీరు

★ బ్రిటిష్ వారి పాలనలో అమలులో ఉన్న భూస్వామ్య పద్ధతులను విశ్లేషించగలరు.
★ వ్యవసాయ ఉత్పాదకతను ప్రభావితం చేసే కారకాలను గుర్తించగలరు.
★ వ్యవసాయ ఉత్పాదకత పెరుగుదలకు దోహదపడే చర్యలను వర్గీకరించి వివరించగలరు.

BRAOU

## 13.1 పరిచయం: బ్రిటిష్ పాలనలో భూస్వామ్య పద్ధతులు

భారతదేశంలో స్వాతంత్ర్యం పొందిన నాటికి మూడు భూస్వామ్య పద్ధతులు అమలులో ఉండేవి. అవి (a) జమీందారీ పద్ధతి, (b) మహల్‌వారీ పద్ధతి, (c) రైతువారీ పద్ధతి.

జమీందారీ పద్ధతిని మొట్టమొదట ఈస్ట్ ఇండియా కంపెనీ వారు 1793లో బెంగాలో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత ఈ విధానం దేశములో అనేక ఇతర ప్రాంతాలకు కూడా విస్తృత పరిచారు. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం ఈ పద్ధతి ద్వారా భూములను సాగుచేస్తున్న రైతుల నుంచి భూమి పన్నును వసూలు చేసుకొనే హక్కును జమీందార్లకు సంక్రమింపజేసింది. అందుకుగాను ప్రభుత్వం నిర్దేశించిన కొంత రుసుము జమీందార్లు చెల్లించవలసి వుంటుంది. జమీందార్లు చెల్లించవలసిన మొత్తం ఎప్పటికి స్థిరంగానే ఉండేది. ఈ పద్ధతిలో భూమిని అభివృద్ధి పరిచే బాధ్యత యావత్తూ జమీందార్లకే పూర్తిగా అప్పగించారు. అయితే దీనిలో అనేక లోపాలు ఉన్నాయి. జమీందార్లు రైతుల నుంచి తీసుకొంటున్న భూమి పన్నును తరచుగా పెంచుతూ

ఉండేవారు. బ్రిటిష్ ప్రభుత్వానికి మాత్రం వారు చెల్లించవలసిన మొత్తం ఎప్పటికి మారకుండా ఉండేది. ఫలితంగా జమీందార్లు లాభం పొందేవారు. వీరికి భూమికి సంబంధించిన సమస్యల్నిగానీ, సాగుచేస్తున్న రైతుల సమస్యల్నిగానీ పరిష్కరించటానికి ఎటువంటి శ్రద్ధ చూపించేవారు కాదు. వీరు ఎక్కువగా విలాస వినోదాలతో కాలం గడుపుతూ ఉండేవారు. ఈ పద్ధతిలో వీరు భూమిని సాగు చేస్తున్న రైతులకూ, ప్రభుత్వానికీ మధ్య మధ్యవర్తులైనారు. అంటే రైతులు తమ సమస్యలను ప్రభుత్వానికి నేరుగా చెప్పుకోటానికి అవకాశం ఉండేదికాదు. దీంతో రైతుల సమస్యలనూ, వ్యవసాయానికి సంబంధించిన సమస్యలనూ ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి ప్రభుత్వానికి వీలు లేకుండా పోయింది.

మహల్‌వారీ భూస్వామ్య పద్ధతి ఆగ్రా, ఔద్, పంజాబ్ ప్రాంతాలలో అమలులో ఉండేది. ఈ పద్ధతి ప్రకారం ఒక గ్రామంలో భూమి అంతా ప్రజలందరి ఉమ్మడి యాజమాన్యంలో ఉంటుంది. భూమి శిస్తును ఉమ్మడిగా గాని లేదా విడివిడిగా గాని చెల్లిస్తూ ఉండేవారు. ఈ పద్ధతి ఉమ్మడి వ్యవసాయమువల్ల పెద్ద కమతాల రైతులు మాత్రమే లాభాన్ని పొందేవారు. మన దేశంలో చిన్న కమతాల సంఖ్య ఎక్కువగా ఉన్నందువల్ల ఈ పద్ధతి సన్నకారు రైతులకు ఎక్కువగా ప్రయోజనాన్ని అందించలేకపోయింది.

రైతువారీ భూస్వామ్య పద్ధతిలో యజమాని ప్రభుత్వానికి నేరుగా భూమి పన్ను చెల్లిస్తాడు. అయితే ఈ పద్ధతిలో కూడా కొంతమంది పెద్ద పెద్ద భూస్వాములు వారికున్న భూమి విస్తీర్ణంలో కొంతభాగాన్ని సేద్యం చేయకుండా కౌలుకు ఇస్తూ ఉండేవారు. కౌలుదార్లు కూడా కమతాన్నంతటినీ స్వంతంగా సాగుచేసేవారు కాదు. వీరు తీసుకున్న కౌలు భూమిని తిరిగి ఇతరులకు కౌలుకు ఇచ్చేవారు.

## 13.2 వ్యవసాయ ఉత్పాదకతను ప్రభావితపరిచే కారకాలు

### 13.2.1 వ్యవస్థాపరమైన కారకాలు

లోపభూయిష్టమైన భూస్వామ్య పద్ధతులు అల్ప పరిమాణంలో కమతాలుండటం, తరచూ కమతాలు విఘటనకు గురికావటం వ్యవసాయరంగం కుంటుపడటానికి కారణాలుగా పేర్కొనవచ్చు. జనాభా పెరుగుదల వల్ల భూమి మీద ఒత్తిడి ఏర్పడుతుంది. వంశ పారంపర్యంగా ఒకే కమతాన్ని ఎందరో పంచుకోవలసి వచ్చింది. కాబట్టి కమతాల విఘటన జరిగి పరిమాణం తగ్గింది. చిన్న కమతాలలో ఆధునిక పద్ధతులను ఉపయోగించి సేద్యం చేయడానికి అవకాశం వుండదు. అంతేకాకుండా వ్యవసాయదారుల శ్రమవృధా అవుతుంది. నీటి వసతులను కూడా పూర్తిగా వినియోగించుకోలేం. ఈ పరిస్థితుల్లో వ్యవసాయ ఉత్పాదకత క్షీణించింది.

వ్యవస్థాపరమైన అంశాలలో పరపతికి, మార్కెటింగ్ విషయాలు కూడా వ్యవసాయరంగ అభివృద్ధిని ప్రోత్సహించేవిగా ఉండేవికావు. రైతులు వారి అవసరాలకు గ్రామీణ ఋణదాతలపై ఎక్కువగా ఆధారపడుతుండేవారు. వారు తీసుకున్న ఋణాలపై అధికవడ్డీ చెల్లిస్తుండేవారు. సంస్థాపరమైన పరపతి లభ్యం కానందువల్ల వ్యవసాయదారులు చాలా ఇబ్బందులకు గురి అయ్యేవారు. మార్కెటింగ్ విషయాలలో కూడా తగిన గిడ్డంగి సౌకర్యాలు లేనందువల్ల ప్రోత్సాహకరమైన ధర లభించే వరకు ఫలసాయాన్ని నిలవ చేయలేక పోయారు. ఈ కారణాలవల్ల వ్యవసాయదారుల ఆదాయాలు క్షీణించాయి. భూమిని అభివృద్ధి పరిచే కార్యకలాపాలను చేపట్టలేకపోయారు.

### 13.2.2. సాంకేతిక కారకాలు

ఇప్పుడు కొన్ని సాంకేతికపరమైన కారణాలను కూడా పరిశీలిద్దాం. వ్యవసాయరంగంలో పురాతన పద్ధతులను అనుసరించి వ్యవసాయం చేస్తుండేవారు. ఆధునిక పరికరాలను ఉపయోగించే వారు కాదు. మేలు రకం విత్తనాలు, రసాయనిక ఎరువులు, ఆధునిక పరికరాలను ఉపయోగించటం వల్ల సుమారు 10 నుంచి 20 శాతం 

ఉత్పత్తి పెరుగుతుంది. చాలా మంది వ్యవసాయదారులు వర్షపు నీరును మాత్రమే ఉపయోగించేవారు. నీటి వనరులు ఆ రోజుల్లో ఎక్కువగా ఉండేవికావు. లభ్యమయ్యే వనరులు కూడా ఇతర సహకార కారణాలు లేనందువల్ల ఉపయోగపడేవికావు.

### 13.2.3. సాధారణ కారణాలు

వ్యవస్థాపరమైన, సాంకేతిక పరమైన కారణాలతో పాటు కొన్ని సాధారణ కారణాలు కూడా వ్యవసాయ రంగ అభివృద్ధిని నిరోధించాయి. జనాభా పెరుగుదల వల్ల వ్యవసాయ రంగములో 'ప్రచ్ఛన్న నిరుద్యోగిత' ఎక్కువైంది. అంటే వ్యవసాయరంగంలో అవసరానికి మించి శ్రామికులుండటమే. పోతే గ్రామీణ వాతావరణము కూడా ప్రతికూలంగా ఉండేది. సంప్రదాయసిద్ధమైన కులవ్యవస్థ, ఉమ్మడి కుటుంబం, మూఢ నమ్మకాలు ప్రజలలో అభివృద్ధి పట్ల ఆసక్తి లేకుండా చేశాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వ్యవసాయ ఉత్పత్తులను పెంపొదించటానికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం:

## 13.3 వ్యవస్థాపరమైన అడ్డంకులను తొలగించే చర్యలు

మొదట వ్యవస్థాపరమైన అడ్డంకులను తొలగించటానికి కొన్ని చర్యలను తీసుకున్నారు. భూసంస్కరణల వల్ల రెండు ముఖ్యమైన ధ్యేయాలను సాధించాలని భావించారు. అవి: (1) వ్యవసాయ ఉత్పత్తులను పెంపొందించటం, (2) సాంఘిక న్యాయాన్ని సమకూర్చటం. భూసంస్కరణల వల్ల భూయాజమాన్యాన్ని పునఃపంపిణీ చేయవచ్చు. భూసంస్కరణలలోని ముఖ్య అంశాలు. (a) మధ్య వర్తులను తొలగించటం, (b) కౌలు సంస్కరణలు, (c) కమతాలపై గరిష్ఠ పరిమాణాన్ని విధించటం, (d) కమతాల సమీకరణ, (e) సహకార వ్యవసాయం అన్ని రాష్ట్రాలలోనూ భూసంస్కరణలను ప్రవేశపెట్టారు. మధ్యవర్తుల తొలగింపు చర్య భూసంస్కరణలలో ముఖ్యమైనది. మధ్యవర్తుల తొలగింపుకు గాను తగు చట్టాలను రూపొందించి జమీందార్లను, జాగీర్ దార్లను తొలగించారు. వారికి నష్ట పరిహారాన్ని కొంత నగదు రూపంలోనే చెల్లించారు. జమీందార్ల తొలగింపు వల్ల సాగు చేసే రైతులకూ, ప్రభుత్వానికీ మధ్య అడ్డుగోడలేవీ లేకుండా ప్రత్యక్ష సంబంధం ఏర్పడింది. అయితే కొంతమంది జమీందార్లు సొంత వ్యవసాయం పేరిట కొంత భూమిని వశపరుచుకోగలిగారు. ఫలితంగా, చాలా కాలం నుండి భూమిని సాగుచేస్తున్న కౌలుదార్లను తొలగించారు. మొత్తం మీద జమీందార్లనూ, జాగీర్‌దార్లనూ అంటే మధ్యవర్తులను ప్రభుత్వం నిర్మూలించగలిగింది.

BRAOU

భూసంస్కరణలలో తదుపరి చర్య కౌలు సంస్కరణలను చేపట్టడం. కౌలు సంస్కరణలో ముఖ్యాంశాలు: (a) కౌలుదారు చెల్లిస్తున్న భాటకాన్ని క్రమబద్ధం చేయడం, (b) కౌలుదార్లకు రక్షణ కల్పించడం, (c) కౌలుదార్లకు భూమి మీద యాజమాన్యపు హక్కులను సంక్రమింపచేయడం. భూస్వామి కౌలుదారు వద్ద నుండి తరుచు అధిక భాటకాన్ని తీసుకుంటుండేవాడు. దీనిని అరికట్టడానికి కౌలుదారు చెల్లించవలసిన పరిమాణం మొత్తం ఉత్పత్తిలో ¼ లేదా 1/5 వంతుకంటె మించరాదని ప్రభుత్వం నిర్దేశించింది. కౌలుదార్లను భూస్వామి తన ఇష్టానుసారం అనేకమార్లు తొలగించే వాడు. దీనిని అరికట్టడానికి కొన్ని చట్టాలను ప్రవేశపెట్టారు. కౌలు చెల్లిస్తున్నంతకాలం కౌలుదార్లను భూస్వామి తొలగించరాదని నిర్దేశించారు. కొంతమంది కౌలుదార్లకు శాశ్వతంగా సాగు చేసే హక్కు భూస్వామి ఇవ్వాలని ప్రభుత్వం చట్టరీత్యా నిర్దేశించింది. ఒకవేళ భూస్వామి భూమిని విక్రయించినట్లయితే కౌలుదార్లే కొనడానికి అవకాశాన్ని కల్పిస్తూ చట్టాలను రూపొందించారు. భూమిని అభివృద్ధి పరిచి వ్యవసాయోత్పత్తులను వృద్ధి పరచడానికీ, కౌలుదార్లను ప్రోత్సహించడానికీ ఈ సంస్కరణలను ఉద్దేశించారు. రాజకీయ ప్రయోజనాల కోసం జమీందారీ వ్యవస్థను బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కానీ కౌలుదార్ల వ్యవస్థ వ్యవసాయదారుల దుర్భర ఆర్థిక పరిస్థితుల పర్యవసానంగా ఆవిర్భవించిందని తెలుసుకోవాలి. (a) జనాభా పెరుగుదల వల్ల భూమిపై తీవ్ర ఒత్తిడి (b) వ్యవసాయదార్లకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లేకపోవడం (c) వ్యవసాయదారుల ఆదాయాలు క్షీణించడం (d) రైతుల

సమస్యల పట్ల అప్పటి బ్రిటిష్ ప్రభుత్వ నిర్లిప్తత, (e) భూమిని స్వేచ్ఛగా విక్రయించుకోడానికి మన వ్యవస్థలో అవకాశము ఉండటం మొదలైనవి లోపభూయిష్టమైన కౌలు వ్యవస్థకు దారి తీసిన ముఖ్యకారణాలు.

కౌలు సంస్కరణల వల్ల భూస్వామి కౌలుదార్లను కౌలు చెల్లిస్తున్నంతకాలం తొలగించలేదు. కొన్ని రాష్ట్రాలలో కౌలుదార్లను తొలగించకుండా కనీసకాల పరిమితిని కూడా చట్టరీత్యానిర్దేశించారు. "దున్నేవాడిదే భూమి" అనే భావనను అమలు పరచడానికి కౌలుదార్లకు యాజమాన్య హక్కులను సాధ్యమైనంతవరకు సంక్రమింపజేయటానికి అనేక చర్యలను ప్రభుత్వం గైకొన్నది. అయితే కౌలు సంస్కరణలను సక్రమంగా అమలు జరుగకుండా సొంత వ్యవసాయం చేయని పెద్ద పెద్ద భూస్వాములు ఇప్పటికీ అడ్డు తగులుతునే ఉన్నారు. వీరు చట్టాలలోని అంశాలను ప్రశ్నిస్తూ కోర్టులలో వివాదాలను సృష్టించి, సొంత వ్యవసాయం పేరిట కౌలుదార్లను తొలగించే చర్యలకు పాల్పడుతున్నారు. కౌలుదార్ల పేర్లు ప్రభుత్వ రికార్డులలో సక్రమంగా నమోదు కావందువల్లా, వారి ఆర్థిక స్థోమత తక్కువగా ఉన్నందువల్లా ఈ సంస్కరణలు కౌలుదార్లకు పూర్తి ప్రయోజనాన్ని చేకూర్చలేక పోయాయి.

కమతాలను సమీకరించి వాటిని లభాసాటి కమతాలుగా మార్చడం కూడా భూసంస్కరణలలో ముఖ్యమైన కార్యక్రమం. భారతదేశంలో కమతాల పరిమాణం అతి చిన్నదిగా ఉన్నందువల్ల వ్యవసాయాభివృద్ధిని సాధించలేక పోయాం. లాభసాటి కమతాలుగా రూపొందించడానికి ప్రభుత్వం రెండు మార్గాలను చేపట్టింది. (1) చిన్న చిన్న కమతాలను ప్రభుత్వం రైతుల నుంచి స్వాధీనం చేసుకొని వాటిని సమీకరించి లాభసాటి కమతాలుగా మార్చటం. (2) భూకమతాలపై గరిష్ట పరిమితిని నిర్దేశించి ఆ పరిమితిని మించిన మిగులు భూమిని యజమానుల నుంచి తీసుకొని లాభసాటి కలమతాలను ఏర్పాటులో వినియోగించటం. ఈ రెండు పద్ధతులవల్ల కమతాల సమీకరణ కార్యక్రమం చెప్పుకోదగిన ప్రగతిని సాధించలేక పోయింది. పోతే కమతాలను సమీకరించడానికి ఆధునిక ఉత్పత్తి 'సహకార వ్యవసాయం' అని ప్రభుత్వం గుర్తించింది. సహకార వ్యవసాయం అంటే కొంతమంది వ్యవసాయదార్లు వారి వారి భూకమతాలను సహకార సంఘానికి ఒప్పచెప్పి ఉమ్మడిగా పరికరాలను వ్యవసాయంలో వినియోగించి వ్యవసాయ ఉత్పత్తిని కూడా ఉమ్మడిగా అనుభవిస్తారు. పెద్ద కమతాలు ఏర్పడినందువల్ల ఈ పద్ధతి ప్రకారం వ్యవసాయం చేస్తే ఆదాయాలు రావటానికి అవకాశం ఉంది. కాని సహకార వ్యవసాయంలో కూడా ఎక్కువ ప్రగతిని సాధించలేక పోయాం. సహకార వ్యవసాయంలో చిన్న రైతులను పెద్ద రైతులు దోచుకునే అవకాశం ఎక్కువగా ఉన్నందువల్ల చిన్న రైతులు ఈ పద్ధతిని ఆమోదించలేకపోయారు. భూకమతాల గరిష్ట పరిమితి చట్టాలనుండి తప్పించుకోడానికి కొంతమంది పెద్ద పెద్ద భూస్వాములు వారి భూములను సహకార సంఘాలకు ఒప్పజెప్పారు. అంతేకాకుండా సహకార వ్యవసాయం పనిచేసే తీరు తెన్నులను గమనిస్తే అందులో అసమర్థత, నిధుల దుర్వినియోగం మొదలైనవి చోటు చేసుకున్నాయి.

భూకమతాల గరిష్ట పరిమితి చట్టాల గురించి కొంత తెలుసుకొందాం. (a) భూయాజమాన్యంలో గల వ్యత్యాసాలను తగ్గించడం, (b) వ్యవసాయ ఉత్పాదకతను వృద్ధి పరచటం, (c) సామర్థ్య వంతమైన రైతాంగాన్ని సృష్టించడం, (d) సహకార ప్రాతి పదికతో గ్రామీణ వ్యవస్థను రూపొందించడం భూకమతాల గరిష్ట పరిమితి నిర్ణయం సాధించవలసిన ధ్యేయాలు. భూకమతాల గరిష్ట పరిమితి చట్టాలను సుమారు 1961-62 నుంచి దేశంలో అన్ని రాష్ట్రాలు ప్రవేశపెట్టినాయి. గరిష్ట పరిమితిని నిర్ణయించటంలో భూసారం, నీటి వనరుల లభ్యత, పంటల వివరాలు మొదలైన అంశాలకు ప్రాముఖ్యమిచ్చారు. ప్రతి రాష్ట్రంలోనూ వివిధ ప్రాంతాలలో ఉన్న పరిస్థితులను బట్టి 'గరిష్ట పరిమితి'ని నిర్ణయించారు. అయితే ఈ చర్యలవల్ల చెప్పుకోదగిన మిగిలు భూమిని ప్రభుత్వం స్వాధీన పరచుకోలేకపోయింది. పెద్ద పెద్ద భూస్వాములు ఈ విధానానికి సహజంగా వ్యతిరేకులు. చట్టాలలో ఏవో కొన్ని లోపాలున్నాయన్న మిషతో తరచు కోర్టులలో లావాదేవీలు మొదలు పెట్టేవారు. కొన్ని సందర్భాలలో వారి కుటుంబ సభ్యులకు, మిత్రులకు రహస్య ఒప్పందాల ద్వారా వారికున్న భూమిని పంపిణీ చేసి భూకమతాల గరిష్ట చట్టాలనుండి తప్పించుకునే వారు. కాబట్టి మొత్తం మీద భూసంస్కరణలో 'మధ్యవర్తుల తొలగింపు' మినహా మిగిలిన అంశాలలో ఊహించినంత ప్రగతిని సాధించలేకపోయాం.



BRAOU

పరపతి, మార్కెట్ సౌకర్యాలూ వ్యవసాయదారుల అవసరాలకు తగినట్లుగా లేవు. బ్యాంకుల జాతీయకరణకు ముందు వ్యవసాయరంగానికి అతి తక్కువ పరపతిని మంజూరు చేసే వారు. జాతీయకరణ తర్వాత వ్యవసాయరంగానికి పరపతిని ఎక్కువ చేసినప్పటికీ వారు పూర్తి అవసరాలకు సరిపడినంతగా ఇవ్వలేక పోతున్నారు. వ్యవసాయదారులలో పెద్ద పెద్ద భూస్వాములు మాత్రమే బ్యాంకు పరపతి వల్ల ఎక్కువ ప్రయోజనాన్ని పొందారు. చిన్న, మధ్య రకం రైతులు బ్యాంకులకు సెక్యూరిటీ కింద ఎక్కువ ఆస్తులను హామీగా ఇవ్వలేరు. కాబట్టి బ్యాంకులు వారికి అధిక మొత్తాలలో పరపతిని అందించలేవు. సహకార సంఘాల ద్వారా ఇచ్చే పరపతి కూడా వారి అవసరాలను తీర్చలేకపోయింది. మార్కెటింగ్ విషయాలను పరిశీలిస్తే గిడ్డంగి సదుపాయాలు తగినంతగా లేనందువల్ల గిట్టుబాటుధర వచ్చే వరకు ఆగకుండా రైతులు ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. మార్కెటింగ్ సౌకర్యాలలో కూడా పెద్ద భూస్వాములే ఎక్కువగా ప్రయోజనం పొందగలిగారు.

కాబట్టి, ఇప్పటికి కూడా వ్యవసాయరంగాన్ని పరిశీలిస్తే లోపభూయిష్టమైన భూస్వామ్య వ్యవస్థ, చిన్న కమతాలు కమతాల విఘటన, తగినంత పరపతి, మార్కెటింగ్ సౌకర్యాలు లేకపోవడం మొదలైనవి అభివృద్ధి విరోధకాలుగా ఉన్నాయి.

## మీ అవగాహనను పరీక్షించుకోండి — 1

1. రైత్వారీ పద్ధతి అంటే ఏమిటి?
2. వ్యవసాయ ఉత్పాదకతను ప్రభావితం పరిచేటటువంటి కారకాలను తెలపండి.
3. భూసంస్కరణల స్వభావమును తెలపండి?
4. భూ కమతాల గరిష్ట పరిమితిని నిర్ణయించడంలో సాధించవలసి ధ్యేయాలు ఏమిటి?

## 13.4 వ్యవసాయ ఉత్పాదకతను పెంచే సాంకేతిక చర్యలు

వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేయడంలో వ్యవస్థాపరమైన కారణాలే కాకుండా సాంకేతిక పరమైన కారణాలు కూడా ఉన్నాయని లోగడ తెలుసుకున్నాం. సాంకేతిక కారణాలలో మొదటిది నీటి వనరులకు సంబంధించినది. వ్యవసాయ ఉత్పత్తులను అధికం చేయటానికి నీటి వనరులు పుష్కలంగా లభించాలి. స్వాతంత్ర్యానంతరం పెద్ద పెద్ద ఆనకట్టలు, రిజర్వాయర్లు నిర్మించారు. అయినప్పటికి చాలా ప్రాంతాలలో నీటి వనరులు లేక వ్యవసాయోత్పత్తులు దెబ్బతింటున్నాయి. నీటి వనరులను సృష్టించిన ప్రాంతాలలో కూడా రైతులు వాటిని పూర్తిగా వినియోగించుకోలేక పోతున్నారు. దీనికి కారణం రైతుల ఆర్థిక దుస్థితే కాక మిగిలిన అవసరాలకు సహకార కారకాలు లేకపోవటం అంటే నీటి వసతులను వినియోగించుకోవటానికి మేలు రకం విత్తనాలు, రసాయనిక ఎరువులు కొరతగా వుండరాదు.

ఇక రెండవది ఉత్పత్తి పద్ధతులకు సంబంధించినది. ఇప్పటికి కూడా చాలామంది రైతులు పురాతన పద్ధతుల్లోనే సేద్యము చేస్తున్నారు. ఆధునిక పద్ధతులంటే కొంతమంది రైతులు విముఖత చూపుతారు. ఆధునిక ఉత్పత్తి పద్ధతులలో ఎక్కువ ప్రవేశం లేనందువల్ల మన దేశములోని రైతులు ఆ విధముగా ఉన్నారు. మూడవ పంచవర్ష ప్రణాళిక తర్వాత ఆధునిక పద్ధతుల్లో సేద్యాన్ని చేయటానికి వీలుగా నూతన వ్యవసాయిక వ్యూహాన్ని రూపొందించినారు. ఫలితంగా వ్యవసాయోత్పత్తులు బాగా పెరిగాయి. ఈ పరిణామాన్ని 'హరిత విప్లవం' అంటారు. అయితే అన్ని ప్రాంతాలలో పంటలన్నీ ఒకే విధంగా వృద్ధి చెందలేదు. ఆధునిక పద్ధతులను ఉపయోగించాలంటే ముఖ్యంగా కావలసినది విద్యుచ్ఛక్తి రసాయనిక ఎరువులు. ఇటీవల విద్యుచ్ఛక్తికి కొరత ఏర్పడింది. రసాయనిక ఎరువుల ధరలు ఎక్కువగా పెరుగుతున్నందువల్ల చాలా మంది రైతులు నూతన పద్ధతులను అవలంబించ లేకపోతున్నారు.

## 13.5 సారాంశం/ముగింపు

భారతదేశ వ్యవసాయాభివృద్ధిలో వ్యవస్థాపూర్వక, సాంకేతిక పరమైన అడ్డంకులు ఏ విధంగా ఎదురవుతున్నాయో ఇంతవరకు తెలుసుకున్నాం. ఏ సమస్యను పరిష్కరించాలో స్పష్టంగా నిర్ణయించిన తర్వాత దానికి తగిన సంస్కరణలను, వ్యవస్థాపరంగా గాని లేదా సాంకేతికపరంగాగాని చేపట్టాలి. వ్యవస్థాపరమైన సంస్కరణలలో, సాంకేతిక పరమైన మార్పులలో ఏవి సాపేక్షికంగా ఉత్తమమైనవనే చర్చ అవసరం. ఈ సందర్భంలో తెలుసుకోవలసిన ఇంకొక విషయమేమిటంటే దీర్ఘ కాలానికి ఉత్తమమైన చర్య స్వల్పకాలంలో ఉపయోగపడకపోవచ్చు. భారతదేశం వంటి విశాల దేశంలో నేల, వాతావరణ పరిస్థితులు వర్షపాతం వంటి ప్రకృతి సిద్ధ వనరులు లభించడంలో ఎన్నో వైరుధ్యాలు గోచరిస్తాయి. కాబట్టి వివిధ ప్రాంతాలలో పెరుగుదల ఫలితాలు పంపిణీ కావడంలో అసమానతలు ఏర్పడతాయి. ఉదాహరణకు, వ్యవసాయరంగంలో జరిగిన సాంకేతిక ప్రగతి వల్ల సన్నకారు రైతులు కాకుండా, భూస్వాములు లాభపడ్డారు. కాబట్టే సంస్థాగత సంస్కరణలను చేపట్టవలసిన అవసరమేర్పడింది. సాంకేతిక ప్రగతి వల్ల ఏర్పడే ప్రయోజనాలు ఒక్క వర్గానికి మాత్రమే చెందకూడదు. దేశ ప్రజలలో అధికశాతం మందికి ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలి. కౌలుదారి, పరపతి, మార్కెటింగ్ వంటి సాధారణ సంస్థాగత సంస్కరణలే కాకుండా వ్యవస్థాపూర్వక నిర్మాణంలో నూతన మార్పులను కనిపెట్టి సాంకేతిక ప్రగతి ప్రయోజనాలను సమాజంలో వివిధ వర్గాల మధ్య సమానంగా పంపిణీ అయ్యేటట్లు చూడాలి. కాబట్టి సాంకేతిక పరిజ్ఞానం, సంస్థాగత సంస్కరణలు, వ్యవసాయ అవస్థాపనా సౌకర్యాల కోసం పెట్టే ప్రభుత్వ పెట్టుబడి — ఈ మూడింటి మిశ్రమం వ్యవసాయ ఉత్పాదకతను ద్విగుణీకృతం చేసేలా ఉండాలి.

— డా.టి. దివాకరరావు

BRAOU

## 13.6 సంప్రదింపు గ్రంథాలు


1. Datt and Sundaram : Indian Economy
2. Dansal, P.C. : Agricultural Problems of India
3. Misra and Puri : Indian Economy


## 13.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

*I. కింది ప్రశ్నలలో ఒక్కొక్క దానికి 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.*

1. భారతదేశంలో వ్యవసాయ ఉత్పాదకతను ప్రభావిత పరిచే వివిధ కారకాలను విమర్శనాత్మకంగా వివరించండి.
2. భారతదేశంలో వ్యవసాయరంగంలో వ్యవస్థాపూర్వకమైన సంస్కరణలను తీసుకొని రావడానికి గైకొన్న చర్యలను వివరించండి.

*II. కింది ప్రశ్నలలో ఒక్కొక్క దానికి సుమారు 15 పంక్తులలో జవాబు లిమ్ము*

1. వ్యవసాయ ఉత్పాదకతను ప్రభావితం చేసే వ్యవస్థాపూర్వక కారకాలను వివరించండి.
2. సాంకేతిక చర్యలు ఏవిధంగా వ్యవసాయ ఉత్పాదకతను పెంచగలుగుతాయి.
3. భూ సంస్కరణలలో ఇమిడి ఉన్న దశలను రాయండి.

# భాగం — 14:హరిత విప్లవం

విషయక్రమం


14.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
14.1 పరిచయం
14.2 హరిత విప్లవం విశిష్ట లక్షణాలు
14.3 హరిత విప్లవ పరిమిత ప్రభావానికి కారణాలు
14.4 వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదల, ఉత్పత్తి అస్థిరత్వం
14.5 హరిత విప్లవ ప్రభావం
14.6 హరిత విప్లవ ఫలితాలు
14.7 సారాంశం/ముగింపు
14.8 సంప్రదింపు గ్రంథాలు
14.9 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 14.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

హరిత విప్లవం ప్రాముఖ్యతమూ, ఉపాధి సౌకర్యాలమీదా, ప్రాంతాల అభివృద్ధి మీదా దాని ప్రభావాన్ని వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

ఈ భాగాన్ని చదివిన తర్వాత మీరు

★ సస్య విప్లవ లక్ష్యాలను గుర్తించగలరు.

★ సస్య విప్లవ ప్రభావం ఎందుకు పరిమితంగా ఉందో తెలుసుకోగలరు.

★ మానవ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వ్యవసాయసేద్యంచేయడం వల్ల వ్యవసాయ ఉత్పత్తిలో పెరుగుదల కలిపించినప్పటికీ అస్థిరత్వం ఎందుకు నెలకొంటుందో వివరించగలరు.

★ హరిత విప్లవ ప్రభావాన్ని, ఫలితాలను చర్చించగలరు.

B R A O U

## 14.1 పరిచయం

1960 దశకం మధ్య కాలానికి ముందు భారతీయ వ్యవసాయం ఎక్కువగా సంప్రదాయ పద్ధతులలో సాగుతూ ఉండేది. వ్యవసాయ ఉత్పత్తిలో గణనీయంగా, నికరంగా పెరుగుదల ఉండాలంటే ఏదో ఒక విధమైన సాంకేతిక పురోగమనం అవసరం. మేలైన నీటి పారుదల ద్వారామా, మంచి విత్తనాల ద్వారామా, ఎరువుల వినియోగం ద్వారామా వ్యవసాయ దిగుబడులు గణనీయంగా పెరుగుతాయని విస్తృతంగా గుర్తించబడి నప్పటికీ, ఈ గుర్తింపు వ్యవసాయరంగంలోని విధాననిర్మాణంలో భాగం కాలేదు. అంతేకాక, సాంప్రదాయిక వ్యవసాయ వ్యవస్థలో ఉత్పాదకత చిన్న కమతాలలో ఎక్కువగా ఉండేది. భూ సంస్కరణలు సమర్థంగా అమలు జరిగిఉంటే, ఉత్పత్తి పెరుగుదల రేటు నిధిగా వృద్ధికాకపోయినా, మొత్తం వ్యవసాయ ఉత్పత్తి పెరిగిఉండేది.

"హరిత విప్లవం"గా రూపుదాల్చిన కొత్త వ్యవసాయ పద్ధతుల సమాహారం వల్ల భారతీయ వ్యవసాయంలో సాంకేతిక పురోగమనం జరిగిందా, తత్ఫలితంగా ఆర్థిక వ్యవస్థమీద పనిచేసే సాంకేతిక నిర్బంధాలను ఆ పద్ధతులు సడలించాయా అనే విషయాన్ని మనం పరిశీలించాలి. దీనికి జవాబు కావాలంటే కొత్త సాంకేతిక

విజ్ఞాన స్వభావాన్నీ, ఉత్పాదితమూ, ఉపాధీ, పంపకమూలాంటి అస్థిర అంశాలమీద దాని ప్రభావాన్నీ, అది నిరంతరం విస్తరించడానికీ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తన్నుతాను మలచుకోడానికీ తగిన పరిస్థితులనూ పరిశీలించాలి. ఒక్క మాటలో చెప్పాలంటే, "హరిత విప్లవం" గత చరిత్రనూ, భావి అవకాశాలనూ మనం సమీక్షించాలి.

తక్కువ దిగుబడి ఇచ్చే సాంప్రదాయిక రకాల విత్తనాల స్థానంలో అధికదిగుబడి వంగడాలను (అదివం) వాడటం కొత్త సాంకేతిక విజ్ఞాన విలక్షణ గుణం. ఈ వంగడాలకు గింజల దిగుబడిని పెంచేందుకు భూసారాన్ని వినియోగించుకొనే సామర్థ్యం ఉంది. కానీ సహజమైన భూసారానికి తోడుగా ఎరువులను ఎక్కువగా వినియోగించినప్పుడే ఇది సాధ్యమౌతుంది. సాంద్రరూపంలో ఉన్న ఎరువులను మొక్కలు గ్రహించలేవు. ఎరువులకు తగిన నీటి సరఫరా కూడా వుండాలి. ఈ సాంకేతిక విజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలంటే, గరిష్ఠ దిగుబడులను సాధించేందుకు పైరు పెరిగేటప్పుడు తగిన దశలలో ఎరువూ, నీరూ అందించడం, కలుపు తీయడం, క్రిమిసంహారకాల సరఫరా, నీటి నియంత్రణ, మురుగునీరు పోవడం మొదలైన మేలైన వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి.

అధిక దిగుబడినిచ్చే వంగడాల విత్తనాలకు మరి రెండు భౌతిక లక్షణాలు ఉన్నాయి. అవి వేగంగా పక్వానికి వస్తాయి. ఎండ లభించే కాలం ఎక్కువైనా, తక్కువైనా ఒకే విధంగా ఫలితం ఇస్తాయి. తక్కువ కాలంలో పంట కోతకు వస్తుంది. కాబట్టి అదే పొలంలో ఏటా ఎక్కువ పైర్లు పండించవచ్చు. భూమి కోసం మొగం వాచిన దక్షిణ ఆసియాలో ఇది ఒక ఆకర్షణే.

## 14.2 హరిత విప్లవం విశిష్ట లక్షణాలు

ప్రధానంగా ప్రతి ఎకరంలోనూ దిగుబడిని పెంచడం ద్వారా మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తిని ఎక్కువ పరిమాణాలలో సాధించేటందుకు సహాయక ఉత్పాదకాలను ఉపయోగించడమే హరిత విప్లవ వ్యూహంలోని మౌలిక సాంకేతిక లక్షణం. కానీ ఈ సాంకేతిక విజ్ఞాన ప్రభావాన్ని అంచనా వేయడంలో ఆర్థిక లక్షణాలను లెక్కలోకి తీసుకోవాలి. భారతదేశంలోని వ్యవసాయం ఎక్కువగా కుటుంబశ్రమ మీద గానీ, అల్పవేతన శ్రమ మీదగానీ ఆధారపడుతుంది. ఈ దేశంలో శ్రమ సమృద్ధిగా ఉంది. దానికి ప్రత్యామ్నాయ ఆదాయమార్గాలు హీనమైన స్థాయిలో వున్నాయి. భూమికాక అత్యంతఖరీదైన ఉత్పాదకం ఎద్దుల శక్తి. కానీ దీనికి భిన్నంగా, కొత్తగా సాంకేతిక విజ్ఞాన పరిశ్రమల్లో తయారైన ఉత్పాదకాలను ఉపయోగిస్తూ వర్షం మీద ఆధారపడకుండా ఉంది. అందువల్ల అది అధిక పెట్టుబడిని ఆపేక్షిస్తుంది. రైతుమీద పడే ఈ అదనపు ఖర్చులో మూడు అంశాలు ఇమిడి ఉన్నాయి.

మొదటిది: ఎరువుల వినియోగం క్షీణమాన ప్రతిఫలసూత్రానికి (law of diminishing return) అనేదానికి లోబడి ఉంది. అందువల్ల సాంకేతికంగా సాధ్యమైన గరిష్ఠ దిగుబడిని సాధించడానికి ఉపయోగించవలసిన ఉత్పాదకాలకంటే ఆర్థికంగా గరిష్ఠ లాభదాయకమైన ఉత్పాదకాల పరిమాణం తక్కువగా ఉంటుంది. అంతేకాక, ఒక ఉత్పాదకం (ఉదాహరణకు ఎరువు) వినియోగం ఇతర ఉత్పాదకాల లభ్యత మీదా వాటిని కొనగల శక్తిమీదా ఆధారపడుతుంది.

రెండవది: లాభాలదృష్ట్యా కొత్త సాంకేతిక విజ్ఞానం వినియోగార్హంగా ఉండాలంటే అస్థిరంగా ఉండే అధిక వ్యవసాయ ఖర్చులను మించేటట్లుగా దిగుబడులు గణనీయంగా ఉండాలి.

మూడవది: అలవాటుపడని కొత్త వాతావరణంలో అధికదిగుబడినిచ్చే వంగడాల విత్తనాలు తెగుళ్ళకు గురిఅయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి; పంటసరిగా పండకపోతే అధికపెట్టుబడి ఖర్చుల మూలంగా రైతు రుణభారంతో క్రుంగిపోవచ్చు.

BRAOU

కొత్త సాంకేతిక విజ్ఞానాన్ని 1960 దశకం మధ్యలో భారతదేశంలో ప్రవేశపెట్టారు. ఈ విజ్ఞానం ఆర్థిక లక్షణాల ప్రాముఖ్యాన్ని వ్యవసాయ యాంత్రీకరణ దృష్ట్యానూ, చిన్న, పెద్ద రైతులు దీన్ని సమానంగా అమలు పరచకపోవడం దృష్ట్యానూ, దీన్ని అమలు పరచిన ప్రాంతాలకూ, వ్యక్తులకూ కలిగిన లాభాల దృష్ట్యానూ గమనించవలసిఉంది. గోధుమల విషయంలో తప్ప హరిత విప్లవం వల్ల వ్యవసాయ ఉత్పాదితాల పెరుగుదల రేటులో గణనీయమైన వృద్ధి కనిపించలేదని ఉత్పాదితం గురించి చేసిన పరిశీలనవల్ల తేలింది. శ్రీనివాసన్ అభిప్రాయం ప్రకారం కొత్త సాంకేతిక విజ్ఞానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత గోధుమలు తప్ప ఇతర ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుదల రేటులో చెప్పుకోదగిన మార్పురాలేదు. గోధుమల విషయంలో ఉత్పత్తి పెరుగుదల రేటులో గమనార్హమైన వృద్ధిఉన్నందువల్ల శ్రీనివాసన్ ఈ సాంకేతిక విజ్ఞానాన్ని "గోధుమ విజ్ఞానం" అన్నాడు. హనుమంతరావు అభిప్రాయంలో 1964-65 కూ, 1970-71 కీ మధ్య జరిగిన అదనపు ఉదాత్పాదితంలో 27 శాతం నుండి 41 శాతం దాకా సస్య విప్లవం వల్ల జరిగింది. తక్కిన భాగం (అంటే పెరుగుదలలో అధిక భాగం) 1950 ల నుంచే అంటే సస్య విప్లవం రాకముందు నుంచే పెరుగుతున్న సహజ కారణాలవల్లేకలిగింది అని గ్రహించవచ్చు. జనాభాకూ, భూమికీ గల నిష్పత్తిలో జరిగిన పెరుగుదల ఈ అభివృద్ధిని తగ్గిస్తుంది. అందువల్ల భారతదేశంలోని వ్యవసాయోత్పత్తిలో స్థిరమైన సాంకేతిక పురోగతి జరిగినట్లు ఉత్పాదితాల లెక్కలు సూచించవు.

---

## మీ అవగాహనను పరీక్షించుకొండి — 1

---

1. హరిత విప్లవం అంటేఏమి?
2. సస్య విప్లవం మౌలిక సాంకేతిక లక్షణం ఏమిటి?
3. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలో ఉన్న అంశాలు ఏవి?

---

## 14.3 హరిత విప్లవం పరిమిత ప్రభావానికి కారణాలు

---

ఆదర్శ పరిశోధన పరిస్థితులలో లభించిన ఫలితాల ఆధారంతో మితిమీరిన ఆశలు పెట్టుకోవడమూ, భారతదేశంలో ప్రముఖ ఆహార పంటలైన వరికీ, ఇతర తృణధాన్యాలకూ ఈ విజ్ఞానం వర్తించకపోవడమూ ఉత్పాదకంగా కనిపించే కొత్త సాంకేతిక విజ్ఞానం ఫలితాలు ఆశాభంగం కలిగించడానికి కారణాలు. అంతేగాక అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థలో తయారైన తైచుంగ్‌లాంటి అసాధరణ అధికదిగుబడి వంగడాలకంటే జయ, పద్మలాంటి దేశీయ వంగడాలు స్థానిక పరిస్థితులలో తెగుళ్ళకు తట్టుకోగలిగి ఉన్నాయి. జొన్న, సజ్జ, పప్పుధాన్యాలు, చెరుకు, పత్తి, జనుము పంటలకు అ.ది.వం. విత్తనాలు ఉత్పత్తి చేయడంలో సాంకేతిక పురోగతి ఏదీ జరగనందువల్ల, సస్యవిప్లవ ప్రభావం మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో స్వల్ప భాగానికి మాత్రమే పరిమితమైంది; అది కూడా కొన్ని ప్రాంతాలలో ఆహారేతర పంటలను తగ్గించడం వల్ల జరిగింది కొందరు రైతులు వ్యక్తిగతంగా లాభపడ్డారు. గానీ, ఉత్పత్తి హీనమైన పెరుగుదలరేట్ల వల్ల మొత్తం మీద కలిగే నిర్బంధాలను కొత్త సాంకేతిక విజ్ఞానం సడలించలేదు.

హరిత విప్లవం పరిమిత ప్రభావానికి ఇతర కారణాలు కూడా ఉన్నాయి. పైన చెప్పినట్లు, సిఫారసు చేయబడిన ఉత్పాదితాల మోతాదులను రైతులు వాడరు; ఎందుకంటే వాళ్ళు ఉత్పాదకాల సాపేక్షధరలను లెక్కగట్టి, నష్టం వచ్చే అవకాశాలను పరిహరిస్తారు. అదీగాక, రసాయనిక ఎరువుల డిమాండ్ పూర్తిగా తీరడం లేదు. ఉత్పాదకాలను సమకూర్చలేని అసమర్థత వల్ల కొత్త సాంకేతిక విజ్ఞాన భౌగోళిక వ్యాప్తిని ప్రభుత్వ విధానం పరిమితపరచింది. కానీ, ఉత్పాదితంలో వృద్ధి జరగాలంటే, ఈ సాంకేతిక విజ్ఞానం ఉపయోగించే భూ విస్తీర్ణం పెరగాలి. హరిత విప్లవానికి చాలినంత నియంత్రిత నీటి సరఫరా అత్యంత ముఖ్యం. కాబట్టి మొత్తం సాగుభూమిలో నీటి పారుదలవున్న భూ విస్తీర్ణ భాగం తప్పని సరిగా పెరగాలి. కానీ, వాస్తవాలు దీనికి

వ్యతిరేకంగా ఉన్నాయి. భారతదేశంలో ఆభాగం 33 శాతం ఉంది, అతి మందకొడిగా పెరుగుతున్నది. దీని ఫలితంగా, అధిక దిగుబడి వంగడాల కింద ఉన్న ఆహార ధాన్యాల మొత్తం భూ విస్తీర్ణభాగం 1967-68 కీ 1971-72 కూ మధ్య 5 శాతం నుండి 15 శాతానికి మాత్రమే పెరిగింది. ఈ పెరుగుదల పరిమితంగానూ, ప్రాంతాల మధ్య అసమానతలతోనూ ఉండటానికి కారణం రుతపవనాలు ముఖ్యమైన జలాధారంగా ఉన్నదేశాలలో అధికజలాన్ని ఆపేక్షించే సంవిధానలు ఉపయోగించుకోడానికి ప్రభుత్వం చొరవ తీసుకుంటే పరిస్థితి మెరుగుపడవచ్చు.

## 14.4 వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదల, ఉత్పత్తి అస్థిరత్వము

ఉత్పత్తి స్థాయి అటుంచి, ఉత్పత్తి స్థాయిల అస్థిరత్వ సమస్య భారతీయ పరిస్థితులలో ముఖ్యమైనది. ఉత్పత్తి పెరుగుదలతో పాటు అస్థిరత్వం కూడా పెరిగిందనీ, అంతేకాక, ఉత్పత్తి పెరుగుదలలో అత్యధిక భాగం పైరు విస్తీర్ణం పెరుగుదలవల్లకాక దిగుబడి పెరుగుదలవల్ల కలిగిందనీ గమనించారు. ఉత్పత్తివిషయంలో చాలా మంది సరఫరా అంశాలపాత్రను నొక్కిచెప్పగా కొంతమంది డిమాండ్ నిర్వహించే పాత్రను గుర్తుచేసినారు. వ్యవసాయ ఉత్పత్తి స్థిరంగా పెరుగుతూ ఉండాలంటే, వ్యవసాయ ఉత్పాదితాల కోసం డిమాండ్ కూడా స్థిరంగా పెరుగుతూ ఉండాలి. మనకు ఆహార ధాన్యాల ఎగుమతికి అవకాశం పరిమితంగా ఉండటమే బియ్యము ఉత్పత్తి గోధుమల ఉత్పత్తిలాగా బాగా పెరగకపోవడానికి కారణం. అందుకే దేశంలో ప్రజల ఆదాయాలు బాగా పెరగకపోవడమూ, తత్కారణంగా బియ్యానికి డిమాండ్ బాగా పెరగకపోవడమూను సరఫరా, డిమాండ్ అనే అంశాల పరస్పర చర్య కొత్త సాంకేతిక విజ్ఞానం మరింత విస్తృతంగా అమల్లోకి రాకుండా అడ్డుపడింది. అందువల్ల వ్యవసాయ ఉత్పాదితం మీద దాని ప్రభావాన్ని ఎలా పరిమిత పరిచిందీ అధిక సంఖ్యాకులుగా ఉన్న బీదరైతుల ఆదాయాల హీనవృద్ధి వివరిస్తుంది.

ఉత్పాదితం మీద వాతావరణ ప్రభావాన్ని పరిశీలించకపోతే, వ్యవసాయ ఉత్పాదిత పెరుగుదల మీద, అస్థిరత్వం మీదా చేసే చర్చ అసంపూర్ణంగా ఉంటుంది. ఆహార ఉత్పత్తిక్షీణతకూ, తక్కువ వర్షపాతానికీ, సువ్యవస్థితమైన సంబంధం లేకపోయినప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తి 1966 వర్షాభావపు సంవత్సరంలో రెండు కోట్లటన్నులూ, 1972 వర్షాభావపు సంవత్సరంలో కోటి పది లక్షల టన్నులూ తగ్గిందంటే, ఈ సంవత్సరాలలో వ్యవసాయోత్పాదిత పెరుగుదల మందగించడం కేవలం గణాంకభ్రమ కాదని వెల్లడౌతుంది.

## 14.5 హరిత విప్లవ ప్రభావం

ఉపాధి మీద కొత్త సాంకేతిక విజ్ఞాన ప్రభావం భారతీయ వ్యవసాయ యాంత్రీకరణ సమస్య మీద ఆధారపడుతుంది. విత్తనాల, ఎరువుల సంవిధానం భూమి డిమాండ్ విషయంలో అనుకూలంగా ఉందిగానీ, శ్రమ డిమాండ్ విషయంలో అనుకూలంగాలేదు. నాట్లు వేయడమూ, కలుపు తీయడమూ, ఎక్కువ పంటలు కోతకు రావడమూ శ్రమ డిమాండ్‌ను పెంచేటట్లు ఉన్నప్పటికీ, దిగుబడులను గరిష్టస్థాయికి పెంచేటందుకు రెండు మూడు కార్లు పండే పొలంలో కోతకూ, మలికారు నాట్లకూ మధ్య భూమిని సిద్ధం చేయడానికీ అవసరమైన యాంత్రీకరణ వల్ల శ్రమ డిమాండ్ అదే మేరకు తగ్గుతుంది. ట్రాక్టర్ల, కోత యంత్రాల ధరలు తక్కువగా ఉన్నందువల్లా, పెద్ద రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు ఎక్కువగా దొరకుతున్నందువల్లా యాంత్రీకరణ పెరిగింది. ఏమైనప్పటికీ, యాంత్రీకరణ వల్ల నిరుద్యోగం పెరిగేదీ, తరిగేదీ ముందుగానే ఊహించడం సాధ్యం కాదు. ఇంతవరకు యాంత్రీకరణ విస్తృతంగా జరగలేదనీ, దాని వికరపు ఫలితంగా ఉపాధి స్థాయిలలో గణనీయమైన మార్పు రాలేదని పరిశీలనలు తెలుపుతున్నాయి. హరిత విప్లవం మీద వచ్చిన వాఙ్మయం గ్రామీణ రంగంలో వచ్చిన మార్పులోని పంపిణీ పార్శ్వాలను శ్రద్ధగా పరిశీలించింది. సాంకేతికమైన మార్పు అన్ని ప్రాంతాలలోను సమానంగా రాలేదనీ, ఒకవైపున లాభపడిన ధనిక రైతులకూ, మరొక వైపున

నష్టపడిన బీదరైతులకూ, భూమిలేని కార్మికులకూ మధ్య అంతరం పెరిగిందని విమర్శలు వచ్చినాయి. చిన్న రైతులూ, భూమిలేని కార్మికులూ కొత్త సాంకేతిక విజ్ఞాన పరిస్థితులలో సాపేక్షంగానూ, పరమంగా కూడానూ నష్టపడినట్లు లభ్యమౌతున్న వాస్తవాలు స్పష్టంగా తెలుపుతున్నాయి. పది ఎకరాలూ, ఇంకా ఎక్కువ పొలం ఉన్న రైతులు లాభపడినంతగా బీదరైతులు లాభపడకపోగా, భూమిలేని కార్మికుల స్థితి ఇంకా అధ్వాన్నంగా ఉంది; వీళ్ల వాస్తవ వేతనాలు ఏమీ మెరుగుపడలేదు. అంతేకాక తిండి ధరలు పెరుగుతున్న పరిస్థితులలో వీళ్లకు ధాన్యానికి బదులు నగదు రూపంలో వేతనాలు ఇస్తున్నారు.

## మీ అవగాహనను పరీక్షించుకొండి — 2

4. వ్యవసాయ రంగంలో యాంత్రికీకరణ ఏ విధంగా గ్రామీణప్రాంతాలలో ఉద్యోగితను ప్రభావితం చేస్తుంది?
5. సస్య విప్లవం వల్ల ప్రాంతీయ అసమానతలు తలెత్తునా?

## 14.6 హరిత విప్లవ ఫలితాలు

హరిత విప్లవం విపరీత పంపిణీ ఫలితాలు యాదృచ్ఛికమైనవి కావు. పెద్దరైతులు అధిక ధనవంతులు. అందువల్ల వాళ్ళు మార్కెట్‌లోని లోపాలను వినియోగించుకొని పెట్టుబడినీ, శ్రమనూ అనుకూలమైన ధరలకు సంపాదించుకొని కొత్త సాంకేతిక విజ్ఞానం వల్ల లాభపడగా, బీదరైతులు అధిక ధరలతో అవస్థపడతారు. డబ్బు కొరతతో బాధపడే చిన్నరైతులకు లభ్యంకాని రుణం పెద్ద రైతు సులభంగా సంపాయించుకొని, తత్ఫలితంగా అరుదైన ఉత్పాదకాల మీద గుత్తాధిపత్యము పొందుతారు. భీమా చేసే ప్రభుత్వ విధానమేదీ లేనందువల్ల, బీదరైతు ఎక్కువగా నష్టపోతాడు; నష్టపడినప్పుడు నిలదొక్కుకోడానికి అతనికి నిలవచేసుకున్న డబ్బు ఎప్పుడూ తక్కువగానే ఉంటుంది. అంతేకాక, అ.ది.వం. విత్తనాలూ, ఎరువులూ ధనికరైతులకు సులభంగా దొరకుతాయి; వాటి అధిక ఉత్పాదకతవల్ల వాళ్ళకు అధిక ఆదాయాలువస్తే, అందువల్ల వాళ్ళు మళ్లీ ఎక్కువ పెట్టుబడి పెట్టగలరు.

ప్రాంతీయాభివృద్ధి మీద హరితవిప్లవ అసమఫలితాలు అర్థం చేసుకోవడం మరింత కష్టం. హరిత విప్లవం పంజాబు లాంటి మంచి నీటి సాగుగల గోధుమ ఉత్పాదక ప్రాంతాలకు సౌభాగ్యం చేకూర్చింది. కానీ, మరికొన్ని ప్రాంతాలలో ఉత్పత్తిలో స్థిరమైన పెరుగుదల లేదు. హరిత విప్లవంతో సంబంధం లేకుండా, శీతోష్ణ పరిస్థితులలో వచ్చే మార్పులతో వ్యవసాయోత్పత్తి (ఆహారమైనా, ఆహారేతరమైనా) ఎక్కువగా ప్రభావితమవడమే దీనికి కొంత వరకు కారణం. పంజాబు, గుజరాతు లాంటి సాపేక్షంగా సంపన్నమైన రాష్ట్రాలు తప్ప, అత్యధిక భాగం రాష్ట్రాలు తలసరి ఆహారోత్పత్తి పెరుగుదల రేట్ల విషయంలో ఏమీ సాధించలేదు. పంజాబు, గుజరాతులకంటే గణనీయంగా తక్కువ సాధించిన బీహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర లాంటి పలు బీద రాష్ట్రాలలో ఆహార ధాన్యాల తలసరి ఉత్పాదితాల పెరుగుదల రేట్లుఅసమానంగా కనిపిస్తాయి.

ఆహారోత్పత్తిలో పురోగతి ఏమీ జరగలేదంటే ఆర్థిక వ్యవస్థను ఎదుర్కొనే వేతనాలు, సరుకుల నిర్బంధాన్ని సడలించడానికి పెద్దగా ఏమీ జరగలేదని అర్థం. కానీ, నిర్దిష్ట ప్రాంతాలలో ధనికరైతులు కేవలం స్థానికమైన లాభాలు సంపాదించారు. దీనివల్ల కొద్దిమంది రైతులు విస్తారమైన స్థాయిలో డబ్బు కూడబెట్టుకున్నారు. కానీ, యీ పెరుగుతున్న అసమానతను ఎదుర్కొనడానికి తగినంతగా ఆహార ధాన్యాల లభ్యత పెరగలేదు. అంతేగాక, ఆర్థిక వ్యవస్థ మరింత స్థిరమైన ఉత్పాదిత స్థాయిని సాధించకుండా, నవరులలో వీటికి కీలక పాత్ర ఉంది కాబట్టి ప్రకృతిలోని మార్పులకు అతి సున్నితంగా ప్రభావితమౌతూనే ఉంది. దీనికి తోడు అధికదిగుబడుల కోసం



BRAOU

ఫ్యాక్టరీలలో తయారయ్యే ఉత్పాదకాల మీద, దిగుమతి చేసుకునే ఉత్పాదకాల మీద ఎక్కువగా ఆధారపడడం వల్ల ఎరువులూ, డీజిల్‌నూనె లాంటి ఉత్పాదకాల లభ్యతకు కూడా ఉత్పాదితం మున్నితంగా ప్రభావితమౌతున్నది.

## 14.7 సారాంశం/ముగింపు

సస్యవిప్లవం అంటే ఏమిటో భారతదేశంలో సస్య విప్లవం ఏ విధంగా జరిగిందో తెలుసుకున్నాం. సస్య విప్లవ ప్రాధాన్యతనూ, దేశంలో వ్యవసాయోత్పత్తి పెరగడంలో దాని పాత్రనూ చర్చించాం. భారతదేశంలో హరిత విప్లవం వల్ల పొందిన ప్రయోజనాలను, అసమానతలను కూడా ఈ పాఠంలో వివరంగా తెలుసుకున్నాం. హరిత విప్లవాన్ని 1960వ దశాబ్దంలో మనం సాధించాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయరంగంలో వినియోగించుకొన్నాం. అధికదిగుబడినిచ్చే విత్తనాలను, రసాయనిక ఎరువులను, క్రిమి సంహారక మందులను నీటి పారుదల సౌకర్యాలను, యాంత్రిక పరికరాలను ఉపయోగించడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను, ఉత్పత్తిని గణనీయంగా పెంచవచ్చు. కానీ ఈ పాఠంలో నేర్చుకొన్నట్లు హరిత విప్లవ ప్రభావం గానీ, ఫలితాలుగానీ కొన్ని రాష్ట్రాలకూ, కొన్ని ప్రాంతాలకూ, కొందరు భూస్వాములకూ పరిమితమైనాయి. ప్రాంతీయ అసమానతలు పెరిగాయి.

— డా. ప్రదీప్తా చౌదరి

## 14.8 సంప్రదింపు గ్రంథాలు


| | | |
|---|---|---|
| 1. Datt and Sundaram | : | Indian Economy |
| 2. P.C. Bansal | : | Agricultural Problems of India. |
| 3. Misra and Puri | : | Indian Economy. |


## 14.9 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. *కింది ప్రశ్నలకు, ఒక్కొక్కదానికి సుమారు 30 పంక్తులలో జవాబులు రాయండి.*

1. భారత ఆర్థికాభివృద్ధిలో హరిత విప్లవం పాత్ర ఏమిటి?
2. భారత వ్యవసాయరంగంలో సస్య విప్లవం వల్ల కలిగిన ప్రయోజనాలు అన్ని ప్రాంతాలకూ, వ్యవసాయదార్లందరికీ ఒకే మాదిరిగా (ఏక రూపతగా) లేవు'' అభిప్రాయాన్ని వివరించండి.
3. హరితవిప్లవం అంటే ఏమిటి? దాని లక్షణాలను వివరించండి.

II. *కింది ప్రశ్నలలో ఒక్కొక్కదానికి సుమారు 15 పంక్తులలో జవాబులు రాయండి.*

1. హరిత విప్లవ లక్షణాలను వివరించండి.
2. హరిత విప్లవ పరిమిత ప్రభావానికి గల కారణాలేమిటి?
3. సస్య విప్లవ ఫలితాలను వివరించండి.
4. భారత వ్యవసాయ ఉత్పత్తి మీద సస్య విప్లవం ప్రభావాన్ని వివరించండి.

# భాగం — 15: వ్యవసాయ ధరలు

విషయక్రమం


15. 0 లక్ష్యాలు, ఉద్దేశాలు

15 1 పరిచయం

15. 2 వ్యవసాయ ధరల వ్యవస్థ బాధ్యతలు

15.2.1 ధరల నిర్మాణమూ, వినియోగం

15.2.2 నవరుల కేటాయింపుదారుగా ధర

15.2.3 ఆదాయపు పంపిణీదారుగా ధర

15.2.4 మూలధన కల్పన మీద ధరల మార్పుల ప్రభావం

15. 3 వ్యవసాయ ఉత్పత్తి, ధరలు, ఆదాయం

15. 4 వ్యవసాయ పరుకుల వ్యయాల, ధరల పంఘం

15. 5 భారత ఆహార సంస్థ

15. 6 అమ్మకం కాగల మిగులు, అమ్మకమైన మిగులు

15.6.1 అమ్మకమైన మిగులు–ఆర్థికాభివృద్ధి

15.6.2 అమ్మకం కాగల మిగులును ప్రభావితం చేసే అంశాలు

15.6.3 గణన పమస్యలు

15. 7 సేకరణ ధరలు

15.7.1 సేకరణ ధరలు : ప్రత్యామ్నాయ సూత్రాలు

15.7.2 భారతదేశంలో సేకరణ ధరలు

15. 8 వర్తక నిబంధనలు

15.8.1 వర్తకనిబంధనలు - భావన

15.8.2 భారతదేశంలో వర్తక నిబంధనలు

15. 9 మంచి ధరల విధానానికి సూచనలు

15.10 సారాంశం/ముగింపు

15.11 సంప్రదింపు గ్రంథాలు

15.12 నమూనా పరీక్షా ప్రశ్నలు


B R A O U

## 15.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో వ్యవసాయ పరుకుల ధరల పాత్రను పరిశీలించడం, వ్యవసాయానికి సంబంధించిన విక్రయం కాగలమిగులు, విక్రయమైన మిగులు, సేకరణ ధరలు, వర్తక నిబంధనలు వంటి భావనలను వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

ఈ భాగాన్ని చదివిన తర్వాత మీరు

★ వ్యవసాయ పరుకుల ధరల ప్రాధానతను గుర్తించగలరు.

★ వ్యవసాయ పరుకుల వ్యయాలు, ధరల పంఘపు ఆవశ్యకతను చర్చించగలరు.

★ భారత ఆహార సంస్థ బాధ్యతలను వివరించగలరు.

★ విక్రయం కాగల మిగులు, విక్రయమైన మిగులు భావాలను గుర్తించి ఆర్థికాభివృద్ధిలో వాటి పాత్రను తెలుపగలరు.

★ సేకరణధరల నిర్ణయంలో ఉపయోగించిన నిర్ణయ ప్రమాణాన్ని గ్రహించగలరు.
★ వర్తక నిబంధనలు అనే భావనను విశ్లేషించగలరు.

## 15.1 పరిచయం

వ్యవసాయరంగం జాతీయాదాయంలో గణనీయమైన భాగాన్ని సమకూర్చే అనేక దేశాలలో వ్యవసాయ పరుకుల ధరలు ఆర్థికవ్యవస్థలో లభ్యమయ్యే వనరుల కేటాయింపును ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తూ, ఆర్థికాభివృద్ధి గతినీ, స్వభావాన్ని రూపుదిద్దడంలో ముఖ్య పాత్రను నిర్వహిస్తాయి. వ్యవసాయేతరపరుకుల ధరల నిర్ణయమూ, వాటి సాపేక్ష గమనాలూ పలుశక్తులతో ప్రభావితమౌతాయి. సేకరణ ధరలూ, మద్దతు ధరలూ నిర్ణయించే ప్రభుత్వ విధానాలూ, ఉత్పాదకులకు ఇచ్చే ప్రోత్సాహకాలూ, ధరల నియంత్రణలూ (కంట్రోళ్ళు), రైతుల ప్రయోజనాల మీద వాటి చర్యా - ఇవి వ్యవసాయ పరుకుల ఉత్పత్తినీ, పంపిణీనీ, వాటి ధరలనూ చాలా వరకు ప్రభావితం చేస్తాయి. అమ్మకం కోసం లభించే సంస్థాగతమైన రుణసౌకర్యాలు కూడా ధరలను ప్రభావితం చేస్తాయి.

## 15.2 వ్యవసాయ ధరల వ్యవస్థ బాధ్యతలు

డిమాండ్‌కూ, సరఫరాకూ మధ్య సమతూకాన్ని నెలకొల్పే ప్రక్రియే ధరల నిర్ణయం. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో దేశవనరులను వివిధ కార్యకలాపాలకుకేటాయించడానికి ధరల వ్యవస్థ ముఖ్యమైన సాధనం. పోటీ, ఆర్థిక వ్యవస్థలో ధర నాల్గు ప్రధాన ప్రక్రియలను నిర్వహిస్తుంది. 1. పరుకుల, సేవల వినియోగానికి ధర దర్శకత్వం వహిస్తుంది. వివిధ పరుకుల, సేవల సాపేక్షధరలనూ, అవి ఇచ్చే సంతృప్తినీ లెక్కలోకి తీసుకొని, ఏది కొనవలసిందీ, దేనికోసం ఎంత ఆదాయం ఖర్చు చేయవలసిందీ నిర్ణయించుకోవడంలో ధర వినియోగదారునికి తోడ్పడుతుంది.

2. ఉత్పత్తి ప్రక్రియలో వనరుల వినియోగానికి కూడా ధర దర్శకత్వం వహిస్తుంది. ధరలను పరిశీలించిన తరువాత వ్యవసాయ ఉత్పాదకుడు దేన్ని ఉత్పత్తి చేయవలసిందీ, ఎంత ఉత్పత్తి చేయవలసిందీ నిర్ణయించుకుంటాడు.

3. ఉత్పాదక వనరుల సొంతదారుల మధ్య ఆదాయాన్ని పంపిణీ చేయడానికి ధరతోడ్పడుతుంది. ధరల మార్పులవల్ల ఆదాయాలూ, ఆస్తి విలువలూ పునః పంపకమై, వివిధ పర్యవసానాలకు దారితీస్తాయి.

4. దేశంలో పెట్టుబడి ఏర్పాటును ధర ప్రభావితం చేస్తుంది. ఈ విధంగా భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశం అభివృద్ధి ప్రక్రియలో వ్యవసాయ పరుకుల నిర్ణయం ఒక ముఖ్యమైన భాగం.

### 15.2.1 ధరల నిర్మాణమూ, వినియోగం

వినియోగదారులకు బజారులో అనేక వ్యవసాయ ఉత్పాదితాలు కనిపిస్తాయి. వాటిలో కొన్ని ప్రత్యామ్నాయ పరుకులు ఉంటాయి. వినియోగదారుడు తన పరిమిత ఆదాయంతో ప్రతి వస్తువునూ తనకు కావలసినంత కొనలేడు. కాబట్టి లభ్యమయ్యే పరుకులలో తనకు గరిష్ఠ సంతృప్తినిచ్చే పరుకుల సమ్మేళనాన్ని కొంటాడు.

### 15.2.2 వనరుల కేటాయింపు దారుగా ధర

వ్యవసాయ పరుకులలోని వనరులను తిరిగి కేటాయించడంలో వివిధ వ్యవసాయ పరుకుల సాపేక్ష ధరలలో వచ్చే మార్పులకు ప్రముఖమైన పాత్ర ఉంది. ధరల మార్పుల వల్ల ఆ పరుకుల సరఫరాలో పెద్ద మార్పులు 

BRAOU

వచ్చినాయని ఉత్తర ప్రదేశ్‌లో చక్కెరను గురించి, పంజాబ్‌లో పత్తిని గురించి జరిపిన పరిశీలనల ద్వారా తేలింది. (అంటే వాటి సరఫరా ప్రతిస్పందనలు ఎక్కువగా ఉన్నాయి). ఈ పరిస్థితులలో, వ్యవసాయ ఉత్పాదితాలకన్నిటికీ స్థితిస్థాపకతలు ఎక్కువగా ఉంటాయని సాపేక్షంగా ఉన్నతమైన సరఫరా ప్రతిస్పందనలనుబట్టి మనం ఊహించవచ్చు.

చక్కెర, పత్తి, జనుము, పొగాకు మొదలైన వాణిజ్య పంటలకంటే మౌలిక ఆహార పంటలైన గోధుమకూ, వరికీ చాలా తక్కువ సరఫరా స్థితిస్థాపకం ఉందనేది అందరూ అంగీకరించిన విషయమే. దీనికి కారణం సరళమైనదే. ప్రముఖ ధాన్యం పంటలు మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో చాలా పెద్దభాగంగా ఉన్నాయి. కాబట్టి అవి సాపేక్ష ధరలకు మొత్తం ఉత్పత్తిలాగ ప్రతిస్పందిస్తాయి. అందువల్ల వాటికి ఉన్న స్థితిస్థాపకతలు తక్కువ. ఒక జిల్లాలోని మొత్తం సాగుభూమిలో 5 శాతం గల పంటకు మొత్తం వ్యవసాయ ఉత్పత్తికంటే ఎక్కువ స్థితిస్థాపక సరఫరా ప్రతిస్పందనా ఉంటుందని ఊహించవచ్చు. సాగుభూమిలో 95 శాతం పంటకు ఆ గుణం ఉండడం సాధ్యముకాదు. చిన్న పంట పెద్ద పంట విస్తీర్ణాన్ని తగ్గించి, తన విస్తీర్ణాన్ని రెండరెట్లకూ, మూడు రెట్లకూ సులభంగా పెంచుకోగలదు. పెద్ద పంట అలా చేయలేదు.

సాధారణంగా, ధరల మార్పులకు మొత్తం వ్యవసాయ ఉత్పత్తి సరఫరా ప్రతిస్పందన తక్కువగా ఉంటుంది. సాంప్రదాయిక వ్యవసాయంలో మరీ తక్కువగా ఉంటుంది. కొని ఉపయోగించే ఉత్పాదకాలు తక్కువగా ఉండడమూ, శ్రమ వనరులను వ్యవసాయ రంగం నుండి ఇతర రంగాలకూ, ఇతర రంగాలనుండి వ్యవసాయ రంగానికీ బదలాయించడానికి అవకాశం తక్కువగా ఉండటమే ఇందుకు కారణం.

### 15.2.3 ఆదాయపు పంపిణీదారుగా ధర

వ్యవసాయ సరుకుల ధరలలో మార్పులు వచ్చినప్పుడు, ఆర్థిక వ్యవస్థలోని వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలలో ఒకదాని నుండి మరొకదానికి ఆదాయం మారుతుంది. అది అధిక ఆదాయం, అల్ప ఆదాయం గల వ్యక్తుల మధ్య జరిగే ఆదాయపు పంపిణీని కూడా మారుస్తుంది. వ్యవసాయ సరుకుల ధరల పెరుగుదల తక్కువాదాయ పట్టణ వినియోగదారుల ఆదాయాన్ని తగ్గించి, అధిక ఆదాయ వ్యవసాయ ఉత్పాదకుల ఆదాయాన్ని పెంచుతుంది.

వ్యవసాయ సరుకల ధరలలో వచ్చే మార్పులు వ్యవసాయదారులు అమ్మే వ్యవసాయ సరుకులకు అనుగుణంగా వాళ్ల ఆదాయాలను ప్రభావితం చేస్తాయి.

సాధారణంగా, తమ ఉత్పాదితంలో స్వల్ప భాగాన్ని అమ్మే రైతులకు తక్కువ ఆదాయం వస్తుంది. తన మొత్తం ఉత్పాదితంలో (90 శాతం సొంత ఉపయోగానికి వుంచుకొని) 10 శాతం మాత్రమే అమ్మే రైతుకు, వ్యవసాయ సరుకుల ధరలు సాపేక్షంగా 10 శాతం పెరిగినపుడు, నిజమైన ఆదాయం ఒక శాతం మాత్రమే పెరుగుతుంది. కానీ, తన మొత్తం ఉత్పాదితంలో 90 శాతం అమ్మే రైతుకు అదే పరిస్థితులలో ఆదాయం 9 శాతం పెరుగుతుంది.

స్థూలంగా, వినియోగదారుల పరిస్థితి దీనికి వ్యతిరేకంగా ఉంటుంది. ఆహార పదార్థాల ధరలు పెరిగినప్పుడు, అనుభోక్తలు వ్యవసాయ సరుకుల మీద ఖర్చు పెట్టే తమ ఆదాయాలకు అనుగుణంగా వాళ్ళ నిజమైన ఆదాయాలు తగ్గుతాయి. ఆహారం కోసం తమ ఆదాయంలో ఎక్కువ భాగాన్ని ఖర్చు పెట్టే అల్పాదాయ పట్టణ వినియోగదారులకంటే ఎక్కువగా ప్రభావితులౌతారు. ఉదాహరణకు, ఆహారం కోసం తన ఆదాయంలో 70 శాతం ఖర్చు పెట్టే అల్పాదాయ వినియోగదారునికి, ఆహార పదార్థాల ధరలు 10 శాతం పెరిగినప్పుడు, నిజమైన ఆదాయం 7 శాతం తగ్గుతుంది. ఆహారం కోసం తన ఆదాయంలో 20 శాతం మాత్రమే ఖర్చుపెట్టే అధికాదాయపు పట్టణ వినియోగదారునికి అదే పరిస్థితిలో నిజమైన ఆదాయం 2 శాతం మాత్రమే తగ్గుతుంది. అధిక ఆదాయపు వ్యక్తి అల్పాదాయవ్యక్తికంటే ఎక్కువ మొత్తం డబ్బు ఆహారం కోసం ఖర్చుపెట్టే మాట నిజమే. అందువల్ల, ఆహార పదార్థాల ధరలలో నిర్దిష్టమైన మార్పు వచ్చినప్పుడు, అల్పాదాయ వ్యక్తి కంటే అధికాదాయ వ్యక్తికి నిజమైన ఆదాయంలో పరమైన మార్పు ఎక్కువ ఉంటుంది.

BRAOU

## 15.2.4 మూలధన కల్పన మీద ధరల మార్పుల ప్రభావం

వ్యవసాయ పరుకుల ధరల పెరుగుదం వ్యవసాయ రంగంలో అధిక పెట్టుబడిని ప్రోత్సహిస్తుంది. అది రెండు విధాలుగా ఆ పని చేస్తుంది. అధికాదాయ వ్యవసాయదారులకూ, స్వల్పాదాయ వ్యవసాయ దారులకూ సమానంగా వర్తించడం ఒక విధం. అధిక ఆదాయపు వ్యవసాయదారులకు అనుకూలంగా పనిచేయడం మరొక విధం.

అధిక ధరలు ఉత్పాదిత విలువను పెంచి పెట్టుబడి మీద వచ్చే ప్రతి ఫలాన్ని పెంచుతాయి. అధిక పెట్టుబడి వల్ల వచ్చిన ఉత్పాదితమంతా అమ్మకమౌతుందనీ, పెట్టుబడి మీద వచ్చే అదనపు స్థూల ప్రతిఫలం ధరల పెరుగుదలకు అనుగుణంగా ఉంటుందిన ఊహించవచ్చు. స్వల్పాదాయరైతులు అదనపు పెట్టుబడివల్ల కలిగిన అదనపు ఉత్పాదితమంతటినీ అమ్మకుండా కొంత భాగం మాత్రమే అమ్ముతారు. అందుకే సాపేక్షధరల మూలంగా వాళ్ళ నిజమైన ప్రతిఫలాలు అధికాదాయరైతుల ప్రతిఫలాలకంటే కొంత తక్కువగా పెరుగుతాయి.

వ్యవసాయ రంగంలోని పెట్టుబడి మీద అధిక ధరల రెండవ ప్రభావం ఆదాయ ఫలితం ద్వారా జరుగుతుంది. పెరిగిన ఆదాయాలు, రైతుల రుణయోగ్యతను పెంచి, తత్ఫలితంగా రుణదాతలు ఎక్కువ మొత్తాలు రుణంగా ఇచ్చేటట్లు ప్రోత్సహిస్తాయి. ఈ ప్రభావం ఆదాయ ఫలితానికి సూటిగా, అనుగుణంగా ఉంటుంది. ఆదాయ ఫలితం అమ్మకాల మీద ఆధారపడుతుంది. తమ ఉత్పాదితాలలో స్వల్ప భాగం మాత్రమే అమ్మే రైతులకు వాళ్ళ ఆదాయంలో తదనుగుణమైన స్వల్పవృద్ధి మాత్రమే లభిస్తుంది. తత్ఫలితంగా పెట్టుబడి పెట్టడనికి వాళ్ళశక్తిచాలా స్వల్పంగా పెరుగుతుంది.

వ్యవసాయ పరుకుల ధరల పెరుగుదలకు పారిశ్రామిక పెట్టుబడిని నిరుత్సాహపరిచే ధోరణి ఉంది. ఆహార పదార్థాల ధరల పెరుగుదల కార్మికులకు డబ్బు రూపంలో ఇచ్చే వేతనాలు పెరగడానికి కారణమౌతుంది. వేతనాల పెరుగుదల పారిశ్రామిక లాభాలను తగ్గించి, లాభాలు తగ్గినందువల్ల పెట్టుబడి పెట్టడానికి ప్రేరణను తగ్గించడమే కాక, లాభాలనిధి తగ్గినందువల్ల పెట్టుబడి పెట్టగల శక్తిని కూడా తగ్గిస్తుంది.

పట్టణ కార్మికులకు సబ్సిడీ ఆహారం సమకూర్చే విధానం పారిశ్రామిక లాభాలనూ, పెట్టుబడి ఏర్పాటునూ పెంచుతుంది. సబ్సిడీ ఆహారం పట్టణ ప్రాంతాలలో జీవన వ్యయాన్ని తగ్గించి, మరికొంతమంది శ్రామికులను పట్టణాలలోకి ఆకర్షించి, పట్టణాలలో శ్రమ చౌకగా లభించేటట్లు చేస్తుంది.

వ్యవసాయ పరుకుల ధరల పెరిగితే, గ్రామీణ ఆదాయాలు పెరగడం వల్ల పారిశ్రామిక పరుకులకు డిమాండ్ పెరిగి తద్వారా పారిశ్రామిక పెట్టుబడికి ప్రోత్సాహం లభిస్తుందని అనిపించవచ్చు. కానీ వాస్తవంలో వ్యవసాయ పరుకుల అధికధరలు వ్యవసాయ పరుకుల అమ్మకాలకు అనుగుణంగా, ఆదాయాన్ని వ్యవసాయేతర రంగం నుండి వ్యవసాయరంగానికి బదలాయించడం తప్ప మరేమీ చేయవు.

## 15.3 వ్యవసాయ ఉత్పత్తి, ధరలూ, ఆదాయం

వ్యవసాయ ఆదాయం ధరల స్థాయిమీదా, ఉత్పత్తి స్థాయి మీద ఆధారపడుతుంది. వ్యవసాయాదాయపెరుగుదల వ్యవసాయ, వ్యవసాయేతర పరుకుల సాపేక్ష ధరల మార్పువల్లనైనా జరగవచ్చు. వ్యవసాయరంగంలో దిగుబడులు పెరగడం వల్ల నైనా జరగవచ్చు. మొదటి మార్పు ఆర్థికాభివృద్ధికి స్వల్పంగా మాత్రమే తోడ్పడగా, రెండవది చాలా గణనీయంగా తోడ్పడుతుంది.

ఉత్పత్తి విస్తృతీ, ధరల స్థాయి తరచుగా పరస్పర వ్యతిరేకంగా పని చేస్తూ, ఒక దాని ప్రభావాన్ని మరొకటి పరిహరించవచ్చు. ఈ పరిహారపు స్వభావమూ, విస్తృతీ డిమాండ్ ధరల స్థితి స్థాపకతమీదా, అమ్మకమయ్యే అదనపు పరుకు మీద ఆధారపడతాయి.

## 15.4 వ్యవసాయ సరుకుల వ్యయాల్సు, ధరల సంఘం (Commission on Agricultural Costs and Prices)

అఖిలభారత ప్రాతిపదిక మీద ఆహారధాన్యాలకు ఉత్పాదకుల ధరలనూ, టోకు వర్తకులకూ, చిల్లర వర్తకులకూ సమంజసమైన లాభాలనూ, వినియోగ ధరలనూ నిర్ణయించే సమస్య మీద సలహా ఇచ్చేందుకు 1964లో భారతప్రభుత్వం యల్.కె.ఝా అధ్యక్షతన ఆహార ధాన్యాల ధరల కమిటీని నియమించింది. నిరంతరం అలాంటి సలహా యిచ్చేందుకు తగిన విచారణాంశాలను ఒక సంస్థకు సూచించే పనిని కూడా ఆ కమిటీకే అప్పగించారు. దాని పర్యవసానంగా 1965లో వ్యవసాయ సరుకుల ధరల కమీషన్‌ను నెలకొల్పారు. దానినే ప్రస్తుతం "వ్యవసాయ సరుకుల వ్యయాలు, ధరల సంఘం" (Commission on Agricultural Costs and Prices) గా మార్చారు. వ్యవసాయ ధరలను నిర్ణయించేటప్పుడు వ్యయాలను కూడా దృష్టిలో వుంచుకోవాలనే ఉద్దేశంతో పేరు మార్చారు. ఉత్పాదకుల ప్రయోజనాలనూ, వినియోగదారుల ప్రయోజనాలనూ లెక్కలోకి తీసుకొని, వ్యవసాయ సరుకుల ధరల విధానం మీద ప్రభుత్వానికి సలహాయిచ్చేంటందుకు ఆ కమీషన్ని నెలకొల్పారు. అది కింది విషయాలను దృష్టిలో పెట్టుకోవలసి ఉంటుంది.

1) మెరుగైన సాంకేతిక విజ్ఞానాన్ని అనుసరించడానికీ, ఉత్పత్తిని గరిష్ట స్థాయికి పెంచడానికీ ఉత్పాదకునికి : ప్రోత్సాహకం సమకూర్చవలసిన అవసరం మొదటిది.

2) భూమి, ఇతర ఉత్పత్తి వనరులా హేతుబద్ధంగా వినియోగమయ్యేటట్లు చూడవలసిన అవసరం రెండవది

3) ధరల విధానానికి తక్కిన ఆర్థిక వ్యవస్థమీద, ముఖ్యంగా జీవన వ్యయం మీదా, వేతన స్థాయి మీదా, పారిశ్రామిక ధరల నిర్మాణం మీదా వుండే ప్రభావాల్ని పరిశీలించడం మూడవది.

ఉత్పాదితం పెరిగినప్పుడు ధరలు విపరీతంగా పడిపోకుండా భీమాలాగా పనిచేసేటట్లు కనీస మద్దతు ధరలను కమిషను సాధారణంగా సిఫారసు చేస్తుంది. అంతేగాక, ధాన్యాలను ప్రభుత్వం ఫలానా ధరలకు సేకరించాలని సేకరణ ధరలను కమిషను నిర్ణయిస్తుంది. ధాన్యం నిలవచేయడమూ, సంపకంచేయడమూ లాంటి సంబంధిత విషయాల మీద కూడా అది సలహాలు ఇస్తుంది.

## 15.5 భారతఆహార సంస్థ

1965లో స్థాపించిన భారత ఆహార సంస్థ ఆహార ధాన్యాల కొనుగోలునూ, నిలవనూ, రవాణానూ, ప్రధానంగా పబ్లిక్ పంపిణీ వ్యవస్థ ద్వారా వాటి పంపిణీనీ, అమ్మకాన్నీ నిర్వహిస్తుంది. అది భిన్న రాష్ట్రాలలో పలు ప్రాంతీయ, జిల్లా కార్యాలయాలను నెలకొల్పింది. అది ఆహార ధాన్యాల దిగుమతి పట్ల శ్రద్ధ వహించడమేకాక, కొన్ని బియ్యం మిల్లులనూ, వడ్లను ఆరబెట్టే యంత్రాలనూ నిర్వహిస్తున్నది.

1969లో ఆహార శాఖను బదలాయించడంలో భారత ఆహార సంస్థ ఆహార ధాన్యాలలో ప్రభుత్వ వ్యాపారానికి భారత ప్రభుత్వపు ఏకైక సంస్థ అయింది. సేకరణ చర్యలు ప్రతి సంవత్సరమూ పరిమాణంలో పెరుగుతున్నాయి. 1983-84లో అది ఆహార ధాన్యాలను ప్రధానంగా గోధుమలూ, బియ్యమూ రికార్డు స్థాయిలో సుమారు ఒకటిన్నర కోటి టన్నులను సేకరించింది.

భారత జనుము సంస్థ, భారత పత్తి సంస్థ కూడా దాదాపు భారత ఆహార సంస్థ పద్ధతుల మీదనే నడిచే ముఖ్యమైన సంస్థలు. అవి ఎగుమతులనూ, దిగుమతులనూ కుడా నిర్వహిస్తాయి.

BRAOU

## 15.6 విక్రయంకాగల మిగులు, విక్రయమైన మిగులు

అభివృద్ధిలో కీలకమైన పాత్ర నిర్వహించేది వ్యవసాయ ఉత్పత్తి ఒకటేకాదు, అమ్మకం కోసం అది సృష్టించే మిగులు కూడా ముఖ్యమైనదని గమనించాలి.

అమ్మకంకాగల మిగులుఅంటే, ఉత్పాదకుని కుటుంబ అవసరాలూ, వేతనాలూ, తప్పనిసరిగా వ్యర్థమయ్యేదీ - అన్నీ పోగా సిద్ధాంతరీత్యా అమ్మకానికి లభ్యమయ్యే మిగులు ఉత్పాదితం. దానికి భిన్నంగా అమ్మకమయ్యే మిగులు అంటే, అమ్మకం కాగల మిగులులో వాస్తవంగా అమ్మకమయ్యే భాగం. వాణిజ్య వ్యవసాయదారుని విషయంలో అమ్మకమయ్యే మిగులు అమ్మకం కాగల మిగులుకంటే ఎక్కువగా ఉండవచ్చు; ఎలాగంటే అతను తన మొత్తం ఉత్పాదితాన్ని అమ్మేసి, తన ఆహార అవసరాలను బజారులో కొనవచ్చు. స్వయం పోషక వ్యవసాయదారుడు తన ఉత్పాదితంలో అతిస్వల్పభాగాన్ని మాత్రమే అమ్మవచ్చు. తరచుగా దురవస్థ అమ్మకాల మూలంగా స్వయం పోషక వ్యవసాయదారుల అమ్మకమయ్యే మిగులు పెరగవచ్చు. కానీ ఇది పైకి కనిపించేది మాత్రమే ఎందుకంటే, వాళ్ళు మళ్ళీ బజారులో కొంటారు. ఒకోసారి, ధరలు ఇంకా పెరుగుతాయనే ఆశతో సరుకును నిలువ చేయడం వల్ల అమ్మకమయ్యే మిగులు తగ్గవచ్చు. ఇదికూడా పైకి కనిపించేదే. ఎందుకంటే, నిలువ చేసిన సరుకు ఎప్పుడో ఒకోసారి అమ్మకం కాక తప్పదు. కాబట్టి నిజంగా అమ్మకమయ్యే మిగులు ఏమిటంటే, పట్టణ ప్రజలూ, వ్యవసాయేతర గ్రామీణ ప్రజలూ కొనేది.

### 15.6.1 విక్రయమైన మిగులు — ఆర్థికాభివృద్ధి

భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో, అమ్మకమయ్యే మిగులు పెరుగుదల దేశ ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర నిర్వహిస్తుంది.

1. అమ్మకమయ్యే మిగులు పెరిగితే, వ్యవసాయరంగంలో పని చేసే కార్మికులు వ్యవసాయేతర రంగంలోకి మారడానికి వీలు ఉంటుంది.
2. అమ్మకమయ్యే మిగులు పెరిగితే, నికర ఆదాయాలు పెరగడం వల్ల వ్యవసాయరంగంలో పెట్టుబడి ఏర్పడడానికి అవకాశముంటుంది.
3. అమ్మకమయ్యే మిగులును ఎగుమతిచేస్తే, సత్వర పారిశ్రామికీకరణకు అవసరమైన యంత్రాలవంటి పెట్టుబడి సరుకులను దిగుమతి చేసుకోడానికి అది తోడ్పడుతుంది.
4. అమ్మకమయ్యే మిగులు పెరిగితే, వ్యవసాయ రంగంలో ప్రజల జీవన ప్రమాణం పెరుగుతుంది.
5. అమ్మకమయ్యే మిగులు పెరిగితే, పారిశ్రామిక సరుకులకు డిమాండ్ పెరిగి, పారిశ్రామిక పురోగతికి దారితీస్తుంది.

వ్యవసాయ ఉత్పత్తిలోని మిగులును బదలాయించడానికి అత్యంత ముఖ్యమైన మార్గం ధరల యంత్రాంగం. భూమిశిస్తూ, నీటి తీరువాలూ ధాన్యం రూపంలో వసూలు చేయవచ్చు. ప్రభుత్వం తగిన సంఖ్యలో నియంత్రిత మార్కెట్లు నెలకొల్పి, వ్యవసాయ సరకులమ్మే రైతులను దళారులబారినుండీ, మోసాల నుండీ రక్షించవచ్చు.

### 15.6.2 విక్రయం కాగల మిగులును ప్రభావితం చేసే అంశాలు

అమ్మకం కాగల మిగులు పరిమాణం ఒక ప్రాంతంలో ఉన్నట్లు మరొక ప్రాంతంలో ఉండదు. ఒక పైరుకు ఉన్నట్లు, మరొక పైరుకు ఉండదు. ఒక రైతుకు ఉన్నట్లు మరొక రైతుకు ఉండదు. ముఖ్య నిర్ణాయకాలలో కొన్ని ఇవి:

1. ఉత్పత్తి స్థాయి
పండించే పైర్ల సంఖ్య ఒక కీలకమైన నిర్ణాయకాంశం. పొలంలో రెండు పైర్లు, మూడు పైర్లు పండిస్తే అమ్మకం కాగల మిగులు పెరుగుతుంది.



BRAOU

2. పొలం పరిమాణం (విస్తీర్ణం)
సాధారణంగా అమ్మకమయ్యే మిగులులో అత్యధిక భాగం పెద్ద పొలాల నుండీ మధ్యరకం పొలాల నుండీ వస్తుంది. చిన్న పొలాలూ, ఉదర పోషకపోలాలూ సమకూర్చేది అతి స్వల్పం.

3. వినియోగం అలవాట్లు
పంజాబు, హర్యానా రైతులలో అత్యధిక భాగానికి ప్రధాన ఆహారం గోధుమ కాబట్టి వాళ్ళు దాదాపు తమ వరి పంటనంతటినీ అమ్ముతారు. భారతదేశంలో బియ్యం పండించే భాగంలో దీనికి వ్యతిరేకంగా జరుగుతుంది.

4. పండించే పంటల స్వభావం
సాధారణంగా, ఆహారపు పంటలతో పోలిస్తే నగదు పంటలలో ఎక్కువ భాగం అమ్మకమౌతాయి. దీనికి తోడుగా నిర్దిష్ట ధాన్యాల ధరల స్థాయీ, రైతులనగదు అవసరాలూ అమ్మకమయ్యే మిగులు పరిమాణాన్ని నిర్ణయించడంలో సహాయపడతాయి.

### 15.6.3 గణన సమస్యలు

అమ్మకం కాదగిన మిగులునూ, అమ్మకమయ్యే మిగులునూ వాస్తవంగా కొలవడంలో అనేక సమస్యలు ఎదురౌతాయి. నిరుటి వసూలులో ఎంతభాగం అమ్మకం కాకుండా నిలువవున్నదీ ఈ ఏడాది ప్రారంభంలో గుర్తించడం కష్టం. విత్తనాల అవసరాలు కూడా ఏడాదికేడాదికీ మారుతాయి. ఉదాహరణకు, నారుమడులలో నారు మొలవకపోతే, మళ్ళీ నారుపోయవలసి ఉంటుంది.

వ్యవసాయ ఖర్చులూ, నగదు రూపంలోనూ, ధాన్యం రూపంలోనూ చేసే చెల్లింపులూ వివిధ రైతుకుటుంబాల వినియోగావసరాలూ-వీటికి సంబంధించిన లెక్కలు వెంటనే లభ్యం కావు. ఈ కారణాల వల్ల కూడా అమ్మకం కాగల మిగులును అంచనావేయడము కష్టమౌతుంది.

సాధారణంగా ఆహార ధాన్యాల మొత్తం ఉత్పత్తిలో సగటున మూడింట ఒక భాగం అమ్మకం కాదగిన మిగులుగా వుంటుందని అధికారవర్గాలు తెలుపుతున్నాయి. బియ్యం 32%, గోధుమలు 35%, చిరుధాన్యాలు 25% నగదు పంటల విషయంలో 90% దాకా కూడా అమ్మకం కాదగిన మిగులుగా ఉంటుంది.

---

**మీ అవగాహనను పరీక్షించుకోండి — 1**

---

1. విక్రయం కాగల మిగులు అంటే ఏమిటి?
2. విక్రయమైన మిగులు అంటే ఏమిటి?

---

## 15.7 సేకరణ ధరలు

---

వరి, గోధుమ లాంటి ప్రధానమైన పంటలకన్నిటికీ భారతప్రభుత్వం దేశమంతటికీ ఒకే రకంగా కనీస మద్దతు ధరలనూ, అమ్మకం ధరలనూ నిర్ణయిస్తున్నది. కొన్ని రాష్ట్రాలు భారత ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధరలకు మరింకొంత చేర్చి రైతులకు అదనపు ప్రోత్సాహకాలు కల్పించడానికి ముందుకువస్తున్నాయి. అలాంటి రాష్ట్రాలలో వాస్తవ సేకరణ ధరలు పెరుగుతాయి.

### 15.7.1 సేకరణ ధరలు : ప్రత్యామ్నాయ సూత్రాలు

వివిధ ఆహార ధాన్యాల సేకరణ ధరలు నిర్ణయించడంలో భారతదేశంలో సాధారణంగా వ్యవసాయ ఖర్చుల సూత్రాన్ని అనుసరిస్తున్నారు. ఇతర దేశాలలో కొన్ని ప్రత్యామ్నాయ సూత్రాలను అనుసరిస్తున్నారు.

1. సమానతా సూత్రం.
2. పంటల మధ్య సమానత అనే సూత్రం.
3. బజారు ధరల సూత్రం.

సమానత అంటే, ఉత్పాదకాలకూ, తమ కుటుంబ వినియోగ సరుకులకూ రైతులు చెల్లించే ధరలకూ, రైతులకు లభించే సేకరణ ధరలకూ మధ్య సముచితమైన సంబంధం ఉండడం. మొదటి పద్ధతి రెండవ దానికంటే సరళమైంది.

పంటల మధ్య సమానత అనే సూత్రం వివిధ పంటల ధరల మధ్య ఉచితమైన సంబంధాన్ని నెలకొల్పవలసిన అవసరాన్ని నొక్కి చెప్తుంది. ఈ సూత్రం దేశంలో పండే వివిధ పంటల, భూముల మధ్య కేటాయింపు సక్రమంగా ఉండేటట్లు చేస్తుంది.
బజారు ధరల సూత్రం ప్రస్తుతధరలను ఇటీవలి కాలంలో ఉన్న బజారు ధరలతో ముడిపెడుతుంది. నిర్దిష్టకాలంలో సరఫరా, డిమాండ్‌లలో వచ్చే సాపేక్షమార్పులను - ప్రస్తుత ధరలనూ, భావి ధరలనూ నడిపించే మార్పులను ఈ పద్ధతి ఆచరణాత్మక దృష్టితో పరిగణిస్తుంది.

### 15.7.2 భారతదేశంలో సేకరణ ధరలు

పంటల ఉత్పత్తి ఖర్చు భారతదేశంలో వివిధ ప్రాంతాలలోనూ, వివిధ రాష్ట్రాలలోనూ ఒకే విధంగా లేదు. ఒక పంటకు దేశమంతటా ఒకే ధర నిర్ణయిస్తే, తక్కువ సారవంతమైన భూములకూ, అసమర్థత వల్ల పంట పండని భూములకూ ఆ ధర గిట్టుబాటుకాదు. చిన్న రైతులకూ, వెనుకబడిన ప్రాంతాల రైతులకూ నష్టం రావచ్చు. దాని ఫలితంగా వాళ్ళు ధాన్యం పంటలు మానుకొని, నగదు పంటలకు మారితే, మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గిపోవచ్చు.

ఆహార సరుకుల ధరల మీద ప్రభుత్వ నియంత్రణ ఉన్నప్పటికీ, దాదాపు అన్ని ఆహారధాన్యాలకు నిర్బంధ మార్కెట్టు ధరలు 1975 తర్వాత తీవ్రంగా పెరిగాయి. ఈ పరిణామం సేకరణ ధరలను కూడా తగు విధంగా పెంచవలసిన అవసరాన్ని సూచిస్తుంది.

వ్యవసాయ ఉత్పాదకాల ధరలు తీవ్రంగా పెరిగినందువల్ల సేకరణధరలను గణనీయంగా పెంచవలసిన అవసరం ఎంతైనా ఉంది.

---

మీ అవగాహనను పరీక్షించుకొండి — 2

---

3. "సేకరణ ధరలు" అనే భావనను తెలపండి.

---

## 15.8 వర్తక నిబంధనలు (Terms of Trade)

---

### 15.8.1 భావన

వర్తక షరతులు అనేది వ్యవసాయరంగం అమ్మే వ్యవసాయ సరుకులూ, కొనే పారిశ్రామిక సరుకులూ సాపేక్ష ధరల స్థాయికి సంబంధించింది. ప్రతికూలమైన ధరల విధానం వ్యవసాయరంగానికి అనుకూలంకాని ధరల నిష్పత్తిని కలిగించి, తక్షణ ఫలితంగా వ్యవసాయ సరుకులను చౌకపరచి, దీర్ఘకాలిక ఫలితంగా వ్యవసాయవృద్ధిని అరికట్టి, వ్యవసాయ సరుకుల కరువును సృష్టిస్తుంది. మరొక వైపున వ్యవసాయరంగానికి సంబంధించిన పారిశ్రామిక సరుకులు చౌకగా ఉంటే, అది వనరుల వ్యర్థం కావడానికి దారితీయవచ్చు. కాబట్టి సత్ఫలవంతమైన, అభివృద్ధి ప్రేరకమైన ధరలవిధానం ధరల నిష్పత్తిని ఎల్లప్పుడు ఉచితమైన స్థాయిలో ఉంచాలి.



BRAOU

భారతదేశం లాంటి దేశాలలో ఆహారానికి ఉండే డిమాండ్‌వల్ల వచ్చే ఆదాయపు స్థితిస్థాపకత ఆర్థికాభివృద్ధి ప్రథమ దశలలో ఎక్కువగా ఉంటుంది. కానీ, వ్యవస్థాత్మకమైన నిర్బంధాలవల్లా, సంస్థాగతమైన కాఠిన్యాలవల్లా పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాలు లేకపోవచ్చు. దానిఫలితంగా, వ్యవసాయ సరుకుల ధరలు పెరిగి, వ్యవసాయేతర సరుకుల ఉత్పత్తి ఖర్చును కూడా పెంచుతాయి. పర్యవసానంగా, వ్యవసాయ సరఫరాలు అవసరమైన స్థాయికి పెరిగేదాకా, ధరల నిష్పత్తి వ్యవసాయరంగానికి అనుకూలంగా ఉంటుంది.

### 15.8.2 భారతదేశంలో వర్తక నిబంధనలు

అభివృద్ధి విధానంలో భాగంగా, భారతదేశ వ్యవసాయధరల విధానం రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉపయోగించారు. పెరుగుతున్న పారిశ్రామికరంగానికి వేతన సరుకులనూ, ముడిపదార్థాలనూ చౌకగా ఉంచడానికీ, పెట్టుబడిగా పెట్టేటందుకు మిగులు ఆదాయాలను గరిష్ట స్థాయికి పెంచడానికీ, పారిశ్రామిక రంగానికి బదలాయించడానికీ, మరొక విధంగా చెప్పాలంటే, ధరల నిష్పత్తి వ్యవసాయ రంగానికి అనుకూలంగా ఉన్నట్లు కనిపించదు. ఈ సందర్భంలో పన్నుల విధానాన్నీ, ధరల విధానాన్నీ కలిపి పరిగణించాలి. వ్యవసాయ ఉత్పాదితంలో కొంత భాగం పన్నుగా చెల్లించమంటే, ఆ భాగానికి ఏ ధర రానట్లుగా పరిగణించవచ్చు. ధరవచ్చే భాగానికి కూడా తక్కువ ధర ఉంటే, వ్యవసాయ ఉత్పాతంలో ప్రతి యూనిట్‌కూ వచ్చే సగటు ధర రెండు విధాలుగా తగ్గుతుంది. అంటే, ధరల గణాంకాలు సూచించే ధరల నిష్పత్తి స్థిరంగా ఉన్నప్పటికీ, వ్యవసాయం మీద పన్నులు పెరిగితే అది వ్యవసాయానికి ప్రతికూలంగా మారవచ్చు. ధరల నిష్పత్తి వ్యవసాయానికి ప్రతికూలంగా ఉండేటట్లు చేసే మూడవ వర్గం, రైతులు కొనే పట్టణ సరుకుల ధరలను పెరగనివ్వి, అదే సమయంలో వ్యవసాయ సరుకుల ధరలను తక్కువగా ఉంచడం.

అభివృద్ధి తొలిదశలలో ప్రతి కూల వ్యవసాయ విధానం మామూలుగా ఉంటుందని అంటారు. అది సాధారణంగా రైతులు ప్రభుత్వానికి ఎక్కువ కోటాలు ఇవ్వడం ద్వారానూ, సేకరణ ద్వారానూ, వ్యవసాయ సరుకులకు తక్కువ ధరల ద్వారానూ, పారిశ్రామిక సరుకులకు ఎక్కువ ధరల ద్వారానూ అమలు జరుగుతుంది.

## 15.9 మంచి ధరల విధానానికి సూచనలు

భారతదేశం లాంటి వర్ధమాన దేశానికి మంచి ధరల విధానంలో ఈ విషయాలు ఉండాలి.

1. అత్యవసర వ్యవసాయ ఉత్పాదకాలను సకాలంలో, సముచితమైన ధరలకు, చాలినంత పరిమాణాలలో క్రమంగా సరఫరా కావడానికి ఏర్పాట్లు చేయాలి.
2. రైతుల వద్ద ఉండే అమ్మకం కాగల మిగులు ఆహారధాన్యాలలో కొంత భాగాన్ని, బలహీనవర్గాలకు పంపకం చేసేటందుకు, చిన్న ఉత్పాదకునికయ్యే సగటు ఉత్పత్తి ఖర్చుకు సమానమైన ధరకు నిర్బంధంగా సేకరించవచ్చు.
3. సేకరణకూ, నిలవకూ, పంపిణీకి అయ్యేఖర్చులు అతి తక్కువగా ఉండాలి.
4. సేకరణ కోటాను మించి రైతుల వద్ద ఉండే అమ్మకం కాగల మిగులును నిర్నిబంధ బహిరంగ మార్కెట్లో అమ్ముకోనివ్వాలి.
5. బహిరంగ మార్కెట్టు ధరలను సముచితమైన పరిమితులలో ఉంచేటందుకు ప్రభుత్వం బఫర్ నిల్వలు ఉంచుకొని అవసరమైనప్పుడు విడుదల చేస్తూ ఉండాలి.

## 15.10 సారాంశం/ముగింపు

వ్యవసయరంగాన్ని ముఖ్యంగా వ్యవసాయ ఉత్పాదితాన్ని ధరల విధానం ప్రభావితపరుస్తుంది. వ్యవసాయ ధరల

విధానక్రియలను తెలపడానికి ఈ పాఠంలో ప్రయత్నం జరిగింది. ఎన్నో వ్యవసాయ సరుకుల ధరలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన "వ్యవసాయ సరుకుల వ్యయాలు, ధరలు సంఘం" నిర్ణయిస్తుంది. భారతదేశంలో పేదరికం వంటి సమస్యల మూలంగా విక్రయంకాగల మిగులు, విక్రయమయ్యే మిగులు అల్పంగా ఉంటుంది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల మధ్య వర్తక నిబంధనలు సాధారణంగా వ్యవసాయ రంగానికి ప్రతికూలంగా ఉంటూ వస్తున్నాయి.

- డా. ఎమ్.అచ్చిరెడ్డి

## 15.11 సంప్రదింపు గ్రంధాలు


1. Datt and Sundaram : Indian Economy.
2. Misra and Puri : Indian Economy.
3. P.C. Bansal : Agricultural Problems of India.


## 15.12 నమూనా పరీక్షా ప్రశ్నలు

I కింది ప్రశ్నలలో ఒక్కొక్కదానికి సుమారు 30 పంక్తులలో జవాబులు రాయండి.

1. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల వ్యవసాయధరల పాత్రను వివరించండి.
2. విక్రయమైన మిగులుకు, విక్రయంకాగల మిగులుకు మధ్య భేదాన్ని తెలియజేయండి. ఆర్థికాభివృద్ధిలో విక్రయమైన మిగులు పాత్రను విశ్లేషించండి.

II కింది ప్రశ్నలలో ఒక్కొక్కదానికి 15 పంక్తులలో జవాబులు రాయండి.

1. విక్రయంకాగల మిగులును ప్రభావపరుచు కారకలేమిటి?
2. సేకరణ ధరలు అంటే ఏమిటి?
3. వ్యవసాయ, పారిశ్రామికరంగాలమధ్య గల వర్తక నిబంధనలను (Terms of Trades) వివరించండి.
4. వ్యవసాయ సరుకుల వ్యయాలు, ధరల సంఘం పని తీరును వివరించండి.

BRAOU

# భాగం — 16 : వ్యవసాయ విత్తం

విషయక్రమం


16.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

16.1 పరిచయం

16.1.1 [illegible]

16.1.2 [illegible]

16.2 ప్రభుత్వ [illegible]

16.2.1 [illegible]

16.4 [illegible]

16.5 [illegible]

16.6 [illegible]


## 16.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

వ్యవసాయ విత్త స్వభావాన్ని [illegible] ఆర్థిక సహాయంతో నడిచే సంస్థల పనితీరునూ వివరించడం ఈ పాఠం లక్ష్యం.

ఈ భాగాన్ని చదివిన తర్వాత మీరు

- ★ భారతదేశంలో వ్యవసాయాభివృద్ధికోసం క్రమబద్ధమైన పరపతి (Organised Credit) ఆవశ్యకతను బలపరచగలరు.
- ★ వ్యవసాయ పరపతి లక్ష్యాలనుగుర్తించగలరు.
- ★ వ్యవసాయ విత్తాన్ని కల్పించడానికిగాను ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందే సంస్థల పనితీరును పరిశీలించగలరు.
- ★ వ్యవసాయ విత్తంలో స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక పరపతులను తెలుసుకొనగలరు.

## 16.1 పరిచయం

అనేక గృహ సంబంధ వస్తువులనే కాక ఆహారానికీ, బట్టలకూ అవసరమైన ముడి సరుకులను వ్యవసాయం ఉత్పత్తి చేస్తుంది. కానీ వ్యవసాయం శ్రమతో కూడుకొన్న పరిస్థితులలో ఒకటైపోయింది. వ్యవసాయదారుతానుఎంత పండించగలడో నమ్మకంగా చెప్పగలిగే పరిస్థితిలో కూడా లేదు. అనావృష్టి, కరువు,

తుఫానులు, వరదలు మొదలైన సమస్యలను రైతు ఎదుర్కోవలసి ఉంది. పంటలను నాశనం చేసే క్రిములు, పంటలకు వచ్చే తెగుళ్ళు పశువులకు వచ్చే రోగాలు మొదలైన సమస్యలను రైతు పరిష్కరించుకోవాలి. చాలా సందర్భాలలో ఎక్కువమంది పేద రైతులు అసహాయ స్థితిలో పడ్డారు. అనేక కుటుంబాలు ఆర్థికంగా దివాళా తీశాయి. వ్యవసాయం ఒక ప్రత్యేక పరిశ్రమ, జాయింట్ స్టాక్ కంపెనీలలో లాగ వ్యవసాయంతలో లాభా లుండవు. రైతు తన సొంత వనరులపైనే ఆధారపడాలి. పారిశ్రామిక వేత్తల్లాగ రైతు ప్రభుత్వ పొదుపు మొత్తాలను వినియోగించుకొనలేడు. రుణం పొందేందుకు పారిశ్రామిక వేత్తల్లాగ రైతు ఉత్పత్తి ఖర్చుమా, దానిపై వచ్చే ప్రతిఫలాన్నీ సరిగ్గా అంచనా వేయలేడు. ఎక్కువమంది రైతులు భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవారు కావటంతో ప్రభుత్వ పరపతి సౌకర్యాలను వినియోగించుకొనలేరు.

పారిశ్రామిక రంగంతో పోలిస్తే వ్యవసాయరంగం డిమాండ్‌కు తగినట్లుగా సరఫరాను సవరించుకోలేదు. వ్యవసాయ రంగంలో ఈ పరిస్థితి ఎంతగా ఉందంటే వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోయినప్పటికీ రైతు తన ఉత్పత్తిని తగ్గించలేడు, అప్పు చేయలేడు. పారిశ్రామిక వేత్త సంవత్సరంలో అనేక సార్లు తన పెట్టుబడిని పునర్జీవింపచేయగలుగుతాడు. కానీ రైతు వ్యవసాయం చేసే కాలం ఒక సంవత్సరం అవటం వల్ల సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే తన పెట్టుబడిని పునర్జీవింప చేయగలుగుతాడు. ఈ రకమైన ప్రత్యేకతలతో వ్యవసాయరంగ ఆర్థికావసరాలు పూర్తిగా వేరుగా ఉంటాయి.

### 16.1.1 భారత దేశంలో వ్యవసాయ విత్త అవసరం

భారతదేశం ప్రాథమికంగా వ్యావసాయిక దేశం. శ్రామికులలో 70 శాతం వ్యవసాయ రంగంలోనే ఉన్నారు. దాదాపు 7.2 కోట్ల కుటుంబాలు 16.2 కోట్ల హెక్టార్ల భూమిని సాగుచేస్తున్నాయి; వీరిలో ఒకటిన్నర భాగం ఒక హెక్టారుకన్నా తక్కువ భూమిని కలిగినవారు. చిన్న, మధ్య తరహా రైతులలో ఎక్కువ భాగం, వ్యవసాయ కార్మికులలో అధిక సంఖ్యాకులు దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారు: అప్పులలో మునిగి ఉన్నారు. అందువల్లనే భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో సంఘటిత పరపతి విధానం ప్రధానమైంది.

### 16.1.2 ప్రయివేటు పరపతి కలుగజేసే నష్టాలు

వ్యవసాయ రంగంలో పరపతి అవసరాలను ప్రయివేటు వడ్డీ వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు వదలకూడదు. దీనికి చాలా కారణాలున్నాయి.

1. ప్రయివేటు వడ్డీ వ్యాపారస్తులకు లాభార్జనే పరమావధి కాబట్టి వడ్డీకి తీసుకున్న రుణాలను సాంఘికంగా వాంఛనీయమైన అవసరాలకు మళ్లించడం కష్టం.
2. పరపతి అర్హతలను నిర్ణయించడంలో భవిష్యత్తును చాలావరకు లెక్కలోకి తీసుకొనరు.
3. ప్రయివేటు వ్యాపారస్తుల వడ్డీ రేట్లు భరించలేనంతఅధికంగా ఉంటాయి.
4. ప్రయివేటు వ్యాపారస్తులు భయపెట్టో దావాలు వేసో బలహీనవర్గాలవారి ఆస్తులను హస్తగతం చేసుకొనే ప్రమాదం ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది.

### 16.1.3 సంస్థాగత సంపతులు

వ్యవసాయాభ్యుదయానికి తగినన్ని పరపతి సౌకర్యాలు అవసరం. వ్యవసాయదారులకు తక్కువ వడ్డీరేటును, అనుకూలమైన షరతులపై పరపతి ఇవ్వడం అవసరం. అందుకే పరపతి వినియోగించే తీరుమీద శక్తివంతమైన నియంత్రణ (కంట్రోల్) ఉంచడం సాంఘిక బాధ్యత.

అందువల్లనే ప్రస్తుత శతాబ్దంలో ప్రపంచలోని అనేక దేశాల్లో ప్రభుత్వ సహాయంతో సంస్థాగత పరపతి వ్యవస్థ అభివృద్ధి అయింది.

వ్యవసాయ పరపతి అంటే కేవలం అప్పులు మంజూరు చేయడం మాత్రమే అనకోకూడదు. సాంకేతిక మార్గదర్శకత్వం (టెక్నికల్ గైడెన్సు), వ్యవసాయం చేయడానికి తగిన పథకాలను ఇవ్వడం కూడా ఇందులో కలిసి ఉన్నాయి. తీసుకొన్న అప్పును ప్రతిభావంతంగా వినియోగించుకొని భూమినుండి ఎక్కువ ప్రతిఫలం



BRAOU

పొందేందుకు వ్యవసాయదారుడికి మార్గ దర్శకత్వం అవసరం. అందువలన పరపతి సేవలు, వ్యవసాయ విస్తరణ సేవలు అందించే బాధ్యతను ప్రభుత్వ సంస్థలకు ఇచ్చారు.

వ్యక్తిగత పొదుపుమొత్తాలు చాలని పరిస్థితినీ, ప్రైవేటు వడ్డీ వ్యాపార వ్యవస్థ కలుగజేసే చెడునూ దృష్టిలో పెట్టుకొని భారత ప్రభుత్వం 19వ శతాబ్ద చివరి దశాబ్దంలో అనేక రాష్ట్రాలలో వ్యవసాయ బ్యాంకులను స్థాపించింది.

### 16.1.4 వ్యవసాయ పరపతి విధానం ముఖ్య లక్ష్యాలు

1. ప్రతి ప్రణాళికలోనూ అర్హులైన వ్యక్తులకు తగిన సమయంలో సహాయాన్నందివ్వడం.
2. వివిధ సంస్థల ద్వారా స్వల్ప, దీర్ఘకాలిక అవసరాలను తీర్చడం.
3. ఆర్థిక సహాయాన్నందించే సంస్థల వనరులన్నింటినీ సరైన వడ్డీ రేటుకు సులభ పద్ధతులపై తిరిగి చెల్లించేటట్లు రైతులందరికీ అందుబాటులో ఉంచడం.
4. ఉత్పాదక శక్తిని పెంచి వ్యవసాయంలో మొత్తం ఉత్పత్తిని సాధించడం.

వీటన్నిటితో బాటు పరపతి సంస్థలు పరపతి వినియోగంమీద ప్రత్యక్ష పర్యవేక్షణా,విస్తరణ సేవలూ, సాధించిన అభివృద్ధిని అంచనా కట్టడం లాంటి పనులుకూడా చేస్తాయి.

---

**మీ అవగాహనను పరీక్షించుకోండి — 1**

1. ప్రైవేటు పరపతి వల్ల కలిగే నష్టాలు ఏమిటి?
2. వ్యవసాయ పరపతి లక్ష్యాలు ఏమిటి?

---

## 16.2 ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడిచేసంస్థలు — వాటి పనితీరు

స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధిలో పెద్ద పాత్ర నిర్వహిస్తోంది. బహుళార్థసాధక పథకాలను నిర్మించడం, భూ సంస్కరణలను అమలు పరచడమే కాక వ్యవసాయ రంగంలో అనేక కార్యక్రమాలకు రుణాలివ్వడానికి అనేక కొత్త విత్త సంస్థలను ప్రారంభించి అప్పటికే ఉన్న సంస్థల పరిధి పెంచింది.

### 16.2.1 సహకార బ్యాంకులు

భారతదేశంలో సహకార బ్యాంకింగ్ విధానం సమాఖ్య స్వభావం కలిగి ఉంది. గ్రామ స్థాయిలో ప్రాథమిక సంఘాలతోనూ, జిల్లా స్థాయిలో సహకార బ్యాంకులతోనూ ఈ వ్యవస్థ ఏర్పడింది.

భారతదేశంలో వ్యవసాయ పరపతిని కల్పించే ప్రత్యేక ఏజెన్సీని ఏర్పాటుచేసి, అభివృద్ధిచేసే లక్ష్యంతో సహకారోద్యమం ప్రారంభమయింది. ఈ లక్ష్యసాధనకు రెండు వేర్వేరు సహకార బ్యాంకులు దేశంలో ఏర్పడ్డాయి. ఒక బ్యాంకు స్వల్ప, మధ్యకాలిక రుణాల నివ్వగా రెండో బ్యాంకు దీర్ఘకాలిక రుణాలను ఇస్తుంది.

ప్రాథమిక సంఘాలు, సహకార కేంద్రబాంకు, రాష్ట్ర స్థాయిలోని ఉన్నత బ్యాంకులు మొదటి తరగతిలోకి వస్తాయి. అనుబంధ బ్యాంకుల వనరులలో హెచ్చు తగ్గులను సమతూకంలో ఉంచుతూ, కేంద్ర సహకార బ్యాంకులు ముఖ్యపాత్ర నిర్వహిస్తాయి. స్థానిక పొదుపు మొత్తాలలో ఉత్పత్తికి అవసరమైన స్థానికావసరాలను తీర్చి, ఉన్నత స్థాయి బ్యాంకులనుండి జిల్లా స్థాయివరకు ద్రవ్య మార్కెట్టును, రిజర్వుబ్యాంకు నుంచి నిధులను ఏర్పాటు చేస్తాయి. కింది స్థాయిలోప్రాథమిక సహకార సంఘాలు ఒకటి రెండు గ్రామాల సహాయంతో సభ్యుల అవసరాలను తీరుస్తాయి.



BRAOU

దీర్ఘకాలిక పరపతి విధానం కేంద్ర భూమి తనఖా (అభివృద్ధి) బ్యాంకులో, ప్రాథమిక బ్యాంకులతోకూడి ఉంది. 1960 సంవత్సరం నాటికి దాదాపు అన్ని రాష్ట్రాలలోనూ కేంద్ర భూమి తనఖా బ్యాంకులు ఏర్పడ్డాయి. మధ్యప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాలలో రాష్ట్ర సహకార బ్యాంకు కేంద్ర భూమి తనఖా బ్యాంకుగా కూడా పని చేస్తుంది. ఈ రాష్ట్రంలో కింది స్థాయిలో కూడా సంస్థాగత నిర్మాణ స్వరూపంలో గణనీయమైన తేడాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఇతర దక్షిణాది రాష్ట్రాలలోనూ ప్రాథమిక భూమి తనఖా (అభివృద్ధి) బ్యాంకులు తాలుకా స్థాయిలో పనిచేసే యూనిట్లు ఉన్నత స్థాయి బ్యాంకుకు అనుబంధమైన ఈ యూనిట్లు కేంద్రభూమి తనఖా బ్యాంకు ఇచ్చిన నిధులనుంచి వ్యవసాయదారులను రుణాలిస్తాయి.

రిజర్వు బ్యాంకు ప్రత్యక్ష రుణాలద్వారానూ, ప్రత్యేక డిబెంచర్లను కొనడం ద్వారాను కేంద్ర భూమి తనఖా బ్యాంకులకు దీర్ఘకాలిక విత్తాన్ని అందిస్తుంది.

## 16.2.2 వాణిజ్య బ్యాంకులు

14 పెద్ద బ్యాంకులను 1969వ సంవత్సరంలో జాతీయం చేసిన తర్వాత వాణిజ్యబ్యాంకులు వ్యవసాయ రంగంలోకి ఎక్కువగా ప్రవేశించాయి. బ్యాంకింగ్ వ్యవస్థ లేని గ్రామీణ ప్రాంతాల అవసరాలను తీర్చేందుకు 1970వ సంవత్సర ప్రారంభంలో లీడ్ బ్యాంక్ పథకాన్ని ప్రారంభించారు. పరపతి అవసరాలనుగురించి సమగ్రంగా సర్వే చేయడానికి దేశంలోని దాదాపు 352 జిల్లాలను జాతీయ బ్యాంకులకు కేటాయించారు. ఈ బ్యాంకులు ఎక్కడ వ్యవసాయాభివృద్ధికి ఎక్కువ పరపతి అవసరమో, ఎక్కడ వ్యవసాయం ప్రధానమైన వృత్తిగా ఉందోగుర్తించాలి.

సంబంధిత జిల్లాలో రుణావసరాలను తీర్చడంలో లీడ్ బాంక్ పథకం ప్రధాన పాత్ర నిర్వహించవలసి ఉన్నప్పటికీ, మొత్తం జిల్లాలో వ్యాపారం మీద గుత్తాధికారం కలిగి ఉండకూడదని భావించారు. ఈ బ్యాంకు గుత్తాధికారం కలిగి ఉండకూడదని భావించారు. ఈ బ్యాంకు కన్సోర్టియం లీడరుగా వ్యవహరించినప్పటికీ, బ్యాంకింగ్ వ్యవస్థ తక్కువగా ఉన్న ప్రాంతాలను, అసలు లేని ప్రాంతాలనుగుర్తించిన తర్వాత ఆ జిల్లాలో పని చేస్తున్న వాణిజ్యబ్యాంకులతో సహా ఇతర పరపతి సంస్థల సహకారాన్ని కోరుతుంది.

లీడ్ బ్యాంకు పథకం మంచి అభివృద్ధిని సాధించింది. జిల్లా స్థాయిలో పరపతి అవసరాలపై పెద్ద నివేదికలను తయారు చేశారు. అధిక సంఖ్యలో గ్రామీణ రైతులకు, చేతి వృత్తులవారికి, చిన్న వర్తకులకు రుణాలిచ్చారు.

లీడ్ బ్యాంకు ఎదుర్కొంటున్న సమస్యలను రెండు తరగతులుగా విభజించవచ్చు. మొదటిగా ఒక బ్యాంకుకు ఒక జిల్లానుకేటాయించడం వల్ల అది ఆ జిల్లాలో ఇతర బ్యాంకులతో శాఖల విస్తరణను సమన్వయం చేస్తుంది. ధనిక, సారవంతమైన జిల్లాలలో రుణాలకై తొందర, పోటీ ఉండడం వల్ల వెనుకబడిన జిల్లాలకు తక్కువ ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతున్నది.

పాలన సంబంధిత సమస్యలు ఎక్కువగా ఉండడం రెండో కారణం. అవినీతి పద్ధతులు, తమకు అనుకూలమైనవారికే రుణాలు ఇవ్వడం లాంటి పద్ధతులను గురించి ప్రజలు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. రెండో వైపున చాలా ప్రాంతాలలో రుణాల చెల్లింపు తక్కువగా ఉండడం బాంకులకు బాధాకరంగా పరిణమించింది.

## 16.2.3 వ్యవసాయ రీఫైనాన్స్ అభివృద్ధి సంస్థ (ARDC)

1963వ సంవత్సరం మేలో వ్యవసాయ రీఫైనాన్స్, అభివృద్ధి కార్పొరేషన్ చట్టం అమలులోకి రావడంతో ఐదుకోట్ల వాటా ధనంతో వ్యవసాయ రీఫైనాన్స్ అభివృద్ధి సంస్థ (Agricultural Refinance Development Corporation) చట్టబద్ధమైన సంస్థగా మారింది. దీని ప్రధాన లక్ష్యం ఉత్పత్తి పెరుగుదలకు ఆర్థిక భద్రత కల్పించడం, భూమి (అభివృద్ధి) తనఖా బ్యాంకులద్వారా ముఖ్యమైన వ్యవసాయ పథకాలను ప్రత్యేకించి



BRAOU

అభివృద్ది చేయడం. ఈ సంస్థ రైతులకు ప్రత్యక్షంగా రుణాలివ్వదు. కానీ సహకార రంగంలో అప్పటికే ఏర్పడి పనిచేస్తున్న పరపతి సంస్థలద్వారా రుణాలందిస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో చిన్న ప్రాంతాలలో సన్నిహిత పర్యవేక్షణ, పరిపాలనలో పొదుపు, సాంకేతిక సహాయాన్నందించే ఏజెన్సీలు, ఆర్థిక సహాయాన్నందించే ఏజెన్సీల మధ్య సమన్వయ సాధనకు ఈ సంస్థ ప్రత్యేక పథకాలను ఉద్దేశించారు. ఈ పథకంలో వ్యవసాయంలో ట్రాక్టర్ల వాడకం, భూసార పరిరక్షణ, కోళ్ల పెంపకం, మొక్కల పెంపకం, పాడి పశువుల పెంపకం, చేపల పెంపకం మొదలైనవి కూడా ఉన్నాయి.

## 16.2.4 భారతీయ స్టేట్ బ్యాంకు (SBI)

వ్యవసాయ ఉత్పత్తుల తయారీకి, మార్కెటింగ్‌కు అవసరమైన పరపతి ఇచ్చే సహకార సంస్థల అవసరాలను భారతీయ స్టేట్‌బ్యాంక్ ఆదుకొంటుంది. వస్తువుల తయారీ, మార్కెటింగ్‌తో సంబంధమున్న అనేక సహకార సంస్థలకు రుణాల నందివ్వడమే కాక సహకార కేంద్ర సంస్థలకు స్వల్పకాల' పరిమితిపై రుణసౌకర్యాలను, డబ్బు దాచుకొనే సౌకర్యాలను కూడా కలుగజేసింది. అనేక సహకార చక్కెర కర్మాగారాలకు, భూమి తనఖా బ్యాంకులకు, పారిశ్రామిక సహకార సంఘాలకు, వినిమయ వస్తువులకు టోకుగా అమ్మే సంస్థలకు స్వల్ప కాలపరిమితి పై రుణాలనందించింది.

## 16.2.5 తక్కావీ రుణాలు

1983వ సంవత్సరంలో ఏర్పరచిన అభివృద్ధి రుణాల చట్టాన్నీ 1984వ సంవత్సరంలో ఏర్పడిన వ్యవసాయదారుల రుణాల చట్టాన్నీ అనుసరించి ప్రభుత్వం రైతులకు తక్కావీ రుణాలద్వారా ఆర్థిక సహాయం చేస్తున్నది. మొదటి చట్టంకింద దీర్ఘకాలిక రుణాలనూ, రెండవ చట్టంకింద చిన్న, మధ్య తరహా రుణాలనూ వ్యవసాయదారులకు అందిస్తారు.

తక్కావీ రుణాలలో కొన్ని లోపాలు కూడా ఉన్నాయి.

1. రుణాలు ఇచ్చే పద్ధతులు, తిరిగి వసూలు చేసే పద్ధతులు సులభతరంగా లేవు.
2. రుణాలు పొందడంలో జరిగే ఆలస్యం వాటిని నిరుపయోగం చేస్తోంది.
3. రుణం పొందే విధానం వ్యయప్రయాసలతో కూడుకొంది. చాలా పాతదైన ఈ తక్కావీ రుణాల పథకం ఆధునిక రుణ సంస్థల ఏర్పాటుతో వెనుకబడిపోయింది.

## 16.2.6 వ్యవసాయ పరపతి — గ్రామీణ బ్యాంకులు

14 పెద్ద బ్యాంకులను జాతీయం చేసిన తర్వాత 50 శాతానికి పైగా శాఖలు గ్రామీణ ప్రాంతాలలో ఉన్నప్పటికీ అనేక కారణాలవల్ల రైతులు వాణిజ్య బ్యాంకులనుండి లాభం పొందలేక పోయారు.

బలహీన వర్గాల సమస్యలను పరిష్కరించేందుకు 1975లో గ్రామీణ బ్యాంకులు ఉనికిలోకి వచ్చాయి. గ్రామీణ రుణభారాన్ని రద్దు చేయడం వల్ల, బలహీన వర్గాలవారికి రుణాల నందివ్వడంలో వాణిజ్య బ్యాంకులు విఫలమవ్వడంవల్ల ఏర్పడిన ఖాళీని పూడ్చడం వీటి ఉద్దేశం.

గ్రామీణ బ్యాంకుల ఆర్థిక స్వరూపం సామాన్యమైంది. 50 శాతం పెట్టుబడి ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ఇవ్వగా మిగిలినది జాతీయం చేసిన బ్యాంకులనుండి సమకూరుతుంది. వీటి వడ్డీ రేట్లు తక్కువగా ఉంటాయి. సహకార సంఘాలవడ్డీ రేట్ల కంటే ఎక్కువ ఉండవు.

ఈ బ్యాంకులు పేద రైతులనువడ్డీ వ్యాపారుల బారినుండి విడిపించేవిగా ఉండాలని భావించారు. చిన్న, మధ్య తరహా రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ చేతివృత్తులవారు, చిన్న వర్తకులకు ప్రధానంగా ఇది సహాయపడతాయి. అర్హులైనవారి విషయంలోనూ, ప్రత్యేకించి అణచివేయబడ్డ కులాలవారి విషయంలోనూ సెక్యూరిటీ నిబంధనలను సడలిస్తారు.

గ్రామీణ బ్యాంకుల లోపాలు: గ్రామీణ బ్యాంకులు మంచి ఆదర్శాలతోనే స్థాపించబడినప్పటికీ వాటికి కొన్ని సమస్య లున్నాయి.

వాణిజ్య బ్యాంకులు సమర్థవంతమైన శాఖలను ఉంచుకొని, సామర్థ్యం అంతగాలేని శాఖల ప్రాంతాలను గ్రామీణ బ్యాంకులకు వదులుతాయి. కొత్తగా ఏర్పాటైన గ్రామీణ బ్యాంకులు అప్పటికే ఆరంగంలో స్థిరపడి ఉన్న వాణిజ్యబ్యాంకులతో నిలబడలేకపోతున్నాయి.

గ్రామీణ బ్యాంకు[illegible] ఆ ప్రాంతాల్లోని సహకార సంఘాల గ్రామీణ బ్యాంకులు వాటికి లోబడి ఉంటాయ[illegible] కాని కేంద్ర ప్రభుత్వాలు ఈ పరిస్థితిని ఏర్పడనివ్వలేదు. ఈ రెండు [illegible] వంది[illegible]మైన సమస్యలు తలెత్తినాయి.

## 16.3 స్వల్ప[illegible]లిక పరపతులు

### స్వల్పకాలిక పర[illegible]

[illegible]కాలి[illegible]రులకు సహాయపడేందుకు ఉద్దేశించింది. సామాన్యంగా దీని కాలపరిమితి 1[illegible]. వ్యవసాయ సమయంలో కూలీలను పెట్టుకొనడం కోసం, విత్తనాలు, ఎరువులు, [illegible]లు, పురుగుమందులు కొనుక్కోవడం కోసం, ధాన్యం అమ్మేంతవరకూ నిల్వచేసుకోవడం [illegible]లకు ధనం అవసరం, కొన్ని సందర్భాల్లో ఈ స్వల్పకాలిక రుణాలు కరువులు, [illegible] కాటకాల సమయంలో కూడా ఉపయోగపడతాయి.

### మధ్యకాలిక పరపతి

[illegible]కరాలు కొనుక్కోవడం కోసం మధ్యకాలిక పరపతి ఇస్తారు. దీని కాలపరిమితి 3 [illegible] సంవత్సరాలవరకు ఉంటుంది.

### దీర్ఘకాలిక పరపతి

భూమి శాశ్వత [illegible]లకోసం, బావుల త్రవ్వకం కోసం దీర్ఘకాలిక రుణం ఉద్దేశించబడింది. దీని కాలపరిమితి 5 నుండి 20 సంవత్సరాలు.

దీర్ఘకాలిక రుణ వ్యయాన్ని కింది విధంగా విభజించవచ్చు:

1. భూమిని కొనుక్కోవడం.
2. పోగొట్టుకున్న భూమిని పొందటం కోసం
3. భూమిని చదును చేసుకోవడం
4. బావులు, కాలువల త్రవ్వకం, మరమ్మతులు
5. కంచెలు, మొక్కలు వేయడం కోసం
6. పొలంలో ఇల్లు, పశువుల పాకలు నిర్మించడం.

## 16.4 సారాంశం / ముగింపు

భారతదేశం వ్యవసాయక దేశమని అందరికీ తెలిసిందే. వ్యవసాయ కుటుంబాలలో అధిక భాగానికి ఒక హెక్టార్ కన్నా తక్కువ భూమి ఉంది. కొందరు వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారు. గ్రామీణ కుటుంబాలలో అధిక శాతం బీదరికంలో మగ్గుతున్నందువ వ్యవసాయం చేయాలంటే వారికి పరపతికి కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వం నెలకొల్పిన, ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందిన సంస్థలు—సహకార బ్యాంకులు,

వాణిజ్య బ్యాంకులు, వ్యవసాయ రీఫైనాన్స్ అభివృద్ధి సంస్థ, స్టేట్ బ్యాంక్, గ్రామీణ బ్యాంకులు — వ్యవసాయ రంగానికి పరపతిని కల్పిస్తాయి. కాని, ఈ సంస్థలు కల్పిస్తున్న పరపతి వ్యవసాయ రంగానికి సరిపోవడం లేదు. గ్రామాలలో ఎంతో మంది వ్యవసాయదారులు పరపతి కోసం ఇంకా దేశీయ బ్యాంకర్లమీద, బంధుమిత్రులమీద ఆధారపడి ఉన్నారు.

— డా. ఎస్.అచ్చిరెడ్డి

## 16.5 సంప్రదింపు గ్రంథాలు

1. Datt & Sndaram : Indian Economy
2. P.C. Bansal : Agricultural Problems of India
3. Misra & Puri : Indian Economy

## 16.6 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలలో ఒక్కొక్కదానికి సుమారు 30 పంక్తులలో జవాబులు రాయండి.

1. వ్యవసాయ విత్తమంటే ఏమిటి? భారతదేశ వ్యవసాయాభివృద్ధిలో దాని పాత్రను విశ్లేషించండి.
2. వ్యవసాయ పరపతిని కల్పించడంలో ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందిన సంస్థల పాత్రను వివరించండి.

II. కింది ప్రశ్నలలో ఒక్కొక్కదానికి సుమారు 30 పంక్తులలో జవాబులు రాయండి.

1. భారత దేశంలో వ్యవసాయదారులకు పరపతిని కల్పించాల్సిన ఆవశ్యకతను వివరించండి.
2. ప్రైవేటు పరపతి, సంస్థాగత పరపతి మధ్య భేదాన్ని తెలపండి.
3. గ్రామీణ ప్రజల పరపతిని కల్పించడంలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఎంతవరకు సఫలీకృతమయ్యాయి?

BRAOU

# ఖండం — V

## పారిశ్రామిక రంగం

భారతదేశంలో జరుగుతున్న పారిశ్రామిక అభివృద్ధిని, స్వాతంత్ర్యానంతరం మన దేశంలో అమలవుతున్న పారిశ్రామిక విధాన తీర్మానాలనూ, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలనూ గురించి ఈ ఖండం విశ్లేషిస్తుంది. పారిశ్రామిక ప్రగతి మందకొడిగా ఉండడానికి గల కారణాలనూ దేశంలో ఆర్థిక శక్తి కొద్ది పారిశ్రామిక సంస్థల చేతుల్లో కేంద్రీకృతం కావడానికి గల కారణాలనూ కూడా ఇందులో తెలుసుకుంటాం. పరిశ్రమలను స్థాపించడానికి లేదా విస్తృతపరచడానికి ఋణాలను కల్పించే పారిశ్రామిక విత్తసౌకర్యాలను గురించీ, సంస్థలను గురించీ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ఖండంలోని చివరి పాఠం ఆ ప్రయత్నాన్నే చేసింది.

ఈ ఖండంలోని చేర్చిన నాలుగు (4) భాగాలు :

ఖండం — 17 : భారతదేశ పారిశ్రామిక అభివృద్ధి

ఖండం — 18 : ప్రభుత్వరంగం

ఖండం — 19 : భారతదేశంలో పారిశ్రామిక శక్తి కేంద్రీకరణ

ఖండం — 20 : పారిశ్రామిక విత్తం

B R A O U

BRAOU

# భాగం — 17 :భారతదేశ పారిశ్రామిక అభివృద్ధి

విషయక్రమం


17.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
17. 1 పరిచయం
17. 2 పారిశ్రామిక విధాన ఆవశ్యకత
17. 3 1948 పారిశ్రామిక విధాన తీర్మానం
17.3.1 తరగతులు
17.3.2 విధాన చర్యలు
17. 4 పరిశ్రమల (అభివృద్ధి, క్రమబద్ధం) చట్టం, 1951
17. 5 1956 పారిశ్రామిక విధాన తీర్మానం
17.5.1 1948 తీర్మానం తర్వాతి అభివృద్ధి
17.5.2 షెడ్యూళ్ళు
17.5.3 విధానలక్ష్యాలు
17.5.4 1956 విధాన గుణగణాలు
17.5.5 1956 విధాన విమర్శనాత్మక విశ్లేషణ
17. 6 1956 నుంచి వెలువడిన ప్రధాన విధానాల వివరణ
17.6.1 పారిశ్రామిక లైసెన్సింగ్
17.6.2 1973 పారిశ్రామిక విధానం
17.6.3 1978, 1980 లో పారిశ్రామిక విధాన తీర్మానాలు
17.6.4 ముగింపు
17. 7 స్వాతంత్ర్యానంతరం పారిశ్రామికీకరణ అభివృద్ధి తీరుతెన్నులు
17. 8 పారిశ్రామిక అభివృద్ధికి అడ్డంకులు
17. 9 పారిశ్రామిక రుగ్మత : కారణాలు
17.10 పారిశ్రామికోత్పత్తిని పెంచటానికి తీసుకోవలసిన చర్యలు
17.11 సారాంశం/ముగింపు
17.12 సంప్రదింపు గ్రంథాలు
17.13 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 17.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

భారతదేశ పారిశ్రామికీకరణ కోసం అమలు పరిచిన వివిధ పారిశ్రామిక విధానతీర్మానాలను పరిశీలించడం, భారతదేశ పారిశ్రామిక అభివృద్ధి తీరుతెన్నులను చర్చించడం ఈ పాఠం ప్రధాన లక్ష్యాలు.

ఈ భాగాన్ని చదివిన తర్వాత, మీరు

★ పారిశ్రామిక విధాన ఆవశ్యకతను గుర్తించగలరు.
★ 1948 పారిశ్రామిక విధాన తీర్మానాన్ని విశ్లేషించగలరు.
★ 1956 పారిశ్రామిక విధాన తీర్మానాన్ని వివరించగలరు.
★ 1956 తర్వాత అమలు పరిచిన ఇతర విధాన తీర్మానాలను తెలుసుకోగలరు.



BRAOU

★ స్వాతంత్ర్యం సాధించిన నాటి నుంచి పారిశ్రామికీకరణ అభివృద్ధి తీరుతెన్నులను పరిశీలించగలరు.
★ పారిశ్రామికాభివృద్ధికి 1950 నుంచి ముఖ్యంగా 1965 నుంచి కలుగుతున్న అడ్డంకులను గుర్తించగలరు.
★ పారిశ్రామిక స్తబ్దతకు కారణాలను తెలుపగలరు.
★ పారిశ్రామికోత్పత్తి పెరుగుదలకు తీసుకోవలసిన చర్యలను గుర్తించగలరు.

## 17.1 పరిచయం

ఈ పాఠంలో పారిశ్రామికరంగం ఆర్థికాభివృద్ధిని పెంపొందించటంలో వహించే పాత్రను విశ్లేషించినాము. పారిశ్రామికీకరణ వర్తమాన ఆర్థిక వ్యవస్థలో సాంఘిక, ఆర్థిక అవస్థాపనములందించుటలో ముఖ్యమైన పాత్ర వహిస్తుంది. మూలధనం కొరత, సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం, ఎక్కువగా విదేశ వ్యాపారం మీద ఆధారపడి ఉండటం, శ్రామికుల్లో గమనశీలత లేక పోవటం, పురాతన ఉత్పత్తి పద్ధతులనుసరించటం వ్యవసాయానికి అత్యధిక ప్రాముఖ్యమివ్వటం మొదలైనవి వెనుకబడిన దేశాలలో అభివృద్ధిని కుంటుపరచే కొన్ని మౌలిక కారణాలు. సాంకేతిక పరమైన, వ్యవస్థాపరమైన మార్పులు జరగనిదే ఈ దేశాలలో అభివృద్ధి త్వరితగతిలో సాగదు. కాబట్టి పారిశ్రామికీకరణ పాత్రను జాగ్రత్తగా అవగాహన చేసుకోవలసి ఉంటుంది.

### వ్యవసాయ, పారిశ్రామిక రంగాలమధ్య సంబంధం

పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు ఒకదాని మీద ఒకటి ఉన్నాయి. పారిశ్రామికరంగం వృద్ధి చెందితే వ్యవసాయ రంగాన్ని ఆధునీకరణ చేయడానికి అవసరమైన రసాయనిక ఎరువులు, వ్యవసాయ పనిముట్లు లభ్యమౌతాయి. అదే విధంగా వ్యవసాయ రంగం వృద్ధి చెందితే, వ్యవసాయ ప్రాతిపదిక పరిశ్రమలకు అవసరమైన ముడి సరుకులూ, శ్రామికులకు అవసరమైన ఆహారవస్తువులూ లభ్యమౌతాయి. అంతేకాకుండా వ్యవసాయరంగం అభివృద్ధి వల్ల పరిశ్రమల్లో ఉత్పత్తి వస్తురాశికి సార్థక డిమాండ్ ఉంటుంది. పోతే, ఇంకొక విషయమేమంటే పారిశ్రామికీకరణ జరిగితే వ్యవసాయేతర కార్యకలాపాల్లో ఉద్యోగావకాశాలు ఎక్కువవుతాయి. ఫలితంగా వ్యవసాయరంగంలో ప్రచ్ఛన్న నిరుద్యోగులుగా పరిగణిస్తున్న మిగులు శ్రామికులకు పారిశ్రామిక రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు. ఈ విధంగా ఈ రెండు రంగాల మధ్య అన్యోన్యత ఉంది.

B R A O U

## 17.2 పారిశ్రామిక విధాన ఆవశ్యకత

ఆర్థికాభివృద్ధిని పెంపొందించటంలో పారిశ్రామికీకరణ పాత్ర ముఖ్యమని తెలుసుకున్నాం. అయితే మిశ్రమ ఆర్థికవ్యవస్థలో పారిశ్రామిక విధానం ఏ విధంగా ఉండాలన్న విషయాన్ని ఇప్పుడే పరిశీలిద్దాం. మిశ్రమ ఆర్థిక వ్యవస్థ అంటే పెట్టుబడిదారీ సామ్యవాద ఆర్థిక వ్యవస్థల కలయిక అని చెప్పవచ్చు. ఇందులో పబ్లిక్ రంగం సామ్యవాద వ్యవస్థకు ప్రతీకగా ఉంటుంది. ప్రైవేట్ రంగం పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థను సూచిస్తుంది. కాబట్టి మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో భారీ, మౌలిక పరిశ్రమలను ప్రభుత్వం అభివృద్ధి పరచి వాటిని నడిపిస్తుంది. భారీ, మౌలిక పరిశ్రమలు పబ్లిక్ రంగంలో ఉండటం ప్రధాన విషయమైనప్పటికీనీ, జాతీయశ్రేయస్సుకోసం ప్రైవేట్ రంగం కార్యకలాపాలను ప్రభుత్వం నియంత్రణ చేయవలసి ఉంటుంది. ప్రభుత్వం ద్రవ్య, కోశ పరిపాలనా విధానాలద్వారా ప్రైవేట్ రంగాన్ని నియంత్రణ చేస్తుంది.

పరిశ్రమలకు సంబంధించిన లైసెన్సింగ్ విధానమూ, పన్నుల విధానమూ, బ్యాంకింగ్ కార్యకలాపాలూ ప్రైవేటూ రంగాన్ని నియంత్రణ చేయడానికి ఉపయోగించవచ్చు. అయితే ప్రైవేటు రంగ పెట్టుబడులను ప్రోత్సహించేవిగా కూడా ఈ విధానములు ఉండాలి. పరిశ్రమల విషయంలో ప్రభుత్వం అనుసరించే విధానం ఈ కింది అంశాల మీద ఆధారపడి ఉంటుంది.

(a) దేశం అంతవరకు సాధించిన ఆర్థికపురోభివృద్ధి
(b) ప్రకృతి, భౌతిక వనరుల లభ్యత
(c) అంతర్గతంగానూ, బహిర్గతంగానూ ఉన్న సాంఘిక, ఆర్థిక పరమైన అంశాలు.

కింది ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకుంటే, భారతదేశ పారిశ్రామిక రంగం తీరుతెన్నులను క్షుణ్ణంగా అర్థం చేసుకోవచ్చు.

(1) త్వరితగతిలో ఆర్థికాభివృద్ధిని సాధించడానికి ప్రభుత్వం ఎటువంటి పారిశ్రామిక విధానాన్ని అమలు పరిచింది?
(2) పబ్లిక్ మరియు ప్రైవేట్ రంగాల మధ్య సరైన సమన్వయానికి మన పారిశ్రామిక విధానం అనుకూలమైనదని భావించవచ్చా?
(3) మిశ్రమ ఆర్థికవ్యవస్థను దృష్టిలో వుంచుకొని మన పారిశ్రామిక విధానానికి ఉన్న పరిమితులేమిటి?
(4) ఇంతవరకు పారిశ్రామిక రంగంలో సాధించిన ప్రగతి ఎంత? పారిశ్రామిక రంగం ఇటీవల ఎటువంటి సమస్యలను ఎదుర్కొంటున్నది?
వీటిని పరిశీలిద్దాం.

మనకు స్వాతంత్ర్యం లభించినతరువాత మొట్టమొదటి పారిశ్రామిక విధానాన్ని 1948లో ప్రకటించారు. అప్పటి దేశ పరిస్థితులనుబట్టి ఆ విధానాన్ని రూపొందించారు. ఆ పరిస్థితులేమిటో తెలుసుకుందాం.

(1) రెండవ ప్రపంచ యుద్ధం వల్ల సంభవించిన ద్రవ్యోల్బణము
(2) స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం పూర్తి జాతీయకరణకు పాల్పడుతుందేమోనన్న అనిశ్చిత పరిస్థితి.
(3) విదేశీ మూలధనం విషయంలో ప్రభుత్వం ఎటువంటి చర్యలను తీసుకుంటుందో తెలియకపోవడం.
(4) దేశ విభజనవల్ల అస్థిరమైన రాజకీయ వాతావరణం.

ప్రైవేట్ ఉద్యమాకారులలో ఉన్న భయభ్రాంతులను తొలగించటానికి పారిశ్రామిక రంగంలో వారి పెట్టుబడులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం 1948 పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది.

BRAOU

## 17.3 పారిశ్రామిక విధాన తీర్మానం, 1948

### 17.3.1 తరగతులు

ఈ విధానం ప్రకారం పరిశ్రమలను నాలుగు ప్రధాన తరగతులుగా విభజించారు.

(a) మొదటి తరగతి కింద వర్గీకరించిన వస్తువుల ఉత్పత్తి పంపిణీలు ప్రభుత్వ పరంగా జరుగుతాయి. వాటి పూర్తి యాజమాన్యం కేంద్ర ప్రభుత్వం వహిస్తుంది. యుద్ధ సామాగ్రి, అణుశక్తి, రైల్వేలు మొదలైనవి దీన్లో ఉన్నాయి.

(b) రెండవ తరగతి కింద వర్గీకరింపబడిన వస్తువులు: బొగ్గు, ఇనుము, ఉక్కు, నౌకానిర్మాణం, టెలిఫోనుల తయారీ, విమానాల తయారీ, టెలిగ్రాఫ్ వైర్‌లెస్ పరికరాలు, రేడియోలు, ఖనిజతైలాలు మొదలైనవి. అప్పటివరకు ప్రైవేట్ యూనిట్లు నడుపుతున్న సంస్థలు ఇకముందు కూడా కొనసాగుతాయి. కాని, కొత్త సంస్థలు మాత్రం వీటి ఉత్పత్తిలో ప్రవేశించకూడదు. కొత్త సంస్థలు ప్రభుత్వ రంగంలో మాత్రమే నెలకొల్పుతారు.

(c) మూడవ తరగతి కింద మోటారు వాహనాలు, ఉప్పు, భారీపరిశ్రమలు, యంత్రసామాగ్రి, భారీ రసాయనాలు, రసాయనిక ఎరువులు, విద్యుత్ పరిశ్రమలు, ఇనుపేతర లోహాలు రబ్బరు, పారిశ్రామిక ఆల్కాహాలు, ట్రాక్టర్లు వస్తాయి. సిమెంట్, పంచదార, కాగితం, న్యూస్‌ప్రింట్ మొదలైన 20 పరిశ్రమలు ఉంటాయి. వీటిని అవసరమైతే ప్రభుత్వం జాతీయం చేయవచ్చు.

(d) పై మూడు తరగతులలో రాని మిగిలిన వస్తువులన్నీ ప్రైవేట్ రంగానికి పూర్తిగా కేటాయించారు. (వ్యక్తిగత యాజమాన్యానికి లేదా ఉమ్మడి యాజమాన్యానికి)

### 17.3.2 విధాన చర్యలు

1948 పారిశ్రామిక విధానం ప్రకారం కుటీర పరిశ్రమలనూ, చిన్న పరిశ్రమలనూ అభివృద్ధి పరిచే పాత్రను ప్రైవేటు వ్యక్తులకూ, గ్రామీణ సహకార సంస్థలకూ విడిచి పెట్టారు. ఈ పరిశ్రమలను వృద్ధి చేసినందువల్ల దేశంలో పారిశ్రామిక వికేంద్రీకరణ కూడా జరుగుతుందని 1948 పారిశ్రామిక తీర్మానం గుర్తించింది.

శ్రామికుల వేతనానికీ, శ్రామికుల—యాజమాన్య సంబంధాలకూ ఈ తీర్మానం అధిక ప్రాధాన్యతను ఇచ్చింది. శ్రామికులకు న్యాయమైన వేతనాలను చెల్లించినప్పుడే వారికీ, యాజమాన్యానికీ మధ్య సత్సంబంధాలు ఉంటాయని ఈ తీర్మానంలో పేర్కొన్నారు. పారిశ్రామిక వాతావరణాన్ని మెరుగుపరచటానికి యాజమాన్యంలో శ్రామికుల పాత్ర ఉండాలని కూడా పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడి అవసరాన్ని ఈ తీర్మానం గుర్తించింది. అయితే విదేశీ పెట్టుబడి మన దేశంలో పెట్టుబడికి పూరకంగా మాత్రమే ఉండాలి. జాతీయశ్రేయస్సుకు భంగంకరంగా విదేశీ పెట్టుబడులు ఉండకూడదు. కాలక్రమేణా విదేశీ సంస్థలను జాతీయం చేయవలసిన అవసరమున్నదని ఈ తీర్మానం పేర్కొన్నది.

1948 తీర్మానం రాజ్యాంగ రీత్యా ఒక మిశ్రమ ఆర్థిక వ్యవస్థకు గట్టి పునాదులను ఏర్పర్చింది. పరిశ్రమలు ప్రైవేట్, పబ్లిక్ రంగాలలో కొనసాగవచ్చుని విస్తరించింది.

## 17.4 పరిశ్రమల (అభివృద్ధి, క్రమబద్ధం) చట్టం 1951

1948 తీర్మానం తరువాత పరిశ్రమలకు సంబంధించినంత మేరకు 1951లో ప్రవేశపెట్టిన లైసెన్సింగ్ చట్టం చాలా ముఖ్యమైనది. పరిశ్రమలను అభివృద్ధిచేయుటానికీ, క్రమబద్ధం చేయుటానికీ ప్రభుత్వం ఈ చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ చట్టంలో ముఖ్యనిబంధనలు ఇవి:

(a) ప్రభుత్వ అనుమతిలేనిదే పారిశ్రామిక సంస్థల్ని కొత్తగా నెలకొల్పకూడదు. ప్రస్తుతం ఉన్న సంస్థలను కూడా విస్తరించకూడదు. సంస్థలను నెలకొల్పవలసిన స్థలాన్ని, పరిమాణాన్ని, ఈ చట్టం నిర్దేశిస్తుంది.

(b) సంస్థలు ఉత్పత్తి చేసే వస్తువుల పరిమాణం తగ్గినప్పుడులేదా వాటి నాణ్యత క్షీణించినప్పుడు లేదా జాతీయ ప్రాధాన్యత గల వనరులను అనవసరంగా వినియోగించినప్పుడూ ప్రభుత్వం సంస్థల కార్యకలాపాల మీద విచారణను జరిపించవచ్చు.

(c) ప్రభుత్వ ఉత్తర్వులను అమలు పరచని సంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు.

(d) ఈ చట్టం ప్రకారం వస్తువుల ధరలనూ, వాటి ఉత్పత్తి పరిమాణాన్నీ, పంపిణీ విధానాన్నీ ప్రభుత్వం నిర్ణయించవచ్చు.

(e) ప్రత్యేకంగా ఒక పరిశ్రమకుగానీ, లేదా కొన్ని పరిశ్రమలకుగాని అభివృద్ధి మండలాలనుప్రభుత్వం నెలకొల్పవచ్చు. ఈ నిబంధనలనుపురస్కరించుకొని 1952 మే నెలలో కేంద్రీయ సలహా మండలిని ఏర్పాటు చేసారు.

ఈ చట్టం ప్రకారం ప్రైవేటు సంస్థలకార్యకలాపాలను ప్రభుత్వం నియంత్రిస్తుంది. సంతులిత ప్రాంతీయాభివృద్ధిని సాధించటానికి ఏ కొద్ది మంది ఉద్యమదారుల చేతుల్లో పరిశ్రమల యాజమాన్యం కేంద్రీకృతం కాకుండానివారించటానికి ఈ చట్టం ద్వారా ప్రభుత్వానికి అధికారం సంక్రమించింది.

## మీ అవగాహనను పరీక్షించుకోండి – 1

1. పారిశ్రామిక విధానాన్ని ఏయే కారకాలు ప్రభావితం చేస్తాయి?
2. 1948 పారిశ్రామిక విధాన తీర్మానాన్ని ప్రకటించే సమయంలో భారతదేశ ఆర్థిక పరిస్థితి ఏ విధంగా ఉంది?
3. 1948 పారిశ్రామిక విధాన తీర్మానంలో పరిశ్రమలను ఎన్ని తరగతులుగా విభజించారు?

## 17.5 పారిశ్రామిక విధాన తీర్మానం, 1956

### 17.5.1 1948 తీర్మానం అమలు తర్వాత అభివృద్ధి

1956 ఏప్రియల్ 30న నూతన పారిశ్రామిక తీర్మానాన్ని ప్రభుత్వం ప్రకటించింది. 1948 తీర్మానం ప్రవేశపెట్టిన తరువాత ఆర్థిక వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయి. కాబట్టి నూతన తీర్మానాన్ని ప్రవేశపెట్టవలసిన అవసరం ఏర్పడింది. 1948 తీర్మానం తరువాత దేశంలో సంభవించిన కొన్ని ముఖ్య సంఘటనలు ఇవి:—

(1) 1950లో రాజ్యాంగం ద్వారా ప్రాథమిక హక్కులను కలుగజేయటం. నిర్దేశిక (ఆదేశిక) సూత్రాలను రాజ్యాంగంలో పొందుపరచడం.

(2) మొదటి పంచవర్ష ప్రణాళిక నుంచి తెలుసుకున్న అనుభవానుబట్టి నూతన పారిశ్రామిక విధానం అవసరం.

(3) సామ్యవాద రీతి సమాజస్థాపన మన ప్రణాళికలు ముఖ్య ధ్యేయంగా పార్లమెంట్ ఆమోదించినది.

(4) రెండవ పంచవర్ష ప్రణాళికను ప్రవేశపెట్టవలసిన సమయం ఆసన్నమవడం.

ఈ సంఘటనల వల్ల పారిశ్రామిక విధానాన్ని పునఃపరిశీలించవలసి వచ్చింది. ఫలితంగా 1956 తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

### 17.5.2 1956 పారిశ్రామిక తీర్మానంలోని షెడ్యూళ్ళు

(a) షెడ్యూల్ A : ఈ పట్టికలో 17 పరిశ్రమలున్నాయి. వీటిని భవిష్యత్‌లో అభివృద్ధి పరచవలసిన బాధ్యత పూర్తిగా ప్రభుత్వానిదే. ఈ పరిశ్రమలు జాతీయశ్రేయస్సుదృష్ట్యా మౌలికమైనవి, కీలకమైనవి. ఇనుము, ఉక్కు, అణుశక్తి, భారీయంత్రసామాగ్రి, బొగ్గు, ఖనిజ నూనెలు, రైల్వేలు, రవాణా విద్యుచ్ఛక్తి మొదలైనవి వాటిలో ముఖ్యమైనవి. వీటిని ప్రభుత్వరంగంలోనే నెలకొల్పవలసి ఉంటుంది.

(b) షెడ్యూల్ B : ఈ పట్టికలో 12 పరిశ్రమలున్నాయి. వీటిని క్రమంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. కొత్త పరిశ్రమల్ని ప్రభుత్వ రంగంలో స్థాపిస్తారు. అవి ప్రైవేట్ రంగ సంస్థలకు పూరకాలుగా ఉంటాయి. అల్యూమినియం, యంత్రసామాగ్రి, ఫెర్రో ఎల్లాయ్‌లు, ఎరువులు, సింథటిక్ రబ్బరు సముద్రయానం మొదలైనవి.

(c) షెడ్యూలు C : పై రెండు తరగతులలోలేని పరిశ్రమలన్నీ ఈ పట్టికలో ఉన్నాయి. వీటి అభివృద్ధిని పూర్తిగా ప్రైవేట్ రంగానికి విడిచి పెట్టారు.

### 17.5.3 విధాన లక్ష్యాలు

త్వరితగతిలో పారిశ్రామికీకరణచేయుటమే 1956 విధానం ముఖ్య ధ్యేయం. పబ్లిక్ రంగాన్నీ సహకార సంస్థలనూ విస్తృత పరచటం, ఆదాయ సంపదల అసమానతలను తొలగించటం ఏకస్వామ్య, బహుళస్వామ్య



BRAOU

పద్ధతులలో కేంద్రీకృత ధోరణులను అరికట్టటం మొదలైనవి కూడా ఈ విధాన ధ్యేయాలని చెప్పవచ్చు. 1956 విధానంలో పరిశ్రమలను మూడు తరగతులుగా వర్గీకరించినప్పటికీ అటువంటి విభజన శాశ్వతమైనది కాదు. అంటే షెడ్యూల్ A లో ఉన్న పరిశ్రమలను ప్రైవేటు యాజమాన్యానికి అప్పగించవచ్చు. అదే విధంగా పబ్లిక్ రంగంలోకి కొన్ని ప్రైవేటు పరిశ్రమలను కూడా చేర్చవచ్చు.

1956 పారిశ్రామిక తీర్మానం కూడా కుటీర, చిన్న పరిశ్రమల వృద్ధిని ప్రోత్సహించడానికి ఎన్నో చర్యలను రాయితీలు ఇవ్వడం, ముడిసరుకులను పొందేటట్లు చూడటం మొదలైనవి. విదేశీ ఉద్యమదారులను వారి పెట్టుబడుల విషయంలో ఎటువంటి భయం పెట్టుకోనక్కరలేదని హామీలను ఈ తీర్మానం ప్రకటించింది. ప్రాంతీయ అసమానతలను తొలగించటానికి విద్యుచ్ఛక్తి, రవాణా మొదలైన ముఖ్యమైన అవస్థాపన నిర్మాణాలను ఈ తీర్మానం ప్రాధాన్యత వ్యక్తం చేసినది.

## 17.5.4 1956 విధాన తీర్మానపు గుణగణాలు

ఈ కింది విషయాలలో 1956 తీర్మానం 1948 తీర్మానం కంటే మెరుగైనదని తెలుసుకోవచ్చు.

(a) ప్రభుత్వ రంగానికి అధిక ప్రాముఖ్యం ఇవ్వడం.

(b) పబ్లిక్, ప్రైవేట్ రంగాలకు కేటాయించిన పరిశ్రమలలో ఎక్కువ సరళతను పొందుపరచటం.

(c) 1956 తీర్మానాన్నిబట్టి వారి ఆస్తులకు ఎటువంటి భయం లేదని ప్రైవేట్ ఉద్యమదారులకు నమ్మకం కలిగింది. ప్రభుత్వం సిద్ధాంత పరంగా వాటిని జాతీయం చేయబోదని స్పష్టం అయింది.

(d) ఈ నూతన విధానం ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మధ్య సత్సంబంధాలను నిర్మరచటానికి ఉద్దేశించపబడింది.

(e) ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు న్యాయమైన, విచక్షణారహితమైన ఆదరణ ఉంటుందని ఈ తీర్మానంలో ఉద్దేశించారు.

ప్రణాళికా ధ్యేయాలను సాధించటానికి ప్రభుత్వం అప్పుడప్పుడు కొన్ని చర్యలు తీసుకున్నప్పటికి మొత్తం మీద 1956లో ప్రవేశపెట్టిన తీర్మానము యిప్పటి వరకు అమలులోనే ఉన్నది.

## 17.5.5 1956 తీర్మాన విమర్శనాత్మక విశ్లేషణ

ఇప్పుడు 1956 తీర్మానానికి సంబంధించిన కొన్ని విమర్శలను పరిశీలిద్దాం. ఈ తీర్మానం ప్రభుత్వరంగానికి ప్రాధాన్యతనిచ్చినందువల్ల ప్రైవేట్ సంస్థల అభివృద్ధికి విచక్షణ చూపడం జరిగిందని విమర్శకులు అంటారు. ప్రైవేట్, ప్రభుత్వ రంగాలు ఒకదానికొకటి పూరకాలుగా సహకరించుకోడానికి బదులు ఒకదానికొకటి వైరుధ్యంగా వ్యవహరించాయని వీరి అభిప్రాయం. నిశితంగా పరిశీలిస్తే ఈ విమర్శలు సరియైనవికావని వెల్లడవుతుంది. ప్రభుత్వ రంగాన్ని విస్తృత పరచినందువల్ల ప్రైవేట్ రంగం అభివృద్ధికి అవకాశాలు ఎక్కువైనాయి. అంతేగాని ప్రభుత్వ రంగం విస్తరణ ప్రైవేట్ రంగ అభివృద్ధిని కుంటుపరచలేదు. ప్రైవేట్ రంగానికి అవసరమైన అవస్థాపనను ప్రభుత్వ రంగం సమకూర్చిందని కూడ అనుకోవచ్చు. పై పెచ్చు ఈ తీర్మానం ప్రైవేట్ ఉద్యమాదారులలో ఉన్న భయభ్రాంతులనుతొలగించింది. భారతదేశంలో మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ఆవిర్భావానికి ఈ తీర్మానం ఎంతగానో తోడ్పడింది. ప్రణాళికా కాలంలో పెట్టుబడులను పరిశీలిస్తే, ప్రైవేటు రంగంలో పెట్టుబడి నానాటికీ పెరుగుతునే ఉంది.

ప్రభుత్వరంగం మూలధన సాంద్రతమైన భారీమౌలిక వస్తువుల తయారీలో నిమగ్నమై ఉండే వినియోగవస్తువుల తయారీలో మాత్రం యిప్పటికీ ప్రైవేట్ రంగానిదే పై చేయి అని చెప్పాలి.

## మీ అవగాహనను పరీక్షించుకొండి – 2

4. 1956 విధాన తీర్మానంలో ఎన్ని షెడ్యూల్సు ఉన్నాయి?
5. 1956 విధాన ప్రధాన లక్ష్యాలేమిటి?
6. 1956 విధానంలోగల గుణగణాలను వివరించండి.

## 17.6 1956 నుండి వెలువడిన ప్రధాన విధానాల వివరణ

1956 పారిశ్రామిక తీర్మానం తర్వాత అప్పుడప్పుడు ప్రభుత్వం కొన్ని విధానాలను ప్రకటించింది. వాటిలో ముఖ్యమైనవి 1970, 1973లో ప్రకటించిన విధానాలు.

### 17.6.1 పారిశ్రామిక లైసెన్సింగ్ విధానం, 1970

1970 ఫిబ్రవరిలో పారిశ్రామిక లైసెన్సింగు పాలసీ విచారణ సంఘం చేసిన సిఫార్సులను ఆమోదించడం జరిగింది. ఈ సిఫార్సులు ముఖ్యంగా పారిశ్రామిక వ్యవస్థలో కేంద్రీకృత ధోరణులను అరికట్టడానికి ఉద్దేశించారు. పారిశ్రామిక రంగాన్ని కోర్ రంగం, మధ్యరకంరంగం భారీ పెట్టుబడులరంగం అని మూడు రకాలుగా విభజించారు.

కోర్ రంగంలో వ్యవసాయ ఉత్పాదకాలు, ఇనుము, ఉక్కు, ఇతర లోహాలు, పెట్రోలియం, కోకింగు బొగ్గు, భారీపారిశ్రామిక యంత్రాలు, నౌకానిర్మాణం, డ్రెడ్జర్లు, న్యూస్‌ప్రింటు వస్తాయి. కోర్ రంగంలో ఉన్న పరిశ్రమల 1956 తీర్మానం షెడ్యూల్ ఏ లో ఉండే వాటికి పూర్తిగా ప్రభుత్వరంగమే ఆధిపత్యం వహిస్తుంది.

రూ. 5 కోట్లు పెట్టుబడికి మించిన పరిశ్రమలను భారీ పెట్టుబడి పరిశ్రమలుగా నిర్వచించారు. వీటిలో పబ్లిక్‌రంగానికి కేటాయించిన పరిశ్రమలు పోను మిగిలిన పరిశ్రమలను ప్రైవేటు రంగంలో నడపవచ్చు.

రూ. 1 కోటిపైన రూ. 5 కోట్లు లోపు పెట్టుబడిగల పారిశ్రామిక సంస్థలను మధ్యరకం రంగంలో చేర్చారు. పెద్దపెద్ద పారిశ్రామిక సంస్థలకు ఈ పరిశ్రమలను నడిపించటానికి లైసెన్సులను మంజూరు చేయరు. ఇతరులకు మాత్రమే లైసెన్సులను మంజూరు చేస్తారు.

### 17.6.2 పారిశ్రామిక విధాన తీర్మానం 1973

ఆ తరువాత 1973 ఫిబ్రవరిలో ఇంకొక విధానాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ఈ విధానం కూడ పారిశ్రామిక కేంద్రీకృత ధోరణులను అరికట్టటానికే ప్రాముఖ్యతనిచ్చింది. చిన్న, మధ్యతరహా పరిశ్రమలనూ, సహకార సంస్థలనూ వృద్ధిపరచటానికి ఎక్కువ వీలుకల్పించారు. ఈ లైసెన్సు విధానంలో కొన్ని ముఖ్య అంశాలు ఇవి:

(a) పెద్ద పారిశ్రామిక సంస్థల నిర్వచనాన్ని మార్చారు. ఇంతకుముందు రూ. 35 కోట్ల ఆస్తులున్న సంస్థల్ని మాత్రమే పెద్ద సంస్థలుగా పరిగణించేవారు. కానీ ఈ లైసెన్సు విధానంలో ఆ పరిమితిని రూ. 20 కోట్ల మేరకు తగ్గించారు. పెద్ద పారిశ్రామిక సంస్థలకు వస్తూత్పత్తి చేయటానికి లైసెన్సులను మంజూరు చేయడంలో 1969 MRTP చట్టం కింద ఉన్న నిబంధనలను అమలు జరపాలని కూడా పేర్కొన్నారు.

(b) కోర్ రంగంలో ఉన్న పరిశ్రమల జాబితాను పెంచారు. జాతీయ శ్రేయస్సు దృష్ట్యా విస్తృత ప్రభావమున్న పరిశ్రమలను ఇందులో చేర్చారు.

(c) విదేశ సంస్థలు కోర్ రంగంలో ఎగుమతికి సంబంధించిన వస్తువుల తయారీలో పాల్గొనవచ్చు. అయితే వారి

కార్యకలాపాలు ప్రభుత్వము నిర్దేశించిన సూత్రాల మేరకు ఉండాలి. విదేశీ సంస్థల పాత్రను సాంకేతిక పరమైన విషయాలను దృష్టిలో ఉంచుకొని పరిశీలించవలసి ఉంటుంది. అటువంటి సంస్థల వల్ల ఎగుమతులూ విదేశ వ్యాపార చెల్లింపుల శేషం ఏ విధంగా ప్రభావితం అవుతుందో పరిశీలించవలసి ఉంటుంది.

(d) సాంకేతిక, ఆర్థిక, సాంఘిక విషయాలను దృష్టిలో ఉంచుకొని మాత్రమే లైసెన్సులను మంజూరు చేయవలసి ఉంటుంది. వెనుకబడిన ప్రాంతాలలో నెలకొల్పే సంస్థలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వవలసి ఉంటుంది.

(e) ఈ విధానాన్ని బట్టి చిన్న, మధ్యతరహా పరిశ్రమలు అత్యధిక ప్రజలు ఉపయోగించే వినియోగ వస్తువులను తయారు చేయవచ్చు. ఈ వస్తువుల తయారీ ఉమ్మడి రంగంలోనూ, సహకార రంగంలోనూ కూడా ఉండవచ్చు.

### 17.6.3 1978, 1980 పారిశ్రామిక విధాన తీర్మానాలు

జనతా ప్రభుత్వ హయాంలో కుటీర, చిన్నపరిశ్రమల అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ1978 జనవరిలో ఒక విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ పరిశ్రమలు ఉత్పత్తి చేసే వస్తువులు పెద్ద పరిశ్రమలు ఉత్పత్తి చేయకూడదు. సుమారు 500 రకాల వస్తువులను చిన్న పరిశ్రమల రంగానికి కేటాయించారు.

అయితే మధ్యంతర ఎన్నికల తరవాత 1980 జూలైలో ఆరవ పంచవర్ష ప్రణాళికను దృష్టిలో ఉంచుకొని ఇంకొక విధానాన్ని ప్రకటించారు. ఈ విధానాన్ని బట్టి చిన్న పరిశ్రమలకున్న నిర్వచనం మారింది. పరిశ్రమలో ప్రధాన పెట్టుబడి రూ. 20 లక్షల మేరకు ఉన్నప్పటికీ "చిన్నపరిశ్రమ" కిందనే పరిగణించాలి. సహాయ లేదా ఉపక్రియ (Auxiliary) పెట్టుబడి రూ. 25 లక్షల మేరకు ఉండవచ్చుని భావించారు. పబ్లిక్ రంగ సంస్థల ఉత్పాదక శక్తిని పూర్తిగా వినియోగిస్తే ఆ సంస్థలు లాభాలను గడించి భవిష్యత్‌లో అభివృద్ధి చెందగలవని ఈ విధానం భావించింది. ఉత్పాదక శక్తిని అభిలషణీయంగా వినియోగించటమే కాకుండా పరిసర వాతావరణాన్ని పరిరక్షించు కోవడం కూడా పరిశ్రమలు చేయవలసి ఉంటుందని ఈ విధానం నిర్దేశించింది.

### 17.6.4 విశ్లేషణ

పై అంశాలను బట్టి మనకు తెలిసేదేమంటే 1956 పారిశ్రామిక తీర్మానం మొత్తంమీద మారలేదు. పోతే లైసెన్సుల విషయంలో కొన్ని నిబంధనలను మారుస్తూ వివిధ విధానాలను ప్రవేశపెట్టారు. ఆ విధంగా ప్రవేశపెట్టడంలో ఉద్దేశం పారిశ్రామిక అభివృద్ధి ఫలితాలు ఏ కొద్దిమంది ప్రైవేట్ పారిశ్రామిక వేత్తలకో హస్తగతం కాకూడదనే సంతులిత ప్రాంతీయాభివృద్ధికీ, అన్ని వర్గాల ప్రజలశ్రేయస్సుకూ పారిశ్రామిక రంగ అభివృద్ధి తోడ్పడాలి. ఈ ధ్యేయాన్ని సాధించటానికే ప్రభుత్వం ప్రవేట్ రంగ కార్యకలాపాలను, ఎప్పటికప్పుడు కొన్ని విధానాలను ప్రకటిస్తూ నియంత్రణ చేస్తుంది. అలా చేయడంలో "మిశ్రమ ఆర్థిక వ్యవస్థ" లక్షణాలను భంగం కలగకుండా తగు విధానాలను చేపడుతుంది.

---

మీ అవగాహనను పరీక్షించుకోండి — 3

---

7. 1970లైసెన్సింగు విధానంలో ప్రధాన అంశాలేమిటి?
8. 1973పారిశ్రామిక విధాన ప్రధాన ఉద్దేశమేమిటి?

---

## 17.7 స్వాతంత్ర్యానంతరం పారిశ్రామికీకరణ అభివృద్ధి తీరుతెన్నులు

మన పారిశ్రామిక రంగం ఎదుర్కొంటున్న సమస్యలను సక్రమంగా అర్థ చేసుకోవడానికి గత 30 సంవత్సరాలలో జరిగిన అభివృద్ధిని ఇప్పుడు సమీక్షిద్దాం.

మొదట పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయ రంగానికి ప్రాముఖ్యమిచ్చారు. విద్యుచ్ఛక్తి నీటి పారుదల వంటి అవస్థాపనను నిర్మించినచో భవిష్యత్‌లో త్వరితగతిలో పారిశ్రామికీకరణ సాధించవచ్చునని భావించారు. మొదటి పంచవర్ష ప్రణాళికలో పారిశ్రామికోత్పత్తి సంతృప్తికరంగానే ఉన్నది. ఉత్పాదక వస్తువులు 17 శాతం పెరిగాయి. మధ్యరకం వస్తువులు 34 శాతం పెరిగాయి. పెట్రోలియం రిఫైనింగు, నౌకానిర్మాణం, రైల్వే వ్యాగన్లు మొట్టమొదటిసారిగా తయారయ్యాయి. పబ్లిక్‌రంగంలో సింధ్రి ఎరువుల కర్మాగారం, చిత్తరంజన్ రేల్వేఫాక్టరీ, భారత్ టెలిఫోన్ పరిశ్రమలను నిర్మించారు.

భారీ పరిశ్రమల స్థాపనకు రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో పథకాలు వేశారు. భారీ ఇంజనీరింగ్, భారీ రసాయనాలు, యంత్రసామగ్రి మొదలైన పరిశ్రమలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. పబ్లిక్ రంగంలో రూర్కెలా, భిలాయ్, దుర్గాపూర్‌ల వద్ద ఉక్కు కర్మాగారాలను నిర్మించారు. సిమెంట్ రసాయనాల వంటి అత్యవసర వస్తువుల ఉత్పత్తికి ప్రాధాన్యతను ఇచ్చారు. అయితే రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో వేతన వస్తువుల కొరత ఏర్పడింది.

మూడవ పంచవర్ష ప్రణాళికలో ఉత్పాదక వస్తువుల పరిశ్రమలను విస్తృతపరిచారు. పబ్లిక్ రంగం ఆ మేరకు అధికపాత్ర వహించింది. కాని మూడవ ప్రణాళిక ఫలితాలు ఆశాజనకంగా లేవు. అందుకు ఈ కింది కారణాలను సాధారణముగా చెబుతూ ఉంటారు.

(1) చైనా, పాకిస్తాన్‌లతో యుద్ధాలు

(2) విదేశమారక ద్రవ్యం కొరత

(3) ప్రతికూల వర్ష ప్రభావం.

అయితే పారిశ్రామిక అభివృద్ధి ముఖ్యంగా 1965-66 సంవత్సరము నుంచీ సన్నగిల్లింది. నాల్గవ ప్రణాళికలో కూడ పారిశ్రామికాభివృద్ధి సంతృప్తికరంగా లేదు. విద్యుచ్ఛక్తి కొరత, ఉత్పాదక శక్తిని పరిశ్రమలు పూర్తిగా వినియోగించక పోవటం, రవాణా సదుపాయాలు తగినంతగా లేకపోవటం ముఖ్యకారణాలుగా పేర్కొనవచ్చు. ఐదవ ప్రణాళికలో కూడా పారిశ్రామికీకరణ ముందంజ వేయలేక పోయింది. ఆరవ ప్రణాళికలో 1982-83 సంవత్సరంలో 3.9 శాతం, 1983-84 లో 4.5 శాతం పారిశ్రామికాభివృద్ధి ఉన్నది.

ఆరవ ప్రణాళిక మొత్తం కాలానికి సగటున సాలీనా 4.5 శాతం వృద్ధి రేటు ఉండవచ్చని భావిస్తున్నారు. 1965 నుండి పారిశ్రామిక అభివృద్ధి రేటు క్షీణించటానికి కారణ భూతమైన ముఖ్యకారకాలను మనం ఇప్పుడు తెలుసుకుందాం.

1965వ సంవత్సరం వరకూ గణనీయమైన ప్రగతి ఉన్నది. 1951 నుండి 1965 మధ్య సగటున సాలీనా పారిశ్రామిక వృద్ధిరేటు 7.7 శాతం ఉన్నది. అయితే 1965 నుంచి 1975 వరకు గల దశాబ్దంలో అకస్మాత్తుగా ఈ రేటు 3.6 శాతానికి దిగజారిపోయింది. అంటే పారిశ్రామిక వృద్ధి రేటు సాఫీగా జరగలేదని అర్థమవుతుంది. 1976 వ సంవత్సరంలో మళ్ళీ అకస్మాత్తుగా 10 శాతానికి వృద్ధిరేటు పెరిగింది. అయితే ఆ తరవాతి సంవత్సరాలలో పారిశ్రామిక వృద్ధిరేటు సంతృప్తికరంగా లేదు. 1977-78 సంవత్సరము కంటె 1978-79 లో వృద్ధిరేటు 7.6 శాతం పెరిగితే 1978-79 తో పోల్చి చూస్తే 1979-80 లో వృద్ధిరేటు 4 శాతం క్షీణించింది. ఆ తరువాత 1980-81 లో 1979-80 కంటె 5.6 శాతం మళ్ళీ పెరిగింది. మొత్తంమీద 1965-66 నుండి పారిశ్రామికాభివృద్ధి సంతృప్తికరంగా లేదనే చెప్పాలి.

## 17.8 పారిశ్రామికాభివృద్ధికి అడ్డంకులు

పారిశ్రామికాభివృద్ధికి గల అడ్డంకులు అనేకం. అవి జటిలమైనవి. ఏదో ఒక కారణాన్ని చెప్పడానికి వీలుండదు. అయితే 1965 నుండి పారిశ్రామిక అభివృద్ధిని దెబ్బతీసిన కొన్ని ముఖ్యమైన కారణాలు ఇవి:—

BRAOU

1. వ్యవసాయరంగం అభివృద్ధి క్షీణించింది.
2. ఆదాయ పంపిణీలో మార్పులు.
3. పబ్లిక్ రంగంలో పెట్టుబడి తగ్గడం.
4. దిగుమతుల ప్రతిస్థాపన తగ్గుముఖం పట్టడం.
5. యాజమాన్యంలో అసమర్థత ఎక్కువ కావటం.

పైన పేర్కొన్న కారణాలను ఇప్పుడు చర్చిద్దాం. పారిశ్రామిక అభివృద్ధి వ్యవసాయ రంగం వృద్ధితో ముడిపడి ఉంటుంది. వ్యవసాయ రంగం వేతన వస్తువులను (ఆహార ధాన్యాలు) సప్లయి చేయడమే కాకుండా పరిశ్రమలకు కావలసిన ముడి పదార్థాలను కూడా అందిస్తుంది. పరిశ్రమలు ఉత్పత్తి చేసే వస్తురాశికి సార్థక డిమాండ్ కలుగజేస్తుంది. కాబట్టి వ్యవసాయ ఉత్పత్తి క్షీణిస్తే కొంతవరకు ఆ రంగంపై ఆధారపడుతున్న పరిశ్రమలు కూడా దెబ్బతింటాయి. కొంతమంది శాస్త్రవేత్తలు ఆదాయ పంపిణీలో వచ్చిన మార్పులవల్ల 1965 నుంచి పారిశ్రామిక స్తబ్దత ఏర్పడిందని భావించారు. మొదటి పంచవర్ష ప్రణాళిక నుంచి ఆర్థికాభివృద్ధి లాభాలను ఎక్కువగా ఉన్నత ఆదాయశ్రేణి వారు అనుభవించగలిగారు. ఫలితంగా, ఎక్కువ మంది పేదవారు కావటం, అందువల్ల కొన్ని పారిశ్రామిక వస్తువులకు సార్థక డిమాండ్ లోపించటం జరిగింది. ఈ కారణాలతోపాటు పబ్లిక్ రంగంలో పెట్టుబడి పరిమాణం క్షీణించినందువల్ల అవసరమైన అవస్థాపన సాధ్యంకాలేదనీ అందువల్ల పారిశ్రామికీకరణ కుంటుపడిందని కూడా కొందరి అభిప్రాయం. పోతే విదేశీ వ్యాపారంలో ప్రభుత్వం చేపట్టిన విధానాలవల్ల వస్తువుల ఉత్పత్తి వ్యయం పెరిగిన మన ఎగుమతులు అంతర్జాతీయ పోటీని తట్టుకోలేకుండా ఉన్నాయని అందువల్ల కూడా పారిశ్రామికీకరణ క్షీణించిందని భావించారు. పబ్లిక్ రంగంలో ఉన్న పరిశ్రమలను సమర్థంగా నడపనందువల్ల కూడా పారిశ్రామికీకరణ ముందంజ వేయలేక పోయింది.

## 17.9 పారిశ్రామిక స్తబ్దత: కారణాలు

ఇటీవల ముఖ్యంగా 1965 నుండి పారిశ్రామిక ప్రగతి క్షీణించడం గమనించవచ్చు. దీనిని చాలామంది పారిశ్రామిక ప్రగతిలో స్తబ్దతగా పేర్కొన్నారు. అయితే పారిశ్రామిక స్తబ్దతకు దారితీసిన కొన్ని కారణాలను మనం ఇప్పుడు తెలుసుకుందాం.

స్వాతంత్ర్యానంతరం పారిశ్రామిక రంగంలో వృద్ధిరేటు ఎక్కువగానే ఉన్నది. అయితే, పెరుగుదల రేటు పోకడలను పరిశీలిస్తే చాలా ఒడుదుడుకులు కన్పిస్తాయి. ఉదాహరణకు 1951-65 మధ్య పారిశ్రామిక ఉత్పత్తి ప్రతి సం. సగటున 7.7 శాతం చొప్పున పెరిగింది. అయితే, ఈ రేటు 1965-75 మధ్య సాలీనా 3.6 శాతానికి పడిపోయింది. 1976 సంవత్సరంలో అనుకోకుండా 10 శాతం మేరకు పారిశ్రామిక ఉత్పత్తి పెరుగుదల రేటు వచ్చింది. మళ్లీ 1977 నుంచి పారిశ్రామిక వృద్ధిరేటును పరిశీలిస్తే 1.4 శాతం నుండి 4.5 శాతం మేరకు వివిధ సంవత్సరంలో వివిధ రేట్లు ఉన్నాయి. కాబట్టి 1965 నుంచి ఒక విధంగా చెప్పాలంటే పారిశ్రామిక వృద్ధిరేటు పెరగలేదని అనుకోవలసి ఉంటుంది. ఈ విధమైన పారిశ్రామిక స్తబ్దత రావడానికి గల కారణాలను అనేక మంది మేధావులు పరిశీలించారు. అనేక మంది అనేక కారణాలను చెప్పారు. ముఖ్యంగా 1970లో భగవతి , దేశాయ్, 1975లో భగవతి, శ్రీనివాసన్, 1978లో దీపక్ నాయర్, 1978లో యస్.ఎల్. షెట్టి, 1981 లో ఏ.వి. దేశాయ్‌లు ఈ విషయాన్ని పరిశీలించారు. అయితే కొన్ని సాధారణ కారణాలను ఇప్పుడు మనం తెలుసుకొందాం.

(1) 1962, 1965, 1971 సం.లో చైనా, పాకిస్తాన్ దేశాలతో యుద్ధాలు జరిపినందువల్ల పారిశ్రామిక రంగంలో మొట్టమొదట అనుకున్న పెట్టుబడిని ఉపయోగించకుండా దానిని యుద్ధ పరికరాల తయారీకి మళ్ళించడం జరిగింది.

(2) 1965-66, 1966-67, 1971-72, 1972-73 సం.లలో వరుసగా వాతావరణం అనుకూలంగా లేదు. ఫలితంగా పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకులను వ్యవసాయ రంగం ఉత్పత్తి చేయలేకపోయింది. అంతేకాకుండా, వ్యవసాయాభివృద్ధి కుంటుపడినందువల్ల పారిశ్రామిక వస్తువులకు తగినంత సార్థక డిమాండ్ మార్కెట్‌లో లేకుండా పోయింది.

(3) కొన్ని కీలకమైన ఉత్పాదకాలు అంటే విద్యుచ్ఛక్తి, మధ్యరకం వస్తువులూ, రవాణా సౌకర్యాలు వంటివి దొరకనందువల్ల కూడా పారిశ్రామిక ప్రగతి దెబ్బతింది.

(4) పై కారణాలతో పాటు 1973 లో ఏర్పడిన క్లిష్టమైన చమురు పరిస్థితి కూడా పారిశ్రామిక ప్రగతిని దెబ్బతీసింది. అరబ్ దేశాలు చమురు ధరలను విపరీతంగా పెంచినందువల్ల మనదేశం వ్యాపార చెల్లింపుల శేషం ఋణాత్మకం అయింది. అంటే విదేశీమారక ద్రవ్యానికి సంబంధించిన సమస్యలు తలెత్తాయి.

(5) ప్రభుత్వం అనుసరించిన లైసెన్సింగ్ విధానం, కంట్రోలు విధానం, పరిపాలనలో అసమర్థతవల్ల వనరులను దుబారాగా వినియోగించటం జరిగింది. ఈ కారణం వల్ల కూడా పారిశ్రామిక ప్రగతి దెబ్బతిన్నదని చెప్పవచ్చు.

భారతీయ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికీ, పరిశ్రమలకూ దగ్గర సంబంధం ఉంది. వ్యవసాయ రంగం దెబ్బతిన్నప్పుడు వేతన వస్తువుల (ఆహార పదార్థాల) ధరలు పెరుగుతాయి. అంతేకాకుండా, పారిశ్రామిక వస్తువులకు సార్థక డిమాండ్ తగ్గిపోతుంది. అంటే, పారిశ్రామిక రంగానికి నష్టాలు వస్తాయన్నమాట. ఫలితంగా పారిశ్రామిక వేత్తలు అదనపు పెట్టుబడిని పెట్టడానికి వెనుకాడతారు. అంతేకాకుండా చాలా పరిశ్రమలలో స్థిర మూలధనాన్ని పూర్తిగా వినియోగించుకోవడం జరగలేదు. కాబట్టి స్థాపించిన ఉత్పాదక శక్తిని పూర్తిగా వినియోగించుకోవడం జరగలేదు. ఫలితంగా మూలధన ఉత్పత్తుల నిష్పత్తి ఎక్కువ కావటం పరిశ్రమలకు నష్టాలు రావటం జరిగింది. పోతే, అంతర్జాతీయ పరిస్థితులను కూడా మనం విస్మరించజాలము. మన ఎగుమతులకు అంతర్జాతీయంగా చాలా పోటీ ఇటీవల, కన్పిస్తున్నది. వీటన్నిటి వల్ల 1965 నుండి పారిశ్రామిక స్తబ్దత ఏర్పడిందని చెప్పవచ్చు.

## 17.10 పారిశ్రామిక ఉత్పత్తిని ఎక్కువ చేయటానికి తీసుకొనవలసిన చర్యలు

పారిశ్రామిక ఉత్పత్తిని పెంచటానికి సప్లయి డిమాండ్ అంశాలను పరిశీలించవలసి ఉంటుంది. సప్లయికి సంబంధించిన విషయాలలో తీసుకోవలసిన చర్యలు: అవస్థాపనా సదుపాయాలను ఎక్కువ చేయటం, ఎక్కువ పెట్టుబడులను పెట్టి, మూలధన, ప్రజల కొనుగోలుశక్తి, అంతర్జాతీయ మార్కెట్టు పరిస్థితులు మొదలైన వాటిని పరిశీలించవలసిన అవసరమున్నది. కాబట్టి ఈ కింద సుదహరించిన చర్యలు అవసరం అవుతాయి.

(i) పారిశ్రామిక, వ్యవసాయ రంగాలలో సరైన వృద్ధి ఉండేటట్లు చేయడం.
(2) సరైన ఆదాయాల, ధరల, వేతనాల విధానాన్ని రూపొందించడం.
(3) వాస్తవికమైన ఎగుమతుల, దిగుమతుల విధానాన్ని ప్రవేశపెట్టడం.
(4) ప్రభుత్వ పంపిణీ విధానం ద్వారా నిత్యావసర వస్తువులను అందించడం.

పారిశ్రామిక ప్రగతి గురించి ఆలోచించేటప్పుడు ఆ రంగాన్ని విడిగా పరిశీలించరాదు. మిగిలిన రంగాలతో ఆ రంగానికి ఉన్న పరస్పర సంబంధాన్ని అన్వేషించాలి. పరిశ్రమలను వృద్ధి చేయటానికి తగు చర్యలను అప్పుడు మాత్రమే రూపొందించవచ్చు.

BRAOU

## 17.11 ముగింపు/సారాంశం

పారిశ్రామికాభివృద్ధిని ఎక్కువ చేయటానికి కీలకమైన వస్తువులను ఎక్కువ చేయాలి. ఉదాహరణకు ఉక్కు, సిమెంటు, బొగ్గు, రైల్వేలు, రవాణా, రసాయనాలను విస్తృతపరచాలి. ఏడవ పంచవర్ష ప్రణాళిక ముసాయిదానునసరించి వృధాగా ఉన్న ఉత్పాదక శక్తిని వినియోగించటానికి, యాజమాన్య సామర్థ్యాన్ని పెంచటానికి చర్యలు తీసుకోవాలి. ఫలితంగా మూలధన ఉత్పత్తుల విస్తృతి తగ్గే అవకాశమున్నది. మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ప్రైవేటు రంగం ప్రభుత్వ విధానాలకు ఏ విధంగా ప్రభావితం అవుతుందో దానిని బట్టితుది ఫలితాలు ఆధారపడి ఉంటాయి. పారిశ్రామికాభివృద్ధి మిగిలిన రంగాలతో ముడిపడి ఉంటుంది. కాబట్టి వివిధ రంగాల మధ్య పరస్పర సమన్వయత్వాన్ని ప్రణాళికల ద్వారా సాధించవలసి ఉంటుంది.

— డా.టి. దివాకరరావు

## 17.12 సంప్రదింపు గ్రంథాలు


1. Datt and sund... m : Indian Economy.
2. Misra and Puri : Indian Economy.


## 17.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. *కింది ప్రశ్నలలో ఒక్కొక్కదానికి 30 పంక్తులలో జవాబులు రాయండి.*

1. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి పారిశ్రామికాభివృద్ధి తీరుతెన్నులను వివరించండి.
2. పారిశ్రామిక విధానాల ఆవశ్యకతను వివరించండి.
3. 1956పారిశ్రామిక విధాన తీర్మానాన్ని విమర్శనాత్మకంగా విశ్లేషించండి.

II. *కింది ప్రశ్నలలో ఒక్కొక్కదానికి సుమారు 15 పంక్తులలో జవాబులు రాయండి.*

1. "ఇటీవలి కాలంలో ముఖ్యంగా 1965 నుంచి పారిశ్రామిక ప్రగతి మందకొడిగా ఉంది" వ్యాఖ్యానించండి.
2. 1948 పారిశ్రామిక విధాన తీర్మానం ప్రధానాంశాలు ఏమిటో వివరించండి.
3 కింది వాటిని వివరించండి.
   (i) పరిశ్రమల (అభివృద్ధి, క్రమబద్ధం) చట్టం, 1951.
   (ii) పారిశ్రామిక లైసెన్సింగు విధానం, 1970.
4 పారిశ్రామిక స్తబ్దతకు గల కారణాలను వివరించండి.

# భాగం — 18: ప్రభుత్వ రంగం

విషయక్రమం


18.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
18.1 పరిచయం
18.2 మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ రంగ పాత్ర
18.3 ప్రభుత్వ రంగ లక్ష్యాలు
18.4 భారతదేశంలో ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రగతి
18.5 వాటి పనితీరు సరిగా లేకపోవడానికి కారణాలు
18.6 పరిష్కార చర్యలు
18.7 సారాంశం/ముగింపు
18.8 సంప్రదింపు గ్రంథాలు
18.9 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 18.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో ప్రభుత్వ రంగ పరిశ్రమల విస్తరణ అవసరాన్ని వివరించడం, వాటి అభివృద్ధిని సమీక్షించడం, వాటిని ఇంకా అభివృద్ధి చేసేందుకు తీసుకొవవలసిన చర్యలను సూచించడం ఈ పాఠం లక్ష్యం.

ఈ భాగాన్నీ చదివిన తర్వాత మీరు

★ ప్రభుత్వ రంగం నిర్వహించగల పాత్రను గుర్తించగలరు.
★ ప్రభుత్వరంగ లక్ష్యాలను తెలుపగలరు.
★ భారతదేశంలో ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రగతిని విశ్లేషించగలరు.
★ ప్రభుత్వరంగ పరిశ్రమల పనితీరు సక్రమంగా లేకపోవడానికి గల కారణాలను అవగాహన చేసుకోగలరు.
★ ప్రభుత్వరంగ సంస్థల పనితీరును మెరుగుపరిచే చర్యలను సూచించగలరు.

## 18.1 పరిచయం

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రభుత్వరంగ పరిశ్రమల పాత్ర చాలా ముఖ్యమైనది. స్వాతంత్ర్యానికి పూర్వం రైల్వేలు, తంతి—తపాలా, రేవులు లాంటి అతి కొద్ది పరిశ్రమలు మాత్రమే ప్రభుత్వ అధీనంలో ఉండేవి.. సాధారణంగా ప్రభుత్వం ప్రజల ఆర్థిక జీవనంలో జోక్యం చేసుకోనేది కాదు. దేశంలో వస్తువుల ఉత్పత్తీ, పంపిణీ చాలావరకు ప్రయివేటు వ్యక్తులకే వదిలివేశారు. స్వాతంత్ర్యానంతరం మాత్రమే ప్రభుత్వ పారిశ్రామికీకరణకు సంబంధించిన విధానాన్ని ప్రకటించింది. "పారిశ్రామిక విధాన తీర్మానం-1948" రూపంలో దీన్ని ప్రకటించారు. దీని ద్వారా మిశ్రమ ఆర్థిక విధానం ప్రభుత్వ ఉద్దేశమని వెల్లడైంది. 1956లో విడుదలైన రెండవ పారిశ్రామిక విధాన తీర్మానంలో ప్రభుత్వరంగ పరిశ్రమల పెరుగుదల, విస్తరణలగురించి నొక్కి చెప్పారు. ఈ తీర్మానంలో 'కొత్త పారిశ్రామిక సంస్థలను ప్రారంభించే బాధ్యతను, వాటిపై

నియంత్రణను ప్రభుత్వం గొప్పగా భావిస్తుంది'' అని స్పష్టంగా పేర్కొన్నారు. దీని తర్వాత ప్రభుత్వ రంగ పరిశ్రమలను పోషిస్తు తరహా సమాజాన్ని సాధించాలనే ముఖ్య లక్ష్యంతో విస్తరింపజేస్తున్నారు.

## 18.2 మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో పబ్లిక్ రంగం పాత్ర

ఆర్థికాభివృద్ధిని పెంపొందించడంలో పారిశ్రామికీకరణ పాత్ర ముఖ్యమని తెలుసుకొన్నాం. అయితే మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామిక విధానం ఏ విధంగా ఉండాలో పరిశీలించాం. మిశ్రమ ఆర్థిక వ్యవస్థ అంటే పెట్టుబడి దారీ, సామ్యవాద ఆర్థిక వ్యవస్థల కలయిక అని చెప్పవచ్చు. ఇందులో పబ్లిక్ రంగం సామ్యవాద వ్యవస్థకు ప్రతీకగా ఉంటుంది. ప్రైవేటు రంగం పెట్టుబడి దారీ ఆర్థిక వ్యవస్థను సూచిస్తుంది. కాబట్టి మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో భారీ, మౌలిక పరిశ్రమలను అభివృద్ధి పరిచి, వాటిని ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఆ విధంగా చేయడానికి కొన్ని కారణాలు ఉన్నాయి.

అవి:

(ఎ) భారీ, మౌలిక పరిశ్రమలకు పెట్టుబడి అధికంగా కావాలి. ప్రయివేటు ఉద్యమదార్లు భారీ మొత్తాలలో పెట్టుబడి పెట్టడానికి ముందంజ వేయలేరు. కాబట్టి ఉద్యమదారుని పాత్ర ప్రభుత్వమే వహించవలసి వుంటుంది.

(బి) ప్రయివేటు ఉద్యమదార్ల కార్యకలాపాలు సాధారణంగా లాభాపేక్షతో ముడిపడి ఉంటాయి. కాని లాభాపేక్ష అనే ప్రాతిపదిక సాంఘిక ధ్యేయాలకు విరుద్ధమైంది.

(సి) దేశంలోని వనరులను హేతుబద్ధంగా ఉపయోగిస్తే సంఘానికి మొత్తంమీద లాభం చేకూరుతుంది. ప్రభుత్వమే ముఖ్యమైన ఉత్పత్తిదారుగా వ్యవహరిస్తేనే ఇది సాధ్యమవుతుంది.

(డి) కొన్ని సందర్భాలలో సంతులిత ప్రాంతీయాభివృద్ధిని సాధించడానికి ప్రభుత్వమే కొన్ని కొత్తపరిశ్రమలను నెలకొల్పవలసి ఉంటుంది.

భారీ, మౌలిక పరిశ్రమలు పబ్లిక్ రంగంలో ఉండడం ప్రధానమైన విషయమైనప్పటికీనీ, జాతీయ శ్రేయస్సు దృష్ట్యా ప్రైవేటు రంగం కార్యకలాపాలను ప్రభుత్వం నియంత్రణ చేయవలసి వుంటుంది. ప్రభుత్వం ద్రవ్య-కోశ, పరిపాలనా విధానాల ద్వారా ప్రైవేటు రంగాన్ని నియంత్రిస్తుంది.

అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వరంగ పరిశ్రమలకు ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరాన్ని విశ్లేషించాలి. ప్రయివేటు రంగంలో ఉత్పత్తి చేసేవారికి లాభార్జనే ధ్యేయంగా ఉంటుందని గమనించాలి. మొత్తం ఉత్పత్తిని ప్రయివేటు రంగానికే వదిలితే గుత్త పెట్టుబడి విధానం తలెత్తుతుంది. ఆర్థికాధికారమంతా కొద్దిమంది పారిశ్రామిక వేత్తల చేతుల్లో కేంద్రీకృతమవుతుంది. దేశంలో ఈ రకమైన పరిస్థితి ఏర్పడడం సాంఘికంగా వాంఛనీయం కాదు. అందుకని ప్రభుత్వ రంగాన్ని విస్తరింపజేయాలి.

అంతేగాక, పారిశ్రామికీకరణ వేగంగా జరగాలంటే ప్రాథమికమైన, వ్యూహాత్మకమైన పరిశ్రమలు తొందరగా అభివృద్ధి కావాలి. ఈ పరిశ్రమలకు పెట్టుబడి అధికంగా కావాలి. ఉత్పత్తిని ప్రారంభించేందుకు దీర్ఘకాలం పడుతుంది. ఇలాంటి పెద్ద పెట్టుబడులకు ప్రయివేటు రంగం ముందుకు రాకపోవచ్చు. ఇందుకు రెండు కారణాలున్నాయి. ఒకటి ప్రయివేటు రంగం పెద్ద మొత్తాల్లో పెట్టుబడులను పెట్టలేకపోవచ్చును. రెండవది పెట్టుబడిమీద ప్రతిఫలం పొందేందుకు వారు దీర్ఘకాలం వేచి ఉండకపోవచ్చు. దీనివల్ల తప్పనిసరిగా విద్యుత్పాదన, వార్త రవాణా సౌకర్యాల విస్తరణ, భారీ యంత్రాలలాంటి ప్రాథమికమైన, వ్యూహాత్మక పరిశ్రమలను ప్రభుత్వ రంగంలోనే స్థాపించాలి. ఈ పరిశ్రమలు ఆర్థికాభివృద్ధికి అవసరమైన సాధన సంపత్తిని సమకూరుస్తాయి. ప్రభుత్వరంగంలో ఈ పరిశ్రమల స్థాపనవల్ల ప్రయివేటు రంగం కొత్త పరిశ్రమలను స్థాపిస్తుంది. ఉన్నవాటిని విస్తరింపజేస్తుంది.

ప్రభుత్వరంగమే ఈ కర్తవ్యాన్ని చేపట్టడానికి మరొక కారణం కూడా ఉంది. ప్రభుత్వమే పరిశ్రమలను నిర్వహించడం వల్ల పెట్టుబడి వనరులను సమకూర్చుకొనడం తేలిక. అవసరమైతే విదేశాలనుండి రుణాలను సాధించగలదు. ఈ అవకాశాలు ప్రయివేటు రంగానికి లేవు. అంతేకాక నానాటికి పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు కూడా ప్రభుత్వరంగ పరిశ్రమలను విస్తరింపజేయాలి. సమతూకంలో ప్రాంతీయాభివృద్ధిని సాధించేటందుకు కూడా ఇది అవసరం. లాభార్జన ధ్యేయంతో ప్రయివేటు రంగం వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రలను స్థాపించదు. కాబట్టి వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలను స్థాపించాల్సిన బాధ్యత ప్రభుత్వ రంగానికి ఎక్కువగా వుంది.

## 18.3 ప్రభుత్వరంగ లక్ష్యాలు

ప్రభుత్వరంగ విశాల లక్ష్యాలు ఈ విధంగా ఉన్నాయి.

1. ఆర్థికాధికారం కొద్దిమంది వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతం కాకుండా చూడడం.
2. ఆర్థికాభివృద్ధికి మిగుల్లను నిర్పరచడం
3. పెరుగుతున్న శ్రమశక్తికి తగిన ఉద్యోగావకాశాలను కల్పించడం.
4. సమతూకంలో ప్రాంతీయాభివృద్ధిని సాధించడం.
5. దేశంలోని కొరత వనరుల వాడకం సహేతుకంగా ఉండేటట్లు చూడడం.
6. మిశ్రమ ఆర్థిక విధానంలో ప్రయివేటు రంగానికి సహాయపడే పాత్రను నిర్వహించడం.

## మీ అవగాహనను పరీక్షించుకొండి - 1

1. భారీ, మౌలిక, కీలక పరిశ్రమలను ప్రయివేటు రంగం ఎందుకు స్థాపించకూడదు?
2. ప్రభుత్వరంగం ప్రధాన లక్ష్యాలేమిటి?

## 18.4 భారతదేశంలో ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రగతి

మన దేశంలోని ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రభుత్వ శాఖలుగానూ, ప్రభుత్వ శాఖేతర సంస్థలుగానూ విభజించవచ్చు. రైల్వేలు, తంతి—తపాలా, విద్యుచ్ఛక్తి, రేవులులాంటి ప్రజోపయోగ సర్వీసులు మొదటి తరగతికి చెందుతాయి. వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు రెండవ తరగతికి చెందుతాయి. కొన్ని ప్రభుత్వ సంస్థలు జాయింట్ స్టాక్ కంపెనీలు, కార్పొరేషన్ల రూపంలో కూడా ఉన్నాయి. స్వాతంత్ర్యానంతర కాలంలో ప్రభుత్వ రంగం అన్ని విధాలుగా తగినంత విస్తరించింది. ఉదాహరణకి మొదటి పంచవర్ష ప్రణాళిక ప్రారంభంలో 29 కోట్ల పెట్టుబడితో కేవలం 5 కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలున్నాయి. 1971లో వీటి సంఖ్య 97కి పెరిగింది. పెట్టుబడి మొత్తం 29 కోట్లనుండి 4,682 కోట్లకు పెరిగింది. 1981లో మరల వీటి సంఖ్య 168కి చేరకొంది. పెట్టుబడి మొత్తంకూడా 18,231 కోట్లకు చేరకొంది. (ఎకానామిక్ సర్వే 1981-82, పేజి 41), ప్రభుత్వరంగ సంస్థల బ్యూరో (బ్యూరో ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్) ఇటీవలనే విడుదల చేసిన నివేదికలో 1982-83లో కేంద్ర ప్రభుత్వ సంస్థల సంఖ్య 193 అని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు కూడా చెప్పుకోతగినంతగా పెరిగాయి. ఉదాహరణకి 1981-82లో రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో 1,546 కోట్ల రూపాయల పెట్టుబడితో 657 సంస్థలు ఉన్నాయి. (8వ ఫైనాన్సు కమిషను నివేదిక, పేజీ 179)

ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన 5 సంవత్సరాల వివరాలు కింది పట్టికలో చూడండి.



BRAOU

**పట్టిక — 1: ఐదేళ్లలో ప్రభుత్వరంగ సంస్థల పనితీరు**
**(కేంద్రప్రభుత్వం నిర్వహిస్తున్నవి)**

| | ప్రమాణం | 1976-77 | 1977-78 | 1978-79 | 1979-80 | 1980-81 |
|---|---|---|---|---|---|---|
| 1. పనిచేస్తున్న ప్రభుత్వ రంగస్థల సంఖ్య | సంఖ్య | 149 | 155 | 159 | 169 | 168 |
| 2. పెట్టుబడి | కోట్లు | 10887 | 12130 | 13968 | 16182 | 18231 |
| 3. సంవత్సరంలో చేసిన వ్యాపారం మొత్తం విలువ | కోట్లు | 14911 | 18020 | 19061 | 23290 | 28645 |
| 4. స్థూల లాభం (వడ్డీ, పన్నులు కట్టకపూర్వం) | కోట్లు | 1028 | 915 | 1071 | 1229 | 1422 |
| 5. నికర లాభం (పన్నులు కట్టకపూర్వం) | కోట్లు | 421 | 160 | 185 | 225 | 39 |
| 6. నికర లాభం (పన్నులు కట్టినతర్వాత) | కోట్లు | 184 | 91 | 40 | 74 | 182 |
| 7. సృష్టించిన ఆంతరంగిక వనరులు | ... | ... | ... | ... | ... | ... |
| 8. పెట్టుబడిపై వచ్చిన స్థూలలాభం | శాతం | 9.4 | 7.5 | 7.7 | 7.6 | 7.8 |
| 9. ఉద్యోగుల సంఖ్య | లక్షలు | 15.75 | 16.38 | 17.03 | 17.75 | 18.38 |

ఆర్థికాభివృద్ధి వేగంగా జరగడానికి అవసరమైన సాధన సంపత్తిని ఏర్పర్చడంలో ప్రభుత్వ రంగం ఒక సాధనంగా ఉందనడంలో సందేహం లేదు. 2వ ప్రణాళిక నుంచి దేశంలో బలమైన పారిశ్రామిక పునాది ఏర్పడింది. ప్రభుత్వరంగ సంస్థలలో చాలా వాటికి ఎగుమతులు పెంచటంలో పాత్ర వుంది. ఉదాహరణకి ప్రభుత్వరంగ సంస్థలైన రాష్ట్రవాణిజ్య సంస్థ (స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్), ఖనిజ, లోహ వాణిజ్య సంస్థ (మినరల్ అండ్ మెటల్ ట్రేడింగ్ కార్పొరేషన్)లు ఎగుమతుల అభివృద్ధికి కృషి చేస్తున్నాయి. ఇంకు ముందు దిగుమతి చేసుకొన్న వస్తువులను ఇప్పుడు ప్రభుత్వ రంగ సంస్థలు ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ విధంగా దిగుమతులకు ప్రత్యామ్నాయాన్ని ఇవి కొంతవరకు సాధిస్తున్నాయి. ఉదాహరణకు హిందూస్థాన్ యాంటీ బయాటిక్స్ లిమిటెడ్, ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మస్యూటికల్స్ (ఐ.డి.పి.ఎల్) లాటి కొన్ని పరిశ్రమలు "దిగుమతి ప్రత్యామ్నాయాని"కి సహాయపడ్డాయి. ఇంకో రకంగా చెప్పాలంటే పూర్వం సరుకులు దిగుమతికి ఉపయోగించిన విదేశీ మారక ద్రవ్యం ఇప్పుడు ఆదా అవుతోంది. అదే విధంగా చమురు, సహజవాయువుల సంస్థ (ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కమీషన్) ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్లు చమురు దిగుమతులను తగ్గించడంలో కొంతవరకు సహాయపడ్డాయి.

పొదుపుకు సంబంధించి కూడా ప్రణాళికలలో ప్రభుత్వరంగ సంస్థలు అభివృద్ధిని సాధించాయి. 1977-78లో పొదుపు మొత్తాలు 20.9 శాతం కాగా 1982-83లో ఇవి 31.6 శాతానికి చేరుకొన్నాయి. ప్రభుత్వరంగం పొదుపులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాల్లో మిగుళ్లే (బడ్జెట్ మిగుళ్ళు) కాక ప్రభుత్వ రంగ సంస్థలు సాధించిన పొదుపు మొత్తాలు కూడా కలిసి ఉంటాయి. ఈ పొదుపు మొత్తాలు ప్రణాళికలలో ప్రభుత్వరంగ సంస్థలకు లభించే ఆర్థిక వనరులతో పెద్ద భాగంగా ఉంటాయి. ఉద్యోగావకాశాల కల్పనలో కూడా ప్రభుత్వరంగ సంస్థలు నిర్వహిస్తున్న పాత్ర తక్కువేమీ కాదు. ఈ సంస్థల్లో 1972-73లో ఉద్యోగుల సంఖ్య 9.32 లక్షలు కాగా 1980-81 నాటికి అది 18.38 లక్షలకు పెరిగింది.



BRAOU

దేశంలో సమతూకంలో ప్రాంతీయాభివృద్ధిని సాధించడంలో ప్రభుత్వరంగ సంస్థలు కొంతవరకు విజయం సాధించాయి. మధ్య ప్రదేశ్‌లోని భిలాయ్ లోనూ, ఒరిస్సాలోని రూర్కెలాలోనూ, మదరాసులోని నైవేలీలోనూ, పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లోనూ ఉక్కు కర్మాగారాలను స్థాపించడం దీనికి మంచి ఉదాహరణ. సమతూకంలో ప్రాంతీయాభివృద్ధిని సాధించడానికి వెనుకబడిన ప్రాంతాల్లో చాలా రాష్ట్రాల్లోరాష్ట్ర ప్రభుత్వ సంస్థలను స్థాపించారు. ఇంత అభివృద్ధిని సాధించినప్పటికీ ప్రభుత్వరంగం కొన్ని విషయాలలో విమర్శలకు గురయింది.

ప్రభుత్వరంగ సంస్థలు సంపాదించిన లాభాలను బట్టి అవి సాధించిన ప్రగతిని నిర్ణయించాలా లేదా అన్నది ఒక దశాబ్దం నుండి చర్చనీయాంశంగా ఉంది. ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలలో చాలా భాగం నష్టాల్లో నడుస్తున్నాయి. ధరల నిర్ణయంలో అనేక విషయాలను పరిగణనలోనికి తీసుకోవలసి రావడం వల్ల ప్రభుత్వ రంగ సంస్థలు సాధించిన 'లాభాలను' బట్టి వాటి సమర్థతను నిర్ణయించకూడదు. రైల్వేలు, విద్యుచ్ఛక్తి, నీటి సరఫరా మొదలైన ప్రజోపయోగ సర్వీసుల్లో ఉత్పత్తి ఖర్చు పెరిగినప్పటికీ ధరలు పెంచలేదు.

## మీ అవగాహనను పరీక్షించుకోండి-2

3. భారతదేశంలో ప్రభుత్వరంగాన్ని వర్గీకరించండి.

## 18.5 ప్రభుత్వరంగ సంస్థల పనితీరు సరిగా లేకపోవడానికి కారణాలు

ధరలను నిర్ణయించడంలో అన్ని సంస్థలకూ వర్తించేటట్లు స్పష్టమైన విధానమేది ఇంతవరకూ లేదు. ప్రతి సంస్థ తన పరిస్థితులకు తగిన ధరల విధానాన్ని పాటించవచ్చు. ఫలితంగా కొన్ని సంస్థలు తగినంత లాభాలను గణించే విధంగా ధరలను నిర్ణయిస్తున్నాయి. ఈ విధానం పూర్తిగా ఆర్థిక కారణాలమీదే నిర్ణయవుతుంది. మరోవైపు కొన్ని సంస్థలు లాభనష్టాల్లేని పద్ధతిపై ధరలను నిర్ణయిస్తున్నాయి. ప్రభుత్వ రంగంలో తయారైన వస్తువులను అదే ధరకి ప్రజలకు అందించాలనే దృష్టితో ప్రభుత్వం ఈ విధానాన్ని అవలంబిస్తోంది. సాంఘిక, రాజకీయ కారణాలతో కొన్ని సంస్థలను ధరలు తగ్గించే విధానాన్ని పాటించవలసిందిగా ప్రభుత్వం కోరింది. ఇంకో మాటలో చెప్పాలంటే హెచ్చు ధరలతో అమ్మే అవకాశ మున్నప్పటికీ సామాన్య మానవునికి అందుబాటులో ఉండే విధంగా ధరలను తగ్గించారు. దిగుమతి చేసుకొనే వస్తువులతో పోటీగా తయారయ్యే వస్తువుల ధరలను నిర్ణయించడంలో దిగుమతి ధరలను పరిగణిస్తారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల ధరల విధానానికి పోలికే లేదు. కాబట్టి ప్రభుత్వ రంగ సంస్థలకు నష్టాలు వస్తున్నాయి. ఈ రకమైన నష్టాలకి ముఖ్యమైన కారణాలు అనేకం.

ప్రభుత్వరంగ పరిశ్రమలను పూర్తి చేయడంలో జరుగుతున్న అసాధారణ జాప్యాలను మొదటి విషయంగా పేర్కొనవచ్చు. ఒక పథకాన్ని అనుకొన్న సమయానికి పూర్తి చేయలేక పోతే ధరలు పెరిగి మొదటగా అంచనా వేసిన మొత్తాన్ని మించి వ్యయం ఉంటుంది. ఫలితంగా పెట్టిన పెట్టుబడిపై ప్రతిఫలం తప్పనిసరిగా తగ్గుతుంది.

ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఉత్పాదక శక్తిని తక్కువగా వినియోగించుకొంటాయన్నది తరచుగా వినవచ్చే రెండో విమర్శ. ఎక్కువగా ప్రభుత్వరంగ పరిశ్రమలు రోజుకి 50 నుండి 75 శాతం శక్తిని మాత్రమే వినియోగించుకొంటున్నాయి. వనరులు, విద్యుత్తుకు సంబంధించిన సరైన ప్రణాళిక లేకపోవడం, నిర్వహణలో అసమర్థత, అనేక ఉత్పత్తి శాఖల మధ్య సమన్వయ లోపం మొదలైనవి ఈ పరిస్థితికి కారణాలు. ఉత్పాదక శక్తిని తక్కువగా వినియోగించుకోవడం, ఫ్యాక్టరీ బిల్డింగుల నిర్మాణం మొదలైనవాటి అతి వ్యయం వల్ల ఈ

పరిశ్రమల్లో పెట్టుబడి-ఉత్పత్తుల నిష్పత్తి విలువ పెరుగుతోంది. సాధారణంగా ఈ నిష్పత్తిని నిర్వహణ సామర్థ్యానికి గుర్తుగా భావిస్తారు. ప్రయివేటు రంగంలో ఈ లోట్లు ఉండవు. కాబట్టి పెరుగుదల-ఉత్పత్తుల నిష్పత్తి ప్రభుత్వరంగ నిష్పత్తి కంటే తక్కువగా వుంటుంది. ఉదాహరణకు 1981-82లో కేంద్ర ప్రభుత్వ పరిశ్రమల పెట్టుబడి-ఉత్పత్తుల నిష్పత్తి 7:4:1 ఉండగా ప్రయివేటు రంగంలో ఈ నిష్పత్తి కేవలం 3:8:1.

నిర్వహణలో అసమర్థతవల్ల ప్రభుత్వరంగం విమర్శల పాలవటం మూడవ విషయం. ప్రభుత్వరంగ సంస్థల అధ్యక్షులూ, నిర్వాహక సంచాలకులూ (మేనేజింగ్ డైరెక్టర్లూ) ప్రభుత్వ సిబ్బంది నుంచి వచ్చిన వారవడం వల్ల పారిశ్రామిక సంస్థలను నడిపేందుకు అవసరమైన నైపుణ్యం వారికి ఉండదు. అంతేకాక ప్రభుత్వరంగ పరిశ్రమల కార్యకలాపాల్లో కేంద్రీకరణ అధికమై పరిపాలనా సంబంధమైన జోక్యాలు వాటి స్వతంత్ర ప్రతిపత్తిని తగ్గిస్తున్నాయి.

ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగులకు ప్రయివేటు రంగ సంస్థల్లో ఉద్యోగులకంటె ఎక్కువ సౌకర్యాలుంటాయి. సంస్థల ఆదాయంలో ఎక్కువ భాగం ఉద్యోగుల వేతనం, కరువు భత్యాలకే పోతుంది. సాంఘిక సంక్షేమ పథకాలపై చేసే ఖర్చు, బోనసు మొదలైనవి ప్రభుత్వరంగ సంస్థలపై ఉన్న అదనపు భారాలు.

## 18.6 పరిష్కార చర్యలు

మన ఆర్థిక విధానంలాంటి మిశ్రమ ఆర్థిక విధానంలో కనీసం వాణిజ్య సంస్థల్లో అయినా సంస్థల పనితీరును లాభాలు సంపాదించేదిగా ఉండాలి. లాభాలను ఆర్జించాలనే దృష్టితో ధరలను నిర్ణయించకపోతే ఈ సంస్థలు నిల్వలను సృష్టించలేవు. రాష్ట్ర వాణిజ్య సంస్థ (ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కమిషన్), ఆయిల్ ఇండియా వంటి సంస్థలు తప్ప అధిక భాగంగా ప్రభుత్వ సంస్థలు చాలా కాలం నుంచీ నష్టాల్లో నడుస్తున్నాయి. ఇది ఆరోగ్యకరం కాదు. రాజ్యాంగం, 1956 పారిశ్రామిక విధాన తీర్మానాల ప్రకారం ప్రభుత్వరంగ సంస్థల పనితీరు ప్రయివేటు రంగానికి మార్గదర్శకత్వం అందించే విధంగా ఉండాలి. కానీ ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఈ కర్తవ్యాన్ని నిర్వహించడం లేదని అనుభవం తెల్పుతోంది. ప్రభుత్వ రంగ పరిశ్రమల పనితీరును ఎలా బాగు పరచాలా అన్నది ప్రస్తుత సమస్య. లాభాలను సంపాదించడం, సాంకేతిక విజ్ఞానం, ప్రగతిని సాధించడం, వాడకం దారులను దృష్టిలో ఉంచుకోవటం, పనితో సంబంధం ఉండే విధంగా నిర్వహణ లాంటి కొన్ని ప్రత్యేక రంగాల్లో శ్రద్ధ చూపించాల్సిందిగా ప్రభుత్వం ఈ సంస్థలను ఆదేశించింది.

BRAOU

పోటీపడే విధంగా ధరల విధానం ఉంటే ప్రభుత్వరంగ పరిశ్రమలు లాభాలు సంపాదిస్తాయి. ఇందుకు ఉత్పత్తి ఖర్చునూ, వృధా వ్యయాన్నీ తగ్గించి, వస్తువుల నాణ్యాన్ని పెంచాలి. ప్రజోపయోగ సర్వీసులలాంటి కొన్ని సంస్థలు తప్ప మిగతా అన్ని సంస్థలు లాభం సంపాదించే లక్ష్యంతో పనిచేయాలి.

ప్రభుత్వరంగ సంస్థలు స్వతంత్రంగా పనిచేసే విధంగా వాటికి కొన్ని అధికారాలివ్వాలి. సంస్థను ఏ ఉద్దేశంతో ప్రారంభించినప్పటికీ ఉన్నత స్థాయిలో ఉత్పాదకతను సాధించాలనేది గమ్యంగా ఉండాలి. ఉన్నత స్థాయిలో ఉత్పాదకను సాధించాలంటే నిర్వహణా సామర్థ్యం మెరుగుపడాలి. వ్యాపారంలోనూ, పరిపాలనలోనూ సమర్థులుగా నియమించాలి. వివిధ పనులు చేసే కార్మికులకు తగిన శిక్షణ ఇవ్వాలి. పారిశ్రామిక తగాదాలను స్నేహపూరితంగానూ, తొందరగానూ తీర్చాలి. ఉద్యోగులలో క్రమశిక్షణను కాపాడాలి. ప్రజలను ఎక్కువగా ఇముడ్చుకొనేందుకై సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల వాటాలను, పరపతి నందించే బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల వాటాలను పెంచుకొనేందుకు అనుమతించాలి.

రాజ్యాంగంలో ప్రభుత్వరంగ పరిశ్రమల పనితీరు ఎలా ఉండాలని భావించారో ఆ రీతిగా లేకపోతే మన మిశ్రమ ఆర్థిక విధాన మూల భావమే ప్రశ్నార్థకం అవుతుంది. కాబట్టి ఆర్థికంగా లాభకరంగా ఉండే విధంగా ప్రభుత్వరంగ పరిశ్రమల పని విధానాన్ని మార్చాలి.

## 18.7 సారాంశం/ముగింపు

అవస్థాపనా సౌకర్యాలను అభివృద్ధి చేయాల్సిన అవసరమున్న భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో ప్రభుత్వ రంగానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ప్రభుత్వ రంగం ద్వారా కీలక, మౌలిక, భారీ పరిశ్రమలను ప్రభుత్వం ఏర్పరిచి అభివృద్ధి చేయవలసి ఉంటుంది. అదే విధంగా వాటిని నియంత్రణ చేయవలసి వుంటుంది. వాటి స్థాపనకయ్యే భారీ పెట్టుబడిని ప్రైవేటు రంగం సమకూర్చుకోలేదు. ఆర్థికశక్తి కేంద్రీకరణను తగ్గించడానికి ప్రభుత్వరంగ ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఉపాధి కల్పనా సౌకర్యాలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వరంగం ఎంతో చేయగలదు. ప్రభుత్వరంగ ప్రగతిని, వాటి విస్తరణను బట్టి చెప్పవచ్చు. అన్ని అంశాలలోగూడ ప్రభుత్వరంగం ఎంతో విస్తరించింది. కాని ఎన్నో కారణాలవల్ల ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు సక్రమంగా లేదు. ఆ కారణాలను, వాటి నివారణ చర్యలను మనం ఈ పాఠంలో తెలుసుకొన్నాం.

-డా॥టి. దివాకరరావు

## 18.8 సంప్రదింపు గ్రంథాలు

1. Datt & Sundaram : Indian Economy
2. S.C. Kuchhal : Industrial Economy of India

## 18.9 నమూనా పరీక్షా ప్రశ్నలు

*I. కింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబులు రాయండి.*

1. భారతదేశం వంటి మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వరంగ పాత్రను వివరించండి. లేదా భారతదేశంలో ప్రభుత్వరంగ విస్తరణను నిర్ణయించండి. కారకాలను వివరించండి.
2. భారతదేశంలోని ప్రభుత్వరంగ సంస్థల పనితీరు సక్రమంగా లేకపోవడానికి కారణాలనూ, వాటి పరిష్కార మార్గాలనూ వివరించండి.
3. భారతదేశంలోని ప్రభుత్వరంగ సంస్థల పనితీరును విమర్శనాత్మకంగా పరిశీలించండి.

*II. కింద ప్రశ్నలకు దాదాపు 15 పంక్తులలో జవాబులు ఇవ్వండి.*

1. భారతదేశంలో ప్రభుత్వరంగ సంస్థల తక్కువ పని సామర్థ్యానికి గల కారణాలను వివరించండి.
2. ప్రభుత్వరంగ సంస్థలు ఎక్కువ పని సామర్థ్యం పెంచడానికి పరిష్కార మార్గాలను సూచించండి.

BRAOU

# భాగం — 19: భారతదేశంలో ఆర్థిక శక్తి కేంద్రీకరణ

విషయక్రమం


19. 0 లక్ష్యాలు, ఉద్దేశాలు
19. 1 పరిచయం
19. 2 మహలనోబిస్ కమిటీ, 1960
19. 3 ఏకస్వామ్యాల విచారణ సంఘం, 1964
19. 4 భారతదేశంలో ఆర్థిక కేంద్రీకరణ-కారణాలు, ఫలితాలు
19. 5 ప్రైవేట్ రంగం పనితీరు
19. 6 ఆర్థిక కేంద్రీకరణను అరికట్టడానికి తీసుకోదగిన చర్యలు
19. 7 ఏకస్వామ్యాల నిర్బంధ వ్యాపార పద్ధతుల చట్టం, 1969
19. 8 సారాంశం/ముగింపు
19. 9 సంప్రదింపు గ్రంథాలు
19. 10 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 19.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

భారతదేశంలో ఆర్థిక స్తోమత కేంద్రీకృతం కావడానికి గల కారణాలను అన్వేషించడం, దానివల్ల కలిగే ఫలితాలను విశ్లేషించడం, ఈ సందర్భంగా మన దేశంలో ప్రైవేట్ రంగం పనిచేసే తీరుతెన్నులను తెలుసుకొనడం ఈ పాఠం లక్ష్యం.

ఈ భాగాన్ని చదవిన తర్వాత మీరు

★ మహలనోబిస్ కమిటీ, ఏకస్వామ్యాల విచారణ సంఘం పరిశీలనలను వివరించగలరు.

★ భారతదేశంలో ఆర్థిక శక్తి కేంద్రీకరణకు తోడ్పడే కారణాలను గుర్తిస్తూ, దానివల్ల కలిగే పరిణామాలను తెలియజేయగలరు.

★ ప్రైవేటు రంగం పనిచేసే తీరుతెన్నులను అవగాహన చేసుకోగలరు.

★ ఆర్థిక శక్తి కేంద్రీకరణను అరికట్టడానికి తగు పరిష్కార మార్గాలను సూచించగలరు.

★ ఏకస్వామ్యాల నిర్బంధ వ్యాపార పద్ధతుల చట్టాన్ని (1969) విశ్లేషించగలరు.

## 19.1 పరిచయం

ఆధునిక పరిశ్రమను నడిపించడానికి ఎక్కువ పరిమాణంలో మూలధనం, ఉద్యమిత్వం, తగినన్ని వనరులు ఉండాలి. సమర్థంగా, పరిశ్రమను నడిపించడానికి పెద్ద సంస్థలకే అవకాశాలు ఎక్కువ. ఆ సంస్థలకు పైన చెప్పిన కారకాలన్నీ ఉంటాయి. అయితే స్వేచ్ఛా వ్యాపార వ్యవస్థలో వనరుల యాజమాన్యం పెద్ద సంస్థల చేతులలో ఉన్నందువల్ల ఆర్థిక స్తోమత కేంద్రీకృతం అయ్యే ప్రమాదం ఉంటుంది. ఏక స్వామ్యదారులు నిర్బంధకమైన వ్యాపార పద్ధతులను అవలంబించడమే ఆ కేంద్రీకృత ధోరణి వల్ల రాగల ప్రమాదం. దాని వల్ల ప్రజల ఆర్థిక, సాంఘిక సంక్షేమం దెబ్బతింటుంది.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ మిశ్రమమైనది. అంటే ప్రైవేటు, పబ్లిక్ రంగాలలో ఉత్పత్తిని సాగించవచ్చును. మన రాజ్యాంగ రీత్యా నిర్దేశిక సూత్రాలనుబట్టి ఉత్పత్తి ప్రక్రియవల్ల ఆర్థిక స్తోమత కేంద్రీకృతం కాకూడదు.



BRAOU

దాన్నిబట్టి 1950లో రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత 1956లో నిర్దేశిక సూత్రాలకు అనుకూలంగా మన పారిశ్రామిక విధానాన్ని రూపొందించారు. పబ్లిక్ రంగానికి ఎక్కువ ప్రాముఖ్యమిచ్చారు. సామ్యవాద రీతి సమాజ స్థాపనకు వీలుగా పబ్లిక్ రంగంలోనే కీలకమైన పరిశ్రమలను నెలకొల్పాలని ఈ పారిశ్రామిక విధానం నిర్దేశించింది. అంతే కాకుండా ప్రణాళికా ధ్యేయాలను సాధించడానికి వీలుగా ప్రైవేట్ రంగ కార్యకలాపాలను ప్రభుత్వం నియంత్రిస్తుంది. దాంతో ప్రణాళికలవల్ల ఆర్థిక స్తోమత కేంద్రీకృతం కాదని, ఆర్థికాభివృద్ధి సాఫీగా జరుగుతుందని భావించారు.

## 19.2 మహలనోబిస్ సంఘం (Mahalanobis Committee)

రెండవ పంచవర్ష ప్రణాళిక ముగిసేనాటికి మన దేశంలో ప్రణాళికలవల్ల లాభాలు ఎవరెవరికి ఎక్కువగా లభించాయో తెలుసుకొనడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. ప్రణాళికలవల్ల అంతకు ముందున్న ఆర్థిక అసమానతలు తగ్గినదీ లేనిదీ తెలుసుకొనవలసిన అవసరం ఏర్పడింది. 1960లో పి.సి. మహలనోబిస్ అధ్యక్షతన ప్రభుత్వం ఈ విషయాలను పరిశీలించడానికి ఒక సంఘాన్ని నియమించింది. ఈ సంఘాన్ని ఆదాయ పంపిణీ, జీవన ప్రమాణాలను తెలియజేసే సంఘం అనికూడా అంటారు. ఈ కింది విషయాలను పరిశీలించమని ప్రభుత్వం ఈ సంఘాన్ని కోరింది:

1. ఆర్థిక వ్యవస్థ పనిచేసే విధానాలు ఎంతమేరకు సంపద, ఉత్పత్తి కారకాల యాజమాన్యంలో కేంద్రీకృత ధోరణులను సృష్టించాయి.
2. ప్రథమ, ద్వితీయ పంచవర్ష ప్రణాళికలలో ఉన్న జీవన ప్రమాణ ధోరణులు ఎట్లాఉన్నాయి.
3. సంపద, ఆదాయ పంపిణీలలో సంభవించిన మార్పులు ఏ విధంగా ఉన్నాయి.

ఈ విషయాలలో మహలనోబిస్ సంఘం పరిశీలన జరిపింది. 1951, 1958 మధ్యకాలంలో ముఖ్యంగా పారిశ్రామిక సంపద విషయంలో కేంద్రీకృత ధోరణులు ప్రైవేటు రంగంలో ఎక్కువగా ఉన్నట్లు ఈ సంఘం తన నివేదికలో వెల్లడించింది.

10 సంవత్సరాల ప్రణాళికా కాలంలో ఆస్తి పంపిణీలో వ్యత్యాసాలు తగ్గటానికి బదులు ఎక్కువయ్యాయని ఈ సంఘం గుర్తించింది. ఆస్తి యాజమాన్యం కొద్దిమంది చేతుల్లో ఉంటే ఆదాయంకూడా కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమౌతుంది. ఈ సంఘం ఆర్థికస్తోమత కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కావడానికి గల కారణాలను ఈ నివేదికలో పేర్కొంది.

మొట్టమొదటిది అవస్థాపనకు సంబంధించినది. ప్రభుత్వం మొదటి రెండు ప్రణాళికలలో భారీఎత్తున అవస్థాపన కోసం వ్యయం చేసింది. విద్యుచ్ఛక్తి, రోడ్డు రవాణా, రైల్వేలు మొదలైన అవస్థాపనను అందించడం జరిగింది. అవస్థాపన వల్ల పెద్ద, పెద్ద పారిశ్రామికవేత్తలు లాభం పొందారు. అవస్థాపనను ఉపయోగించుకొనడానికి పెద్ద పారిశ్రామిక వేత్తలు వద్ద అన్ని హంగులు ఉండేవి. ఆ సమయంలో ప్రభుత్వరంగంలో పరిశ్రమల సంఖ్య ప్రైవేటు రంగంలో పరిశ్రమల సంఖ్యకంటె చాలా తక్కువ. కాబట్టి కార్పొరేటు రంగం లాభాలు పెద్ద, పెద్ద పారిశ్రామిక వ్యవస్థలైన టాటా, బిర్లా మొదలైన వారికి చేరాయి.

1951-1958 మధ్యకాలంలో ఏర్పడిన మధ్యరకం ద్రవ్యోల్బణం రెండవ విషయం. ప్రైవేటు పెట్టుబడులు పెరగటానికి ద్రవ్యోల్బణం సహకరిస్తుంది. మరీ ఎక్కువ కాని ద్రవ్యోల్బణం వల్ల ఉద్యమదార్ల పెట్టుబడులను ప్రేరేపించవచ్చు.

ఇక మూడవది, పెట్టుబడులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అందించిన రాయితీలవల్ల కొత్త కొత్త యూనిట్లు ప్రైవేటు రంగంలో వెలిశాయి.

సంస్థాపరమైన వరపతిని ప్రైవేటు రంగంలో పెద్ద పారిశ్రామిక వేత్తలు సులువుగా పొందగలిగారు. ఇది వాళ్లివ కారణం. అంతే కాకుండా జాతీయం చేయకమునుపు బ్యాంకుల యాజమాన్యం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉండేది. ఫలితంగా ఈ బ్యాంకులు పెద్ద పారిశ్రామిక వేత్తలకు ఎక్కువ సహాయాన్ని అందించగలిగాయి. ఈ కారణాలవల్ల ఆర్థిక స్తోమత కేంద్రీకృతం అయింది.

## 19.3 ఏకస్వామ్యాల విచారణ సంఘం, 1964

పై కారణాలతో బాటు 1964లో ప్రభుత్వం నియమించిన ఏకస్వామ్యాల విచారణ సంఘం ఆర్థిక స్తోమత కేంద్రీకృతం కావడానికి అదనంగా మరికొన్ని కారణాలను కూడా వెలిబుచ్చింది.

1. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సాంకేతిక పరిజ్ఞానంలో ఏర్పడిన ప్రగతి ఎక్కువగా ప్రైవేట్ రంగంలో ఉన్న జాయింట్ స్టాక్ కంపెనీలకు తోడ్పడింది. కాబట్టి ఆర్థిక స్తోమత కేంద్రీకృతమై కొద్దిమంది చేతుల్లోకి పోయింది.

2. దీనికి తోడు మేనేజింగ్ ఏజెన్సీ విధానంకూడా ఒక కారణం అని చెప్పవచ్చు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా చాలా కాలం వరకు మేనేజింగు ఏజెన్సీ విధానం కొనసాగింది. మేనేజింగు ఏజెన్సీ విధానంవల్ల పెద్ద పెద్ద సంస్థలకు ఎక్కువ లాభం వచ్చింది. ఈ విధానం ప్రకారం ఒక కంపెనీ ఇంకొక కంపెనీకి అవసరమైన నిధులను సమకూర్చడం, యాజమాన్య విషయంలో సహాయం చేయడం, ఒక కంపెనీ వాటాలలో పాల్గొనడం మొదలైనవి. ఇవన్నీ పెద్ద సంస్థలే చేయగలవు. కాబట్టి ఈ విధానం పెద్ద సంస్థల చేతుల్లో సంపద, ఆదాయం కేంద్రీకృతం అయ్యేటట్లు చేసింది. (అయితే ఈ విధానాన్ని 1970లో ఎత్తి వేశారు.)

3. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ధరలు విపరీతంగా పెరిగాయి. పెద్ద పారిశ్రామిక సంస్థలు ఎక్కువ లాభాలను గణించాయి. స్వాతంత్ర్యానంతరం పారిశ్రామిక రంగంలో కొత్త సంస్థలను నెలకొల్పి ఎక్కువ లాభాలను పొందడానికి ఎక్కువ పారిశ్రామిక సంపద కేంద్రీకృతం కావటానికి ఈ సంస్థలకు అవకాశాలుండేవి.

4. పైన వివరించిన కారకాలతో బాటు ప్రభుత్వం ప్రైవేటు రంగ కార్యకలాపాలను అదుపులో ఉంచడానికి ప్రవేశపెట్టిన లైసెన్సు విధానం, దిగుమతుల విదేశ మారక ద్రవ్య విధానం ప్రైవేటు రంగంలో పెద్దసంస్థలకు ఎంతగానో తోడ్పడ్డాయి. చిన్న పారిశ్రామికవేత్తల్లా కాకుండా పెద్ద సంస్థలవారు ఎక్కువ మూలధనాన్ని ఖర్చుచేసి పెద్ద పెద్ద ఆధునిక పరిశ్రమలను నెలకొల్పగలిగారు. గవర్నమెంటు నుంచి లైసెన్సులను తేలికగా పొందగలిగారు. లైసెన్సింగ్ విధానంలో నిర్దేశించిన షరతుల కనుగుణంగా పెద్ద సంస్థలు తేలికగా ప్రభుత్వాన్ని తృప్తిపరచగలిగాయి. అంతేకాకుండా విదేశీపెట్టుబడులను ఆకర్షించి పరిశ్రమలను సమర్థవంతంగా నడపగలిగారు. వారికే విదేశీ సాంకేతిక పరిజ్ఞానం తేలికగా లభ్యమయ్యేది.

## 19.4 భారతదేశంలో ఆర్థిక స్తోమత కేంద్రీకరణ: కారణాలు, రకాలు, ఫలితాలు

ఏకస్వామ్య విచారణ సంఘం పైన చెప్పిన కారణాలే కాకుండా ఆర్థిక స్తోమత రెండు విధాలుగా కేంద్రీకృత మవుతుందని కూడా చెప్పింది. 1) వస్తువారీ కేంద్రీకరణ, 2) దేశవ్యాప్త కేంద్రీకరణ. ఈ సంఘం నిర్వహించిన సర్వేలో తెలిసిందేమంటే సుమారు 100 వస్తువుల తయారీలో పెద్ద ఎత్తున కేంద్రీకృత ధోరణులు ఉన్నాయి. ఉదాహరణకు పసిపాపలకు ఇచ్చే పాలు, టీ, పంచదార, వస్త్ర పరిశ్రమలో కొన్ని రకాలు, గృహ సంబంధమైన దీపాలు, ఫ్రిజ్‌లు, ఫ్లాస్కులు, అగ్గిపెట్టెలు, సిగరెట్లు, చెప్పులు, అనేక రకాల మందులు, రవాణా సామాగ్రి మొదలైనవి. ఈ వస్తువుల్లో 75 శాతం పెద్ద పెద్ద పారిశ్రామిక సంస్థల ఆధ్వర్యంలో ఉత్పత్తి అవుతున్నాయి. దీనిని వస్తువారీ కేంద్రీకరణ అంటాం. అంటే అనేక వస్తువుల తయారీని ఏ కొద్ది సంస్థలో నిర్వహిస్తాయి.

పోతే దేశ వ్యాప్తంగా జరిగే కేంద్రీకృత ధోరణులగూర్చి తెలుసుకుందాం. కొద్ది కుటుంబాల ఆధ్వర్యంలోనే అనేక కంపెనీలు ఉండడం, ఏకస్వామ్య విచారణ సంఘం 2,259 కంపెనీలను పరిశీలించింది. ఈ కంపెనీలు 83 పారిశ్రామిక గ్రూపులు లేదా కుటుంబాల చేతులో ఉన్నాయి. అంటే టాటా, బిర్లా వంటి పెద్ద పెద్ద పారిశ్రామిక గ్రూపుల్లో అనేక కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీలు దేశ వ్యాప్తంగా ఉంటాయి. 1951-76 మధ్యకాలంలో మొదటి పది పెద్ద ఏకస్వామ్య సంస్థల ఆస్తుల వివరాలను ఈ కింది పట్టికలో చూడండి.

పట్టిక 1: మొదటి పది పెద్ద ఏకస్వామ్య సంస్థల ఆస్తులు
(1951-1976 కాలంలో) (రూ. కోట్లలో)

| క్రమ సంఖ్య | ఏకస్వామ్యసంస్థ (గ్రూప్) | 1951 | 1971 | 1976 |
|---|---|---|---|---|
| 1 | టాటా | 116 | 711 | 981 |
| 2 | బిర్లా | 104 | 687 | 975 |
| 3 | మఫత్‌లాల్ | 13 | 172 | 257 |
| 4 | సింఘానియా | 29 | 113 | 241 |
| 5 | థాపర్ | 15 | 137 | 202 |
| 6 | ఐ.సి.ఐ | | 119 | 199 |
| 7 | బంగూర్ | 17 | 150 | 195 |
| 8 | సింథియా | 25 | 90 | 177 |
| 9 | శ్రీరాం | 12 | 137 | 172 |
| 10 | భివండీవాలా | | | 166 |

మూలం: (ఎకనామిక్స్ మరియు పొలిటికల్ వీక్లీ, స్పెషల్ నెంబరు 1979 పేజీ 1244)

ఆర్థిక స్తోమత కేంద్రీకరణను కొలవడానికి కొన్ని సూచికలు ఉన్నాయి. లాభాల నిష్పత్తి స్థూల లాభాలు-ఆస్తుల విలువ మొదలైనవి కేంద్రీకరణను సూచిస్తాయి. 1963-64 నుంచి 1966-67 మధ్యకాలం వరకు 20 పెద్ద పారిశ్రామిక సంస్థల ఆస్తులు రూ. 1326 కోట్ల నుంచి రూ 2386 కోట్లకు పెరిగాయి. అంటే 21.6 శాతం పెరిగాయన్నమాట. ఆ తర్వాత 6 సంవత్సరాలలో అంటే 1966-67 నుంచి 1972-73 వరకు వీరి ఆస్తులు రూ 2386 కోట్లనుండి రూ. [illegible]516 కోట్లకు పెరిగాయి. అంటే 6.6 శాతం పెరిగాయన్నమాట. 1966-67 నుంచి పెరుగుదల రేటు ఎం[illegible]కు తగ్గిందని సందేహం రావచ్చు. పెద్ద పారిశ్రామిక సంస్థల పెరుగులదలను అరికట్టడానికి ప్రభుత్వం తీ[illegible] కొన్న చర్యలవల్లా, కొన్ని కీలకమైన పారిశ్రామిక ముడి సరుకుల కొరతవల్లాపెద్ద సంస్థలు అనుకొన్నంత లాభాలను ఆర్జించలేక పోయాయి. అయితే మన దేశంలోని 20 పెద్ద పారిశ్రామిక సంస్థలలో 46.5 శాతం ఆస్తులు టాటా, బిర్లా, మఫత్‌లాల్ సంస్థలకే చెందడం ఒక విశేషం.

ఆర్థిక స్తోమత కేంద్రీకృత ధోరణులను తెలుసుకొనడానికి మహల్‌నోబిస్ సంఘం, ఏక స్వామ్య విచారణ సంఘం పరిశీలనలే కాకుండా కొంత మంది మేధావులు వ్యక్తిగతంగా కొన్ని పరిశీలనలను జరిపారు. వాటిలో చెప్పుకోదగినది ఆర్.కే. హజారీ (R.K. Hazari) చేసిన కృషి. 1951-58 మధ్యకాలంలో ప్రైవేటు రంగంలో 20 పెద్ద సంస్థల కేంద్రీకృత ధోరణిని ఈయన పరిశీలించాడు. అదే విధంగా శ్రీ బి.దత్ 1968 సంవత్సరంలో నున్న ఏకస్వామ్య మూలధనం కేంద్రీకృత ధోరణిని పరిశీలించారు. అయితే వివిధ పరిశీలనలను పోల్చడానికి వీలులేదు. కారణం వారు కొలవడానికి ఉపయోగించిన పద్ధతుల్లో చాలా తేడాలున్నాయి.

1969లో ఏకస్వామ్యాల నిర్బంధ వ్యాపార విధాన చట్టం అమలులోనికి వచ్చింది. దీని ప్రకారం రూ. 20 కోట్లకు మించి ఆస్తులు కలిగున్న సంస్థను ఏకస్వామ్య గ్రూపుగా పరిగణిస్తారు. అయితే ఆస్తులను కాలానుగుణంగా విలువకట్టడం అంత తేలికైన పనికాదు. కారణం మన దేశంలో ఆస్తుల విలువే కాకుండా ఇతర దేశాల్లో కూడా ఆస్తుల విలువలను తెలుసుకోవలసి ఉంటుంది. వీటన్నింటికి సరైన గణాంక సమాచారం లభ్యంకాదు. అయితే లభ్యమైన గణాంక సమాచారాన్నిబట్టి మనకు తెలిసేదేమంటే పెద్ద సంస్థల ఆస్తులు విపరీతంగా పెరిగి ఆర్థికస్తోమత కేంద్రీకృతమయింది. కాబట్టే ఆదాయ అసమానతలు విపరీతంగా పెరిగాయి.

ఇంతవరకు మనం చర్చించిన దానిబట్టి ప్రైవేటు పరిశ్రమలు పెరగడం మంచిది కాదని అనుకోరాదు. ఆర్థికపరంగా ఆలోచిస్తే పెద్ద సంస్థల పెరుగుదల సమర్థనీయమైనదే. భారతదేశం వంటి వెనుకబడిన దేశాల్లో మూలధనకొరతను భర్తీ చేయాలంటే ప్రైవేటు రంగ సంస్థలను ప్రోత్సహించాల్సి ఉంటుంది. కనీసం ఆర్థికాభివృద్ధి చెందుతున్న తొలి దశలోనైనా వీటి పెరుగుదలను ప్రోత్సహించాలి. కాబట్టే భారతదేశం అభివృద్ధిలో పెద్ద పరిశ్రమల పెరుగుదల ముఖ్యమైనదని భావించారు కొంత మంది మేధావులు. కేంద్రీకృతం కావటం వల్ల ఉత్పత్తి ప్రక్రియలో ఆదాలు వస్తాయని భావించారు. అయితే ఈ భావాలతో పూర్తిగా అంగీకరించడానికి వీలు లేదు. ఆర్థికాభివృద్ధి సాధించడానికి మూలధనం ఉండాలి. కాని ఆ మూలధనాన్ని సేకరించడంలో ఏ కొద్ది మంది చేతుల్లో సంపద కేంద్రీకృత మయ్యేటట్లు మన పద్ధతులుండరాదు. పెద్ద పారిశ్రామిక సంస్థలకు బదులుగా పబ్లిక్ రంగ, సహకార రంగాలను విస్తృత పరచడం శ్రేయస్కరం.

పెద్ద పెద్ద ప్రైవేటు పారిశ్రామిక సంస్థల్లో కేంద్రీకృత ధోరణులవల్ల సంభవించే దుష్పరిణామాలను చర్చిద్దాం. దేశంలో ఉన్నవనరులను సక్రమంగా ఉపయోగించరు. వనరులను పూర్తిగా వినియోగం చేసుకొనకపోవడం, ఒకవేళ వినియోగించినా వాటి ఉత్పాదకతను సక్రమంగా ఉపయోగించుకొనడం ఉండదు. ప్రైవేటు ఉద్యమదారులు వారి ధ్యేయాలను సాధించుకొనడానికి వనరులను వారి ఇష్టానుసారంగా ఉపయోగించుకొంటారు. దేశ అవసరాలకు ప్రాముఖ్యత ఇచ్చి ఉత్పత్తిని చేయరు. ఏకస్వామ్యదారులు నిర్బంధ వ్యాపార పద్ధతులను చేపట్టినందువల్ల వారు ఉత్పత్తి చేస్తున్న వస్తువులలో కొత్త ఉద్యమదారులు ప్రవేశించడానికి వీలుండదు. కాబట్టి ఏకస్వామ్యదార్లు పోటీ లేకుండా వారి అభీష్ట ప్రకారం ప్రవర్తిస్తుంటారు. పోతే వినియోగదార్ల విషయంలో ఆలోచిస్తే కేంద్రీకృత ధోరణులు చాలా హాని కలుగజేస్తాయి. వినియోగదార్లకు గత్యంతరం లేక అధిక ధరలను చెల్లించి వస్తువులను కొంటుంటారు. ఆర్థిక స్తోమత కేంద్రీకృతం కావడం వల్ల పెద్ద పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వ విధానాలు వారికి అనుకూలంగా ఉండేటట్లు మార్చుకోగలరు. ఈ కారణాలవల్ల ఆర్థికాభివృద్ధి ఫలితాలు పెద్ద పారిశ్రామిక వేత్తల గుప్పిట్లోకి చేరాయి. కాబట్టే ఆదాయం పంపిణీలలో అసమానతలు ఏర్పడ్డాయి. అంతేకాకుండా పారిశ్రామిక సంపదలో చాలా ఎక్కువ శాతం సుమారు 10 లేక 15 శాతం ప్రజల చేతుల్లోకి పోయింది. దీని ఫలితంగా పారిశ్రామిక ప్రగతి ఒక విధంగా కుంటుపడిందనే చెప్పవచ్చు. కారణం అసమానతలు ఎక్కువవుతున్నకొద్దీ ఎక్కువమంది పేదవారు కావటం, తత్ఫలితంగా పారిశ్రామిక వస్తువులకు తగినంత డిమాండు లేకపోవడం జరుగుతుంది.

## మీ అవగాహనను పరీక్షించుకోండి-1

1. ఆర్థికశక్తి కేంద్రీకరణ అంటే ఏమిటి?
2. ఆర్థికశక్తి కేంద్రీకరణ ఎన్నిరకాలుగా జరుగుతుంది?
3. ఆర్థికశక్తి కేంద్రీకరణను కొలిచే సూచిక లేమిటి?

BRAOU

## 19.5 ప్రైవేటు రంగం పనితీరు

పైన చెప్పిన కారణాలవల్ల మన ఆర్థిక వ్యవస్థలో ప్రైవేటు రంగాన్ని పూర్తిగా నిర్మూలించడం మంచిదా? అన్న ప్రశ్న తలెత్తుతుంది. మన రాజ్యాంగం ప్రకారం భారతదేశం ఆర్థిక వ్యవస్థ మిశ్రమమైనది. అంటే ప్రభుత్వరంగం ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించాల్సి ఉంటుంది. ఎందుకంటే అభివృద్ధిప్రక్రియలో ప్రైవేటు రంగానికి చెప్పుకోదగిన పాత్ర ఉంది. అయితే సాంఘికంగా అవాంఛనీయమైన ఆర్థికస్తోమత కేంద్రీకరణకు ప్రైవేటు రంగం దారితీయరాదు. ఈ ముఖ్య విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి ప్రణాళిక ఆచరణలో ఆర్థిక, సాంఘిక ధ్యేయాలను తగు పాళ్లలో సమన్వయ పరచవలసి వుంటుంది. అందుకే 1969 ఏకస్వామ్యాల నిర్బంధ వ్యాపార పద్ధతుల చట్టం ప్రకారం ప్రైవేటు సంస్థల కార్యకలాపాలను పరిశీలించడానికి ఒక న్యాయబద్ధమైన కమీషన్ను ప్రభుత్వం నియమించింది. భారతీయ పారిశ్రామిక రంగంలో ఆర్థిక స్తోమత కేంద్రీకృత విషయంలో ఈ కమిషను ప్రభుత్వానికి ఒక సలహాదారుగా వ్యవహరిస్తుంది.

పోతే ప్రయివేటు రంగంలో ఏయే సంస్థలుంటాయి? మిగిలిన దేశాలమాదిరి భారతదేశంలో కూడా ప్రయివేటు రంగంలో చిన్న, పెద్ద పారిశ్రామిక సంస్థలూ, కొన్ని విదేశీ ప్రయివేటు సంస్థలూ ఉన్నాయి. విదేశీ సంస్థలు వారి పెట్టుబడిని మన దేశంలో వినియోగించి, కొన్ని సంస్థలను విడిగాగానీ, స్వదేశీ సంస్థలతో ఉమ్మడిగాగానీ నెలకొల్పాయి. ప్రభుత్వ విధానాల ప్రకారం ప్రైవేటు రంగం ఒక అనుబంధ పాత్ర మాత్రమే వహించాలి. ప్రభుత్వరంగానికి ప్రైవేటు రంగం ఒక పూరక రంగంగా వ్యవహరించాలి.

ప్రభుత్వ రంగంలోనే కీలకమైన పరిశ్రమలుండాలన్న విషయం 1956 పారిశ్రామిక విధానంలో స్పష్టంగా పేర్కొన్నారు. ప్రైవేటు రంగం ఏ విధంగా పనిచెయ్యాలన్నది కూడా ఈ తీర్మానంలో పేర్కొన్నారు. కాని ఆ ఆశయాలకు చాలా భిన్నంగా ప్రైవేటు రంగం మన దేశంలో వృద్ధి చెందింది. ఇంతకుముందు చర్చించినట్లు ప్రణాళికా కాలంలో పెద్ద పారిశ్రామిక సంస్థల ఉత్పత్తి పరిమాణం, ఆస్తులు విపరీతంగా పెరిగాయి. ప్రభుత్వం చిన్న పరిశ్రమలకు ఎన్ని రాయితీలు ఇచ్చినప్పటికీ అనుకొన్నంతగా అభివృద్ధి చెందలేక పోయాయి. పబ్లిక్ రంగంలో కన్నా చాలా వరకు వినియోగ వస్తువులను ప్రైవేటు రంగమే ఉత్పత్తి చేస్తోంది. దాంతో వినియోగ వస్తువుల తయారీ రంగంలో కేంద్రీకృత ధోరణులు ఏర్పడ్డాయి. వినియోగ వస్తువుల మార్కెట్టును కొద్దిమంది ఏకస్వామ్యాలు, బహుళ స్వామ్యాలు లేదా పరిమిత స్వామ్యాలు అదుపులో ఉంచుకొన్నాయి. ఫలితంగా ఆదాయ అసమానతలు ప్రజలలో పెరిగిపోయాయి. అంతేకాకుండా పరిశ్రమ స్థాపనకూడా ప్రాంతీయ అసమానతలకు దారి తీసింది. లాభాపేక్షతో ప్రైవేటు సంస్థలు పని చేయడం వల్ల వారి పనితీరు ఒకే విధంగా ఉండదు. ఏ పద్ధతిని అనుసరించినా లాభం రావాలి. ఆ పద్ధతులు సంస్థల మధ్య భిన్నంగా ఉంటాయి. కొంతమంది ఏకస్వామ్యాదారులుగా వ్యవహరిస్తారు. మరికొన్ని సంస్థలు పరిమిత స్వామ్యాలుగా పనిచేస్తుంటాయి. భారతదేశంలో పరిమిత స్వామ్యాలుగా ఉన్న సంస్థల పెరుగుదల ఏకస్వామ్యాల సంస్థలకంటే ఎక్కువ. ఈ సందర్భంలో ఇంకో విషయాన్నికూడా చెప్పవచ్చు. ఈ సంస్థలు తక్కువ శ్రమ సాంద్రత గల ఉత్పత్తి పద్ధతులను అవలంబించినందవల్ల ఉద్యోగావకాశాలను సృష్టించలేక పోతున్నాయి.

ప్రయివేటు రంగంలో ఆర్థికస్తోమత కేంద్రీకృతం కావటానికి ప్రభుత్వం చేపట్టిన లైసెన్సింగు విధానం కూడా కొంతవరకు కారణమని చెప్పుకోవచ్చును. లైసెన్సింగు విధానలోపాలను సవరించడానికి 1967లో ఎస్. దత్ (S. Dutt) అధ్యక్షతన ప్రభుత్వం పారిశ్రామిక లైసెన్సింగు విచారణ సంఘాన్ని నియమించింది. (Industrial Liecnsing Policy Enquiray Committee - ILPEC) ఈ సంఘం 1956-66 మధ్యకాలంలోని లైసెన్సింగు విధానాన్ని పరిశీలించింది. ఈ దిగువ పేర్కొన్న లోపాలను పేర్కొన్నది.

1) కార్పొరేటు రంగంలో పరిశీలన నిమిత్తం ఎంపిక చేసిన 73 పెద్ద పారిశ్రామిక సంస్థలలో 30 సంస్థలకు కార్పొరేటు రంగం వాటాలో అత్యధిక శాతం యాజమాన్యం ఉంది.

విచారణ సంఘం, హజారీకమిటీ, దత్ కమిటీ వంటి సంఘాలెన్నిటినో ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీలు ఆర్థిక శక్తి కేంద్రీకరణ 1951 నుంచి పెరుగుతున్నట్లుగా కనుగొన్నాయి. పారిశ్రామిక లైసెన్సింగు విచారణ సంఘం (ILPIC) లైసెన్సింగు విధానం పనితీరుపై అధ్యయనం చేసి, అందులో ఎన్నో లోపాలు ఉన్నట్లు ధృవపరిచింది.

ఈ భాగంలో ఏకస్వామ్యాల నిర్బంధ వ్యాపార పద్ధతుల చట్టం, 1969 గురించి తెలుసుకొన్నాం. అదే విధంగా ఆర్థికశక్తి కేంద్రీకరణను అరికట్టడానికి తీసికోదగిన వివారణ చర్యలను సూచించడం జరిగింది.

- డా: టి. దివాకరరావు

## 19.9 సంప్రదింపు గ్రంథాలు


1. Datt & Sundaram : Indian Economy
2. S.C. Kuchhal : Industrial Economy of India


## 19.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

I *ఈ కింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబు ఇవ్వండి.*

1. ఆర్థికశక్తి కేంద్రీకరణ అంటే ఏమిటి? మహలనోబిస్ కమిటీ ఈ విషయంలో చేసిన సిఫారసులేమిటి?
2. భారతదేశంలో ఆర్థికశక్తి కేంద్రీకృతం కావడానికి గల కారణాలను, దాని వల్ల కలిగే ఫలితాలను వివరించండి.

II *కింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబు ఇవ్వండి.*

1. మహలనోబిస్ కమిటీ సిఫారసు లేమిటి?
2. ఆర్థికశక్తి కేంద్రీకరణ మీద ఏకస్వామ్యాల విచారణ సంఘం (1964) ప్రధాన సిఫారసులేమిటి?
3. ఏకస్వామ్య నిర్బంధ వ్యాపార పద్ధతుల చట్టం (MRTP Act), 1969 అంటే ఏమిటి? దాని ఉద్దేశాలు ఏమిటి?

BRAOU

## భాగం-20:పారిశ్రామిక విత్తం

విషయక్రమం


20.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
20.1 పరిచయం
20.2 పరిశ్రమలద్రవ్య అవసరాలు
 20.2.1 చిన్న తరహా పరిశ్రమల ద్రవ్య అవసరాలు
 20.2.2 పెద్ద తరహా పరిశ్రమల ద్రవ్య అవసరాలు
20.3 భారతదేశంలో ద్రవ్య సంస్థలు
 20.3.1 భారతపారిశ్రామిక ఆర్థిక సహాయసంస్థ (IFCI)
 20.3.2 భారతపారిశ్రామిక పరపతి, పెట్టుబడుల సంస్థ (ICICI)
 20.3.3 భారతపారిశ్రామికాభివృద్ధి బాంకు (IDBI)
 20.3.4 భారతపారిశ్రామిక పునర్నిర్మాణసంస్థ (IRCI)
 20.3.5 యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (UTI)
20.4 సమస్యలు, నివారణ చర్యలు
20.5 సారాంశం/ముగింపు
20.6 సంప్రదింపు గ్రంథాలు
20.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 20.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

భారతదేశం వంటి వర్ధమాన దేశంలో పారిశ్రామికాభివృద్ధి కోసం ద్రవ్య సంస్థల ఆవశ్యకతను చర్చించి కొన్ని ద్రవ్యసంస్థలను పరిచయం చేయడమే ఈ పాఠం లక్ష్యం.

ఈ భాగాన్ని చదివిన తర్వాత మీరు.

- ★ ద్రవ్య సంస్థల ఆవశ్యకతను గుర్తించగలరు
- ★ పరిశ్రమలకు విత్త సౌకర్య అవసరాలను వివరించగలరు
- ★ భారతదేశంలో వివిధ విత్త సంస్థల పని తీరును చర్చించగలరు.
- ★ పారిశ్రామిక విత్త సమస్యలను పరిశీలించి తగిన నివారణ చర్యలను సూచించగలరు.

## 20.0 పరిచయం — ద్రవ్య సంస్థల ఆవశ్యకత

ఉద్యమదారులూ, ఋణదాతలూ వ్యక్తిగతంగా నిర్వహించే బాధ్యతలను రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ద్రవ్య సంస్థలు చేపట్టాయి. పబ్లిక్ లేదా ప్రైవేటు లేదా మిశ్రమ పరిశ్రమలకు మధ్య, దీర్ఘకాల ఆర్థిక అవసరాలను తీర్చుకోడానికి ద్రవ్య సంస్థలు తగు సహాయాన్ని అందిస్తాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలనుండి నిధులను సమీకరించి వాటిని అవసరమైన పరిశ్రమలకు అందజేయడం ఈ సంస్థలు నిర్వహించే విధులలో ముఖ్యమైనవి. ఆర్థికంగా అభివృద్ధి చెందిన బ్రిటన్, అమెరికావంటి దేశాలలో పెద్దపెద్ద వ్యాపార సంస్థలువారి ద్రవ్య అవసరాలను స్వతంగా సమకూర్చుకుంటాయి. కాని భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉద్యమదారులు వారి పరిశ్రమలకు అవసరమైన నిధులను ఇతరులపై ఆధారపడకుండా సమకూర్చుకోలేరు. కాబట్టి పారిశ్రామికాభివృద్ధి జరపటానికి వీలుగా ద్రవ్య సంస్థలు తగిన ఆర్థిక సహాయాన్ని అందించుటలో క్రియాశీలకపాత్ర వహిస్తున్నాయి.

మొదటి విషయమేమంటే అభివృద్ధి చెందుతున్న దేశాలలో మూలధన సంచయనం అతిస్వల్పంగా ఉంటుంది. ఒక పారిశ్రామిక సంస్థ పొదుపు, పెట్టుబడి మధ్యగల వ్యత్యాసాన్ని ద్రవ్య సంస్థలిచ్చే సహాయంతో భర్తీ అవుతుంది. ద్రవ్యసంస్థల ప్రాధాన్యతను ఇంకొక దృక్కోణం నుంచి కూడ పరిశీలించవచ్చు. ఈ దేశాలలో ఆర్థిక వ్యవస్థలో జనించిన పొదుపును సమీకరించటానికి శాస్త్రీయమైన యంత్రాంగమేమీ లేదు. కాబట్టి ద్రవ్య సంస్థలు ఒక పక్క పొదుపును సమీకరించి వేరొక పక్క ఆ పొదుపును పరిశ్రమల ద్రవ్య అవసరాలకోసం అందిస్తాయి. అంతేకాకుండా అభివృద్ధి చెందుతున్న దేశాలలో మూలధన మార్కెట్టు నిర్వహణ సక్రమంగా ఉండదు. మూలధన మార్కెట్టును అభివృద్ధి పరచటానికి ద్రవ్య సంస్థలు శ్రద్ధ తీసుకుంటాయి. మూలధన మార్కెట్ జారీ చేసే వివిధ కార్పొరేట్ సెక్యూరిటీలకు పూచీదారుగా ద్రవ్య సంస్థలుంటాయి. ఫలితంగా సెక్యూరిటీలకు తగినంత డిమాండును ఆర్థికవ్యవస్థలో సృష్టించవచ్చు. దేశంలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని సాధించటానికి ద్రవ్య సంస్థలు ఎంతగానో తోడ్పడతాయి. పరిమిత ద్రవ్య వనరులను ముఖ్యమైన కీలకపరిశ్రమల వృద్ధికి ఉపయోగపడేట్టు ద్రవ్య సంస్థలు చర్యలు తీసుకుంటాయి. ద్రవ్య సంస్థలు సర్వసాధారణంగా కార్పొరేట్ సెక్యూరిటీలలో పాల్గొనటం, వాటికి హామీదారుగా (పూచీదారుగా) ఉండటం, డిబెంచర్లను కొనటం, జారీ చేయటం, ఆస్తులను తనఖాకు స్వీకరించటం మొదలైన విధులను నిర్వహిస్తుంటాయి. ద్రవ్య సంస్థలు ద్రవ్య సహాయాన్ని అందించడమే కాకుండా కొత్త పరిశ్రమల యూనిట్లకు సాంకేతిక పరమైన సలహాలను కూడాఅందిస్తాయి. ఈ విధంగా ద్రవ్య సంస్థల పాత్ర వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలలో పారిశ్రామికీకరణకు అవసరమైన సహాయం సమకూరుతుంది.

## 20.2 పరిశ్రమల ద్రవ్య అవసరాలు

పరిశ్రమల అభివృద్ధిలో ద్రవ్య సంస్థల పాత్రను ఇంతవరకూ చర్చించాము. ఇప్పుడు ఏ ఏ పరిశ్రమలకు ద్రవ్య సంస్థలు ఏ విధంగా ఆర్థిక సహాయాన్ని అందజేస్తాయో పరిశీలిద్దాం. పరిశ్రమలకు వివిధ రకాల అవసరాలుంటాయి. మూలధన రాశిని నిర్మించటానికి, యంత్రాలను కొనడానికీ, భూమిని కొనడానికీ, భవనాలను నిర్మించడానికీ ద్రవ్యం అవసరమౌతుంది. వీటి కోసం అవసరమైన ద్రవ్యం చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యయాన్ని "మూలధన వ్యయం" అని అంటారు (Block or Capital expenditure).

పరిశ్రమలకు స్థిరకారకాలను నిర్మించుకోడానికే కాకుండా చరకారకాలను కొనడానికి కూడ ద్రవ్యం అవసరమౌతుంది. దానిని "నిర్వహణ మూలధనం" అంటారు. అయితే ఈ అవసరాలలో కొన్నింటిని ద్రవ్య సంస్థలే కాకుండా వాణిజ్య బ్యాంకులు కూడా పరిశ్రమలకు అందిస్తాయి. ముఖ్యంగా స్వల్పకాలానికి సంబంధించిన ద్రవ్య అవసరాలనువాణిజ్య బ్యాంకులు తీరుస్తాయి. ఋణాలు, అడ్వాన్సులు, క్యాష్‌క్రెడిట్, బిల్లును డిస్కౌంట్ చేయటం మొదలైన కార్యకలాపాల ద్వారా పరిశ్రమలకు బ్యాంకులు స్వల్పకాల ఆర్థిక సహాయాన్నిస్తాయి. ప్రతి పరిశ్రమ వాణిజ్య బ్యాంకులలో ఏదో ఒక బ్యాంకుతో స్వల్పకాల అవసరాలను తీర్చుకోడానికి సంబంధం పెట్టుకుంటుంది. ఒక పారిశ్రామిక సంస్థకు ఎంత మేరకు ఒక బ్యాంకు పరపతి సౌకర్యాన్ని అందజేయగలదన్న అంశం ఈ కింది కారకాల మీద ఆధారపడి ఉంటుంది. (1) బ్యాంకు అప్పుఇవ్వగల ఋణ పరిమాణం (2) బ్యాంకింగు సూత్రాలలో పేర్కొన్న షరతులు. అయితే ద్రవ్యసంస్థలు ఇచ్చే సహాయాన్ని గురించి చర్చించే ముందు పరిశ్రమలకు ద్రవ్య వనరులను సమకూర్చుకోడానికి గల వివిధ మూలాధారాలను తెలుసుకోవాలి. అవి (a) షేర్లూ, డిబెంచర్లు (b) పబ్లిక్ డిపాజిట్లు (c) వాణిజ్య బ్యాంకుల నుంచి స్వల్పకాల ఋణాలు (d) గ్రామీణ బ్యాంకర్లు(e)ద్రవ్యసంస్థలు (f) నిల్వలాభాలు. భారతదేశంలో 1970 ఏప్రెల్ వరకు మేనేజింగు ఏజెంట్లు పరిశ్రమలకు కావలసిన ద్రవ్యసహాయాన్ని అందిస్తుండేవారు, కాని మేనేజింగు ఏజెన్సీ పద్ధతిలో అనేక లోపాలుండటం చేత 1970 తరువాత రద్దు చేశారు.

### 20.2.1 చిన్న తరహా పరిశ్రమల ద్రవ్య అవసరాలు

పరిశ్రమ మూలాధారాలలో అతిముఖ్యమైనవి షేర్లు, డిబెంచర్లు, పబ్లిక్ డిపాజిట్లు, ద్రవ్యసంస్థలు. పోతే, చిన్న పరిశ్రమలకు కావలసిన పరపతి సౌకర్యాన్ని గ్రామీణ బ్యాంకర్లు ఎక్కువగా అందిస్తుండేవారు. ఈ పరిశ్రమలకు ముడిసరుకు కొనడానికీ, శ్రామికులకు వేతనాలను చెల్లించడానికీ అంతిమ వస్తువులను విక్రయించడానికి ద్రవ్యం అవసరం. గ్రామీణ బ్యాంకర్లు ఎక్కువ వడ్డీ వసూలు చేస్తుంటారు. చిన్న పరిశ్రమల సమస్యలను కొంత మేరకు పరిష్కరించడానికి 1969 జూలై నెలలో భారత ప్రభుత్వం వాణిజ్య బ్యాంకులను జాతీయం చేసింది. చిన్న పరిశ్రమల ద్రవ్య అవసరాలను వాణిజ్య బ్యాంకులు తీరుస్తాయని ప్రభుత్వం భావించింది. ఈ చర్యవల్ల చిన్న పరిశ్రమలకు సహాయం చాలా సంస్థల నుండి లభిస్తోంది. పారిశ్రామిక సహకార సంస్థలు, భారతీయ స్టేట్‌బ్యాంకు, జాతీయ వాణిజ్య బ్యాంకులు, రాష్ట్ర ఆర్థిక సహాయ సంస్థలు, సహకార బ్యాంకులు, చిన్న పరిశ్రమల కార్పొరేషన్ మొదలైనవి ముఖ్యమైనవి.

పారిశ్రామిక సహకార సంస్థలు కొన్ని పరిశ్రమలకు కావలసిన సహాయాన్ని అందించటంలో జయప్రదమైనవి. ముఖ్యంగా చేనేత, కుమ్మరి, కొబ్బరిపీచు పరిశ్రమలు పేర్కొనదగినవి. సహకార సంస్థలు అవసరమైన నిధులను రాష్ట్ర సహకార బ్యాంకుల నుండి తీసుకుంటాయి.

లోగడ వివరించినట్లు బ్యాంకింగు రంగం జాతీయాకరణకు ముందు చిన్న సంస్థలకు అవసరమైన నిధులను సమకూర్చలేక పోయింది. 1969 తరువాత భారతీయ స్టేట్‌బ్యాంకు దాని అనుబంధ సంస్థలు జాతీయమయిన వాణిజ్య బ్యాంకులు ఇతర షెడ్యూల్డు బ్యాంకులు చిన్న పరిశ్రమలకు ఆర్థిక సహాయాన్ని అందించడంలో ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి. రాష్ట్ర ఆర్థిక సహాయ కార్పొరేషన్లు సహకార బ్యాంకులు ఈ పరిశ్రమలకు పరపతి గ్యారంటీ స్కీము కింద 1960 జూలై నుండి సహాయాన్ని చేస్తున్నాయి. ఈ స్కీము ప్రకారం ద్రవ్య సంస్థలు చిన్న పరిశ్రమలకు మంజూరు చేసిన ఋణాల వల్ల ఎటువంటి నష్టము రాకుండా రక్షణ కల్పించారు. చిన్న పరిశ్రమలకు ద్రవ్య సహాయాన్ని అందించడమే కాకుండా అనేక ఇతర సౌకర్యాలను 1955 ఫిబ్రవరి నెలలో స్థాపించిన జాతీయ చిన్న పరిశ్రమల కార్పొరేషను నిర్వహిస్తోంది. ఈ కార్పొరేషను ముఖ్యవిధులు : (i) చిన్న పరిశ్రమలు ఉత్పత్తి చేసిన వస్తువులకు గవర్నమెంటు నుంచి ఆర్డర్లను తీసుకొనటం, (ii) చిన్న పరిశ్రమలకు ద్రవ్య, సాంకేతిక పరమైన సహాయాన్ని అందించడం (iii) పెద్ద, చిన్న పరిశ్రమల మధ్య సమన్వయాన్ని సాధించడానికి ప్రయత్నించడం, (iv) వివిధ బ్యాంకులు చిన్న పరిశ్రమలకు ఇచ్చే ఋణాలకు పూచీదారుగా వ్యవహరించడం మొదలైనవి.

BRAOU

### 20.2.2 పెద్ద తరహా పరిశ్రమల ద్రవ్య అవసరాలు

ఇప్పుడు పెద్ద పరిశ్రమల ద్రవ్య అవసరాలను గురించి చర్చిద్దాం. చిన్న పరిశ్రమల్లాగ వీటికి కూడ యంత్రాలు, భవనాలు మొదలైనవి ఏర్పరచుకోడానికి మూలధనం కావాలి. ఈ పరిశ్రమలు సాధారణంగా స్థిరమూలధనాన్ని షేర్లు, డిబెంచర్లును, బ్యాంకు ఋణాల ద్వారా సమకూర్చుకుంటాయి. స్థిర మూలధనంలో చాలా మేరకు సమానవాటాలు లేదా అధీకృత వాటాలు ఉంటాయి. పారిశ్రామిక సంస్థలు జారీచేసే డిబెంచర్ల మీద ఆకర్షణీయమైన వడ్డీ ఉన్నందున ప్రజల నుండి డిపాజిట్ల రూపంలో నిధులను సమకూర్చవచ్చు.

పెద్ద పరిశ్రమలకు కూడా వాణిజ్య బ్యాంకులు ఋణాలందిస్తాయి. ఇటీవల స్వల్పకాల ఋణాలేకాకుండా మధ్యకాలిక ఋణాలను కూడా వాణిజ్య బ్యాంకులిస్తున్నాయి. పరిశ్రమలు జారీచేసే వాటాలు, డిబెంచర్లలో వాణిజ్య బ్యాంకులు పాల్గొంటున్నాయి. షేర్లు, డిబెంచర్లు, పబ్లిక్ డిపాజిట్లు వాణిజ్య బ్యాంకుల నుంచి పరపతి మొదలైన సౌకర్యాలున్నప్పటికీ పెద్ద పరిశ్రమల ద్రవ్య అవసరాలను పూర్తిగా తీర్చలేదు. ఇందుకు కారణం మన దేశంలో మూలధన మార్కెటు సక్రమంగా అభివృద్ధి చెందక పోవటమే. మన దేశంలో చాలా మంది ప్రజలకు వాటాలు, డిబెంచర్ల గురించి తగిన పరిజ్ఞానం లేదు. పబ్లిక్ డిపాజిట్లు పరిశ్రమలకు అవసరమైనప్పుడు దొరకకపోవచ్చు. కాబట్టి పబ్లిక్ డిపాజిట్ల విషయంలో ఒక విధమైన అనిశ్చితత్వముఉన్నది. పోతే, బ్యాంకుల

ద్వారా లభ్యమయ్యే రుణము పరిశ్రమలకు స్వల్పకాలిక వంస్థాపరమైన పరపతి తగినంతగా లేదు. దీర్ఘకాల అవసరాలను తీర్చడానికి స్వాతంత్ర్యానంతరం కొన్ని ద్రవ్య సంస్థలను స్థాపించారు.

## 20.3 భారతదేశంలో ద్రవ్య సంస్థలు

### 20.3.1 భారత పారిశ్రామిక ఆర్థిక సహాయసంస్థ (IFCI)

1948లో 10 కోట్లు అధీకృత మూలధనంతో ఈ సంస్థను భారతప్రభుత్వం ఏర్పరచినది. ఈ సంస్థముఖ్యమైన విధులు మూడు.

(a) పరిశ్రమలకు రుణాలనూ, అడ్వాన్సులనూ ఇవ్వడం. పరిశ్రమలు జారీ చేసే డిబెంచర్లను కొనటం.

(b) పరిశ్రమలు తీసుకున్న ఋణాలకు పూచీదారుగా వ్యవహరించటం.

(c) పరిశ్రమలు జారీచేసే షేర్లు, డిబెంచర్లకు హామీ ఉండటం. పబ్లిక్, ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలకు దీర్ఘ, మధ్యకాల పరపతి సౌకర్యాన్ని ఈ సంస్థ అందిస్తుంది. ఈ ఋణాల గడువు 25 సంవత్సరాల మేరకు ఉండవచ్చు. ఏ ఒక్క పరిశ్రమకైనా కోటిరూపాయల వరకూ ఈ సంస్థ అందించిన సహాయంలో చాలా మేరకు బట్టలు, కాగితం, మౌలిక రసాయనాలు, ఎరువులు, సిమెంటు, లోహాలు, లోహపదార్థాలు, మోటారు వాహనాలు, కొన్ని ఆహార వస్తువుల తయారీ చేసే పరిశ్రమలకు అందినది. ఇటీవల ఈ సంస్థ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికోసం ఆ ప్రాంతాలలో ఉన్న పరిశ్రమలకు సహాయం చేయటానికి పూనుకున్నది. పరిశ్రమలను ఆధునీకరణ చేయడానికీ, సంబంధీకరణ చేయడానికీ ఈ సంస్థ కొన్ని కార్యకలాపాలను కూడా చేపట్టింది. ఆధునిక యాజమాన్యంలో సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి కూడా ఈ సంస్థ పూనుకొన్నది.

రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర ఆర్థిక సహాయ సంస్థలను నెలకొల్పారు. ఇవి ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలకూ, భాగస్వామి పరిశ్రమలకూ,వ్యక్తిగత సంస్థలకూ కూడా సహాయాన్ని ఇస్తాయి. ఈ సంస్థలు సుమారు 50 లక్షల నుండి 5 కోట్ల మేరకు అధీకృతమూలధనాన్ని కలిగి ఉంటాయి. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సహాయం చేయడం జరుగుతుంది. రాష్ట్ర ఆర్థిక సహాయ సంస్థతో పాటు రాష్ట్రప్రభుత్వాలు పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషనుల కూడా నెలకొల్పాయి. అయితే, రాష్ట్ర ఆర్థిక సహాయ సంస్థలూ, పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషనల విధుల దాదాపు సమానంగా ఉంటాయి. ఇటీవల రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్లు ఉమ్మడి రంగంలో చాలా సంస్థలను అభివృద్ధి పరిచాయి.

### 20.3.2 భారత పారిశ్రామికపరపతి పెట్టుబడుల సంస్థ (ICICI)

ఈ సంస్థను 1955లో 25 కోట్ల రూపాయల అధీకృతంతో స్థాపించారు. ఈ సంస్థ ముఖ్యవిధి పెద్ద, మధ్యతరహా పరిశ్రమలకు పరపతి సౌకర్యాన్ని అందించటం. ఈ సంస్థ ప్రైవేటు రంగ పరిశ్రమలకు సహాయాన్ని ఇస్తుంది. ఈ సంస్థ,

(a) కొత్త పరిశ్రమలను ప్రోత్సహిస్తుంది.

(b) పరిశ్రమలను ఆధునీకరణ చేయటానికి, సాంకేతిక యాజమాన్య విషయాలలో తగు సలహాలను ఇచ్చి ఉత్పత్తి అధికమయ్యేట్లు చేస్తుంది.

(c) పారిశ్రామికార్థిక సహాయ సంస్థలూ, ఈ సంస్థ కూడా పరిశ్రమలు జారీచేసే షేర్లు, డిబెంచర్లను కొంటుంది. వాటికి పూచీదారుగా వ్యవహరిస్తుంది. ఈ సంస్థ సహాయం ముఖ్యంగా కాగితం, రసాయనాలు, విద్యుత్పరికరాలు, బట్టలు, పంచదార, సిమెంటు మొదలైన పరిశ్రమలకు ఎక్కువగా అందినది. ఈ సంస్థ విదేశీ మారక ద్రవ్యంలో కూడా ఋణాలను పరిశ్రమలకు అందజేస్తుంది. అయితే, ఈ సంస్థ కార్యకలాపాలు ముఖ్యంగా ప్రైవేటు రంగం పరిశ్రమలను దోహదపరిచాయి.

### 20.3.3 భారతీయ పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు (IDBI)

ఈ బ్యాంకును 1964లో స్థాపించారు. ఇది రిజర్వుబ్యాంకుకు అనుబంధ సంస్థగా ఉన్నది. 50 కోట్ల రూపాయలు అధీకృత మూలధనంతో ఈ సంస్థ పరిశ్రమలకు ఋణాలిచ్చి, వివిధ సంస్థల కార్యకలాపాలను సమన్వయం చేస్తుంది. పారిశ్రామికరంగంలో ఉన్నటువంటి లోపాల గురించి, వాటికి తగిన పరిష్కార మార్గాలనూ అన్వేషిస్తుంది. అంతేకాకుండాదీర్ఘ, మధ్యకాల ఋణాలకు పరోక్ష ఆర్థిక సహాయం మంజూరు చేస్తుంది. ఇతర సంస్థల ద్వారా గాని, లేదా ప్రత్యక్షంగాగాని పరిశ్రమలకు సహాయం చేస్తుంది.

### 20.3.4 భారత పారిశ్రామిక పునర్నిర్మాణ సంస్థ (IRCI)

కొన్ని పారిశ్రామిక యూనిట్లలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి 1971లో 25 కోట్ల రూపాయల అధికృత మూలధనం, యాజమాన్య అసమర్థత, శ్రామిక వివాదాలు, ముడిసరుకు కొరత మొదలైనవి సాధారణంగా పరిశ్రమలలో ఉండే సమస్యలు. ఈ సంస్థను ఇటువంటి సమస్యల పరిష్కారం కోసం ఉద్దేశించారు. అసామర్థ్యం, కుష్కించిన పారిశ్రామిక సంస్థలను ఈ కార్పొరేషను పునర్నిర్మాణం చేస్తూ, పునరావాసాన్ని కల్పిస్తుంది. ఇటీవల బట్టలు, ఇంజనీరింగు, గనులు మొదలైన పరిశ్రమలు ఈ సంస్థవల్ల ప్రయోజనం పొందాయి.

### 20.3.5 యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (UTI)

చిన్న పొదుపు మొత్తాలనుసమీకరించి, పారిశ్రామిక పెట్టుబడిలో వాటిని వినియోగించుకోటానికి 1964 ఫిబ్రవరిలో 5 కోట్ల రూపాయల అధికృత మూలధనంతో ఈ ట్రస్ట్‌ను స్థాపించారు. 10 రూ.లు లేదాఅంతకు మించిన విలువగల యూనిట్లను ఈ ట్రస్ట్ అమ్ముతుంది. వాటిని ఎవరైనా కొనుక్కోవచ్చు. యూనిట్లను కొన్న వ్యక్తులకు ఆ విలువపై డివిడెండ్లను చెల్లిస్తారు. ఈ ట్రస్ట్ ముఖ్యోద్దేశ్యాలు రెండు:

1. దేశం వివిధ ప్రాంతాలలో చిన్న పొదుపు మొత్తాలను సమీకరించటం,
2. పారిశ్రామికాభివృద్ధి లాభాలను తక్కువ మొత్తాలలో పొదుపు చేయువారికి కూడా అందజేయడం.

BRAOU

---

## 20.4 సమస్యలూ, నివారణోపాయాలు

---

పైన చెప్పిన అనేక ద్రవ్య సంస్థలను స్థాపించినప్పటికీ మన దేశంలో పరిశ్రమలకు అవసరమైన ద్రవ్య సహాయాన్ని అందించలేక పోతున్నాయి. పారిశ్రామికార్థిక సహాయసంస్థలు ఎక్కువగా ద్రవ్య సహాయాన్ని ఇవ్వటం లోనే కృతకృత్యులయ్యాయి. కాని, అభివృద్ధి చెందుతున్న దేశాలలో పారిశ్రామికాభివృద్ధిని పెంచటానికి ఈ సంస్థలు నిర్మాణాత్మక పాత్రను నిర్వహించవలసి ఉంటుంది. ఈ సంస్థలు కొత్త ప్రాజెక్టులను అన్వేషించి ప్రణాళికాప్రాధాన్యతలను బట్టి వాటిలో కొన్నింటిని ఎంపిక చేసి పరిశ్రమల యాజమాన్యాన్ని సమర్థంగా నడిపించడానికి పథకాలను వేయవలసి ఉంటుంది. పరిశ్రమల వస్తు వ్యయాన్ని తగ్గించడానికీ పరిశ్రమల ఉత్పాదక సామర్థ్యాన్ని మెరుగుపరచడానికీ తగు సలహాలను ఈ సంస్థలు అందించాల్సి ఉంటుంది. పరిశ్రమలకు సహాయం చేయటంలో పరిమితమైన వనరులను వృథా చేయరాదు. అంటే పరిమితంగా లభ్యమయ్యే దేశీయ, విదేశీయ ద్రవ్యాన్ని వృథా చేయరాదు. మన దేశంలో పారిశ్రామికార్థిక సహాయ సంస్థలు చాలా కాలం పాటు వెనుకబడిన ప్రాంతాలను నిర్లక్ష్యం చేశాయి. కాబట్టి వెనుకబడిన ప్రాంతాల పారిశ్రామిక సంపదను సక్రమంగా వినియోగించుకోటానికి ఈ సంస్థలు పథకాలను వేయాలి. అయితే, ఈ సందర్భంలో మరికొన్ని ఇతర విషయాలను కూడా మనం తెలుసుకోవాలి. ఈ సంస్థలు ద్రవ్య సహాయాన్ని అందజేయడానికి ముందుకొచ్చినప్పటికీ దానిని వినియోగించుకోడానికి ఉత్సాహవంతులైన ఉద్యమదారులువెనుకబడిన ప్రాంతాలలో లేరు. అంతేకాకుండా, లైసెన్సులు ఇవ్వటంలో ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వవలసి ఉంటుంది.

అయితే పారిశ్రామిక విత్తాన్ని మాత్రమే విస్తృతం చేస్తే చాలదు. పరిశ్రమలు అవసరమైన నిధులను స్వంతంగా ఏర్పరచుకోగలగాలి. పారిశ్రామిక విత్తాన్ని సక్రమంగా వినియోగించుకోవాలి. ఒక పరిశ్రమ లాభం పైనా అభివృద్ధి సరళిని బట్టి ఆ పరిశ్రమ ఎంత మేరకు పారిశ్రామిక విత్తాన్ని వినియోగించుకోగలదో తెలుస్తుంది. అయితే ఇటీవల పరిశ్రమలు స్వంత నిధులపై కాక సంస్థాపరమైన పరపతి మీద ఎక్కువగా ఆధారపడుతున్నాయి. దీనికి ముఖ్యకారణం మూలధన మార్కెట్టు (షేర్లు, డిబెంచర్ల మార్కెట్) మనదేశంలో అభివృద్ధి చెందకపోవటమే.

## 20.5 సారాంశం/ముగింపు

ఈ పాఠంలో ద్రవ్య సంస్థల ఆవశ్యకతను గురించి తెలుసుకున్నారు. స్వాతంత్ర్యానంతరం మన దేశంలో పారిశ్రామికాభివృద్ధి కోసం స్థాపించిన వివిధ ద్రవ్య సంస్థలను గురించి చర్చించాం. మన దేశంలో ప్రోత్సాహకరమైన పారిశ్రామిక వాతావరణాన్ని కలుగజేయటానికి మూలధన మార్కెట్టును ముందుగా అభివృద్ధి పరచవలసి ఉంటుంది. దానికి తోడుగా సంస్థాపరమైన పరపతి సౌకర్యాలను సమర్థంగా నిర్వహించవలసి ఉంది. పారిశ్రామికవిత్తాన్ని అందించే సంస్థల కార్య కలాపాలేకాకుండా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను బట్టి కూడా పారిశ్రామికాభివృద్ధి ఆధారపడి ఉంటుంది.

— డా॥ టి.దివాకరరావు

## 20.6 సంప్రదింపు గ్రంథాలు

1 Datt and Sundarm : Indian Economy.
2. S.C. Kuchhal : Industrial Economy of India.

## 20.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. *కింది ప్రశ్నలలో ఒక్కొక్కదానికి సుమారు 30 పంక్తులలో జవాబులు రాయండి.*

1. పారిశ్రామిక విత్తమంటే ఏమిటి? చిన్న, భారీ తరహా పరిశ్రమల ప్రధాన ఆర్థిక వనరులను వివరించండి.
2. "అత్యధిక పారిశ్రామికాభివృద్ధిని సాధించటానికి విత్త సంస్థల ప్రాధాన్యతను ఇతర విధాన సంబంధ చర్యలను జోడించాలి"— చర్చించండి.

II. *కింది ప్రశ్నలలో ఒక్కొక్కదానికి సుమారు 15 పంక్తులలో జవాబులు రాయండి.*

1. పారిశ్రామిక విత్త సమస్యలను చర్చించి, నివారణోపాయాలను సూచించండి.
2. పారిశ్రామికాభివృద్ధిని పెంపొందించడంలో సంస్థాగత విత్త ప్రాధాన్యతను వివరించండి.
3. భారీ తరహా పరిశ్రమల విత్త అవసరాలు ఏమిటి?

BRAOU

# ఖండం VI

## విదేశీరంగం

ఈ ఖండంలోని మూడు భాగాలలో చర్చ ప్రధానంగా విదేశీ వర్తకం మీద కేంద్రీకృతమై ఉంది. ఒక దేశ ఆర్థికాభివృద్ధిలో విదేశీ వర్తకానికి ఎంత ప్రాముఖ్యం ఉంటుందో తెలుసుకుంటాం. విదేశీ వర్తకానికి సంబంధించిన వివిధ భావనలను — వర్తక నిబంధనలు, వర్తకశేషం, చెల్లింపుల శేషం మొదలైనవాటిని — అవగాహన చేసుకోవడానికి వీలు కలుగుతుంది. భారతదేశానికి విదేశీ వర్తకం ఎంతవరకు దోహదపడుతుంది, విదేశీ వర్తకపు తీరు తెన్నులు ఏ విధంగా వున్నాయి, విదేశీ మూలధనం వల్ల ఏ విధమైన ఉపయోగం వుంది అనే విషయాలను కూడా ఈ ఖండంలో చర్చిస్తాం.

ఈ ఖండంలోని 3 భాగాలు :

భాగం 21 : విదేశీవర్తకం — ఆర్థికాభివృద్ధి

భాగం 22 : భారతదేశంలో విదేశీ వర్తకం

భాగం 23 : విదేశీ ఆర్థిక సహాయం, విదేశీ మూలధనం.

BRAOU

BRAOU

# భాగం-21: విదేశీ వర్తకం – ఆర్థికాభివృద్ధి

విషయక్రమం


21.0 లక్ష్యాలు, ఉద్దేశాలు
21.1 పరిచయం
21.2 విదేశీ వర్తకం ప్రాధాన్యత
21.3 ప్రపంచ వర్తక దృక్పథాలు
21.4 వర్తక నిబంధన (Terms of Trade)ల సమస్య
21.5 అంతర్జాతీయ వర్తక ధోరణులు
21.6 చెల్లింపుల శేషం
21.7 సారాంశం/ముగింపు
21.8 సంప్రదింపు గ్రంథాలు
21.9 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 21.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

దేశాలవారిగానూ, ఖండాలవారిగానూ విదేశీ వర్తకానికి ఉన్న ప్రాధాన్యతను వివరించడమే ఈ భాగం లక్ష్యం.

ఈ భాగాన్ని చదివిన తర్వాత మీరు

★ ఆర్థికాభివృద్ధిలో విదేశీ వర్తక ప్రాధాన్యతను విశ్లే... రు.
★ ప్రపంచ వర్తక దృక్పథాలను చర్చించగలరు.
★ వర్తక నిబంధనలు, చెల్లింపుల శేషం అనే వాటిని అవగాహన చేసుకోగలరు.
★ అంతర్జాతీయ వర్తక పోకడలను తెలుసుకోగలరు.

BRAOU

## 21.1 పరిచయం

ఆర్థికాభివృద్ధి అంటే ఏమిటి అనే ప్రశ్నతో ఆర్థికాభివృద్ధిలో విదేశవర్తక పాత్ర పరిశీలన ప్రారంభమౌతుంది. ఇటీవల దాకా ఆర్థికాభివృద్ధి అంటే తలసరి జాతీయాదాయ పెరుగుదల అని భావించే వారు. కానీ, ఇప్పుడలా అనుకోవడంలేదు. నూనె ఎగుమతుల మూలంగా పలు మధ్య ప్రాచ్యదేశాలు వేగంగా ధనం సంపాదించాయి. కానీ ఇలాంటి ఒంటి కొలత పెరుగుదలను అభివృద్ధి అనరు.

కాబట్టి, అభివృద్ధి అనేది సమాజ మౌలిక లక్షణాలలోనూ, సామాజికార్థిక లక్షణాలలోనూ, సాంకేతికార్థిక లక్షణాలలోనూ వచ్చే గుణాత్మకమైన మార్పుకు వర్తిస్తుంది. ఒట్టి పెరుగుదల అనేది ప్రజలలో అధిక సంఖ్యాకులను నికృష్టపు దారిద్ర్యంలో వదలివేయవచ్చు. అభివృద్ధి అనేది అటువంటి పెరుగుదలకంటే విశాలమైన సంపన్నమైన భావం. అభివృద్ధి లేకుండా చాలా కాలం పాటు పెరుగుదల జరగవచ్చు. పెరుగుదల అనేది అభివృద్ధిలో ఒక అంశం మాత్రమే. కాకుంటే చాలా ముఖ్యమైన అంశం.

## 21.2 విదేశీ వర్తక ప్రాధాన్యత

ఇప్పుడు పురోగామి దేశాలుగా ఉన్నవాటి ఆర్థికచరిత్రను బట్టి విదేశీ వర్తక ప్రాముఖ్యాన్ని మనం సులభంగా గ్రహించవచ్చు. 15వ, 17వ శతాబ్దాల మధ్య జరిగిన గొప్ప భౌగోళిక ఆవిష్కరణలకు అంటే అమెరికాలను కనుక్కోవడం, భారతదేశానికి సముద్రమార్గం కనిపెట్టడం, మొదలైన వాటికి— కొంత వరకు ప్రేరణ ఏమిటి అంటే— విదేశీ వర్తకంలో కొరతగా ఉన్న బంగారు, మసాలా దినుసులూ, బట్టలూ, వగైరాలను సంపాయించుకోవలసిన అవసరం. నిజానికి ప్రధానంగా విదేశీవర్తకం ద్వారా దేశంలో సంపద సృష్టింపబడుతుందనే ఒక ఆర్థిక సిద్ధాంతమే 'వాణిజ్యవాదం' అనే పేరుతో ఉండేది. ఆ గొప్ప భౌగోళిక ఆవిష్కరణల ఫలితాలు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో విస్తారమైన భాగాలు వలసలుగా మారడానికి దారి తీసినాయి. వర్తకులు త్వరలోనే వలసకారులై, ఆ ప్రాంతాల ప్రకృతి వనరులనూ, మార్కెట్లనూ, దోపిడి చేసి, తమ మాతృదేశాలలో— ముఖ్యంగా బ్రిటన్‌లోనూ, ఫ్రాన్సులోనూ — పారిశ్రామిక విప్లవం తెచ్చినారు.

వర్తకానికి ప్రాముఖ్యం ఉందంటే ఏదేశమైనా, ముఖ్యంగా పెద్ద దేశం, గణనీయమైన వర్తకం లేకుండా, అభివృద్ధి చెందజాలదని విధిగా అర్థంకాదు. సోవియట్ యూనియన్‌ను ఉదాహరణగా తీసుకోవచ్చు; అది అనేక ఆంతరంగిక, బాహ్య కారణాలవల్ల కొద్ది దశాబ్దాలపాటు స్వయం సమృద్ధిగల అభివృద్ధిని ఆదర్శంగా పాటించింది. తరువాత చైనా ఈ ఆదర్శాన్ని సుమారు రెండు దశాబ్దాలపాటు అనుసరించింది. యూరప్‌లో ఆల్బేనియా కూడా అనుసరించింది. సోవియట్ యూనియనూ, చైనా రెండూ పారిశ్రామికీకరణకు అవసరమైన అనేక ప్రకృతి వనరులుగల అతిపెద్ద దేశాలు కాబట్టి ఇది సాధ్యమైంది. ఈ రకం అభివృద్ధికి అవసరమైన ఆర్థిక, సామాజిక ఖర్చులు కూడా చాలా ఎక్కువగా వున్నాయి. ప్రపంచంతో సంబంధాలు లేకుండా ఒంటరిగా ఉండిపోయిన చిన్నదేశానికి ఆల్బేనియా అద్వితీయమైన ఉదాహరణ. అయితే, ఆల్బేనియా ఇంతవరకు అభివృద్ధి చెందిన దేశంగా లెక్కలోకి రాలేదు. తూర్పు యూరప్‌లోని పలుదేశాలు "సమిష్టి స్వావలంబన" ఆదర్శాన్ని అనుసరించి చూసాయి. కానీ యా ఆదర్శం కూడా పనిచేయడంలేదని అర్థమౌతున్నది. ఆర్థికాభివృద్ధి చోదక శక్తులలో ఒకటిగా వర్తక ప్రాముఖ్యాన్ని ప్రపంచమంతటా ఇప్పుడు గుర్తించారు.

అమెరికా సంయుక్త రాష్ట్రాలలాగ మరికొన్ని పెద్ద దేశాలు ప్రపంచ మార్కెట్టుతో పరిమిత సంబంధాలు పెట్టుకొనే విధానం అవలంభించినాయి. అమెరికాకు ఒక ఖండం లాంటి పరిణామాలుగల విస్తారమైన అంతరంగిక మార్కెటూ,వైవిధ్యంగల వనరులూ ఉన్నాయి. గనుక ఇది సాధ్యమైంది. బ్రెజిల్ లాంటి మరికొన్ని దేశాలకుకూడా ఇది వర్తిస్తుంది. విదేశీవర్తకానికి పెరుగుతున్న ప్రాముఖ్యం ఇప్పుడు గుర్తిస్తున్నారు. ప్రకృతి వనరులు తరిగి పోవడం వల్లా,సాంకేతిక పరస్పరాధారం పెరుగుతున్నందువల్లా, విదేశీ వర్తకానికి ప్రముఖ పాత్ర లభిస్తున్నది.

అభివృద్ధికోసం ప్రధానంగా విదేశీ వర్తకం మీద ఆధారపడిన దేశాలు కొన్ని ఉన్నాయి. వీటిల్లో జపానూ, పశ్చిమ యూరప్‌కు చెందిన కొన్ని చిన్న దేశాలు ఉన్నాయి. ఇవి చిన్న దేశాలైనందువల్లా, (అనేక సందర్భాలలో) ప్రకృతి వనరుల ఆధారంలేనందువల్లా, తమ కొరతలను తీర్చుకోడానికి వర్తకం మీద ఆధారపడవలసి ఉంది. అంతేకాక, అత్యుత్తమ ఫలితాలనిచ్చే స్థాయిలో ఆర్థిక వ్యవస్థ నడవాలంటే, అనేక సందర్భాలలో ఉత్పాదక సామర్థ్యానికి తగిన అంతరంగిక మార్కెట్ ఉండదు. ఈ దేశాలు ప్రపంచ మార్కెటుతో పూర్తిగా ఐక్యమైపోయి ప్రపంచ మార్కెటు ఎగుడుదిగుడులను బట్టి తమ పెట్టుబడి నిర్ణయాలనూ, ఉత్పత్తి నిర్ణయాలనూ మార్చుకుంటున్నాయి. అందువల్ల ఈ దేశాలు ధరల విషయంలో ప్రపంచ స్థాయిలో పోటీపడగల చురుకైన ఆర్థిక వ్యవస్థను నిర్మించుకోగలిగినాయి.

## 21.3 ప్రపంచ వర్తక దృక్పథాలు

వర్థమాన దేశాలలో కూడా ప్రపంచ వర్తకం పట్ల వివిధ వైఖరులు కనిపిస్తాయి. ఒకవైఖరినవలంభించే బృందానికి చెందిన దేశాలలో అత్యధికంగా సోషలిస్ట్‌దేశాలు ఉన్నాయి. వియత్నాం, లావోస్, టాంజానియా, గినీ, మొజాంబిక్, ఇథియోపియా లాంటివి, ఇటీవలి దాకా చైనాకూడా సొంతకాళ్ళమీద నిలబడాలనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, స్వయం చోదకమైన స్వదేశ జనిత అభివృద్ధికి అవకాశముందని వాదిస్తాయి. మొత్తం మీద ఈ దేశాల పెరుగుదల రేట్లు కాస్త తక్కువగానే ఉన్నాయి. అంతర్జాతీయ శ్రమ విభజనకు దూరం కావడం వీటికి పెద్దగా సాయపడినట్లు కనిపించదు. ఈ దేశాలు విదేశ వర్తకంతో సహా అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలను మౌలికంగా దోపిడి చేసేట్టివిగానూ, వనరులను పురోగామి దేశాలకు బదలాయించేటట్టివిగానూ పరిగణించే ధోరణిలో ఉన్నాయి. కానీ, ఈ అభిప్రాయం దెబ్బతింటునట్లు కనిపిస్తున్నది. చైనా ఇప్పుడు తన ఆధునికీకరణ కార్యక్రమంలో విదేశీవర్తకం ముఖ్యమైన పాత్ర నిర్వహించవలసి ఉందని గుర్తిస్తున్నది. ఇతర సోషలిస్ట్ దేశాలు సోవియట్ యూనియన్‌తోనూ, తక్కిన తూర్పు యూరప్ సోషలిస్టు దేశాలతోనూ ఆర్థిక సంబంధాలు పెంచుకుంటున్నాయి. కానీ, చారిత్రక, భౌగోళిక, సాంప్రదాయిక, రాజకీయ, ఆర్థికసమస్యలనేకం ఉన్నాయి. అలాంటి ఏకపార్శ్వ వర్తక సంబంధాల అభివృద్ధివల్ల ఆ దేశాలు బలహీనపడతాయి. పాతబడిన సాంకేతిక విజ్ఞానం మీద ఆధారపడిన అసమర్థ పరిశ్రమలను వెలకొల్పుకుంటాయి.

లాటిన్ అమెరికా, ఆగ్నేయ ఆసియా దేశాలు కొన్నీ అలాగే తూర్పు, పడమటి ఆఫ్రికా కొన్ని దేశాలు ప్రపంచ మార్కెట్లతో పూర్తిగా ఐక్యమయ్యే మార్గం అవలంభించి, అంతర్జాతీయ శ్రమ విభజనలో ప్రత్యేక కృషి చేస్తున్నాయి. ఈ దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలను పురోగామి దేశాల సరసన చేర్చే ప్రధానశక్తిగా విదేశీవర్తకాన్ని పరిగణిస్తున్నాయి. సాంకేతిక విజ్ఞానాన్నీ, సరకులనూ, నిర్వాహక నైపుణ్యం లాంటి ఇతర అంశాలనూ ఉదారంగా దిగుమతి చేసుకోవడం ద్వారా ఈ దేశాలు పురోగామి దేశాలను అందుకోగలమనీ, పాశ్చాత్య దేశాలు పారిశ్రామికానంతర సమాజం వైపు జరిగే కొద్దీ తాము పారిశ్రామికీకరణలో కింది మెట్లను చేరుకోగలమనీ ఆశిస్తున్నాయి. అంతర్జాతీయ శ్రమ విభజనలో వీటి ప్రత్యేక కృషి సాపేక్షంగా చౌకగా లభించే నిపుణ శ్రమ మీదా, భౌగోళిక స్థానం మీదా, అలాంటి ఇతర సౌకర్యాల మీదా సహజసిద్ధమైన లక్షణాల మీదా ఆధారపడి ఉంది. మొత్తం మీద ఈ దేశాలు ఆర్థిక పెరుగుదల విషయంలో మంచి విజయం సాధించాయి. వీటిలో కొన్ని దేశాలు 'పారిశ్రామిక దేశాల సంఘం'లో చేరినాయి. సింగపూర్, హాంకాంగు, దక్షిణ కొరియా, తైవాన్ అనే నాలుగు సర్వాను ''కొత్త పారిశ్రామిక దేశాలు''గా పరిగణిస్తున్నారు. కొంత వరకు ఆగ్నేయాసియా దేశాలకు కూడా ఈ మాట వర్తిస్తుంది. లాటిన్ అమెరికా దేశాలు అంత విజయం సాధించలేక, రుణాల ఊబిలో ఇరుక్కున్నాయి. అయితే, ఈ 'ఎగుమతి చోదిత ఆర్థిక వ్యవస్థ'లలో అత్యధిక భాగానికి గల ఒక సామాన్య విషయం ఏమిటంటే, ఆర్థిక పెరుగుదల ఫలితంగా ఉత్పన్నమయ్యే రాజకీయ ఉద్రిక్తతలను తగ్గించగల సంస్థలను ఇవి నిర్మించుకోలేదు. అందువల్ల ఇవి వ్యవస్థకు సంబంధించిన సమస్యలను ఎదుర్కొంటున్నాయి.

భారతదేశం లాంటి మరికొన్ని దేశాలకు ఇంకొక వైఖరి ఉంది. ప్రధానంగా స్వావలంబనమీదా, విస్తారమైన అంతరంగిక మార్కెటు మీద ఆధారపడే ఈ దేశాల ఆర్థిక వ్యవస్థలో విదేశీ వర్తకానికి ప్రముఖమైన స్థానం ఉంది. తన స్వతంత్ర్య అభివృద్ధిలోని మొదటి దశలో భారతదేశం దిగుమతులకు ప్రత్యామ్నాయాలను కనిపెట్టే వ్యూహం కోసం ప్రయత్నించి,ఇప్పుడు ప్రత్యామ్నాయ విధాన చట్రాన్ని రూపొందించుకోడానికి సిద్ధంగా ఉంది.

## 21.4 వర్తక నిబంధనల (Terms of Trade) సమస్య



విదేశీ వర్తకం గురించి జరిగే మొత్తం చర్చలో ఒక ముఖ్యమైన సమస్య వర్తక నిబంధనల సమస్య. చారిత్రకంగా

BRAOU

ఇటీవలిదాకా వర్ధమాన దేశాలు ఎగుమతి చేసే సరుకుల ధరలు అభివృద్ధి చెందిన దేశాల సరుకుల ధరల కంటే మందకొడిగా పెరుగుతూ ఉన్నాయి. ఇది వర్ధమాన దేశాలకు ధరల నిష్పత్తి క్షీణించడానికీ, తత్ఫలితంగా వర్ధమాన దేశాల వనరులు బయటకి పోవడానికి దారి తీసింది. కానీ, 1973లో నూనె ధరల పెరుగుదల సంభవించినప్పటినుండి గాలి మారుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ధరలు, ముఖ్యంగా ప్రకృతి వనరుల ధరలు, అంతకంతకూ ఎక్కువగా పెరుగుతూ, కొరతను ప్రతిబింబిస్తున్నాయి. మార్కెట్లను సమిష్టిగా ప్రభావితం చేసేటందుకు వర్ధమాన దేశాలు అంతకంతకూ ఎక్కువగా ఏకమౌతున్నాయి. 'ఉత్తరాది దక్షిణాది సంభాషణ' కూడా ఈ సమస్యలను పరిశీలిస్తున్నది. ఈ సమస్యలు వెంటనే పరిష్కారం కాకపోతే, ఇకముందు ఇవి ప్రమాదకరమైన పరిమాణాలు అందుకోవచ్చు.

అంతర్జాతీయ వర్తకం 'వలసవాదనమూనా' వ్యవసాయ వనరులనూ, ప్రకృతి వనరులనూ ఎగుమతి చేసేదేశాలుగా వర్ధమాన దేశాలను ఉంచింది. ఇది పాక్షికంగా రికార్డో చెప్పిన సాపేక్ష ఖర్చుల సిద్ధాంతం మీద ఆధారపడింది. ఒక దేశం ఏ సరుకుల ఉత్పత్తిలో తనకు సహజ సౌకర్యం ఉందో, ఆ సరుకుల ఉత్పత్తిలో ప్రత్యేకత కృషి చేయాలని ఆ సిద్ధాంతం ప్రతిపాదించింది. అది జడ సిద్ధాంతంగా ఉండి, క్రియాశీలమైన వ్యవస్థనూ, మార్పుకోసం ప్రయత్నాన్నీ ఊహించలేదు. అనేక దేశాలు పారిశ్రామిక సరుకులు ఎగుమతి చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించినాయి.

## 21.5 అంతర్జాతీయ వర్తక ధోరణులు

ఈనాడున్న అంతర్జాతీయ వర్తక నమూనాను సమీక్షిస్తే, కొన్ని ప్రముఖమై ధోరణులు స్పష్టంగా కనిపిస్తాయి. మొదటిది: అంతర్జాతీయ వర్తకంలో ఇప్పుడు ఉత్పత్తి సాధనాల వర్తకం అంతకంతకూ ఎక్కువగా ఉంటున్నది. అంటే, మొత్తం వర్తకంలో ఉత్పత్తి సాధనాలు మునపటికంటే ఎక్కువ స్థానం ఆక్రమిస్తున్నాయి. రెండవది: వర్తకం అంతకంతకూ ఎక్కువగా శాస్త్ర విజ్ఞాన భూయిష్టమౌతున్నది. అంటే, జన్యుశాస్త్రం, కంప్యూటర్ శాస్త్రం, జీవసాంకేతిక విజ్ఞానం లాంటి శాస్త్ర సాంకేతిక విజ్ఞానాల సరిహద్దు ప్రాంతాలు వర్తక ప్రవాహాలను మరింత నిశ్చితమైన పద్ధతిలో నిర్ణయించబోతున్నాయి. ప్రపంచ వర్తకంలో ప్రకృతి వనరుల పాత్ర, విలువలో కాకపోయినా, ఉపయోగించే పరిమాణంలో, నెమ్మదిగా తగ్గుతున్నది; దీనికి కారణం కృత్రిమ పదార్థాల (సింథటిక్స్) పెరుగుదల. అంతేకాక, వర్ధమానదేశాలు ఐక్యరాజ్యసమితీ, అంతర్జాతీయ ద్రవ్య నిధీ, (IMF) పునర్నిర్మాణం అభివృద్ధుల అంతర్జాతీయ బాంక్ (IBRD), వర్తక, సుంకాల మీద సార్వత్రిక ఒప్పందం లాంటి సమిష్టి సంస్థలలో సమైక్యంగా పని చేసి ఇప్పుడు ప్రపంచ ధోరణులను ఎక్కువగా ప్రభావితం చేయగల స్థితిలో ఉన్నాయి. ప్రపంచ ఆదానప్రదానాలలో అంతర్జాతీయ వర్తక స్థానాన్ని పునర్నిర్వచిస్తే, న్యాయమైన కొత్తప్రపంచ వ్యవస్థను సృష్టించడానికి అది ఎంతో తోడ్పడుతుంది. పెరుగుతున్న అంతర్జాతీయ వర్తకం ద్వారా పెరిగే పరస్పరాధారం స్థిరమైన ఆర్థిక పునాదిని నిర్మించడానికి ఒక మార్గంగా ఉండగలదు. అనేక పురోగామి దేశాలు రూపాంతరం చెందడానికి అంతర్జాతీయ వర్తకాన్ని ఉపయోగించుకున్నాయి.వర్ధమాన దేశాలు కూడా అదే పని చేయవచ్చు.

### మీ అవగాహనను పరీక్షించుకొండి – 1

1. వర్తక నిబంధనలు అంటే ఏమిటి?
2. IBRD మరియు, IMF లను గురించి తెలపండి.

## 21.6 చెల్లింపుల శేషం

చెల్లింపు సమస్యలను ఎదుర్కోని వర్ధమాన దేశమే లేదు. అభివృద్ధి అవేదే ఈ సమస్యలకు కారణం. స్వయం చోదక వృద్ధిని సృష్టించడానికి గానీ, జీవన ప్రమాణాలను పెంచడానికిగానీ అవసరమైనంతకంటే తక్కువ ఆదాయస్థాయి గల అర్ధ అభివృద్ధిదశలో, ఆర్థిక వ్యవస్థకు చెల్లింపుల శేషం సమతూకం హీనమైన స్థాయిలో ఉండే అవకాశం ఎక్కువ స్వదేశ, విదేశవనరుల మధ్యగల అంశాల విస్తృత్తుల స్థిరత్వమూ, ఎగుమతి అవకాశాలు తక్కువగా ఉండటమూ — ఈ రెండింటి మూలంగా భారత దేశ అభివృద్ధి కృషిలో అంతర్గతంగానే చెల్లింపుల శేషపు ఒత్తిళ్ళను సృష్టించే ధోరణి ఉన్నది. అభివృద్ధి కృషిని తగ్గించడం ద్వారా మాత్రమే ఈ ఒత్తిళ్ళను తొలగించడం సాధ్యమవుతుంది. భారతీయ పరిస్థితులలో ఆ పని చేయడమంటే పంచవర్షప్రణాళికలలోని లక్ష్యాలను విసర్జించడమే అవుతుంది.

ఈ ఒత్తిళ్ళ ఫలితంగా, 1955 నుంచి భారత దేశ వర్తకశేషంలో లోటు కొనసాగుతూనే ఉంది. ఆ లోట్లను పూడ్చుకొనే మార్గాల విషయంలో సంక్షోభాలు మళ్ళీ మళ్ళీ వస్తూనే ఉన్నాయి. మూడవ పంచవర్షప్రణాళిక చివరి సంవత్సరాలలో లోట్లు పెరిగాయి. ఇటీవలి సంవత్సరాలలో, విదేశాలలోని భారతీయులు పంపే మొత్తాలతో సహా, అదృశ్యాలమీద వచ్చే ఆదాయాలతో వర్తకపు లోట్లు పాక్షికంగా భర్తీ అయినాయి.

### మీ అవగాహనను పరీక్షించుకోండి — 2

3. చెల్లింపుల శేషాన్ని తెలుపండి.

## 21.7 సారాంశం/ముగింపు

ఆర్థికాభివృద్ధిని దోహదం చేసే శక్తులలో, ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థలోగానీ ప్రణాళికా వ్యవస్థల్లోగానీ అదే విదంగా పెట్టుబడీదారి వ్యవస్థలోగానీ లేదా సామ్యవాద వ్యవస్థలోగానీ, విదేశీ వర్తకం ఒక ప్రధానమైన అంశంగా ఉంటుంది. విదేశీ వర్తక ప్రక్రియలో కొన్ని దేశాలు ఎక్కువగా లాభపడతాయి. మరికొన్ని దేశాలు తక్కువ లాభపడతాయి. కాని మూడవ ప్రపంచ దేశాలలో చాలా మట్టుకు తమ ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో చెల్లింపుల శేష సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఈ దేశాలు భారీ యంత్రాలను, ఇతర యంత్ర సామాగ్రిని అదిక ధరలు చెల్లించి కొనుగోలు/దిగుమతి చేసుకుంటాయి. కాని తక్కువ ధరలకు ముడి సరుకులను, ఇతర ప్రాధమిక వస్తువులను ఎగుమతి చేస్తాయి. అందుకే చెల్లింపుల శేషం అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రతికూలంగా ఉంటూ వస్తున్నది.

— డా. జి.ఎస్. సీతారాం

## 21.8 సంప్రదింపు గ్రంథాలు

1. Misra and Puri : Indian Economy
2. J.S. Uppal : India's Economic Problems

BRAOU

## 21.9 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నకు సుమారు 30 పంక్తులలో జవాబు రాయండి.

1. ఆర్థికాభివృద్ధిపై విదేశీ వర్తక పాత్రను విశ్లేషించండి.

II. కింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులు రాయండి.

1. విదేశవర్తకంలో భారతదేశ దృక్పథం ఏ విధంగా ఉంది?
2. విదేశీ వర్తకానికి సంబంధించి వర్తకనిబంధనలు అంటే ఏమిటి? భారతదేశంలో వర్తకనిబంధనల ధోరణిని వివరించండి.
3. చెల్లింపుల శేషం, ప్రపంచ వర్తకం అంటే ఏమిటి?

BRAOU

# భాగం — 22: భారత దేశ విదేశీ వర్తకం

## విషయక్రమం


22.0 లక్ష్యాలు

22.1 పరిచయం — భారతదేశ విదేశీవరకం

22.2 వర్తక సమ్మేళనంలో, దిశలో ఇటీవలి ధోరణులు

22.2.1 ఎగుమతుల సమ్మేళనం, దిశ

22.2.2 దిగుమతుల సమ్మేళనం, దిశ

22.2.3 భారతదేశ వర్తక శేషపరిస్థితి

22.3 భారతదేశంలో చెల్లింపుల శేషం

22.3.1 చెల్లింపుల శేషం — అర్థం

22.3.2 భారతదేశ చెల్లింపుల శేష పరిస్థితి

22.3.3 చెల్లింపుల శేషంలో లోటును తగ్గించడానికి తీసుకునే చర్యలు

22.4 వర్తక వ్యూహాలు — విధానాలు

22.4.1 దిగుమతి విధానం — దిగుమతి ప్రత్యామ్నాయం

22.4.2 ఎగుమతి విధానం — ఎగుమతి ప్రోత్సాహం

22.4.3 సమీక్ష

22.5 సారాంశం/ముగింపు

22.6 సంప్రదింపు గ్రంథాలు

22.7 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 22.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

భారతదేశ విదేశీ వర్తకాన్ని, ఎగుమతి దిగుమతులనూ ఇటీవలి కాలంలో వాటి ధోరణులనూ, విదేశీ వ్యాపార చెల్లింపుల శేష పరిస్థితిని విశ్లేషించడమే ఈ పాఠం లక్ష్యం.

విదేశీ వర్తకాన్ని, భారతదేశ విదేశీ సహాయాన్ని, విదేశీ మూలధనాన్ని గురించి ఈ ఖండంలోని ఇతర పాఠాలలో చర్చించినందున, ఈ పాఠంలో వర్తకలోటు, చెల్లింపుల శేష సమస్యలకూ, వర్తక విధానాలకూ అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం.

ఈ భాగాన్ని చదివిన తర్వాత మీరు,

★ వర్తక సమ్మేళనంలో, దిశలో ఇటీవలి కాలంలో ఏర్పడుతున్న మార్పులను గుర్తించగలరు.
★ భారతదేశ చెల్లింపుల శేష పరిస్థితిని విశ్లేషించగలరు.
★ భారతదేశంలో పాటిస్తున్న ఎగుమతి, దిగుమతి విధానాలను విమర్శనాత్మకంగా పరిశీలించగలరు.

## 22.1 పరిచయం — భారత దేశ విదేశీ వర్తకం

35 సంవత్సరాల ప్రణాళికా కాలంలో భారతదేశ ఎగుమతులూ, దిగుమతులూ గణనీయంగా పెరిగాయి. ఎగుమతుల విలువ 1950-51 లో రూ. 600 కోట్లు ఉండగా, 1984-85 నాటికి రూ. 11,513 కోట్లకు



BRAOU

పెరిగింది. దిగుమతుల విలువ అదేకాలంలో రూ. 650 కోట్ల నుండి రూ. 16,834 కోట్లకు పెరిగింది. దీనిని బట్టి ఎగుమతులలో పెరుగుదలకన్న దిగుమతుల పెరుగుదల అధికంగా ఉందని గమనించవచ్చు. దానికి తగినట్లుగా రెంటి మధ్య భేదం పెరిగింది. 1950-51 సంవత్సరంలో రూ. 50 కోట్లుగా ఉన్న లోటు 1984-85 సంవత్సరానికి రూ. 5321 కోట్లకు హెచ్చింది. 1970-71 నుంచి ఎగుమతులు 14 శాతం సాంవత్సరిక రేటుతో పెరగగా దిగుమతులు 17 శాతం పెరిగాయి.

ఒక దేశ ఆర్థిక వ్యవస్థలోని విదేశీ వ్యాపార ప్రాధాన్యతను ఆ దేశ జాతీయాదాయంలో ఎగుమతి దిగుమతుల వాటాల ద్వారా తెలుసుకోవచ్చు. 1984-85 సంవత్సరంలో జాతీయాదాయంలో దిగుమతుల వాటా 8 శాతం ఉండగా ఎగుమతుల వాటా 5.4 శాతం మాత్రమే ఉంది. ఈ వాటాలు 1970-71లో వరుసగా 4.1 శాతం, 3.8 శాతం ఉన్నాయి. దీని ద్వారా మనకు భారతదేశంలో విదేశీ వర్తకరంగ ప్రాముఖ్యం పెరుగుతూ ఉందని విశదమవుతుంది.

## 22.2 వర్తక సమ్మేళనంలో, దిశలో ఇటీవలి ధోరణులు

### 22.2.1 ఎగుమతుల సమ్మేళనం, దిశ

ఎగుమతి దిగుమతుల విలువలో గణనీయమైన పెరుగుదలతో బాటు వాటి సమ్మేళనంలో చెప్పుకోదగినంతగా మార్పు సంభవించింది. స్వాతంత్ర్యం పొందేనాటికి భారతదేశం వెనుకబడి ఉంది. ఎగుమతులలో అధికభాగం ప్రాథమిక వస్తువులైన వ్యవసాయ, గనుల రంగాల్లో ఉండేది. ఎగుమతి వస్తువులలో జనపనార, నూలు వస్త్రాలు, తేయాకు, ముడి ఇనుము, మాంగనీస్ ముఖ్యమైనవి. కాని భారతదేశం పారిశ్రామికంగా పురోగతి సాధిస్తున్న కొద్దీ ఎగుమతుల సమ్మేళనంలో మార్పు సంభవిస్తూ ఉంది. జనపనార ఎగుమతుల వాటా తగ్గుతూ వచ్చింది. ఆరంభంలో 20 శాతం ఉండగా ప్రస్తుతం అది 2 శాతం కన్న తక్కువగా ఉంది. అదే విధంగా నూలు వస్త్రాల ఎగుమతుల వాటా కూడా తగ్గిపోయింది. ప్రస్తుతం ఎగుమతి వస్తువులలో ఇంజనీరింగ్, చేతి వస్తువులు (Handi crafts) ముఖ్యమైనవి. చేతి పని వస్తువుల ఎగుమతులు విదేశీమారక ద్రవ్యాన్ని అధికంగా (దాదాపు 16 శాతం) సంపాదిస్తున్నాయి. ఇంజనీరింగు వస్తువుల ఎగుమతులు రెండవ స్థానాన్ని ఆక్రమించాయి.

వాస్తవానికి భారతదేశ ఎగుమతులలో పెరుగుదల అధికంగా ఉన్నప్పటికీ ప్రపంచ ఎగుమతులతో పోలిస్తే మన ఎగుమతుల వాటా భాగం తగ్గిపోయింది. ప్రపంచ ఎగుమతులలో భారతదేశం వాటా 1948-49 లో 2.2 శాతం ఉండగా 1984-85 లో 0.5 శాతం ఉంది. దీనిని బట్టితెలిసేదేమంటే భారతదేశ ఎగుమతుల కన్న ఇతర దేశాల ఎగుమతులే విస్తారంగా పెరిగినాయి.

భారతదేశ ఎగుమతుల దిశలో కూడా మార్పు వచ్చింది. 1950-51లో భారతదేశ ఎగుమతులను అత్యధిక స్థాయిలో కొనుగోలు చేసింది ఇంగ్లండ్. భారతదేశ ఎగుమతులలో దాదాపు 25 శాతాన్ని ఇంగ్లండ్ దిగుమతి చేసుకొంది. ఈ వాటా 1984-85 సం. నాటికి 10 శాతానికి తగ్గిపోయింది. ప్రస్తుతం అమెరికా, రష్యా, జపానులు భారతదేశ ఎగుమతులలో అధికభాగాన్ని పొందుతున్నాయి. ఒక్కొక్కటి దాదాపు 13 శాతం ఎగుమతులను కొనుగోలు చేస్తున్నాయి. గత 10 సం.లలో రష్యా భారతదేశంతో వర్తక సంబంధాన్ని గణనీయంగా విస్తృత పరచుకొంది. 30 సం.ల క్రితం రష్యాకు భారతదేశపు ఎగుమతులు అత్యల్పంగా ఉండేవి.

### 22.2.2 దిగుమతుల సమ్మేళనం, దిశ

భారతదేశ దిగుమతుల సమ్మేళనం, దిశలో ముఖ్యమైన మార్పులు సంభవించినాయి. ఇంతకుముందే తెలిపినట్లు ఎగుమతులకన్నా దిగుమతులు అధికంగా పెరిగాయి. 1979-80 కి ముందుకంటే ఆ తర్వాతే ఈ పెరుగుదల వేగం అధికంగా ఉంది. పెట్రోలియం ఉత్పత్తులు, టెలివిజను (దూరదర్శిని) వంటి విలాస వినియోగ వస్తువులు, ఆటోమొబైల్ పరికరాలు వంటి వస్తువుల దిగుమతులు పెరగడమే అందుకు కారణం.

## మీ అవగాహనను పరీక్షించుకొండి-2

4. ప్రైవేటు రంగానికి సంబంధించి ప్రభుత్వ విధానం ఏ విధంగా ఉండాలి?
5. భారతదేశంలో ఆదాయ కేంద్రీకృత ధోరణులు ఏర్పడడానికి ప్రధాన కారణాలేమిటి?
6. ప్రభుత్వం ఏ చర్యలను చేపట్టి ఆర్థికశక్తి కేంద్రీకరణను అరికట్టవచ్చు.

## 19.7 ఏకస్వామ్యాల, నిర్బంధ వ్యాపార పద్ధతు చట్టం (M.R.T.P. Act) 1969

ఈ సందర్భంగా MRTP Act, 1969 గురించి కొన్ని విషయాలు తెలుసుకొనడం అవసరం. ఈ చట్టాన్ని ఇంతకుముందు ఒకటి, రెండు చోట్ల చర్చించాం. ఆర్థిక స్థోమత కేంద్రీకృత ధోరణులను అరికట్టడానికి డిశంబరు 1969లో భారత ప్రభుత్వం ఏకస్వామ్యాల, నిర్బంధ వ్యాపార విధానాల చట్ట శాసనాన్ని ప్రవేశపెట్టింది. ఈ చట్ట ముఖ్యోద్దేశాలు రెండు.

1) ప్రజా శ్రేయస్సుకోసం ఆర్థిక వ్యవస్థ పనిచేసే విధానం వల్ల ఆర్థిక స్థోమత కేంద్రీకృత ధోరణులు తలెత్తకుండా చర్యలు తీసుకొనడం.
2) ప్రజా సంక్షేమంకోసం ఏకస్వామ్యాల నిర్బంధ వ్యాపార పద్ధతులను అరికట్టడం.

ఈ చట్టం ప్రకారం 1970 ఆగస్టు 2వ ఏకస్వామ్యాల నిర్బంధ వ్యాపార పద్ధతుల కమీషను అనే దాన్ని శ్రీ అలగిరి స్వామి (Justice Alagiriswamy) అధ్యక్షతను నియమించారు. అప్పటి నుంచి ఈ కమిషను ప్రభుత్వానికి న్యాయ విషయాలలోనూ, పరిపాలనా విషయాలలోనూ సలహాల నిస్తున్నది.

M.R.T.P చట్టం పనిచేసే తీరుతెన్నులమీద తరచు చాలా విమర్శలు వస్తున్నాయి. ఈ చట్టంలో రెండు అవకాశాలను విడివిడిగా పరిశీలించక ఉమ్మడిగా పరిశీలించడం సరైనది కాదని కొంతమంది విమర్శించారు. (1) ఆర్థిక స్తోమత కేంద్రీకరణ, (2) ఏకస్వామ్యాలకు సంబంధించినవి ఆ రెండు అంశాలు. ఈ సంఘం, ప్రభుత్వం ఏయే విషయాలను పరిశీలించమంటే ఆ విషయాలనే పరిశీలిస్తుందనీ, అంతకుమించి కంపెనీల మిగిలిన విషయాలను అన్వేషించదనీ కొంతమంది అంటారు.

కంపెనీలకు సంబంధించిన విస్తరణ, కొన్ని పరిశ్రమలను సమ్మేళనించడం మొదలైనవి ప్రభుత్వం తరముగా ఈ సంఘానికి నివేదించే విషయాలు. ఈ సంఘం పరిశ్రమలకు లైసెన్సులు ఇవ్వకముందే, కేంద్రీకృత ధోరణుల గురించి పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక పంపించేటట్లు చర్యలను తీసుకొంటే, ఈ సంఘం ప్రయోజనకరమైన చర్యలను తీసుకొన్నట్లుగా భావించవచ్చు. అయితే M.R.T.P చట్టం ఉన్నపట్పటికీ, పరిపాలనలోని అసమర్థత వల్లా, ఇతర రాజకీయ కారణాలవల్లా పెద్ద పారిశ్రామిక సంస్థల పెరుగుదలను ఈ సంఘం అరికట్టలేక పోయింది.

ఈ చట్టంతో పాటు విదేశీ మారక ద్రవ్యం క్రమబద్ధం చేసే చట్టాన్ని 1973లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ చట్టం ప్రకారం విదేశీ మారక ద్రవ్యాన్ని వృథాగా పెద్ద పారిశ్రామిక సంస్థలు ఖర్చు చేయడానికి వీలుండదు. ఎగుమతులను అధికం చేసే పరిశ్రమలకూ, చిన్న పరిశ్రమలకూ విదేశీ మారక ద్రవ్యాన్ని సరఫరా చేయడంలో ఈ చట్టం తోడ్పడుతుంది. ఈ చట్టం ద్వారా కూడా కొంతమేరకు ఆర్థికస్తోమత కేంద్రీకృతం కాకుండా ప్రభుత్వం చర్యలను తీసుకొంటున్నది.

## 19.8 సారాంశం/ముగింపు

ఆర్థికశక్తి కేంద్రీకరణను అర్థం చేసుకొనడానికి ఈ పాఠంలో ప్రయత్నించాం. మహలనోబిస్ కమిటి, ఏకస్వామ్య

విచారణ సంఘం, హజారీకమిటీ, దత్ కమిటి వంటి సంఘాలెన్నిటినో ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీలు ఆర్థిక శక్తి కేంద్రీకరణ 1951 నుంచి పెరుగుతున్నట్లుగా కనుగొన్నాయి. పారిశ్రామిక లైసెన్సింగు విచారణ సంఘం (ILPIC) లైసెన్సింగు విధానం పనితీరుపై అధ్యయనం చేసి, అందులో ఎన్నో లొసుగులు ఉన్నట్లు ధృవపరిచింది.

ఈ భాగంలో ఏకస్వామ్యాల నిర్బంధ వ్యాపార పద్ధతుల చట్టం, 1969 గురించి తెలుసుకొన్నాం. అదే విధంగా ఆర్థికశక్తి కేంద్రీకరణను అరికట్టడానికి తీసికోదగిన నివారణ చర్యలను సూచించడం జరిగింది.

- డా: టి. దివాకరరావు

## 19.9 సంప్రదింపు గ్రంథాలు


1. Datt & Sundaram : Indian Economy
2. S.C. Kuchhal : Industrial Economy of India


## 19.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

I *ఈ కింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబు ఇవ్వండి.*

1. ఆర్థికశక్తి కేంద్రీకరణ అంటే ఏమిటి? మహలనోబిస్ కమిటీ ఈ విషయంలో చేసిన సిఫారసు లేమిటి?
2. భారతదేశంలో ఆర్థికశక్తి కేంద్రీకృతం కావడానికి గల కారణాలను, దాని వల్ల కలిగే ఫలితాలను వివరించండి.

II *కింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబు ఇవ్వండి.*

1. మహలనోబిస్ కమిటీ సిఫారసు లేమిటి?
2. ఆర్థికశక్తి కేంద్రీకరణ మీద ఏకస్వామ్యాల విచారణ సంఘం (1964) ప్రధాన సిఫారసు లేమిటి?
3. ఏకస్వామ్య నిర్బంధ వ్యాపార పద్ధతుల చట్టం (MRTP Act), 1969 అంటే ఏమిటి? దాని ఉద్దేశాలు ఏమిటి?

BRAOU

ఒక దేశ  దేశం సర్వసాధారణంగా మూలధన వస్తువులను, నాణ్యతగల పారిశ్రామిక వస్తువులను దిగుమతి చేసుకొంటుంది. పారిశ్రామికీకరణ కాలంలో, నూతన పరిశ్రమలను స్థాపించడానికి యంత్రసామగ్రి, పరికరాలు చాలా అవసరం. అందుకే యంత్రపరికరాలను, ఇతర మూలధన వస్తువులను అధికస్థాయిలో దిగుమతి చేసుకుంటుంది. ఒకసారి ఆ దేశం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన తర్వాత మూలధన వస్తువులను, తయారైన ఇతర నాణ్యతగల వస్తువులను ఎగుమతి చేస్తుంది.

దిగుమతుల విషయంలో భారతదేశ అనుభవం గురించి కొంత వివరణ అవసరం. మొదట భారతదేశం ఆహారవస్తువులను, నాణ్యతగల వినియోగ వస్తువులను దిగుమతి చేసుకొనేది. దాదాపు 1980 వరకు మన దిగుమతులలో ఆహార వస్తువులే ముఖ్యమైనవి. రెండవ పంచవర్ష ప్రణాళిక నుంచి కొత్త పరిశ్రమల స్థాపనకోసం మూలధన వస్తువులను దిగుమతి చేసుకోవడం ఆరంభించాం. హరిత విప్లవ ప్రభావం వల్ల మనదేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తి పెరగడం వల్ల వీటి దిగుమతులు బాగా తగ్గిపోయాయి. ప్రస్తుతం చాలా తక్కువ పరిమాణంలో మనం ఆహారధాన్యాలను దిగుమతి చేసుకొంటున్నాం. కాని ఆహారధాన్యాల దిగుమతి తగ్గినప్పటికీ వాటి ఉత్పత్తి కవసరమయ్యే ఉత్పాదకాల దిగుమతి గణనీయంగా పెరిగింది. హరిత విప్లవం వల్ల రసాయనిక ఎరువుల, క్రిమిసంహారక మందుల ఉపయోగం విపరీతంగా పెరిగింది. అంతేగాకుండా 1973 సంవత్సరం నుంచి పెట్రోలు ఎగుమతి చేసే దేశాలు (OPEC) పెట్రోలియం ఉత్పత్తుల ధరలను నాలుగింతలు పెంచడం వల్ల కూడా మనదేశ దిగుమతుల విలువ విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం మనదేశ దిగుమతులలో సగభాగం పెట్రోలియం వస్తువులున్నాయి. 1950-51లో పెట్రోలియం వస్తువుల దిగుమతుల విలువ మొత్తం దిగుమతులలో 8 శాతం వుండగా 1984-85 నాటికది 40 శాతానికి పెరిగింది. పారిశ్రామికీకరణ సాధించడానికి అవసరమయ్యే మూలధన వస్తువుల దిగుమతి 25 శాతంతో రెండవస్థానం వహించింది. పెట్రోలియం వస్తువుల పరిమాణం ధరలో హెచ్చుదలవల్ల కూడా ఇటీవలి కాలంలో వర్తకలోటు అధికంగా పెరిగింది. అయితే ఇవి వ్యవసాయిక, పారిశ్రామిక, రవాణా రంగాల అభివృద్ధికి అవసరం కాబట్టి వాటిని ఒకేసారి తగ్గించలేము.

భారతదేశ దిగుమతుల దిశలో కూడా మార్పు జరిగింది. 30 సంవత్సరాల క్రితం అమెరికా, ఇంగ్లండులు భారతదేశానికి ముఖ్యమైన ఎగుమతి దేశాలుగా వుండేవి. కాని ఎగుమతులలాగే దిగుమతుల విషయంలో కూడా రానురాను రష్యా ప్రాబల్యం పెరిగింది. రష్యా మనదేశానికి ఎన్నో వస్తువులను ఎగుమతి చేయనారంభించింది. భారతదేశ దిగుమతి అవసరాలలో అమెరికా, రష్యా దేశాలు చేరి 10 శాతం వస్తువులను సరఫరా చేశాయి. ఆ తర్వాతి ప్రాధాన్యం జపాను, ఇంగ్లండ్ దేశాలకు చెందుతుంది.

BRAOU

## 22.2.3 భారతదేశ వర్తక శేష పరిస్థితి

భారతదేశ ఎగుమతి దిగుమతుల గురించి పైన మనం తెలుసుకొన్నట్లుగా గత ఐదారు సంవత్సరాల కాలంలో వర్తకశేషంలో లోటు విపరీతంగా పెరిగింది. గత 35 సం.ల కాలంలో భారతదేశ ఎగుమతులు, దిగుమతులు, వర్తకలోటు ఏ విధంగా ఉన్నాయో పట్టిక 1 ద్వారా పరిశీలించవచ్చు.

పట్టిక — 1: భారతదేశ విదేశీవర్తకం (రూ. కోట్లలో)

| సం॥ | దిగుమతులు (−) | ఎగుమతులు (−) | వర్తకశేషం |
|---|---|---|---|
| 1950-51 | 650.2 | 606.6 | (−) 49.6 |
| 1960-61 | 1,139.7 | 660.2 | (−) 479.5 |
| 1965-66 | 1,408.5 | 805.6 | (−) 602.9 |
| 1976-77 | 5,074.0 | 5,142.0 | (+) 68.0 |

| | | | |
|---|---|---|---|
| 1980-81 | 12,549.0 | 6,711.0 | (– ) 5,838.0 |
| 1981-82 | 13,608.0 | 7,806.0 | (– ) 5,802.0 |
| 1982-83 | 14,356.0 | 8,908.0 | (– ) 5,448.0 |
| 1983-84 | 15,763.0 | 9,37.0 | (– ) 5,891.2 |
| 1984-85 | 16,834.0 | 11,513.0 | (– ) 5,321.0 |

ఆధారం:

(i) Monthly Statistics of Foreign Trade (Various issues) for years upto 1965-66
(ii) Centre for Monitoring Indian Economy, August 1985 for Subsequent years.

పై పట్టికను బట్టి ఒక్క 1976-77 సంవత్సరంలోని వర్తక మిగులు (trade surplus) తప్ప మిగిలిన కాలంలో వర్తక శేషం లోటు ఉంది అని తెలుసుకోవచ్చు. ఆరంభంలో లోటు పరిమితంగా ఉండేది. కాని రెండవ పంచవర్ష ప్రణాళికా కాలం నుంచి మూలధన వస్తువుల, ఆహార ధాన్యాల దిగుమతి పెరగడం వల్ల ఎగుమతుల పెరుగుదల కన్నా దిగుమతుల పెరుగుదల అధికమై లోటు అధికమైంది. మూడవ పంచవర్ష ప్రణాళికా కాలంలో కూడా ఇది కొనసాగింది. 1973లో పెట్రోలియం ఉత్పత్తుల ధరలు హఠాత్తుగా పెరిగాయి. తద్వారా దిగుమతుల విలువ కూడా పెరిగింది. 1980-81 నుంచి ఎగుమతులకన్నా దిగుమతులు వేగంగా పెరిగాయి. పెట్రోలియం దిగుమతినిగాని, పెట్రోలియం వస్తువులైన ఎరువులు, క్రిమిసంహారక మందులు, పోలియెస్టర్ ఫైబర్ మొదలగువాటి దిగుమతులనుగాని భారతదేశం తగ్గించుకోలేక పోవడమే దీనికి కారణం. అంతేగాకుండా ప్రభుత్వ నూతన విధానాలవల్ల కంప్యూటర్ల, ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతులు పెరిగినాయి. పారిశ్రామిక వస్తువుల ఉత్పత్తులను పెంచే ఉద్దేశంతో దిగుమతుల విధానాన్ని ఇంకా సులభతరం చేసింది. దేశీయ ఉత్పత్తులను పెంచడానికి ముడి వనరుల, యంత్రసామగ్రి, సాంకేతిక పరిజ్ఞాన దిగుమతులను కూడా సులభతరం చేసారు. ఇవన్నీ దిగుమతులలో తీవ్రమైన పెరుగుదలకు దారితీసాయి.

ఇక రెండవ విషయం దిగుమతుల పెరుగుదలతో సమానంగా ఎగుమతులు పెరగలేదు. భారతదేశం ఎగుమతిదార్లకు ఎన్నో ప్రోత్సాహకాలు కల్పించినప్పటికీ ఎగుమతులు ఉపాంతంగా మాత్రమే పెరిగాయి. అందుకు కారణాలు అనేకం.

(i) భారతదేశ ఎగుమతులకు ఇతర దేశాల నుంచి పోటీ ఎదురైంది.
(ii) భారతదేశ ఎగుమతి వస్తువుల నాణ్యతా, ధరా పోటీని తట్టుకునేటటువంటివి కావు. అందువల్ల వాటి డిమాండ్ పెరగడం లేదు.
(iii) భారతదేశంలాంటి అభివృద్ధి చెందుతున్నదేశాల ఎగుమతులను అభివృద్ధి చెందిన దేశాలు ప్రయత్నా పూర్వకంగా నిర్బంధిస్తున్నాయి.

కాబట్టి ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ దిగుమతులకన్నా ఎగుమతులు చాలా తక్కువగా ఉంటున్నాయి.

1980-81 సంవత్సరంనుంచి వర్తకలోటు రూ.5000 కోట్లకు పైగా పెరిగింది. ఈ లోటు తగ్గే సూచనలేమి కనబడటం లేదు. అనవసరపు దిగుమతులను తగ్గిస్తూ, ఎగుమతులను పెంచే తీవ్రమైన చర్యలు తీసుకుంటే తప్ప ఈ పరిస్థితిలో పురోగతి ఉండదు.

## మీ అవగాహనను పరీక్షించుకోండి — 1

1. ఎగుమతి రంగంలో జరుగుతున్న మార్పు ధోరణిని తెలపండి.
2. ఎగుమతుల సమ్మేళనంలో మార్పు మీద మీ అభిప్రాయమేమిటి?
3. దిగుమతులలో ఏర్పడిన మార్పు ధోరణిని తెలపండి.
4. ప్రస్తుత కాలంలో భారతదేశ వర్తక శేషం ఏ విధంగా ఉంది?



BRAOU

## 22.3 భారతదేశంలో చెల్లింపుల శేషం

### 22.3.1 చెల్లింపుల శేషం : అర్థం

ఇంతకు ముందే తెలుసుకున్నట్లు, ప్రపంచంలోని ఇతర దేశాలతో ఒక దేశానికి ఉండే ఆర్థిక కార్యకలాపాలను చెల్లింపుల శేషం తెలియజేస్తుంది. దానిని కరెంటు ఖాతా, మూలధన ఖాతాలుగా విభజించవచ్చు. కరెంటు ఖాతాలో (i) వర్తక శేషం, (ii) సేవల వంటి అదృశ్య వర్తక శేషం, (iii) బహుమానం వంటి అనవసర చెల్లింపులు ఉంటాయి. బంగారాన్ని అమ్మడం ద్వారా గానీ, మిగులు ఉన్న దేశాల నుంచీ, అంతర్జాతీయ సంస్థల నుంచీ అప్పు తీసుకొనిగానీ మూల ధన ఖాతాలో కరెంటు ఖాతాలోని లోటును సర్దుబాటు చేస్తారు.

### 22.3.2 భారతదేశ చెల్లింపుల శేష పరిస్థితి

అభివృద్ధి చెందుతున్న దేశంలో సాధారణంగా ఎగుమతులకన్నా దిగుమతులు ఎక్కువగా ఉంటాయి. ఇవి వస్తు సేవల రెంటికీ వర్తిస్తుంది. ఇటువంటి దేశం మూలధన వస్తువులను దిగుమతి చేసుకుని విదేశాల సముద్రయాన, భీమా సేవలను ఉపయోగించుకొంటుంది. ఈ దేశం అభివృద్ధి చెందిన తర్వాత ఈ వైఖరి మార వచ్చు. దిగుమతుల వల్ల ఏర్పడే లోటును సంపన్నదేశాల నుంచీ అంతర్జాతీయ సంస్థలైన అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచీ ఋణాలు తీసుకొనిసర్దుబాటు చేసుకొంటుంది. కొన్ని అనుకోని పరిస్థితులలో తప్ప బంగారాన్ని అమ్మి లోటును పూడ్చుకోదు.

భారతదేశ దృశ్యకరమైన వ్యాపార శేష వైఖరిని ఒకటో పట్టిక ద్వారా స్పష్టంగా తెలుపవచ్చు. ప్రణాళికా కాలమంతా వ్యాపార లోటు (trade deficit) ఉంది. 1980-81నుంచి ఈ లోటు తీక్షణంగా పెరగడమేగాక దాని స్థాయి రూ.5000 కోట్లకు పైగా ఉంది. ఈ వైఖరికి గల కారణాలను ఇంతకు ముందే చర్చించాం.

అదృశ్య వ్యాపార శేషంలో ఎగుమతి దిగుమతులకయ్యే నౌకాయానం, బ్యాంకింగు, భీమా సేవలు, టూరిజం, డివిడెండ్లు, వడ్డీ చెల్లింపులు ఇమిడి ఉంటాయి. 1973-74 వరకు భారతదేశ అదృశ్య వ్యాపార శేషంలో లోటు నిలకడగా ఉంది. భారతదేశ నౌకాయానం, భీమా, బ్యాంకింగు ఇప్పటికీ సరిగ్గా అభివృద్ధి చెందకపోవడం వల్ల మన దేశం విదేశాలపై ఆధార పడవలసి వస్తుంది. అంతేకాకుండా, మన దేశం విదేశాల నుంచి అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి ఋణాలను అధికంగా స్వీకరిస్తూ ఉండడం వల్ల విదేశాలకు వడ్డీ చెల్లింపులు కూడా చేయవలసి ఉంటుంది. భారతదేశం విషయంలో చెల్లింపులకన్న వసూళ్ళు అల్పంగా ఉన్నాయి. కాబట్టి1950-51 నుండి 1973-74 వరకు లోటు ఉంది. 1973-74 నుండి కొత్త ధోరణులు ఆరంభమయ్యాయి. క్రమంగా ఈ లోటు మిగులుగా మారింది. మొదట ఈ మిగులు మితంగా ఉంది. 1974-75 లో అది రూ. 200 కోట్లుగా ఉంది. మిగులు 1976-77 లో రూ. 824 కోట్లకూ, 1977-78 లో రూ. 1422 కోట్లకూ పెరిగింది. 1980-81 నుంచి ప్రతి సంవత్సరం ఈ ఖాతాలో రూ. 3000 కోట్లు మిగులుగా ఉంది. ఈ మిగులు (రూ.5000 కోట్లలో సగానికిపైగా) వ్యాపారలోటును తటస్థం చేస్తుంది. దీని ద్వారా భారతదేశ విదేశీ వర్తకంలో ఎంతో సహాయం చేసినట్లయింది. ఫలితంగా, కరెంటు ఖాతాల మొత్తం లోటు రూ.2000 కోట్లు ఉంది.

అదృశ్య వ్యాపార శేషంలో మిగులు ఉండడానికి ముఖ్యమైన కారణం అరబ్ దేశాలలో, అమెరికాలో ఉన్న ప్రవాస భారతీయులు సంపాదించి సొమ్ము పంపడం. ఇంతకు ముందు తెలిపినట్లు, పెట్రోలియం ఉత్పత్తి చేస్తున్న అరబ్ దేశాలు పెట్రోలియం ధరలను హఠాత్తుగా పెంచాయి. అందువల్ల అవి ఒకే సారి ధనవంతమయ్యాయి. పెద్ద ఎత్తున అభివృద్ధి పథకాలను చేపట్టాయి. ఉద్యోగితను పొందడానికి వ్యాపార అవకాశాల కోసం భారతదేశం నుంచి, కాయకష్టం చేసుకోనేవారు, ఇంజనీర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులు ఈ దేశాలకు వెళ్ళారు. అనేక భారతీయ కంపెనీలు ఈ దేశాలలో కాంట్రాక్టును పొందినాయి. వారు తమ సంపాదనలను భారతదేశంలోని

BRAOU

వారి ఆశ్రితులకు పంపిస్తున్నారు. ఫలితంగా, శ్రామికులను ఎగుమతి చేయడం ద్వారా భారతదేశం అత్యధిక స్థాయిలో విదేశీమారకాన్ని సంపాదిస్తున్నది. అంతేకాకుండా, ప్రవాస భారతీయులు తమ సంపాదనలను అధికారిక మార్గం ద్వారా పంపడానికి, భారత ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను కల్పిస్తుంది. ప్రవాస భారతీయులు విదేశీ మారక ద్రవ్యంతో కార్లు, ఇల్లు, స్కూటర్లు మొదలైన ఎన్నో అరుదైన వస్తువులను తొందరగా కొనడానికి ప్రభుత్వం వీలు కల్పిస్తుంది. కొత్త పరిశ్రమలలో పెట్టుబడి పెట్టడానికి వారికి ప్రభుత్వం ప్రోత్సాహాన్నిస్తుంది. స్మగ్లింగు జరగకుండా కఠిన చర్యలుతీసుకోవడం వల్లకూడా వారి వసూళ్లు పెరిగాయి.

పైన గుర్తించినట్లు, ప్రవాస భారతీయులు పంపే సొమ్ము వ్యాపార చెల్లింపుల శేషాన్ని చాలా మటుకు తగ్గించినప్పటికీ, నికర సాంవత్సరిక లోటు ఇంకా రూ.2000 కోట్లకు పైగా ఉంది. అందుకు కారణం భారతదేశ విదేశీ ఋణం పెరగడమే కాకుండా, ఋణాన్నీ, వడ్డీనీ తిరిగి చెల్లించే భారం పెరగడం. 1970-71లో భారతదేశ విదేశీ ఋణం రూ. 6,577 కోట్లు ఉండగా 1984-85 నాటికి అది రూ. 28,891 కోట్లకు పెరిగింది. అందుకే ప్రతి సంవత్సరం తిరిగి చెల్లించే భారం, వడ్డీ భారం అధికమైంది. 1970-71 సం.లో వడ్డీ కోసం, తిరిగి చెల్లింపు కోసం రూ.450 కోట్ల భారం ఉండగా, అది 1984-85.సం.లో రూ. 1,115 కోట్లకు పెరిగింది. అంటే వ్యాపార చెల్లింపుల శేషంలోని నికరలోటులో సగభాగం ఋణ సేవకే సరిపోతుంది. లోటును చెల్లించడానికీ, ఆర్థికాభివృద్ధికీ భారతదేశం విదేశీ ఋణంపై ఆధారపడి ఉంది కాబట్టి ఈ భారం ఇంకా పెరుగుతుంది. దిగుమతులను తగ్గించడానికిగానీ, ఎగుమతులను పెంచడానికిగానీ భారతప్రభుత్వానికి వీలుకావడం లేదు కాబట్టి లోటును భర్తీ చేయడానికి ఇతర దేశాల నుండి ఋణాలను స్వీకరించడం ఒక్కటే మార్గం. ఇది ఇంకా లోటును పెంచుతుంది. ఈ విధంగా ఒక విషవలయం ఏర్పడవచ్చు.

## 22.3.3 చెల్లింపుల శేషంలోని లోటును తగ్గించడానికి తీసుకునే చర్యలు

ఒక దేశ చెల్లింపుల శేషంలో చాలా కాలం వరకు లోటు ఉంటే కొన్ని దీర్ఘ కాలిక నివారణ చర్యలను తీసుకోవల్సిన అవసరమేర్పడుతుంది. స్వల్ప కాలంలో అయితే విదేశీ ఋణాలతో సర్దుబాటు చేయవచ్చు. కాని ఈ విధానంలో కొన్ని పరిమితులున్నాయి. విదేశాల నుండి పొందే ఋణాల మొత్తంలో సాధారణంగా ఒక పరిమితి ఉంటుంది. విదేశీ ఋణం పెరిగిన కొలది గ్రహీత దేశపు ఆర్థిక స్వాతంత్ర్యం దెబ్బతింటుంది. వీటిని ఋణం ఇచ్చిన దేశాలు తమ స్వలాభం కోసం ఉపయోగించుకొంటాయి. ఋణగ్రహీత దేశాల ఆర్థిక విధానాలన్నీ ఋణదాత (ఋణం ఇచ్చిన దేశాల) ప్రభావానికి గురవుతాయి. ఒక వేళ అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి ఋణాలను పొందినప్పుడు, ఆ సంస్థ విధించే ఆర్థిక విధానాలను పాటించాల్సి ఉంటుంది. ఋణ సేవ భారం పెరిగే సమస్య కూడా ఉంటుంది. బహిర్గత ఋణం పెరిగినప్పుడు వడ్డీ, తిరిగి చెల్లింపు భారం పెరుగుతుంది. అర్జంటీనా, మెక్సికో వంటి లాటిన్ అమెరికా దేశాలు ఋణగ్రస్థత (debt trap) లో చిక్కుకున్నాయి. ఆ దేశాల విదేశీ మారక సంపాదనలు బహిర్గత ఋణాలపై వడ్డీని చెల్లించడానికి సరిపోవు. కాబట్టి మరల అప్పు తీసుకుంటాయి. ఈ విధంగా అవి మరల ఋణగ్రస్థత (trap) లో పడతాయి.

పై వివరణ ప్రకారం, లోటును తగ్గించడానికి ముఖ్యమైన రెండు నివారణ చర్యలు ప్రభావాన్ని చూపగలవు. అవి, దిగుమతుల తగ్గింపు, ఎగుమతుల పెంపు. ఒక వేళ ఈ నివారణ చర్యలు విఫలమైతే ద్రవ్య మూల్య హీనీకరణ (Devaluation) ను చేపట్టాలి. కానీ మూల్య హీనీకరణ అనిశ్చలమైన నివారణ చర్య. మారకపు రేటు మార్పులకు ఎగుమతి, దిగుమతులు ప్రతిస్పందించవు. అంతేగాకుండా, ఇతర దేశాలు కూడా వాటి కరెన్సీలను మూల్యహీనీకరణ చేస్తే ఏ దేశం కూడా దాని వల్ల లాభం పొందదు. అలాగే, మారక నియంత్రణలు కూడా తాత్కాలిక చర్యలే. ఒక వేళ ఈ చర్యను కొనసాగించినట్లయితే వర్తక ప్రవాహంలో కలతలు ఏర్పడుతాయి. కాబట్టి ప్రభుత్వం అనవసర దిగుమతులను తగ్గిస్తూ, సరియైన చర్యల ద్వారా ఎగుమతులను పెంచడానికి శ్రద్ధ వహించాలి.

## 22.4 వర్తక వ్యూహాలు — విధానాలు

### 22.4.1 దిగుమతి విధానం — దిగుమతి ప్రత్యామ్నాయం

దిగుమతి ప్రత్యమ్నాయం ద్వారానే గాకుండా ప్రత్యక్షంగా దిగుమతులను తగ్గించడం ద్వారా ఒక దేశం తవ దిగుమతులను నిర్బందించుకోవచ్చు. దిగుమతి చేసుకునే వస్తువులను ఇక ముందు దిగుమతి చేసుకోకుండా అదే దేశంలో ఉత్పత్తి చేసుకోవడాన్ని దిగుమతి ప్రత్యమ్నాయం అని అంటారు. దిగుమతి చేసుకొనే వస్తువులకు ప్రత్యమ్నాయ వస్తువులను గుర్తించి వాటిన ఆ దేశంలోనే ఉత్పత్తి చేయడానికి ప్రోత్సాహాన్ని ఇవ్వాలి, అవసరమైన చర్యలు తీసుకోవాలి. ఈ దిగుమతి విధానం వల్ల రెండు ప్రయోజనాలు ఉన్నాయి.

1. దిగుమతులు తగ్గి లోటు తగ్గుతుంది.
2. దేశంలో పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. తద్వారా స్వావలంబ (Self-reliance) సాధ్యమౌతుంది. అది దేశంలో పారిశ్రామికాభివృద్ధికి దారి తీస్తుంది.

భారతదేశంలో రెండవ పంచవర్షకాలంలో దిగుమతి ప్రత్యమ్నాయ విధానాన్ని పాటించారు. విదేశీమారక కొరత కారణంగా మన దేశానికి మూలధన వస్తువులను దిగుమతి చేసుకొనే స్థోమత లేదని ఆచార్య మహలనోబిస్ భావించారు. స్వయం సమృద్ధిగల వృద్ధిని సాధించడానికి మూలధన వస్తువులు అవసరం. అందుకే మౌలిక, మూలధన వస్తువుల కోసం దిగుమతి ప్రత్యమ్నాయాన్ని మహలనోబిస్ సూచించారు. రెండవ ప్రణాళిక కాలంలో ఇనుము, ఉక్కు, రసాయనాలు, యంత్రాలు, విద్యుచ్ఛక్తి మొదలైన మూలధన వస్తు పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి భారత దేశం కృషి ఆరంభించింది. ఈ వస్తువుల దిగుమతులను తగ్గించారు. వాటి దేశీయ ఉత్పత్తులను పెంచడానికి ప్రాధాన్యత నిచ్చారు. అదే విధంగా, ఆహార ధాన్యాల దిగుమతులను తగ్గించడానికి వ్యవసాయాభివృద్ధికి కూడా ప్రాధాన్యతనిచ్చారు. దిగుమతి ప్రత్యమ్నాయ విధానం భారీ పారిశ్రామిక వృద్ధికి, ఆహారధాన్యాల విషయంలో స్వయం సమృద్ధికి దారి తీస్తుంది.

కానీ ఈ విధానం వాస్తవానికి దిగుమతులను తగ్గించలేక పోయిందని గుర్తించాలి. పైన వివరించినట్లు, ఆహార ధాన్యాల విషయంలో స్వయం సమృద్ధిని సాధించినప్పటికీ వాటి దిగుమతులను అల్ప స్థాయికి తగ్గించినప్పటికీ, రసాయనిక ఎరువుల, వాటి ఉత్పాదకాల దిగుమతులు అధికంగా పెరిగాయి. పెట్రోలియం ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం వల్ల దిగుమతుల విలువ హెచ్చుగా పెరిగింది. అదే విధంగా మూలధన వస్తు రంగంలో దిగుమతి ప్రత్యమ్నాయం కూడా భారత దేశం ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించలేకపోయింది. ఈ పరిశ్రమల నిర్వహణకవసరమైన యంత్రాంగాన్ని ఇంకా దిగుమతి చేసుకుంటున్నాము. మొత్తం దిగుమతులలో మూలధన వస్తువుల దిగుమతి ఇప్పటికీ 25 శాతం ఉంది.

ముఖ్యమైన విషయమేమిటంటే, దిగుమతి ప్రత్యమ్నాయ విధానం అసమర్థతనూ, పారిశ్రామిక వస్తువుల వ్యయాన్ని పెంచింది. అన్ని దిగుమతి ప్రత్యమ్నాయ పరిశ్రమలకు రక్షణ కల్పించారు. వాటికి విదేశీ పోటీ లేదు. పోటీ లేకపోవడం వల్ల వి అసమర్థంగా తయారయ్యాయి. ఏకస్వామ్య పరిస్థితి అధికధరలకు వీలు కల్పించింది. ఈ వస్తువులు ప్రపంచ మార్కెట్‌లోని ఇతర దేశాల వస్తువులతో పోటీ పడలేవు. ఎందుకంటే వాటి నాణ్యత అత్యల్పంగా ఉండి, వ్యయాలు అధికంగా ఉంటాయి. రక్షణ విధానం వల్ల దేశీయ వినియోగదారులు కూడా నష్ట పడ్డారు. వారికి వస్తువుల మధ్య ఎంపిక చేసుకొనే వీలు లేదు. నాణ్యత లేని లేదా తక్కువ రకం ఉత్పత్తులను అధికధరలకు కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

దిగుమతులను తగ్గించే ఇంకొక విధానం ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ వాటిని నిరోధించటమే. ప్రభుత్వం విదేశీ మారకాన్ని పొదుపు చేయడానికి అనవసరపు వస్తువుల దిగుమతులను నిషేధించాలి. ఇతర వస్తువుల విషయంలో అధిక దిగుమతి సుంకాలను విధించడం ద్వారా ప్రభుత్వం దిగుమతులను నిరుత్సాహపరుచవచ్చు. భారత దేశంలో రెండవ ప్రణాళిక ఆరంభం నుంచి దిగుమతి ఆంక్షలను పాటించింది. అన్ని అనవసరపు

వినియోగ వస్తువుల దిగుమతులను నిషేధించింది. ఆహార ధాన్యాలనూ, కొత్త పరిశ్రమల కవసరమయ్యే యంత్రాలనూ దిగుమతి చేసుకోవడానికి మాత్రమే అనుమతిని ఇచ్చారు.

1966లో ద్రవ్య మూల్య హీనీకరణ జరిగిన తరువాత దిగుమతి ఆంక్షల విధానాన్ని సడలించింది. ఎగుమతుల డిమాండులను పెంచడమే మూల్యహీనీకరణ ఉద్దేశం. ఈ ఉత్పత్తులను పెంచడానికి ఆయా పరిశ్రమలు ముడి వనరులను, యంత్రాలను దిగుమతి చేసుకోటానికి అనుమతి లభించింది. ఎగుమతి వస్తువులను ఉత్పత్తి చేయటానికి అవసరమయ్యే అన్ని వస్తువులను స్వేచ్ఛగా దిగుమతిచేసుకోవచ్చు. దిగుమతి ప్రత్యమ్నాయ విధానానికి బదులుగా ఉదార దిగుమతి విధానాన్ని పాటించారు.

1977-78లో దిగుమతులను ఇంకా ఉదారం చేసారు. దిగుమతి ప్రత్యమ్నాయ, దిగుమతి ఆంక్షల విధానాలు చెల్లింపుల శేషం లోటును తగ్గించడంలో ప్రతిభావంతంగా పనిచేయలేవని భావించారు. ఎగుమతుల ప్రోత్సాహకం ద్వారానే లోటును తగ్గించవచ్చు. ఎగుమతి ప్రాధాన్యం గల పరిశ్రమలను ప్రోత్సహించడానికి వాటికి అవసరమయ్యే వస్తువులను దిగుమతి చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. దిగుమతులు స్వేచ్ఛగా జరగడానికి స్వేచ్ఛా వ్యాపార మండలాలు (Free Trade Zone) ఏర్పాటు చేయబడ్డాయి.

ఆధునాతన ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్‌కు చెందిన సాంకేతిక యంత్రాంగాన్ని అభివృద్ధిచేయాలనే ప్రభుత్వ నూతన విధానం కారణంగా కూడా దిగుమతులను ఉదారం చేసారు. వస్త్ర పరిశ్రమ, ఇతర పరిశ్రమలను ఆధునికీకృతం చేయాలి. దూరదర్శిని వంటి ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ ఉపయోగాన్ని, ఉత్పత్తిని ప్రోత్సహించాలి. భారతదేశంలో వాటిని పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసే సామర్థ్యం లేదు. కాబట్టి దిగుమతి చేసుకోవలసి ఉంటుంది.

ఈ విధానాన్ని పాటించి అంతర్జాతీయ ద్రవ్య సంస్థ కూడా భారతదేశంలో తనవంతు పాత్రను నిర్వహించింది. స్వేచ్ఛా వర్తకాన్ని వృద్ధి చేయటానికి, అన్ని రకాల వర్తక ఆంక్షలను నిషేధించటానికి దిగుమతి సుంకాలను, కంట్రోళ్ళను తగ్గించారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి భారతదేశానికి ఋణాన్ని కల్పించినప్పుడు ఏర్పర్చిన షరతులలో ఇది ఒకటి.

అందుకే, దిగుమతి ప్రత్యమ్నాయ, దిగుమతి ఆంక్షల విధానాన్ని ఇటీవలికాలంలో సడలించినట్లు గుర్తించవచ్చు. 1985లో ప్రభుత్వం దిగుమతి ఆంక్షలను బహిరంగంగా సడలించింది. స్వేచ్ఛగా దిగుమతి చేసుకునే వస్తువుల సంఖ్య 149కి పెంచారు. ఒక్క గోమాంసం తప్ప ఇతర ఏ వస్తువు దిగుమతినీ నిషేధించలేదు. దిగుమతులపై లైసెన్సింగు, ఇతర ఆంక్షలన్నిటినీ దాదాపు తొలగించారు. ప్రభుత్వ దిగుమతి విధానంలో పూర్తి మార్పు వచ్చింది.

## 22.4.2 ఎగుమతి విధానం — ఎగుమతి ప్రోత్సాహం

దిగుమతి ఆంక్షలతో పోల్చి చూస్తే వ్యాపార లోటును తగ్గించడానికి ప్రతిభావంతమైన సాధనం ఎగుమతి ప్రోత్సాహకం. చాలా కాలం వరకు, భారతదేశం జనపనార, తేయాకు, వస్త్ర పరిశ్రమ వంటి సంప్రదాయ వస్తువులను ఎగుమతి చేస్తూ ఉండేది. ఈ వస్తువుల డిమాండ్ సాధారణంగా అవ్యాకోచత్వంగా ఉంటుంది. పారిశ్రామికీకరణ జరిగే వరకు ఎగుమతులను విస్తృతించడం భారతదేశానికి సాధ్యం కాదని మొదట భావించారు. భారతదేశ సంప్రదాయ వస్తువులను గాకుండా ఆధునిక పారిశ్రామిక వస్తువులను ఎగుమతి చేయాలి. పారిశ్రామికీకరణ ఆరంభ దశలో ఎగుమతులు నిలకడగా ఉంటాయి. ఆ తర్వాత ఆర్థికాభివృద్ధితోపాటు ఎగుమతులుకూడా పెరగుతాయి.

ముందుగా తెలిపినట్లు, భారతదేశ ఎగుమతుల సమ్మేళనంలో మార్పు గమనించవచ్చు. ప్రస్తుతం ఇంజనీరింగు వస్తువులు, చేతి పనుల వస్తువులు ప్రధానంగా ఎగుమతి అవుతున్నాయి. అయినప్పటికీ, ఎగుమతులు తక్కువ రేటులో పెరుగుతున్నాయి. 1966లో జరిగిన ద్రవ్య మూల్యహీనీకరణ కూడా ఎగుమతులను అంతగా పెంచలేకపోయింది. ఎగుమతుల వృద్ధి అల్పంగా ఉండడానికి అనేక కారణాలున్నట్లుగా గుర్తించారు.

1. భారతదేశంలో జనపనార, నూలు వస్త్రాల వంటి సాంప్రదాయ ఎగుమతుల డిమాండు అవ్యాకోచత్వంగా ఉంది. కాబట్టి ఆ ఎగుమతులను పెంచే అవకాశం లేదు.

2. కొత్త రకమైన ఎగుమతి వస్తువుల విషయంలో కూడా వాటి ఎగుమతులను పెంచడం అంత సులభం కాదు వీటిలో అనేక వస్తువులకు దేశీయ డిమాండు అధికంగా ఉంది. విదేశీ మార్కెట్లకు వాటిని ఎగుమతి చేయడానికి ప్రోత్సాహం ఉండదు. వాటిని ఎగుమతి చేసినప్పటికీ విదేశాలలో వాటిని అమ్మడం కష్ట సాధ్యం. ఎందుకంటే వాటి నాణ్యత తక్కువగా ఉండి ధరలు అధికంగా ఉంటాయి. విదేశీ వస్తువులతో అవి పోటీకి నిలబడలేవు. ఇటీవలి కాలం వరకు ఎగుమతులపై అనేక ఆంక్షలుండేవి. ప్రభుత్వం ఎగుమతి సుంకాలను అధికంగా విధించేది.

కాని ఇటీవలి కాలంలో ప్రభుత్వం తన వర్తక విధానాన్ని ఎగుమతుల ప్రోత్సాహకానికి అనుకూలంగా మార్చుకుంది. దిగుమతి ఆంక్షల విధానం ప్రతిభావంతమైన సాధనం కాదని ప్రభుత్వం గుర్తించి ఎగుమతి ప్రోత్సాహకం ద్వారానే వర్తక లోటును తగ్గించవచ్చని నిర్ణయించింది. దిగుమతుల ఆంక్షలకన్నా ఎగుమతి ప్రోత్సాహక విధానం ఉత్తమమైందని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐ.ఎం.ఎఫ్) సంస్థ భావించింది. వివిధ దేశాల మధ్య ఇది వర్తకాన్ని పెంచుతుంది. కాబట్టి భారతదేశం ఎగుమతి ప్రోత్సాహక విధానాన్ని (Export Promotion Policy) అమలుపరిచింది.

ఎగుమతులను విస్తృతపరచటానికి ప్రభుత్వం అనేక చర్యలను ప్రకటించింది. ఎగుమతిచేసే పరిశ్రమలకు అనేక ప్రోత్సాహాలను కల్పించింది. వాటికి ఆదాయ పన్ను, ఎక్సైజ్ సుంకాలపై రిబేటును కూడా కల్పించింది. ఎగుమతి దారులకు ఉదార షరతులతో పరపతి సౌకర్యాలు కల్పించారు. కొన్నిసార్లు, వారికి ద్రవ్య రూపంలో కూడా సహాయం అందించారు.

స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ (S.T.C) 1956 నుండి కొత్త కొత్తవస్తువుల ఎగుమతులను పెంచడానికి కృషి చేస్తూ ఉంది. స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్‌తో పాటు ప్రభుత్వం తేయాకు, కాఫీ, రబ్బరు, పొగాకుల కోసం బోర్డులను స్థాపించింది. ఆయా వస్తువుల ఉత్పత్తులను, ఎగుమతులను పెంచడానికి ఈ బోర్డులు సహాయపడతాయి.

ఎగుమతి ప్రోత్సాహక చర్యలలో దిగుమతులను ఉదారం చేయడం ముఖ్యమైనది. ఎగుమతి ప్రాధాన్యంగల పరిశ్రమలు ముడిసరుకులను, యంత్రాలను స్వేచ్ఛగా దిగుమతి చేసుకోవడానికి వీలు కల్పించారు. ఉత్పత్తి అయిన వస్తువులను పూర్తిగా (100 శాతం) ఎగుమతి చేసే పరిశ్రమలకు స్వేచ్ఛా దిగుమతి లైసెన్సులను, ఇతర ప్రోత్సాహాలను కల్పించారు. ప్రభుత్వం స్వేచ్ఛా వ్యాపార మండలాలను సృష్టించింది. ఈ మండలాలలో ఉత్పత్తి చేసిన మొత్తం వస్తువులను ఎగుమతి చేసే పరిశ్రమలకు ఏ వస్తువులైనా దిగుమతి చేసుకునే పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. 1985-86 లో ప్రకటించిన కొత్త ఎగుమతి విధానంలో ఎగుమతి ప్రోత్సాహకం కోసం దిగుమతులను ఇంకా ఉదారం చేసారు. ఎగుమతులను పెంచడం కోసం అన్ని రకాల ఆంక్షలను తొలగించారు. అంతే గాకుండా, పన్ను రిబేటు, ఉదార లైసెన్సులు, పరపతి కల్పన మొదలైన ప్రోత్సాహాలను ప్రభుత్వం ఎగుమతి పరిశ్రమలకు కల్పించింది.

ఈ చర్యలు చేపట్టినప్పటికీ, ఆచరణలో భారతదేశ ఎగుమతులు ఆశాజనకంగా లేవు. అందుకు కారణాలను తెలుసుకోవడం కష్టమేమీ కాదు. వస్తు స్వభావాన్ని, వాటి ఎగుమతి సామర్థ్యాలను చూడకుండానే ఎగుమతి ప్రోత్సాహక విధానాన్ని పాటించారు. ఎగుమతి ప్రోత్సాహకం పేరుమీద కూరగాయలు, మాంసం వంటి అత్యవసర వినియోగ వస్తువులను కూడా ఎగుమతి చేసారు. తద్వారా ఈ వస్తువుల కొరత ఏర్పడింది. అంతేకాకుండా ప్రభుత్వం కల్పించిన అధిక సబ్సిడీలనుపయోగించి ఈ వస్తువులను ఎగుమతి చేసారు. దీని వల్ల మూడు రకాల దుర్వినియోగం జరిగింది. అవి:

1. దేశీయ వినియోగదారుకు ఈ వస్తువులు కొరతగా ఉండడం,
2. ఆ వస్తువుల ధరలు దేశీయ మార్కెటులో పెరగడం,



BRAOU

3. ప్రభుత్వ సబ్సిడీల దుర్వినియోగం జరగడం.

ఎగుమతి ప్రోత్సాహకం వల్ల అనేక పరిశ్రమలు అనవసరంగా వాటి దిగుమతులను పెంచుకొన్నాయి. ఆ విధంగా దిగుమతుల విలువ హెచ్చుగా పెరిగింది. వేరే మాటలలో చెప్పాలంటే ఎగుమతి ప్రోత్సాహక విధానం దిగుమతి ప్రోత్సాహకానికి దారి తీసింది. ప్రభుత్వ ఎగుమతి ప్రోత్సాహక విధానం వల్ల ఇంకొక తీవ్రమైన పరిణామం ఏర్పడింది. ఎగుమతి ప్రోత్సాహకం కోసం అధిక మూలధన సాంద్రత కలిగిన ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వివిధ పరిశ్రమలు దిగుమతి చేసుకున్నాయి. అందువల్ల శ్రామిక నిరుద్యోగిత పెరిగింది. దేశీయ సాంకేతిక విజ్ఞానం ఉపయోగిత తగ్గింది. కాబట్టి ప్రభుత్వ ఎగుమతి ప్రోత్సాహక విధానం సఫలీకృతం కాకపోవచ్చు.

### 22.4.3 సమీక్ష

దిగుమతి తగ్గింపు, ఎగుమతి ప్రోత్సాహక విధానాల వైఫల్యాల వల్ల భారతదేశంలో వ్యాపార శేషంలో లోటు అధిక స్థాయిలో పెరుగుతూ ఉంది. గత కొన్ని సంవత్సరాల నుంచి ఈ లోటు సంవత్సరానికి రూ.5000 కోట్లకు పైగా ఉంది. ప్రవాస భారతీయుల ఆర్జనలను కలుపుకొన్నప్పటికీ చెల్లింపుల శేషం సాధారణంగా రూ.2000 కోట్ల స్థాయికిపైగా ఉంది. పారిశ్రామికదేశాల నుంచి, అంతర్జాతీయ ద్రవ్యనిధి, అంతర్జాతీయ అభివృద్ధి సంస్థల వంటి అంతర్జాతీయ విత్త సంస్థల నుంచి సేకరించే ఋణాల ద్వారా భారతదేశం తన చెల్లింపుల శేషంలో సంతులనం చేయడానికి ప్రయత్నిస్తుంది.

## 22.5 సారాంశం/ముగింపు

ఈ పాఠంలో మనం చెల్లింపుల శేషాన్ని గురించి తెలుసుకోవడంతో బాటు భారతదేశంలో వర్తక శేష, చెల్లింపుల శేష పరిస్థితి ఏ విధంగా ఉందో విశ్లేషించుకొన్నాం. భారతదేశ ఎగుమతి, దిగుమతులలో ఏర్పడుతున్న ప్రధాన మార్పులను అవగాహన చేసుకొన్నాం. భారతదేశంలో చెల్లింపుల శేషం మన దేశానికి ప్రతికూలంగా ఉంది. చెల్లింపుల శేషలోటు దిన దినం పెరుగుతూ ఉంది. 1970-71, 1984-85 కాలంలో చెల్లింపుల లోటు రూ. 6,500 కోట్ల నుంచి రూ. 29,000 కోట్లకు పెరిగింది. ఈ లోటును తగ్గించడానికీ, ఎగుమతులను పెంచడానికీ, దిగుమతులను తగ్గించడానికీ కొన్ని విధానాలను అమలు పరుస్తున్నారు. ఈ పాఠంలో రెండు విధానాలను తెలుసుకున్నాం. అవి: దిగుమతి ప్రత్యమ్నాయ విధానం, ఎగుమతుల ప్రోత్సాహ విధానం. ఎన్ని చర్యలు చేపట్టినప్పటికీ మన దేశ చెల్లింపుల శేషంలో లోటు తగ్గడం లేదు.

రచన: ఆచార్య తిప్పారెడ్డి
అనువాదం: కే. సతీష్‌రెడ్డి

## 22.6 సంప్రదింపు గ్రంథాలు

1. Misra and Puri : Indian Economy (Ch. 41 and 42)
2. Michael P. Todaro : Economic Development in the Third World (Ch. 12-14)
3. J.S. Uppal : India's Economic Problems (Ch. 19, 20)
4. Bo Soderstein : International Economics (Ch.21)

## 22.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు సుమారు *30* పంక్తులలో జవాబులు రాయండి

1. భారతదేశంలో దిగుమతి ప్రత్యమ్నాయ విధాన లక్ష్యాలను, దాని ప్రభావాలను విశదరచండి.
2. ప్రభుత్వ ఉదార దిగుమతి విధాన ప్రభావాలను పరిశీలించండి.
3. భారత దేశ ఎగుమతి ప్రోత్సాహక విధానాన్ని తెలుపుతూ పరిమితులను వివరించండి.

II. కింది ప్రశ్నలకు సుమారు *15* పంక్తులలో జవాబులు రాయండి.

1. గత 10 సం.ల కాలంలో భారతదేశ దిగుమతులలో సంభవించిన ముఖ్యమైన పరిణామాలను తెలపండి.
2. భారత దేశ వ్యాపార శేషంలో అధికలోటు 'ఉండడానికి కారణాలు ఏమిటి?
3. భారతదేశ వ్యాపార చెల్లింపుల శేషంలో ప్రవాస భారతీయుల సంపాదనల ప్రాధాన్యతను చర్చించండి.
4. దిగుమతి ప్రత్యమ్నాయ విధానాన్ని వివరించండి.
5. ఎగుమతి ప్రోత్సాహక విధానాన్ని వివరించండి.

B R A O U

# భాగం – 23: విదేశీ ఆర్థిక సహాయం– విదేశీ మూలధనం

విషయక్రమం


23.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

23. 1 పరిచయం

23. 2 విదేశీ సహాయం పాత్ర

23. 3 అభివృద్ధి, పునర్నిర్మాణాలకోసం అంతర్జాతీయ బాంకు

23. 4 అంతర్జాతీయ ద్రవ్యనిధి

23. 5 విదేశీ సహాయం – భారతదేశపు వైఖరి

23. 6 సహాయాలను ముడి పెట్టడం

23. 7 పారిశ్రామికీకరణలో విదేశీ సహాయం పాత్ర

23. 8 విదేశీ మూలధం – దాని ప్రవేశం

23. 9 విదేశీ మూలధనం ఆవశ్యకత

23.10 విదేశీ మూలధనం – దాని ప్రభావం

23.11 బహుళ జాతీయ సంస్థల లక్షణాలు

23.12 భారతదేశంలో బహుళ జాతీయ సంస్థలు

23.13 సారాంశం/ముగింపు

23.14 సంప్రదింపు గ్రంథాలు

23.15 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 23.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

విదేశీ సహాయం, విదేశీ మూలధనాల పాత్రను విశ్లేషిస్తూ, ప్రపంచబాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి, బహుళ జాతీయ సంస్థల యంత్రాంగాలను చర్చించడం ఈ భాగం లక్ష్యం.

ఈ భాగాన్ని చదివిన తరవాత మీరు

* పారిశ్రామిక అభివృద్ధిలో విదేశీ సహాయం పాత్రను వివరించగలరు.
* ప్రపంచబాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థల యంత్రాంగాన్ని విశ్లేషించగలరు.
* విదేశీ సహాయం పొందటంలో భారత దేశ ధోరణిని గుర్తించగలరు.
* సహాయాలను ముడిపెట్టడం అనే భావనను తెలుసుకోగలరు.
* విదేశీ మూలధన ప్రవేశాన్ని, ఆవశ్యకతను, దాని ప్రభావాన్ని వివరించగలరు.
* బహుళ జాతీయ సంస్థల లక్షణాలను గుర్తించగలరు.

## 23.1 పరిచయం

ఒక దేశ ఆర్థికాభివృద్ధిని నిర్ణయించే మరియు పెంచే కారకాలలో విదేశీ రంగానికి గల ప్రాధాన్యత ఆధునిక కాలంలో పెరుగుతూ వుంది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న మూడవ ప్రపంచ దేశాలు సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే విదేశీ వర్తకాన్ని ప్రోత్సహించాల్సి వుంటుంది. ఈ విషయాన్ని గత రెండు పాఠాలలో నేర్చుకొన్నాం. విదేశీ వర్తకంతో బాటుగా ఒక దేశానికి ఇతర దేశాలు చేసే సహాయం (aid), అవి పంపే

పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం కూడా ఆ దేశ పారిశ్రామికాభివృద్ధిని నిర్ణయిస్తాయి. ఒక దేశంలోకి విదేశీ మూలధనం ఎన్నో రూపాల్లో రావచ్చు. అందులో ఒక రూపం బహుళ జాతి సంస్థలు (multi-national corporations). అంతేగాకుండా వివిధ దేశాలకు ఋణాన్ని కల్పించడానికి గాను, ఆయా దేశాల ఆర్థికాభివృద్ధికి అవసరమైన ద్రవ్య, విత్త వనరులను కల్పించడానికి గాను ప్రపంచ బాంకు, అంతర్జాతీయ ద్రవ్య సంస్థ చేస్తున్న కృషిని తెలుసుకోవలసిన అవసరం వుంది. అందుకే ఈ పాఠంలో విదేశీ సహాయం, విదేశీ మూలధనం, ప్రపంచ బాంకు, అంతర్జాతీయ ద్రవ్య సంస్థ మరియు బహుళ జాతి సంస్థల స్వరూపాన్ని చర్చించుకొందాం.

## 23.2 విదేశీ సహాయం పాత్ర

సహాయమంటే ప్రపంచంలోని బీద దేశాలకు సాపేక్షంగా సంపన్నమైన దేశాలు ఇచ్చే దానమే అనే అభిప్రాయం జనంలో ఉంది. సంపన్నదేశాలకు ప్రపంచ ఐశ్వర్యంలో తమవంతుకు మించిన భాగం ఉన్నందున ఈ అభిప్రాయం ఏర్పడింది. సహాయమనేది తృతీయ ప్రపంచపు దేశాలను దోపిడీ చేయడానికి ప్రపంచ గుత్త పెట్టుబడి దారీ వ్యవస్థ రూపొందించిన మరొక సాధనమని కమ్యూనిస్టు దేశాలు అనుకొంటాయి. ఒక విధంగా ప్రపంచ బాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి, అంతర్జాతీయ అభివృద్ధి కోసం సంయుక్త రాష్ట్రాల ఏజెన్సీ అనేవి తృతీయ ప్రపంచంలో పెట్టుబడి దారీ భావజాలాన్నీ వ్యాప్తి చేసే ఉద్దేశంతో ప్రపంచ గుత్తపెట్టుబడి దారీ వ్యవస్థ సృష్టించిన సంస్థలుగా పరిగణిస్తున్నారు. తృతీయ ప్రపంచ దేశాలలో విదేశీ ప్రయివేట్ పెట్టుబడికి అనుకూలమైన పరిస్థితులు సంపాదించుకోవడానికి అంతర్జాతీయ విత్త సంస్థలు తమ సహాయాన్ని బేరమాడే సాధనంగా వినియోగించుకున్నాయనే నింద ఉన్నది. అనుకూలమైన పరిస్థితులంటే, పాశ్చాత్యదేశాల సరుకులూ, సేవలూ తృతీయ ప్రపంచానికి సులభంగా ఎగుమతి చేయడానికి, సహాయ దాతలకు లాభదాయకమైన ఆర్థిక విధానాలను తృతీయ ప్రపంచంలో అమలు పరచడానికి అనుకూలమైన పరిస్థితులన్నమాట.

ప్రొఫెసర్ పీటర్ బావర్ దృష్టిలో అభివృద్ధికి సహాయం అవసరమైనదీకాదు, చాలేదీకాదు. అది అవసరమైనది కాదు ఎందుకంటే మలేషియా, హాంకాంగ్, థాయ్ లాండ్, సింగపూర్, మెక్సికో లాంటి పలు వర్ధమాన దేశాలు పెద్ద సహాయం పొందకుండానే పందొమ్మిదో శతాబ్దపు చివరి పాదం నుంచి ఇరవయ్యవ శతాబ్దపు మధ్యకాలం దాకా సత్వరమైన పురోగతిని సాధించినాయి. అది చాలేది ఎందుకుకాదంటే, గణనీయమైన సహాయం పొందిన అనేక దేశాలు పురోగతిని ఏమీ సాధించలేదు. అభివృద్ధికి అత్యవసరమైన అంశాలు — పురోగతికి తోడ్పడే మానవ నైపుణ్యాలు, సంస్థలు, వైఖరులు మొదలైనవి లేనప్పుడు సహాయం సులభంగా వ్యర్థం కావచ్చు. అంతేకాక, సహాయం వనరుల అనుచిత కేటాయింపును ప్రోత్సహించవచ్చు. స్వదేశంలో పెట్టుబడిని సంపాదించే కృషిని బలహీన పరచవచ్చు, సహాయం పొందే ప్రభుత్వాలు అనవసర ఆర్భాటపు ప్రాజెక్టులలో నిమగ్నమయ్యేటట్లు చేయవచ్చు.

BRAOU

## 23.3 అభివృద్ధి, పునర్నిర్మాణాలకోసం అంతర్జాతీయ బాంక్ (ప్రపంచబాంక్, ఇ.బి.ఆర్.డి.)

రెండవ ప్రపంచ యుద్ధం తొలి దశలో మిత్రరాజ్యాల మిత్ర నిపుణులు — యుద్ధానంతరం ప్రపంచంలో ద్రవ్య, విత్త సమస్యలను పరిష్కరించడానికి అంతర్జాతీయ సహకారం అవసరం చాలా ఉంటుందనే విషయాన్ని గుర్తించారు. పలు సన్నాహక సమావేశాల అనంతరం, 1944 జూలైలో 44 మిత్ర రాజ్యాలు అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని బ్రెటన్ ఉడ్స్‌లో ఐక్యరాజ్యాల ద్రవ్య, విత్త మహాసభ జరిపినాయి. ఈ మహాసభలో, పరస్పర పూర్వకమైన రెండు అంతర్జాతీయ విత్త సంస్థలకు నియమావళులు — లేదా నియమ పత్రాలు —

రూపొందించారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి, అభివృద్ధి పునర్నిర్మాణాలకోసం అంతర్జాతీయ బాంక్ (ఇదే ప్రపంచ బాంక్‌గా ప్రసిద్ధి కెక్కింది) ఆ సంస్థలు. ఆ రెండు సంస్థలకు కేటాయించిన పాత్రలు భిన్నమైనప్పటికీ, వాటి సంయుక్త లక్ష్యం ఒకటే. ప్రపంచ సౌభాగ్యం కోసం కలిసి కృషి చేయడానికి జాతులకు వీలు కలిగించే ద్రవ్య విత్త యంత్రాంగాన్ని సమకూర్చడమూ తద్వారా రాజకీయ స్థిరత్వానికి తోడ్పడి, జాతుల మధ్య శాంతిని పెంపొందించడం. 1945లో బాంక్ నియమావళిని 44 ప్రభుత్వాల ఆమోదం కోసం సమర్పించారు. వాషింగ్‌టన్‌లో 28 దేశాలు 1945 డిసెంబర్ 27న దానిమీద సంతకాలు చేసినప్పుడు అది అమలులోకి వచ్చింది. తదనంతరం, సోవియట్ యూనియన్ తప్ప బ్రెటన్ ఉడ్స్ మహాసభలో పాల్గొన్న ప్రభుత్వాలన్నీ ఆ రెండు సంస్థలలోను సభ్యులయినాయి. 1946లో బాంక్ పనిచెయ్యడం ప్రారంభించింది. ప్రపంచబాంక్ ఉత్పాదకమైన పునర్నిర్మాణకమైన, అభివృద్ధి ప్రాజెక్టులకోసం గ్యారంటీ రుణాలు ఇచ్చే కొత్త రకం అంతర్జాతీయ పెట్టుబడి సంస్థగా దీని సృష్టించారు. ప్రభుత్వాలు ఇచ్చిన మొత్తాలవల్లే ఏర్పడినా తన స్వంత పెట్టుబడి నుంచి తాను సమీకరించే ప్రయివేట్ పెట్టుబడి నుంచి అది రుణాలిస్తుంది. బాంక్ షేర్ పెట్టుబడికి, బాంక్ చర్యలలో ఏదైనా నష్టం వస్తే, దాని సభ్య ప్రభుత్వాలన్నీ దామాషాగా వాటివాటి ఆర్థిక శక్తిని బట్టి ఆ నష్టాన్ని పంచుకొంటాయి. బాంక్ అంతర్ ప్రభుత్వ సంస్థ అయినప్పటికీ తన విత్త వనరులలో అత్యధిక భాగం కోసం అది ప్రధానంగా ప్రపంచ పెట్టుబడి మార్కెట్లమీద ఆధారపడుతుంది.

1947లో బాంక్ ఇచ్చిన సుమారు $ 50 (డాలర్లు) కోట్ల మొదటి రుణాలు 4 యూరప్ దేశాలకు పునర్నిర్మాణం కోసం ఇచ్చారు. యుద్ధంలో విధ్వంసమైన దేశాల పునర్నిర్మాణ కర్తవ్యం బాంక్‌కు ఉన్న వనరులకు మించి ఉంది. కానీ, 1948లో సంయుక్త రాష్ట్రాల మార్షల్ పథకం రాకతో సమస్యను ఎదుర్కొన్నారు. అప్పటి నుంచి దానికి తన కృషిని ప్రధానంగా అభివృద్ధి కోసం రుణాలివ్వడంవైపు మళ్ళించింది. తక్కువగా అభివృద్ధి చెందిన తన సభ్య దేశాల ఆర్థిక పెరుగుదలకు దారితీసే ఉత్పాదక ప్రాజెక్టుల కోసం రుణాలివ్వడం అప్పటినుండి బాంక్ ప్రధాన కర్తవ్యంగా ఉంది. యూరప్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లకు ఇచ్చిన 310 కోట్ల డాలర్లు కాక బాంకు గత 25 సంవత్సరాలలో 8 ఆఫ్రికా దేశాలకు 210 కోట్ల డాలర్లు, 16 ఆసియా దేశాలకు 480 కోట్ల డాలర్లు, పశ్చిమార్థ గోళంలోని 22 దేశాలకు 440 కోట్ల డాలర్లు రుణాలుగా ఇచ్చింది. విద్యుచ్ఛక్తి, రోడ్లు, రైలు మార్గాలు, రేవులు, సహజ వాయువు గొట్టపు మార్గాలు, టెలికమ్యూనికేషన్‌లు, వ్యవసాయం, పరిశ్రమలు, నీటి సరఫరా, విద్య, కుటుంబ నియంత్రణ కోసం, కొన్ని సందర్భాలలో పారిశ్రామిక దిగుమతులతో సహా మరింత సాధారణ అభివృద్ధి కార్యక్రమాలకోసం రుణాలు ఇచ్చారు.

బాంకు అనుబంధంగా రెండు విత్త సంస్థలను స్థాపించారు. అవి 1956లో పని ప్రారంభించిన అంతర్జాతీయ విత్త సంస్థ (I.F.C), 1960లో అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (IDA). ఈ రెండు సంస్థలు, బాంకు కలిసి ప్రపంచ బాంకు బృందమవుతాయి. ప్రపంచ బాంకులో సభ్యత్వం ఉంటేనే ఈ రెండు అనుబంధ సంస్థల్లోనూ సభ్యత్వం ఉంటుంది. అంతర్జాతీయ విత్త సంస్థ విశిష్టంగా వర్ధమాన దేశాల ప్రయివేటు రంగంతో వ్యవహరిస్తుంది. అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ బాంకు అనుసరించే విధానాలనే అనుసరిస్తుంది. బాంకు వలెనే రంగాలలోనే పనిచేస్తుంది. అయితే దాని రుణాలు ("ఖాతాలు" అనబడేవి) సాంప్రదాయిక ప్రపంచ బాంకు రుణాలకంటే సులభమైన షరతులతో మరీ బీద వర్ధమాన దేశాలకు మాత్రమే లభిస్తాయి. పెట్టుబడి వివాదాల పరిష్కారానికి అంతర్జాతీయ కేంద్రాన్ని కూడా బాంకు ఏర్పాటు చేసింది.

ప్రపంచబాంకు గవర్నర్ల బోర్డుకు కొత్త సభ్యులను చేర్చుకోవడానికి, ఆ సభ్యుల ప్రవేశానికి షరతులను నిర్ణయించడానికి అధికారముంటుంది. కానీ, బాంకు సభ్యత్వం పొందడానికి ఏ దేశమైన అంతర్జాతీయ ద్రవ్యనిధిలో చేరాలి. దానిలో చేరడమంటే అంతర్జాతీయ విత్త విధాన అంగీకృత నియమాలను పాటించడానికి ఒప్పుకోవడమన్న మాట. దేశ రాజకీయ వ్యవస్థగాని, ఆర్థిక వ్యవస్థగాని బాంకులో సభ్యత్వానికి అడ్డురావు. ఉదాహరణకు సోషలిస్టు దేశాలు ప్రపంచబాంకులోను, అంతర్జాతీయ ద్రవ్య నిధిలోను సభ్యత్వం పొందవచ్చు కావాలనుకొంటే ఏ దేశమైనా సభ్యత్వం కోరవచ్చు.

BRAOU

## 23.4 అంతర్జాతీయ ద్రవ్యనిధి (I.M.F)

అంతర్జాతీయ ద్రవ్యనిధిలో మొదటి సభ్యులు, ఇతర సభ్యులు (అధికరణం—1) ఉన్నారు. పై రెండు బృందాలకు సభ్యత్వ అర్హతలలో గణనీయమైన భేదమేమీ లేదు. కాని అవి ప్రవేశించేటప్పటి సర్వాక్రమం భిన్నంగా వుంది. బ్రెటన్ వుడ్స్ మహాసభలో పాల్గొని, ఆమోదించే పని 1946 అంతానికి పూర్తి చేసి (మొదటి నియమావళి ప్రకారం 1945 అంతం వరకే గడువు వుంటుంది. కానీ సవన్నాలో జరిగిన ప్రారంభ సమావేశంలో గడువు మరో సంవత్సరం పెంచారు). తమ అంగీకారం పత్రాన్ని అమెరికా ప్రభుత్వానికి అందజేసిన దేశాలు మొదటి సభ్యులు. మొదటి సభ్యత్వమున్న దేశాలు 39 అంటే బ్రెటన్ వుడ్స్ మహాసభలో పాల్గొన్న 44 మిత్ర దేశాలలో ఆస్ట్రేలియా, హైటీ, లైబీరియా, న్యూజీలాండ్, సోవియట్ యూనియన్ తప్ప తక్కినవన్నీ. (కానీ తరవాత ఆస్ట్రేలియా, హైటీ, లైబీరియా ద్రవ్య నిధిలో చేరినాయి). ఇతర సభ్యులు: అంతర్జాతీయ ద్రవ్యనిధి విధించిన నియమాల ప్రకారం తదనంతర కాలంలో సభ్యులైన దేశాలు. ఆ దేశాలు అనుసరించవలసిన సర్వాక్రమం ఒకటి ఉంది. అవి సభ్యత్వం కోసం తమ అభ్యర్థనలను గవర్నర్ల బోర్డుకు సమర్పించాలి. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సభ్యత్వ నియమాలను (చెల్లించవలసిన కోటాలు, చెల్లించే పద్ధతులూ మొదలగు వాటిని) నిర్ణయిస్తారు. ఆ నియమాలను బోర్డు ఆమోదించాలి. పిదప ఆ దేశాలు నియమావళి మీద సంతకం చేసి, తన అంగీకార పత్రాన్ని అమెరికా ప్రభుత్వానికి అందజెయ్యాలి. 1962 మే అంతం నాటికి ఇతర సభ్యుల మొత్తం సంఖ్య 39. నియమావళిలోని అధికరణం XX, విభాగం రెండు ఇలా ఉంది: ఈ నియమావళి మీద సంతకం చేసిన సకల ప్రభుత్వాలు దీన్ని తమ తరపున మాత్రమే కాక, తమ సమస్త వలస తరపున, తమ సముద్రాంతర ప్రాంతాల తరపున, తమ రక్షణ కింద, ఆధిపత్యం కింద, అధికారం కింద, మాండేట్ కింద గల సమస్త భూభాగాల తరపున అంగీకరిస్తున్నాయి. కాబట్టి ఈ నియమావళి తమ మాతృ దేశాలకు మాత్రమే కాక తమ ఆధీనంలో ఉన్న సకల ప్రాంతాలకు వర్తిస్తుంది.

అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి ఒక సభ్యదేశం ఉపసంహరించుకోవాలనుకుంటే, ఆ విషయం నిధి అధికారులకు తెలియజేయడం ద్వారా ఆ పని ఎప్పుడైనా చేయవచ్చు. నోటీసు అందిన తేదీ నుంచి ఉపసంహరణ అమలులోకి వస్తుంది. (అధికరణం XV, విభాగం — 1). అంతర్జాతీయ ద్రవ్యనిధి కేవలం అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రభుత్వ కీలుబొమ్మగా ఉందనే కారణం చెబుతూ, మొదటి సభ్యులలో ఒకటైన పోలెండ్ 1953 మార్చి 14 నాడు తన ఉపసంహరణ హక్కును ఉపయోగించుకున్నది. ఐచ్ఛిక ఉపసంహరణ కాక, ద్రవ్యనిధి నుంచి ఉపసంహరించుకొమ్మని ఒక సభ్య దేశాన్ని అడగవచ్చు. ఒక సభ్య దేశం నియమావళి ప్రకారం తమ బాధ్యతలలో దేనినైనా నిర్వర్తించకపోతే, ఆ దేశానికి నిధి వనరులను వినియోగించుకొనే అర్హత లేదని నిధి ప్రకటించవచ్చు. సముచితమైన గడువు ముగిసిన తర్వాత కూడా ఆ దేశం తన బాధ్యతను నిర్వర్తించకపోతే, గవర్నర్ల బోర్డు నిర్ణయం ద్వారా ఆ నిధిలో తన సభ్యత్వాన్ని కోల్పోతుంది. మొదటి సభ్యులలో ఒకటైన చెకోస్లోవాకియాను ఈ నియమం ప్రకారం 1954 డిసెంబర్ 31న నిధి నుంచి బహిష్కరించారు.

ఆ విధంగా 1962 మే అంతం నాటికి అంతర్జాతీయ ద్రవ్యనిధి మొత్తం సభ్యుల సంఖ్య 76; అందులో మొదటి సభ్యుల సంఖ్య 37. అంటే కమ్యూనిస్టు దేశాలు, స్విట్జర్లాండ్ తప్ప ప్రపంచంలోని ప్రముఖ దేశాలన్నీ నిధిలో ఉన్నాయి.

పునర్నిర్మాణ, అభివృద్ధుల కోసం అంతర్జాతీయ బాంకు (ప్రపంచబాంకు)లో సభ్యత్వం ఉండాలంటే, అంతర్జాతీయ ద్రవ్యనిధిలో విధిగా సభ్యత్వం ఉండాలనే విషయం జ్ఞాపకం పెట్టుకోవాలి. కాని, ప్రపంచబాంకులో సభ్యత్వం లేకపోయినా, అంతర్జాతీయ ద్రవ్యనిధిలో సభ్యత్వం పొందవచ్చు. అందువల్ల, క్యూబా 1960 నవంబర్ 4న, డొమినికా 1960 డిసెంబర్ 1న తేదీన ప్రపంచబాంకు నుంచి ఉపసంహరించుకొన్నప్పటికీ, అవి అంతర్జాతీయ ద్రవ్యనిధిలో తమ సభ్యత్వం నిలుపుకోగలిగాయి.

అంతర్జాతీయ ద్రవ్యనిధి లక్ష్యాలు సాధించేటందుకు సభ్యదేశాలు నిధికి తలా కొంత మొత్తం చందాగా చెల్లించాలి. ప్రారంభ చందాల మొత్తం 1100 కోట్ల డాలర్లు ఉండాలని, అందులో 880 కోట్లు మొదటి సభ్యులు, తక్కింది ఇతర సభ్యులూ చెల్లించాలని నిర్ణయించారు. ఈ చందాల సభ్యులకు నిర్ణయించిన కోటాల ప్రాతిపదిక మీద నిర్ణయించారు. మొదటి సభ్యుల కోటాలు నియమావళికి జతజేసి పట్టీ 'ఎ'లో ప్రకటించారు. ఇతర సభ్యులు నిధిలో చేరినప్పుడు వాటి కోటాలు నిర్ణయిస్తారు. ఈ కోటాలు సభ్యుల స్థానాలనూ, హక్కులనూ చాలా ప్రభావితం చేస్తాయి. ఎలాగంటే ఇవి నిధి వనరులను ఉపయోగించుకోవడానికి ప్రాతిపదికగానూ నిధిలోని ఓటింగు హక్కులకు ప్రమాణంగానూ పనిచేస్తాయి. ప్రతి దేశం ద్రవ్యనిల్వలను విదేశ వర్తక పరిమాణాన్ని, జాతీయాదాయాన్ని ప్రాతిపదికగా చేసుకొని కోటాలు నిర్ణయిస్తారు. వాటికి తోడు రాజకీయ అంశాలు కూడా కొంతవరకూ పరిగణనలోకి తీసుకొంటారు.

## 23.5 విదేశీ సహాయం — భారతదేశ వైఖరి

భారతదేశానికి వచ్చే సహాయం గురించి రెండు దృక్పథాలున్నాయి. సహాయం భారతదేశంలో ప్రభుత్వ రంగ వృద్ధిని, అసమర్థ బ్యూరాక్రటిక్ విధానాలను ప్రోత్సహించిందనేది ఒక దృక్పథం. సహాయం లేకపోతే భారత విధాన కర్తలు మరింత సమర్థవంతమైన విధానాలను అనుసరించే వాళ్ళనే అర్థం దీనిలో ఇమిడి ఉంది. అప్పుడు ప్రయివేట్ పెట్టుబడి మీదా, మార్కెట్ యంత్రాంగం మీదా ఇంకా ఎక్కువగా ఆధారపడటం జరిగేది. ఆర్థిక శక్తి కేంద్రీకరణకు, భారత ఆర్థిక వ్యవస్థమీద భారత బడా పెట్టుబడి దారుల పెత్తనం బలపడడానికి విదేశ సహాయం చాలా ఎక్కువగా తోడ్పడిందనేది మరొక దృక్పథం. ఈ దృక్పథం ప్రకారం భారతదేశానికి ప్రధాన సహాయదాతలలో ప్రపంచ బాంకు ఒకటి. అందువల్ల ప్రపంచబాంకు సాధించిన ప్రముఖ విజయం ఏమిటంటే భారతదేశంలో ప్రపంచపెట్టుబడి దారీ వ్యవస్థలో విడదీయరాని భాగంగా చేసి, తత్ఫలితంగా అంతర్జాతీయ పెట్టుబడిదారుల లాభాలు గరిష్ఠ స్థాయికి పెరిగేటట్లుగా పెట్టుబడికి, సాంకేతిక విజ్ఞానానికి విస్తారమైన మార్కెట్‌ను సమకూర్చడం జరిగింది.

సహాయం తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని భారతదేశ విధానకర్తలు చాలా కాలంగా చెబుతున్నారు. భారత దేశ ప్రణాళికల్లో "స్వావలంబిత వృద్ధి" ప్రధాన లక్ష్యాలలో ఒకటిగా ఉంది. కాని "స్వావలంబన" అనే దాని అర్థం కాలక్రమాన మార్పులకు, సవరణలకు గురి అవుతూ వచ్చింది. సహాయాన్ని అంతమొందించడం దాని అర్థమని మూడవ, నాల్గవ ప్రపంచ వర్ష ప్రణాళికలు వ్యాఖ్యానించగా, సహాయం మీద ఆధారపడటాన్ని తగ్గించడమని తరవాతి పంచవర్ష ప్రణాళికలు వ్యాఖ్యానించాయి. "స్వావలంబన" అంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మరింత సమానమైన సంబంధాన్ని పొందే సాధనమని ఆరో పంచవర్ష ప్రణాళిక వ్యాఖ్యానిస్తున్నది. అలాంటి సంబంధాన్ని పొందడమంటే, అంతర్జాతీయ వత్తిళ్ళ వల్లా, కల్లోలాల వల్లా దేశం దెబ్బతినే అవకాశాన్ని తగ్గించడం. సహాయం మీద ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా మాత్రమే కాక, ఎగుమతుల పెరుగుదలకు, దిగుమతులకు సమర్థవంతమైన ప్రత్యామ్నాయాలను సృష్టించడానికీ సమానమైన విలువ ఇవ్వడం ద్వారా కూడా దీన్ని సాధించవలసి ఉంది.

## 23.6 సహాయాలను ముడిపెట్టడం (Tying of Aid)

నామకహా మనకు ఇచ్చే సహాయం మొత్తం నుంచి మనకు నిజంగా లభించే వనరులను తగ్గించే ఒక ముఖ్యమైన అంశం ఉంది. అది సహాయాన్ని ముడిపెట్టే పద్ధతి. సహాయాన్ని లభ్యస్థానానికి ముడిపెట్టవచ్చు, ప్రాజెక్టులకు ముడి పెట్టవచ్చు, లేదా రెండింటికీ ముడిపెట్టవచ్చు. లభ్యస్థానానికి ముడి పెట్టడమంటే, సహాయ గ్రహీతలు సరుకులు, సేవలను ఫలానా స్థానం నుంచి, మామూలుగా సహాయం ఇచ్చిన దేశం నుంచి అక్కడ ధరలు ఎక్కువగా ఉన్నప్పటికి కూడా కొన్నాలని నిర్బంధించడం. ప్రాజెక్టులకు ముడిపెట్టడమంటే, సహాయ గ్రహీతలు



BRAOU

తమకు వచ్చే సహాయ నిధులను ఫలానా ప్రాజెక్టులకు, ఖర్చు పెట్టరాదని నిర్బంధించడం. దీనివల్ల దాతలు గుత్తాధిపత్యంతో ధరలు విధించడానికీ వీలు కలుగుతుంది. దీనికి తోడుగా, సహాయదాతలు విడిభాగాలకు, ఉత్పాదకాలకు, ముడి పదార్థాలకు మితిమీరిన ధరలు విధించవచ్చు. ముడిపెట్టిన సహాయంతో యంత్రాలు, పరికరాలు వచ్చిన తరవాత అవి (విడి భాగాలూ వగైరా) వస్తాయి. అంతేకాక, సహాయాన్ని ముడిపెట్టడం వల్ల వనరులను అనుచితంగా కేటాయించడమూ, సహాయ గ్రహీతల వనరులకు తగని యంత్రాలను, పరికారాలను దిగుమతి చేసుకోవడమూ జరగవచ్చు. అందువల్ల దాతలు తాము ఇచ్చే సహాయానికి తమ వర్తకాన్ని పెంచే సాధనంగా ప్రాముఖ్యమిస్తారు. గణనీయమైన మొత్తాలు సహాయంగా ఇవ్వడానికి ఆ దేశాలు సిద్ధపడటం ఏదో ఒక విధంగా వాటి ఇతర లక్ష్యాలతో సంబంధం కలిగి ఉన్నట్లు కనిపిస్తుంది. అంతర్జాతీయ యంత్రాంగాన్ని సకల జాతుల ఆర్థికాభివృద్ధి సంపాదించడానికే వినియోగించాలని ఐక్యరాజ్య సమితి పత్రం చెబుతుంది. దేశాల మధ్య సహాయమనే భావం అంతర్జాతీయతావాదం నుంచి, మానవతావాదం నుంచి పుట్టింది. కానీ, అదే సమయంలో అది ఆర్థిక ప్రయోజనాలకు, వ్యూహాత్మక ప్రయోజనాలకు లోబడి కూడా ఉంది.

ట్రూమన్ పాయింట్ 4 కార్యక్రమం అమెరికా సంయుక్త రాష్ట్రాలలో అంతర్జాతీయ సహాయానికి సంబంధించిన ప్రముఖ విధాన పత్రం. సహాయమనేది పెరుగుదల ప్రక్రియలో ఒక భాగం. ఆధునికీ కరణ ప్రక్రియలో ఒక దేశం స్వయంచోదక దశ చేరుకొనే దాకా సహాయం కొనసాగుతుంది. ప్రాణపదమైన, కీలకమైన ముడి పదార్థాలు సంపాయించుకొనే మార్గంగా ఒకోసారి సహాయం ఉంటుంది. సోవియట్ యూనియన్ సరిహద్దుల్లోనూ, చైనా సరిహద్దుల్లోనూ ఉన్న దేశాలకు సహాయం ఎక్కువగా లభించడం కూడా కనిపిస్తుంది. సాంకేతిక ప్రగతినీ, సంస్థ నిర్మాణాన్నీ సంపాదించడానికి అది రాజకీయ స్థిరత్వానికి దారి తీస్తుందనే ఆశతో సహాయం ఇవ్వడం కూడా ఉంది. మరొకవైపున, సహాయం క్రియాశీలమైన శక్తులను ఉత్పన్నం చేయడం ద్వారా అస్థిరత్వానికి దారి తీస్తుందని హాన్స్ మోర్గెన్‌థా లాంటి నిపుణులు వాదించినారు. మాజీ సామ్రాజ్య వాద దేశాలు తమ మాజీ వలసలకు మామూలుగా సహాయం ఇవ్వడం కూడా కనిపిస్తుంది. ఒక్కొక్కసారి తన భాషను వ్యాప్తి చేసుకోడానికి ఒక దేశం సహాయం చేస్తుంది. ఉదాహరణకు ఒక ఫ్రెంచి రాజకీయ నాయకుడు ఇలా అన్నాడు... "మా ఫ్రెంచి వాళ్ళకు మా భాషను రక్షించుకోవడం అవసరం. ద్వైపాక్షిక సహాయం కొనసాగించడానికి ఇదొక మౌలిక కారణం". సోవియట్ యూనియన్, చైనా లాంటి ఇతర దేశాలు రాజకీయ, ఆర్థిక ఉద్దేశాలతో సహాయం చేస్తాయి. ఆ సహాయం అత్యధికంగా మృదు రుణాల రూపంలో ఉంటాయి. చైనా ఇచ్చే సహాయానికి వడ్డీ ఉండదు. దాని సహాయం కొన్ని దేశాల్లో కేంద్రీకరింపబడి, వర్తకంతో ముడి పెట్టారు. సహాయం భావజాల యుద్ధంలో ఒక ఆయుధం. భావజాల కారణాలతో విదేశీ సహాయాన్ని వ్యతిరేకించే బలమైన వర్గం పాశ్చాత్య దేశాలలో ఉంది. సహాయం నిర్నిబంధ మార్కెట్ సూత్రానికి వ్యతిరేకమనీ, స్మృతి చిహ్నాల దాహంతో ప్రేరేపిత మవుతుందని ఒక ఆరోపణ ఉంది. ఇతోధిక సహాయం మామూలుగా ప్రభుత్వ రంగాన్ని పెంచుతుంది. భావజాలం రీత్యా ఇది మితవాద అర్థ శాస్త్రజ్ఞులకు నచ్చదు. ఇవి సహాయానికి అనుకూలంగాను, ప్రతికూలంగాను ఉన్న వివిధ వాదాలు.

## 23.7 పారిశ్రామికీకరణలో విదేశీ సహాయం పాత్ర

వర్థమా దేశాలన్నీ పారిశ్రామికీ కరణమ తమ ఆర్థిక లక్ష్యాలలో అత్యధిక భాగానికి దివ్యౌషధంగా పరిగణిస్తాయి. ఈ దేశాలలో అనేకం తమ దారిద్ర్యానికీ, హీన అనుభోగపు స్థాయిలకు చెందిన సమస్యలకు విస్తృత పారిశ్రామికీకరణ సాపేక్షంగా సత్వరమైన పరిష్కారమని అనుకొంటాయి. అమిత జనాభాగల కొన్ని వర్థమాన దేశాలు భూమి మీద వత్తిడికి, అదనపు శ్రమకు సంబంధించిన తమ సమస్యలను పారిశ్రామికీకరణ తీరుస్తుందని భావిస్తాయి. భారీ పరిశ్రమల సత్వర వృద్ధితో తమ అదనపు శ్రామికులను అమిత జనాభా గల వ్యవసాయరంగం నుంచి కొత్త పట్టణ ఫ్యాక్టరీలకు తరలించవచ్చునని, తద్వారా ఎక్కువ వేతనాలను సమకూర్చవచ్చునని, సరుకులకు, సేవలకు డిమాండ్‌ను పెంచవచ్చునని ఆ దేశాల నమ్మకం. భారతదేశ ప్రణాళిక సంఘం



BRAOU

(Planning Commission) ఇలా చెప్పింది. "అభివృద్ధికి కీలకమైనది సత్వర పారిశ్రామికీకరణ. కానీ పారిశ్రామికీకరణ తగినంత సత్వరంగా జరగాలంటే, అనుభోగ వస్తువులకు, మధ్యంతర ఉత్పాదితాలకు చెందిన రంగంలో బహుళ సంఖ్యాక పరిశ్రమల కోసం యంత్రాలను తయారు చేసే పరిశ్రమలను అభివృద్ధి చేయడం దేశం లక్ష్యంగా ఉండాలి. ఇనుము, ఉక్కు, ఇతర లోహాలు, బొగ్గు, సిమెంటు, భారీ రసాయనికాలు, మౌలిక ప్రాముఖ్యం గల ఇతర పరిశ్రమలలో గణనీయమైన విస్తరణ జరిగితేనే అది సాధ్యమవుతుంది."

1952లో భారత అమెరికాల సాంకేతిక సహకార ఒప్పందం చేసుకోవడంతో భారత పారిశ్రామికీకరణకు విదేశీ సహాయం ప్రారంభమైంది. అమెరికా సంయుక్త రాష్ట్రాల పరిజ్ఞానాన్ని, సంవిధానాలను, సమస్తులను, పదార్థాలను భారత దేశ ఆర్థిక, సాంఘిక అభివృద్ధి కోసం లభ్యం చేయడం దాని మౌలిక ఉద్దేశం. మొదటి రెండు పంచవర్ష ప్రణాళికల లోను మూడో పంచవర్ష ప్రణాళిక మధ్య వరకూనూ వందకు పైగా ప్రముఖ ప్రాజెక్టులు చేపట్టారు. 1955లో జరిగిన భారత సోవియట్ ఒప్పందం భారత-సోవియట్ సహకారానికి ఊపునిచ్చింది. ఈ సహకారం ఇనుము-ఉక్కు, లిగ్నైట్ తవ్వకం, గనుల తవ్వకం, శాస్త్ర పరిశోధన, నూనె అన్వేషణ, విద్యుచ్ఛక్తి సౌకర్యాలు, చిన్న పరిశ్రమలు, శిక్షణ సంస్థలు మొదలైన రంగాలలో ఉంది.

## 23.8 విదేశీమూలధనం — దాని ప్రవేశం

పెట్టిన పెట్టుబడి మీద లాభాలు పొందేందుకు విదేశీ పెట్టుబడి ఎక్కువగా మూలధనం రూపంలో మన దేశంలోకి వస్తోంది. దేశంలోకి విదేశీ పెట్టుబడి ఏ రూపంలోనైనా రావచ్చు. తమ ఆధీనంలో ఉన్న భారతీయ సంస్థల ద్వారాను, మన దేశంలో ఉన్న వాటి శాఖల ద్వారాను ప్రత్యక్ష పెట్టుబడి రూపంలో ప్రవేశిస్తుంది. ఇంకో విధంగా చెప్పాలంటే భారతదేశంలో పనిచేసే ఉద్దేశంతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల్లో సంస్థలు ఏర్పడినాయి. కొన్ని సందర్భాల్లో పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల్లోని సంస్థలు మన దేశంలో తమ శాఖలను, అనుబంధ సంస్థలను ఏర్పాటు చేస్తాయి.

రెండోది, భారతదేశం స్వదేశీ, విదేశీ పెట్టుబడులు సంయుక్తంగా పనిచేయాలని కోరుతున్నది. విదేశీ పెట్టుబడి దిగుమతిని ప్రోత్సహిస్తున్నది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో అభివృద్ధి క్రమాన్ని త్వరితం చేసేందుకై ఆర్థిక సహాయాన్ని, రుణాలను అందించాలన్నది అభివృద్ధి చెందిన దేశాలు ఆమోదించిన విధానం. ఏ రూపంలో వచ్చినప్పటికీ విదేశీ పెట్టుబడి ఏకైక ఉద్దేశం లాభాలను సంపాదించుకోవటమే. అందుకే ఇది చిక్కుతో కూడుకొన్న పెట్టుబడే.

BRAOU

## 23.9 విదేశీ మూలధన ఆవశ్యకత

అనేక కారణాల వల్ల మూడో ప్రపంచ దేశాలకు విదేశీ పెట్టుబడి అవసరం. విదేశీ పెట్టుబడి దేశంలోకి ఎంత వరకు రావచ్చు అనే విషయంలో ఒక దేశానికీ మరో దేశానికీ పోలిక వుండదు. ఒక దేశం విదేశీ పెట్టుబడిపై ఎంతవరకు ఆధారపడుతుంది అన్న విషయం ఆ దేశం సహజ వనరులు, సాంకేతిక ప్రగతి, ప్రభుత్వ విధానాలను బట్టి ఉంటుంది.

అభివృద్ధి చెందుతున్న దేశాలు విదేశీ పెట్టుబడిని అనేక కారణాల వల్ల ఆహ్వానిస్తాయి. అందులో కొన్ని:

1. దేశ ఆర్థికాభివృద్ధికి తగినంత పెట్టుబడి దేశంలో లేకపోయినట్లయితే, ఆ దేశం విదేశీ పెట్టుబడిని కోరుతుంది.
2. అత్యధిక భాగం జనాభా పేదవారైతే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు వనరుల సమీకరణ

కష్టమవుతుంది. స్వదేశీ పెట్టుబడి మార్కెట్ అప్పుడప్పుడే అభివృద్ధి చెందుతుంటే కూడా ఆ దేశాలు విదేశీ పెట్టుబడిని కోరుతాయి.

3. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అనుభవం గల వ్యాపారస్తులు తక్కువగా ఉండటం వల్ల, సాంకేతిక పరిజ్ఞానం నిర్వహణ నైపుణ్యాల కొరతవల్ల ఉత్పత్తి, కార్యక్రమాల్లోనికి స్వదేశీ పెట్టుబడి ఎక్కువగా ప్రవహించలేదు. విదేశీ పెట్టుబడి ఈ మార్గాన్ని నిర్వర్తించగలదని భావించారు.

## 23.10 విదేశీ మూలధన ప్రభావం

అన్ని ఆర్థిక సంబంధాల్లోను, అంతర్జాతీయ సంబంధాల్లోను, విదేశీ పెట్టుబడి నిర్ణయాత్మక శక్తిగా ఉంది. పూర్తి రాజకీయ స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్న దేశాలను కూడా ఇది లోబరుచుకోగలదు. రాజకీయంగా ఒక దేశం మరో దేశం పై ఆధిపత్యం చలాయిస్తూ ఉంటే ఎక్కువగా పట్టించుకొంటారు. కానీ ఒక దేశం పెట్టుబడి, సంస్థలు, సాంకేతిక సంబంధం, నైపుణ్యం మరో దేశం వ్యాపార ఉత్పత్తులపైన ఆధిపత్యం చేస్తుంటే పట్టించుకోరు. ఈ విదేశీ ప్రయివేటు పెట్టుబడులు మన దేశంలో ముఖ్యపాత్ర వహిస్తున్నాయి.

ఒకప్పుడు సామ్రాజ్యవాద దేశాలుగా ఉన్న దేశాల విదేశీ సంస్థలు పూర్వం తమ వలసలుగా ఉన్న దేశాల్లో చాలా పెట్టుబడులు పెడుతున్నాయి. విదేశాల నియంత్రణలో ఉన్న సంస్థలు చాలా దేశాల్లో ఉన్నాయి. ఇవి ప్రపంచాన్నంతటినీ ఆవహించిన భూతాలు. ఆర్థిక సహాయాన్నందించే శక్తి చాలా ఉన్న ఈ సంస్థలకు చాలా ప్రభావముంది. పన్ను మినహాయింపులు, టాక్స్ హాలిడే, వడ్డీలు లేకుండా రుణాలు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీలు లాంటి ఎన్నో ప్రత్యేక ప్రోత్సాహాలు ఈ సంస్థలకు లభిస్తున్నాయి. 1948 సంవత్సరంలో ప్రధాని శ్రీ జవహర్ లాల్ నెహ్రూ విదేశీ పెట్టుబడులను జాతీయం చేయాలని అన్నారు. ఆర్థికాభివృద్ధి పథకాలలో విదేశీ పెట్టుబడి ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తుందని భారతదేశం భావిస్తుంది. ఫలితంగా విదేశీ పెట్టుబడిదారులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తోంది.

మన దేశంలో విదేశీ పెట్టుబడి పాత్ర మీద అనేక అభిప్రాయాలున్నాయి. మన పరిశ్రమలు ముడి సరుకుల కోసం, పరికరాల కోసం దిగుమతులపై ఆధారపడటం వల్ల మన పెట్టుబడులలో అత్యధిక భాగం విదేశాలకు వెళ్ళుతోంది. లాభాల తరలింపు, పెరిగిన పెట్టుబడుల విలువ, సాంకేతిక విజ్ఞానం ద్వారా చెల్లింపులు, రాయల్టీల ద్వారా కూడా మన పెట్టుబడులు విదేశాలకు ప్రవహిస్తున్నాయి. విదేశీ పెట్టుబడితో ప్రారంభించే పరిశ్రమలకు కావలసిన ముడి సరుకులు, సంధాన వస్తువులు, విడి భాగాల దిగుమతికి ప్రధానంగా మన పెట్టుబడి విదేశాలకు వెళ్ళుతోంది. ఈ రకంగా విదేశీ మారకద్రవ్య సంక్షోభం వల్ల పెట్టుబడి ఎదుగుదల తగ్గి దేశం విదేశాలపై ఆధారపడవలసి వస్తుంది. వివిధ రూపాలలో దోపిడీ చేసేందుకు విదేశీ పెట్టుబడి దారులు అనుసరించే రకరకాల మార్గాలను గురించి వివరించడం కష్టం. విదేశాల్లో పెట్టుబడి పెట్టడం ద్వారా విదేశీ పెట్టుబడి దారులు (1) కాలదోషం పట్టిన యంత్రాలను, (2) వారి ముడి సరుకులకు మార్కెట్‌ను, (3) వారి విడి భాగాలను, సగం తయారైన వస్తువులను లాభసాటి ధరలకు అమ్ముకోగలుగుతున్నారు. ఇవి కాక పెద్ద ఎత్తున లాభాల తరలింపు, రాయల్టీలు ఉండనే ఉన్నాయి.

విదేశీ ప్రయివేటు పెట్టుబడులపైన సాంకేతిక సహకారాలపైన మన దేశానికి గల నమ్మకం దేశ పారిశ్రామికీకరణలో చెప్పుకోదగిన పాత్రను నిర్వహిస్తోంది. దేశం పారిశ్రామికీకరణలో ముందంజ వేస్తుండడం వల్ల విదేశీ పెట్టుబడిని స్వీకరించడం వల్ల హాని లేదు అన్నది మరొక అభిప్రాయం.

## 23.11 బహుళ జాతీయ సంస్థల లక్షణాలు

బహుళ జాతీయ సంస్థలు చాలా పెద్ద సంస్థలు. వీటి కేంద్ర స్థానం ఒక దేశంలో ఉండి, అనేక ఇతర దేశాలలో



BRAOU

రకరకాల వ్యాపార కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. మాతృ దేశ పరిహద్దులను దాటి కార్యక్రమాలను వ్యాపింపజేసిన సంస్థలను ఇలా అంటారు. కొన్ని బహుళ జాతీయ సంస్థలు అంతర్జాతీయ నియంత్రణ కింద ఉన్నాయి. యూని లివర్, డన్ఫ్నల్, అగ్వా — గవేట్ లాంటి సంస్థలు అంతర్జాతీయంగా స్వంతం చేసుకోబడ్డాయి. కొన్ని సంస్థలు అంతర్జాతీయంగా స్వంత సంస్థలుగాను, అంతర్జాతీయ నియంత్రణలోను ఉన్నాయి. గత రెండు దశాబ్దాల కాలంలో అభివృద్ధి చెందిన సంస్థలన్నీ అంతర్జాతీయంగా స్వంతం చేసుకొన్న ఆస్తుల ప్రాతిపదికపై పనిచేస్తున్నాయి. ఈ ఆస్తులపై యాజమాన్యం వల్ల సంస్థల కార్యకలాపాలపై నియంత్రణ వస్తుంది. బహుళ జాతీయ సంస్థల సమర్థత సౌలభ్యాలకు మూలం ఈ నియంత్రణే. ఈ నియంత్రణ బహుళ జాతీయ సంస్థల ప్రాథమిక లక్షణం. ఈ నియంత్రణ సుదూర ప్రాంతం నుంచి ఉంటుంది. కాబట్టి అది ఏ మేరకు ఉండాలన్నది ఆర్థిక ఎత్తుగడల వ్యూహాన్ని అనుసరించి ఉంటుంది. కానీ నియంత్రణ అవసరమన్న ప్రసక్తే లేదు. ఇటీవలి స్వరూపం ప్రకారం మూలధనమే కాక సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార దక్షత, వివిధ వస్తు సేవల రూపంలో ఉత్పత్తి కారకాలను సరఫరా చేయటం ఈ సంస్థల రెండో లక్షణం. అంతర్జాతీయ వర్తక సూత్రాల ప్రకారం ఈ సంస్థలలో వనరుల మార్పిడేగానీ వనరుల అమ్మకం ఉండదు. ఇది వాటి మూడో లక్షణం. ఒక దేశం కంటె ఎక్కువ దేశాల్లో కర్మాగారాలు, గనులు, నూనె శుద్ధి కర్మాగారాలు, పంపిణీ మార్గాలు, కార్య నిర్వాహణ సంస్థలు మొదలైన ఉత్పత్తి సౌకర్యాల మీద యజమాన్యంగాని, నియంత్రణను గానీ కలిగి ఉండే సంస్థ బహుళ జాతీయ సంస్థ.

## 23.12 భారత దేశంలో బహుళ జాతీయ సంస్థలు

అమెరికా సంయుక్తరాష్ట్రాలు, ఇంగ్లాండ్ (యునైటెడ్ కింగ్‌డమ్), జపాను, ఫ్రాన్స్, నెదర్‌లాండ్స్ మొదలైన దేశాల బహుళజాతీయసంస్థలు మనదేశంలో వివిధ రూపాలలో ఉన్న విదేశీ తోడ్పాటు సంస్థల్లో ప్రవేశించాయి. ఈ విదేశీ తోడ్పాటు సంస్థలు రంగులు, వార్నిషులు, సబ్బులు, సౌందర్య సాధనాలు, టూత్ పేస్టులు, టూత్‌బ్రష్లు, అలంకరణ సామాగ్రి, కాగితాలు, పెన్నులు మొదలైన రాతసామగ్రి, జోళ్ళు, కాఫీ, టీ మొదలైన చిన్న వస్తువులను కూడా తయారుచేస్తున్నాయి. నిత్యజీవితంలో పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకోబోయే దాకా మనం వాడే వస్తువులన్నీ స్వదేశంలో అమ్ముతున్న విదేశీ వస్తువులే. విదేశీ ఆధిపత్యంలో ఉన్న సంస్థలు దిగువ ఇవ్వబడ్డాయి.

మొక్కల పెంపకంలో రెండు బ్రిటిషు కంపెనీలు, లిప్టన్, బ్రూక్‌బాండ్ ఆధిపత్యం వహిస్తున్నాయి. అలాగే వ్యవసాయ యంత్రసామగ్రిలో మాసీ ఫెర్గూసన్; క్రిమిసంహారక మందులు, పురుగుల మందుల రంగంలో ఐ.సి.ఐ., సీబాగాయిగీ, షెవాలెస్, యూనియన్ కార్బైడ్, బేయర్స్ ఆధిపత్యం వహిస్తున్నాయి. మోటార్ సైకిళ్ళ ఉత్పత్తిలో ఎన్‌ఫీల్డ్, ఎస్కర్ట్స్, పొగాకు విషయంలో ఇంపీరియల్ టొబాకో సంస్థలు ఆధిపత్యం వహిస్తున్నాయి.

## మీ అవగాహనను పరీక్షించుకోండి

1. ప్రపంచబాంకు అంటే ఏమిటి?
2. ఐ.ఎం.ఎఫ్. అంటే ఏమిటి?
3. విదేశీ మూలధనం ఏ రూపాలలో భారతదేశంలో ప్రవేశించింది?
4. అభివృద్ధి చెందుతున్న దేశాలకు విదేశీ మూలధనం ఎందుకు అవసరం?

## 23.13 సారాంశం/ముగింపు

ఆర్థికాభివృద్ధి ప్రక్రియల్లో విదేశీ సహాయం మరీ అంత ముఖ్యమైన అంశం కాకపోయినా కొంత ప్రాముఖ్యం గల అంశమే. పారిశ్రామికంగా ప్రగతి సాధించిన దేశాలు అనేకమార్గాల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల్లోకి చొచ్చుకుపోతాయి. సంఘటిత ఉత్పత్తిలో ముఖ్యమైన రంగాలపై ఆధిపత్యం సంపాదించడానికి ఇలా చేస్తాయి. లాభాలను ఆర్జించటమే వీటి ఏకైక లక్ష్యం. లాభాలు, రాయల్టీ చెల్లింపులు, కమీషన్‌లు, సాంకేతిక సలహాల రూపంలో అన్ని వనరులను ప్రవహింపచేస్తాయి.

— డా. జి.ఎస్. సీతారాం.

## 23.14 సంప్రదింపు గ్రంథాలు ·

1. T. Nagi Raddy : India Mortgaged
2. J.S. Uppal : Indias Economic Problems
3. Datt and Sundaram : Indian Economy
4. Wadhwa C.D : Some Problems of India's Economic Policy

## 23.15 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. *కింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబులు రాయండి.*

1. ఆర్థికాభివృద్ధిలో విదేశీ ఆర్థిక సహాయం పాత్రను వివరించండి.
2. విదేశీ ఆర్థిక సహాయం అభివృద్ధికి దోహదం చేస్తుందా? చర్చించండి.
3. భారతదేశ ఆర్థికాభివృద్ధి మీద విదేశీ సహాయం ప్రభావాన్ని వివరించండి.
4. (భారతదేశ) ఆర్థికాభివృద్ధిలో విదేశీ మూలధన పాత్రను విమర్శనాత్మకంగా పరిశీలించండి.
5. ఒక దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రపంచ బాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థల పాత్రను వివరించండి.

II. *కింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులు రాయండి.*

1. ఆర్థికాభివృద్ధిలో ప్రపంచబాంకు పాత్రను వివరించండి?
2. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ విధులను, పాత్రను వివరించండి.
3. విదేశీ ఆర్థిక సహాయం పై భారతదేశ ధోరణిని వివరించండి.
4. బహుళ జాతీయ సంస్థ లక్షణాలేవి?
5. విదేశీ మూలధన ప్రభావాన్ని తెలపండి.

BRAOU

BRAOU

# ఖండం — VII

## పేదరికం - నిరుద్యోగం

పేదరికం, నిరుద్యోగితకు సంబంధించిన వివిధ భావనలను, వాటిని కొలిచే వివిధ మార్గాలను ఈ ఖండంలో చర్చిస్తాం. నిరుద్యోగితలో ఉండే వివిధ రకాలను తెలుసుకుంటాం. భారతదేశంలో పేదరికం, నిరుద్యోగ సమస్యలు ఏర్పడడానికి కారణాలనూ, వాటిని నివారించడానికి తీసుకోవాల్సిన, తీసుకుంటున్న చర్యలనూ వివరించడమే ఈ ఖండం ఉద్దేశం.

ఈ ఖండంలో రెండు (2) భాగాలున్నాయి అవి :

భాగం — 24: భారతదేశంలో పేదరికం

భాగం — 25: భారతదేశంలో నిరుద్యోగ సమస్య

BRAOU

BRAOU

# భాగం-24: భారతదేశంలో పేదరికం

విషయక్రమం


24.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

24.1 పరిచయం

24.2 భారతదేశంలో జీవనప్రమాణ స్థాయి

24.3 దారిద్ర్యానికి (పేదరికానికి) నిర్వచనం

- 24.3.1 తక్కువస్థాయి తలసరి ఆదాయం
- 24.3.2 తలసరి వినియోగ వ్యయం
- 24.3.3 దారిద్ర్య రేఖ
- 24.3.4 దండేకర్, రథ్ ల అధ్యయనం

24.4 దారిద్ర్యానికి (పేదరికానికి) కారణాలు

24.5 పేదరికాన్ని నిర్మూలించే విధానాలు

24.6 సారాంశం/ముగింపు

24.7 సంప్రదింపు గ్రంథాలు

24.8 పరీక్షా ప్రశ్నలు


## 24.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

భారతదేశంలో పేదరికం ఏ మేరకు పరిశీలించడం; దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న జనసంఖ్య పెరుగుదలకు కారణాలను వివరించడం; పేదరికాన్ని తొలగించడానికి తీసుకోవలసిన నివారణ చర్యల గురించి చర్చించడం ఈ భాగం లక్ష్యం.

ఈ భాగం చదివిన తర్వాత మీరు,

★ భారతదేశ ప్రజల జీవనప్రమాణ స్థాయిని గుర్తించ గలరు.

★ దారిద్ర్యాన్ని నిర్వచించ గలరు.

★ దారిద్ర్యం ఏర్పడడానికి కారణాలను తెలుసుకోగలరు.

★ పేదరికాన్ని నిర్మూలించడానికి తీసుకోవలసిన చర్యలను సూచించగలరు.

## 24.1 పరిచయం

మూడు దశాబ్దాల పాటు ప్రణాళికలు అమలు జరిగిన తర్వాత అభివృద్ధి ఫలితాలు సామాన్య మానవులకు ఎంతవరకు అందాయో నిర్ణయించటం అవసరం. ఆదాయాల పంపిణీని, ప్రజల జీవనప్రమాణాలను విశ్లేషిస్తే జాతీయాదాయ పంపిణీ సమంగా ఉందో లేదో తెలుస్తుంది. ధనవంతులు మరీ ధనవంతులుగా మారి దారిద్ర్యం పెరిగిపోతున్న పరిస్థితి ఉందోలేదో కూడా తెలుస్తుంది. అభివృద్ధి క్రమం ప్రజలపై కొన్ని త్యాగాలను, బాధలను విధిస్తుంది. సాంఘిక న్యాయం ప్రకారం ఇది పేదప్రజల మీద భారాన్ని పెంచకూడదు. అసమానతలను తగ్గించేందుకు, పేదరికాన్ని తొలగించేందుకు విధానాలను రూపొందించాలంటే దేశంలో పేదరికం ఏ మేరకు ఉంది, ఎంతమంది పేదవారున్నారో అంచనా వేయాలి.

## 24.2 భారతదేశంలో జీవన ప్రమాణ స్థాయి

అసమానతల స్థాయి ఆర్థిక పెరుగుదల కంటే వేగంగా పెరిగిపోయింది. మార్కెట్లోకి కొత్త కొత్త వినియోగ వస్తువులు ప్రవేశించటంతో ఉన్నతాదాయ వర్గాల వారి జీవనప్రమాణం పెరుగుతూనే వచ్చింది. పేదరికపు స్థాయిపై అభివృద్ధి యత్నాల ప్రభావం ఏమీలేదు. ధనికవర్గాల వారు వీటిని ప్రబలంగా వినియోగించుకోటం వల్ల జీవన స్థాయిలో అసమానతలు కొట్టొచ్చినంతగా పెరిగాయి. వివిధ రచయితలు తమ అధ్యయనాల్లో ఆదాయంలో అసమానతల స్థాయిని గురించి ఎత్తి చూపారు. భారతీయ రిజర్వుబ్యాంకు అంచనా ప్రకారం జనాభాలో పై స్థాయిలో ఉన్న 5 శాతం మంది జాతీయాదాయంలో 25 శాతం పొందుతుండగా అడుగున ఉన్న 20 శాతం మంది కేవలం 7 శాతాన్ని పొందుతున్నారు. 1956-57 సంవత్సరంలో అయ్యంగార్, ముఖర్జీల అంచనాతో ఇది ఇంచుమించు ఏకీభవిస్తోంది. 1960-61 ధరల ప్రకారం అడుగున ఉన్న 5 శాతం ప్రజల వినియోగ వ్యయం 78 రూ.లు కాగా పై స్థాయిలో ఉన్న 5 శాతం ప్రజల వినియోగ వ్యయం 1350 రూ.లు అని జాతీయ శాంపిల్ సర్వే అంచనా కట్టింది. వ్యవసాయంలోనూ, భూకమతాలలోనూ, ప్రైవేటు పరిశ్రమల్లోనూ దేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య అసమానతలున్నాయి. 1960లో ఆదాయపంపిణీ, జీవన స్థాయిలను గురించిన తన విశ్లేషణలో మహలనోబిస్ కమిటీ కూడా ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చింది. ఇటీవలి సంవత్సరాలలో పరిస్థితి క్షీణించింది. 10 శాతం బడుగువర్గాల వినియోగ వ్యయం 20 శాతం నుంచి 15-20 శాతాల మధ్యకు పడిపోగా ధనికవర్గాల వారి వినియోగ వ్యయం పెరిగింది. దీన్నిబట్టి ధనిక, బడుగు వర్గాల జీవన ప్రమాణాల మధ్య అగాధం మరింత పెరిగిందని తెలుస్తోంది. సంక్షేమ రాజ్యంలో ప్రాథమికావసరాలైన గృహవసతి, విద్య, వైద్య ఆరోగ్యసేవలు, ఆహారం, బట్ట, రక్షిత నీటిసరఫరా మొదలైన వాటిని అత్యధిక భాగం ప్రజలకు అందించటంలో ప్రభుత్వం విఫలమైందని తెలుస్తున్నది. పౌరసౌకర్యాలు, విద్యుచ్ఛక్తి సరఫరా, ఇతర అత్యవసర సౌకర్యాల కల్పనను నిర్లక్ష్యం చేసారు. ఫలితంగా మూడు దశాబ్దాల ప్రణాళికా విధానం తర్వాత కూడా పేదప్రజల జీవన ప్రమాణాలు పెరగలేదు.

## 24.3 దారిద్ర్యానికి నిర్వచనం

దారిద్ర్యాన్ని తగ్గించాలంటే ప్రభుత్వ విధానాల వల్ల లాభపడవలసిన పేదలను గుర్తించాలి. దరిద్ర్యాన్ని అనేక విధాలుగా నిర్వచించారు. పేదరికం తీవ్రత, దాని పరిమితి అనేవి దానికి మనమిచ్చే సరైన నిర్వచనాన్ని బట్టి ఉంటాయి.

### 24.3.1 తక్కువ స్థాయి తలసరి ఆదాయం

జాతీయ తలసరి ఆదాయాన్ని సాధారణంగా ప్రజల జీవన ప్రమాణాలను కొలిచేందుకు ఉపయోగిస్తారు. ఉదాహరణకు 1960-61 సంవత్సరంలో భారతదేశంలో జాతీయ తలసరి ఆదాయం రూ. 306.70 పైసలు. ఈ సగటు ఆదాయం కంటే తక్కువ ఆదాయం ఉన్న వారందర్నీ పేదవారుగా భావించారు.

సగటు జీవన ప్రమాణాన్ని కొలవడానికి తలసరి ఆదాయాన్ని ఉపయోగించటంలో కొన్ని పరిమితులున్నాయి. అలాగే పేదరిక స్థాయిని నిర్ణయించడానికి, తలసరి ఆదాయాన్ని ఉపయోగించటంలో పరిమితులున్నాయి. ఇది సామాన్యమైన సగటు సంపద కాబట్టి ఆదాయాల సంపిణీ గురించి ఇదేమీ చెప్పదు. మనదేశంలో లాగా పంపిణీ చాలా ఏటవాలుగా ఉన్నట్లయితే సగటు అనే పదానికి అర్థం ఉండదు. పేదరిక స్థాయి కొలతలనుగానీ, జీవన ప్రమాణాలలోని భేదాలను గానీ ఇది చూపలేదు. జాతీయాదాయం అంటే మొత్తం దేశం ఆదాయాన్ని చూపుతుంది. కానీ ఉత్పత్తి అవుతున్న వస్తువుల రకాలను గురించి కానీ, వాటి పంపిణీని గురించి కానీ ఏ సమాచారాన్నీ ఇవ్వదు.

### 24.3.2 తలసరి వినియోగ వ్యయం

జాతీయాదాయం అనేది ఎగుమతి చేసే వస్తువుల ధర, పెట్టుబడి, పెట్టుబడి కల్పనకు ఉపయోగించిన వస్తువుల విలువ, ప్రభుత్వ వ్యయంలతో కూడి ఉంటుంది. ఇది ప్రజల వాస్తవ జీవన స్థాయికి ప్రాతినిధ్యం వహించలేదు. వినియోగ వస్తువుల సరైన వినియోగ విలువను తెలుసుకోవాలంటే జాతీయాదాయం నుంచి పై వాటన్నిటినీ తీసివేయాలి. ఇలా తీసివేయగా మిగిలిన మొత్తాన్ని జనాభాతో భాగిస్తే తలసరి వినియోగ వ్యయం వస్తుంది. దండేకర్, రథ్ 1960-61 లో తలసరి వినియోగ వ్యయం ఈ విధంగా వేసారు.

| వస్తువు | రూ.లు (కోట్లలో) |
|---|---|
| మార్కెట్టు ధరలలో జాతీయ నికర ఉత్పత్తి | 14,328 |
| దిగుమతులు కలుపుకొని (ఎగుమతులను మినహాయించి) | 411 |
| నికర కుటుంబ ఖర్చుకి సమానమవుతుంది | 14,739 |
| నికర స్వదేశీ పెట్టుబడి ఏర్పాటును మినహాయించి | 1,665 |
| ప్రభుత్వ ఖర్చును మినహాయించి | 1,086 |
| ప్రైవేట్ వినియోగ వ్యయానికి సమాన మవుతుంది | 11,988 |

ఈ సంఖ్యను జనాభాతో భాగిస్తే తలసరి వినియోగ వ్యయం సంవత్సరానికి రూ. 276.30 పైసలని తేలింది. 1960-61 లో ఒక వ్యక్తికి ఒక రోజుకు వినియోగ వ్యయం 75 పైసలుగా అంచనా వేసారు. దీనికంటే తక్కువ వినియోగ వ్యయం ఉన్నవారిని పేదలుగా పరిగణించారు.

ఇది కూడా 'స్థూలా'నికి సంబంధించిన అంకె కావటంతో తలసరి ఆదాయంలో వలె ఈ పద్ధతిలో కూడా నష్టాలున్నాయి. దీనిలో ధనికుల విలాస వస్తువుల వినియోగం పేదవారి వినియోగం కలిపి ఉండటం వలన ఇది ధనికుల, పేదల వినియోగాలను వేరుచేయలేక విఫలమైంది. ఇది ఏ రకంగానూ దేశంలోని సగటు జీవన ప్రమాణానికి ప్రతిబింబం కాదు. ఫలితంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో నివసించే, వివిధ తరగతుల ప్రజలు వినియోగించే వస్తువుల రకాలు, ఉత్పత్తులను గురించి ఏ సూచనా ఇవ్వలేదు.

### 24.3.3 దారిద్ర్య రేఖ

1960 వ దశకం ప్రారంభంలో భారత ప్రభుత్వం ఒక నిపుణుల సంఘాన్ని నిర్వరచింది. ఈ సంఘం 1960-61 ధరల ప్రకారం వాంఛించదగిన జాతీయ కనీస వినియోగ వ్యయం స్థాయి తలకు నెలకు రూ. 20 అని అంచనా వేసింది. ప్రభుత్వం భరించాల్సిందిగా భావించే విద్య ఆరోగ్యాల ఖర్చును దీనితో కలపలేదు. ఈ సంఖ్య "దారిద్ర్యరేఖ"ను నిర్ణయించేందుకు పునాదిగా ఉంటూ వస్తోంది. దీనిని ఆధారంగా చేసుకొని 5 శాతం ప్రజలు ఈ వినియోగ స్థాయికి కూడా చేరుకోలేక భరించలేని పేదరికంతో ఉన్నారని అంచనా వేసింది.

### 24.3.4 దండేకర్, రథ్ ల అధ్యయనం

1971లో దండేకర్, రథ్ అనే ఇద్దరు ఆర్థికవేత్తలు మనదేశంలోని పేదరికం అసమానతలను గురించి అధ్యయనాన్ని చేపట్టారు. వీరు "దారిద్ర్యరేఖ"కు ప్రణాళికా సంఘం ఇచ్చిన నిర్వచనాన్ని ఏకపక్ష నిర్వచనంగా భావించారు. వీరు తలసరి వినియోగ వ్యయమైన రూ. 20 లకు, వారు పరిశీలిస్తున్న వినియోగ బాస్కెట్ స్వరూపానికి గానీ, అత్యవసర వస్తువుల ధరలతో గానీ సంబంధం లేదని పేర్కొన్నారు. ఫలితంగా ఈ రచయితలు ప్రజల భౌతిక జీవనానికవసరమైన ఆహారంలాంటి పైవారు చేసే వ్యయ రూపంలో నిరుపేదల జీవనస్థాయిని పేర్కొనాల్సిన అవసరాన్ని గుర్తించారు. వివిధ అవసరాలకు నిరుపేదలు చేసే ఖర్చును పరిశీలించి

వారి ఖర్చులో దాదాపు 75 నుంచి 80 శాతం వరకు ఆహారం పైననే అని కనుగొన్నారు. ఆ తరువాత వారు ప్రజలు తినే ఆహారంలో పోషక విలువలు తగినంతగా ఉన్నాయా, లేదా అనే విషయాన్ని పరిశీలించారు. వీరు ప్రజలు తీసుకునే ఆహారంలో కాలరీలు, దానికి వారు చేసే ఖర్చును ప్రజల జీవన స్థాయిగా వ్యాఖ్యానించారు. భారత పరిస్థితుల ప్రకారం ఒక వ్యక్తి రోజుకు 2,250 కాలరీల ఆహారం తీసుకోవాలని భావించారు. డబ్బు రూపంలో దీని విలువను సంవత్సరానికి రూ. 170 గా నిర్ణయించారు. గ్రామీణ ప్రజలలో దాదాపు మూడువంతుల మంది కనీసం ఈ స్థాయిలోనైనా వినియోగం చేయలేకపోతున్నారని వీరి అంచనా. పట్టణ వాసుల విషయంలో ఇది 271 రూ. దాదాపు 50 శాతం మంది పట్టణవాసులు దీనికన్నా దిగువన జీవిస్తున్నారు. అప్పుడు గ్రామీణ ప్రాంతాలలో పేదల సంఖ్య 100.4 మిలియన్లు కాగా, పట్టణ ప్రాంతాలలో 49 మిలియన్లు. పేదరికం స్థాయి చాలా ఎక్కువగా ఉందని గుర్తించారు.

మినహాస్, బీజా తదితరులు పేదరికం గురించి అధ్యయనాలు చేశారు. మినహాస్ ప్రజలలో 35 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారంటే, బీజా 70 శాతం పైగా ఉన్నారని లెక్కకట్టారు. 6 వ ప్రణాళిక చిత్తు ప్రతి (1978-83) లో మొత్తం జనాభాలో 48 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని అంచనా వేశారు. అంచనాలలోని ఈ భేదాలు, పేదరికాన్ని వివిధ మార్గాలలో నిర్వచించడం వల్ల ఏర్పడ్డాయి. అంచనాలు ఏమైనప్పటికీ అవి సమస్య తీవ్రతనూ, దారిద్ర్య పీడితులైన అత్యధిక ప్రజలనూ ప్రతిబింబిస్తాయి.

## మీ అవగాహనను పరీక్షించుకోండి

1. దారిద్ర్యరేఖ అంటే ఏమిటి?
2. ప్రజల జీవనప్రమాణ స్థాయిని ఏ విధంగా లెక్కిస్తారు?
3. తలసరి వినియోగవ్యయం అంటే ఏమిటి?

## 24.4 పేదరికానికి కారణాలు

పేదరికాన్ని విశ్లేషించటం చాలా చిక్కుతో కూడుకున్న విషయం. పేదరికం అనేక కారణాల ఫలితం, ఈ కారణాలను స్థూలంగా ఇలా విభజించవచ్చు.

(ఎ) చారిత్రక కారణాలు: ముందు పాఠాలలో బ్రిటిషు విధానాల వల్ల కలిగిన బాధాకర ఫలితాలను, ప్రత్యేకించి వస్త్ర పరిశ్రమలో అవి కలుగజేసిన ప్రభావాలను గమనించాము. బ్రిటిషు వస్తువుల దిగుమతివల్ల స్వదేశీ పరిశ్రమల నుంచి అనేకమంది ప్రజల్ని తొలగించారు. ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవటంతో వారు నిరాధారులైనారు.

(బి) అధికసంఖ్యలో జనాభా పెరుగుదల: వైద్య, ఆరోగ్య సౌకర్యాలు మెరుగుపడటంతో మరణాల సంఖ్య తగ్గి జనాభా సమస్యను పెంచింది. కుటుంబ నియంత్రణ, జననాలరేటు తగ్గుదల అవసరం. పరిమిత కుటుంబం లాభాలపట్ల మెలకువ ఉన్న ఉన్నతాదాయ వర్గాల వారికే కుటుంబ నియంత్రణ పరిమితమైయ్యింది. పేదప్రజలలో నిరక్షరాస్యత, సాంఘిక, మతకారణాల వల్ల జనాభా పెరుగుదల రేటు ఎక్కువగా ఉంది. ఇది పేదప్రజల సంఖ్య పెరగడానికీ, కష్టాలకూ దోహదం చేసింది.

(సి) అభివృద్ధిక్రమం: పై కారణాలతో పాటు దేశంలో అమలుజరుగుతున్న అభివృద్ధి పథం పరిస్థితిని క్షీణపరిచింది. మన మిశ్రమ ఆర్థికవ్యవస్థలో ఉత్పత్తి, వినియోగాలకు సంబంధించిన నిర్ణయాధికారం శక్తివంతులైన కొద్దిమంది చేతిలో కేంద్రీకృతమై ఉంది.

(డి) ఉత్పత్తి పద్ధతులలో లోపాలు: వినియోగ వస్తువులకు సంబంధించి ఏ వస్తువులను ఉత్పత్తి చేయాలి, ఏ పద్ధతిలో ఉత్పత్తిచేయాలి అన్న నిర్ణయాలను గురించి పంచవర్ష ప్రణాళికలు పట్టించుకోక పోవటంతో

"లాభంపొందే" పరిశ్రమల్లోనే పెట్టుబడి పెట్టేందుకు ధనికవర్గాలవారు ఇష్టపడ్డారు. ఈ పరిశ్రమలు వారి అవసరాలను తీర్చే విలాస వస్తువులను తయారుచేసేవి. దీనితో వనరులన్నీ విలాసవస్తువుల ఉత్పత్తివైపు మళ్లి ఆదాయ, వినియోగాల మధ్య పెద్ద ఎత్తున అసమానతలకు కారణమైనాయి. ఆర్థిక, భౌతిక ఉత్పత్తి కారకాలన్నీ ఈ రకంగా ధనవంతులకు విలాసవస్తువులను సమకూర్చటంలో నిమగ్నమయ్యాయి. అధికభాగం ప్రజల కనీస అవసరాలను తీర్చే రంగాలకు చాలా తక్కువ వనరులు ఉండటంతో వీరి అవసరాలను నిర్లక్ష్యం చేసారు. ఉత్పత్తి ఖర్చులో ఆదాచేసే యంత్రాలద్వారా ఉత్పత్తిచేసే పద్ధతులను ఉపయోగించటము వల్ల ఉద్యోగావకాశాలు తగ్గి నిరుద్యోగం పెరిగి మరింత దారిద్ర్యానికి దారితీసింది.

(ఇ) నిరుద్యోగ సమస్య: నిరుద్యోగ సమస్య జటిలం కావడం కూడా పేదరికానికి ఒక ప్రధాన కారణం. ఈ రెండింటికీ ధనాత్మక (positive) సంబంధం వుంది. మన ఆర్థికాభివృద్ధి దేశంలోని మొత్తం శ్రామిక సంఖ్యకు ఉపాధి సౌకర్యాలను కల్పించే స్థితిలో లేదు.

## 24.5 పేదరికాన్ని నిర్మూలించే పద్ధతులు

నానాటికీ పెరుగుతున్న పేదరికాన్ని గుర్తించి దాన్ని అదుపులో పెట్టడానికి, రూపుమాపడానికి విధానాలను రూపొందించారు. ప్రణాళికలు పరిష్కారమార్గాలను సూచించడం మొదలుపెట్టాయి. 5వ పంచవర్ష ప్రణాళికలో "గరీబీహటావో" (పేదరికాన్ని అణగదొక్కండి) అనే నినాదాన్ని ఇచ్చారు. సాంఘిక న్యాయసూత్రాల అభివృద్ధిని లక్ష్యంగా తీసుకున్నారు. ఒకవైపు అసమానతల తగ్గింపునూ, మరోవైపు అభివృద్ధిరేటును పెంచవలసిన అవసరాన్ని గురించీ ప్రణాళికలు వక్కాణించాయి.

"గరీబీహటావో" అన్న తలంపు కాగితంపైనే మిగిలిపోవటంతో ఈ ప్రణాళిక తన లక్ష్యాన్ని సాధించడంలో విఫలమైంది. అడుగున వున్న 30 శాతం ప్రజల అభివృద్ధిరేటును పెంచేందుకు పైన ఉన్న 5 శాతం వారి పూర్తి వినియోగాన్ని అదుపులో పెట్టాలనీ, తరవాత ఉన్న 25 శాతం వారి పెరుగుతున్న వినియోగాన్ని తగ్గించాలనీ "అమలు ప్రణాళిక" (అప్రోచ్ప్లాన్) కోరింది. అయినప్పటికీ ఉత్పత్తి క్రమంలో కానీ, విలాసవస్తువులు, అవసరాలు తీర్చుకొని వినియోగవస్తువుల పంపిణీలో కానీ ఏ మార్పూలేదు. ప్రణాళికా విధానాలను రూపొందించటం కానీ పైన ఉన్న 30 శాతం మంది వినియోగాన్ని తగ్గించి ఆ మొత్తాన్ని అడుగున ఉన్న 30 శాతం మందికి పంపిణీ ఎలా చేయాలో చెప్పలేదు. ఫలితంగా కార్యక్రమం కేవలం సిద్ధాంతంగా మిగిలి, నినాదం సారంలేకుండా మిగిలిపోయింది. 5వ ప్రణాళిక తుదిరూపంలో పేదరికం తొలగింపును పక్కనపెట్టి పాతప్రణాళిక విధానాన్ని తిరిగి ప్రతిష్ఠించారు. ఆరవ, ఏడవ ప్రణాళికలు సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం వంటి కొన్ని చర్యలను అమలు పరచడం ద్వారా పేదరికాన్ని తగ్గించగలిగాయి.

మంత్రదండాన్ని ఉపయోగించో, సంపదను తిరిగి పంపిణీ చేసో పేదరికాన్ని తక్షణం రూపుమాపలేము. సంపద, ఆస్తులను పెద్ద ఎత్తున తిరిగి పంపిణీ చేసినప్పటికీ సామర్థ్యం, సాంకేతిక విజ్ఞానం కొద్దిమంది దగ్గరే ఉండి మరలా అసమానతలు ఏర్పడతాయి.

## 24.6 సారాంశం_ముగింపు

ఈ భాగంలో పేదరికమనే భావనను, భారతదేశంలో పేదరిక సమస్య ఏ విధంగా ఉందనే విషయాన్ని తెలుసుకున్నాం. దారిద్ర్యరేఖకు దిగువభాగాన ఉన్న జనాభాను అంచనావేయడానికి ప్రజల జీవనప్రమాణ స్థాయినీ, తలసరి వినియోగ వ్యయాన్నీ ఆధారంగా తీసుకోవచ్చు. ప్రస్తుతం, అధికార అంచనాల ప్రకారం భారతదేశంలో 35 శాతం ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. పేదరికం ఏర్పడడానికి గల కారణాలలో ముఖ్యమైన వాటిని చెప్పాలంటే చారిత్రక కారణాలు, జనాభా పెరుగుదల, అసమానతలతో కూడిన అభివృద్ధి

మొదలైనవి మనకు ప్రధానంగా గోచరిస్తాయి. భారతదేశంలో పేదరికాన్ని తగ్గించడానికి ప్రభుత్వం అనేక చర్యలను చేపడుతూనే ఉంది. ఈ శతాబ్దాంతానికి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న జనాభాను కనీసం 10 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం భావిస్తున్నది.

\- ప్రభావంత్.

## 24.7 సంప్రదింపు గ్రంథాలు


1. Datt and Sundaram : Indian Economy.
2. Dandekar and Rath : Poverty in India.
3. Misra and Puri : Indian Economy.


## 24.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I *కింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో జవాబులు రాయండి.*

1. దారిద్ర్యరేఖ అంటే ఏమిటి? భారతదేశంలో దాని స్వభావాన్ని పరిమాణాన్ని వివరించండి.
2. పేదరికం అంటే ఏమిటి? పేదరికం ఏర్పడడానికి గల కారణాలను వివరించండి.

II *కింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులు రాయండి.*

1. దారిద్ర్యరేఖ అంటే ఏమిటి? భారతదేశంలో దాని పరిమాణాన్ని తెలపండి.
2. భారతదేశంలో పేదరికం (దారిద్ర్యం) ఏర్పడడానికి గల కారణాలను తెలపండి.

BRAOU

# భాగం — 25: భారతదేశంలో నిరుద్యోగ సమస్య

విషయక్రమం


25. 0 లక్ష్యాలు, ఉద్దేశాలు
25. 1 పరిచయం
25. 2 నిరుద్యోగమనే పదానికి అర్థం
    25.2.1 స్వచ్ఛంద నిరుద్యోగం
    25.2.2 తమంతట తానే ఏర్పడు నిరుద్యోగం
25. 3 ప్రణాళికలో ఉద్యోగితా కల్పనకు ఉన్న ప్రాముఖ్యత
25. 4 నిరుద్యోగంలో రకాలు
    25.4.1 ప్రచ్ఛన్న నిరుద్యోగం
    25.4.2 కాల సంబంధ నిరుద్యోగం
    25.4.3 సాంకేతిక నిరుద్యోగం
    25.4.4 వ్యక్తీయ నిరుద్యోగం
    25.4.5 ఫ్రిక్షనల్ నిరుద్యోగం
    25.4.6 దీర్ఘకాలిక లేక ప్రత్యక్ష నిరుద్యోగం
25. 5 అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల నిరుద్యోగంలో భేదాలు
25. 6 నిరుద్యోగిత గణన
    25.6.1 కాల పద్ధతి
    25.6.2 ఆదాయ పద్ధతి
    25.6.3 ఉత్పాదకతా పద్ధతి
    25.6.4 సమ్మతి పద్ధతి
25. 7 రతదేశంలో నిరుద్యోగితా పరిమాణం
    25.7.1 పారిశ్రామిక నిరుద్యోగం
    25.7.2 విద్యావంతుల నిరుద్యోగం
25. 8 నిరుద్యోగ నిర్మూలనా పద్ధతులు
25. 9 ఉద్యోగావకాశాలు పెరిగేందుకు కావలసిన పూర్వ పరిస్థితులు
25.10 సారాంశం/ముగింపు
25.11 సంప్రదింపు గ్రంథాలు
25.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 25.0 లక్ష్యాలు, ఉద్దేశాలు

భారతదేశంలో నిరుద్యోగితా భావనలు, రకాలు, స్వభావం, తీవ్రత గురించి; నిరుద్యోగ సమస్య పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలను గురించి అధ్యయనం చేయడం ఈ భాగం లక్ష్యం.

ఈ భాగం చదివిన తర్వాత, మీరు

★ నిరుద్యోగ సమస్యకు సంబంధించిన వివిధ భావనలను గుర్తించ గలరు.

★ సంపూర్ణ ప్రణాళికలో ఉద్యోగావకాశాల పెంపుదలకు ఇచ్చిన ప్రాధాన్యతను తెలుసుకుంటారు.

BRAOU

* ★ ప్రచ్ఛన్న నిరుద్యోగితను పటం సహాయంతో వివరించగలరు.
* ★ అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలలోని నిరుద్యోగితా స్వభావంలో గల తారతమ్యాలను గుర్తించగలరు.
* ★ నిరుద్యోగ సమస్యను లెక్కించడంలో వాడే వివిధ పద్ధతులను వివరించగలరు.
* ★ భారతదేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రతను తెలుపగలరు.
* ★ భారతదేశంలో నిరుద్యోగ సమస్యను నిర్మూలించడానికి అనుసరించిన విధానాలను సమీక్షించగలరు.

## 25.1 పరిచయం

ఏ ఆర్థిక వ్యవస్థకైనా నిరుద్యోగం ఒక తీవ్ర సమస్య. సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ ఈ సమస్యా పరిష్కారానికి శ్రద్ధ పెరిగింది. మూడవ ప్రపంచ దేశాల్లోని కోట్ల మంది ప్రజలు ఎక్కువగా ఈ సమస్యతో బాధపడుతున్నారు. ఈ సమస్య విద్యావంతులైన ప్రజలలో కలతను, ఆందోళనను కలుగ చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఇది శాశ్వత బాధగా పరిణమించింది. (1) నిరుద్యోగ సమస్య మానవ శ్రమ ఎంత వ్యర్థమవుతున్నదో చెప్పే కొలతగా ఉంది. ఈ అర్థంతో చూస్తే, నిరుద్యోగమంటే పనిలేక వ్యర్థంగా గడిచిపోయిన రోజులు తప్ప మరేం కాదు. దీన్నే ఇంకో మాటలో చెప్పాలంటే ఉత్పత్తి కార్యక్రమానికి ఉపయోగపడే మానవ శ్రమ పనికొరత వల్ల వ్యర్థం అయిపోయిందని అర్థం. ఫలితంగా ఇది ఉద్యోగావకాశాలు లేక మరుగు పడ్డ ఉత్పత్తి కారకంగా మిగిలిపోయింది. (2) ఆదాయ పంపిణీలో భాగం పొందేందుకు ఉద్యోగం ఒక సాధనం. పనిచేసే ఆదాయం సంపాదించుకునే అవకాశం కల్పించటంలో విఫలతను ఇది చూపుతుంది. (3) ప్రభుత్వం తన పరిమిత వనరులను విద్యపై ఖర్చుపెడుతుంది. చదువుకున్న యువతరంలో నిరుద్యోగం ఉండటం దేశానికీ, జాతికీ నష్టం. (4) దీర్ఘకాల నిరుద్యోగం మనిషిలో ఆత్మగౌరవాన్నీ, హుందాను నాశనం చేస్తుంది. ఇది మనిషిలో ఆందోళనను సృష్టించి చివరకు పనికి రాని వానిని చేస్తుంది. నిరుద్యోగం వల్ల కుటుంబంలోనూ, ప్రజల మధ్య ఉద్రిక్తతలను సృష్టిస్తుంది. ఇది ప్రజలను మామూలు సాంఘిక కార్యక్రమాలు, విధుల పట్ల విముఖులుగా చేస్తుంది. నిరుద్యోగం ప్రజలను తమ స్థితిని మెరుగు పరుచుకునేందుకు ఉద్దేశపూర్వకంగా హింసాత్మక చర్యలు జరిపేటట్లు చేస్తుంది.

ఈ కారణాల వల్ల ఆర్థిక వ్యవస్థ ఎంత బాగా పనిచేస్తుందో తెలిపేందుకు నిరుద్యోగం ఒక సూచికగా పనిచేస్తుంది.

## 25.2 నిరుద్యోగం అనే పదానికి అర్థం

నిరుద్యోగాన్ని స్వచ్ఛంద నిరుద్యోగం, తనంతట తానే ఏర్పడే నిరుద్యోగం అని రెండు రకాలుగా తెలుపవచ్చు.

### 25.2.1. స్వచ్ఛంద నిరుద్యోగం

కొంత మంది వ్యక్తులు వివిధ కారణాలవల్ల తమ ఉద్యోగాలనుండి విరమించుకోవటం వల్ల ఏర్పడే నిరుద్యోగాన్ని స్వచ్ఛంద నిరుద్యోగం అంటారు. ఆ కారణాలలో కొన్ని: (1) అదృష్టం కలిసి రావటం వల్ల ఉద్యోగం చేసి సంపాదించుకోవాల్సిన అవసరం లేకపోవటం, లేక పెద్ద మొత్తంలో పిత్రార్జితం ఉండి చాలా కాలం వరకూ జీవనోపాధికి తడుముకోవాల్సిన అవసరం లేక పోవటం, (2) కొంతమంది ప్రజల సాంఘిక కట్టుబాట్లు వారిని ఉత్పత్తి కార్యక్రమంలో నిమగ్నమవనివ్వటం లేదు. (3) సోమరితనం, మూర్ఖపు పట్టుదలలు కూడా స్వచ్ఛంద నిరుద్యోగానికి కారణాలు. స్వచ్ఛంద నిరుద్యోగం అంతగా పట్టించుకోవలసింది కాదు. దీన్ని గురించి ఇక్కడ పెద్దగా చర్చించటం మన ఉద్దేశ్యం కాదు.

## 25.2.2. తనంతటతానే ఏర్పడే నిరుద్యోగం

తనంతట తానే ఏర్పడే నిరుద్యోగం ముఖ్యమైనది. ప్రజలు పని కావాలని కోరినప్పటికీ రోజుల తరబడి, వారాల తరబడి, నెలల తరబడి, సంవత్సరాల తరబడి కూడా తగినన్ని అవకాశాలు లేక ఏర్పడే నిరుద్యోగంగా దీన్ని వర్ణించవచ్చు. నిరుద్యోగం అనే పదాన్ని ఈ అర్థంలో వాడటమే సరైంది. కాబట్టి నిరుద్యోగం అంటే పని చేయడానికి ఇష్టపడినప్పటికీ ఏ ఉత్పత్తి కార్యక్రమంలోనూ ఉద్యోగావకాశం లేని పరిస్థితి అని నిర్వచించవచ్చు.

### మీ అవగాహనను పరీక్షించుకొండి — 1

1. ప్రచ్ఛన్న నిరుద్యోగం అంటే ఏమిటి?
2. తనంతట తామగా ఏర్పడే నిరుద్యోగం అంటే ఏమిటి?

## 25.3 ప్రణాళికలలో ఉద్యోగావకాశాల కల్పనకు గల ప్రాముఖ్యత

ప్రణాళికల ప్రారంభం నుంచి ఇటీవలి ప్రణాళిక వరకూ భారత ప్రణాళికలన్నిటికి ఉద్యోగావకాశాల కల్పన ప్రధాన లక్ష్యంగా ఉంది. ప్రణాళికలలో పేర్కొన్న లక్ష్యాలనుంచి దీన్ని గమనించవచ్చు. ఉదాహరణకు, మొదటి పంచవర్ష ప్రణాళికలో "దేశంలో ఊరికే ఉన్న మానవశక్తిని పూర్తిగా వినియోగించుకోవాలన్నది ప్రధానమైన లక్ష్యం, అభివృద్ధి పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగావకాశాల కల్పనకు ప్రతివారూ ప్రయత్నం చేయాలి" అని పేర్కొన్నారు. రెండవ పంచవర్ష ప్రణాళికలో "ఆర్థిక సాంఘిక దృష్టితో చూస్తే ఉద్యోగావకాశాల విస్తరణ లక్ష్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి" అని పేర్కొన్నారు. నాల్గవ ప్రణాళికలో "ఈ ప్రణాళిక ముఖ్య లక్ష్యం గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఎప్పటికీ పెరిగే విధంగా ఉద్యోగావకాశాలను కల్పించడం" అని చెప్పారు. ఆరవ ప్రణాళికలో "నిరుద్యోగ సమస్యను తగ్గించలేక పోవటం వల్ల సాధించిన అభివృద్ధి అంతా మరుగున పడిపోయింది. దీనివల్ల తర్వాత రెండు ప్రణాళికల్లోనూ నిరుద్యోగాన్ని రూపు మాపేందుకు గట్టి ప్రయత్నం చేయాల్సి వస్తుంది" అని చెప్పారు. ఏడవ పంచవర్ష ప్రణాళికలో కూడా ఈ సమస్య పరిష్కారానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు.

BRAOU

## 25.4 నిరుద్యోగంలో రకాలు

నిరుద్యోగంలో ఆరు రకాలున్నాయి.

(ఎ) ప్రచ్ఛన్న నిరుద్యోగం
(బి) కాల సంబంధ నిరుద్యోగం
(సి) సాంకేతిక నిరుద్యోగం
(డి) చక్రరూప నిరుద్యోగం లేదా చక్రీయ నిరుద్యోగం
(ఇ) ఘర్షణ వల్ల ఏర్పడే నిరుద్యోగం
(ఎఫ్) దీర్ఘకాల, లేక తిరుగులేని నిరుద్యోగం

### 25.4.1 ప్రచ్ఛన్న నిరుద్యోగం (Disguised Unemployment)

"ప్రచ్ఛన్న నిరుద్యోగం" అనే పదాన్ని మొదటి సారిగా శ్రీమతి జాన్ రాబిన్‌సన్ ఉపయోగించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో నిరుద్యోగాన్ని గురించి వర్ణించే సమయంలో ఆమె ఈ మాట వాడారు. ఆర్థిక మాంద్యం

సమయంలో సరైన డిమాండు లేక కార్మికులు మామూలు ఉద్యోగాల నుంచి తక్కువ ఉత్పాదకత గల చిన్న ఉద్యోగాలను చేపట్టే పరిస్థితిని "ప్రచ్ఛన్న నిరుద్యోగం"గా నిర్వచించారు. ఈ సమస్యను తన విధానంతో ఆమె 'ప్రచ్ఛన్న నిరుద్యోగం" అనే ఈ సాధారణ విషయాన్ని పారిశ్రామిక రంగానికే పరిమితం చేశారు. వ్యవసాయ ప్రధానమైన ఆర్థిక వ్యవస్థలో ఉన్న శ్రమశక్తి మిగులును గురించి వివరించటానికి ఈ పదాన్ని ఇప్పుడు విరివిగా వాడుతున్నారు. ఉత్పత్తి కార్యక్రమం నుంచి కొంత మంది కార్మికులను తొలగించినా ఉత్పత్తిలో మార్పు ఉండని పరిస్థితి ప్రచ్ఛన్న నిరుద్యోగంగా నిర్వచించారు. ఇంకోరకంగా చెప్పాలంటే కొంతమంది కార్మికులను తమ వృత్తి నుంచి తొలగించినా ఉత్పత్తిలో మార్పుకాని, తగ్గుదలకాని ఉండని పరిస్థితిలో ప్రచ్ఛన్న నిరుద్యోగం ఉంటుంది. దూరదృష్టిలో అదనపు ఉత్పాదకత ఏమీ లేకపోతే దాన్ని ప్రచ్ఛన్న నిరుద్యోగానికి మూలమని నర్క్స్ (Nurkse) తన సాంకేతిక పరిభాషలో చెప్పారు. ఈ అదనపు ఉత్పాదకతను కొలిచే విషయంలో వివిధ విధానాలకూ, ఆలోచనలకూ చెందిన ఆర్థిక శాస్త్రవేత్తల మధ్య ఏకాభిప్రాయం లేదని ఇక్కడ మనం గమనించాలి. ఫలితంగా ఈ సమస్యకు సంక్షిప్త నిర్వచనాలివ్వటం కాక అదనపు ఉత్పాదకత సమాచారాన్ని చూడాలి.

ప్రచ్ఛన్న నిరుద్యోగం గురించి ఒక అభిప్రాయానికి రావాలంటే కొంత గందరగోళం ఉందని అమర్త్యసేన్ (Amartya Sen) భావించారు. "శ్రమకూ, శ్రామికులకూ మధ్య భేదాన్ని చూపకపోవటం వల్ల ఈ గందరగోళం ఏర్పడుతుంది" సేన్ భావించారు. ఉత్పత్తి కార్యక్రమంలో చాలా ఎక్కువ శ్రమ ఖర్చవుతుందని కాదు దాని ఎక్కువ మంది శ్రామికులు పనిచేస్తున్నారు. సాధారణంగా ప్రచ్ఛన్న నిరుద్యోగం అంటే సంవత్సరంలో శ్రామికుల పనిగంటల తగ్గింపు అని అంటారు. ఉదాహరణకు ముగ్గురు అన్నదమ్ములు ఒక గ్రామ కార్యాలంటే మూడు రోజులకొకసారి ఒక్కొక్కరి వంతు వస్తుంది. ఈ విధంగా చూస్తే శ్రామికుడి అదనపు ఉత్పాదకత, ఇంకా వివరంగా చెప్పాలంటే: ఎక్కువ పరిధిలో చూస్తే అదనపు ఉత్పాదకత లేదు. శ్రమ ఉత్పాదకత అదనంగా ఏమీ లేదని చెప్పనక్కర్లేదు. పని తేలిక తీసుకునే వారి విషయంలో తక్కువ తీవ్రతతో కూడిన పనిగా కూడా ఉండవచ్చు. ఉదాహరణకు, రైతు పొలంలో పనిచేసేటప్పుడు నష్టాలను గమనించే సమయం. ఎక్కువ మంది శ్రామికులు చెప్పినట్లే, మిగిలినవారు ఎక్కువ కాలం కష్టపడి పనిచేసే అంతే ఉత్పత్తిని సాధించగలుగుతారు. రైతు కుటుంబాల ఆర్థిక వ్యవస్థలో నిరుద్యోగం సహజంగా ప్రచ్ఛన్నంగానే ఉంటుంది. ఇద్దరు పూర్తిగా సాగు చేయగలిగినంత భూమి మీద నలుగురు పని చేయాల్సి రావచ్చు. ఒక కుటుంబంలో నలుగురు పనిచేసే వారుండి వారిలో ఏ ఒక్కరికీ ఇతర ఉద్యోగావకాశాలు లేకపోతే ఆ భూమి ఇద్దరు మాత్రమే పూర్తిగా సాగు చేయగలిగేంత అయినప్పటికీ వారందరూ ఆ భూమిపైనే బతుకుతారు. OC గంటల పనికి OA మంది శ్రామికులు రోజంతా పని చేయాలనుకుందాం. మొత్తం శ్రామికులతో భాగిస్తే ఒక్కొక్కరు ఎన్ని గంటలు పని చెయ్యాలో తెలుస్తుంది. OC పని గంటలతో శ్రమ అదనపు ఉత్పాదకత అంటూ ఏమీ ఉండదు. శ్రమ "C" పాయింటుని దాటి వెళ్ళలేదు.




పటం: 25.1

పని గంటలను పెంచకుండానే OA శ్రామికులు మొత్తం పనిని చేయగలగటం వల్ల, AB మిగులు శ్రామికులు, వర్ల అదనపు ఉత్పాదకత AB పరిధిపై ఏమీ చేయదు. ఇది ప్రచ్ఛన్న నిరుద్యోగ పరిమాణాన్ని చూపిస్తుంది.

ప్రచ్ఛన్న నిరుద్యోగం, తక్కువ ఉద్యోగం విషయంలో గందరగోళంగా ఉంది. కనుక ఇచ్చిన వేతనం ప్రకారం శ్రామికులు పని చేయాల్సిన పనిగంటలను, వారు వాస్తవంగా పనిచేసే గంటలతో పోలిస్తే వారు వాస్తవంగా పనిచేసే గంటలకు తక్కువ ఉద్యోగంగా నిర్వచించవచ్చు. ఇంకో విధంగా చెప్పాలంటే ఇచ్చిన వేతనం ప్రకారం కార్మికులు చేయాల్సిన గంటల వారు వాస్తవంగా పనిచేసే గంటల మధ్య అంతరాన్ని తక్కువ ఉద్యోగం అంటారు. తాము బతకటానికి అవసరమయ్యే దానికన్నా తక్కువ వేతనానికి కూడా కార్మికులు పనిచేసేందుకు సిద్ధపడితే తక్కువ ఉద్యోగం ఉన్నట్లు లెక్క. ఎక్కడైతే కొంతమంది కార్మికులు పని నుంచి తప్పుకున్నా మొత్త ఉత్పత్తి క్షీణించదో అక్కడ ప్రచ్ఛన్న నిరుద్యోగం ఉంటుంది.

ప్రచ్ఛన్న నిరుద్యోగం, చిన్న ఉద్యోగాలను రెండింటినీ ఒకే పటంలో చూపించవచ్చు. పటం 25.2లో ఈ పరిస్థితిని చూడవచ్చు. జీవనానికి సరిపోయే వేతన స్థాయిని QWS గాను, శ్రామికుల ఉద్యోగావకాశాల స్థాయిని OA గాను ప్రమాణంగా తీసుకోవచ్చు. ఏదైనప్పటికీ శ్రమ సరఫరా OD అయితే, అందరూ పనిలో ఉంటే AB యూనిట్లు తక్కువ ఉద్యోగంగానూ, BD యూనిట్లు ప్రచ్ఛన్న నిరుద్యోగంగానూ ఉంటాయి.




పటం: 25.2
క్యూ.డబ్ల్యు.ఎస్. సరిపడిన వేతనం
ఎ.బి. తక్కువ ఉద్యోగానికి యూనిట్లు
బి.డి. ప్రచ్ఛన్న నిరుద్యోగానికి యూనిట్లు

## 25.4.2 ఋతు సంబంధ నిరుద్యోగం (Seasonal Unemployment)

వ్యవసాయంలో కొన్ని ఋతువుల్లో పని ఎక్కువగానూ, కొన్ని ఋతువుల్లో పని తక్కువగానూ ఉండటం సామాన్య లక్షణం. వ్యవసాయంలో ఋతువులను, విత్తనాలను విత్తినప్పటినుంచి పంటకోసే వరకు ఉన్న సమయంలో చూడవచ్చు. వ్యవసాయంలో వాతావరణానికి సంబంధించిన విషయాలు ముఖ్య పాత్ర వహిస్తాయి. ఒక సమయంలో ఎక్కువ పని ఉండటం మరో సమయంలో తక్కువ పని ఉండటం వ్యవసాయంలో ఉద్యోగావకాశాల క్రమాన్ని దెబ్బ తీస్తుంది. ఒక సమయంలో పొలంలో చేయాల్సిన పని ఉండదు. ఫలితంగా ఇది బలవంతపు నిరుద్యోగానికి దారి తీస్తుంది. ఇంకోవైపు వాతావరణ, ప్రకృతి కారణాల వల్ల రైతులు పనిని త్వరగా పూర్తి చేసేందుకు మామూలు సమయం కన్నా ఎక్కువ సమయం పని చేయాల్సి వస్తుంది. పని ఎక్కువగా ఉండని ఋతువుల్లో నిరుద్యోగాన్ని కాల సంబంధ నిరుద్యోగం అంటారు. దీనివల్ల వ్యవసాయంలోని శ్రమశక్తి మందకొడి ఋతువు వల్ల వ్యర్థమవుతుంది.

## 25.4.3 సాంకేతిక నిరుద్యోగం (Technical Unemployment)

ఉత్పత్తి పద్ధతుల్లో మార్పుల వల్ల ఈ రకం నిరుద్యోగం ఏర్పడుతుంది. ఉత్పత్తి పద్ధతుల్లో మార్పులు అంటే

శామికులను ఆదా చేసే విధంగా యాంత్రికీకరణను ప్రవేశపెట్టడమన్న మాట. అంటే అప్పటికి ఉన్న ఉత్పత్తులను కాదని కొత్త ఉత్పత్తులు పెంచటం. శ్రమను ఆదా చేసే పద్ధతిని ప్రవేశపెట్టిండం వల్ల ఒక కార్మికుడు తన ఉద్యోగం నుంచి మారవలసి వస్తుంది. అలాంటిమార్పు జరిగినప్పుడు ఒక పనిలో ఎక్కువ నైపుణ్యం సంపాదించిన కార్మికుడు ఇంకో పనికి పనికిరాడు. పాత పనివారు, తక్కువ చదువుకొన్న వారు కొత్త ఉద్యోగాలను పొందలేరు. ఈ రకమైన నిరుద్యోగాన్ని సాంకేతిక నిరుద్యోగం అంటారు.

## 25.4.4. చక్రీయ నిరుద్యోగం

వ్యాపారంలో హెచ్చు తగ్గుల చక్రం ఆధునిక పారిశ్రామికీకరణలో ఒక శాశ్వత లక్షణమైంది. గొప్ప పారిశ్రామిక కార్యకలాపాలు జరిగిన కాలంతో పాటు సాధారణ వ్యాపార మాంద్యం ఉండే కాలం కూడా ఉంటుంది. వాస్తవమైన సమయను అనుసరించిన వేగంగా విస్తరణ జరిగిన కాలం తర్వాత హెచ్చు తగ్గులు పునరావృతమవుతుంటాయి. సరైన డిమాండు లేకపోవటం చక్ర రూపంలో ఉండే హెచ్చు తగ్గులకు మూల కారణం. క్రమ విరామంతో ఉండే వ్యాపార చక్రాలవల్ల వచ్చే నిరుద్యోగాన్ని చక్ర రూపంలో ఉండే నిరుద్యోగం అంటారు. ఈ వ్యాపార చక్రాల వల్ల ఎక్కువగా నష్టపోయేది పెట్టుబడి వస్తువులు, విరామకాలంలో ఉత్పత్తి, అమ్మకాలు తక్కువైతే, వ్యాపారస్తులు ఉత్పత్తాగారాలు తమ శక్తికన్నా చాలా తక్కువగా పని చేస్తున్నట్లు కనగొంటాడు. అందువల్ల కొత్త యంత్రాలపైన, పరికరాలపైన పెట్టుబడి పెట్టి వాటి శక్తిని పెంచేందుకు ఎక్కువ ఉత్సాహం చూపరు.

## 25.4.5 ఫ్రిక్షనల్ నిరుద్యోగం (Frictional Unemployment)

మార్కెట్‌లో అపరిపక్వతల వల్ల ఎప్పుడూ ఉండే నిరుద్యోగం మొత్తాన్ని ఫ్రిక్షనల్ నిరుద్యోగం అంటారు. మార్కెట్‌లో సరైన విజ్ఞానం, కదలిక ఉంటే ఒక కార్మికుడు ఒక పనిని వదిలిన వెంటనే మరొక పనిలో చేరతాడు. వాస్తవంలో ఇంకొక పనిఉన్నా అది అతడికి తెలియడానికి కొంత సమయం పడుతుంది. సరైన సమాచారం లేకపోవటం, అందుబాటులో ఉన్న ఉద్యోగాల మీద నమ్మకం లేక, ఒక వృత్తి నుంచి మరో వృత్తి, ఒక పరిశ్రమ నుంచి మరొక పరిశ్రమకూ మారే ఖర్చుల వల్ల తాత్కాలికంగా ఏర్పడే నిరుద్యోగాన్ని ఫ్రిక్షనల్ నిరుద్యోగం అంటారు.

## 25.4.6 దీర్ఘ కాలిక లేక ప్రత్యక్ష నిరుద్యోగం (Open unemployoment)

సంవత్సరం పొడుగునా, లేక ఎక్కువ కాలం ప్రజలు ఉద్యోగావకాశాలు లేక నిరుద్యోగులుగా ఉండే పరిస్థితిని దీర్ఘకాలిక నిరుద్యోగం అంటారు.

---

### మీ అవగాహనను పరీక్షించుకొండి — 2

3. ప్రచ్ఛన్న నిరుద్యోగం అంటే ఏమిటి?
4. సాంకేతిక నిరుద్యోగం అంటే ఏమిటి?
5. చక్రరూపంలో ఉండే నిరుద్యోగం అంటే ఏమిటి?
6. దీర్ఘ కాలిక నిరుద్యోగం అంటే ఏమిటి?

---

## 25.5 అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లోని నిరుద్యోగంలో భేదాలు

అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో నిరుద్యోగ స్వభావంలో తేడా ఆర్థిక వ్యవస్థల నిర్వహణ పద్ధతిలో తేడాల వల్ల ఏర్పడుతుంది. సాధారణంగా అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి ప్రమాణం వేతనాలు పొందే కార్మికుల స్థిరమైన శ్రమ కాగా, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో ప్రధానంగా కుటుంబ సభ్యుల శ్రమ



BRAOU

మీద ఆధారపడే కుటుంబం ప్రమాణంగా ఉంటుంది. ఫలితంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నిరుద్యోగ సమస్య కనపడనిది గానూ, ప్రచ్ఛన్నంగానూ ఉంటే అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది పైకి కనపడేదిగానూ, దీర్ఘ కాలిక నిరుద్యోగంగానూ ఉంది.

అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల నిరుద్యోగం గురించి కెనిషియన్ (Keynesian) మాటలో కొన్ని విభేదాలున్నాయి. మొదటిది: అభివృద్ధి చెందిన దేశాల్లో నిరుద్యోగం చక్రరూపం లక్షణంతో ఉన్నది. కాబట్టి అది తాత్కాలికమైనది. మంచి డిమాండు పెరగగానే పెట్టుబడి పునరుద్ధరించబడి, తీసేసిన కార్మికులందర్నీ తిరిగి పనులలోకి పిలుస్తారు.

రెండవది: అభివృద్ధి చెందిన దేశాల్లో చిన్న ఉద్యోగాలల్లో బలవంతంగా వచ్చిన కార్మికుల అదనపు ఉత్పాదకత తక్కువగా ఉంటుంది. కానీ ఏ మాత్రం లేకుండా ఉండదు. అదే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అయితే అదనపు ఉత్పాదకత ఏమీ ఉండదు.

మూడవది: కార్మికులు ఒక పనినుంచి మరొక పనిలోకి మారటానికీ, ప్రచ్ఛన్న నిరుద్యోగానికీ సంబంధం లేదు.

నాల్గవది: అభివృద్ధి చెందిన దేశాలలో అసలు ఉద్యోగాలనుండి తొలగించిన కార్మికులను తేలికగా గుర్తించవచ్చు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రచ్ఛన్న నిరుద్యోగానికి సరైన వారిని గుర్తించలేము.

ఐదవది: అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ సమస్య తగినంత డిమాండు లేక ఏర్పడితే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ సమస్య ప్రాథమికంగా ప్రతిభావంతమైన సరఫరా కొరత వల్ల ఏర్పడుతుంది.

## 25.6 నిరుద్యోగితా గణన

BRAOU

సాధారణంగా నిరుద్యోగాన్ని కొలవడానికి నాలుగు పద్ధతులను ఉపయోగించవచ్చు.

ఎ) కాలం పద్ధతి
బి) ఆదాయం పద్ధతి
సి) ఉత్పాదకతా పద్ధతి
డి) సమ్మతి పద్ధతి

### 25.6.1 కాల పద్ధతి (Time Criterion)

శ్రామికులకు ఉద్దేశించిన సమయంతో పోలిస్తే వాస్తవంగా పనిచేసిన కాలాన్ని నిరుద్యోగంగా నిర్వచించారు. కాల పద్ధతిని ఉపయోగించి నిరుద్యోగాన్ని అంచనాలకు రావాలంటే సాధారణ పద్ధతి అనే దాన్ని ఎలా నిర్వచించాలి అన్న ప్రశ్న వస్తుంది. ఇది రోజుకు 8 గంటలకన్నా ఎక్కువా? తక్కువా? అన్ని వృత్తుల వారికీ కలిపి 8 గంటలు తీసుకోవచ్చునా? ఒక సంవత్సరంలో పని దినాలను నిర్ణయించే పద్ధతి ఏది? అన్ని తరగతులకు ఇదే పద్ధతి ఉంటుందా? అనుభవ పూర్వకంగా కాలం పద్ధతిపై నిరుద్యోగం గురించి కనుక్కోవాలంటే ఈ ప్రశ్నలు చాలా ముఖ్యం.

కాల పద్ధతిననుసరించి మొత్తం పని పద్ధతులను పరిగణనలోనికి తీసుకొని ఎంత మంది ప్రజలు ఎంతకాలం నిరుద్యోగులుగా ఉన్నారో చెప్పగలం. కొంతమంది సాక్షిక ఉద్యోగులుగానూ ఉండవచ్చు. అందువల్ల ఇంతమంది ఉద్యోగులు, ఇంతమంది నిరుద్యోగులు అని చెప్పటం అర్థ రహితం. ఉద్యోగావకాశాలు, నిరుద్యోగం, పని దొరక్క పోవటానికి సంబంధించి జాతీయ శాంపిల్ సర్వే మూడు రకాల సమాచారాన్నిస్తుంది.

(i) మామూలు స్థితి గురించిన భావన: మొదటిగా ఒక సంవత్సరంలో కంటే అంతకుముందు సంవత్సరంలో

ఎక్కువ కాలానికి సంబంధించిన మామూలు కార్యక్రమాలను అనుసరించి ఉన్న సమాచారంగా నిర్వచించవచ్చు. ఈ సమాచారాన్ని ఆధారంగా చేసుకొని కింది నిరుద్యోగ రేటును అంచనా కట్టవచ్చు.

$$\text{వ్యక్తి - సంవత్సరలో నిరుద్యోగం రేటు } M_1 = \frac{UY}{LY} \times 100$$

UY అంటే మామూలు కార్యక్రమాల స్థితిని ఆధారం చేసుకొని ఉన్న నిరుద్యోగులు. LY అంటే మామూలు కార్యక్రమాల స్థితిని ఆధారం చేసుకొని ఉన్న శ్రమశక్తి.

(ii) వారంలోని స్థితి భావన: ప్రస్తుతం జరుగుతున్న కార్యక్రమాలు లేక ప్రస్తుతం మనం ఘాట్లాడుతున్న తేదీకి ముందు వారం రోజుల్లోని కార్యక్రమాల సమాచారాన్ని తీసుకుంటారు. మంచి ఆదాయం ఉన్న వృత్తిననుసరించి ఒక వ్యక్తి మనం తీసుకొన్న వారం రోజుల్లో ఏదో ఒక రోజు కనీసం ఒక గంటైనా పని చేసినట్లయితే ఉద్యోగస్తుడుగా భావిస్తాం. ఈ కాలంలో పని చేయుడానికి సిద్ధ పడి పనికోసం వెతుకుతున్న వ్యక్తి ఒక గంటైనా పని చేయనట్లయితే అతన్ని నిరుద్యోగిగా భావిస్తాం.

$$\text{వ్యక్తి — వారంలో నిరుద్యోగపు రేటు } (M_2) = \frac{Uw}{Lw} \times 100$$

Uw అంటే ప్రస్తుత కార్యక్రమాల ప్రాతిపదికపై నిరుద్యోగులు

Lw అంటే ప్రస్తుత కార్యక్రమాల ప్రాతిపదికపై శ్రమశక్తి.

(iii) దైనందిన స్థితి భావన: ప్రతిరోజుకి సంబంధించిన సమాచారాన్ని తీసుకుంటారు. ముందు ఏడు రోజులలో వ్యక్తి కార్యకలాపాల స్థితినీ, ప్రతి రోజుకి సంబంధించిన సమాచారాన్నీ తీసుకుంటారు. ఒక వ్యక్తి కనీసం రోజుకి ఒక గంటకంటే ఎక్కువ నాలుగు గంటల కంటే తక్కువ పని చేస్తే సగం రోజు పనిచేసినట్లుగా పరిగణిస్తారు. రోజులో నాలుగు గంటలకంటే ఎక్కువ పనిచేస్తే ఆ రోజు పూర్తిగా పనిచేసినట్లు భావిస్తారు.

$$\text{వ్యక్తి — ఒక రోజు నిరుద్యోగం రేటు } (M_3) = \frac{Ud}{7Lw - Nd} \times 100$$

BRAOU

Ud అంటే శ్రామిక సైన్యంలోని ఒక వ్యక్తి నిరుద్యోగిగా వున్న రోజులు

Lw అంటే ప్రస్తుత కార్యక్రమాల ప్రాతిపదికపై శ్రమశక్తి

Ld అంటే తీసుకున్న వారం రోజులో పని లభించని రోజులు.

మొదటి రెండు రేట్లు ($M_1$, $M_2$లు ) నిరుద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తూ నిలకడ రేట్లుకాగా, మూడవది $M_3$నిరుద్యోగ కాలానికి ప్రాతినిధ్యం వహిస్తూ ప్రవాహ రేటుగా ఉంది.

## 25.6.2. ఆదాయ పద్ధతి (Income Criterion)

ఎవరైనా ఒక వ్యక్తి ఒక సంవత్సరానికి సంపాదించవలసిన దానికన్న తక్కువ ఆదాయాన్ని సంపాదిస్తే అతన్ని నిరుద్యోగిగా పరిగణిస్తారు. తక్కువ ఆదాయం నిరుద్యోగానికీ, చిన్న ఉద్యోగానికీ సూచన. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రజల శాతాన్ని చూసి ఎవరైనా పరే దేశంలో నిరుద్యోగం, చిన్న ఉద్యోగాలు ఏ మేరకు ఉన్నాయో కొలవవచ్చు. పేదరికం ఉన్న పద్ధతిని అనుసరించి నిరుద్యోగాన్ని లెక్కకట్టాలని దండేకర్, రథ్

వాదించారు. ప్రజలకు కనీస జీవన భృతిని కల్పించే విషయంలో తగినన్ని ఉద్యోగావకాశాల స్థాయిని నిర్వచించాలని వారు వాదించారు. తలసరి వినియోగం కనీసస్థాయికి సంబంధించిన జాతీయ పద్ధతిని ఆమోదిస్తే దానంతట అదే సంపాదనకూ, తగినన్ని ఉద్యోగావకాశాల స్థితికి సంబంధించిన జాతీయ పద్ధతిని తెలుపుతుందని వారు వాదించారు. సంపాదించిన ఆదాయంకంటే పనిచేసిన సమయం అముఖ్య పరిశీలనాంశంగా తరచూ భావిస్తారు. వ్యక్తులు ఎల్లప్పుడూ తగినంతగా ఉద్యోగాలలో నియామకం కారు. దీనికి కారణం పనిలో వచ్చే సంపాదన తక్కువగా ఉండటమే తప్ప పనికి తక్కువ సమయాన్ని కేటాయించటం కాదు.

### 25.6.3. ఉత్పాదకత పద్ధతి (Productivity Criterion)

ఒక వ్యక్తి మామూలు ప్రమాణాని కన్నా తక్కువ స్థాయిలో ఉంటే అతన్ని నిరుద్యోగిగా పరిగణిస్తారు. ప్రచ్ఛన్న నిరుద్యోగ సమస్యను గుర్తించేందుకై ఈ పద్ధతిని ఉపయోగిస్తారు.

### 25.6.4 సమ్మతి పద్ధతి (Willingness Criterion)

ఒక వ్యక్తి ప్రస్తుతం తాను చేస్తున్న పనికంటే ఎక్కువ పని చేసేందుకు సమ్మతిస్తే అతను నిరుద్యోగిగా పరిగణింపబడతాడు. ఎక్కువ పని చేయడానికి ఇష్టపడే వ్యక్తులు, పనికోసం వెతికేవారు నిరుద్యోగులుగా పరిగణింపబడతారు. వేరే పద్ధతి ప్రకారం అతను ఉద్యోగా! నిరుద్యోగా! అన్న విషయానికీ దీనికీ సంబంధం ఉండదు. ఇది స్వతంత్రంగా ఉంటుంది. ఈ పద్ధతి కూడా కాల పద్ధతి లాగా ప్రత్యేకించిన పద్ధతి కంటే తక్కువ పనిచేసేవారినీ, పనికోసం చూసే వారినీ నిరుద్యోగులుగా నిర్వచిస్తుంది. పని చేయటానికి సమ్మతించినప్పటికీ పని పొందటంలో విఫలమైన వారిని మాత్రమే నిరుద్యోగులుగా పరిగణిస్తారు.

## మీ అవగాహనను పరీక్షించుకొండి — 3

7. కాల పద్ధతి ద్వారా నిరుద్యోగితను కొలిచే విధానాన్ని తెలపండి.
8. ఆదాయ పద్ధతి ద్వారా నిరుద్యోగితను ఏ విధంగా కొలవవచ్చు?

## 25.7 మన దేశంలోని నిరుద్యోగ సమస్య తీవ్రత

మన దేశంలో నిరుద్యోగ సమస్య స్వభావంలో పెద్దదిగా ఉంది. పెరుగుతున్న జనాభా తగినంతగా లేని అభివృద్ధి రేట్ల ఫలితమే ఈ నిరుద్యోగం. మన దేశంలో జనాభా పెరుగుదల రేటు సంవత్సరానికి 2.25 శాతం ఉంది. ఉద్యోగాలకు వెదికే వారి సంఖ్యకూడా నానాటికి పెరిగిపోతుంది. మన దేశంలోని నిరుద్యోగాన్ని రెండు రకాలుగా విభవించాలి. అది, (1) పట్టణ ప్రాంత నిరుద్యోగం, (2) గ్రామీణ ప్రాంత నిరుద్యోగం. పట్టణ ప్రాంత నిరుద్యోగంలో రెండు రకాలున్నాయి. అవి: (ఎ) పారిశ్రామిక నిరుద్యోగం, (బి) విద్యావంతుల నిరుద్యోగం. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగాన్ని (1) ప్రత్యక్ష నిరుద్యోగం, (2) ప్రచ్ఛన్న నిరుద్యోగంగాని విభజించవచ్చు.

### 25.7.1 పారిశ్రామిక నిరుద్యోగం (Industrial Unemployment)

మన దేశంలో పారిశ్రామిక నిరుద్యోగ పరిమాణం గురించి తెలియదు. దీనికి సంబంధించిన సమాచారం అందుబాటులో లేదు. ప్రణాళికా కాలంలో పారిశ్రామిక రంగం విస్తరించి, ఉద్యోగావకాశాలు నిలకడగా పెరిగినాయి. దురదృష్టవశాత్తు కొన్ని కారణాల వలన పారిశ్రామిక నిరుద్యోగం కూడా పెరిగిపోయింది. అవి: (1) ఆర్థిక అభివృద్ధి రేటుతో పోలిస్తే జనాభా పెరుగుదల రేటు చాలా ఎక్కువ. (2) గ్రామీణ ప్రాంతాల

నుండి పట్టణ ప్రాంతాలకు వలస వచ్చే వారి సంఖ్య ఎక్కువగా వుంది. పారిశ్రామిక రంగం పెరుగుదల మితంగా ఉండటంతో అది వలస వచ్చిన వారందరినీ ఇముడ్చుకోలేక పోతున్నది. (3) 1960ల మధ్య నుండి పారిశ్రామిక రంగంలో తిరోగమనం ఉంది.

### 25.7.2 విద్యావంతుల నిరుద్యోగం (Educated Unemployment)

విద్యావంతుల సంఖ్య వేగంగా పెరిగిపోయి నిరుద్యోగుల సంఖ్య పెరుగుతున్నది. 1980 ప్రారంభంలో 34 నుండి 72 లక్షల మంది చదువుకున్న నిరుద్యోగులున్నారని ప్రణాళికా సంఘం అంచనాలో ఉంది. గడిచిన మూడ దశాబ్దాలలోను విద్యావంతులైన నిరుద్యోగుల సంఖ్య 14 రెట్లు పెరిగింది. ఆరవ పంచవర్ష ప్రణాళిక అంచనా ప్రకారం 1980 ప్రారంభంలో విద్యావంతులైన నిరుద్యోగులలో 2.4. శాతం ఇంజనీర్లు,1980లో మెట్రిక్ వరకు చదువుకున్న నిరుద్యోగులు 70.9 శాతం దాకా వున్నారు. విద్యావంతులలో నిరుద్యోగానికి చాలా కారణాలున్నాయి. (1) లోప భూయిష్టమైన విద్యావ్యవస్థ, (2) అనేక పనులకు అవసరమైన సాంకేతిక అర్హతలు విద్యావంతులలో లేకపోవటం, (3) విద్యావంతులైన కార్మికులకున్న డిమాండ్, వారి సరఫరాల మధ్య సరైన సర్దుబాటు లేకపోవటం.

గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం ప్రత్యక్ష పరోక్ష రూపాల్లో ఉంది. కాలాన్ని బట్టి ఉండే నిరుద్యోగం పెద్దగా వ్యాపించి ఉండటం మరొక సమస్య. భూమిపై జనాభా వత్తిడి ఎక్కువగా ఉండటం వల్ల ప్రచ్ఛన్న నిరుద్యోగం ఏర్పడుతోంది. సర్వేలలో ఉపయోగించే అంశాలపై విభేదాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం గురించి జాతీయ అంచనా వేయడం చాలా కష్టం. మొదటి ప్రణాళికలలో మొత్తం గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వారిలో 30 శాతం మంది నిరుద్యోగులున్నారని అంచనా వేశారు. రెండవ ప్రణాళికలలో గ్రామీణ నిరుద్యోగం తీవ్రత 15 నుండి 18 మిలియన్ల వరకూ ఉందని పేర్కొన్నారు. జనాభా పెరుగుదల వల్ల ఇటీవల సంవత్సరాలలో గ్రామీణ నిరుద్యోగం పెరిగిందని చెప్తున్నారు.

మనదేశంలో నిరుద్యోగం గురించి అనేక అంచనాలను ఇప్పుడు పరిశీలిద్దాం. 1951 నుంచి రెండు దశాబ్దాల వరకూ నిరుద్యోగం గురించిన అంచనాలను ప్రణాళికా సంఘం ఇచ్చింది. నిపుణుల సంఘం ఈ అంచనాలకు పరిమితులున్నట్లు వ్యక్తం చేసింది. దాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రణాళికా సంఘం ఒక దశాబ్దం పాటు తన అంచనాలను ఆపివేసింది. ఏమైనప్పటికీ నిరుద్యోగ సమస్యను అర్థం చేసుకునేందుకు ఈ అంచనాలు చాలా ఉపయోగపడతాయి. మొదటి పంచవర్ష ప్రణాళికా సమయంలో 3.3 మిలియన్ల మంది నిరుద్యోగులు ఉన్నారు. నిరుద్యోగం రేటు 2.4. శాతం 1966లో నిరుద్యోగుల సంఖ్య 9.6 మిలియన్లు కాగా 1966-67ల మధ్య 14 మిలియన్ల దాకా ఉంది. ఫలితంగా నిరుద్యోగుల సంఖ్య 22 మిలియన్లకు పెరిగింది. ఆరవ పంచవర్ష ప్రణాళిక నిరుద్యోగాన్ని రూపు మాపేందుకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రణాళికా సంఘం 1980లో అంచనాలను ఇచ్చింది. కానీ తలంపులలో హెచ్చు తగ్గులవల్ల ఈ అంచనాలను పూర్వ అంచనాలతో పోల్చలేదు. 1980 మార్చిలో ప్రణాళికా సంఘం అంచనాలనిచ్చింది. వయసు రీత్యా చూస్తే మొత్తం శ్రమశక్తిలో 75 శాతం మామూలు పద్ధతి ఉద్యోగాలు 15-29 ఏళ్ళ మధ్య వారికే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కంటే పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం రేటు ఎక్కువ. ఇది గ్రామీణ ప్రాంతాల్లో3.26 శాతం కాగా పట్టణ ప్రాంతాల్లో 8.77 శాతం. చదువుకున్న యువతరంలో నిరుద్యోగుల శాతం (66 శాతం) ఎక్కువ అని కూడా వెల్లడైంది. మొత్తం యువతరంలో వీరు 11.5 శాతం. రోజు వారీ పరిస్థితి అంచనాలు వ్యవసాయకూలీల కుటుంబాల్లో నిరుద్యోగ రేటు ఎక్కువని పేర్కొన్నారు. మొత్తం దేశ జనాభాలో 21.2. శాతం ఉన్న ఈ కుటుంబాల్లో 1977-78 సంవత్సరంలో 46.7 శాతం రోజువారీ ఉద్యోగాల్లో ఉన్నారు.

## 25.8 నిరుద్యోగ నిర్మూలనా పద్ధతులు


నిరుద్యోగాన్ని తొలగించడం లక్ష్యంగా ఉన్నప్పటికీ- భారత ప్రణాళికా విధానం దీర్ఘకాల ఉపాధి పద్ధతులను

BRAOU

ఇంతవరకూ ఏర్పర్చలేదు. ప్రతి ప్రణాళికలోనూ కొద్దిపాటి ఫలితాలను మాత్రమే ఇచ్చే స్వల్పకాలిక పథకాలు చాలా ఉన్నాయి. అభివృద్ధి రేటు ఎక్కువ ఉంటే ఉద్యోగావకాశాలు ఎక్కువ ఉంటాయని ప్రభుత్వ నమ్మకం. అందుకని అభివృద్ధి రేటును పెంచేందుకై అన్ని చర్యలు తీసుకున్నారు. దీనివల్ల స్వల్పకాలంలోనే నిరుద్యోగ సమస్య తీవ్రమైపోయింది. అందువల్ల ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యక్ష చర్యలు తీసుకున్నారు. మొదటి ప్రణాళికా కాలంలో ఉద్యోగావకాశాలను పెంచుతాయని భావించి కుటీర పరిశ్రమలు, రోడ్డుభవనాల నిర్మాణం మొదలగు పనులను చేపట్టారు. 2వ ప్రణాళికలో భారీ పరిశ్రమల మీద దృష్టిని సారించారు. అందువల్ల అదనపు ఉపాధి అవకాశాల కల్పనకు ఎక్కువ అవకాశం లేకుండా పోయింది.

3వ ప్రణాళికలో గ్రామీణాభివృద్ధి పథకాన్ని అనుసరించాల్సిన అవసరాన్ని అంగీకరించారు. ఎక్కువమంది శ్రామికులు అవసరమైన ప్రజా పనుల కార్యక్రమాన్ని, పరిశ్రమల్లో ఎక్కువ మంది శ్రామికులను ఇముడ్చుకునే సాంకేతిక విజ్ఞానాన్ని అమలుచేయటం, ఉత్పత్తి పద్ధతులను పెంచటం, స్వదేశీ, విదేశీ మార్కెట్‌లను అభివృద్ధి చేయటం పోటీలో ఉన్నాయి.

5వ పంచవర్ష ప్రణాళికలో నిరుద్యోగ నిర్మూలనకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఉద్యోగావకాశాలను పెంపొందించేందుకు శ్రామికులను ఇముడ్చుకొనే సాంకేతిక పద్ధతుల ప్రాముఖ్యాన్ని ఈ ప్రణాళిక నొక్కి చెప్పింది. ఎక్కువ ఉపాధి అవకాశాలను కల్పించే గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక పథకాలను ఈ ప్రణాళికల్లో చేర్చారు. సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ (ఎస్.ఎఫ్.డి.ఏ), చిన్నతరహా వ్యవసాయ కూలీల అభివృద్ధి సంస్థలు (ఎం.ఎఫ్.ఎ.ఎల్), దుర్భిక్ష ప్రాంతాల పథకం (డి.పి.ఏ.పి) మొదలగునవి ఈ పథకాలు.

6వ పంచవర్ష ప్రణాళికలో ఉపాధి కల్పన పద్ధతి రెండు పెద్ద లక్ష్యాలతో ఉంది. ఎక్కువ మంది శ్రామికులకు ఉన్న సమస్యను తగ్గించడం, దీర్ఘ కాల నిరుద్యోగాన్ని కత్తిరించటం అనేవి ఈ రెండు లక్ష్యాలు. అందుకని వ్యవసాయంలో స్వయం ఉపాధి వృత్తులు, కుటీర పరిశ్రమలు, చిన్న పరిశ్రమలు వాటికి సంబంధించిన ఇతర కార్యకలాపాలకు, వ్యవసాయేతర పనులు మొదలగు వాటికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు.

## 25.9 ఉద్యోగావకాశాలు పెరిగేందుకు కావలసిన పూర్వ పరిస్థితులు

అధిక దిగుబడినిచ్చే మేలు రకపు విత్తనాలు, నీటి పారుదల సౌకర్యాలు వ్యవసాయంలో ఎక్కువమంది శ్రామికులను ఇమిడ్చేందుకు ఉపయోగపడవు. దీనితో పాటు యాంత్రికీకరణ పద్ధతులను కూడా ప్రవేశపెడితే అసలు ఇమిడ్చే అవకాశాలే పోతాయి. వేతనాల రేటు పెరుగుదల వ్యవసాయ సంస్కరణతో సంబంధం లేకుండా కేవలం ఉద్యోగావకాశాలను పెంచటం వల్ల కూడా పేదరికం పోదు. వ్యవసాయాభివృద్ధి దానంతట అదే సంపదను పెంచలేదని అందరూ గుర్తించారు. వ్యవసాయాభి వృద్ధి ఏటవాలుగా ఉండే సంపీణీకి దారితీస్తే అది తన స్వంత అభివృద్ధి పైననే ఆటంకాలు విధించుకుంటుంది.

మంచి సంపీణీని సాధించటానికి అనేక మంది ఆర్థికవేత్తలు "ఎరువులు, కొత్త విత్తనాలు, విద్యుచ్ఛక్తి, నీరులాంటి ఉత్పత్తి కారకాలు ఎక్కువమంది రైతులకు అందుబాటులో ఉంచే నిర్వహణ పద్ధతులను" కల్పించాలని పేర్కొన్నారు. ఈ నిర్వహణ పద్ధతులలో ఈ కిందివి కూడుకొని ఉన్నాయి. 1) బలమైన భూసంస్కరణలు, 2) ఉత్పత్తి, ఋణ మార్కెట్టులు మొదలగు వాటిపై ఉన్న పెద్ద పట్టును బలహీనపరచటం, 3) పేదలను సంఘటిత పరచటం, 4) అవసరమైన ఆసరా కలిగించి సేవలను సృష్టించటం. మొదటి దానిని గుర్తిస్తే దాని ప్రభావం రెండు, మూడు అంశాల మీద కూడా ఉంటుంది.

నిర్వహణ పద్ధతులు ఆమోదించి పైన సూచించిన విషయాలను గుర్తిస్తే చిన్న రైతులను పటిష్ట పరిచి ఎక్కువ పరిధిలో సంపదను సృష్టించటం సాధ్యం. ఈ క్రమంలో వ్యవసాయరంగంలో ఉద్యోగావకాశాలు పెరిగి స్థానికంగా తయారయ్యే వస్తువులకు మార్కెటు పెరుగుతుంది. రుణ మార్కెటుతో కలిసి ఈ రకమైన



BRAOU

డిమాండు పెరగటం వల్ల చిన్న పారిశ్రామికోత్పత్తి యూనిట్లలో సాంకేతికంగా మార్పు వస్తుంది. ఇలా జరిగితే చిన్న పారిశ్రామిక యూనిట్లు ఉద్యోగావకాశాలను పెంచడమే కాక ఇతర రంగాలతో తనకు గల సంబంధాల వల్ల వాటిలో కూడా ఉద్యోగవకాశాలను పెంచుతుంది. ఇలా గ్రామీణ భారతంలో ఎక్కువ పరిధిలో అవకాశాలను సృష్టించేందుకు అవసరమైన శక్తులు ఏర్పడతాయి.

## 25.10 సారాంశం/ముగింపు

నిరుద్యోగ సమస్యకు సంబంధించిన స్వచ్ఛంద, ప్రచ్ఛన్న, కాల సంబంధ, సాంకేతిక, చక్రరూపంలో ఉండే, ఫ్రిక్షనల్, ప్రత్యక్ష (Open or Chronic), పారిశ్రామిక, విద్యావంతుల నిరుద్యోగం అనే అనేక భావనలను ఈ భాగంలో తెలుసుకున్నాం. నిరుద్యోగితను నాలుగు విధాలుగా కొలవవచ్చునని కూడా తెలుసుకున్నాం. అవి: కాల పద్ధతి, ఆదాయ పద్ధతి, ఉత్పాదకతా పద్ధతి, సమ్మతి పద్ధతి. అదే విధంగా, కాల పద్ధతిలో మామూలు స్థితి, వారంలోని స్థితి, దైనందిన స్థితి అనే మూడు విధాలుగా నిరుద్యోగితను లెక్కిస్తారు.

మన దేశంలో నిరుద్యోగ సమస్య ప్రభావం పెద్దగా వుంది. ఉద్యోగితా సౌకర్యాలను పెంచడానికి గానూ ప్రభుత్వం అనేక చర్యలను చేపట్టింది. ఈ దశాబ్ద కాలంలో నిరుద్యోగ సమస్యను తగ్గించడానికి ఎంతో కృషి చేస్తూనే ఉంది. 1989 - 90వ సంవత్సరంలో ఈ ఉద్దేశం కోసం రూ. 500 కోట్లను కేటాయించింది. ప్రస్తుతం ఎన్నో ఉపాధి కల్పనా పథకాలు అమలులో ఉన్నాయి. అందులో ముఖ్యమైనవి: జవహర్ రోజ్‌గార్ పథకం, నెహ్రూ రోజ్‌గార్ పథకం.

-శ్రీ జి. రామకృష్ణ

## 25.11 సంప్రదింపు గ్రంథాలు

| | |
|---|---|
| 1. Datt and Sundarm | : Indian Economy |
| 2. J.S. Uppal (ed) | : India's Economic Problems |
| 3. Misra and Puri | : Indian Economy. |

## 25.12. మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు సుమారు *30* పంక్తులలో జవాబులు రాయండి.

1. వివిధ నిరుద్యోగితా రకాలను వివరించండి.
2. నిరుద్యోగితను లెక్కించే/నిర్ణయించే వివిధ అంశాలను వివరించండి.
3. నిరుద్యోగ నిర్మూలనకు ఎలాంటి విధానాలను సూచిస్తారు.
4. ప్రచ్ఛన్న నిరుద్యోగాన్ని పటం సహాయంతో వివరించండి.

II. కింది ప్రశ్నలకు సుమారు *15* పంక్తులలో జవాబులు రాయండి.

1. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల నిరుద్యోగితలలో గల వ్యత్యాసాలు ఎటువంటి
2. పూర్తి ఉద్యోగితా కల్పనకు కావలసిన పరిస్థితులు ఏవి.
3. "నిరుద్యోగం ఒక తీవ్రమైన సమస్య" - చర్చించండి.
4. నిరుద్యోగిత అర్థాన్ని వివరించండి.

# ఇతర సంప్రదింపు గ్రంథాలు (Reference Books)


1. Chaudhuri P - Aspects of Indian Economic Development.
2. Fei, J.C.H. and Ranis, G - Development of the Labour Surplus Economy Theory and Policy.
3. Hirschman. A.O. - The Strategy of Economic Development.
4. Kindleberger, C.P. - Economic Development.
5. Lewis, W, Arthur - Economic Development with Unlimited Supplies of Labour.
6. Nurkse, R - Problems of Capital Formation in Under Developed Countries.
7. Amartya Sen - Choice of Techniques
8. Bhagawati, JN and Chakravarthy,S - Indian Economic Analysis - A Survey
9. Higgins - Economic Development - Principles, Problems and Economic Growth.
10. Leibenstein, H - Economic Backwardness and Economic Growth
11. Lewis, W.A - Development Planning.
12. Meier, G.M - Leading issues in Economic Development.
13. Atal and Pieris - Asian Rethinking on Development.
14. Little, IMO - Economic Development: Theory, Policy and International Relations.
15. Ghosh - Economics of Underdevelopment.
16. Walter Elkan - The Economics of Development.
17. Todaro, Micheal - Economic Development and the Third World Development.
18. Agarwal HS - The Indian Economy.
19. Singh & Singh - The Economics of Underdevelopment


BRAOU

# ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సు — రెండవ సంవత్సరం

## అర్థశాస్త్రం

### కోర్సు — 2: అభివృద్ధి అర్థశాస్త్రం పాఠ్య ప్రణాళిక

ఖండం - **I:** అభివృద్ధి, అల్పాభివృద్ధి: పరిచయం
భాగం - 1: వెనుకబడిన ఆర్థిక వ్యవస్థల లక్షణాలు
భాగం - 2: ఆర్థికాభివృద్ధికి అవరోధాలు, దోహదాలు
భాగం - 3: మూలధన సంచయన సిద్ధాంతాలు
భాగం - 4: ఉత్పత్తి పద్ధతుల ఎంపిక, వస్తువుల ఎంపిక
భాగం - 5: ఆర్థికాభివృద్ధి [illegible]

ఖండం - **II:** జాతీయాదాయం, సాంఘిక గణన
భాగం - 6: జాతీయాదాయం - దాని మదింపు
భాగం - 7: భారతదేశ జాతీయాదాయ అంచనాలు
భాగం - 8: జాతీయాదాయ ఖాతాలు — సాంఘిక గణన పద్ధతులు

ఖండం - **III:** అభివృద్ధి కొరకు ప్రణాళికా రచన
భాగం - 9: భారతదేశంలో ఆర్థిక ప్రణాళిక
భాగం - 10: భారతదేశపు పంచవర్ష ప్రణాళికలు
భాగం - 11: భారతదేశ పంచవర్ష ప్రణాళికల విజయాలు

ఖండం - **IV:** వ్యవసాయ రంగం
భాగం - 12: భారతదేశంలో వ్యవసాయరంగ స్వరూపం
భాగం - 13: వ్యవసాయ ఉత్పాదకత
భాగం - 14: హరిత విప్లవం
భాగం - 15: వ్యవసాయ ధరలు
భాగం - 16: వ్యవసాయ విత్తం

ఖండం - **V:** పారిశ్రామిక రంగం
భాగం - 17: భారతదేశ పారిశ్రామిక అభివృద్ధి
భాగం - 18: ప్రభుత్వ రంగం
భాగం - 19: భారతదేశంలో పారిశ్రామిక శక్తి కేంద్రీకరణ
భాగం - 20: పారిశ్రామిక విత్తం

ఖండం - **VI:** విదేశీ రంగం
భాగం - 21: విదేశీ వర్తకం - ఆర్థికాభివృద్ధి
భాగం - 22: భారతదేశపు విదేశీ వర్తకం
భాగం - 23: విదేశీ ఆర్థిక సహాయం, విదేశీ మూలధనం

ఖండం - **VII:** పేదరికం, నిరుద్యోగం
భాగం - 24: భారతదేశంలో పేదరికం
భాగం - 25: భారతదేశంలో నిరుద్యోగ సమస్య

# ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## మూడు సంవత్సరాల డిగ్రీ [illegible]

## నమూనా పరీక్షా పత్రం

## అర్థశాస్త్రం

## కోర్సు — భారత అభివృద్ధి అర్థశాస్త్రం

సమయం: 3 గంటలు

మార్కులు: 100

కనీస మార్కులు: 35

### విభాగం - A

సూచనలు: ★ క్రింది ఎనిమిది ప్రశ్నలలో ఏ నాలిగింటికైనా జవాబులు వ్రాయుము.
★ జవాబులు సుమారు 30 పంక్తులలో ఉండాలి.
★ ప్రతి ప్రశ్నకు 15 మార్కులు. 4 × 15 = 60.

1. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ ముఖ్య లక్షణాలను వివరింపుము.
2. సంతులిత వృద్ధి కన్న అసంతులిత వృద్ధి మెరుగైనదనే హర్ష్‌మన్ వాదనను విమర్శనాత్మకంగా పరిశీలింపుము.
3. భారత పంచవర్ష ప్రణాళికల ముఖ్య లక్ష్యాలేవి? ఇవి ఎంతవరకు సాధింపబడినవి?
4. హరిత (సస్య) విప్లవం అనగానేమి? భారతదేశ వ్యవసాయ రంగంపై దాని ప్రభావాన్ని విమర్శనాత్మకంగా పరిశీలింపుము.
5. 1956 పారిశ్రామిక విధాన తీర్మానపు ప్రాముఖ్యతను పరిశీలింపుము.
6. భారతదేశ ఆర్థికాభివృద్ధిలో విదేశీ వ్యాపారం యొక్క పాత్రను చర్చింపుము.
7. దారిద్ర్యరేఖ అనగానేమి? దాని స్వభావాన్ని, పరిమాణాన్ని వివరింపుము.
8. ఇటీవల కాలంలో పారిశ్రామిక ప్రగతి మందకొడిగా ఉండడానికి గల కారణాలను విమర్శనాత్మకంగా పరిశీలింపుము.

### విభాగం - B

సూచనలు: ★ క్రింది పదింటిలో ఏవేని ఐదు (5) ప్రశ్నలకు జవాబులు వ్రాయుము.
★ జవాబు సుమారు 30 పంక్తులలో ఉండాలి.
★ ప్రతి ప్రశ్నకు 8 మార్కులు. 5 × 8 = 40.

9. క్రింది భావనలను వివరింపుము:
   (a) జనాభా విస్ఫోటన (b) ద్వంద్వ ఆర్థిక వ్యవస్థలు

10. ఆర్థికాభివృద్ధికి, ఆర్థిక పెరుగుదల (వృద్ధి)కు మధ్యగల భేధాన్ని వివరింపుము.
11. బీదరికపు విషవలయాన్ని వివరించండి.
12. ఏడవ పంచవర్ష ప్రణాళికలోని ముఖ్య అంశాలేవి?
13. క్రింది భావనలు వివరింపుము:
(a) నిరంతర ప్రణాళిక, (b) ప్రణాళికా సెలవు, (c) దీర్ఘదర్శి ప్రణాళిక
14. ప్రచ్ఛన్న నిరుద్యోగిత అనుభావను వివరింపుము.
15. క్రింది పదాలను వివరింపుము:
(a) వర్తక నిబంధనలు (షరతులు),
(b) చెల్లింపు శేషం, (c) మూల్య హీనీకరణ
16. మూలధన సాంద్రత పద్ధతిలో గల లాభనష్టాలను చర్చింపుము.
17. నిరుద్యోగితను లెక్కించు పద్ధతులను వివరింపుము.
18. క్రింది భావనలను వివరింపుము:
(a) స్వయం స్వావలంబన, (b) స్థూల జాతీయోత్పత్తి,(c) భూ సంస్కరణలు

BRAOU

# ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## బి.ఏ/బి.కాం./బి.యస్సి., రెండవ సంవత్సరం

## అర్థశాస్త్రం

## కోర్సు- II: అభివృద్ధి అర్థశాస్త్రం

## అభ్యాసం: 1

సూచనలు

1. మీరు పుస్తకాలలో నుండి ఉన్నది ఉన్నట్లుగా రాయకూడదు.
2. సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత వాక్యాలలో రాయాలి.
3. ఒకవేళ ఏ గ్రంథం నుండైనా చూసి రాయవలసి వస్తే అందుకు సంబంధించిన ఆధారాలను పేర్కొనండి.
4. అభ్యాసాలు రాయడానికి మీ స్వంత కాగితాలను (అరఠావు) ఉపయోగించండి.
5. మీరు వ్రాసే జవాబుపై పరీక్షకులు సూచనలివ్వడానికి తగినంత మార్జిన్‌ను (స్థలాన్ని) వదలండి.
6. ఈ అభ్యాసాన్ని పూర్తిగా రాయడానికి రెండు గంటలకంటే ఎక్కువ సమయం తీసుకోరాదు.

---

**I. క్రింది ప్రశ్నలకు సుమారు *30* పంక్తులలో జవాబులు రాయుము.**

1. అభివృద్ధి చెందుతున్న దేశాల ముఖ్య లక్షణాలను వివరింపుము.
2. 'సంతులిత వృద్ధి' సిద్ధాంతాన్ని వివరింపుము. దీనికి ప్రత్యామ్నాయంగా హార్ష్‌మన్ తెలిపిన సిద్ధాంతమేమి?
3. శ్రమ సాంద్రత పద్ధతి మరియు మూలధన సాంద్రత పద్ధతి అంటే ఏమిటో తెలిపి, వీటి మధ్య భేదాన్ని విశదీకరించుము.

BRAOU

**II. క్రింది ప్రశ్నలకు సుమారు *15* పంక్తులలో జవాబులు రాయుము.**

1. క్రింది పదాలను వివరింపుము:
   - (a) వెనుక అనుబంధాలు, ముందు అనుబంధాలు
   - (b) సామాజిక ఉమ్మడి మూలధనం, ప్రత్యక్ష ఉత్పాదక కార్యక్రమాలు
2. ఆర్థికాభివృద్ధి అంటే ఏమిటి? ఆర్థిక పెరుగుదలకు (వృద్ధికి) ఆర్థికాభివృద్ధికి గల తారతమ్యాన్ని వివరింపుము.
3. ఆర్థికాభివృద్ధి లక్ష్యాలను తెలుపుము.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

# ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
## బి.ఏ/బి.కాం./బి.యస్సి., రెండవ సంవత్సరం
## అర్థశాస్త్రం
## కోర్సు- II: అభివృద్ధి అర్థశాస్త్రం
## అభ్యాసం: 2

సూచనలు

1. మీరు పుస్తకాలలో నుండి ఉన్నది ఉన్నట్లుగా రాయకూడదు.
2. సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత వాక్యాలలో రాయాలి.
3. ఒకవేళ ఏ గ్రంథం నుండైనా చూసి రాయవలసి వస్తే అందుకు సంబంధించిన ఆధారాలను పేర్కొనండి.
4. అభ్యాసాలు రాయడానికి మీ స్వంత కాగితాలను (అరఠావు) ఉపయోగించండి.
5. మీరు వ్రాసే జవాబుపై పరీక్షకులు సూచనలివ్వడానికి తగినంత మార్జిన్ను (స్థలాన్ని) వదలండి.
6. ఈ అభ్యాసాన్ని పూర్తిగా రాయడానికి రెండు గంటలకంటే ఎక్కువ సమయం తీసుకోరాదు.

---

I. క్రింది ప్రశ్నలకు సుమారు *30* పంక్తులలో జవాబులు రాయుము.

1. 'ప్రణాళికా రచన' అనగానేమి? భారతదేశ ప్రణాళికల లక్ష్యాలను వివరింపుము.
2. పంచవర్ష ప్రణాళికా కాలంలో భారతదేశం వ్యవసాయ అభివృద్ధిని విశేషించుము
3. భారతదేశంలో వ్యవసాయ ఉత్పాదకత తక్కువగా నుండుటకు గల వివిధ కారణాలను విమర్శనాత్మకంగా పరిశీలింపుము.

II. క్రింది ప్రశ్నలకు సుమారు *15* పంక్తులలో జవాబులు రాయుము.

1. భారత దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రణాళికల ఆవశ్యకతను వివరింపుము.
2. హరిత (సస్య) విప్లవం అనగానేమి? దాని ప్రభావం పరిమితంగా వుండడానికి గల కారణాలను తెలుపుము.
3. విక్రయం కాగల మిగులుకు, విక్రయమైన మిగులుకు మధ్యగల తారతమ్యాన్ని వివరింపుము.

BRAOU

# ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
## బి.ఏ/బి.కాం./బి.యస్సి., రెండవ సంవత్సరం
## అర్థశాస్త్రం
## కోర్సు- II: అభివృద్ధి అర్థశాస్త్రం
## అభ్యాసం: 3

సూచనలు

1. మీరు పుస్తకాలలో నుండి ఉన్నది ఉన్నట్లుగా రాయకూడదు.
2. సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత వాక్యాలలో రాయాలి.
3. ఒకవేళ ఏ గ్రంథం నుండైనా చూసి రాయవలసి వస్తే అందుకు సంబంధించిన ఆధారాలను పేర్కొనండి.
4. అభ్యాసాలు రాయడానికి మీ స్వంత కాగితాలను (అరతావు) ఉపయోగించండి.
5. మీరు వ్రాసే జవాబుపై పరీక్షలు సూచనలివ్వడానికి తగినంత మార్జిన్‌ను (స్థలాన్ని) వదలండి.
6. ఈ అభ్యాసాన్ని పూర్తిగా రాయడానికి రెండు గంటలకంటే ఎక్కువ సమయం తీసుకోరాదు.

---

I. క్రింది ప్రశ్నలకు సుమారు *30* పంక్తులలో జవాబులు రాయుము.

1. స్వాతంత్ర్యానంతరపు పారిశ్రామికీకరణ పెరుగుదలను మరియు ధోరణిని చర్చింపుము. దాని ప్రగతి తక్కువగా (మందకోడిగా) వుండడానికి గల కారణాలను తెలుపుము.
2. ఆర్థిక శక్తి కేంద్రీకరణ అనగానేమి? భారతదేశంలో ఆర్థిక శక్తి కేంద్రీకరణకు గల కారణాలను, దాని సర్వనాశాలను వివరింపుము.
3. నిరుద్యోగిత అనగా నేమి? నిరుద్యోగిత రకాలను వివరింపుము.

II. క్రింది ప్రశ్నలకు సుమారు *15* పంక్తులలో జవాబులు రాయుము.

1. భారతదేశంలోని ప్రభుత్వరంగ సంస్థల పని సామర్థ్యం తక్కువగా వుండడానికి గల కారణాలను వివరింపుము.
2. భారతదేశంలో పేదరికానికి గల కారణాలను వివరింపుము.
3. క్రింది భావనలను వివరింపుము.

   **(a)** చెల్లింపుల శేషం, **(b)** విదేశీ వ్యాపారానికి సంబంధించి వర్తక నిబంధనలు (షరతులు), **(c)** దిగుమతి ప్రత్యామ్నాయ విధానం

BRAOU

BRAOU